వ్యాస మహాభారతం

(తెలుగు వచనం)

ఆశ్వమేధిక పర్వం

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

9361

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
ఆశ్వమేధిక పర్వం

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894.8278
రాము - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

ఆశ్వమేధిక పర్వం

ప్రథమ ముద్రణ : గీతా జయంతి (డిసెంబర్ 2010)

20 సంపుటాల వెల : రూ. 720/-

C.27H99
సుందరయ్య గ్రంథాలయ సంఘం
A C.No. 96369
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

కీ।శే। కరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి



శ్రీ కమ్మిల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

కీ॥శే॥ బ్రహ్మశ్రీ పాలపర్తి వెంకట సుబ్బారావు

వారి ధర్మపత్ని పూర్ణాంబ

As a Hindu, every individual has to study,
observe, and real'ze the essence of

MAHABHARATHAM



An. Muthu Palaniappam
M. Meenakshi

As a Hindu, every individual has to study,
observe, and realize the essence of

MAHABHARATHAM

M. Bala Subramanyam
Smt. Anbuchelvi

మానవులలో మానవత్వాన్ని పెంపొందించే

మహాభారతానికి మా నమస్కారం

పిరిగిరి దుర్గారావు

వారి ధర్మపత్ని శ్రీమతి శారద

తల్లిదండ్రులు, కీర్తిశేషులు

నాగళ్ల తులసమ్మ, నాగళ్ల వీరయ్య

సంస్మృతి చిహ్నముగా

ఆశ్వమేధిక పర్వ ముద్రణమునకు సంబంధించిన

సమస్త వ్యయమును భరించినవారు



సాహిత్యవేత్త, సుధీరత్న

పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల పూర్వాధ్యక్షుడు

ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠము ప్రధాన కార్యదర్శి

శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,
వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

ఆశ్వమేధిక పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది 'అభిగమ్యకృతే దానం' అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కొరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కొండ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా। పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా। ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	।	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యధాతధంగా అందించేందుకే ఈ ప్రయత్నం – వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాబ్జేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాబ్జభవ శ్రీకన్దరా శ్శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యధాతధంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	1. అశ్వమేధ పర్వము - 15	
1.	యుధిష్ఠిరుని శోకపరవశత - ధృతరాష్ట్ర ప్రబోధము. (20)★	23
2.	శ్రీకృష్ణవ్యాసులు యుధిష్ఠిరుని ఓదార్చుట. (20+2)	24
3.	సంవర్తమరుత్త వృత్తాంతము. (23)	26
4.	మరుత్తుని పూర్వరాజులు, మరుత్తుని గుణ ప్రభావములు. (28)	27
5.	ఇంద్రుని ప్రేరణతో బృహస్పతి మనుష్యునిచే యజ్ఞము చేయింపనని ప్రతిజ్ఞ చేయుట. (28)	29
6.	నారదవచనానుసారము సంవర్తుని మరుత్తుడు దర్శించుట. (33)	30
7.	సంవర్తమరుత్తీయము. (27)	32
8.	సంవర్తమరుత్తీయము. (38+12)	34
9.	సంవర్తమరుత్తీయము. (37)	37
10.	సంవర్తమరుత్తీయము. (37)	41
11.	శ్రీకృష్ణయుధిష్ఠిర సంవాదము. (20)	44
12.	కృష్ణధర్మజ సంవాదము. (16)	46
13.	శ్రీకృష్ణ ధర్మజ సంవాదము. (22)	47
14.	యుధిష్ఠిరుని ధర్మపాలనము. (17+30 $\frac{1}{2}$)	48
15.	శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళుదునని అర్జునునికి చెప్పుట. (35)	51
	2. అనుగీతా పర్వము - 77	
16.	శ్రీకృష్ణుడు అర్జునునికి సిద్ధమహర్షి కాశ్యపసంవాదము చెప్పుట. (46)	53

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
17.	జీవుల వివిధ గతులనిరూపణము. (42)	56
18.	జీవుని గర్భప్రవేశము. (35)	59
19.	మోక్షప్రాప్త్యుపాయ వర్ణనము. (66)	61
20.	బ్రాహ్మణగీత - 1. (28)	66
21.	బ్రాహ్మణగీత - 2 దశహోతృవిధానము. (26)	68
22.	బ్రాహ్మణగీత - 3 సప్తహోతృవిధానము. (29)	70
23.	బ్రాహ్మణగీత - 4 పంచహోతృవిధానము. (24+1$\frac{1}{2}$)	72
24.	బ్రాహ్మణగీత - 5. (27)	74
25.	బ్రాహ్మణగీత - 6 చాతుర్హోత్ర విధానము. (17)	76
26.	బ్రాహ్మణగీత - 7. (18)	77
27.	బ్రాహ్మణగీత - 8. (24)	78
28.	బ్రాహ్మణ గీత - 9. (28)	80
29.	బ్రాహ్మణగీత - 10. (22)	82
30.	బ్రాహ్మణగీత - 11. (33)	84
31.	బ్రాహ్మణ గీత - 12. (13)	86
32.	బ్రాహ్మణగీత - 13. (26)	87
33.	బ్రాహ్మణగీత - 14. (8)	89
34.	బ్రాహ్మణగీతోప సంహారము - 15. (12)	90
35.	గురుశిష్య సంవాదము - 1. (50)	91
36.	గురుశిష్య సంవాదము - 2. (36)	95
37.	గురుశిష్య సంవాదము - 3. (17)	97

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
38.	గురుశిష్య సంవాదము - 4. (15)	99
39.	గురుశిష్య సంవాదము - 5. (25)	100
40.	గురుశిష్య సంవాదము - 6. (13)	101
41.	గురుశిష్య సంవాదము - 7. (5)	102
42.	గురుశిష్య సంవాదము - 8. (63)	103
43.	గురుశిష్య సంవాదము - 9. (42)	107
44.	గురుశిష్యసంవాదము - 10. (22)	109
45.	గురుశిష్య సంవాదము - 11. (25)	111
46.	బ్రహ్మచారి వానప్రస్థ సన్న్యాసుల ధర్మములు. (57)	113
47.	గురుశిష్య సంవాదము - 1. (17)	117
48.	గురుశిష్య సంవాదము - 2 జీవాత్మ, పరమాత్మల స్వరూప వివేచనము. (13)	118
49.	గురుశిష్య సంవాదము - 3. (17)	119
50.	గురుశిష్య సంవాదము - 4. (56)	121
51.	బ్రాహ్మణగీత - అనుగీత ఉపసంహారము. (52)	124
52.	శ్రీకృష్ణుని ద్వారకాగమనము. (58+$\frac{1}{2}$)	128
53.	ఉత్తంకో పాఖ్యానము - 1. (26)	131
54.	ఉత్తంకోపాఖ్యానము - 2. (23)	133
55.	ఉత్తంకోపాఖ్యానము - 3. (37+5)	134
56.	ఉత్తంకోపాఖ్యానము - 4. (35)	137
57.	ఉత్తంకోపాఖ్యానము - 5. (28)	139
58.	ఉత్తంకోపాఖ్యానము - 6. (61)	141

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
59.	శ్రీకృష్ణుని ద్వారకా ప్రవేశము. (21+3 $\frac{1}{2}$)	145
60.	వసుదేవునికి శ్రీకృష్ణుడు మహాభారతయుద్ధమును సంక్షేపముగా చెప్పుట. (36)	146
61.	శ్రీకృష్ణుడు అభిమన్యు వధను చెప్పుట. (42)	148
62.	వ్యాసుడు అశ్వమేధము చేయ యుధిష్ఠిరుని అనుమతించుట. (21)	151
63.	ద్రవ్యానయనోపక్రమము - 1. (24+8 $\frac{1}{2}$)	152
64.	ద్రవ్యానయనోపక్రమము - 2. (16)	154
65.	ద్రవ్యానయనము. (23)	155
66.	పరీక్షిజ్జన్మ వృత్తాంతము. (29)	156
67.	పరీక్షిత్తును బ్రతికింపుమని సుభద్ర శ్రీకృష్ణుని ప్రార్థించుట. (19)	158
68.	ఉత్తరావిలాపము, శ్రీకృష్ణ ప్రార్థనము. (24)	159
69.	ఉత్తరా విలాపము, శ్రీకృష్ణుడు మృతబాలుని బ్రతికించుట. (24)	160
70.	పాండవులు హస్తినా పురమునకు వచ్చుట. (21)	162
71.	వ్యాస శ్రీకృష్ణులు యజ్ఞము చేయుమని యుధిష్ఠిరుని ఆజ్ఞాపించుట. (26)	163
72.	యజ్ఞ సామగ్రి సంపాదించుట. (26)	165
73.	ససైన్యుడై అర్జునుడు అశ్వము వెంటపోవుట. (28)	166
74.	అర్జునుడు త్రిగర్తులను జయించుట. (34)	168
75.	అర్జునునికి వజ్రదత్తునితో యుద్ధము. (20)	170
76.	అర్జునుడు వజ్రదత్తుని జయించుట. (26)	171
77.	అర్జునుడు సింధుదేశ వీరులతో పోరాడుట. (32+1)	172
78.	సైంధవుల ఓటమి. (49)	174
79.	అర్జున బభ్రువాహనయుద్ధము. (39)	177

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
80	అర్జునుని పునర్జీవనము. (61)	179
81.	ఉలూపి జరిగినది చెప్పుట. (32)	183
82.	మగధరాజు మేఘసంధి పరాజయము. (30)	184
83.	అర్జునుడు ద్వారకా పంచనాధ గాంధారములకేగుట. (20)	186
84.	శకుని పుత్రుని పరాజయము. (24)	187
85.	అశ్వమేధారంభము - 1. (42)	189
86.	అశ్వమేధారంభము - 2. (21)	191
87.	అర్జునుని పునరాగమనము. (28)	192
88.	అశ్వమేధారంభము - 3. (40)	194
89.	అశ్వమేధ యజ్ఞసమాప్తి. (44)	197
90.	నకులోపాఖ్యానము. (120)	199
91.	హింసామిశ్రిత యజ్ఞ, ధర్మముల నింద. (37)	208
92.	అగస్త్యమహర్షి యజ్ఞవృత్తాంతము. (53+1220)	210

వైష్ణవధర్మ పర్వము

	ధర్మవిషయమయి యుధిష్ఠిరప్రశ్న. శ్రీకృష్ణుడు ధర్మమహిమను, స్వమహిమను చెప్పుట.	214
	చతుర్వర్ణముల కర్మ ఫలితాలు - ధర్మవృద్ధికి, పాపక్షయానికి ఉపాయాలు.	217
	వ్యర్థ జన్మ - దానజీవన వర్ణనము - దాన లక్షణము, దానార్హ పాత్రులు.	219
	బీజయోనుల శుద్ధి - గాయత్రీ జపము - బ్రాహ్మణ మహత్త్వము - బ్రాహ్మణావమానఫలితము.	223
	యమలోకమార్గకష్టములు వానినుండి విముక్త్యుపాయములు.	226
	జలాన్నదానముల అతిధిసత్కారముల మాహాత్మ్యము.	230

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	భూదాన తిలదాన మాహాత్మ్యము, ఉత్తమ బ్రాహ్మణ మహిమ.	233
	వివిధ దానముల మహిమ.	236
	పంచమహాయజ్ఞాలు, విధి సహిత స్నానము, తదంగకర్మలు, భగత్ప్రియ పుష్పములు, భగవద్భక్త లక్షణము.	238
	కపిల గోదాన మాహాత్మ్యము - కపిల గోవులలో పది భేదములు.	243
	కపిల గోవుతో దేవనివాసము కపిలామాహాత్మ్యము. నరక స్వర్గప్రాపక పాప పుణ్యవర్ణనము.	246
	బ్రహ్మహత్యతో సమానమైన పాపాలు. అన్నదానాలు - త్యాజ్యాన్నములు - ధర్మాధర్మప్రశంస	249
	ధర్మశౌచలక్షణము, భిక్షుక అభ్యాగతులసత్కారము శిష్టాచారము దానపాత్రత, బ్రాహ్మణుల, అన్నదాతల ప్రశంస.	250
	భోజనవిధి, గోగ్రాస ప్రదాన విధానము, తిలమాహాత్మ్యము.	252
	ఆపద్ధర్మములు. శ్రేష్ఠాశ్రేష్ఠ బ్రాహ్మణులు. శ్రాద్ధమునకు ఉత్తమ కాలము. మానవధర్మసారవర్ణనము.	254
	అగ్నిహోత్రవిధి, దాని మాహాత్మ్యము	258
	చాంద్రాయణవ్రతవిధి - ప్రాయశ్చిత్తరూపమయిన కర్మవిధానము - దాని మహిమ	261
	సర్వహిత ధర్మము - ద్వాదశీవ్రతమాహాత్మ్యము - భగవత్ స్తవము.	263
	విష్ణు యోగములో గ్రహసమయములో దానమహిమ. అశ్వత్థమాహాత్మ్యము తీర్థభూతగుణప్రశంస, ఉత్తమప్రాయశ్చిత్తము.	265
	ఉత్తమాధమబ్రాహ్మణుల లక్షణము భగవద్భక్తుల మాహాత్మ్యము. గోపిప్పల వృక్ష మాహాత్మ్యము.	268
	భగవదుపదేశ సంహారము - ద్వారకాగమనము.	270

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
ఆశ్వమేధిక పర్వం

1. యుధిష్ఠిరుని శోకపరవశత - ధృతరాష్ట్ర ప్రబోధము.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

వైశంపాయనుడు చెప్పాడు - జనమేజయా! ధృతరాష్ట్రుడు భీష్మునికి జల తర్పణం చేసిన తరువాత మహాబాహువయిన యుధిష్ఠిరుడు ఆయనను ముందుంచుకొని, నీటినుంచి బయటకు వచ్చాడు. అప్పుడు ఆయన ఇంద్రియాలు అన్నీ శోక వ్యాకులా లయ్యాయి. బయటకు వచ్చిన యుధిష్ఠిరుడు గంగాతీరాన వ్యాధుని దెబ్బతిన్న గజరాజు వలె పడిపోయాడు. అప్పుడు ఆయన కన్నులు కన్నీటితో నిండిపోయాయి. అలా పడిపోతున్న ఆయనను కృష్ణుడు ప్రేరేపించగా భీష్ముడు పట్టుకొన్నాడు. శత్రుబలనాశకు డయిన శ్రీకృష్ణుడు ఆయనతో 'ఇలాంటి బేలతనం తగదు' అన్నాడు. జనమేజయా! ఆర్తుడై, నేలబడి, మాటిమాటికి నిట్టూరుస్తున్న ధర్మపుత్రుని రాజులందరు చూచారు. రాజు ఈ రీతిగా దీనచిత్తుడు, ఉత్సాహరహితుడు కావటం చూసిన పాండవులు మళ్ళీ శోకాకులులయి ఆయన వద్దకు వచ్చి కూర్చున్నారు. మహా మేధావియై తెలివితేటలే కన్నులు గాగల ధృతరాష్ట్రుడు పుత్రశోకంతో పీడితుడయి, యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు.

'కురువంశ శ్రేష్ఠా ! లే ! తరువాత చేయవలసింది చెయ్యి. కుంతీ కుమారా! నీవు క్షత్రియ ధర్మంతోనే ఈ భూమండలం జయించావు. నీ సోదరులతో, మిత్రులతో కలిసి కావలసిన భోగాలను అనుభవించు. నీవు దుఃఖించాల్సింది నాకు ఏమీ కనపడదు.

కలలో వచ్చిన ధనంలాగా నూర్గురు పుత్రులు గతించటం చేత నేను, గాంధారి దుఃఖించాలి. దుర్బుద్ధినయిన నేను మేలు కోరే నా విదురుని అర్థవంతమయిన మాటలు విననందుకు పరితాపం చెందుతున్నాను. దివ్యదృష్టి గల, ధర్మాత్ముడయిన విదురుడు "రాజా! దుర్యోధనుని అపరాధాలవల్ల నీ వంశం నశించగలదు. నీ వంశానికి మేలు కలగాలని ఉంటే నేను చెప్పినట్లు చెయ్యి, మందబుద్ధి, దుష్టస్వభావుడు అయిన ఈ దుర్యోధనుని వధించు" అని ముందే చెప్పాడు. 'కర్ణశకునులు ఎప్పుడూ వీనిని చూడకుండేటట్లు చెయ్యి, వీళ్ళ జూదం ఆడటానికి చేసే ప్రయత్నాలు వారించు. ధర్మాత్ముడయిన యుధిష్ఠిరుని పట్టాభిషిక్తుని చెయ్యి. ఇంద్రియనిగ్రహం గల ఆయన ధర్మపూర్వకంగా ఈ భూమిని పాలిస్తాడు. కుంతీ పుత్రుడయిన యుధిష్ఠిరుని రాజును చేయటం ఇష్టంలేక పోతే రాజా! నీవే రాజువయి స్వయంగా రాజ్యం తీసుకో ! పాలించు. నరేంద్రా! సర్వప్రాణులయందు సమానంగా ప్రవర్తించే నిన్ను జ్ఞాతులు అందరూ సోదరులతో కూడా అనుసరించి బ్రతుకుదురుగాక.' కుంతీపుత్రా! ఇలా ముందు చూపుగల విదురుడు చెపుతుంటే నేను పాపాత్ముడయిన దుర్యోధనుని అనుసరించాను. నాబుద్ధి వ్యర్థం అయింది. ధీరు డయిన విదురుని తీయని మాటలను పెడచెవిన పెట్టి దానికి తగిన ఫలితంగా మహాదుఃఖం పొంది శోకసముద్రంలో మునిగాను. రాజా! ముసలివారు, దుఃఖితులయిన మీ పెద్ద తండ్రి, పెద్దమ్మలను ఇప్పుడు కనిపెట్టు. నీవు దుఃఖించవలసింది ఏమీ నాకు కన్పించదు.'

2. శ్రీకృష్ణవ్యాసులు యుధిష్ఠిరుని ఓదార్చుట.

ధీమంతు డయిన ధృతరాష్ట్రుడు ఇలా చెప్పగా యుధిష్ఠిరుడు మౌనం దాల్చాడు. అప్పుడు మేధావి అయిన శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "రాజా! మనుష్యుడు మరణించిన తన వారికోసం మనస్సులో ఎక్కువగా శోకిస్తే అది అంతకుముందు మరణించిన పూర్వపితామహులకు ఎక్కువ సంతాపం కలిగిస్తుంది. భూరిదక్షిణలతో నానా విధాలయిన అనేక యజ్ఞాలను చెయ్యి. సోమంతో దేవతలను, స్వధతో పితృదేవతలను తృప్తి పరచు. అతిథులను అన్నపానా లిచ్చి, దరిద్రులకు వారికి కావలసినవి ఇచ్చి తృప్తిపరచు. తెలియదగినదంతా నీకు తెలుసు. చేయవలసిన వన్నీ చేశావు. గంగాపుత్రుడయిన భీష్ముని వలన, వ్యాసునివలన, నారదుని వల్ల, విదురునివల్ల రాజధర్మాలను విన్నావు. మూర్ఖుల ప్రవర్తనను అనుసరించటం నీకు తగదు. తాత తండ్రుల ప్రవర్తన ననుసరించి రాజ్యభారం

వహించు. నిస్సంశయంగా క్షత్రియ వీరులు కీర్తిదాయకమయిన వీరత్వం చూపి, స్వర్గం చేరటం సముచితమే కదా! శూరులలో యుద్ధవిముఖుడు ఎవ్వడూ హతుడు కాలేదు. మహారాజా! శోకం త్యజించు. అలా జరుగవలసింది జరిగింది. ఈ యుద్ధంలో చనిపోయిన వారిని మళ్ళీ చూడటం అశక్యం." అని గోవిందుడు ధర్మరాజయిన యుధిష్ఠిరునికి చెప్పి, విరమించాడు. మహా తేజస్వి అయిన యుధిష్ఠిరుడు కృష్ణునితో ఇలా అన్నాడు. 'శ్రీకృష్ణా ! నీకు నా మీద ఉన్న ప్రేమ నాకు తెలుసు. ప్రేమతో, మంచి మనస్సుతో ఎల్లప్పుడూ నామీద దయ చూపుతుంటావు. శ్రీకృష్ణా! నీవు ప్రసన్నమయిన మనస్సుతో నాకు తపోవనానికి వెళ్ళటానికి అనుజ్ఞ ఇస్తే అది నాకు ప్రియమయిన కార్యం అవుతుంది. అప్పుడు నేను కృతకృత్యుడి నవుతాను అని నా ఆలోచన. తాతగారయిన భీష్ముని, గురువయిన ద్రోణుని యుద్ధాలలో పారిపోని పురుషశ్రేష్ఠుడయిన కర్ణుని క్రూరుడినై నేలగూల్చిన నాకు శాంతి కలగటం లేదు. ఈ క్రూరకార్యంనుంచి ఏమిచేస్తే నాకు ముక్తి కలుగుతుంది? ఏ కార్యం చేస్తే నా మనస్సు పరిశుద్ధం అవుతుంది ?'

ఇలా మాట్లాడుతున్న యుధిష్ఠిరునితో ధర్మవేత్తఅయిన వ్యాసమహర్షి ఓదారుస్తూ అర్థవంతంగా ఇలా చెప్పాడు. 'నాయనా! నీ మనస్సు ఇంకా శుద్ధం కాలేదు. కాబట్టే మళ్ళీ బాలునిలాగా అవివేకంతో మోహితుడి వవుతున్నావు. వత్సా! ఇప్పుడు మావల్ల ఏం ప్రయోజనం? చాలాసార్లు మేము చెప్పేవి వ్యర్థప్రలాపాల్లాగా అయ్యాయి. యుద్ధమే బ్రతుకు తెరువయిన క్షత్రియ ధర్మాలు నీకు బాగా తెలుసు. వాటిని అనుసరించి ప్రవర్తించే రాజు ఎప్పుడూ మానసిక చింతలో పడడు. నీవు మోక్ష ధర్మాలను గూడా ఉన్నవి ఉన్నట్లు సంపూర్ణంగా విన్నావు.

అలా కామజనితమాయను నీవు పరిత్యజించాలి. త్యజించే రాజు ఎప్పుడూ బద్ధుడు కాడు.

నేను చాలాసార్లు నీకు కామజనిత సందేహాలను నివారించాను. కాని నీ బుద్ధి కళతప్పి వాటిమీద శ్రద్ధ పెట్టలేదు. అందువల్ల నిజంగా నీకు స్మరణశక్తి తగ్గిందనటం నిశ్చయం. నీవు ఇలా కారాదు. ఇలాంటి అజ్ఞానం నీకు తగదు. అనఘా! నీకు ప్రాయశ్చిత్తాలు అన్నీ తెలుసు. సమస్త రాజధర్మాలు, దానధర్మాలు విన్నావు. సమస్త ధర్మాలు తెలిసిన వాడివి, సర్వశాస్త్ర విజ్ఞానం గలవాడివయినా అజ్ఞానం వల్ల మాటిమాటికి ఎందుకు మోహితుడి వవుతున్నావు?'

3. సంవర్తమరుత్త వృత్తాంతము.

వ్యాసుడు చెప్పాడు - 'యుధిష్ఠిరా! నీ మనస్సు సరిగాలేదని నాకు అనిపిస్తున్నది. ఏ మానవుడూ స్వతంత్రుడయి, స్వయంగా ఏ పనీ చేయలేడు. పరమేశ్వర ప్రేరణతో ఈ పురుషుడు మంచిపని గాని చెడ్డపని గాని చేస్తాడు. ఆ విషయంలో దుఃఖించనవసరం లేదు. భారతా! అయినా చివరకు నీవు 'నేను పాపకర్ముడి' నని అనుకొంటున్నావు. ఆ పాపం ఎలా తొలగించుకోవాలో చెపుతాను, విను. యుధిష్ఠిరా! పాపాలు చేసే పురుషులు తపస్సులతో, యజ్ఞాలతో, దానంతో నిత్యం తమ్ము ఉద్ధరించుకొంటారు. నరశ్రేష్ఠా! భూపాలా! పాపాలు చేసే మానవులు యజ్ఞంతో, తపస్సుతో, దానంతో, ఆ పాపాలనుంచి విముక్తులవుతారు. మహాత్ములయిన అసురులు, దేవతలు కూడా పుణ్యం కలగటాని కని యజ్ఞక్రియ నిర్వర్తింప ప్రయత్నిస్తుంటారు. కాబట్టి యజ్ఞాలే పరమాశ్రయాలు. యజ్ఞాల వల్లనే దేవతలు మహాత్ములు, అధికులు అయినారు. అప్పుడు దేవతలు కార్యనిష్ఠులయి దానవులను ఓడించారు. భరతవంశీయా! యుధిష్ఠిరా! అందువల్ల నీవు రాజసూయం, అశ్వమేధం, సర్వమేధం, నరమేధం అనే యజ్ఞాలు చెయ్యి. పూర్వం దశరధ కుమారుడయిన శ్రీరామునివలె సమృద్ధమయిన దక్షిణలతో, సమధికంగా కోరినవారికి అన్నం, ధనం ఇవ్వవలసిన అశ్వమేధ యాగాన్ని యథావిధిగా ఆచరించు. నీకు పూర్వపితామహుడు, మహావీరుడు, శకుంతలా దుష్యంతుల కుమారుడు మహారాజు అయిన భరతుడు చేసినట్లు చేయి.

యుధిష్ఠిరు డన్నాడు - 'మహర్షీ! అశ్వమేధయాగం నిస్సంశయంగా భూమండలాన్ని గూడా పవిత్రం చేస్తుంది. ఆ విషయంలో నాకు ఒక ఉద్దేశ్యం ఉంది. అది నీవు వినదగినది. విప్రశ్రేష్ఠా! మహత్తరమయిన ఈ జ్ఞాతివధ చేసి స్వల్పదానం చేయటం వీలుగాదు, సమృద్ధిగా దానం చేయటానికి నావద్ద ధనం లేదు. ఇక్కడ ఉన్న ఈ రాజులు అందరూ బాలురు, దీనులు. వీరికి యుద్ధంలో తగిలిన గాయాలు ఇంకా మానలేదు. అలాగే చాలా సంకట స్థితిలో ఉన్నారు. వీరిని ధనం అడగలేను. ద్విజోత్తమా! భూమిని అంతా స్వయంగా నాశనం చేసి, శోకపరాయణుడినై పన్నులు ఎలా వసూలు చేయగలను ? మునిసత్తమా! దుర్యోధనుడు చేసిన అపరాధం వల్ల భూమి, రాజులు నాశనం అయ్యారు. అతడు మమ్ములను అపకీర్తి పాలు చేశాడు. ధనంకోసం దుర్యోధనుడు భూమిని సర్వనాశనం చేశాడు. ధనం లభించకపోగా ఆ దుర్బుద్ధి ఖజానాకూడా ఖాళీ అయింది. అశ్వమేధ యజ్ఞంలో సమస్త భూమండలాన్ని దానం చెయ్యాలి. ఇది విద్వాంసులు ప్రథమ కల్పంగా భావిస్తారు. ఇలా కాకుండా చేసేది శాస్త్ర విధికి విరుద్ధం. తపోధనా! ముఖ్య వస్తువు

లేనప్పుడు ఇంకో వస్తువు ఏదయినా ఇవ్వటాన్ని ప్రతినిధి దక్షిణ అంటారు. ఆ ప్రతినిధి దక్షిణ ఇవ్వటం నాకు ఇష్టం లేదు. కాబట్టి ఈ విషయంలో తగు సలహాను ఇవ్వగోరుతాను.'

యుధిష్ఠిరుడు ఇలా చెప్పగా కృష్ణద్వైపాయన మహర్షి ఒక్క రెండు గడియలు ఆలోచించి, ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'కుంతీకుమారా! హిమవత్పర్వత ప్రాంతంలో ధనం సమృద్ధిగా ఉంది. దాంతో ఖాళీ అయిన నీ ధనాగారం నిండుతుంది. మహాత్ముడయిన మరుత్తుని యజ్ఞంలో దానం తీసుకొన్న బ్రాహ్మణులు దాన్ని వదలివేశారు. అది తీసుకురా. అది యజ్ఞానికి చాలుతుంది.' యుధిష్ఠిరుడు అడిగాడు - 'వక్తలలో శ్రేష్ఠుడివయిన వ్యాసమహర్షీ! మరుత్తుని యజ్ఞంలో ఇంత ధన సంగ్రహణం ఎలా జరిగింది? ఆ రాజు ఏ సమయంలో ఉన్నాడు ?' వ్యాసుడు చెప్పాడు - 'పృథా పుత్రా! కరంధముని మనుమని వృత్తాంతం వినదలచుకొంటే చెపుతాను విను. ఆ రాజు ఏకాలంలో మహాధనవంతుడు అయినాడో చెపుతాను విను.'

4. మరుత్తుని పూర్వరాజులు, మరుత్తుని గుణ ప్రభావములు.

ధర్మరాజు అడిగాడు - 'ధర్మజ్ఞా! రాజర్షి అయిన ఆ మరుత్తుని కథను, ఆయన గుణ కీర్తనను వినగోరుతున్నాను. అనఘా! ద్వైపాయన మహర్షీ! అది నాకు చెప్పవలసింది.' వ్యాసుడు చెప్పాడు. 'నాయనా! కృతయుగంలో రాజదండం ధరించిన మనువు ఉండేవాడు. ఆయన పుత్రుడు ప్రసంధి అనే పేరుతో ప్రసిద్ధుడు. ప్రసంధికి క్షుపుడు అనే పేరుతో ప్రసిద్ధుడయిన కుమారుడు కలిగాడు. క్షుపుని పుత్రుడయిన ఇక్ష్వాకు మహారాజు ప్రభువయినాడు. రాజా! ఆయనకు ధార్మికులయిన నూరుగురు పుత్రులు కలిగారు. ప్రభువయిన ఇక్ష్వాకువు వారిని అందరిని నరపతులను చేశాడు. వారిలో పెద్దవాడు వింశుడు. ఆయన విలుకాండ్రకు ఆదర్శం అయ్యాడు. వింశుని పుత్రుడు వివింశుడు. రాజా! వివింశునికి పదిహేను మంది పుత్రులు కలిగారు. వాళ్ళందరూ ధనుర్విద్యలో వీరులు, బ్రాహ్మణభక్తులు. ఆడినమాట తప్పనివారు. దానధర్మాలు చేయటంలో ఆసక్తులు, ఎల్లవేళలా ప్రియంగా మాట్లాడేవారు. వారిలో పెద్దవాడు ఖనీనేత్రుడు. ఆతడు వారిని అందరినీ బాధించేవాడు. పరాక్రమవంతుడయిన ఖనీనేత్రుడు నిష్కంటకంగా రాజ్యాన్ని జయించాడు. కాని రాజ్యం రక్షించలేకపోయాడు. ప్రజలు కూడా అతనియందు అనురక్తులు కాలేదు. ప్రజలు అతనిని రాజ్యాన్నుంచి తొలగించి, అతని పుత్రుడయిన సువర్చసుని రాజ్యాభిషిక్తుని చేసి, సంతోషించారు.

ఆయన తన తండ్రి దీనదశను, రాజ్యంనుంచి తొలగింపబడటం చూసి, తగినరీతిగా జాగ్రత్తపడి, ప్రజల హితంకోసం అందరితో ఉచితరీతిగా ప్రవర్తించాడు. సువర్చసుడు బ్రాహ్మణభక్తుడు సత్యవచనుడు, పవిత్రుడు, శమదమాలు గలవాడు, ధర్మాసక్తుడు కావటంవల్ల ప్రజలు ఆయన యందు అనురక్తులయ్యారు. కేవలం ధర్మ నిరతుడు మాత్రమే కావటం వల్ల కొద్దిరోజుల్లోనే రాజుగారి కోశాగారం ఖాళీ అయింది. అది తెలుసుకొన్న సామంతరాజులు ఆయనను పీడించసాగారు. అనేకులు ఎక్కువగా పీడించటంచేత ధనాగారం, గుర్రాలు, ఇతర వాహనాలు క్షీణించటం చేత సేవకులతో, పట్టణ వాసులతో సహా మిక్కిలి సంకటస్థితిలో పడ్డాడు. యుధిష్ఠిరా! ఆ రాజు మంచి నడవడిక గలవాడు, ధర్మపరాయణులు కావటంవల్ల కోశాగారం, సైన్యం నష్టం అయినా ఆక్రమించిన శత్రువులు సంహరించలేకపోయారు. నగర వాసులతో గూడా తీవ్రమయిన ఆపదలో పడిన ఆ రాజు - సువర్చసుడు తన చేతిని నోటిమీద పెట్టుకొని, శంఖంలాగే పూరించాడు. దానివల్ల సైన్యం ఆవిర్భవించింది. ఆ సైన్యంతో ఆయన రాజ్యానికి చుట్టుప్రక్కల పాలిమేరలలోని శత్రురాజులను జయించాడు. రాజా! చేతిని శంఖంలాగా చేసి ఊదటం వల్ల ఆయనను కరంధముడు అన్నారు. ఆయన పుత్రుడు కారంధముడు. త్రేతాయుగారంభంలో కలిగాడు. ఆయన ఇంద్రసమానుడు. శ్రీమంతుడు. దేవతలకు కూడా జయింపవీలుగానివాడు. ఆ కారంధమునికి సమస్త రాజులు వశమయి ఉండేవారట. ఆయన నడవడితో బలంతో ఆ రాజులకు అందరికి సమ్రాట్టు అయ్యాడు.

ధర్మాత్ముడయిన ఆ కరంధముని పుత్రుని పేరు అవిక్షితుడు. శౌర్యంలో ఆయన ఇంద్రతుల్యుడు. యజ్ఞాలు చేసేవాడు. ధర్మరతుడు, ధైర్యం గలవాడు. ఇంద్రియాలను అదుపులో పెట్టుకొన్నాడు. ఆయన తేజస్సులో సూర్యసమానుడు. ఓర్పులో భూదేవి వంటివాడు. బుద్ధిలో బృహస్పతి. హిమవంతునివలె సుస్థిరుడు. అవిక్షితుడు పనులతో, మనస్సుతో, మాటలతో, ఇంద్రియజయంతో ప్రజల మనస్సులను సంతృప్తి పరిచాడు. ఆ రాజు యథావిధిగా నూరు అశ్వమేధాలు చేశాడు. విద్వాంసుడు, సమర్థుడయిన అంగిరసుడు స్వయంగా ఆ యాగాలు ఆయనచేత చేయించాడు. ఆయన పుత్రుడయిన మరుత్తుడు మహాయశస్సంపన్నుడు, చక్రవర్తి, ధర్మజ్ఞుడు. ఆయన తన ఉత్తమగుణాలతో తండ్రిని మించిపోయాడు. ఆయనకు పదివేల ఏనుగుల బలం ఉంది. ఆయన మరియొక విష్ణువు లాగా కన్పించేవాడు. ఆయన యజ్ఞం చేయటానికి సిద్ధమయి శుభ్రమయిన బంగారు పాత్రలు వేలకొలదిగా చేయించాడు. ఆయన హిమవత్పర్వతానికి ఉత్తరం వైపున ఉన్న

మేరుపర్వతం దగ్గరకు వెళ్ళి అక్కడ యజ్ఞశాలను నిర్మింపజేశాడు. అక్కడే యజ్ఞకార్యాలను ఆరంభించాడు. ఆయన ఆజ్ఞను అనుసరించి, అనేక సువర్ణకారులు సువర్ణమయమయిన కుండాలను, సువర్ణ పాత్రలను, కుండలను, ఇతర పాత్రలను, ఆసనాలను తయారుచేశారు. వాటి సంఖ్య లెక్కకు మించింది. పృథివీపతి, నరపతి ధర్మాత్ముడు అయిన ఆ మరుత్తుడు ఇతర రాజులు అనేకులతో కలిసి అక్కడ యథావిధిగా యజ్ఞం చేశాడు.

5. ఇంద్రుని ప్రేరణతో బృహస్పతి మనుష్యునిచే యజ్ఞము చేయింపనని ప్రతిజ్ఞ చేయుట.

యుధిష్ఠిరుడు అడిగాడు – 'వక్తలలో శ్రేష్ఠుడివయిన మహర్షీ! ఆ రాజు పరాక్రమం ఎంతటిది? ఆయనకు అంత బంగారం ఎలా లభించింది ? తపోధనా! మహాత్మా! ఆ ద్రవ్యం ఇప్పుడు ఎక్కడ ఉన్నది? దాన్ని మేము ఎలా పొందగలం ?' వ్యాసమహర్షి చెప్పాడు – 'నాయనా! దక్షప్రజాపతికి అసురులు, దేవతలు సంతానం. వారు పరస్పరం పోటీపడేవారు. ఆ రీతిగానే అంగిరసునికి మహాతేజస్వి అయిన బృహస్పతి తపోధనుడయిన సంవర్తుడు అనే ఇద్దరు పుత్రులు. వ్రతపాలనలో సమానులుగా ఉండేవారు. పరస్పరం స్పర్ధగల వారిద్దరు విడిగా ఉండేవారు. పెద్దవాడయిన బృహస్పతి తన తమ్ముడైన సంవర్తుని మాటిమాటికి బాధిస్తుండేవాడు. అన్న ఎల్లవేళలా బాధిస్తుంటే సంవర్తుడు విసుగుజెంది, సంపదలు అన్నీ వదలి, ఇల్లువాకిలి వదలి దిగంబరుడయి అడవులు పట్టాడు. ఆయనకు అదే బాగుంది. ఇంద్రుడు కూడా అసురులను అందరిని జయించి, లోకాలు అన్నింటి మీద ఇంద్రత్వాన్ని పొందాడు. తరువాత అంగిరసుని పుత్రులలో పెద్దవాడు బ్రాహ్మణ జ్యేష్ఠుడయిన బృహస్పతిని పురోహితునిగా చేసుకొన్నాడు. ఇంతకుముందు అంగిరసునికి కరంధమ మహారాజు యజమానిగా ఉండేవాడు. ఆ రాజు పరాక్రమంతో, బలంతో, నడవడితో లోకంలో సాటిలేనివాడు. ఇంద్రునివలె తేజస్వి. ధర్మాత్ముడు. కఠోర వ్రతపాలకుడు. ఆయన వాహనాలు, మిత్రులు, నానావిధాలయిన ముఖ్యశయనాలు చాలా విలువయినవి. అన్నీ ధ్యానించటం వల్ల నోటిగాలి వల్ల ఆవిర్భవించేవి. ఆ మానవేంద్రుడు ఉత్తమగుణాలతో సమస్త రాజులను వశం చేసుకొన్నాడు.

అనుకొన్నంత కాలం ఈ లోకంలో ఆయన బ్రతికి ఉండి, చివరకు శరీరంతోపాటు స్వర్గానికి వెళ్ళాడు. ఆయన కుమారుడు అవిక్షితుడు యయాతి మహారాజులాగా సకల ధర్మాలు తెలిసినవాడు. శత్రువులను జయించినవాడు. కరంధముని తరువాత ఆయన

భూమిని వశం చేసుకొన్నాడు. ఆ రాజు పరాక్రమంతో, గుణాలతో తండ్రి వంటివాడు అయినాడు. ఆ అవిక్షితునికి ఇంద్రతుల్యుడు, పరాక్రమవంతుడయిన మరుత్తుడు పుత్రుడు. సముద్రమే వస్త్రంగా గల భూదేవి ఆయన యందు అనురక్తురాలు అయింది. ఆయన ఎల్లప్పుడు దేవరాజయిన ఇంద్రునితో పోటీపడే వాడు. ఇంద్రుడు కూడా ఆయనతో పోటీపడేవాడు. మరుత్తుడు ఉత్తమగుణాలు కలవాడు. ఎంతగానో ప్రయత్నించి గూడా ఇంద్రుడు ఆయనను మించలేకపోయాడు. అతడు దేవతలను గూడా మించిపోవటం చేత ఇంద్రుడు బృహస్పతిని పిలిచి ఇలా చెప్పాడు. 'బృహస్పతీ! నాకు సంతోషం కలిగించాలి అనుకొంటే మరుత్తుని చేత ఏ పరిస్థితిలో కూడా దైవకార్యాలు గాని, పిత్కకార్యాలు గాని నీవు చేయించవద్దు. బృహస్పతీ! ముల్లోకాలలో దేవతలందరిలో నేను ఒక్కడినే ఇంద్రత్వం పొందగలిగాను. మరుత్తుడు ఒక్క భూపతిమాత్రమే. బ్రాహ్మణోత్తమా! మరణం లేని ఇంద్రుని చేత యాగాదులు చేయించే నీవు మరణం గల మరుత్తుని చేత నిశ్శంకంగా ఎలా యాగాదులు చేయిస్తావు ? బృహస్పతీ! నీకు మేలు కలుగుగాక. నన్నో లేక మరుత్తునో యజమానిగా చేసుకో. మరుత్తుని పూర్తిగా వదిలివేసి నన్ను మాత్రమే ఆశ్రయించు.' దేవరాజు ఇలా చెప్పగా బృహస్పతి ఒక్క కొద్దిసేపు ఆలోచించి ఇంద్రునితో అన్నాడు. 'దేవరాజా! నీవు సమస్త ప్రాణులకు అధిపతివి. సమస్త లోకాలు నీ మీదనే ఆధారపడి ఉన్నాయి. నీవు నముచిని, విశ్వరూపుని, బలుని సంహరించినవాడివి. సాటిలేని వీరుడివి. నీవు ఉత్తమ సంపత్తి కలిగి ఉన్నావు. భూమిని, స్వర్గాన్ని ఎల్లవేళలా నీవే రక్షిస్తున్నావు. అలాంటి నీకు పౌరోహిత్యం చేసే నేను మానవుడయిన మరుత్తునికి ఏలా పౌరోహిత్యం చేస్తాను ? దేవేంద్రా! ధైర్యం వహించు. ఇకముందు నేను ఎలాంటి స్థితిలో గూడా మర్త్యుని యజ్ఞంలో స్రువాన్ని పట్టుకోను. ఈ నా మాట విను. అగ్ని వేడిమి కోల్పోయినా, భూమి తల్లక్రిందులయినా, సూర్యుడు వెలుగును ఇవ్వకపోయినా నిజమయిన నా ప్రతిజ్ఞ స్థిరంగా ఉంటుంది.' వైశంపాయనుడు చెప్పాడు. 'ఇంద్రుడు బృహస్పతి మాటలు విని మాత్సర్యం వదలి ఆయనను ప్రశంసించి, తన భవనం లోకి వెళ్ళాడు.'

6. నారదవచనానుసారము సంవర్తుని మరుత్తుడు దర్శించుట.

వ్యాసమహర్షి చెప్పాడు - ఈ విషయంలో ధీమంతుడయిన మరుత్తుడు, బృహస్పతుల సంవాదరూపమైన పురాతనేతిహాసాన్ని చెపుతారు. బృహస్పతి దేవరాజయిన ఇంద్రునితో చేసుకొన్న ఒప్పందం విన్న మరుత్త మహారాజు గొప్ప యజ్ఞానికి కావలసిన

సంభారాలు సిద్ధంచేశాడు. కరంధముని మనుమడయిన మరుత్తుడు యజ్ఞం చేయటానికి మానసికంగా సంకల్పించాడు. మాటకారి అయిన ఆయన బృహస్పతి వద్దకు వచ్చి, ఇలా అన్నాడు. 'తపోధనా! గురుదేవా! పూర్వం ఒకప్పుడు మీ వద్దకు వచ్చి యజ్ఞవిషయంలో మీసలహా తీసుకొన్నాను. మీరు చేయమని ఆజ్ఞాపించిన ఆ యజ్ఞాన్ని ఇప్పుడు చేయ తలపెట్టాను. మీ మాట ప్రకారం యజ్ఞానికి కావలసిన వస్తు సమకూర్చుకొన్నాను. సాధుపురుషా! మీకు పూర్వం యజమానిని. కాబట్టి నా చేత యజ్ఞం చేయించండి.' బృహస్పతి అన్నాడు - 'భూపాలా! నీచేత యజ్ఞం చేయించాలనే కోరిక నాకు లేదు. దేవరాజు పురోహితునిగా నన్ను చేసుకొన్నాడు. ఆయనకు తప్ప మరెవరికీ పౌరోహిత్యం చేయనని మాట ఇచ్చాను.' మరుత్తుడన్నాడు - 'మీ తండ్రి నాటినుంచి నేను మీకు యజమానిని. నాకు మీరంటే అమితమయిన పుణ్యభావం ఉంది. మీ శిష్యుడిని. సేవాతత్పరుడిని. నన్ను ఆత్మీయుని చేసుకోండి.'

బృహస్పతి అన్నాడు - 'మరుత్తా! దేవతలచేత యజ్ఞం చేయించిన తరువాత మానవునిచేత ఎలా చేయించేది ? వెళ్ళు లేకపోతే ఉండు. ఇవ్వాళ నేను మానవునిచేత యజ్ఞం చేయించటం మానుకొన్నాను. ఇవ్వాళ నీచేత యజ్ఞం చేయించను. నీకు కావలసిన ఇంకెవరినైనా పురోహితునిగా చేసుకో. ఆతడు నీచేత యజ్ఞం చేయిస్తాడు.' బృహస్పతి ఇలా అనగా మరుత్తరాజు సిగ్గుతో ముడుచుకుపోయాడు. చాలా ఖిన్నుడై తిరిగి వస్తూ త్రోవలో నారద మహర్షిని దర్శించాడు. ఆ రాజు దేవర్షి నారదుని వద్దకు వచ్చి యథావిధిగా దోసిలొగ్గి నిలిచాడు. అప్పుడు నారదుడు ఇలా అన్నాడు. 'అనఘా! రాజర్షీ! ఏమిటి ? నిరుత్సాహంగా దీనంగా ఉన్నావు ? క్షేమమేనా? ఎక్కడికి వెళ్ళావు ? ఈ ఖేదానికి కారణమేమిటి ? రాజశ్రేష్ఠా! వినదగినదైతే నాకు చెప్పు. రాజా! సర్వప్రయత్నాలతో నీకు కలిగిన దుఃఖాన్ని తొలగిస్తాను.' నారద మహర్షి ఇలా అడుగగా మరుత్తుడు ఉపాధ్యాయుడు (పురోహితుడు) తనకు దూరమయిన వృత్తాంతం అంతా ఆయనకు నివేదించాడు. మరుత్తుడు చెప్పాడు - 'అంగిరస పుత్రుడు, దేవగురువు అయిన బృహస్పతి వద్దకు వెళ్ళాను. నా యజ్ఞంలో ఋత్విక్కుగా ఉండమని అడగగా ఆయన నా ప్రార్థనను అంగీకరించలేదు. నారదా! ఆయన నామీద మర్త్యుడ ననే దోషం ఆరోపించాడు. అందువల్ల నన్ను పరిత్యజించాడు. ఆయన నిరాకరించటం వల్ల ఇవ్వాళ నేను జీవించదలచుకోలేదు.'

వ్యాసమహర్షి చెప్పాడు. 'మహారాజా! ఇలా రాజు చెప్పగా నారదుడు అవీక్షితుని కుమారుని మాటలతో బ్రతికిస్తున్నట్లు ఇలా అన్నాడు. "రాజా! అంగిరసుని పుత్రుడు,

ధర్మాత్ముడు అయిన సంవర్తుడు దిగంబరుడై నిగూఢంగా అన్ని దిక్కులలో తిరుగుతున్నాడు. బృహస్పతికి నీచేత యజ్ఞం చేయించటం ఇష్టం లేకపోతే సంవర్తుడు యజ్ఞం చేయిస్తాడు. ఆయన దగ్గరకు వెళ్ళు.' మరుత్తుడు అన్నాడు - 'నారదమహర్షీ! నీ మాటలతో పునర్జీవితుడి నయ్యాను. సంవర్తుని నేను ఎక్కడ చూడాలో చెప్పవలసింది. ఆయన దగ్గర ఎలా ప్రవర్తించాలి? ఆయన నన్ను పరిత్యజించకుండా ఉంటాడా? ఆయన కూడా నిరాకరిస్తే నే బ్రతుకలేను.' నారదమహర్షి చెప్పాడు - 'మహారాజా! ఆయన వారణాసిలో మహేశ్వరుని దర్శింపగోరి, పిచ్చివాడి వేషంలో ఇష్టంవచ్చినట్లు తిరుగుతుంటాడు. నీవు ఆ పట్టణ ప్రవేశద్వారం వద్దకు వెళ్ళి, అక్కడ ఒక చోట ఒక శవాన్ని పడవెయ్యి. రాజా! అదిచూసి వెనకకు వెళ్ళేవాడే సంవర్తుడు. ఆ తేజోవంతుడు వెళ్ళే చోటికి ఆయన వెంబడే వెళ్ళు. ఒంటరిగా ఆయన ఉన్నప్పుడు దగ్గరకు వెళ్ళి, దోసిలొగ్గి శరణు పొందు. నా నివాసం నీకు ఎవరు చెప్పారు? అని సంవర్తుడు అడిగితే నారదుడు మిమ్ము గురించి చెప్పాడు అని ఆయనతో అను. ఆయన నా దగ్గరకు రాదలచి నేను ఎక్కడున్నానో అడిగితే నీవు సందేహించకుండా నారదుడు అగ్నిప్రవేశం చేశాడని చెప్పు.'

వ్యాసమహర్షి చెప్పాడు - మరుత్తుడు 'అలాగే' అని చెప్పి ఆయనను తగు రీతిగా గౌరవించాడు. ఆ రాజర్షి ఆయన అనుమతి తీసుకొని వారణాసీ పురానికి బయలుదేరాడు. మహాయశస్వి అయిన మరుత్తుడు వారణాసికి వెళ్ళి నారద వచనం స్మరిస్తూ ఆపట్టణ ద్వారంలో ఒక శవాన్ని పడవేశాడు. అదే సమయంలో విప్రవరుడైన సంవర్తుడు వారణాసీ నగర ద్వారంలో ప్రవేశించాడు. అక్కడ శవాన్ని చూసి త్వరగా వెనుదిరిగాడు. సంవర్తుడు వెనుదిరగటం చూసి, మరుత్త మహారాజు ఆయన బోధకోసం దోసిలొగ్గి, నమస్కరిస్తూ ఆయన వెంటవెళ్ళాడు. సంవర్తుడు ఏకాంతంలో ఆయనను చూసి, ఆయనమీద దుమ్ము చల్లాడు. బురదవేశాడు. కళ్ళె వేశాడు. ఉమ్మివేశాడు. సంవర్తుడు ఈ రీతిగా బాధిస్తున్నప్పటికి మరుత్తరాజు దోసిలొగ్గి నమస్కరిస్తూ ప్రసన్నుని చేసుకొంటూ వదలకుండా వెంట వెళ్ళాడు. తరువాత సంవర్తుడు అలసిపోయి, వెనుదిరిగి చాలా కొమ్మలు గల్గి చల్లని నీడనిచ్చే ఒక మర్రి చెట్టు క్రింద కూర్చున్నాడు.

7. సంవర్తమరుత్తీయము.

సంవర్తుడు అన్నాడు. "నన్ను ఎలా తెలుసుకొన్నావు ? నీకు ఎవరు చెప్పారు ? నాకు సంతోషం కలగాలంటే యధార్థం చెప్పు. నిజాన్ని చెపితే నీ కోరికలు అన్నీ నెరవేరుతాయి.

అబద్ధం చెపితే నీ తల నూరు ముక్కలవుతుంది." మరుత్తుడు చెప్పాడు - 'త్రోవన వెళ్ళుతున్న నారదుడు మీరు తన గురు పుత్రులని చెప్పాడు. అందువల్ల నాకు చాలా సంతోషం కలిగింది.' సంవర్తుడు అన్నాడు - 'నీవు నిజమే చెప్పావు. నేను యాగాలు చేయిస్తానని ఆయనకు తెలుసు. ఇప్పుడు నారదుడు ఎక్కడ ఉన్నాడో చెప్పు.' మరుత్తుడన్నాడు - 'దేవర్షి శ్రేష్ఠుడు మిమ్ములను గురించి నాకు చెప్పి, నాకు సెలవిచ్చి, అగ్ని ప్రవేశం చేశాడు.' వ్యాసమహర్షి చెప్పారు - 'మరుత్తరాజు మాటలు విన్న సంవర్తుడు చాలా సంతోషించాడు. ఈ మాత్రమైతే నేను చేయగలను అన్నాడు. రాజా! అప్పుడు ఉన్మత్తుడయిన ఆ బ్రాహ్మణుడు మాటలతో భయపెడుతున్నట్లు పరుషంగా రాజుతో పలుమారులు ఇలా అన్నాడు. 'వాయు ప్రధానుడిని - పిచ్చివాడినై నాచిత్తానుసారం ప్రవర్తించే నేను ఇలాంటి వికృత రూపంతో యజ్ఞం చేయించాలని ఎలా అనుకొంటున్నావు. మా అన్నగారు బృహస్పతి యజ్ఞాలు చేయించటంలో సమర్థుడు. ఇంద్రునితో కలిసి ఉంటాడు. యజ్ఞాలు చేయిస్తున్నాడు. ఆయనతో చేయించుకో. నా ఇల్లు, ఇంట్లో సామాను, యజమాని, గృహంలో పూజ్యులైన దేవతలు - సమస్తం మా అన్నగారు లాక్కున్నారు. ఈ శరీరం మాత్రం వదిలారు. మరుత్తా! ఆయన అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితిలో కూడా యజ్ఞం చేయించను. ఆయన నాకు పరమ పూజ్యుడు. నిజంగా నీవు యజ్ఞం చేయదలచుకొంటే బృహస్పతి అనుమతి తీసుకొనిరా! అప్పుడు నీచేత యజ్ఞం చేయిస్తాను.'

మరుత్తుడు చెప్పాడు. 'సంవర్తా! ఇంతకుముందు నేను బృహస్పతి వద్దకు ఈ విషయంలో వెళ్ళాను. ఆ విషయం చెపుతాను. వినండి. ఆయన ఇంద్రుని ప్రసన్నుని చేసుకోవటానికని ఇప్పుడు నన్ను తన యజమానిని చేసుకోవటానికి ఇష్టపడటం లేదు. "మృత్యువులేని ఇంద్రుడు యజమాని ఉండగా మర్త్యుని యజమానిగా గ్రహించకు. మరుత్తుని యజ్ఞం చేయించవద్దు" అని ఇంద్రుడు నిషేధించాడు. 'బృహస్పతీ! ఆ మరుత్తరాజు నాతో పోటీపడుతుంటాడు.' అని ఆయన అనగా మీ అన్నగారు 'అలాగే' అన్నారు. నేను చాలా ప్రేమగా ఆయన దగ్గరకు వెళ్ళాను. ఆయన దేవరాజును ఆశ్రయించి, నన్ను యజమానిగా స్వీకరించదలచలేదు. మునిపుంగవా! ఇది తెలుసుకో. కాబట్టి నేను నా సర్వస్వం ఇచ్చైనా సరే మీ చేతనే యజ్ఞం చేయించ గోరుతున్నాను. నీవు అనుగ్రహించే గుణ ప్రభావంతో ఇంద్రుని అతిక్రమించగోరుతున్నాను. బ్రహ్మర్షీ! బృహస్పతి వద్దకు వెళ్ళటానికి నాకు బుద్ధి పుట్టటం లేదు. ఎలాంటి అపకారం చేయకపోయినా ఆయన నన్ను నిరాకరించాడు గదా!' సంవర్తుడన్నాడు - 'రాజా! నా ఇష్టానుసారం పనిచేస్తే నీవు

కోరుకొన్నది పరిపూర్ణం అవుతుంది. నేను నీచేత యజ్ఞం చేయించేటప్పుడు దేవేంద్ర బృహస్పతులు ఇద్దరు కుపితులయిన నన్ను ద్వేషిస్తే అప్పుడు నీవు నా పక్షాన్ని సమర్థించాలి. అప్పుడు నీవు నా పక్షమే సమర్థిస్తావని నాకు నమ్మకమేమిటి? ఎలాగయినా నా సందేహం తీరాలి. అలా కాకపోతే క్రుద్ధుడినై బంధువులతో గూడా నిన్ను ఇవ్వాళే భస్మం చేస్తాను.' మరుత్తుడన్నాడు - 'బ్రహ్మర్షీ! మీ సాంగత్యాన్ని త్యజిస్తే సూర్యుడు తపింపజేస్తున్నంత కాలం, పర్వతాలు ఉన్నంతకాలం నాకు ఉత్తమలోక ప్రాప్తి కలుగకుండుగాక. మీసాంగత్యాన్ని వదలివేస్తే నాకు లోకంలో మంచి బుద్ధి కలుగకుండుగాక. నిరంతరం లౌకిక విషయ సుఖమగ్నుడిని అగుదును గాక.' సంవర్తుడు అన్నాడు - 'అవిక్షిత పౌత్రా! నీ బుద్ధి ఎల్లవేళలా సత్కర్మాసక్తమగు గాక. రాజా! నిన్ను యజమానిగా స్వీకరించాలని నా మనస్సులో ఉంది. రాజా! ఇందుకోసం నీకు సర్వోత్తమమయిన అక్షయ ధనం ప్రాప్తించటానికి ఉపాయం చెపుతాను. దానితో నీవు, దేవతలను, గంధర్వులను, ఇంద్రుని కూడా క్రిందు చేయగలవు. నాకు ధనం సంపాదిద్దామని గాని, యజమానులను సంపాదించవలెనని కాని కోరికలేదు. నా సోదరుడు బృహస్పతి, ఇంద్రుడు - వీరిద్దరికి విరుద్ధకార్యం చేస్తాను. నిన్ను ఇంద్రునితో సమానుని చేస్తాను. ఇది, నిశ్చయం నీకు ప్రియమయినది చేస్తాను. నీకు నిజం చెపుతున్నాను.'

8. సంవర్తమరుత్తీయము.

సంవర్తుడు చెప్పాడు. 'మరుత్తా! హిమవత్పర్వతానికి వెనుక ముంజవంతం అనే పర్వతం ఉంది. అక్కడ ఉమాపతి నిత్యం తపస్సు చేస్తుంటాడు. ఉమా సహాయుడయిన భగవానుడు, మహాతేజస్వి, శూలధారి అయిన మహేశ్వరుడు నానావిధాలయిన భూత గణాలు పరివేష్టించి ఉండగా ఆ పర్వతశ్రేష్ఠంయొక్క చెట్ల మొదట పర్వతశిఖరాల మీద మిట్ట స్లలలో, గుహలలో ఇష్టంవచ్చినట్లు, సుఖకరంగా నిత్యం విహరిస్తుంటాడు. ఆ పర్వతంమీద రుద్రగణాలు, సాధ్యులు, విశ్వేదేవులు, వసువులు, యముడు, వరుణుడు, సహచరులతో కుబేరుడు, భూత గణాలు, పిశాచులు, అశ్వినీకుమారులు, గంధర్వులు, అప్సరసలు, యక్షులు, దేవఋషులు, ఆదిత్యులు, మరుద్గణం, రాక్షసులు అనేక రూపాలు ధరించే ఉమాపతి అయిన పరమేశ్వరుని సేవిస్తుంటారు. వికృతులు, వికారాకారాలు గల కుబేరానుచరులు యక్షులు క్రీడిస్తుంటే వారితో శివదేవుడు ఆనందంగా ఉంటాడు. ఆ భగవానుని దివ్యస్వరూపం ఉదయకాల సూర్యునివలె తేజస్సుతో జాజ్వల్యమానమై కన్పిస్తుంది.

ప్రపంచంలోని ఏ ప్రాకృత ప్రాణికూడా చర్మచక్షువులతో ఆయన రూపాన్ని గాని, ఆకారాన్ని గాని ఎప్పుడూ చూడలేదు. రాజా! అక్కడ ఎక్కువ వేడి గాని, చలి గాని, గాలి తీవ్రత గాని, సూర్యుని ప్రచండతాపం గాని ఉండవు. ముసలితనం గాని, ఆకలిదప్పులు గాని, మృత్యువుగాని కలుగవు. ఇతర భయాలు ఏవీ ఉండవు. ఆ పర్వత పార్శ్వభాగాల్లో అంతటా సూర్యకిరణాలవలె ప్రకాశించే బంగారపు గనులు ఉన్నాయి. రాజా! మహాత్ముడయిన కుబేరునికి సంతోషం కలిగించగోరి కుబేరునికి సహాయులయిన యక్షులు ఎత్తి పట్టిన ఆయుధాలతో వాటిని రక్షిస్తుంటారు.

రాజర్షీ! అక్కడకు వెళ్ళి పరమభక్తితో మహా యోగేశ్వరుడయిన శివునికి నమస్కరించు. జగత్తును సృజించే శంకరునికి ప్రణమిల్లి, సర్వవిద్యలను ధరించిన ఆయనను ఈ నామాలతో స్తుతించు.

దుఃఖకారణం దూరంచేసే రుద్రునికి, నీలకంరునికి, అంత్యరామి అయిన పురుషునికి, అత్యంత తేజస్వికి, జటాజూట ధారికి, భయంకర రూపునికి, ఎఱ్ఱని కన్నులు గలవానికి, వరదాతకు, ముక్కోటికి, పూషదంతాలు ఊడగొట్టినవానికి, వామనునికి, శివునికి, యమని గణస్వరూపునికి, అవ్యక్తరూపునికి, సదాచారునికి, శంకరునికి, క్షేమం కరునికి, గోధుమరంగు శిరోజాలు కలవానికి, స్థాణువుకు (స్థిరునికి), పురుషునికి, హరినేత్రునికి, ముండునికి, క్రుద్ధునికి, సంసార సాగరం నుంచి ఉద్ధరించేవానికి, సూర్య రూపునికి, పవిత్ర తీర్థరూపునికి, దేవదేవునికి, వేగవంతునికి, శిరస్సుపై తలపాగ గలవానికి, సుందరముఖునికి, వేల కన్నులు గలవానికి, కామపూరకునికి, పర్వత శాయికి, ప్రశాంతునికి, సంయమం గలవానికి, చీరవస్త్రధారికి, బిల్వదండం దాల్చినవానికి, సిద్ధునికి, అందరిని దండించువానికి, ఆర్ద్రా నక్షత్ర స్వరూపునికి, మహాత్మునికి, పినాక మను ధనుస్సు ధరించినవానికి, లోకసృష్టి కర్తకు, శ్రేష్ఠునికి, చంద్ర సమానముఖునకు, సర్వమంత్రాలు సిద్ధింపజేసుకొన్నవానికి, నేత్రరూపునికి, బంగరుఛాయ గల సుందర బాహువులు గలవానికి, భయంకరునికి, దిక్కులకధిపతికి, అగ్ని రూపంతో జిహ్వాలతో హవిస్సును స్వీకరించువానికి, వాక్కుకు నివాసమయిన వానికి, మంత్ర సిద్ధిగలవానికి, కోరికలు కురిపించువానికి, పశుపతికి, భూతపతికి, ధర్మస్వరూపునికి, మాతృభక్తునికి, కార్తికేయస్వామి స్వరూపునకు సర్వపాలకునకు, ధనుర్ధారికి, భార్గవునికి, జన్మరహితునికి, కృష్ణనేత్రునికి, విరూపాక్షునికి, తీక్షణమయిన కోరలు గలవానికి, తీక్షణమయినవానికి అగ్ని రూపముఖునకు, మహాద్యుతికి, నిరాకారునికి, సమస్తమయిన వానికి, సమస్తమునకు ప్రభువయిన వానికి, రక్తవర్ణునికి,

తేజస్వికి, దేదీప్యమాన నేత్రునికి, మహాబలునికి, హిరణ్యవీర్యమయిన అగ్ని రూపునికి, సుందరశరీరునికి, స్థూలమయినవానికి, మృగచర్మధారికి, కపాల మాలికలు దాల్చువానికి, బంగరు కిరీటం గలవానికి, మహాదేవునికి, సచ్చిదానంద స్వరూపునికి, త్రినేత్రునికి, నిష్పాపునికి, దుష్టులపై కోపించువానికి, కోమల స్వభావునికి, మృదువునకు, బాహుశాలికి, దండికి, తేజోవంతమయిన తపస్సు చేయువానికి, క్రూరం కాని పనులు చేయువానికి, సహస్ర శిరస్సులు గలవానికి, వేల పాదాలు గలవానికి, స్వధా స్వరూపునికి, బహురూపునికి, దంష్ట్రినామం గలవానికి నమస్కారాలు. ఈరీతిగా పినాకి, మహాదేవుడు, మహాయోగి, అవ్యయుడు, త్రిశూల హస్తుడు, వరదుడు, మూడు కన్నులు గలవాడు, మూడు పురాలు నాశనం చేసినవాడు, సమస్త భువనాలకు ప్రభువు, సమస్త ప్రాణుల ఉత్పత్తికి కారణం అయినవాడు, సమస్తం ధరించేవాడు, మూడులోకాలకు అధిపతి, మహాతేజస్వి, భూమిని ధరించినవాడు, జగత్తుకు శాసకుడు, మేలు చేసేవాడు, సర్వరూపుడు, శివుడు, విశ్వేశ్వరుడు, జగత్తును పుట్టించేవాడు, పార్వతీపతి, పశుపాలకుడు, విశ్వరూపుడు, మహేశ్వరుడు, విరూపాక్షుడు, పది భుజాలు గలవాడు, ధ్వజం మీద దివ్య వృషభచిహ్నం దాల్చేవాడు. ఉగ్రుడు, స్థాణువు, శివుడు, రుద్రుడు, శర్వుడు, గౌరీశుడు, ఈశ్వరుడు, శితిక కంఠుడు, పుట్టుకలేనివాడు, శుక్రుడు, పృథువు, పృథుహరుడు, శ్లేష్ముడు, విశ్వరూపుడు విరూపాక్షుడు, బహురూపుడు, ఉమాపతి, మన్మథుని దహించినవాడు, హరుడు, చతుర్ముఖుడు, శరణాగత వత్సలుడు అయిన మహాదేవునికి తలవంచి నమస్కరించి, శరణందాలి.

తేజశ్శరీరంతో ప్రకాశించేవాడు, దివ్యాభరణ భూషితుడు, తుది మొదలు లేనివాడు. అజుడు, శంభువు, సర్వవ్యాపి, ఈశ్వరుడు, త్రిగుణరహితుడు, ఉద్వేగం లేనివాడు, నిర్మలుడు, తేజోనిధి, శర్వుడు అయిన హరుని దోసిలొగ్గి శరణందుతాను. పూజ్యుడు, నిశ్చలుడు, నిత్యుడు, కారణరహితుడు, నిర్లేపుడు, అధ్యాత్మతత్త్వ విచారకుని పలుమారులు నమస్కరింతును. అధ్యాత్మతత్త్వ విచారకు లగు జ్ఞానులు మోక్ష తత్త్వంలో ఆయన స్థితిని భావిస్తారు. తత్త్వ మార్గపరినిష్ఠితు లయిన యోగులు ఆయనను అవినాశికైవల్యం ఆయన రూపమని అంటారు. నిస్సంగులగు సమదర్శకులు ఆయన్ను అంతటా సమానరూపంగా ఉన్నట్లు చూస్తారు. జాతిలేని వాడు, జగత్కారణుడు, నిర్గుణుడయిన పరమాత్మ శివుని శరణందుతున్నాను. సనాతనమయిన భూమ్యాది సప్తలోకాలను సృజించిన వాడు, సత్యానికైన ఉన్న స్థాణురూపుడయిన సనాతన శివుని శరణందుతాను. భక్తులకు దగ్గరివాడు, విముఖులకు దూరపువాడు, అందరికి దగ్గరవాడు, ప్రకృతికి పరుడు, సర్వలోకములందున్నవాడు అగు శివుని శరణందుతాను.

రాజా! ఈ రీతిగా వేగశాలి మహాత్ము డయిన మహాదేవుని స్తోత్రం చేసి, నమస్కరించి, ఆ బంగారం పొందగలవు.

శంకరునియందు మనస్సు ఏకాగ్రం చేసే మానవులు ప్రమధగణత్వాన్నే పొందుతారు. అనగా సువర్ణాభరణాదులు పొందుతారని వేరే చెప్పాలా? కాబట్టి త్వరగా వెళ్ళు ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు మున్నగువానితో గొప్ప లాభం కలుగుతుంది.

నీ సేవకులు బంగారం తీసుకురావటానికి అక్కడికి వెళ్ళాలి.' అని సంవర్తుడు చెప్పగా మరుత్తుడు అలాగే చేశాడు.

కుబేరుడు శివానుగ్రహం వల్ల సంపదను పొందినట్లు మరుత్తుడు శంకరునికి నమస్కరించి, ఉత్తమధనం పొందాడు. దాన్ని పొంది, ఆయన సంవర్తుని ఆజ్ఞానుసారం యజ్ఞశాలలను, ఇతర సర్వవస్తు సామగ్రిని సిద్ధం చేశాడు.

తరువాత ఆ రాజు లోకాతీతంగా యజ్ఞానికి కావలసిన వాటిని అన్నిటిని సిద్ధం చేయసాగాడు. అక్కడ బంగారు పనివారు అనేకపాత్రలను సిద్ధం చేశారు. దేవతలను గూడా అతిక్రమించి, మరుత్తరాజు సంపదను గురించి విన్న బృహస్పతి చాలా బాధపడ్డాడు. ఆయన తన శత్రు వయిన సంవర్తుడు గొప్ప సంపన్నుడు అవుతాడు అనే సంతాపంతో పాలిపోయినాడు, చాలా చిక్కిపోయాడు. దేవేంద్రుడు తన గురువు బృహస్పతి బాగా పరితాపం చెందుతున్నాడని విని, దేవతలతో కూడా కలిసి బృహస్పతి దగ్గరకు వచ్చాడు. అక్కడ ఇలా సంభాషణ సాగింది.

9. సంవర్తమరుత్తీయము.

ఇంద్రుడు :- బృహస్పతీ! సుఖంగా నిద్రిస్తున్నావా! సేవకులంతా నీ మనస్సు తెలుసుకొని మెలుగుతున్నారా? దేవతల సుఖాన్నే కోరుకొంటున్నావా? దేవతలంతా నీ బాగోగులు చూస్తున్నారా?

బృహస్పతి :- దేవేంద్రా! సుఖంగానే పక్కమీద నిద్రిస్తున్నాను. సేవకులంతా నా మనస్సు తెలుసుకొనే ప్రవర్తిస్తున్నారు. ఎల్లవేళలా దేవతల సుఖాన్నే కోరుతున్నాను. దేవతలు గూడా నన్ను చాలా చక్కగా చూచుకొంటున్నారు.

ఇంద్రుడు :- అలాగయితే ఇక నీకు శారీరక మానసిక దుఃఖం ఎందుకు ? ఎందుకని నేడు పాలిపోయావు? ముఖం కళ తప్పింది. బ్రాహ్మణోత్తమా! అసలు విషయం నాకు చెప్పు. నీకు బాధ కలిగించినవారినీ అందరిని సంహరిస్తాను.

బృహస్పతి :- ఇంద్రా! మరుత్తుడు ఉత్తమదక్షిణలిస్తూ మహాయజ్ఞం చేయబోతున్నాడనీ సంవర్తుడు ఆ యజ్ఞం చేయిస్తున్నాడనీ విన్నాను. కాబట్టి సంవర్తుడు మరుత్తునిచేత యజ్ఞం చేయించకపోవటం నా కోరిక.

ఇంద్రుడు :- ద్విజోత్తమా! కోరిన భోగాలన్నీ నీకు కలిగాయి. నీవు దేవతలకు మంత్రవేత్తయిన పురోహితుడివి. జరామరణాలకు అతీతుడవు. మర్త్యుడైన సంవర్తుడు ఏం చేస్తాడు నిన్ను ?

బృహస్పతి :- దేవేంద్రా! నీవు అసురులలో ఎవడయినా సర్వసంపదలతో తులతూగుతుంటే వాడిని దేవతలలో గూడా కలిసి వారిని పుత్రమిత్రాదులతో గూడా సంహరింప జూస్తావు కదా! శత్రువు సంపన్నుడుగా ఉండటం ఎవరికయినా సంతాపకరం అవుతుంది. కాబట్టి దేవేంద్రా ! నా శత్రువు అభివృద్ధి పొందుతున్నాడని వినటం చేత నేను పాలిపోయాను. కాబట్టి దేవరాజా! సమస్తమయిన ఉపాయాలతో సంవర్తుని, మరుత్తుని బంధించు.

ఇంద్రుడు :-అగ్నిదేవా! నా వద్దకురా. నా సందేశం మరుత్తునికి అందించు. మరుత్తుని అంగీకారాన్ని తీసుకుని బృహస్పతిని ఆయన వద్దకు తీసుకొని వెళ్ళి, "ఈ బృహస్పతి నీచేత యజ్ఞం చేయిస్తాడు. అలాగే నిన్ను అమరుని గూడా చేస్తాడు!" అని నా సందేశం చెప్పు.

అగ్ని :- ఇంద్రా! బృహస్పతిని మరుత్తుని వద్దకు తీసుకుపోవటానికి, ఇంద్ర వాక్కును నిజం చేయటానికి, బృహస్పతి యందలి గౌరవం చూపటానికి ఇవ్వాళ నేను దూతగా వెళ్తాను.

వ్యాసుడు :- శీతాకాలం దాటిపోయిన తరువాత స్వేచ్ఛగా వీచే వాయుదేవుడు పెద్దగా ధ్వనిస్తూ ముందుకు పోయేటట్లు మహాత్ముడయిన అగ్నిదేవుడు చెట్లను తీగెలను ధ్వంసం చేస్తూ వెళ్ళాడు.

మరుత్తుడు :- మునీంద్రా! సంవర్తా అగ్నిదేవుడు సాకారుడై వచ్చాడు. ఇది ఆశ్చర్యంగా ఉంది. ఈయనకు ఆసనాన్ని, పాదోదకాన్ని, గోవును సమర్పించండి.

అగ్ని :- అనఘా! నీవు ఇచ్చే ఆసనాన్ని, పాదోదకాన్ని అభినందిస్తున్నాను. ఇంద్రుని ఆజ్ఞానుసారం వచ్చిన దూతను నేను అని తెలుసుకో.

మరుత్తుడు :- అగ్నిదేవా! దేవరాజు సుఖంగా ఉన్నాడా? మాయందు ప్రసన్నుడుగా ఉన్నాడా? దేవతలు అందరూ ఆయనకు వశులయి ఉన్నారా? దేవా! ఇది అంతా వివరంగా నాకు చెప్పు.

అగ్ని :- రాజేంద్రా! మహేంద్రుడు బాగా సుఖంగా ఉన్నాడు. నీతో శాశ్వతమయిన స్నేహం కోరుతున్నాడు. రాజా! దేవతలందరూ ఆయన వశవర్తులే. నేను తెచ్చిన దేవరాజ

సందేశాన్ని విను. ఆయన నన్ను ఎందుకు నీ వద్దకు పంపాడో అది విను. ఆయన నాద్వారా బృహస్పతిని నీ వద్దకు పంపగోరుతున్నాడు. రాజా! ఈయన నీకు గురువు. నీచేత యజ్ఞం చేయిస్తాడు. మర్త్యుడవు అయిన నిన్ను అమరుని చేస్తాడు.

మరుత్తుడు :-అగ్నిదేవా! ఈ సంవర్తుడు అనే ద్విజుడు నా చేత యజ్ఞం చేయిస్తాడు ! బృహస్పతికి చేతులు జోడిస్తున్నాను. మహేంద్రుని చేత యజ్ఞం చేయించి మర్త్యుని యజమానిగా గ్రహించటం ఆయనకు శోభాకరంగాదు.

అగ్ని :- ఈ బృహస్పతికి యజమాని వయితే మహేంద్రుని ప్రసాదం వల్ల దేవలోకంలో ఉండే గొప్ప గొప్ప లోకాలను పొందుతావు. కీర్తిమంతుడవు కావటంతో పాటు స్వర్గాన్నే జయిస్తావు. రాజేంద్రా! బృహస్పతి యజ్ఞం చేయిస్తే నీవు మనుష్యలోకాలను, దివ్యమయిన మహత్తర ప్రజాపతి లోకాలను, సంపూర్ణ దేవరాజ్యాన్ని జయిస్తావు.

సంవర్తుడు :- అగ్నీ! బృహస్పతిని మరుత్తునికి సమర్పించటం కోసం ఇంకోసారి రావద్దు. అలా వస్తే క్రుద్ధుడ నయిన నేను దారుణ మయిన నాకంటిచూపుతోనే నిన్ను భస్మం చేస్తాను.

వ్యాసుడు :- తరువాత అగ్నిదేవుడు సంవర్తుడు దగ్ధం చేస్తాడేమో అని భయపడి రాలే ఆకులాగా వణకిపోతూ వృధజెంది దేవతల వద్దకు వెళ్ళాడు. ఆయనను చూచి మహాత్ము డయిన ఇంద్రుడు బృహస్పతి సన్నిధిలో అగ్నితో ఇలా అన్నాడు. 'అగ్నిదేవా! బృహస్పతిని మరుత్తుని వద్దకు తీసుకుపోవటానికి నిన్ను పంపాను. గదా! యజ్ఞం చేయదలచిన ఆ రాజు ఏమన్నాడు? నా మాట పాటిస్తానన్నాడా ?'

అగ్ని :- దేవా ! నీ మాటలు మరుత్తుకు నచ్చలేదు. ఆయన బృహస్పతికి నమస్కారం పంపించాడు. ఎన్నిసార్లు నేను అడిగినా ఆయన సంవర్తుడు నాచేత యజ్ఞం చేయిస్తాడు అని చెప్పాడు. మానవలోకాలు, దివ్యలోకాలు, ప్రజాపతి లోకాలను ఇంద్రునితో సంధి చేసుకొని పొందగలిగినా నేను బృహస్పతిని నా యజ్ఞానికి పురోహితునిగా చేసుకోను. దీన్ని నా దృఢ నిశ్చయంగా చెపుతున్నాను! అని కూడా చెప్పాడు.

ఇంద్రుడు :- అగ్నీ! మళ్ళీ వెళ్ళి నీవు ఆ రాజును కలిసి అర్థవంతమయిన నా మాటను చెప్పు. నీవు మళ్ళీ చెప్పినా నీ మాట ప్రకారం చేయకపోతే ఆయనను నా వజ్రాయుధంతో కొడతాను.

అగ్ని :- వాసవా! ఈ గంధర్వ రాజు అక్కడికి నీదూతగా వెళ్ళుగాక. నేను మళ్ళీ అక్కడికి వెళ్ళటానికి భయపడుతున్నాను. చక్కగా బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించిన

సంవర్తుడు తీవ్రమయిన కోపంతో ఆవేశపూర్ణుడై ఇలా అన్నాడు. 'అగ్నీ! మరుత్తు దగ్గరకు బృహస్పతిని చేర్చటానికి మళ్ళీ నీవు తిరిగి వస్తే నేను కోపంతో దారుణమైన చూపుతో నిన్ను భస్మం చేస్తాను.' ఇంద్రా! ఆయన మాటను సరిగా అర్థం చేసుకో.

ఇంద్రుడు :- జాతవేదా! నీవే ఇతరులను అందరినీ, అన్నిటినీ భస్మం చేస్తావు కదా! సమస్తం భస్మం చేసేవాడు నీవు తప్ప ఇంకొకడు లేడు. నీ స్పర్శ తగులుతుంది. లోకం భయపడుతుంది. అగ్నీ! నీ మాటలు నమ్మను.

అగ్ని :- దేవేంద్రా! నీవు నీ బలంతోనే స్వర్గాన్నీ భూమినీ సమస్తాన్ని పరివేష్టించి ఉన్నావు గదా! ఇంతటి మహానుభావుడి వయినా పూర్వం ఆ వృత్రాసురుడు నీనుండి దేవలోకాన్ని అపహరించాడు గదా!

ఇంద్రుడు :- అగ్నీ నేను మహాపర్వతాన్నయినా ఈగంత చిన్నదాన్ని చేయగలను. అయినా శత్రువు ఇచ్చే సోమాన్ని త్రాగను. శక్తి క్షీణించిన వానిని వజ్రాయుధంతో కొట్టను. అయినా నాకు కష్టం కలిగించే విధంగా నన్ను ఏ మానవుడు ప్రహరించగలడు ? నేను తలుచుకొంటే కాలకేయులలాంటి దానవులను ఆకాశాన్నించి లాగి నేలకుకొట్టగలను. ఇలాగే స్వర్గాన్నించి ప్రహ్లాదుని ప్రభుత్వాన్ని అంతం చేయగలను. అలాంటప్పుడు నాకు కష్టం కలిగించే రీతిగా ప్రహరించ గల మానవుడు ఎవడు ఉంటాడు?

అగ్ని :- మహేంద్రా! చ్యవన మహర్షి శర్యాతి మహారాజు చేత యజ్ఞం చేయించబోతున్నాడు. నీవు కోపంతో ఆయన్ను నిషేధిస్తున్నా ఆయన ఒక్కడే తన ప్రభావంతోనే సమస్త దేవతలతో, అశ్వినీ కుమారులతో కలిసి సోమపానం చేశాడు. ఇంద్రా! నీవు అతిఘోరమయిన వజ్రాయుధం తీసుకుని చ్యవన మహర్షిని ప్రహరింపదలచావు. కాని ఆ బ్రహ్మర్షి కోపించి, తన తపోబలంతో వజ్రాయుధంతో కూడా నీ చేతిని స్తంభింపజేశాడు. అప్పుడు ఆ మహర్షి కోపంతో భయంకర రూపుడయిన నీ శత్రువును మదుడు అనేవానిని పుట్టించాడు. విశాలరూపు డయిన ఆ అసురుని చూసి, నీవు కన్నులు మూసుకొన్నావు. ఆ దానవుని ఒక దవడ నేలను ఆని ఉండగా ఇంకొకదవడ ఆకాశాన్ని అంటింది. నూరు యోజనాల పొడవయిన మిక్కిలి పదునయిన దంతాలతో ఆతని నోరు భయంకరంగా అయింది. ఆ దానవుని నాలుగు కోరలు గుండ్రంగా, బాగా లావుగా వెండిస్తంభాలవలె రెండు వందల యోజనాల పొడవు ఉన్నాయి. ఆతడు నిన్ను చంపాలని పండ్లు కొరుకొతూ, శూలం పట్టుకొని నీ వెంటబడ్డాడు. ఆ భయంకరా కారంగల దానవుని చూశావు. దానవనాశకా! నీవు దానవునికి భయపడి, చ్యవన మహర్షిని శరణు కోరావు. అప్పుడు చూడదగిన నిన్ను

అందరు చూశారు. ఇంద్రా! క్షత్రియబలానికంటే బ్రాహ్మణ బలం గొప్పది, బ్రాహ్మణ బలాన్ని మించిన గొప్ప బలం ఇంకొకటి లేదు. బ్రహ్మతేజోబలం ఉన్న దున్నట్లు నాకు తెలుసు. అందువల్లనే సంవర్తుని జయించదలచలేదు.

10. సంవర్తమరుత్తీయము.

ఇంద్రుడు :- అది నిజమే. బ్రాహ్మణ బలమే గొప్పది. బ్రాహ్మణ బలాన్ని మించింది ఇంకొకటి గొప్పది లేదు. కాని మరుత్తుని బలం మాత్రం సహింపదగదు. ఘోరమైన వజ్రాయుధంతో ఆయనను కొడతాను. గంధర్వా! ధృతరాష్ట్రా! సంవర్తునితో కలిసి ఉన్న మరుత్తుని వద్దకు వెళ్ళు? ఆయనతో, 'రాజా! నీవు బృహస్పతిని ఆచార్యుని చేసుకొని యజ్ఞం చేయాల్సిన విధానం తెలుసుకో. అలాకాకపోతే నేను ఇంద్రుడిని ఘోరమయిన వజ్రాయుధంతో ప్రవర్తిస్తాను.' అని చెప్పు.

వ్యాసుడు :- తరువాత ధృతరాష్ట్ర డనే గంధర్వుడు మరుత్తుని వద్దకు వెళ్ళి ఆయనకు ఇంద్రుని మాటలను ఇలా చెప్పాడు. నరేంద్రా! నేను ధృతరాష్ట్రుడు అనే గంధర్వుడిని. నీకు సందేశం చెప్పటానికి వచ్చాను. లోకాధిపతి, మహాత్ముడయిన ఇంద్రుడు చెప్పినది నేను చెపుతాను. విను. 'రాజా! బృహస్పతిని యాజకునిగా స్వీకరించు. అలా చేయకపోతే ఘోరమయిన వజ్రాయుధం నీ మీద ప్రయోగిస్తాను!' అని అచింత్యకార్యాలు చేసే మహేంద్రుడు మీకు చెప్పి పంపాడు.

మరుత్తుడు :- గంధర్వా! మిత్రద్రోహం చేస్తే దానికి ప్రాయశ్చిత్తం లేదు. అది బ్రహ్మహత్యతో సమమయిన మహాపాపం. ఆ విషయం నీకు, ఇంద్రునికి, విశ్వేదేవులకు, వసువులకు, అశ్వినీ దేవతలకు తెలుసు. గంధర్వరాజా! వజ్రాయుధధారులలో దేవతలలో శ్రేష్ఠుడయిన ఇంద్రునిచేత బృహస్పతి యజ్ఞం చేయించుగాక. సంవర్తుడు నా చేత యజ్ఞం చేయిస్తాడు. ఆయన మాటగాని, నీ మాటగాని నాకు రుచింపవు.

గంధర్వుడు :- రాజశ్రేష్ఠా! మహేంద్రుని ఘోరమయిన గర్జన ఆకాశంనుంచి వినిపిస్తున్నది. విను. ఇక నీమీద వజ్రాయుధం వేస్తాడనేది స్పష్టం. రాజా! ఈ సమయంలో నీ క్షేమం ఆలోచించుకో.

వ్యాసుడు :- యుధిష్ఠిరా! ధృతరాష్ట్రుడు ఇలా చెప్పగా, గర్జిస్తున్న ఇంద్రుని కంఠనాదం విన్న మరుత్తుడు నిరంతర తపశ్శీలి, ధర్మవేత్తలలో శ్రేష్ఠుడయిన సంవర్తునికి ఇంద్రుని పనిని చెప్పాడు.

మరుత్తుడు :- విప్రశ్రేష్ఠా! మహేంద్రుడు దూరాన్నుంచే ప్రహరించ యత్నిస్తున్నాడు. చాలా దూరంలో నిలిచి ఉన్నాడు. అందువల్ల ఆయన దేహం కన్పించటం లేదు. విప్రోత్తమా! నిన్ను శరణందుతున్నాను. కాబట్టి నాకు అభయం ఇవ్వవలసింది. వజ్రధారి అయిన మహేంద్రుడు పదిదిశలను వెలిగింపజేస్తూ వస్తున్నాడు. భయంకరమై, మానవాతీత మయిన ఈయన సింహనాదం ిని, మన యజ్ఞశాలలోని సదస్యులు భయకంపితులు అవుతున్నారు.

సంవర్తుడు - రాజేంద్రా! నీకు ఇంద్రుని వల్ల భయం తొలగుగాక. నేను స్తంభినీ విద్యను ప్రయోగించి త్వరగానే నీభయం పోగొడతాను. నన్ను నమ్ము. "ఇంద్రుని వల్ల పరాజితుడిని అవుతాను" అనే భయం వదలు. నరేంద్రా! ఇప్పుడే ఆయనను స్తంభింపజేస్తాను. ఇంద్రునికి నీవు భయపడకు. ఇప్పటికే దేవతలందరి ఆయుధాలు క్షీణించాయి. అన్ని దిక్కులా పిడుగులు పడుగాక. తుపానులు కలుగు గాక. ఇంద్రుడే స్వయంగా వర్షమయి బాగా వర్షించుగాక ! ఆకాశంలో వ్యర్థంగా కుండపోతగా వానపడనీ. మెరుపులు కనపడనీ. నీవు మాత్రం భయపడకు. అగ్నిదేవుడు అన్నివైపులనుంచి నిన్ను రక్షించుగాక ! ఇంద్రుడు వానకాక నీకు సమస్తకాంక్షలను వర్షించుగాక ! నిన్ను వధింప పైకెత్తిన, జలరాశితో పాటు చంచల గమనంతో మహా ఘోరమయిన వజ్రాయుధం తనచేతిలోనే ఉంచుకొనుగాక !

మరుత్తుడు :- విప్రోత్తమా! గాలితో గూడిన వజ్రాయుధ మహాధ్వని భయంకరంగా వినిపిస్తున్నది. నా మనస్సు మాటిమాటికి వ్యధజెందుతున్నది. ఇవ్వాళ, నాకు ప్రశాంతత కలగటం లేదు.

సంవర్తుడు :- నరేంద్రా! ఉగ్రమయిన వజ్రాయుధాన్నుంచి నీకు కలిగిన భయం తొలగుగాక. నేను వాయువ్యవై ఆ వజ్రాన్ని ధ్వంసం చేస్తాను. భయంవీడి ఇంకో వరం కోరుకో. నీ మనఃకామన ఏమి సాధించాలో చెప్పు.

మరుత్తుడు :- విప్రా! ఇంద్రుడు త్వరగా ఇక్కడికి స్వయంగా రావాలి. యజ్ఞంలో హవిస్సు తీసుకోవాలి. దేవతలు అందరు తమతమ స్థానాలలో కూర్చోవాలి. హుతమయిన సోమాన్ని దేవతలు అందరు గ్రహించాలి.

సంవర్తుడు :- (సంవర్తుడు మంత్రబలంతో సర్వదేవతలను పిలిచాడు. మరుత్తునితో ఇలా అన్నాడు). రాజా! ఇదిగో ఇంద్రుడు పరుగెత్తే అశ్వాలుగల రథంమీద నేను మంత్రాలతో ఆహ్వానించగా వస్తున్నాడు. అటుచూడు. ఆయన శరీరాన్ని మంత్రశక్తి లాగుతున్నది. అప్పుడు దేవతలతో గూడా దేవరాజు అశ్వశ్రేష్ఠాలయిన తన అశ్వాలను

రథానికి పూన్చి, మహా ప్రభావసంపన్నుడయిన మరుత్తుడు చేసే యజ్ఞంలో సోమపానం చేయదలచి వచ్చాడు. దేవతల సమూహంతో కలిసి వస్తున్న ఆ ఇంద్రునికి మరుత్తుడు పురోహితునితో గూడా లేచి, ఎదురు వెళ్ళాడు. సంతోషంతో ఆయన దేవాధిపతికి శాస్త్రానుసారం శ్రేష్ఠమయిన పూజను చేశాడు.

సంవర్తుడు :- ఇంద్రా! నీకు స్వాగతం ! విద్వాంసుడా! నీవు ఇక్కడికి రావటం వల్ల ఈ యజ్ఞం చాలా బాగా శోభిల్లుతున్నది. బల వృత్ర రాక్షస నాశకా ! నేను సిద్ధం చేసిన ఈ సోమరసం సిద్ధంగా ఉంది. దీనిని పానం చెయ్యి.

మరుత్తుడు :- సురేంద్రా! నీకు నమస్సులు. నన్ను చల్లని చూపుతో చూడవలసింది. నీవు అడుగిడటం వల్ల నా యజ్ఞం, జీవితం సఫలమయినాయి. బృహస్పతి తమ్ముడు, బ్రాహ్మణశ్రేష్ఠుడు ఈయన నా యజ్ఞం చేయిస్తున్నాడు.

ఇంద్రుడు :- నరేంద్రా! ఈ మీ గురువును ఎరుగుదును, తపోధనుడు, తీవ్రతేజస్వి అయిన ఈయన బృహస్పతి తమ్ముడు. ఆయన ఆహ్వానం వల్లనే నేను వచ్చాను. ఇవ్వాళ నాకు చాలా సంతోషంగా ఉంది. నీ మీద కోపం పోయింది.

సంవర్తుడు :- దేవరాజా! నీవు పాత్రుడ వయితే స్వయంగా యజ్ఞంలో ఏమేమి ఎప్పుడు చెయ్యాలో శాసించు. దేవతలకు ఈయవలసిన యజ్ఞభాగాలను స్వయంగా చేయి ఇక్కడికి వచ్చినవారికి అందరికి నీ ప్రీతి తెలియాలి.

వ్యాసుడు :- ఇలా అంగిరస పుత్రుడు చెప్పగా ఇంద్రుడు స్వయంగా దేవతలను ఇలా ఆదేశించాడు. మీరు అన్ని వస్తువులు సమృద్ధిగా గల వేలకొలది సభలను, ముఖ్యమయిన నివాసాలను నిర్మించండి. గంధర్వులకు, అప్సరసలకు సుందరమయిన రంగస్థలాన్ని ఏర్పరచండి. ఆ రంగస్థలం ఎక్కటానికి చాలా మెట్లను కట్టండి. దీని మీద అప్సరసలు అందరు నృత్యం చేస్తారు. యజ్ఞశాలను స్వర్గంలాగా అలంకరించి, సుందరంగా తీర్చిదిద్దండి. నరేంద్రా! దేవరాజు ఈ రీతిగా చెప్పగా దేవతలందరూ సంతోషించి, ఆయన ఆజ్ఞానుసారం త్వరగా అన్నీ నిర్మించారు. రాజా! తరువాత పూజితుడు, సంతుష్టుడయిన ఇంద్రుడు మరుత్తునితో ఇలా అన్నాడు. ఇదిగో రాజా! నేను వచ్చి ఉన్నాను. నరేంద్రా! నీ వంశంలో పూర్వులు వచ్చారు. ఇంకా ఇతర దేవతలు వచ్చారు. రాజా! వీరందరు నీవు ఇచ్చే హవిస్సులను సంతోషంగా స్వీకరిస్తారు. రాజా! అగ్నికి ఎర్రరంగు వస్తువులు సమర్పించాలి. విశ్వేదేవులకు అనేక విధాలయిన రూపం, రంగు కలవి ఇవ్వాలి. నీవు ముందుగా ఎన్నుకున్న బ్రాహ్మణశ్రేష్ఠులు పవిత్రమయిన చలించే మూత్రేంద్రియం గల నల్లని ఆబోతును దానంగా గ్రహింతురుగాక. తరువాత యజ్ఞం జరగసాగింది. అందులో దేవతలు స్వయంగా,

ఆహారం వడ్డించారు. ఆ యజ్ఞంలో దేవరాజయిన ఇంద్రుడు బ్రాహ్మణుల గౌరవమర్యాదలు అందుకొంటూ ఒక సదస్యు డయినాడు. అంతట ప్రజ్వలించే రెండవ అగ్నిలాగా ఉన్న మహాత్ము డయిన సంవర్తుడు యజ్ఞమండపంలో కూర్చుని ప్రసన్నచిత్తంతో దేవతలను అందరినీ మంత్రాలతో ఉచ్చైఃస్వరంతో ఆహ్వానిస్తూ హవిస్సులను అగ్నిలో హోమం చేశాడు. అటు తరువాత ఇంద్రుడు, సోమపానం చేసే ఇతర దేవతా సమూహాలు సోమపానం చేశాయి. వాటితో సంతృప్తులయి వారు అందరు మరుత్తుని ఆజ్ఞ తీసుకొని, తమతమ స్థానాలకు వెళ్ళారు. అప్పుడు మరుత్తరాజు సంతుష్టుడయి బంగారం రాసులను పోయించాడు. బ్రాహ్మణులకు భూరిదానాలు చేసిన శత్రునాశకు డయిన ఆయన కుబేరునివలె విరాజిల్లాడు. అంతట మరుత్తుడు బ్రాహ్మణులు తీసుకొనిపోగా మిగిలి ధనాన్ని అంతా ఒకచోట చేర్చి, ఒక ధనాగారం నిర్మించి, అందులో ఉంచాడు. గురువు సంవర్తుని అనుమతిగొని, తిరిగి రాజధానికి వచ్చి, సముద్రపరివేష్టిత మయిన భూమండలం పరిపాలించాడు. నరేంద్రా! ఆ మరుత్తరాజు ఇంతటి ప్రభావశాలి. ఆయన నిలువచేసిపోయిన ఆ సమృద్ధమయిన సువర్ణాన్ని నీవు తీసుకొని వచ్చి, దేవతలను హవిస్సులతో తృప్తిపరుస్తూ, యజ్ఞం చెయ్యి.' వైశంపాయనుడు చెప్పాడు. వ్యాసమహర్షి వాక్కులు విన్న తరువాత పాండురాజపుత్రుడు సంతోషించి, ఆ సువర్ణంతో యజ్ఞం చేయసంకల్పించాడు. మళ్ళీ తన మంత్రులతో ఆలోచించాడు.

11. శ్రీకృష్ణయుధిష్ఠిర సంవాదము

వైశంపాయనుడు చెప్పాడు - 'జనమేజయా! అద్భుత కార్యాలు చేసే వ్యాసమహర్షి ఈ రీతిగా యుధిష్ఠిరునికి చెప్పాడు. అప్పుడు మహాతేజస్వి అయిన వాసుదేవుడు ఇలా చెప్పాడు. జ్ఞాతులు, బంధువులు చనిపోగా దీన మనస్సుతో, గ్రహణంపట్టిన సూర్యునివలె, పొగ క్రమ్మిన అగ్నివలె నిరుత్సాహపడిన యుధిష్ఠిరుని గుర్తించి శ్రీకృష్ణుడు ఓదారుస్తూ ఇలా చెప్ప నారంభించాడు. శ్రీవాసుదేవుడు చెప్పాడు - ధర్మజ్ఞా! **కుటిలత్వం అంతా మృత్యుస్థానం. పారళ్యం బ్రహ్మప్రాప్తి సాధనం. దీనిని చక్కగా తెలుసుకోవటమే జ్ఞాన విషయం అవుతుంది. ఇంతకంటె ఇతరమయినది చెప్పటం ప్రలాపం అవుతుంది. దానివల్ల ఏం ప్రయోజనం?*** నీ కర్తవ్యం ఇంకా పూర్తి కాలేదు. ఇంతవరకు

---

* సర్వం జిహ్మం మృత్యుపదమ్ ఆర్జవం బ్రహ్మణః పదమ్ ।
ఏతావాన్ జ్ఞానవిషయః కిం ప్రలాపః కరిష్యతి ॥ 4

నీవు శత్రువులను జయించలేదు. నీ శరీరంలోనే నీ శత్రువు ఉన్నాడని తెలుసుకోవేమి? నేను ధర్మానుసార మయిన దాన్ని విన్నది విన్నట్లు చెపుతాను. ఇంద్రునికి వృత్రాసురునితో యుద్ధం జరిగింది. ఆ విషయమే చెపుతాను. రాజా! పూర్వం వృత్రాసురుడు అధికారంతో భూమిని వ్యాపించాడట. ఇలా భూమిపై అధికారం పొంది, దాని విషయమయిన గంధాన్ని అపహరించటం ఇంద్రుడు చూచాడు. భూమిని హరించటంవల్ల దుర్గంధం ఏర్పడ్డది. గంధానికి విషయమయిన పృథివి అపహరింపబడటం వల్ల ఇంద్రుడు కోపించాడు. అందుకు కుపితుడయిన ఇంద్రుడు వృత్రాసురుని మీద ఘోరమయిన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. తీవ్రమయిన తేజస్సుగల ఆ వ్రజాయుధం వధిస్తుంటే వృత్రుడు త్వరగా నీటిలో ప్రవేశించి దాని విషయమయిన రసం హరించాడు. వృత్రుడు జలం గ్రహించి దాని విషయమయిన రసాన్ని అపహరించటం వల్ల మిక్కిలి కోపించిన ఇంద్రుడు అక్కడ వజ్రాయుధం ప్రయోగించాడు.

ఆ జలంలో అమితతేజోవంత మయిన వజ్రాయుధం చేత హతుడవుతూ ఆ వృత్రుడు జ్యోతిస్సును ప్రవేశించి దాని విషయమయిన రూపాన్ని గ్రహించాడు. వృత్రుడు జ్యోతిస్సును వ్యాపించి దాని విషయమయిన రూపాన్ని అపహరించగా ఇంద్రుడు తీవ్రంగా కంపితుడై అక్కడ వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. వజ్రాయుధం పీడిస్తుంటే అక్కడ ఉన్న వృత్రుడు దాన్ని వదలి త్వరగా వాయువులో ప్రవేశించి, దాని విషయమయిన స్పర్శను గ్రహించాడు. వృత్రుడు వాయువును వ్యాపించి, దాని విషయమయిన స్పర్శను అపహరింపగా శతక్రతువు క్రుద్ధుడయి, అక్కడ వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. వజ్రాయుధం తీవ్రంగా హింసిస్తుండగా వృత్రుడు ఆకాశంలోకి పరుగెత్తి, దాని విషయమయిన శబ్దాన్ని అపహరించాడు. వృత్రుడు ఆకాశం అయిపోయి దాని విషయమయిన శబ్దాన్ని అపహరించగా మహేంద్రుడు అతిగా కుపితుడయి, అక్కడ వజ్రాయుధం ప్రయోగించాడు. వజ్రం వధిస్తుంటే వృత్రుడు చాలా వేగంగా వెళ్ళి ఇంద్రునిలో ప్రవేశించి అక్కడి విషయాన్ని (వివేకాన్ని) గ్రహించాడు. వృత్రాసురుడు ప్రవేశించటం చేత ఇంద్రునికి అధికంగా మోహం కలిగింది. నాయనా! అప్పుడు వసిష్ఠమహర్షి ఆయనను రథంతరం అనే సామ మంత్రంతో ప్రబోధించాడు. భరతశ్రేష్ఠా! అప్పుడు ఇంద్రుడు, శరీరంలో అదృశ్యంగా ఉన్న వృత్రుని వజ్రాయుధంతో సంహరించాడని మేము విన్నాం. ధర్మయుక్తమయిన ఈ విషయాన్ని మహర్షులకు ఇంద్రుడు చెప్పాడు. రాజా! దాన్ని నాకు ఋషులు చెప్పారు. అది నీవు తెలుసుకో.'

12. కృష్ణధర్మజ సంవాదము.

వాసుదేవుడు చెప్పాడు - 'రాజా! వ్యాధి రెండు రకాలు. శరీరంలో పుట్టేది శారీరక వ్యాధి. మనస్సులో కలిగేది మనో వ్యాధి. వాటి పుట్టుక పరస్పర సంబంధం గలది. అది లేక ఏ వ్యాధీ కలుగదు. శరీరంలో కలిగే వ్యాధిని శారీరం అంటారు. మనస్సులో కలిగే దాన్ని మనోవ్యాధి అంటారు. రాజా! శీతోష్ణాలు వాయువు శరీరంలో గలిగే గుణాలు. ఆ మూడూ సమానంగా ఉంటే అది ఆరోగ్య లక్షణం అంటారు. వేడి చల్లదనాన్ని వారిస్తుంది. చల్లదనం వేడిని వారిస్తుంది. సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు మనస్సు గుణాలు అంటారు. ఆ మూడు సమానంగా ఉంటే దాన్ని మానసిక స్వస్థత అంటారు. వాటిల్లో ఏదో ఒకటి ఎక్కువయితే దాని నివారణకు ఉపాయం ఉపదేశిస్తాను. సంతోషం శోకాన్ని, శోకం సంతోషాన్ని బాధిస్తాయి. దుఃఖంలో ఉన్నవాడు సుఖాన్ని స్మరింపగోరుతాడు. సుఖంగా ఉన్నవాడు దుఃఖం స్మరింపగోరుతాడు. కుంతీనందనా! నీవు దుఃఖం గలవాడివి కాకపోయినా దుఃఖాన్ని, సుఖంకాకపోయినా సుఖాన్ని గుర్తుచేసుకోగోరుతున్నావు. ఈ దుఃఖం భ్రాంతి కాకపోతే మరేమిటి ? రాజా! అలా కాకపోతే ఇది నీ స్వభావం కావాలి. అది నిన్ను లాగుతున్నది. ఏకవస్త్రధారిణి, రజస్వల, సభలోకి లాక్కు రాబడిన ద్రౌపదిని పాండవులతో పాటు చూస్తున్న ఆ దృశ్యాన్ని నీవు స్మరింపగోరవు. పట్టణంలోనుంచి వెళ్ళగొట్టబడటం, చర్మాలు ధరించి ఉండటం, మహారణ్యంలో నివసించటం నీవు గుర్తు తెచ్చుకోగోరవు. జటాసురుని వల్ల గలిగిన బాధలను, చిత్రసేనునితో యుద్ధాన్ని, సైంధవుని వల్ల కలిగిన కష్టాన్ని స్మరింప ఇష్టపడవు. అజ్ఞాతవాస సమయంలో కీచకుడు విరాటసభలో ద్రౌపదిని కాలితో తన్నటం రాజా! అవి ఏవీ గుర్తుతెచ్చుకొనగోరవు. శత్రునాశకా! భీష్మద్రోణులతో నీకు జరిగిన యుద్ధం ఇప్పుడు నీముందుకు వస్తున్నది. ఇప్పుడు నీవు ఒక్కడివే నీ మనస్సుతో యుద్ధం చేయాలి. భరతశ్రేష్ఠా! కాబట్టి ఆయుద్ధానికి నీవు ఇప్పుడు సిద్ధం కావాలి. నీ కర్తవ్యాన్ని అనుష్ఠిస్తూ, యోగంతో మనస్సు వశం చేసుకొని మాయాతీతమయిన పరబ్రహ్మను పొందాలి. ఆ మనో యుద్ధంలో బాణాలు గాని, సేవకులు గాని, బాంధవులు గాని అక్కడకు రారు. నీవు ఒక్కడివే పోరాడాలి. ఆ యుద్ధం ఇప్పుడు ఆసన్నమైంది. కుంతీకుమారా! ఆ యుద్ధంలో మనస్సును జయించకపోతే నీ స్థితి ఏమవుతుందో తెలియదు. ఇది బాగా తెలిస్తే కృతకృత్యుడివి అవుతావు. 'సమస్తప్రాణుల రాకపోకలు ఈ లోకంలో జరుగుతుంటాయి.' అని బుద్ధితో నిశ్చయం చేసుకొని తాతతండ్రుల వలె ప్రవర్తిస్తూ రాజ్యాన్ని సముచితంగా పరిపాలించు.

13. శ్రీకృష్ణ ధర్మజ సంవాదము.

భారతా! కేవలం రాజ్యాదిబాహ్య ధర్మాలను వదలటంచేత మాత్రమే సిద్ధికలుగదు. శరీర సంబంధ ద్రవ్యం వదలటం చేత సిద్ధి కలుగవచ్చు, కలుగకపోవచ్చు. బాహ్యద్రవ్యాలనుంచి దూరంగా ఉండి శారీరక సుఖాలపైన ఆసక్తుడయిన వానికి లభించే ధర్మం, సుఖం నిన్ను ద్వేషించే వారికే కలుగుగాక. **'మమ' (నాది) అనే రెండక్షరాలు మృత్యువు. 'న మమ' (నాదికాదు) అనే మూడు అక్షరాలు సనాతన బ్రహ్మ ప్రాప్తికి కారణం అవుతాయి. మమకారం మృత్యువు దాని త్యాగం సనాతనమయిన అమృతత్వం.*** కాబట్టి రాజా! మృత్యువు, అమృతమూ అనే రెండూ తనలోనే ఉన్నాయి. అవి బయటకు కన్పించకుండా ప్రాణులచేత పోరాటం చేయిస్తుంటాయి. అంటే ఒకనిని తనవాడనుకోవటం ఇంకొకనిని పరాయివాడనుకోవటం అనే భావమే యుద్ధకారణం అనటంలో సంశయం లేదు. భారతా! ఈ జగత్తు ఉనికికి నాశనం లేదు అనేది నిశ్చయం అయితే ప్రాణుల శరీరాలను ఛేదించి కూడా మానవుడు అహింసా ఫలాన్నే పొందుతాడు. చరాచర ప్రాణులతో నిండిన ఈ భూమండలాన్ని అంతా సంపాదించి కూడా దాని యందు మమకారం లేనివానిని అది ఏం చేస్తుంది? అంటే ఆ సంపద వల్ల ఆతనికి ఎలాంటి కీడు కలుగదు అని అర్థం. పృథాపుత్రా! అలాకాక అడవిలో ఉంటూ, అడవిలో దొరికేవానితో బ్రతుకుతున్నా ఆయా వస్తువుల యందు మమకారం ఉన్నవాడు మృత్యు ముఖంలోనే ఉంటాడు. భారతా. బయట ఉండే లోపల ఉండే శత్రువుల స్వభావం చూడు. తెలుసుకో (ఇవి మాయ అవటంవల్ల మిథ్య అని నిశ్చయించుకోవాలి) మాయిక పదార్థాలను మమకార దృష్టితో చూడనివాడు మహాభయాన్నుంచి విముక్తుడవుతాడు. కోరికల యందు ఆసక్తుడయినవానిని లోకులు ప్రశంసించరు. కోరికలేకుండా ఈ లోకంలో ఏ ప్రవర్తనా ఉండదు. అన్ని కోరికలూ మనస్సునుంచే కలుగుతాయి. కామనలు దుఃఖకారణాలు అని తెలుసుకొని విద్వాంసులు వాటిని వదిలేస్తారు. యోగ్యులయినవారు అనేక జన్మలలో చేసిన అభ్యాసం వల్ల యోగమే మోక్ష మార్గం అని కోరికలను నాశనం చేస్తారు. ఈ విషయం తెలిసినవాడు దానం, వేదాధ్యయనం, తపస్సు, వేదోక్త కర్మలు, వ్రతాలు, యజ్ఞాలు, నియమాలు, ధ్యాన యోగాదులను సకామంగా అనుష్ఠానం చేయకపోయినా కొద్దిగా ఒక కామన కలిగిఉంటే అది ధర్మం కాదు. నిజానికి కోరికలను అణచుకోవటమే ధర్మం. అదే

---

* ద్వ్యక్షరస్తు భవేన్మృత్యుః త్ర్యక్షరం బ్రహ్మ శాశ్వతమ్ ।
మమేతి చ భవేన్మృత్యుః న మమేతి చ శాశ్వతమ్ ॥ 3

మోక్షానికి మూలం అవుతుంది.

యుధిష్ఠిరా! (కామగీత) ఈ విషయంలో ప్రాచీన విషయాలు తెలిసిన విద్వాంసులు ఒక పురాతన గాథను వర్ణిస్తుంటారు. దాన్ని కామగీత అని వ్యవహరిస్తారు. దాన్ని వినిపిస్తాను. వినుు. కామం ఇలా చెప్పింది. 'మమకారం లేక యోగాభ్యాసం అనే వాస్తవికోపాయాలు లేక ఏ ప్రాణీ నన్ను నాశనం చేయలేడు. ఎవరయినా నేను అస్త్రబలం కలవాడినని అనుకొని నన్ననాశనం చేయటానికి ప్రయత్నిస్తే, నేను ఆతని అస్త్రబలంలో అహంకారం రూపంగా వ్యక్తం అవుతాను. నానావిధాలయిన దక్షిణలిచ్చి, వివిధ యజ్ఞాలతో నన్ను చంప ప్రయత్నిస్తే, ధర్మాత్ముడు ఉత్తమమయిన జంగమ జాతిలో జన్మించినట్లు ఆతని చిత్తంలో మళ్ళీ జన్మిస్తాను. వేదవేదాంతా లనే సాధనాలతో నిత్యం నన్ను నాశనం చేయ ప్రయత్నిస్తే, నేను స్థావర ప్రాణులలో జీవాత్మవలె ఆతని మనస్సులో వ్యక్తమవుతాను. సత్యపరాక్రముడు ఎవడయినా నన్ను ధైర్యబలంతో నాశనం చేయ ప్రయత్నిస్తే, నేను అతనికి తెలియనంతగా ఆతని మనోభావాలతో కలిసిపోతాను. కఠోర వ్రతాలను అనుష్ఠించే వ్యక్తి నన్ను తపస్సుతో ధ్వంసం చేయదలిస్తే, నేను ఆతని తపస్సులోనే మళ్ళీ జన్మిస్తాను. ఎవరయినా పండితుడు మోక్షాన్ని సహాయంగా తీసుకొని నన్ను నాశనం చేయప్రయత్నిస్తే, ఆతడు మోక్ష విషయంలో ఆసక్తి కలవాడు కాబట్టి దానితోనే బద్ధుడవుతాడు. ఇలా ఆలోచించే నాకు నవ్వువస్తుంది. సంతోషంతో నృత్యం చేస్తాను. సనాతనుడనయిన నేను ఒక్కడినే సమస్త ప్రాణులకు అవధ్యుడ నవుతాను. కాబట్టి మహారాజా! నీవు గూడా వివిధ దక్షిణలు గల యజ్ఞాలతో ఆ కామాన్ని ధర్మంతో కలిపి వెయ్యి. అక్కడ నీ కామన సఫలం అవుతుంది. ఉత్తమ దక్షిణాప్రదానం కల అశ్వమేధ యాగాన్ని యథావిధిగా చెయ్యి. అలాగే ఇంకా ఇతర యజ్ఞాలను తగినన్ని దక్షిణలతో సర్వసమృద్ధిగా చెయ్యి. మరణించిన బంధువులను స్మరించి, మాటిమాటికి వ్యధజెందవద్దు. యుద్ధరంగంలో హతులయిన వారిని మళ్ళీచూడ వీలుగాదు. ఇక నీవు సర్వ సమృద్ధిగల మహా యజ్ఞాలను చేసి, లోకంలో మహత్తర కీర్తిని పొంది, తుదకు ఉత్తమ గతిని పొందుతావు.'

14. యుధిష్ఠిరుని ధర్మపాలనము.

వైశంపాయనుడు చెప్పాడు – 'ఈ విధంగా బంధువులను కోల్పోయిన యుధిష్ఠిరుని ఆయా మునులు నానావిధాలయిన సముచిత వచనాలతో ఓదార్చారు. భగవంతుడు శ్రీకృష్ణుడు, కృష్ణద్వైపాయన వ్యాసుడు, దేవస్థానుడు, నారదుడు, భీముడు, నకులుడు,

ద్రౌపది, సహదేవుడు, అర్జునుడు, ఇంకా ఇతరులు, శాస్త్ర దృష్టిగల విద్వాంసులు ధర్మరాజును ఓదార్చారు. ఆయన శోకజదుఃఖాన్ని, మానస సంతాపాన్ని విడిచిపెట్టాడు. తరువాత రాజయిన యుధిష్ఠిరుడు దేవతలను, బంధువులను అర్చించాడు. మృతులయిన బంధువులకు ఆయన శ్రాద్ధాదులను పెట్టాడు. సముద్రమే కట్టుబట్టగా గల భూమిని ధర్మాత్ముడయి ఆయన పాలించాడు. మనస్సు నెమ్మదించిన తరువాత కురువంశశ్రేష్ఠ డయిన ఆయన కేవలం తన రాజ్యాన్ని మాత్రమే పొంది, వ్యాస నారదులతో, తదితరులతో ఇలా అన్నాడు. 'వృద్ధులు, మునిశ్రేష్ఠ లయిన మీరు అందరు ఇంతకుముందు నన్ను ఓదార్చారు. ఇప్పుడు నా మనస్సులో కొంచెం కూడా దుఃఖం లేదు. ధనం గూడా సమృద్ధిగా లభించింది. దానితో దేవతలను అర్చిస్తాను. మిమ్ము అందరిని ముందుంచుకొని ఆ ధనం యజ్ఞశాలకు తెస్తాం. ద్విజశ్రేష్ఠా! తాతా! నీ రక్షణలో హిమవత్పర్వతానికి వెళ్దాం. ఆ ప్రదేశంలో అనేక విచిత్రాలు ఉంటాయని విన్నాం. శ్రీకృష్ణుడు, దేవర్షి నారదుడు, దేవస్థానుడు అనేక శుభ విషయాలు చెప్పారు. ఏదయినా గొప్ప దుఃఖం కలిగినప్పుడు ఎవడో అదృష్టవంతుడికి కాని మంచి మనస్సుగలవారు, సాధు సమ్మతులు అయిన ఇటువంటి గురువులు లభించరు.'

అని ధర్మరాజు అనగా ఆ మహర్షులందరు కృష్ణార్జునుల అనుమతిని తీసుకొని, అక్కడే అంతర్ధానం చెందారు. తరువాత ధర్మతనయుడు అక్కడే కూర్చున్నాడు. భీష్ముని మరణానంతరం శౌచకార్యాలు చేస్తున్న వారికి కొంతకాలం అక్కడే గడిచింది. కురుశ్రేష్ఠా! ధృతరాష్ట్రునితో కూడా ఆయన భీష్ముడు, కర్ణుడు మొదలయిన కురువంశీయులకు శ్రాద్ధాదులలో గొప్ప దానాలు చేశాడు. తరువాత పాండవ శ్రేష్ఠ డయిన యుధిష్ఠిరుడు బ్రాహ్మణులకు సమృద్ధిగా ధనం దానంచేసి, ధృతరాష్ట్రుని ముందుంచుకొని హస్తినాపురంలోకి ప్రవేశించాడు. ధర్మాత్ముడయిన యుధిష్ఠిరుడు ప్రజ్ఞాచక్షువయిన పెద తండ్రిని ఓదార్చి సోదరులతో కూడా రాజ్యం పాలించాడు.

మను మహారాజు వలె, దశరథరాముని వలె భరతసింహు డయిన ధర్మరాజు కూడ భూమిని పాలించాడు. అతని రాజ్యంలో అధర్మానికి తావు లేకుండగ ప్రజలంతా ధర్మమందే ప్రీతికలవారైరి. నరశ్రేష్ఠ ! కృతయుగమందువలె ద్వాపరమందు కూడ అందరు ధార్మికు లయ్యారు. కలియుగం సమీపిస్తుండగా ధీమంతుడైన యుధిష్ఠిరుడు ధర్మబలోపేతుడై సోదరులతో కూడా భాసిల్లాడు. మేఘుడు యథోచితంగా, యథావసరంగా సకాలంలో వర్షించాడు. లోకమంతా రోగరహితమైంది. ఆకలి దప్పికలు ఎచ్చటను లేవు. మనుష్యులకు మానసిక చింతలేదు. వ్యసనాల యందు వారి మనస్సు లగ్నం కాలేదు. బ్రాహ్మణాదులు అన్ని వర్ణాలవారు తమ తమ ధర్మాలను మంగళప్రదంగా, ఉత్కృష్టంగా తలచారు. ధర్మం సత్యప్రధానం కాగా, సత్యం ఉత్తమ విషయాలతో కూడి ఉండేది.

ధర్మాసనమందు ఆసీనుడైన ధర్మరాజు స్త్రీలను, బాలురను, రోగులను, వృద్ధులను అట్లే సత్పురుషులచే పూర్వమందు చేయబడిన సమస్త వర్ణాశ్రమధర్మాల్ని రక్షించటానికి ఉద్యుక్తుడైనాడు. జీవికలేనివారికి జీవికను కల్పించటం, యజ్ఞయాగాదులు చేసేవారికి అవసరమైన వస్తుసామగ్రిని సమకూర్చటం మున్నగు పనులద్వారా ప్రజలందరికి ఇహలోకసుఖం కల్పించబడింది. వారికి పరలోక భయ మనేది లేదు. ధర్మరాజు పాలనలో లోకమంతా స్వర్గలోకతుల్యమైంది. అంతకంటె విశిష్టమైన సుఖం ఇక్కడ లభించింది. అతని రాజ్యంలో స్త్రీలు పతివ్రతలు, రూపవతులు, ఆభరణభూషితలు, సదాచార సంపన్నులై తమతమ గుణాలతో తమవారికి ప్రీతిపాత్రులైరి. పురుషులు పుణ్యస్వభావం కల్గి తమతమ ధర్మాలను పాటిస్తూ సుఖజీవనం సాగిస్తూ ఎన్నడూ ఎట్టి చిన్న పాపకృత్యమూ చేయలేదు. అందరు స్త్రీపురుషులు ఎల్లప్పుడు ప్రియాన్నే మాట్లాడుతూ కుటిలత్వం దరిచేరనీయక ఆలసటను విడిచి నిర్మలమనస్కులయ్యారు. అతని రాజ్యంలో జనులందరు కటక, కుండల, హార, కటిసూత్ర భూషితులై చక్కని వస్త్రాలతో, సుగంధాలతో ఒప్పుచుండిరి. బ్రాహ్మణులందరు బ్రహ్మజ్ఞానులై అన్ని విషయాలలో పరినిష్ఠితులై, వార్ధక్య లక్షణాలైన ముడతలుపడటం, నెరయటం లేక దీర్ఘకాలం సుఖమయ జీవనం గడిపారు. మహారాజ ! మనుష్యులకు అనుచిత విషయాల యందు కోరిక కల్గటంలేదు. వర్ణసాంకర్యం లేదు. అందరూ తమ హద్దులలోనే ఉన్నారు. ధర్మరాజు పాలనలో క్రూరమృగ, సర్ప, సరీసృపాలు తమలోతాము బాధించుకొనలేదు. ఇతరులనూ ఎన్నడూ బాధించలేదు చక్కని పుచ్ఛం, ముఖం, ఉదరంకల్గి, బాగా పాలిచ్చే ఆవులను వ్యవసాయదారులు పీడించటం లేదు. మనుష్యులు తమ సమయాన్ని వ్యర్థపరచుకోక పురుషార్థాలయందు క్రమంగా ప్రవర్తిస్తూ, నిషేధింపబడని విషయాలయందు, వేదశాస్త్రాలయందు ప్రయత్నశీలురై యుండిరి. వృషభాలు మంచి వర్తన కలవై, పరిపుష్టితో నుండి మంచి స్వభావం కల్గి, సుఖంగా నుండేవి. శబ్దస్పర్శలు అత్యంతం మధురంగానూ, రసం సుఖకారిగ, రూపం చూడముచ్చటగ, గంధం మనోజ్ఞంగా భాసిల్లాయి. అందరిమనస్సులు ధర్మార్థకామాలతో కూడి, మోక్ష అభ్యుదయాలకు సాధనాలై, ఆహ్లాదం కల్గించి, నిర్మలంగా ఉండేవి. వృక్షాలు పుష్పఫలాలతో శోభిల్లుతూ, నీడనిస్తూ, చక్కని స్పర్శను కల్గిస్తూ, విషహీనాలై మంచి ఆకులు, బెరడు, మొలకలతో శోభిల్లినవి. అందరి చేష్టలు అందరికి అనుకూలంగా ఉండేవి భూమి మీద (ప్రాణులకు) ఎటువంటి సంతాపంలేదు. ధర్మరాజు సదాచారమే సర్వత్ర ప్రసరించింది. పాండవులందరు శుభలక్షణసంపన్నులై ధర్మాన్ని ఆచరిస్తూ, తమ అన్నగారి మాటను జవదాటక, అందరికీ హితులయ్యారు. వారంతా సింహసదృశమైన ఉరస్సు కల్గి, క్రోధాన్ని జయించినవారు, తేజోబలసమన్వితులు, ఆజానుబాహులు, జితేంద్రియులు, దానశీలురు. పాండవుల పాలనలో ఋతువులన్నీ తమ గుణాలతో భాసిల్లాయి. తారాగణంతో కూడి గ్రహాలు అందరికి సుఖాన్ని కల్గించాయి. భూమి సస్యశ్యామలం, సమస్తరత్నగర్భితం. కామధేనువువలె వేలకొలది భోగాల నిచ్చేది. పూర్వం మన్వాదులు మనుష్యులకు ఏర్పాటుచేసిన మర్యాదలను, వంశాచారాలను అతిక్రమించకుండా ధర్మరాజుకు ప్రియాన్ని ఆచరిస్తూ, రాజులు పాలన చేశారు. రాజులు ధార్మికులై

96369

విశేషంగా మహాకులాన్ని వృద్ధిపరస్తూ మనుప్రోక్తమార్గంలో రాజ్యాన్ని పాలించారు. తాత ! భూమండలంపై నిరంతరం రాజుల ప్రవృత్తి ధర్మబద్ధం కాగా లోకులబుద్ధి రాజుల ప్రవృత్తిని అనుసరించింది. శ్రీకృష్ణునితో కూడా అర్జునునిచే రక్షింపబడుతూ ధర్మరాజు, ఇంద్రుడు స్వర్గాన్ని వలె భారతవర్షాన్ని పాలించాడు.

15. శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళుదునని అర్జునునికి చెప్పుట.

జనమేజయుడు అడిగాడు – 'ద్విజోత్తమా! పాండవులు విజేతలు కాగా రాజ్యంలో ప్రశాంతత నెలకొనగా, వీరులయిన శ్రీకృష్ణార్జునులు ఏమి చేశారు ?' వైశంపాయనుడు చెప్పాడు – 'రాజా! పాండవులు విజయం పొందారు. రాజ్యం అంతా ప్రశాంతంగా ఉంది. శ్రీకృష్ణార్జునులు సంతోషంగా ఉన్నారు. స్వర్గంలో విహరించే దేవాధిపులవలె వారిద్దరు ఆనందమగ్నులయి చిత్రవిచిత్రమయిన వనాల్లో, పర్వతాల సుందర శిఖరాలమీద విహరించారు. నందనవనంలో అశ్వినీ దేవతల వలె పవిత్రమయిన పుణ్యతీర్థాలలో, సరస్సులలో, నదులలో వారు ఆనందించారు. భరతవంశ శ్రేష్ఠా! మహాత్ములయిన శ్రీకృష్ణార్జునులు ఇంద్రప్రస్థానికి వెళ్ళి అక్కడ మయుడు నిర్మించిన సుందరమయిన సభా భవనంలో ప్రవేశించి ఆనందించారు. రాజా! అక్కడ మహాత్ములు పురాతన మహర్షులు నరనారాయణు లయిన వారిద్దరు పరస్పరం ఆప్తులు. మాటల సందర్భంలో ఆ మిత్రులు ఇద్దరు దేవతలు, ఋషుల వంశ చర్చ చేసేవారు. చిత్రవిచిత్రమయిన యుద్ధ వృత్తాంతాలను అందులో పడ్డ కష్టాలను వారు వివరించుకొనేవారు. శ్రీకృష్ణుడు సర్వసిద్ధాంతాలు తెలిసినవాడు. ఆయన అర్జునునికి విచిత్ర పదాలు, అర్థాలు సిద్ధాంతాలతో గూడిన విచిత్ర కథలు చెప్పేవాడు. పుత్రు డయిన అభిమన్యుని శోకంతో సంతప్తుడై, అనేక బంధువులు మరణించటం చేత దుఃఖితుడయిన అర్జునుని దుఃఖాన్ని అనేక కథలు చెప్పి శ్రీకృష్ణుడు పోగొట్టాడు. మహాతపస్వి, విజ్ఞాన వేత్త అయిన శ్రీకృష్ణుడు ఆ అర్జునున్ని శాస్త్రవిధానంతో ఓదార్చి, తన భారాన్ని దించుకొన్నవాని వలె విశ్రమించాడు. అనేక విషయాలు చెప్పిన తరువాత శ్రీకృష్ణుడు అర్జునుని అనునయిస్తూ మృదువయిన మాటలతో హేతుయుక్తంగా ఇలా చెప్పాడు.

శ్రీకృష్ణుడు అన్నాడు – 'శత్రుసంతాపకా! అర్జునా! నీబాహుబలాన్ని ఆశ్రయించి, ధర్మసుతుడు ఈ సమస్త భూమిని జయించాడు. నరోత్తమా! భీమసేన, నకుల సహదేవుల ప్రభావంతో యుధిష్ఠిరుడు శత్రురహితమయిన ఈ రాజ్యాన్ని అనుభవిస్తున్నాడు. ధర్మజ్ఞా! యుధిష్ఠిరుడు ధర్మానుసారం శత్రురహితమయిన రాజ్యం పొందాడు. ఆ దుర్యోధనుడు

యుద్ధంలో ధర్మంచేతనే హతు డయ్యాడు. అధర్మాసక్తులు, లుబ్ధులు, ఎల్లప్పుడు అప్రియంగా మాటాడేవారు, దుర్మార్గులు అయిన ధృతరాష్ట్రపుత్రులు సపరివారంగా నేలగూలారు. కురుకులశ్రేష్ఠా! పార్థా! యుధిష్ఠిరుడు నీచే రక్షితుడయి ప్రశాంతంగా ఉన్న సమస్త భూమిని అనుభవిస్తున్నాడు. పాండుపుత్రా! పార్థా! నీవు తోడు ఉంటే నేను అరణ్యాలలోనయినా ఆనందంగా విహరిస్తాను. శత్రునాశకా! మా మేనత్త కుంతి ఉన్నచోట వేరుగా చెప్పవలెను. ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు ఉన్నచోట నాకు ఆనందంగా ఉంటుంది. అలాగే స్వర్గంతో సమానమయిన సభలలో, అందమయిన పుణ్యవంతమయిన ప్రదేశాలలో నీతో కలిసి ఉంటే నాకు ఆనందంగా ఉంటుంది. మా నాన్నగారు వసుదేవుని, మా అన్నగారు బలదేవుని, ఇంకా ఇతర వృష్ణివంశీయులను చూసి, చాలా కాలం అయింది. కాబట్టి నేను ద్వారకానగరానికి వెళ్ళాలి అనుకొంటున్నాను. నేను వెళ్ళటాన్ని నీవు సమ్మతించాలి. శోకంతో పరవశించిన యుధిష్ఠిరునికి భీష్మునితో పాటు మేము కూడా ఆయా సమయాలలో తగిన ఉపదేశాలు చేశాం. పాండుపుత్రా! యుధిష్ఠిరుడు శాసకుడయినా మేము అనేక విధాల బోధించాం. మహాత్ముడయిన ఆయన ఆ మాటలను చక్కగా గ్రహించాడు. ధర్మం తెలిసినవాడు, కృతజ్ఞుడు, సత్యం చెప్పేవాడు అయిన ధర్మపుత్రుని యందు సత్యం, ధర్మం, ఉత్తమధీశక్తి, నెమ్మదితనం, ఎల్లవేళల స్థిరంగా ఉంటాయి.

అర్జునా! నీకు ఇష్టమయితే నీవు ఆ మహాత్ముని వద్దకు వెళ్ళి 'నేను ద్వారకకు వెళ్దామనుకొంటున్నా'నని చెప్పు. **ప్రాణంపోయే స్థితివచ్చినా ఆయనకు ఇష్టంగానిది చేయను.** ఇంక ద్వారకా నగరగమనం గురించి చెప్పేదేమి? అర్జునా! నీ ప్రీతిని గోరి ఇదంతా నిజం చెపుతున్నాను. ఇది ఏమాత్రం ఎప్పుడూ అబద్ధం కాదు. అర్జునా! సైన్యంతో, అనుయాయులతో గూడా దుర్యోధనుడు హతుడయ్యాడు. ఇక్కడ ఉన్నందుకు కావలసిన ప్రయోజనం నెరవేరింది. నాయనా! సముద్రం చుట్టూ గలిగి, పర్వతాలతో, వనాలతో, అడవులతో గూడిన భూమి అంతా ధీమంతు డయిన ధర్మపుత్రునికి వశమై ఉంది. ఈ భూమి బహు విధాలయిన రత్నాలతో సమృద్ధమై ఉంది. మహాత్ము లయిన సిద్ధులు అనేకులు ఉపాసిస్తుండగా, వందిమాగధులు స్తోత్రాలు చేస్తుండగా ధర్మజ్ఞు డయిన ధర్మరాజు సమస్త భూమండలాన్ని పరిపాలించుగాక. కురుశ్రేష్ఠా! ఇప్పుడు నీవు నాతో పాటు వచ్చి, రాజుకు శుభాశంసనలు చెప్పి, నేను ద్వారకకు వెళ్ళే విషయం ఆయనతో చెప్పి, ఆజ్ఞ ఇప్పించు. పార్థా! నా ఇంట్లో ఉండే సంపద, ఈ నా శరీరం నిరంతరం

యుధిష్ఠిరుని సేవకే అర్పితం. కురువంశీయులకు అధిపతి, మహామేధావి అయిన యుధిష్ఠిరుడు నాకు ఇష్టుడు, పూజ్యుడు. రాజపుత్రా! నీతో ఆనందం పంచుకోవటానికి తప్ప ఇక్కడ నేను ఉన్నందువల్ల వేరే ప్రయోజనం ఉండదు. నీకు గురువు, మంచి నడవడిగల యుధిష్ఠిరుని పరిపాలనలో భూమి అంతా ఇప్పుడు ఉన్నది." రాజా! జనమేజయా! మహాత్ముడయిన శ్రీకృష్ణుడు ఇలా చెప్పగా మహా పరాక్రమవంతు డయిన అర్జునుడు శ్రీకృష్ణుని పూజించి, మిక్కిలి దుఃఖంతో 'అలాగే' అన్నాడు.

16. శ్రీకృష్ణుడు అర్జునునికి సిద్ధమహర్షి కాశ్యపసంవాదము చెప్పుట.

జనమేజయుడు అడిగాడు – 'ద్విజోత్తమా ! శత్రుసంహారం చేసి సభాభవనంలో నివసిస్తున్న మహాత్ములయిన శ్రీకృష్ణార్జునుల మధ్య ఆ రోజులలో ఎలాంటి సంభాషణ జరిగింది ?' వైశంపాయనుడు చెప్పాడు – 'జనమేజయా ! కృష్ణునితో కలిసి అర్జునుడు కేవలం తమ రాజ్యం పొంది, దివ్యమయిన ఆ సభాభవనంలో సంతోషంగా విహరించాడు. రాజా! వారిద్దరు తమ వారితో కలిసి సంతోషంతో స్వర్గ సమానమయిన ఒకచోటికి వెళ్ళారు. పాండునందను డయిన అర్జునుడు శ్రీకృష్ణునితో చాలా ఆనందంగా ఉన్నాడు. సుందరమయిన ఆ సభాభవనాన్ని చూస్తూ ఇలా అన్నాడు. మహాబాహూ ! దేవకీ పుత్రా! మహాయుద్ధం ఆసన్నం కాగా అప్పుడు నాకు నీ మాహాత్మ్యజ్ఞానం, పారమేశ్వర స్వరూప దర్శనం కలిగాయి. కేశవా! పూర్వం ఆత్మీయతతో భగవంతుడివయిన నీవు చెప్పిన జ్ఞానం అంతా విచలిత చిత్తుడను కావటం వల్ల మరచిపోయాను. నీవు చెప్పిన ఆ విషయాలను మళ్ళీ మళ్ళీ వినాలనే కుతూహలం ఉంది. కాని నీవు త్వరగా ద్వారకకు వెళ్తున్నావు. మాధవా!'

వైశంపాయనుడు చెప్పాడు – 'అర్జునుడు ఇలా చెప్పగా మహాతేజస్వి అయిన శ్రీ కృష్ణుడు అర్జునుని కౌగిలించుకొన్నాడు. వక్తలలో శ్రేష్ఠుడయిన ఆయన ఇలా చెప్పాడు. "అర్జునా ! ఆ సమయంలో నేను నీకు అత్యంత రహస్యమయిన జ్ఞానాన్ని వినిపించాను. నా స్వరూపమయిన ధర్మమూ, సనాతనమయిన పురుషోత్తమతత్త్వాన్ని బోధించాను. ఇంకా (శుక్ల కృష్ణ గతులను నిరూపిస్తూ) సంపూర్ణమయిన నిత్యలోకాల వర్ణనం చేశాను. కాని నీవు నీ తెలివి తక్కువ తనంచేత ఆనాటి ఆ ఉపదేశాన్ని గుర్తు తెచ్చుకోలేకపోతున్నావు. అది నాకు తీవ్రమయిన అప్రియం. ఆ విషయాలను అన్నింటిని పూర్తిగా గుర్తుచేసుకోవటం అసంభవం అనిపిస్తున్నది. పాండునందనా! నిజంగా నీకు సరిఅయిన శ్రద్ధలేదు. నీవు

మందబుద్ధిలాగా ఉన్నావు. ధనంజయా! ఆ విషయాన్ని అంతటినీ ఉన్నది ఉన్నట్లుగా ఇప్పుడు చెప్పలేను. ఆ ధర్మం బ్రహ్మపద ప్రాప్తికి పర్యాప్తం అయినది. ఆ ధర్మాన్ని సంపూర్ణంగా అదేరూపంలో మళ్ళీ చెప్పటం ఇప్పుడు నా వశంకాదు. పరమాత్మతత్త్వాన్ని వివరించాను. ఇప్పుడు ఆ విషయజ్ఞానం కలిగించటానికి నేను ఒక ప్రాచీనమయిన ఇతిహాసాన్ని చెపుతాను. దానివల్ల సమగ్ర బుద్ధిని ఆశ్రయించి, ఉత్తమగతిని పొందుతావు. ధర్మాత్ములలో శ్రేష్ఠా! ఇప్పుడు నేను చెప్పేది అంతా సావధానంగా విను.

శత్రునాశకా! ఒకనాటి మాట. దుర్ధర్షుడు అయిన ఒక బ్రాహ్మణుడు బ్రహ్మలోకం నుంచి స్వర్గలోకానికి వచ్చి, అక్కడినుంచి మాయింటికి వచ్చాడు. ఆయనను మేము తగురీతిగా గౌరవించాం. నేనడిగిన ప్రశ్నకు ఆయన చక్కని సమాధానం ఇచ్చాడు. అదే నీకు ఇప్పుడు చెపుతాను. ఇంకొక విషయం ఆలోచించకుండా సావధానంగా అది విను. బ్రాహ్మణుడు చెప్పాడు - "శ్రీకృష్ణా! మధుసూదనా! సర్వప్రాణుల యందు కృపకలిగి మోహాన్ని నాశనం చేయటానికి మోక్షధర్మ సంబంధమయిన ధర్మాన్ని అడిగావు. దానికి తగినట్లుగా సమాధానం చెపుతున్నాను. ప్రభూ! మాధవా! సావధానంగా నేను చెప్పేది విను.

ప్రాచీనకాలంలో ఒకప్పుడు ధర్మం తెలిసినవారిలో శ్రేష్ఠుడు, తపస్వి అయిన బ్రాహ్మణుడు ఒక సిద్ధమహర్షి వద్దకు వెళ్ళాడు. ఆయన ధర్మవిషయంలో సమస్త శాస్త్రాలలోని అన్ని రహస్యాలు తెలిసిన వాడు, భూత భవిష్యత్తులు తెలిసినవాడు, లోక తత్త్వ విషయాలలో ప్రవీణుడు, సుఖదుఃఖ రహస్యం తెలిసినవాడు, జననమరణ తత్త్వం తెలిసినవాడు, పాపపుణ్యాల స్వరూపజ్ఞానం బాగా కలవాడు, ఉత్తమ, అధమప్రాణులకు, కర్మానుసారం ప్రాప్తించే గతిని ప్రత్యక్షంగా చూచినవాడు. ముక్తునివలె సంచరించేవాడు, సిద్ధుడు, శాంతచిత్తుడు, జితేంద్రియుడు, బ్రహ్మతేజస్సుతో దేదీప్యమానుడు, అంతటా సంచరించేవాడు, అంతర్ధాన విద్య తెలిసినవాడు ఆయన. అలాగే, అదృశ్యంగా ఉండే చక్రధారు లయిన సిద్ధులతో ఆయన కలసి వెళ్ళుతున్నాడు. ఏకాంతంలో వారితో కలిసి కూర్చుని సంభాషిస్తుంటాడు. **ఎక్కడా ఆసక్తంకాకుండా గాలి అంతటా వీచినట్లు ఆయన ఎక్కడా ఆసక్తుడు కాక స్వేచ్ఛగా సంచరిస్తుంటాడు** అని ఆయనను గురించి విని, కాశ్యపుడు ఆయన వద్దకు వెళ్ళాడు. మేధావి, తపస్వి, ధర్మాభిలాషి, ఏకాగ్రచిత్తుడయిన మహర్షి యథావిధిగా ఆ సిద్ధమహాత్ముని పాదాలకు నమస్కరించాడు. ఆయన బ్రాహ్మణశ్రేష్ఠుడు, ఉత్తమసాధువు, ఆయనకు సర్వయోగ్యతలు ఉన్నాయి. ఆయన సర్వశాస్త్రాలు

తెలిసినవాడు, సచ్ఛీలుడు. ఆయనను దర్శించిన కాశ్యపునికి మహదాశ్చర్యం కలిగింది. ఆయన సిద్ధుని తన గురువుగా భావించి ఆయన సేవించాడు. తన గురుభక్తితో, శుశ్రూషతో, శ్రద్ధతో ఆ సిద్ధుని సంతుష్టుని చేశాడు. జనార్దనా! శిష్యుని భక్తికి ప్రసన్నుడయిన ఆ సిద్ధ మహర్షి పరమసిద్ధి విషయాన్ని ఆలోచించి, చేసిన ఉపదేశం చెపుతాను విను. సిద్ధుడు చెప్పాడు.

వత్సా! కాశ్యపా! మానవులు నానావిధాలయిన శుభకర్మలను అనుష్ఠించి కేవలం పుణ్యసంబంధం వల్ల ఈ లోకంలో ఉత్తమఫలాన్ని, దేవలోకంలో ఉనికిని పొందుతారు. జీవుడికి ఎక్కడా అత్యంత సుఖం కలగదు. ఏ లోకంలోనూ అతడు ఎల్లప్పుడు ఉండడు. తపస్సు మొదలయిన వాటితో నానాకష్టాలుపడి, గొప్ప గొప్ప స్థానాలను పొందినా అక్కడినుంచికూడా మాటిమాటికి తిరిగి రావటం తప్పదు. నేను కామక్రోధయుక్తుడనై, తృష్ణా మోహితుడనై పలుమారులు పాపాలు చేశాను. వాటి ఫలంగా ఘోరకష్టాలు కలిగించే నీచగతిని పొందాను. పలుమారులు పుట్టుక, పలుమారులు మరణం వల్ల కలిగే క్లేశం అనుభవించాను. నానావిధాలయిన ఆహారాలు తిన్నాను. అనేక స్తన్యపానం చేశాను. అనేక జనకులను, నానావిధమాతలను చూశాను. చిత్రవిచిత్రాలయిన సుఖాలను, అనేక విధాలయిన దుఃఖాలను అనుభవించాను. చాలాసార్లు నాకు ఇష్టులతో వియోగం, ఇష్టంగానివారితో కలిసి ఉండటం సంభవించింది. నానాకష్టాలు పడి సంపాదించిన ధనం అంతా నేను చూస్తుండగానే మాయమయింది. రాజువల్ల, అయిన వాళ్ళవల్ల అవమానాలు అనేకం కలిగాయి. వాళ్ళ వల్ల కష్టాలు కలిగాయి. చాలా భయంకరమయిన శారీరక మానసిక వేదనలు కలిగాయి. చాలా నీచమయిన అవమానాలు, దారుణమయిన మరణదండనలు, కారాగృహ ప్రాప్తులు అనేకం అనుభవించాను. యమలోకంలో అనేక యాతనలు పడ్డాను. అనేక నరకాలు అనుభవించాను. ఈ లోకంలో సమృద్ధిగా జ్వరాలు, నిరంతరం రోగాలు, ముసలితనం, అనేకబాధలు, రాగద్వేషాలవల్ల కలిగే ఇక్కట్లు అనుభవించాను.

తరువాత దుఃఖంతో ఆర్తుడనయిన నా మనస్సులో తీవ్రమయిన ఖేదం కలిగింది. అందువల్ల నిరాకారుడయిన పరమాత్మను శరణందాను. సమస్త లోక వ్యవహారాలను పరిత్యజించాను. ఈ లోకంలో అనుభవం తరువాత నేను ఈ త్రోవ పట్టాను. తరువాత పరమాత్మ అనుగ్రహంవల్ల ఈ సిద్ధి కలిగింది. ఇంకనేను మళ్ళీ ఈ జగత్తులోకి రాను, ఈ సృష్టి ఉన్నంతకాలం, నాకు ముక్తి కలగనంతవరకు ఇతర ప్రాణుల శుభగతులను చూస్తుంటాను. బ్రాహ్మణశ్రేష్ఠా! ఆ రీతిగా ఈ ఉత్తమగతి కలిగింది. దీని తరువాత

నేను ఉత్తమలోకాలకు వెళ్తాను. తరువాత వాటికంటె పరమోత్కృష్టమయిన బ్రహ్మలోకానికి వెళ్తాను. క్రమంగా అవ్యక్త మోక్షపదం (ముక్తి) పొందుతాను. ఇందు సందేహం లేదు. కామక్రోధాది శత్రువులను తపింపజేసే కాశ్యపా! ఈ మర్త్యలోకానికి నేను మళ్ళీ రాను. మహామేధావీ! నీయందు ప్రీతి కలిగింది. నీకు ఏమి చేయాలో చెప్పు. నీవు ఏదయినా పొందదలచుకుంటే దానికి సమయం వచ్చింది. నీవు ఎందుకు ఇక్కడికి వచ్చావో నాకు తెలుసు. త్వరగానే ఇక్కడినించి వెళ్తాను. కాబట్టే నన్ను ప్రశ్నింప నిన్ను ప్రేరేపించాను. విద్వాంసుడా! నీనడవడికి నేను చాలాచాలా సంతోషించాను. నీకు మేలు కలిగించే విషయం అడుగు. నీకు ఇష్టమయింది అడుగు చెపుతాను. నీ తెలివితేటలను ప్రశంసిస్తాను. దాన్ని ఆదరిస్తాను. నన్ను గుర్తించటం చేత నీవు బుద్ధిమంతుడివి అంటాను.'

17. జీవుల వివిధ గతులనిరూపణము.

శ్రీకృష్ణుడు చెప్పాడు - 'తరువాత ధర్మాత్ములలో శ్రేష్ఠుడయిన కాశ్యపుడు ఆ సిద్ధుని పాదాలు పట్టుకొని, నమస్కరించాడు. సమాధానం చెప్పటం కష్టమయిన ధర్మయుక్తమయిన అనేక ప్రశ్నలు అడిగాడు. కాశ్యపుడు అడిగాడు - మహాత్మా! ఈ శరీరం ఏ రీతిగా పడిపోతుంది? మళ్ళీ ఇంకో శరీరం ఎలా కలుగుతుంది? సంసారి అయిన జీవుడు కష్టమయమయిన ఈ సంసారంనుంచి ఎలా ముక్తుడవుతాడు? జీవాత్మ ప్రకృతిని, (మూలవిద్యను) దానివల్ల ఉత్పన్నమయ్యే శరీరాన్ని ఎలా వదులుతుంది ? జీవుడు ఆ శరీరం వదలి ఇంకొక శరీరంలో ఎలా ప్రవేశిస్తాడు ? మానవుడు తాను చేసిన పుణ్యపాపాలను ఎలా అనుభవిస్తాడు? శరీరం లేనపుడు ఆతని కర్మ ఎక్కడ ఉంటుంది?' బ్రాహ్మణుడు చెప్పాడు - 'శ్రీకృష్ణా! కాశ్యపుడు ఈ రీతిగా ప్రశ్నింపగా మహాత్ముడయిన సిద్ధుడు ఆ ప్రశ్నలకు క్రమంగా సమాధానం చెప్పసాగాడు.'

సిద్ధుడు చెప్పాడు - 'కశ్యపా! మనుష్యుడు ఈ లోకంలో ఆయువును, కీర్తిని పెంపొందించే కర్మలను చేస్తే అవి తరువాతి శరీర ప్రాప్తికి కారణాలు అవుతాయి. శరీరం గ్రహించిన తరువాత ఆ కర్మలు తాము ఇచ్చే ఫలితం ఇచ్చి క్షీణిస్తాయి. అనంతరం ఆ జీవుని ఆయువు గూడా క్షీణిస్తుంది. ఆ స్థితిలో ఆతడు అయోగ్యమయిన విపరీతకర్మలు చేస్తాడు. అవసానకాలం ఆసన్నమయినప్పుడు ఆతనిబుద్ధి వికటిస్తుంది. అతడు తన ధైర్యం, బలం, కాలం, అనుకూల సమయం తెలిసి గూడా మనస్సు మీద అదుపులేక పోవటం వల్ల తన ప్రకృతికి పడని ఆహారం తింటాడు. మిక్కిలి హాని

కలిగించే వస్తువులను అన్నింటిని అనుభవిస్తాడు. ఒకప్పుడు అధికంగా తింటాడు. ఒకప్పుడు అసలు తినడు. ఒక సమయంలో దూషితాలయిన ఆహారపానీయాలను స్వీకరిస్తాడు. ఒకప్పుడు విరుద్ధగుణాలు కలిగి వికటించే పదార్థాలు తింటాడు. ఒకనాడు మితిమీరి అరగని పదార్థాలు తింటాడు. మరొకప్పుడు తిన్న ఆహారం జీర్ణంకాకముందే మళ్ళీ భుజిస్తాడు. మితిమీరిన వ్యాయామం, మితిమీరిన సంభోగం చేస్తాడు. ఎల్లప్పుడు ఏదో ఒకపనిలో పడిపోయి మలమూత్రాలను విసర్జించడు. రసవంతమయిన ఆహారం తీసుకొంటాడు. పగటిపూట నిద్రిస్తాడు. తిన్నఅన్నం బాగా జీర్ణంకాకముందే భోజనం చేసి స్వయంగానే శరీరంలో ఉండే వాత పిత్తాదులను ప్రకోపింపజేసుకొంటాడు. వాత పిత్తాది దోషాలు ప్రకోపించటం చేత ప్రాణాంతక వ్యాధులను ఆహ్వానిస్తాడు. లేకపోతే ఉరివేసుకోవటం, నీటిలో దూకటం లాంటి శాస్త్ర విరుద్ధాలయిన ఉపాయాలను ఆశ్రయిస్తాడు. ఇలాంటి కారణాల వల్ల జీవుని శరీరం నశిస్తుంది. ఈ ప్రకారం జీవుని జీవితం చెప్పారు. దాన్ని చక్కగా తెలుసుకో.

శరీరంలో తీవ్రవాయువు చేత ప్రేరితమయిన పిత్తం పెంపొందుతుంది. అది శరీరంలో వ్యాపించి, సమస్త ప్రాణవాయువుల గమనాన్ని అడ్డుకొంటుంది. ఈ శరీరంలో అత్యంతం ప్రకోపించిన బాగా ప్రబలమయిన పిత్తం జీవుని మర్మ స్థానాలను చీల్చివేస్తుంది అని తెలుసుకో. మర్మస్థానాలు భిన్నభిన్నాలు అయినప్పుడు బాధతో వ్యధజెందే జీవుడు వెంటనే జడమయిన ఈ శరీరాన్నుంచి బయటకుపోతాడు. ద్విజశ్రేష్ఠా! మృత్యుకాలంలో జీవుని శరీర మనస్సులు చాలా బాధపడతాయి అని తెలుసుకో. ఈ రీతిగా లోకంలోని సమస్త ప్రాణులు ఎల్లప్పుడు జనన మరణాలతో ఉద్విగ్నాలు అవుతుంటాయి. ద్విజోత్తమా! సమస్తప్రాణులు తమ శరీరాలను వదలి పెట్టటం చూస్తుంటాం. గర్భంలో ప్రవేశించేటప్పుడు, మళ్ళీ గర్భంలో నుంచి బయటకు వచ్చేటప్పుడు అలాంటి బాధే పడుతుంటాడు. మృత్యుకాలంలో జీవుని దేహ సంధులు శిథిలమవుతాయి. జన్మించేటప్పుడు గర్భస్థ జలంలో తడిసి మిక్కిలి వ్యాకులు డవుతాడు. ఇంకొకరకంగా తీవ్రవాయు ప్రేరితమయి శరీరంలో నిరంతరం ప్రకోపించిన వాయువు పంచభూతాలలో ప్రాణాపానాలస్థానంలో ఉన్నదే పంచభూతాత్మక శరీరాన్ని నాశనం చేస్తుంది. అది దేహధారులకు మిక్కిలి కష్టం కలిగిస్తూ, శరీరాన్ని వదలి ఊర్ధ్వలోకానికి పోతుంది. ఈ రీతిగా జీవుడు శరీరాన్ని వదలిపోయినప్పుడు శరీరంలో ఉచ్ఛ్వాస నిఃశ్వాసలు ఉండవు. ఆ శరీరంలో వేడిమి, శ్వాస తీసుకోవటం, శోభ, చైతన్యం ఉండవు. ఈ రీతిగా జీవాత్మ వదలిన శరీరాన్ని జనులు

మరణించాడు అని అంటారు.

దేహధారి అయిన జీవుడు రూపరసాదులయిన ఇంద్రియార్థాలను ఇంద్రియాలద్వారా అనుభవిస్తాడు. వాటిద్వారా పరిపుష్టాలయ్యే ప్రాణాలను ఆతడు ఎరుగడు. ఈ శరీరంలో ఉండి సమస్త కార్యాలు చేసేవాడే సనాతనుడయిన జీవుడు. శరీరంలో అక్కడక్కడ సంధిస్థానాల్లో కలిసి ఉండే అంగాలను మర్మస్థానాలు అని తెలుసుకో. శాస్త్రాలు మర్మస్థానాల లక్షణం ఇలా చెప్పాయి. ఆ మర్మస్థానాలు శిధిలం కాగా వాయువు పైకి లేస్తూ ప్రాణి హృదయంలో ప్రవేశించి, త్వరగా ఆతని బుద్ధిని అడ్డగిస్తుంది. అప్పుడు అవసానకాలం దాపురించగా ప్రాణి చైతన్యవంతుడయి ఉన్నా ఏమీ తెలుసుకోలేడు. అప్పుడు తమస్సు ఆతని జ్ఞానశక్తిని ఆవరించి ఉంటుంది. మర్మస్థానాలు కూడా నిరుద్ధాలు అవుతాయి. ఆ సమయంలో జీవునికి ఏ ఆధారమూ ఉండదు. వాయువు జీవుని తన స్థానంనుంచి కదిలిస్తుంది. ఆ సమయంలో జీవాత్మ మాటిమాటికి భయంకర దీర్ఘశ్వాస వదలుతూ బయటికి వస్తాడు. ఆ సమయంలో ఈజడ శరీరాన్ని కంపింపజేస్తాడు. శరీరం వేరుకాగా ఆ జీవుడు తాను చేసిన శుభంకరమయిన పుణ్యకర్మలతో గాని, పాపకర్మలతోగాని ఆవృతుడయి ఉంటాడు.

వేదశాస్త్ర సిద్ధాంతాలను అధ్యయనం చేసిన జ్ఞానసంపన్నులయిన బ్రాహ్మణులు లక్షణాల ద్వారా 'ఈ జీవుడు పుణ్యాత్ముడ'ని 'ఈ జీవుడు పాపాత్ముడ'ని తెలుసుకుంటారు. చూపుబాగా ఉన్నవారు చీకటిలో ఇటు అటు పైకిలేస్తూ కనిపిస్తూ ఉండే మిణుగురు పురుగును స్పష్టంగా చూచినట్లు జ్ఞాననేత్రులయిన సిద్ధపురుషులు దివ్యదృష్టితో పుడుతున్న, చస్తున్న, గర్భంలో ప్రవేశిస్తున్న జీవులను నిరంతరం చూస్తుంటారు. శాస్త్రానుసారం జీవునికి మూడు స్థానాలు ఉన్నట్టుగా తెలుస్తుంది. (మానవ లోకం, స్వర్గం, నరకం అనేవి ఆ మూడు) అనేక ప్రాణులు ఉండే ఈ మర్త్య లోకభూమిని **కర్మభూమి** అంటారు. ఈ మర్త్యలోకంలోనే మంచిపనులు, చెడ్డపనులు చేసి సమస్త మనుష్యులు ఆ కర్మల ఫల స్వరూపంగా మంచి చెడులను అనుభవిస్తారు. ఈ లోకంలోనే పాపాలు చేసే మానవులు తమ కర్మానుసారం నరకాలకు పోతారు. ఘోరకష్టాలు కలిగించే ఇది జీవునికి అధోగతి అవుతుంది. ఇందులో పడిన పాపాత్ములయిన మానవులు నరకాగ్నిలో పక్వం అవుతారు. దానినుండి విముక్తి మహాకష్టం, కాబట్టి పాపకర్మలకు దూరంగా ఉంటూ నరకాన్ని ఆత్మరక్షణకు బాగా యత్నించాలి.

స్వర్గాది ఊర్ధ్వలోకాలకు వెళ్ళిన ప్రాణులు నివసించే స్థానాలను వివరిస్తాను.

వాటి యధార్థ రూపం తెలుసుకో. ఇది వింటే నీకు కర్మవల్ల కలిగే గతి నిశ్చయంగా తెలుస్తుంది. సమస్తమయిన తారకల రూపాలు, చంద్రమండలం, తన కాంతితో ప్రకాశించే సూర్యమండలం అనేవి పుణ్యాత్ముల నివాసస్థానాలని తెలుసుకో. జీవుల పుణ్యకర్మానుభవం సమాప్తం అయినప్పుడు వారు అక్కడినించి క్రిందపడతారు. ఈ రీతిగా మాటిమాటికి వారి రాకపోకలు జరుగుతుంటాయి. స్వర్గ లోకంలో కూడా ఉత్తమ, మధ్యమ అధమాలనే మూడు భేదాలు ఉంటాయి. అక్కడకూడా తమకంటే ఇతరుల చాలా ఎక్కువ దీప్తిమంతమయిన తేజస్సు, ఐశ్వర్యంచూచి మనస్సులో సంతోషం కలగదు. ఈ రీతిగా జీవులకు కలిగే ఈ సమస్త గతులను నేను నీకు ప్రత్యేకంగా విడివిడిగా చెప్పాను. జీవుడు గర్భంలో ప్రవేశించి ఎలా జన్మిస్తాడో చెపుతాను. నీవు ఏకాగ్రత చిత్తుడవయి విను.

18. జీవుని గర్భప్రవేశము.

కాశ్యపా! ఈలోకంలో చేసిన శుభాశుభకర్మలు ఫలితాన్ని అనుభవించకుండా నశించవు. ఆ కర్మలు ఆయాకర్మల క్రమంలో ఒకదాని తరువాత ఇంకొకటి శరీరాలను ధరింపజేసి, తమ ఫలితాలను ఇస్తుంటాయి. పండ్లను ఇచ్చేచెట్లు ఫలించవలసిన సమయంలో చాలా పండ్లను ఇచ్చినట్లే పవిత్ర మనస్సుతో చేసిన పుణ్యం అధికం అవుతుంది. పాప బుద్ధితో చేసిన పాప ఫలంగూడా వృద్ధి పొందుతుంది. జీవుడు మనస్సును ముందుంచుకొనే ప్రతిపనిలో ప్రవర్తిస్తాడు. కామక్రోధాలతో ఆవృతుడయి, మానవుడు కర్మజాలంతో గూడి, మాతృగర్భంలో ఎలా ప్రవేశిస్తాడో చెపుతాను. విను.

జీవుడు మొదట పురుషుని వీర్యంలో ప్రవేశిస్తాడు. తరువాత స్త్రీ గర్భాశయంలో రజస్సుతో కలుస్తాడు. తరువాత ఆతని పాపపుణ్యాలకు తగిన శరీరం ధరిస్తాడు. జీవుడు తన ఇచ్ఛానుసారం ఆ గర్భంలో ప్రవేశించి, సూక్ష్మమయిన వాడు అవ్యక్తస్వరూపుడు కావటం వల్ల ఎక్కడా ఆసక్తుడు కాడు. అతడు సనాతన పరబ్రహ్మమే కావటం అందుకు కారణం. ఆ జీవుడే సర్వప్రాణులకు బీజం అవుతాడు. ఆతని వలననే సర్వప్రాణులు బ్రతుకుతుంటాయి. ఆ జీవుడు సమస్త అంగాల్లో ప్రవేశించగానే వాటి ప్రతి ఒక్క అంశంలో చేతన కలిగిస్తాడు. అతడే ప్రాణాల స్థానంలో - వక్షఃస్థలంలోనే ఉండి సమస్తావయవాలను కదిలిస్తాడు. అప్పుడే ఆ గర్భం చైతన్యవంతం అవుతుంది. బాగా కరిగించిన లోహద్రవ్యాన్ని మూసలో పోస్తే అది దాని ఆకారాన్నే ధరించినట్లే గర్భంలో

జీవ ప్రవేశం కలుగుతుంది. అని తెలుసుకో (అంటే జీవుడు ఏ రకమయిన జాతి వ్యక్తిలో ప్రవేశిస్తే అలాంటి రూపమే పొందుతాడు). అగ్ని ఇనుపగుండును ప్రవేశించి, దాన్ని తీవ్రంగా కాల్చినట్లే మాతృగర్భంలో జీవుడు ప్రవేశించి, చైతన్యవంతం చేస్తాడు. ప్రకాశవంతమయిన దీపం ఇంటిని అంతటిని ప్రకాశవంతం చేసినట్లు జీవుని చైతన్యశక్తి శరీరంలోని అన్ని అవయవాలను ప్రకాశింపజేస్తుంది. జీవుడు వెనుకటి దేహంతో చేసిన పుణ్యం గాని, పాపం గాని సమస్తమూ తప్పక అనుభవిస్తాడు. అనుభవించటం చేత వెనుకటి కర్మ నశిస్తుంది. మళ్ళీ క్రొత్త క్రొత్త కర్మలను పోగుచేసుకుంటాడు. మోక్షప్రాప్తికి సహాయకరమయిన ధర్మం తెలియనంతవరకు ఆకర్మ పరంపర నశించదు. సాధుశ్రేష్ఠా! ఈ రీతిగా భిన్నభిన్నమయిన యోనులలో భ్రమించే జీవుడు ఎలాంటి కర్మలు చేస్తే సుఖపడతాడో చెపుతాను.

దానం చేయటం, వ్రతాచరణం, యథావిధిగా వేదాధ్యయనం, ఇంద్రియ నిగ్రహం, శాంతి, సర్వప్రాణులయందు దయ, మనోనిగ్రహం, మృదుస్వభావం, ఇతరుల సొత్తు తీసుకోకపోవటం, లోకంలోని ప్రాణులకు మనస్సుతో గూడా కీడు చేయకుండటం, తల్లిదండ్రుల సేవ, దేవతలను అతిథులను పూజించటం, గురువులను గౌరవించటం, కనికరం, పవిత్రత, ప్రతినిత్యం ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవటం, మంచి విషయాలను ప్రచారం చేయటం అనేవి సత్పురుషుల ప్రవర్తన అని చెపుతారు. వీటిని అనుష్ఠించటం వల్లనే ధర్మం ఏర్పడుతుంది. అలాంటి ధర్మాత్ముడే చిరకాలం ప్రజలను రక్షిస్తాడు. సత్పురుషులలో ఇలాంటి ధర్మాచరణం ఎల్లప్పుడు కన్పిస్తుంది. వారిలోనే ధర్మం నిశ్చలంగా ఉంటుంది. సదాచారమే ధర్మాన్ని తెలుపుతుంది. శాంతచిత్తులయిన మహాత్ములు ఎల్లవేళలా సదాచారం పాటిస్తుంటారు. వారియందే వెనక చెప్పిన ధర్మాదులు ఉన్నాయి. ఆ కర్మలే సనాతన ధర్మం అనే పేరుతో ప్రసిద్ధాలు. ఆ ధర్మాన్ని ఆచరించేవాడు దుర్గతి పాలు కాడు. కాబట్టే ధర్మమార్గం నుంచి భ్రష్టులు కాకుండా నియంత్రణం ఉంటుంది. యోగి అయినవాడు, ముక్తుడు, వీరికంటే శ్రేష్ఠుడు. ధర్మానుసారం ప్రవర్తించేవాడు. ఎక్కడ ఎలాంటిస్థితిలో ఉన్నా ఆ స్థితిలో ఆతనికి అతని కర్మానుసారం ఉత్తమ ఫలం ప్రాప్తిస్తుంది. అతడు మెల్లమెల్లగా చాలాకాలం తరువాత సంసార సాగరాన్ని దాటుతాడు. ఈ రీతిగా ప్రాణి నిత్యమూ పూర్వ జన్మకృత కర్మఫలం పొందుతుంటాడు. ఈ ఆత్మ నిర్వికారబ్రహ్మమయినా వికృతమయి ఈ జగత్తులో జన్మించటానికి కర్మయే కారణం అవుతుంది.

ఆత్మ శరీరాన్ని ఎలా ధరిస్తుంది ? అనే సందేహం సాధారణంగా జనానికి

కలుగుతుంది. దానికి సమాధానం చెపుతాను. సమస్త జగత్తుకు పితామహుడయిన బ్రహ్మ మొట్టమొదట స్వయంగా శరీరం ధరించి, స్థావరజంగమాత్మకమయిన లోకత్రయాన్ని (కర్మానుసారం) సృజించాడు. సమస్త శరీరధారులకు ప్రకృతిగా చెప్పబడే ప్రధానాన్ని సృష్టించాడు. అది ఈ సమస్త జగత్తును వ్యాపించి ఉన్నది. దాన్నే మూల ప్రకృతి అంటారు. ఈ ప్రాకృత జగత్తును క్షరం అంటారు. దీనికంటె భిన్నమయి వినాశం లేనిది అయిన జీవాత్మను అక్షరం అంటారు. (దీనికంటె విలక్షణమయినది పరబ్రహ్మ). ఈ మూడింటిలోని రెండు తత్త్వాలు క్షరం, అక్షరం అనేవి. అవి ప్రతిజీవునికి ప్రత్యేకంగా ఉంటాయి. వేదంలో సృష్టిమొదట సత్‌రూపంతో నిర్దిష్టమయిన ప్రజాపతి సమస్త స్థావర ప్రాణులను, జంగమ ప్రాణులను సృష్టించాడు అనేది ప్రాచీనమయిన వేద వాక్కు. పితామహుడు జీవునికి నిర్దిష్ట సమయ పర్యంతం శరీరం ధరించి ఉండటానికి, భిన్నభిన్న యోనులలో సంచరించటానికి, పరలోకం నుంచి తిరిగివచ్చి ఈలోకంలో జన్మించటానికి ఒక వ్యవస్థను చేశాడు. పూర్వజన్మలో ఆత్మసాక్షాత్కారం పొందిన మేధావి సంసారం అనిత్యం అనే విషయంలో చెప్పేవిషయాన్నే నేనూ చెపుతాను. నేను చెప్పే మాటలు యథార్థాలు. సుఖదుఃఖాలను అనిత్యాలు అని భావించేవాడు, శరీరాన్ని అపవిత్ర వస్తుసమూహంగా భావించేవాడు, మృత్యువు కర్మఫలం అని తెలుసుకొన్నవాడు, సుఖం అనిపించేవి సమస్తమూ దుఃఖమే అని భావించేవాడు ఘోరమూ, దుస్తరమూ అయిన సంసారసాగరాన్ని తరిస్తాడు. జనన మరణ రోగాలు చుట్టుముట్టిన పురుషుడు ప్రధానతత్త్వం ప్రకృతి, తెలిసినవాడు, సమస్తచేతన ప్రాణులలో చైతన్యం సమానంగానే వ్యాపించి ఉన్నదని చూచేవాడు. పూర్ణపరమపదానుసంధానంలో లగ్నుడయి జగత్తు నందలిభోగాలలో విరక్తుడవుతాడు. సాధుశిరోమణీ! వైరాగ్యవంతుడయిన ఆ పురుషునికి హితకరమయిన ఉపదేశాన్ని నేను యథాతథంగా చేస్తాను. సనాతనుడు, అవినాశి అయిన పరమాత్మకు ఇష్టమయిన ఉత్తమ జ్ఞానాన్ని చెపుతాను. పూర్తిగా అది తెలుసుకో.

19. మోక్షప్రాప్త్యుపాయ వర్ణనము.

స్థూల సూక్ష్మకారణ శరీరాలలో క్రమంగా పూర్వపూర్వాల మీద ఉండే అభిమానాన్ని వదలి, ఏమీ చింతించనివాడు మౌనంగా ఉండి, సమస్తానికి ఏకైకాధిష్ఠానమయిన పరమాత్మయందు లీనుడయి ఉండేవాడు సంసార బంధవిముక్తు డవుతాడు. అన్నిటిని

ఓర్చుకొనేవాడు, మనో నిగ్రహతత్పరుడు, ఇంద్రియ విజేత, భయం, కోపం లేనివాడు, ఆత్మవంతుడు సంసారముక్తు డవుతాడు.* నియమ పరాయణుడు, పవిత్రుడు, సర్వప్రాణులను తనవలె చూచేవాడు, గర్వం లేనివాడు, అభిమానరహితుడు అన్ని విధాల ముక్తుడే. జనన మరణాలయందు, సుఖదుఃఖాల యందు, లాభనష్టాలయందు, శత్రుమిత్రులయందు సమభావం గలవాడు ముక్తుడవుతాడు. ఏ ద్రవ్యం కావాలని కోరడు. ఎవ్వరినీ అవమానించడు. మనస్సు మీద ద్వంద్వాల ప్రభావం పడనివాడు. చిత్తంలో ఆసక్తిలేనివాడు అన్నివిధాలా ముక్తుడే అవుతాడు. ఎవ్వరిని మిత్రునిగా, శత్రువుగా, బంధువుగా సంతానంగా భావించనివాడు, సకామధర్మాన్ని అర్థాన్ని, కామాన్ని వదలినవాడు, ఎలాంటి కోరికలేనివాడు ముక్తుడు అవుతాడు. ధర్మాధర్మాలు రెండింటియందు ఆసక్తిలేనివాడు; పూర్వార్జిత కర్మ త్యాగం చేసినవాడు, వాసనాక్షయం వల్ల శాంతచిత్తుడు, సర్వద్వంద్వ రహితుడు ముక్తుడవుతాడు. ఏపనికి కర్తకానివాడు, ఏ కోరిక లేనివాడు, ఈ జగత్తు అశ్వత్థం (రేపులేనిది) అనిత్యం అని ఎరిగినవాడు, ఇది జననమరణ జరలు గలదని తెలిసినవాడు, వైరాగ్యయుక్తచిత్తుడు, నిరంతరం తన తప్పులను చూచుకొనేవాడు, చాలా కొద్దికాలంలోనే బంధవిముక్తుడ వుతాడు. ఆత్మను గంధం, రసం, స్పర్శ, అపరిగ్రహం (పట్టుకొనవీలులేనిది) శబ్దం, రూపం లేనిది, తెలియరానిది అని భావించేవాడు ముక్తు డవుతాడు. ఆత్మ పంచభూతాల గుణరహితం, నిరాకారం, కారణరహితం, నిర్గుణమయినా మాయా సంబంధంతో గుణభోక్త అనే దృష్టిగలవాడు ముక్తుడు అవుతాడు. బుద్ధితో ఆలోచించి శారీరకాలు, మానసికాలయిన సర్వసంకల్పాలను వదలి వేసేవాడు కట్టెలు లేని అగ్నివలె మెల్లమెల్లగా శాంతుడు అవుతాడు. సర్వవిధ సంస్కార రహితుడు, ద్వంద్వాతీతుడు, ఏదీ తీసుకోనివాడు, తపస్సుతో ఇంద్రియాలను వశం చేసుకుని అనాసక్తుడయి సంచరించేవాడు ముక్తుడే అవుతాడు. సర్వసంస్కార ముక్తుడయిన మనుష్యుడు శాంతం, అచలం, నిత్యం, అక్షరం, సనాతన మయిన పరమాత్మను పొందుతాడు.

ఇకమీద సర్వోత్తమమయిన యోగశాస్త్రాన్ని చెపుతాను. దాన్ని అనుసరించి యోగసాధనచేసే యోగులు ఆత్మసాక్షాత్కారం పొందుతారు. నేను దాన్ని యథాతథంగా ఉపదేశిస్తాను. మనోనిగ్రహోపాయంతో చిత్తాన్ని ఈ శరీరంలోనే లొంగదీసి, అంతర్ముఖాన్ని చేసుకొని యోగులు నిత్యమయిన తమ ఆత్మదర్శనంతో ముక్తులవుతారు. అది అందుకు

---

* సర్వమిత్రః సర్వసహాः శమే రక్తో జితేంద్రియः ।
వ్యపేతభయమన్యుశ్చ ఆత్మవాన్ ముచ్యతే నరः ॥ 2

సాధనం అవుతుంది. ఇంద్రియాలను విషయాలనుంచి తొలగించి మనస్సులో, మనస్సును ఆత్మలో నిలపాలి. ఈ రీతిగా మొదట తీవ్రతపస్సు చేసి తరువాత మోక్షానికి ఉపయోగకరమయిన ఉపాయాన్ని అవలంబించాలి. మనీషి అయిన బ్రాహ్మణుడు నిరంతరం తపస్వి అయి, యజ్ఞశీలుడయి యోగశాస్త్రం చెప్పిన ఉపాయాలను అనుసరించాలి. దీనివల్ల ఆతడు మనస్సు ద్వారా అంతఃకరణంలో ఆత్మసాక్షాత్కారం పొందుతాడు. ఏకాంతంలో ఉండే సాధకుడు తన మనస్సును ఆత్మలో నిలపటంలో సఫలుడు అయితే అతడు తప్పక తనలో ఆత్మదర్శనం చేస్తాడు. ఎల్లప్పుడు సంయమ పరాయణుడు, యోగయుక్తుడు, మనస్సును వశం చేసుకొన్నవాడు, జితేంద్రియుడు అయిన సాధకుడు ఆత్మప్రేరితుడయి బుద్ధి ద్వారా దాని సాక్షాత్కారం పొందుతాడు. మనుష్యుడు కలలో ఒక అపరిచిత వ్యక్తిని చూసి, తరువాత జాగ్రదవస్థలో ఆతనిని చూస్తే 'అతడే ఇతడు' అని గుర్తిస్తాడు. అలాగే సాధన పరాయణుడయిన యోగి సమాధి స్థితిలో ఆత్మను చూచినట్లే తరువాత కూడా అదే రూపంలో చూస్తుంటాడు. ఒక వ్యక్తి ముంజెగడ్డినుంచి ఇషీకను వేరుచేసి చూసినట్లు యోగి ఆత్మను ఈ దేహాన్నుంచి విడదీసి చూస్తాడు. ఇక్కడ శరీరం ముంజెగడ్డి అని ఆత్మను ఇషీక అనిచెప్పారు. యోగవేత్తలు దేహం ఆత్మ విడివిడిగా ఉంటాయి అని తెలపటం కోసం ఈ చక్కని దృష్టాంతం ఇచ్చారు.

దేహధారి అయిన జీవుడు యోగంతో ఆత్మయధార్థరూపాన్ని దర్శించినప్పుడు ఆ సమయంలో ఆయన మీద త్రిభువనాధిపతికి గూడా అధికారం ఉండదు. ఆ యోగి తన ఇష్టానుసారం విభిన్న శరీరాలు ధరించగలడు. ముసలితనాన్ని, మృత్యువును కూడా పారద్రోలుతాడు. ఆయనకు శోకహర్షాలు ఉండవు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకొనే యోగి దేవతలకు దేవత అవుతాడు. ఆయన అనిత్యమయిన ఈ శరీరాన్ని వదలి శాశ్వతమయిన బ్రహ్మత్వాన్ని పొందుతాడు. సర్వప్రాణులు నశించినా ఆయనకు భయం కలగదు. అందరు క్లేశాలను పొందినా ఆయనకు ఎలాంటి క్లేశం కలుగదు. శాంతచిత్తుడు, నిఃస్పృహుడు అయిన యోగి ఆసక్తి, స్నేహాలతో ప్రాప్తించే భయంకర దుఃఖశోకాల వల్ల, భయంవల్ల చలించడు. శస్త్రాలు ఆయన్ను ఛేదించలేవు. మృత్యువు ఆయన దరి చేరదు. ప్రపంచంలో ఆయనంత సుఖవంతుడు ఎవ్వడూ కన్పించడు. ఆయన మనస్సును ఆత్మలో లీనం చేసుకొని, అందులోనే ఉండిపోతాడు. ముసలితనం వల్ల కలిగే దుఃఖం నుండి విముక్తుడయి సుఖంగా నిద్రిస్తూ అక్షయానందాన్ని అనుభవిస్తాడు. ఆయన ఈ మానవ శరీరాన్ని వదలి ఇతరమయిన అనేక శరీరాలను ధరిస్తాడు. యోగం వల్ల కలిగిన ఐశ్వర్యాన్ని

అనుభవించే యోగి యోగం నుంచి విరక్తుడు కారాదు. చక్కగా యోగాభ్యాసం చేసిన యోగి తనలోనే ఆత్మసాక్షాత్కారం పొంద సాగినప్పుడు ఆయన ఇంద్రపదవిని కూడా సంపాదించాలని అనుకోడు.

ఏకాంతంలో ధ్యానం చేసే వ్యక్తికి యోగప్రాప్తి ఎలా కలుగుతుందో విను. వేదోక్తమయిన ఉపదేశాన్ని ధ్యానిస్తూ దేహంలో జీవనివాసం ఎక్కడ ఉన్నదని చెప్పారో అక్కడ మనస్సును గూడా నిలపాలి. దాన్ని ఎప్పుడూ దాటిపోరాదు. శరీరంలోపల ఉండే ఆత్మ ఏ స్థానంలో ఉంటుందో దాంట్లోనే బ్రహ్మ, ఆభ్యంతర విషయాలతో గూడిన మనస్సును ధరించాలి. మూలాధారాదులయిన వాటిల్లో ఏదో ఒకదానిలో ధ్యానించి సర్వ స్వరూపమయిన పరమాత్మ సాక్షాత్కారం పొందినప్పుడు ఆయన మనస్సు ప్రత్యక్ష స్వరూపమయిన ఆత్మకంటె భిన్నమయిన ఏ బాహ్య వస్తువులోను ఉండదు. నిర్జనవనంలో ఇంద్రియ సముదాయాన్ని వశం చేసుకొని, ఏకాగ్రచిత్తుడయి, నిఃశబ్దమయిన తన శరీరానికి బయట, లోపల ప్రతి అవయవంలో పరిపూర్ణమయిన పరబ్రహ్మను ధ్యానించాలి. దంతాలను, దవడలను, నాలుకను, మెడను, కంఠాన్ని, హృదయాన్ని, హృదయాన్నుంచి వచ్చేనాడీ మార్గాన్ని పరమాత్మ రూపంగా ధ్యానించాలి. శ్రీకృష్ణా! ఇలా నేను చెప్పగా మేధావి అయిన ఆ శిష్యుడు ఇటువంటిదని నిర్వచించటానికి కష్టమయిన ఈ మోక్షధర్మాన్ని గురించే మళ్ళీ అడిగాడు.

'మాటిమాటికి తిన్న ఈ అన్నం కుక్షిలోకి పోయి ఎలా జీర్ణం అవుతుంది? అదిరసంగా ఎలా తయారవుతుంది? రక్తంగా ఎలా మారుతుంది ? స్త్రీ శరీరంలో మాంసం మేదస్సు, స్నాయువు, ఎముకలు ఎలా ఏర్పడతాయి? దేహధారుల ఈ శరీరం సమస్తం ఎలా పెంపొందుతుంది? వృద్ధినందే శరీరానికి బలం ఎలా కలుగుతుంది? అన్నివైపులా అన్నీ అడ్డంకులు ఉండగా మలాలు అన్నీ విడివిడిగా బయటకు ఎలా పోతాయి ? ఈ జీవుడు ఎలా ఊపిరి తీసుకుంటాడు? ఎలా విడుస్తాడు? ఈ శరీరంలో ఎల్లవేళలా ఎలా ఉంటాడు? చేష్టాశీలుడయిన జీవుడు ఈ శరీరభారాన్ని ఎలా మోస్తాడు? ఏ రంగు గల శరీరాన్ని ఎలా ధరిస్తాడు ? మహాత్మా! అనఘా! ఈ విషయాలన్నీ ఉన్నవి ఉన్నట్లు నాకు చెప్పగోరుతాను.' మహాబాహూ! శత్రునాశకా! ఈరీతిగా ఆ విప్రుడు అడుగగా నేను విన్నదివిన్నట్లు ఆయనకు సమాధానం చెప్పాను.

ఇంటిలోని సామాను సామాన్లగదిలో పడేసి మానవుడు దాన్ని గురించే ఆలోచిస్తున్నట్లు ఇంద్రియాలు అనే చంచలద్వారాల్లో సంచరించే మనస్సును తన శరీరంలోనే

నిలిపి అక్కడే ఆత్మానుసంధానం చెయ్యాలి. ఎలాంటి పొరపాటునైనా వదలి వెయ్యాలి. ఈ విధంగా ఎల్లవేళలా ధ్యానం చేయ ప్రయత్నించే వాని చిత్తం త్వరలోనే ప్రసన్నం అవుతుంది. అతడు ఆ పరమాత్మను పొందుతాడు. పరబ్రహ్మ సాక్షాత్కారం వల్ల మానవుడు ప్రకృతిని, దానివికారాలను తెలుసుకొంటాడు. ఆ పరమాత్మను కన్నులతోగాని, ఇతరేంద్రియాలు వేనితోగాని గ్రహింప వీలుగాదు. కేవలం బుద్ధి అనే ప్రదీప సహాయంతోనే మహత్తరమయిన ఆత్మదర్శనం కలుగుతుంది. **ఆ పరమాత్మ అన్నివైపులా చేతులు, కాళ్ళు గలవాడు, అన్నివైపులా కన్నులు, శిరస్సులు, ముఖాలు కలవాడు, అన్ని దిక్కులా చెవులు గల్గి ఉన్నాడు.*** ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. తత్త్వజ్ఞుడయిన జీవుడు, తనను తాను శరీరానికంటె భిన్నంగా చూస్తాడు. అతడు శరీరంలో ఉండి కూడా దాన్ని వదలి, దాన్ని తనకంటె భిన్నం అనే అనుభవంతో; తుది సుఖాన్ని, తన అసలు స్వరూపమయిన పరమాత్మను ధ్యానిస్తూ, బుద్ధి సహాయంతో ఆత్మసాక్షాత్కారం పొందుతాడు. ఆహా ! ఎండమావులలో కన్పించే నీరులాగా నాలోనే ప్రతీతమయ్యే ఈ ప్రపంచం ఇప్పటి దాకా వ్యర్థమయిన భ్రమలో పడేసింది అని నవ్వుకొంటాడు. ఇలా పరమాత్మను దర్శించినవాడు ఆయన్ను ఆశ్రయించి చివరకు నాలాగే ముక్తుడవుతాడు. ద్విజోత్తమా! ఈ సర్వరహస్యాన్ని నీకు చెప్పాను. ఇక నేను వెళ్ళగోరుతాను. విప్రవరా! నీవు కూడా సుఖంగా నీ నివాసానికి వెళ్ళు. శ్రీకృష్ణా! ఇలా నేను చెప్పగా కఠోరవ్రతపాలకుడయిన ఆ మహాతపస్వి శిష్యుడయిన కాశ్యపుడు తన ఇష్టానుసారం తన నివాసానికి వెళ్ళాడు.

శ్రీకృష్ణుడు అన్నాడు - 'పార్థా! మోక్ష ధర్మాన్ని ఆశ్రయించే సిద్ధుడయిన ఆ మహాత్ముడయిన శ్రేష్ఠ బ్రాహ్మణుడు నాతో ఈ విషయాన్ని చెప్పి అంతర్ధానం చెందాడు. అర్జునా! నేను చెప్పినది అంతా ఏకాగ్రమయిన మనస్సుతో విన్నావా? ఆ యుద్ధసమయంలో రథం మీద ఉండి ఈ తత్త్వాన్నే విన్నావు. కుంతీనందనా! వ్యగ్రమైన మనస్సు గలవాడు, జ్ఞానోపదేశం పొందనివాడు ఈ విషయాన్ని సులభంగా తెలుసుకోలేడు అని నా విశ్వాసం. శుద్ధమయిన అంతఃకరణం గలవాడే ఈ విషయం తెలుసుకోగలడు. భరతశ్రేష్ఠా! దేవతలు మిక్కిలి జాగ్రత్తగా దాచే రహస్యాన్ని నీకు చెప్పాను. ఈ లోకంలో ఏ మానవుడూ ఈ రహస్య విషయం వినలేదు. అనఘా! నీవు తప్ప ఇతర మనుష్యుడు ఎవడూ దాన్ని

---

* సర్వతః పాణిపాదాంతః సర్వతోఽక్షిశిరోముఖః ।
సర్వతః శ్రుతిమాఁల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥ 49

వినటానికి అర్హుడుకాడు. ఇతర విషయాలతో మిశ్రమయి సందిగ్ధమయిన మనస్సు గలవానికి ఇది అంతతేలికగా తెలియదు. కుంతీపుత్రా! దేవలోకం క్రియావంతులతో నిండి ఉంది. మానవునికి మర్త్యరూపం నివృత్తికావటం దేవతలకు అభీష్టం కాదు. సనాతన పరబ్రహ్మయే జీవునికి పరమగతి. జ్ఞాని అయిన మానవుడు దేహాన్ని వదలి ఆ పరబ్రహ్మలోనే అమృతత్వాన్ని పొందుతాడు. నిరంతరం సుఖిస్తాడు. ఆత్మదర్శనరూప మయిన ఈధర్మాన్ని ఆశ్రయించి స్త్రీలు, వైశ్యులు, శూద్రులు పాపజాతులయిన మానవులు గూడా పరమగతిని పొందుతారు. పార్థా! స్వధర్మాన్ని ప్రేమించేవారు, నిరంతరం బ్రహ్మలోకాన్ని పొందే సాధనలో నిమగ్నులు బహుశ్రుతులు అయిన బ్రాహ్మణులు, క్షత్రియుల విషయం వేరే చెప్పాలా? ఈ రీతిగా నేను నీకు మోక్షధర్మాన్ని యుక్తియుక్తంగా ఉపదేశించాను. దాని సాధనోపాయాలను చెప్పాను. సిద్ధి, ఫలం, మోక్షం, దుఃఖ స్వరూపం కూడా చెప్పాను. భరతశ్రేష్ఠా! దీన్ని మించిన సుఖసంపాదకమైంది ఇంకొకటి లేదు. బుద్ధిమంతుడు, శ్రద్ధాళువు, పరాక్రమవంతుడయిన మానవుడు, లౌకిక సుఖాలను నిస్సారంగా భావించి, వాటిని వదిలినవాడు పైన చెప్పిన ఉపాయాలతో చాలా త్వరగా పరమగతిని పొందుతాడు. పార్థా! చెప్పదగింది ఇంతే. ఇంతకుమించి ఏమీ లేదు. ఆరునెలలు నిరంతరం యోగాభ్యాసం చేసేవానికి తప్పక యోగసిద్ధి కలుగుతుంది.

20. బ్రాహ్మణగీత - 1.

భరతశ్రేష్ఠా! అర్జునా! ఈ విషయంలో పతిపత్నీ సంవాదరూపమయిన ఒక ప్రాచీనేతిహాసాన్ని ఉదహరిస్తుంటారు. జ్ఞానవిజ్ఞానాల పారం చూచిన ఒక బ్రాహ్మణుడు ఏకాంతంలో కూర్చుని ఉన్నాడు. ఆ భర్తను చూచిన బ్రాహ్మణి ఇలా ప్రశ్నించింది. 'స్వామీ! స్త్రీలు పతికర్మానుసారం ప్రాప్తించే లోకాలకు వెళ్తారని విన్నాను. కాని మీరు కర్మకాండ వదలి కూర్చున్నారు. నా విషయంలో క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. నేను అనన్యభావంతో మిమ్ములనే ఆశ్రయించి ఉన్నాను. ఈ స్థితిలో మీవంటి భర్త ఆశ్రయం స్వీకరించిన నేను ఏ లోకానికి వెళ్తాను? మిమ్ములను భర్తగా పొందిన నాకు ఏ గతి కలుగుతుంది ?' భార్య ఇలా అనగా శాంతచిత్తుడయిన ఆ భర్త నవ్వుతూ ఇలా అన్నాడు. 'సౌభాగ్యవతీ! నీవు పవిత్రురాలివి. నీ మాటలను చెడుగా భావించటం లేదు. లోకంలో గ్రహించదగిన దీక్ష, వ్రతాదులను, ఈ కన్నులకు కనపడే కర్మలనే అసలయిన కర్మలని అనుకొంటున్నారు. కర్మనిష్ఠులయినవారు ఇలాంటి కర్మలనే కర్మలు అనే పేరుతో పిలుస్తున్నారు.

జ్ఞానం కలుగనివారు కర్మద్వారా మోహాన్నే సంపాదించుకొంటున్నారు. ఈ లోకంలో ఏ ఒక్కడూ క్షణకాలం గూడా ఏ పనీ చేయకుండా ఉండలేడు. మనస్సుతో, మాటలతో, కర్మలతో మంచివి గాని చెడ్డవి గాని జరిగే పనులు, జన్మ, స్థితి, వినాశం, శరీర భేదాదులయిన కర్మలు ప్రాణుల్లో ఉన్నాయి. సోమం, ఘృతం, మున్నగు దృశ్యపదార్థాలు ఉపయోగించే కర్మమార్గాలను రాక్షసులు, దుర్జనులు నాశనం చేయటం చూసి, నేను వాటి మీద విరక్తి కలిగి, నాలోనే ఉన్న ఆత్మస్థానం కనుగొన్నాను.

ద్వంద్వ రహితమయిన పరమాత్మ విరాజిల్లే చోట, సోమం అగ్నితో నిత్యం కలిసేచోట, సర్వప్రాణులను ధరించి గంభీరమయిన సమీరం నిరంతరం వీచేచోట... బ్రహ్మాది దేవతలు, ఉత్తమవ్రతాలను అనుష్ఠించే శాంతచిత్తులు, జితేంద్రియులు అయిన విద్వాంసులు యోగయుక్తులయి అవినాశి అయిన ఆ పరబ్రహ్మను ఉపాసిస్తుంటారు. అవినాశి అయిన ఆ పరబ్రహ్మను ముక్కుతో వాసన చూడటం, జిహ్వాతో ఆస్వాదించటం, స్పర్శేంద్రియమయిన చర్మంతో స్పృశించటం వీలుగాదు. కేవలం బుద్ధితోనే ఆ తత్త్వం అనుభవైక వేద్యం అవుతుంది. అది కన్నులకు గ్రాహ్యంకాదు. వినికిడికి అతీతం. దానికి వాసనలేదు. రసం లేదు. స్పర్శ లేదు. రూపం లేదు. శబ్దం లేదు. ఇది ఆ తత్త్వ లక్షణం. దానివల్ల సృష్టి విస్తరిల్లుతుంది. అది దానిలోనే ఉంటుంది. ప్రాణం, అపానం, సమానం, వ్యానం, ఉదానం అనే పంచవాయువులు దానినుండియే ప్రవర్తిస్తాయి. దానిలోనే ప్రవేశిస్తాయి. సమాన వ్యాన వాయువుల మధ్య ప్రాణాపానవాయువులు సంచరిస్తాయి. అపానంతో గూడిన ప్రాణం లీనమయినప్పుడు సమాన వ్యాన వాయువులు గూడా లీనం అవుతాయి. అపాన ప్రాణవాయువుల మధ్య ఉదానం సమస్తాన్ని వ్యాపించి ఉంటుంది. కాబట్టి నిద్రిస్తున్న పురుషుని ప్రాణాపానాలు వదలవు. ప్రాణాలకు ఆధారం కావటం వల్ల విద్వాంసులు దాన్ని ఉదానం అంటారు. ఇందువల్లనే బ్రహ్మవాదులు నాలో ఉండే తపస్సును నిశ్చయిస్తారు. పరస్పరం సహాయంగా ఉండేవి. సర్వ శరీరాల్లో సంచరించే ఆ అయిదు ప్రాణ వాయువుల మధ్యలో సమానవాయువుకు స్థానమయిన నాభి మండలంలో మధ్య ఉన్న వైశ్వానరాగ్ని సప్తరూపాల్లో ప్రకాశిస్తుంది. ముక్కు, నాలుక, కన్నులు, చర్మం, చెవి, మనస్సు, బుద్ధి అనే ఏడు వైశ్వానరాగ్నికి నాలుకలు అయి ఉన్నాయి. వాసన చూడదగిన గంధం, చూడదగిన రూపం, త్రాగదగిన రసం, స్పృశింపదగిన స్పర్శ, వినదగిన శబ్దం, మనస్సు ద్వారా మననం చేయదగినది, బుద్ధి ద్వారా తెలుసుకోదగిన విషయాలు అనే ఏడు ఆ వైశ్వానరాగ్నికి సమిధలు. వాసన చూసేవాడు, తినేవాడు, చూసేవాడు, స్పృశించేవాడు, శ్రోత, మననం

చేసేవాడు, తెలుసుకొనేవాడు - అనే ఏడుగురు నాలోని వైశ్వానరాగ్నికి ఉత్తమ ఋత్విక్కులు. సౌభాగ్యవతీ! వాసనచూడదగినది, త్రాగదగినది, చూడదగినది, తాకదగినది, వినదగినది, మననం చేయదగినది, తెలుసుకొనదగినది అయిన విషయం మీద దృష్టిపెట్టు. (వీటిని హవిస్సులని తెలుసుకో). ఏడుగురు హోతలు, ఏడు రూపాలయిన అగ్నులలో, ఏడు హవిస్సులను చక్కగా హవనం చేసి (అంటే విషయాలనుంచి ఆసక్తిని తొలగించి), విద్వాంసుడు తమ తన్మాత్రలకు మూలాలయిన శబ్దాది విషయాలను ఉత్పత్తి చేస్తాడు. పృథివి, ఆకాశం, వాయువు, అప్పులు (నీరు), (అయిదవది) జ్యోతి, మనస్సు, బుద్ధి అనే ఏడు యోనులు (మూలాలు) అని వ్యవహారం. వీటి సమస్తగుణాలు హవిస్సు రూపాలు. అగ్నినుంచి జనించిన ఆ గుణాలు బుద్ధి వృత్తిలో ప్రవేశిస్తాయి. అవి అంతఃకరణంలో సంస్కార రూపంగా ఉండి తమ యోనులలో (మూల కారణాలలో) జన్మిస్తాయి. అవి ప్రళయకాలంలో అంతఃకరణంలోనే అడ్డగింపబడతాయి. ప్రాణిసృష్టి సమయంలో అక్కడినుంచే గంధం కలుగుతుంది. అక్కడినుంచే రసం కలుగుతుంది. అక్కడినుంచే రూపం పుడుతుంది. అక్కడినుంచే స్పర్శ కలుగుతుంది. అక్కడినుంచే శబ్దం పుడుతుంది. అక్కడినుంచే సంశయం జనిస్తుంది. అక్కడినుంచే నిశ్చయాత్మక బుద్ధి కలుగుతుంది. ఇది సప్తవిధ జన్మ అని తెలుపుతారు. ఈ రీతిగా పురాతనులు శ్రుతిని అనుసరించి, ప్రాణాది రూపాలను గ్రహించారు. జ్ఞాత, జ్ఞానం, జ్ఞేయం అనే ఆహుతి త్రయంతో సమస్త లోకం పరిపూర్ణమయి ఉంది. ఈ సమస్తలోకాలు ఆత్మజ్యోతితో పరిపూర్ణాలయి ఉంటాయి.

21. బ్రాహ్మణగీత - 2. దశహోతృవిధానము.

బ్రాహ్మణుడు చెప్పాడు - అర్దాంగీ! ఈ విషయంలో పురాతనమయిన ఇతిహాసాన్ని పెద్దలు ఉదాహరిస్తున్నారు. దశహోతృ విధానం ఎలాంటిదో చెపుతాను. తెలుసుకో. చెవి, చర్మం, కన్నులు, నాలుక (వాక్కు), ముక్కు, కాళ్ళు; చేతులు, ఉపస్థ, గుదం అనే పది హోతలు. శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం, వాక్కు, క్రియ, గతి, వీర్యం, మూత్రవిసర్జన, మలవిసర్జనలు అనే పది హవిస్సులు. దిక్కులు, వాయువు, సూర్యుడు, చంద్రుడు, భూమి, అగ్ని, విష్ణువు, ఇంద్రుడు, ప్రజాపతి, మిత్రుడు అనే పది అగ్నులు. దశేంద్రియా లనే హోతలు, దశదేవత లనే అగ్నులలో దశ విషయా లనే హవిస్సులను - సమిధలను హోమం చేస్తున్నారు. (ఈ రీతిగా నాలోపల నిరంతరం యజ్ఞం జరుగుతుంటే నేను నిష్క్రియుడను ఎలాగవుతాను?). ఈ యజ్ఞంలో చిత్తమే స్రువం. పవిత్రమూ, ఉత్తమమూ

అయిన జ్ఞానమే ధనం. ఈ సమస్త జగత్తు మొదట విభక్తమయి ఉండేది అని వింటాం. తెలుసుకోవటంలోకి వచ్చే ఈ సమస్త జగత్తు చిత్తరూపమే. ఇది జ్ఞానం అంటే ప్రకాశాన్ని కోరుతుంది. వీర్యం వల్ల జనించే శరీర సముదాయంలో ఉండే శరీరధారి జీవుడు దాన్ని తెలుసుకొనేవాడే తాను. ఈ శరీరాభిమాని అయిన జీవుడు గార్హపత్యాగ్ని. దానిలో నుంచి వ్యక్తమయ్యే రెండవ అగ్ని మనస్సు. మనస్సు ఆహవనీయాగ్ని. దానిలో వెనుక చెప్పిన హవిస్సును వేస్తారు. దానినుండి వాచస్పతి (వేదవాక్కు) కలుగుతుంది. దాన్ని మనస్సు చూస్తుంది. మనస్సు తరువాత రూపం ఆవిర్భవిస్తుంది. అది నీలపీతాది వర్ణరహితం అవుతుంది. ఆ రూపం మనస్సువైపు పరుగెత్తుతుంది.

బ్రాహ్మణస్త్రీ అడిగింది – స్వామీ! ఏ కారణం వల్ల వాక్కు మొదట పుట్టింది ? తరువాత మనస్సు ఎందుకు పుట్టింది? మనస్సు ఆలోచించిన తరువాతనే వాక్కు లోక వ్యవహారంలోకి వస్తుంది గదా! ఏ విజ్ఞాన ప్రభావంతో మనస్సు చిత్రాన్ని ఆశ్రయిస్తుంది? దాన్నిపైకి పంపిన తరువాత కూడా విషయాలవైపు ఎందుకు పోదు? దాని త్రోవలో కలిగే ఆటంకం ఏమిటి ? బ్రాహ్మణుడు చెప్పాడు. అపానం పతి అయి ఆ మతిని అపానభావం వైపు తీసుకుపోతుంది. ఆ అపాన భావప్రాప్తి మనోగతి అంటారు. కాబట్టి మనస్సు దాన్ని అపేక్షిస్తుంది. నీవు వాక్కు మనస్సులను గురించే నన్ను అడుగుతున్నావు గదా! కాబట్టి నీకు ఆ రెండింటి సంవాదాన్ని చెపుతాను. వాక్కు, మనస్సు రెండూ జీవాత్మ వద్దకు వెళ్ళి, "ప్రభూ! మా ఇద్దరిలో శ్రేష్ఠులు ఎవరో చెప్పి మా సందేహం పోగొట్టు" అని అడిగాయి. అప్పుడు భగవానుడైన ఆత్మ 'మనస్సే శ్రేష్ఠమయినది అని చెప్పింది. అది విని, సరస్వతి నేను కామధేనువునై నీకు సమస్తం ఇస్తాను'. అన్నది. ఈ రీతిగా వాక్కు స్వయంగా తన శ్రేష్ఠతను చెప్పుకొన్నది. బ్రాహ్మణుడు చెప్పాడు – ప్రియా! స్థావరజంగమాలు రెండూ నా మనస్సు. స్థావరం అంటే బాహ్యేంద్రియాలతో ఈ జగత్తు నా సమీపంలోనే ఉంది. జంగమం అంటే ఇంద్రియాతీతమయిన స్వర్గాదికం నీ అధికారంలో ఉంది. మంత్ర, వర్ణ, స్వరాలు ఆ అలౌకిక విషయాన్ని ప్రకాశింపజేస్తాయి. వాటిని అనుసరించే మనస్సుకూడా జంగమ మనే పేరు ఉంది. వాక్కు స్వరూపమయిన నీ ద్వారానే మనస్సుకు ఆ అతీంద్రియ జగత్తులో ప్రవేశం కలుగుతుంది. కాబట్టి నీవు మనస్సుకన్నా శ్రేష్ఠురాలవు. గౌరవశాలినివి. శోభామయీ! సరస్వతీ! నీవు స్వయంగానే దగ్గరకు వచ్చి సమాధానం అంటే నీ పక్షాన్ని బలపరచుకొన్నావు. కాబట్టి నేను ఊపిరిపీల్చుకొని నీకు చెపుతాను. సౌభాగ్యవతీ! ప్రాణాపానాలమధ్యలో వాగ్దేవి నిరంతరం ఉంటుంది. ఆమె ప్రాణ వాయువు

సహాయంలేక నిమ్న దశను పొందినప్పుడు ప్రజాపతివద్దకు పరుగెత్తి 'భగవానుడా! ప్రసన్నుడివి కావలసింది!' అని కోరింది. అప్పుడు వాక్కును పరిపుష్టం చేస్తూ మళ్ళీ ప్రాణం ఆవిర్భవించింది. ఇందువల్ల ఉచ్ఛ్వాస తీసుకొనేటప్పుడు వాక్కు ఎలాంటి శబ్దం చేయదు. వాక్కు రెండు విధాలు. ఒకటి ఘోష యుక్తం (స్పష్టంగా వినిపించేది). రెండోది ఘోషరహితం. ఆది అన్నిస్థితులలో ఎప్పుడూ ఉండేది. ఈ రెండింటిలో ఘోషయుక్తవాక్కుకంటే ఘోష రహితం శ్రేష్ఠతమం. ఘోషయుక్తవాక్కుకు ప్రాణశక్తి కావాలి. ఘోషరహితవాక్కుకు అది అవసరం లేకుండానే సహజంగా ఉచ్చరితం అవుతుంది. ఘోషయుక్తమయిన (వైదిక) వాక్కు గూడా ఉత్తమగుణ శోభిత అయి ఉంటుంది. అది పాలిచ్చే గోవులాగా మానవులకు నిరంతరం ఉత్తమరసాన్ని కురిపిస్తూ కావలసిన పదార్థాలను ఉత్పత్తి చేస్తుంది. పరబ్రహ్మను ప్రతిపాదించే ఉపనిషద్వాక్కు శాశ్వత బ్రహ్మను బోధిస్తుంది. ఈ రకంగా వాగ్రూపమయిన గోవు దివ్యాదివ్య ప్రభావయుక్తం. రెండూ సూక్ష్మ మయినవే. అభీష్ట పదార్థాలను ఇచ్చేవే. ఈ రెండింటిమధ్య ఏమితేడా ఉందో స్వయంగా చూడు.' బ్రాహ్మణస్త్రీ అడిగింది. 'నాధా ! వాక్కు ఉత్పన్నం కానప్పుడు ఏదో చెప్పాలనే కోరికతో ప్రేరితమయిన సరస్వతీదేవి మొదట ఏమి చెప్పింది ?' బ్రాహ్మణుడు చెప్పాడు - 'ప్రియా! ఆ వాక్కు ప్రాణం ద్వారా శరీరంలో వ్యక్తమవుతుంది. తరువాత ప్రాణం నుంచి అపానత్వం పొందుతుంది. తరువాత ఉదాన రూపమయి శరీరాన్ని వదలి వ్యానరూపంతో సంపూర్ణమయిన ఆకాశాన్ని వ్యాపిస్తుంది.* ఈ రీతిగా వాణి మొదట తన ఉత్పత్తిని చెప్పింది. కాబట్టి స్థావరం కావటం వల్ల మనస్సు శ్రేష్ఠం. జంగమంకావటం చేత వాగ్దేవి విశిష్టమయింది.'

22. బ్రాహ్మణగీత - 3. సప్తహోతృవిధానము.

బ్రాహ్మణుడు చెప్పాడు - 'సౌభాగ్యవతీ ! ఈ విషయంలో ఈ పురాతనమయిన ఇతిహాసాన్ని ఉదాహరిస్తారు. సప్తహోతల యజ్ఞ విధానం ఎలాంటిదో విను. ముక్కు, కన్ను, నాలుక, చర్మం, చెవి, మనస్సు, బుద్ధి అనే ఏడుగురుహోతలు విడివిడిగానే

* దీని సారాంశాన్ని ఇలా తెలుసుకోవాలి. మొదట ఆత్మ మనస్సును ఉచ్చారణ చేయటానికి ప్రేరేపిస్తుంది. అప్పుడు మనస్సు జఠరాగ్నిని ప్రజ్వలింపచేస్తుంది. ప్రజ్వలిత జఠరాగ్ని ప్రభావం వల్ల ప్రాణవాయువు అపానవాయువుతో కలుస్తుంది. తరువాత ఆ వాయువు ఉదాన వాయువు ప్రభావంతో పైకి లేచి మస్తకానికి తగులుతుంది వ్యానవాయువు లేకపోవటం వల్ల కంఠతాల్వాదిస్థానాల నుంచి వేగంగా వచ్చి వరాలను ఉత్పన్నం చేస్తూ వైఖరీ రూపంతో మానవునిచెవిలో ప్రకాశిస్తుంది. ప్రాణవాయువేగం తగ్గినప్పుడు అది సమానభావంతో సంచరిస్తుంది.

ఉంటారు. ఇవి అన్నీ సూక్ష్మ శరీరంలోనే ఉన్నా ఒకదానిని ఒకటి చూడవు. కల్యాణీ! ఈ సప్తహోతలను సహజంగానే తెలుసుకో.' బ్రాహ్మణి అడిగింది. 'మహాత్మా! ప్రభూ! ఇవి అన్నీ సూక్ష్మశరీరంలోనే ఉన్నా ఒకదానిని ఇంకొకటి ఎందుకు చూడవు ? వాటి స్వభావం ఏమిటి? ఇవన్నీ నాకు చెప్పండి.' బ్రాహ్మణుడు చెప్పాడు - '(ఇక్కడ చూడటం అంటే తెలుసుకోవటం) గుణాలు తెలియకపోవటం అంటే గుణవంతుని తెలుసుకొనటం.. ఈ నాసికాది సప్తహోతలు ఒకరి గుణాలను ఇంకొకరు ఎరుగరు. (దీన్నే ఒకరినొకరు చూడరని చెప్పారు) నాలుక, కన్నులు, చెవులు, వాక్కు, మనస్సు, బుద్ధులకు వాసన తెలియదు. ముక్కు దాన్ని తెలుసుకొంటుంది. ముక్కు, కన్నులు, చెవులు, చర్మం, మనస్సు, బుద్ధి రసాలను తెలుసుకోలేవు. నాలుకకు రసాలు తెలుస్తాయి. ముక్కు, నాలుక, చెవులు, వాక్కు, మనస్సు, బుద్ధులకు రూపం తెలియదు. కన్ను దాన్ని తెలుసుకొంటుంది. ముక్కు, నాలుక, కన్ను, చెవి, బుద్ధి, మనస్సులకు స్పర్శ తెలియదు. చర్మానికి స్పర్శలు తెలుస్తాయి. ముక్కు, నాలుక, కన్ను, వాక్కు, మనస్సు, బుద్ధులకు శబ్దాలు తెలియవు. చెవి తెలుసుకొంటుంది. ముక్కు, నాలుక, కన్ను, చర్మం, చెవి, బుద్ధులు సంశయాన్ని పొందవు. మనస్సు దాన్ని పొందుతుంది. ముక్కు, నాలుక, కన్ను, చర్మం చెవి, మనస్సులు ఏ విషయాన్ని నిశ్చయించలేవు. బుద్ధి నిశ్చయిస్తుంది.

కాంతా! ఈ విషయంలో ప్రాచీనమయిన ఈ ఇతిహాసాన్ని పెద్దలు ఉదహరిస్తారు. అది ఇంద్రియాలకు మనస్సుకు కలిగిన సంభాషణం. మనస్సు చెప్పింది - నా సహాయం లేకపోతే ముక్కు వాసన చూడలేదు. నాలుక రుచిని ఎరుగలేదు. కన్నులు రూపాన్ని గ్రహించలేవు. చర్మానికి స్పర్శ తెలియదు. చెవికి నేను లేకపోతే శబ్దం తెలియదు. కాబట్టి అన్ని ఇంద్రియాలకంటే సనాతనమయిన నేనే శ్రేష్ఠమయినదానిని. నేను లేకపోతే ఇంద్రియాలు శూన్యగృహాలవలె మంటలు చల్లారిన అగ్నులవలె ఎన్నడూ ప్రకాశించలేవు. ప్రపంచంలోని సమస్త జీవులు ప్రయత్నం చేస్తూ కూడా తడిసిన ఎండు పుల్లలవలె విషయాలను అనుభవించలేవు. ఇంద్రియాలు అన్నవి - మా సహాయం లేకుండా నీవు గంధాది విషయాలను అనుభవించగలిగితే నీ మాట నిజమని ఒప్పుకొంటాము. మేము లయమయిన తరువాత గూడా నీవు తృప్తిగా ఉండగలిగితే, జీవితాన్ని ధరించగలిగితే, అన్నిభోగాలు అనుభవించగలిగితే నీవు చెప్పింది నిజం అవుతుంది. లేక ఇంద్రియాలమయిన మేము లీనమయినా, విషయాల్లో స్థిరంగా ఉన్నా నీవు నీ సంకల్పంతో విషయాల యథార్థానుభవం పొందే శక్తి ఉంటే ఇలా చేయటంలో నీకు ఎల్లప్పుడు సాఫల్యం కలుగుతుంటే

ముక్కుతో రూపాన్ని అనుభవించు. కన్నులతో రసాన్ని రుచి చూడు. కన్నుతో వాసన చూడు. ఇలాగే నీ శక్తితో నాలుకతో స్పర్శను, చర్మంతో శబ్దాన్ని విను. బుద్ధితో స్పర్శను అనుభవించు. నీవంటి బలవంతులకు నియమాలనే బంధనాలు ఉండవు. దుర్బలులకు మాత్రమే నియమాలు ఉంటాయి. నీవు కొత్తరీతిలో కొత్త భాగాలను అనుభవించు. మా ఎంగిలి తినటం నీకు తగదు. శిష్యుడు వేదార్థం తెలుసుకోవటానికి ఉపదేశించే గురువు వద్దకు వెళ్తాడు. ఆయన వద్ద వేదార్థాన్ని అభ్యసించి తాను దాన్ని స్వయంగా చింతనచేసి, అనుభవం లోకి తెచ్చుకొంటాడు. అలాగే నీవు నిద్రించేటప్పుడు మేలుకొన్నప్పుడు మేము చూపే విషయాలనే అనుభవిస్తుంటావు. మనోరహితులు, మందబుద్ధులయిన ప్రాణులలో గూడా మాకోసమే పనులు చేస్తే ప్రాణధారణం ఉండటం కన్పిస్తుంది. అనేక సంకల్పాలను మననం చేయటంతో, స్వప్నాలను ఆశ్రయించి భోగాలను అనుభవించాలనే కోరికతో ప్రాణి విషయాలవైపే పరుగులు తీస్తుంటుంది. విషయ వాసనలను అనుసరించి, సంకల్పం వల్ల కలిగిన భోగాలను అనుభవించి, ప్రాణశక్తి క్షీణించగా తలుపులు లేని ఇంటిలో చొరబడిన మానవునివలె, సమిధలు కాలిపోగా అగ్ని చల్లారినట్లు మానవుడు శాంతిస్తాడు. మాకు మా మా గుణాల మీద ఆసక్తి ఉండుగాక ! ఇతరేంద్రియ గుణాలు మాకు పరస్పరం తెలియకుండుగాక ! కాని ఒకటి మాత్రం నిజం. నీవు మా సహాయం లేకుండా ఏ విషయాన్నీ అనుభవించలేవు. నీవులేకపోతే కేవలం మాకు హర్షం మాత్రం ఉండదు.'

23. బ్రాహ్మణగీత - 4. పంచహోతృవిధానము.

బ్రాహ్మణుడు చెప్పాడు - 'ప్రియా! పంచహోతల యజ్ఞవిధాన విషయంలో ఒక ప్రాచీనమయిన ఇతిహాసాన్ని దృష్టాంతంగా చెపుతారు. ప్రాణం, అపానం, ఉదానం, సమానం, వ్యానం అనే అయిదు పంచహోతలు. విద్వాంసులు వీటిని సర్వశ్రేష్ఠాలు అంటారు.' బ్రాహ్మణస్త్రీ అడిగింది - 'నాధా ! ఇంతకుముందు నేను సహజంగా సప్తహోతలు అని అనుకొనేదాన్ని. కాని ఇప్పుడు మీరు చెపుతుంటే పంచహోతలని తెలుస్తున్నది. పంచహోతలు ఏ విధంగా అవుతారు? వీని శ్రేష్ఠతను వివరించండి.'

బ్రాహ్మణుడు చెప్పాడు - 'ప్రియా! వాయువు ప్రాణంతో పరిపుష్టమయి అపాన రూపాన్ని, అపానంతో పుష్టమయి వ్యానరూపాన్ని, వ్యానంతో పరిపుష్టమయి ఉదాన రూపాన్ని ఉదానంతో పరిపుష్టమయి సమాన రూపాన్ని పొందుతుంది. ఒకప్పుడు ఈ పంచ వాయువులు తమ కంటె ముందు జన్మించిన పితామహుని ఇలా ప్రశ్నించాయి.

'దేవా! మాలో శ్రేష్ఠమయిన వాని పేరు చెప్పండి. అతడే మాలో ప్రబలుడు అవుతాడు.' బ్రహ్మచెప్పాడు - 'ప్రాణధారుల శరీరంలో ఉండే మీలో ఎవరు లయమయితే సర్వప్రాణాలు లీనమవుతాయో, ఏది సంచరిస్తే అన్నీ సంచరిస్తాయో అదే శ్రేష్ఠం అవుతుంది. ఇప్పుడు మీకు ఇష్టమయిన చోటికి వెళ్ళండి.' ఇది విని ప్రాణం అపానాదులతో ఇలా అన్నది. 'నేను లీనమయితే ప్రాణులలో ఉండే సమస్త ప్రాణాలు లీనం అవుతాయి. నేను సంచారం సాగిస్తే అన్నీ మళ్ళీ సంచరిస్తాయి. చూడండి ఇప్పుడు నేను లీనం అవుతున్నాను. (కాబట్టి మీరు గూడా లయం అవుతారు.)' ప్రాణం కొంతసేపు లీనం అయింది. తరువాత మళ్ళీ సంచరించసాగింది. కల్యాణీ! అప్పుడు సమానోదానాలు ఇలా అన్నాయి. 'ప్రాణమా! మేము ఈ శరీరంలో వ్యాపించి ఉన్నట్లే నీవు ఈ శరీరంలో వ్యాపించి ఉండలేదు. కాబట్టి నీవు మాకంటె గొప్పవాడివి కావు. కేవలం అపానం మాత్రం నీవశమయి ఉంది. (కాబట్టి నీవు లయంకావటం వల్ల మాకు ఎలాంటి హాని లేదు).' అప్పుడు ప్రాణం వెనకటిలాగానే సంచరించసాగింది. దానితో అపానం ఇలా అన్నది. 'నేను లీనమయితే ప్రాణిలో ఉండే సర్వప్రాణాలు లీనం అవుతాయి. నేను సంచరిస్తే అన్నీ సంచరిస్తాయి. కాబట్టి నేను శ్రేష్ఠాన్ని, చూడండి. ఇప్పుడు నేను లీనం అవుతున్నాను. (కాబట్టి మీరు గూడా లయం అవుతారు)' ఇలా మాట్లాడుతున్న అపానంతో వ్యానోదానాలు ఇలా అన్నాయి. 'అపానా! నీవు శ్రేష్ఠం కావు. ప్రాణం నీకు వశమయి ఉంది.' అంతట అపానం సంచరించ సాగింది. వ్యానం దానితో ఇలా అంది. 'అన్నిటికంటె నేను ఏ కారణం వల్ల శ్రేష్ఠమవుతానో చెపుతా, వినండి. నేను లయమయితే ప్రాణధారుల శరీరంలో ఉండే అన్ని ప్రాణాలు లయమవుతాయి. నేను సంచరించసాగితే అన్నీ సంచరిస్తాయి. కాబట్టి నేను శ్రేష్ఠాన్ని నేను అదృశ్యం అవుతున్నాను చూడండి.' తరువాత వ్యానం కొంతసేపు లీనం అయింది. తరువాత మళ్ళీ సంచరించసాగింది. ప్రాణా పానోదాన సమానాలు దానితో ఇలా అన్నాయి. 'వ్యానా! నీవు శ్రేష్ఠానివి కావు. సమానం నీ వశంలో ఉంది.' మళ్ళీ వ్యానం సంచరించసాగింది. సమానం ఇలా అన్నది. 'అన్నింటికన్నా నేను ఏ కారణం చేత శ్రేష్ఠాన్నో చెపుతాను. వినండి. నేను లయ మయితే అన్ని ప్రాణాలు లయం అవుతాయి. నేను సంచరించ సాగితే అన్నీ మళ్ళీ సంచరిస్తాయి. కాబట్టి నేను శ్రేష్ఠమయిన దాన్ని, చూడండి. ఇదిగో నేను లీనం అవుతున్నాను.'

తరువాత సమాన వాయువు లీనం అయింది. మళ్ళీ కొంతసేపయిన తరువాత సంచరించసాగింది. అప్పుడు ప్రాణాపానోదాన వ్యానాలు దానితో ఇలా అన్నాయి. 'సమానా! నీవు

శ్లేష్మానివి కావు. వ్యానం నీ శరీరంలో ఉంది.'

తరువాత సమానం సంచరించసాగింది. ఉదానం దానితో ఇలా అంది. 'నేను అన్ని వాయువుల కంటే శ్లేష్మాన్ని ఎందుకయ్యానో వినండి. నేను అదృశ్యమయితే ప్రాణధారుల శరీరాల్లో ఉండే ప్రాణాలన్నీ లయమవుతాయి. నేను సంచరిస్తే అన్నీ మళ్ళీ సంచరిస్తాయి. కాబట్టి నేనే శ్లేష్మాన్ని లయమవుతున్నాను చూడండి.' తరువాత ఉదానం కొంతసేపు లీనమయి మళ్ళీ సంచరించసాగింది. అప్పుడు ప్రాణాపాన సమాన వ్యానాలు దానితో ఇలా అన్నాయి. 'ఉదానా! నీవు శ్లేష్మానివి కావు. వ్యానం మాత్రమే నీ వశంలో ఉంది.' బ్రాహ్మణుడు చెప్పాడు - తరువాత ఆ ప్రాణాదులు అన్నీ బ్రహ్మ దగ్గరకు చేరాయి. అప్పుడు ప్రజాపతి బ్రహ్మ అన్నాడు. 'వాయు సమూహమా! మీరు అందరు శ్రేష్ములే లేక మీలో ఎవ్వరూ శ్రేష్ములు కారు. మీ అందరి ధారణ రూపమయిన ధర్మం పరస్పరం ఆధారపడి ఉంటుంది. మీరు అందరూ మీ మీ స్థానాల్లో శ్రేష్ములు, అందరి ధర్మం పరస్పరాలంబం కలది.' ఈ రీతిగా అక్కడ కూడిఉన్న అన్ని ప్రాణాలతో ప్రజాపతి అన్నాడు. 'ఒకే వాయువు స్థిరరూపంతో, అస్థిర రూపంతో విరాజిల్లుతున్నది. దాని విశేష భేదాలతో అయిదు వాయువులు అవుతాయి. ఈ రీతిగానే ఒకటే అయిన నా ఆత్మ అనేక రూపాలతో వృద్ధినందుతుంది. మీకు మేలు కలుగుగాక. మీరు క్షేమంగా వెళ్ళండి. పరస్పరం హితైషులు అయి ఉండి. పరస్పరోన్నతిలో సహాయం చేసుకొంటూ ఒకరిని ఒకరు ధరిస్తూ ఉండండి.'

24. బ్రాహ్మణగీత - 5.

బ్రాహ్మణుడు చెప్పాడు - 'ఈ విషయంలో ఋషి అయిన దేవమతునికి, నారదునికి జరిగిన సంవాద రూపమైన పురాతనమయిన ఇతిహాసాన్ని ఉదాహరిస్తారు. దేవమతుడు అడిగాడు - 'నారదమహర్షీ! జీవుడు జన్మించేటప్పుడు అన్నింటికంటే ముందు వాని శరీరంలో ప్రాణం, అపానం, సమానం, వ్యానం, ఉదానం అనే వాటిల్లో ఏది మొదట ప్రవర్తిస్తుంది ?' నారదుడు చెప్పాడు - 'మునీంద్రా! ఏ నిమిత్త కారణంతో ఈ జీవుని ఉత్పత్తి జరుగుతుందో దానికంటె భిన్నమయిన ఇంకొక పదార్థం గూడా కారణరూపంగా కలుగుతుంది. అది ప్రాణ ద్వంద్వం. అది పైన ఉన్న దేవలోకంలో, తిర్యక్కు (మనుష్య లోకం) లో, అధోలోకం (పశ్వాదుల) లో వ్యాప్తమవుతుంది.' దేవమతుడు అడిగాడు - 'ఏ నిమిత్త కారణం వల్ల ఈజీవ సృష్టి అవుతుంది? ఏ పదార్థం మొదట కారణ

రూపంగా నిలుస్తుంది ? ప్రాణ ద్వంద్వం అంటే ఏమిటి? అది ఎందుకు పైన, మధ్య, కింద వ్యాప్తమయి ఉంటుంది?'

నారదుడు చెప్పాడు - 'హర్షం సంకల్పం వల్ల కలుగుతుంది. ఇష్టమయిన శబ్దం వింటే కలుగుతుంది. రసం వల్ల, రూపం వల్ల కూడా కలుగుతుంది. రజస్సుతో కలిసిన వీర్యంవల్ల మొదట ప్రాణంవచ్చి కార్యం ఆరంభిస్తుంది. ఆ ప్రాణం వల్ల వీర్యంలో వికృతి కలుగగా అపానం ప్రవృత్తం అవుతుంది. శుక్ర రసాల వల్ల కూడా హర్షం కలుగుతుంది. ఈ హర్షమే ఉదానరూపం. కారణ కార్యరూపమయిన ద్వంద్వం మధ్య హర్షం వ్యాపించి ఉంటుంది. ప్రవృత్తికి మూలమయిన కామం వల్ల వీర్యం ఉత్పన్నం అవుతుంది. దానివల్ల రజస్సు ఉత్పన్నం అవుతుంది. ఆ వీర్యరజస్సులు రెండు సమాన వ్యానాలవల్ల ఉత్పన్నాలవుతాయి. కాబట్టి వాటిని సామాన్యం అంటారు. ప్రాణాపానాలు రెంటిని ద్వంద్వం అంటారు. ఇవి క్రిందికి పైకి పోతుంటాయి. వ్యాన సమానాలు రెండింటిని మధ్యగాములయిన ద్వంద్వం అంటారు. అగ్ని అంటే పరమాత్మయే. సమస్త దేవతారూపం. ఈ వేదం ఆ పరమాత్మ ఆజ్ఞా రూపం. ఆ వేదం వల్లనే బ్రాహ్మణునిలో బుద్ధియుక్తమయిన జ్ఞానం కలుగుతుంది. ఆ అగ్నిధూమం తమోరూపం కాగా భస్మం రజోరూపం అవుతుంది. మనం హవిస్సు వేసే అగ్నివల్ల (ప్రకాశరూపుడయిన పరమేశ్వరుని వల్ల) ఈ సమస్త జగత్తు ఉద్భవిస్తుంది. సమాన వ్యానాలు సత్త్వగుణం వల్ల కలుగుతాయని యజ్ఞవేత్తలకు తెలుసు. ప్రాణాపానాలు ఆజ్యభాగం అనే రెండు ఆహుతులతో సమానం అవుతాయి అగ్ని ఆ రెంటికి మధ్య ఉంటుంది. ఇదే ఉదాన వాయువు ఉత్కృష్టరూపం అని బ్రాహ్మణులకు తెలుసు. నిర్ద్వంద్వం అని దేన్ని అంటారో చెపుతా విను. ఈ రేయింబవళ్ళు ద్వంద్వం. వాని మధ్యలో అగ్ని ఉన్నాడు. బ్రాహ్మణులు ఈ ఉదాన వాయువు ఉత్కృష్ట రూపం అని భావిస్తారు. సత్తు - అసత్తు అనే రెండు ద్వంద్వం. వాని మధ్యలో అగ్ని ఉంది. ఇది ఉదాన వాయువు ఉత్కృష్ట రూపమని బ్రాహ్మణులు తలుస్తారు. ఊర్ధ్వం - అంటే బ్రహ్మ సంకల్పం అనే హేతువుచేత సమాన వ్యానాలు అవుతాడు. దాని వల్లనే కర్మ విస్తారం అవుతుంది. కాబట్టి సంకల్పాలను అరికట్టాలి. జాగ్రత్స్వప్నాలకంటే ఇతరమయిన తృతీయావస్థ వల్ల ఉపలక్షితమయ్యే బ్రహ్మ సమానంతోనే నిశ్చితం అవుతుంది. వ్యానం ఒకటే శాంతి ప్రదాయకం. శాంతి సనాతన బ్రహ్మం. బ్రాహ్మణులు దీన్నే ఉదాన పరమోత్కృష్టరూపంగా భావిస్తారు.'

25. బ్రాహ్మణగీత - 6. చాతుర్హోత్ర విధానము.

బ్రాహ్మణుడు చెప్పాడు - 'చాతుర్హోత్ర విధానం పద్ధతి ఎలాంటిదో చెప్పే ఒక పురాతనమయిన ఇతిహాసాన్ని ఈ విషయంలో ఉదాహరిస్తారు. సౌభాగ్యవతీ! అది అంతా యథావిధిగాచేసే విధానం ఉపదేశిస్తాను. రహస్యం, అద్భుతమయిన ఇది చెపుతాను విను. సాధనం, కర్మ, కర్త, మోక్షం అనే నాలుగు హోతలు. ఆ నలుగురి చేత ఈ జగత్తు అంతా ఆవృతమయి ఉన్నది. వీటికి హేతువులను యుక్తితో నిర్ణయిస్తారు. ఇది అంతా పూర్తిగా విను. ముక్కు, నాలుక, కన్ను, చర్మం, చెవి, మనస్సు, బుద్ధి అనే ఏడు కారణ రూపమయిన హేతువులు గుణమయాలు. గంధం, రసం, రూపం, శబ్దం, స్పర్శ, మంతవ్యం, బోద్ధవ్యం అనే ఏడు విషయాలు కర్మ రూపహేతువులు. వాసన చూసేవాడు, తినేవాడు, చూసేవాడు, వినేవాడు, మననం చేసేవాడు, నిశ్చయాత్మక బోధపొందేవాడు. ఈ ఏడుగురు కర్త రూపమయిన హేతువులు. ఈ ప్రాణాదులయిన ఇంద్రియాలు గుణవంతాలు, కాబట్టి తమతమ శుభాశుభాలయిన విషయ రూపగుణాలను అనుభవిస్తాయి. నేను నిర్గుణుడను, అనంతుడను. (వీనితో నాకు ఎలాంటి సంబంధం లేదు అని తెలుసుకున్న తరువాత) ఘ్రాణాదులయిన ఈ ఏడు మోక్షహేతువు లవుతాయి. విభిన్న విషయాలను అనుభవించే విద్వాంసుల ఘ్రాణాదులు తమతమ స్థానాలను ఎరిగి ఉంటాయి. అవి దేవతా రూపాలయి ఎల్లప్పుడు హవిస్సును భుజిస్తాయి. అజ్ఞాని అయినవాడు ఆహారం తినేటప్పుడు వాటి యందు మమకారం కలిగి ఉంటాడు. ఈ రీతిగా తనకొరకే వండుకొనేవాడు మమకార దోషంచేత హతుడవుతాడు. అతడు తినగూడనివి తినటం, మద్యపానం లాంటి దుర్వ్యసనాలకు లొంగుతాడు. అవే అతన్ని చంపుతాయి. అతడు తినటంతో అన్నాన్ని హత్య చేస్తాడు. దాన్ని హతం చేసి తాను దానిచేత హతుడు అవుతాడు. ఈ అన్నం తినేవాడు - అంటే అన్నం చేత సూచితమయ్యే సమస్త ప్రపంచాన్ని తనలో లీనం చేసుకొనేవాడు ఈశ్వరుడు. సర్వసమర్థుడయి మళ్ళీ అన్నాదులు పుట్టించేవాడవుతాడు. ఆ అన్నం వల్ల ఆ విద్వాంసునిలో సూక్ష్మాతి సూక్ష్మమయినదోషం కూడా కలుగదు. మనస్సుతో తెలుసుకొనేది, మాటలతో చెప్పేది, చెవితో వినేది, కంటితో చూచేది చర్మంతో స్పృశించేది, ముక్కుతో వాసన చూచేది, మంతవ్యాదులయిన ఈ ఆరు విషయా లనే హవిస్సులను మనస్సు మొదలయిన ఆరు ఇంద్రియాలను సంయమనంతో వాటిలో వాటినే హోమం చేయాలి. ఆ హోమానికి అధిష్ఠానమయిన గుణవంతుడు పానక రూపు డయిన పరమాత్మ నా శరీర మనస్సులలో ప్రకాశిస్తున్నాడు. నేను యోగమనే యజ్ఞానుష్ఠాన్ని

ఆరంభించాను. ఈ యజ్ఞోత్పత్తి జ్ఞానం అనే అగ్నిని ప్రకాశింపజేసేది. దానిలో ప్రాణమే స్తోత్రం. అపానం, శస్త్రం, సర్వస్వత్యాగమే ఉత్తమ దక్షిణ అవుతాయి. కర్త (అహంకారం), అనుమంత (మనస్సు), ఆత్మ (బుద్ధి) అనే మూడు బ్రహ్మరూపమయి క్రమంగా హోత, అధ్వర్యుడు, ఉద్గాతలవుతారు. సత్యం పలకటమే ప్రశస్త శాస్త్రం. అపవర్గం (మోక్షం) ఈ యజ్ఞానికి దక్షిణ. నారాయణుని తెలిసికొన్నవారు ఈ యోగ యజ్ఞానికి ప్రమాణాలనుగా ఋక్కులను కూడా ఉదహరిస్తారు. పూర్వకాలంలో భగవన్నారాయణ ప్రాప్తికి భక్తులు ఇంద్రియా లనే పశువులను తమ అధీనం చేసుకొన్నారు. భగవత్ప్రాప్తి కలిగిన తరువాత పరమానంద పరిపూర్ణులయిన సిద్ధులు చేసే సామగానానికి దృష్టాంతం తైత్తిరీయోప నిషత్తులోని 'ఏతత్సామగాయన్నాస్తే,' మొదలయిన మంత్రాన్ని చెపుతారు. నీవు సర్వాత్మకుడయిన నారాయణ జ్ఞానం పొందు.'

26. బ్రాహ్మణగీత - 7.

బ్రాహ్మణుడు చెప్పాడు - 'జగత్తును శాసించే వాడు ఒక్కడే ఉన్నాడు. వేరొక శాసకుడు లేడు. హృదయంలో ఉండే ఆ పరమాత్మను గురించే చెపుతున్నాను. నీరు ఏటవాలుగా ఉన్నచోటి నించి క్రిందికి ప్రవహించినట్లు ఆ పరమాత్మప్రేరణ నన్ను నియోగించే పనినే చేస్తాను. గురువు ఒక్కడే ఉన్నాడు. ఇంకొకడు లేడు. హృదయంలో ఉండే ఆ పరమాత్మను గురించే చెపుతున్నాను. ఎల్లవేళలా ఆ గురువు శాసనాన్ని అనుసరించే దానవులందరూ పరాజయం పాలయ్యారు. ఆ పరమాత్మ ఒక్కడే బంధువు. రెండోవాడు లేడు. హృదయంలో ఉండే ఆయనను గురించే చెపుతున్నాను. ఆయన ఉపదేశం వల్లనే బంధువులు బంధు సమూహం గలవారవుతారు. సప్తర్షులు గూడా ఆకాశంలో వెలుగుతున్నారు. శ్రోత ఒక్కడే ఉన్నాడు. రెండో వాడు లేడు. హృదయంలో ఉండే ఆశ్రోతను గురించే చెపుతున్నాను. ఇంద్రుడు ఆయననే గురువును చేసుకొని గురుకుల వాసం చేశాడు. అంటే శిష్యభావంతో ఆయన అంతర్యామినే శరణందాడు. అందువల్లనే ఆయన సర్వ లోకాధిపతి, అమరుడు అయ్యాడు. శత్రువు ఒక్కడే ఉన్నాడు. ఇంకొకడు లేడు. హృదయంలో ఉండే ఆ పరమాత్మనే నేను గురువని చెపుతున్నాను. గురువయిన ఆయన ప్రేరణతోనే ప్రపంచంలోని సర్పాలన్నీ ద్వేషంతో ఉంటున్నాయి. పూర్వకాలంలో సర్పాలకు, దేవతలకు, ఋషులకు, బ్రహ్మదేవునితో జరిగిన సంవాదాన్ని ప్రాచీనమయిన ఇతిహాసంగా ఈ విషయంలో ఉదాహరిస్తుంటారు. దేవతలు, ఋషులు, సర్పాలు, అసురులు ప్రజాపతిని సేవిస్తూ

'మాకు మేలు చేసేదాన్ని చెప్ప'మని అడిగారు. ఆ రీతిగా తమకు శ్రేయస్సు కలిగేది చెప్పమని అడిగిన వారికి బ్రహ్మదేవుడు పరబ్రహ్మ రూపమై, ఏకాక్షరమయిన ఓంకారాన్ని పలికాడు. అదివిని వారందరు తమతమ దిక్కులకు తమ నివాసాలకు పరుగుతీశారు. తరువాత వారు తమకు ఉపదేశించిన దాన్ని తలకొకరీతిగా అర్థం చేసుకున్నారు. వారిలో మొదట సర్పాలకు కాటు వెయ్యాలి అనే భావం మనస్సులో కలిగింది. అసురులకు సహజమయిన దంభం - కపటం మోసం అనే భావం కలిగింది. దేవతలు దానం అని, మహర్షులు దమం అని నిశ్చయించుకొన్నారు. ఈ రీతిగా సర్పాలు, దేవతలు, ఋషులు, దానవులు ఒకే గురువు వద్దకు వెళ్ళారు. ఒకే శబ్దాన్ని ఉపదేశించగా వారి బుద్ధులలో సంస్కారం కలిగింది. అయినా వారి వారి మనస్సులలో భిన్నభిన్నమయిన భావాలు కలిగాయి. శ్రోతలు గురువు చేసే ఉపదేశం వింటారు. దాన్నే భిన్న భిన్నంగా గ్రహిస్తారు. కాబట్టి ప్రశ్నవేసే శిష్యునికి అంతర్యామిని మించిన వేరే గురువు లేడు. మొదట ఆయన కర్మను ఆమోదిస్తాడు. తరువాత జీవుడు ఆ కర్మలో ప్రవృత్తుడు అవుతాడు. ఈ రీతిగా హృదయంలో వ్యక్తమయ్యే పరమాత్మయే గురువు, జ్ఞాని, శ్రోత, ద్వేషించేవాడు అవుతాడు. లోకంలో పాపాలుచూస్తూ సంచరించే వాడిని పాపాత్ముడని, పుణ్యకర్మలు చేస్తూ సంచరించేవాడిని పుణ్యాత్ముడని వ్యవహరిస్తారు. ఇష్టంవచ్చినట్లు ఇంద్రియ సుఖాలలో ఆసక్తుడయినవాడు కామచారి అవుతాడు. ఇంద్రియజయంలో నిరంతరం ఆసక్తు డయినవాడు బ్రహ్మచారి అవుతాడు. వ్రతాలను, కర్మకాండను వదలి కేవలం బ్రహ్మభావంలో ఉండేవాడు బ్రహ్మరూపుడై ప్రపంచంలో సంచరిస్తాడు. ఆయనయే ముఖ్యుడయిన బ్రహ్మచారి అవుతాడు. ఆయనకు బ్రహ్మమే సమిధలు, బ్రహ్మమే అగ్ని అవుతుంది. ఆయన బ్రహ్మనుంచే సంభవిస్తాడు. బ్రహ్మమే ఆయనకు జలం. బ్రహ్మమే గురువు అవుతుంది. ఆయన చిత్తవృత్తులు ఎల్లప్పుడు బ్రహ్మలో లీనం అవుతాయి. విద్వాంసులు దీన్నే **సూక్ష్మ బ్రహ్మ చర్యం** అన్నారు. తత్త్వోపదేశాన్ని పొంది, ప్రబోధాన్నందిన ఆత్మజ్ఞానులు ఈ బ్రహ్మచర్య స్వరూపం తెలుసుకొని నిరంతరం దాన్ని అనుష్ఠిస్తుంటారు.'

27. బ్రాహ్మణగీత - 8.

బ్రాహ్మణుడు చెప్పాడు - 'ప్రియా! సంసారం మహాదుర్గమం. సంకల్పాలు దానిలో అడవిదోమలు, దోమలు. శోకహర్షాలు చలి, వేడి. మోహం చీకటి. లోభవ్యాధులు సర్పాలు. ఇంద్రియ విషయాలు మార్గం. కామక్రోధాలు శత్రువులు. ఒంటరిగా ప్రయాణం.

ఆ దుర్గమమార్గాన్ని దాటి ఇప్పుడు నేను పరబ్రహ్మ అనే మహావనంలో ప్రవేశించాను.' బ్రాహ్మణ పత్ని అడిగింది - 'మహాప్రాజ్ఞా! ఆ వనం ఎక్కడ ఉంది ? అక్కడ ఉండేచెట్లు, నదులు, గిరులు, పర్వతాలు ఏవి? ఆ వనం ఎంత దూరంలో ఉంది.' బ్రాహ్మణుడు చెప్పాడు - 'కల్యాణీ! ఆ వనంలో భేదం లేదు. అభేదం లేదు. అది రెండింటికి అతీతం. అక్కడ లౌకిక సుఖదుఃఖాలు ఉండవు. దానికంటె చాలా చిన్నది. చాలా పెద్దది లేదు. దానికంటె సూక్ష్మతరమయింది లేదు. దాంతో సమానమయిన ఇంకొక సుఖం లేదు. ఆ వనంలో ప్రవేశించిన తరువాత ద్విజులకు హర్షం కలగదు. శోకం కలుగదు. వారు ఎవరికి భయపడరు. వారికి ఎవ్వరు భయపడరు. ఆ వనంలో ఏడు పెద్ద చెట్లు ఉన్నాయి. వాటి ఫలాలు ఏడు, ఆ ఫలాలు అనుభవించే అతిథులు ఏడుగురు. ఏడు ఆశ్రమాలు. సమాధులు ఏడు. దీక్షలు ఏడు. ఇది ఆ అరణ్యరూపం. అక్కడి చెట్లు అయిదు రంగులు గల దివ్యమయిన పూలను, పండ్లను సృష్టిస్తూ, ఆ వనాన్ని అన్నివైపుల నుంచి వ్యాపించి ఉన్నాయి.

అక్కడ ఇంకొకరకమయిన వృక్షాలు రెండు రంగులు గల పూలను, పండ్లను సృష్టిస్తూ ఆ వనం అంతా వ్యాపించి ఉంటాయి. అక్కడి వృక్షాలు సువాసనగల రెండు రంగుల పుష్పాలను, ఫలాలను సృజిస్తూ ఆ వనాన్ని వ్యాపించి ఉంటాయి. అక్కడి చెట్లు సువాసన గలవి. ఒకే రంగు గల పూలను, పండ్లను సృష్టిస్తూ ఆ అరణ్యం అంతా వ్యాపించి ఉంటాయి. అక్కడ రెండు మహావృక్షాలు అనేకమయిన అవ్యక్త వర్ణంగల పూలను, పండ్లను ఇస్తూ ఆ వనాన్ని వ్యాపించి ఉన్నాయి. ఆ వనంలో ఒకే ఒక అగ్ని ఉంది. జీవుడు శుద్ధచిత్తుడయిన బ్రాహ్మణుడు. అయిదు ఇంద్రియాలు సమిధలు. వాటి వల్ల కలిగే మోక్షం సప్తవిధాలు. ఈ యజ్ఞ దీక్షకు ఫలం తప్పక కలుగుతుంది. గుణాలే అతిథులు, సప్తాతిథులే ఫలభోక్త లవుతున్నారు. ఈ యజ్ఞంలో అతిథులు మహర్షులు. ఆతిథ్యం స్వీకరిస్తారు. పూజను స్వీకరించిన వెంటనే లయమవుతారు. తరువాత బ్రహ్మరూపమయిన ఆ వనం విలక్షణ రూపంతో ప్రకాశిస్తుంది. దానిలో ప్రజ్ఞారూపమయిన వృక్షం విలసిల్లుతుంది. మోక్ష రూప ఫలాలు కలుగుతాయి. శాంతిమయ మయిన ఛాయ వ్యాపిస్తుంది. జ్ఞానం ఆశ్రయస్థానం. తృప్తియే నీరు. ఆ వనంలో ఆత్మరూపమయిన సూర్యకాంతి వ్యాపిస్తుంది. ఆ వనాన్ని ఆశ్రయించే ఉత్తమ పురుషులకు ఎప్పుడూ ఎలాంటి భయమూ కలుగదు. ఆ వనం పైన, క్రింద, అడ్డంగా అంతటా అన్నివైపులా వ్యాపించి ఉన్నది. దానికి అంతం లేదు. అక్కడ ఏడుగురు స్త్రీలు ఉంటారు. వారు సిగ్గుతో తలలు

వంచి ఉంటారు. వారు చిన్మయజ్యోతితో ప్రకాశిస్తూ ఉంటారు. వారు అందరికి తల్లులు. వారు ఆ వనంలో ఉండే ప్రజల నుండి ఉత్తమ రసాన్ని అనిత్యతనూ, సత్యాన్నీ గ్రహించినట్లు గ్రహిస్తారు. సప్తసిద్ధులు సప్తర్షులు వసిష్ఠాదులతో గూడ ఆ వనంలోనే ఉంటారు. అక్కడే జన్మిస్తారు. యశస్సు, ప్రభ, ఐశ్వర్యం, విజయం, సిద్ధి (ఓజస్సు), తేజస్సు అనే సప్తజ్యోతులు పైన చెప్పిన ఆత్మరూపి అయిన సూర్యుని అనుసరిస్తుంటాయి. ఆ బ్రహ్మతత్త్వంలోనే గిరులు, పర్వతాలు, సెలయేళ్లు, నదులు, సరస్సులు ఉన్నాయి. అవి బ్రహ్మ నుండి పుట్టిన జలాన్ని ప్రవహిస్తుంటాయి. దాని అత్యంత గూఢమయిన హృదయాకాశంలో సంక్షేపంగా నదుల సంగమం కూడా జరుగుతుంటుంది. అక్కడ యోగమనే యజ్ఞం విస్తరిస్తుంటుంది. అక్కడే సాక్షాత్తూ పితామహ స్వరూపం ఉంది. ఆత్మజ్ఞాన తృప్తులయిన వారు ఆయననే పొందుతారు. ఆశలు క్షీణించినవారు, ఉత్తమ వ్రతానుష్ఠాతలు, తపస్సులతో పాప విముక్తి నందిన వారు తమబుద్ధిని ఆత్మనిష్ఠం చేసుకొని పరబ్రహ్మోపాసన చేస్తుంటారు. విద్య (జ్ఞానం) ప్రభావంతోనే బ్రహ్మరూపమయిన వనం తెలుస్తుంది. ఇది తెలిసినవారు ఈ వనంలో ప్రవేశించాలనే ఉద్దేశ్యంతో శమం (మనోనిగ్రహం) ప్రశంసిస్తారు. దానివల్ల బుద్ధిస్థిరం అవుతుంది. బ్రాహ్మణులు ఇలాంటి గుణాలు గల పవిత్రవనం తెలుసుకొంటారు. తత్త్వ దర్శుల ఉపదేశం వల్ల ప్రబుద్ధులయిన ఆత్మజ్ఞానం గలవారు ఆ బ్రహ్మవనాన్ని శాస్త్రానుసారం తెలుసుకొని శమాదుల అనుష్ఠానంలో మగ్నులవుతారు.'

28. బ్రాహ్మణ గీత - 9.

బ్రాహ్మణుడు చెప్పాడు - 'నేను సువాసనలను వాసన చూడటం లేదు. రసాలను ఎరుగను. రూపాన్ని చూడను. స్పృశించను. వివిధాలయిన శబ్దాలను వినను. ఎలాంటి సంకల్పాలను చేయను. స్వభావమే ఇష్టమయిన పదార్థాలను కోరుతుంది. స్వభావమే ద్వేషించవలసిన వాటిని ద్వేషిస్తుంది. ప్రాణాపానాలు ప్రాణి దేహంలో ప్రవేశించి, తిన్న అన్నం జీర్ణంచేసినట్లు రాగద్వేషాలు స్వభావానుసారమే కలుగుతాయి. ఈ బాహ్యేంద్రియాలు, విషయాలకంటె ఇతరమయిన స్వప్న సుషుప్తులలోని వాసనామయమయిన విషయాలు, ఇంద్రియాలు, వాటిల్లో ఉండే నిత్యభావాలు, వాటికంటె విలక్షణమయిన భూతాత్మను శరీరం లోపల యోగులు చూడగలరు. ఆ భూతాత్మలో ఉన్న నేను కామక్రోధ జరామృత్యుగ్రస్తుడను ఎప్పటికీ కాను. సమస్తకామాల్లో ఏ ఒకదాన్ని నేను కోరను. సమస్త దోషాలను ద్వేషించను. పద్మపత్రాలమీద జల బిందువులు అంటనట్లే నాస్వభావంలో

రాగ ద్వేషస్పర్శలేదు. నానావిధ స్వభావాలు గల ఇంద్రియాదులను చూచే నిత్యస్వరూపమయిన ఈ ఆత్మకు సమస్త భోగాలు అనిత్యా లవుతాయి. ఆకాశంలోని సూర్యకిరణ సముదాయం సూర్యుని కంటనట్లే ఆ భోగసముదాయం విద్వాంసుని తాకలేదు.

యశస్వినీ! అధ్వర్యు యతి సంవాద రూపమైన ఈ పురాతనమయిన ఇతిహాసాన్ని ఈ విషయంలో ఉదాహరిస్తారు. అది చెపుతాను. తెలుసుకో. ఏదో ఒక యజ్ఞంలో బలిగా ప్రోక్షితమవుతున్న పశువును చూసి, అక్కడే కూర్చుని ఉన్న ఒకయతి దాన్ని నిందిస్తూ "ఇది హింస. దీనివల్ల పాపం కలుగుతుంది." అని అన్నాడు. అధ్వర్యుడు యతికి ఇలా సమాధానం చెప్పాడు. 'ఈ మేకపోతు నశించదు. పశుర్హ్యేనీయమానః అనే వేదవాక్యం సత్యమయితే ఈ జీవుడు కల్యాణభాజను డవుతాడు. దీనిలో ఉండే పార్థివ భాగం భూమిలో కలుస్తుంది. దీనిలో ఉండే జలభాగం జలంలో కలిసిపోతుంది. నేత్రం. సూర్యుని, శ్రోత్రం దిక్కులను, దీని ప్రాణం స్వర్గాన్ని చేరతాయి. శాస్త్రానుసారం విధిని నిర్వర్తిస్తున్న నాకు ఎలాంటి దోషం ఉండదు.' యతి అన్నాడు - 'మేకపోతుకు ప్రాణాలు పోవటం మేలని నీవు అనుకొంటే మేకపోతు కోసం జరిగే యజ్ఞం వల్లనీకు ఏం ప్రయోజనం ఉంటుంది ? పశువా! ఈ విషయంలో నీవు నీ సోదరుడు, తల్లి తండ్రుల అనుమతిని పొందాలి అనే శ్రుత్యనుసారం పరాధీనమయిన ఈ పశువును తీసుకొని వెళ్లి, దీని సోదరాదుల అనుమతి పొందు. లేకపోతే నీకు హింసాదోషం వస్తుంది. మొదట నీవు ఈ పశువును దాని బంధువులతో కలపాలి. అవిగూడా ఇలా చేయటానికి అనుమతిస్తే, వాటి ఆమోదం విని, తదనుసారం ఆలోచించవచ్చు. నీవు దీని ఇంద్రియాలను వాని కారణాలలో విలీనం చేశావు. నా ఉద్దేశ ప్రకారం ఇప్పుడు దీని చేష్టారహితమయిన శరీరమే మిగిలి ఉంది. చైతన్యం లేని జడశరీరం ఇంధనం లాంటిదే. దాంతో హింసకు ప్రాయశ్చిత్తం గోరి, యజ్ఞం చేసేవానికి కట్టె పుల్లే పశువు. (ఇంధనంతోటే పని అవుతుంటే పశుహింస ఎందుకు చేయాలి?) ధర్మాలు అన్నింటిలో అహింస పరమధర్మం అని పెద్దల మాట. హింస లేని కర్మయే చేయదగినది అని మేము భావిస్తాం. దీని తరువాత కూడా నేను ఇంకేమయినా చెప్పవలసి ఉంటే ఒకేమాట చెపుతాను. ప్రతివాడు 'నేను అహింసా ధర్మాన్ని పాటిస్తాను.' అని ప్రతిజ్ఞ చేయాలి. అలా కాకపోతే మీరు చేసే అనేక కర్మలు దోషయుక్తాలు అవుతాయి. ఏ ప్రాణిని హింసించకుండటమే మాకు ఎప్పుడూ మంచి పనిగా తోస్తుంది. మేము ప్రత్యక్షఫల సాధకులం. పరోక్షోపాసన చేయం.

అధ్వర్యువు చెప్పాడు - 'సర్వభూతాలలో ప్రాణం ఉందని నీవు ఒప్పుకొంటావు.

అయినా నీవు భూమిలో ఉండే గంధం అనే గుణాన్ని అనుభవిస్తున్నావు. జలమయమయిన రసాన్ని త్రాగుతున్నావు. తేజోగుణమయిన రూపం చూస్తున్నావు. వాయుగుణమయిన స్పర్శను అనుభవిస్తున్నావు. ఆకాశ గుణమయిన శబ్దం వింటున్నావు. మనస్సుతో తెలుసుకోదగినది తెలుసుకొంటున్నావు. ఏ ప్రాణి ప్రాణాన్ని తీయటం మానివేసిన నీవు హింస చేస్తూనే ఉన్నావు. ద్విజశ్రేష్ఠా! ఏ పనీ హింసలేకుండా ఉండదు. మరి నీవు ఏ రీతిగా నేను అహింసాపరుడిని అని అనుకొంటున్నావు?' యతి చెప్పాడు – 'ఆత్మకు, క్షరం, అక్షరం అని రెండు రూపాలు ఉన్నాయి. కాలత్రయంలో సత్తను (ఉనికిని) కోల్పోనిది అక్షరం (అవినాశి) అని చెప్పారు. ఎల్లప్పుడు అన్నిరీతులా లేనిది క్షరం అంటారు. ప్రాణం, నాలుక, మనస్సు, రజోగుణ సహిత సత్త్వం, ఇవి మాయాసహిత సద్భావాలు. ఈ భావాల నుండి విముక్తుడై, ద్వంద్వాతీతుడై, నిష్కాముడై, సర్వప్రాణులయందు సమభావంతో, మమకారహీనుడై, జితాత్ముడై, సర్వవిధాల బంధన రహితుడయిన వ్యక్తికి ఎప్పుడూ, ఎక్కడా, ఎలాంటి భయమూ ఉండదు.' అధ్వర్యువు చెప్పాడు – 'బుద్ధిమంతులలో శ్రేష్ఠుడివయిన యతీశ్వరా! ఈ జగత్తులో మీవంటి సత్పురుషులతో కలిసి ఉండాలని మీ అభిప్రాయం విన్న తరువాత నాకు అనిపిస్తున్నది. మహాత్మా! మీ మాటలు విని జ్ఞానసంపన్నుడనయిన నేను వేదమంత్రాలు నిశ్చయించిన వ్రతాన్నే పాటిస్తున్నాను. కాబట్టి ఇందులో నా దోషం ఏమీ లేదు.' బ్రాహ్మణుడు చెప్పాడు – 'ప్రియా! అధ్వర్యువు చెప్పిన యుక్తి వచనాలు విని యతి మౌనం పాటించాడు. ఇంకేమీ మాటాడలేదు. అధ్వర్యువు గూడా నిర్మోహుడై మహాయజ్ఞంలో ముందుకు సాగాడు. ఈ రీతిగా బ్రాహ్మణులు మోక్షానికి అత్యంత సూక్ష్మ స్వరూపాన్ని చెపుతారు. తత్త్వదర్శులు ఉపదేశానుసారం ఆ మోక్ష ధర్మం తెలుసుకొని దాన్ని అనుష్ఠిస్తారు.'

29. బ్రాహ్మణగీత - 10.

బ్రాహ్మణుడు చెప్పాడు – 'సుందరీ! కార్తవీర్య సముద్రుల మధ్య జరిగిన సంవాద రూపమైన పురాతనమయిన ఇతిహాసాన్ని ఈ విషయంలో ఉదాహరిస్తున్నారు. కార్తవీర్యార్జునుడు అనే రాజు వేయి చేతులు గలవాడు ఉండేవాడు. ఆయన సముద్ర పర్యంతం గల భూమినంతా ధనుస్సు బాణాలతోనే జయించాడు. బాహుబలంతో పాగరెక్కిన ఆయన ఒకసారి వందలకొలది బాణాలతో సముద్రాన్ని కప్పివేస్తూ ఆ సముద్రతీరంలో విహరించాడని మేము విన్నాం. సముద్రుడు ఆయనకు నమస్కరించి దోసిలొగ్గి ఇలా

అన్నాడు - 'వీరా! రాజశ్రేష్ఠా! నీవు ప్రయోగించిన మహాస్త్రాలు నన్ను ఆశ్రయించి ఉండే ప్రాణులను వధిస్తున్నాయి. కాబట్టి నా మీద బాణాలు ప్రయోగించకు. ఆ ప్రాణులకు అభయం ఇయ్యి.' కార్తవీర్యార్జునుడు అన్నాడు - 'సముద్రా ! యుద్ధరంగంలో నాతో సమానుడు, నన్ను ఎదుర్కొన గలవాడు ధనుర్ధారి అయిన వీరుడు ఉంటే చెప్పు, నీమీద బాణాలు వేయటం మానుతాను.' సముద్రుడు చెప్పాడు - 'రాజా! జమదగ్ని మహర్షిని గురించి విన్నావా? ఆయన కుమారుడు పరశురాముడు నీకు తగిన రీతిగా సత్కారం చేస్తాడు.' తీవ్రకోప పరవశుడయిన ఆ రాజు జమదగ్ని మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ పరశురాముని ఎదుర్కొన్నాడు. మహాత్ముడయిన ఆయనకు తన బంధువులతో కూడా కలిసి ఆ రాజు అనేక ప్రతికూల కార్యాలు చేశాడు. పరశురాముని తీవ్రమయిన ఉద్విగ్నునిగా చేశాడు. అప్పుడు మహాతేజస్వి అయిన పరశురాముని తేజస్సు ప్రజ్వరిల్లింది. పద్మనయనా! మహా పరాక్రమంతో ఆయన శత్రుసేనలను దహించాడు. ఆ తరువాత పరశురాముడు గండ్రగొడ్డలిని తీసుకొన్నాడు. కొమ్మలుగల చెట్టువలె నున్న కార్తవీర్యార్జునుని వేయి చేతులను దానితో ఖండించాడు.

హతుడయి నేలగూలిన ఆయనను చూసి, ఆయన బంధువులు అందరు కలిసి ఒక్కటై ఖడ్గాలు, శక్తులను తీసుకొని, పరశురాముని నాలుగువైపులనుంచి చుట్టుముట్టారు. పరశురాముడు గూడా త్వరగా ధనుస్సు తీసుకొని రథం ఎక్కి, బాణవర్షాలను కురిపిస్తూ రాజసైన్యాన్ని సంహరించాడు. అప్పుడు కొంతమంది క్షత్రియులు సింహానికి భయపడిన జింకలవలె పరశురామునికి భయపడి, పారిపోయి, పర్వతగుహలలో దాక్కున్నారు. అలా అడవులు పట్టినవారికి కర్మకాండను ఉపదేశించే బ్రాహ్మణులు కన్పించకపోవటం చేతను, పరశురాముని భయంచేతను క్షత్రియోచితమయిన కర్మలను చేయలేదు. అందువల్లవారు శూద్రులయ్యారు. ఈ రీతిగా ద్రవిడులు, ఆభీరులు, పుండ్రులు, శబరులు అనే జాతులవారి సహవాసంతో వారు సహజంగా క్షత్రియులయినా స్వధర్మాన్ని వీడటం వల్ల శూద్రత్వాన్ని పొందారు. క్షత్రియ వీరులు హతులు కాగా వారికాంతలయిన క్షత్రియ స్త్రీలయందు బ్రాహ్మణులు క్షత్రియులను కన్నారు. పరశురాముడు వారిని గూడా సంహరించాడు. ఈ విధంగా ఇరవై ఒక్కసారులు క్షత్రియ సంహారం జరిగింది. అప్పుడు దివ్యమయిన అశరీరవాణి పరశురామునికి, తదితరులకు అందరికి వినపడేటట్లుగా మధురంగా ఇలా అన్నది. 'నాయనా! పరశురామా! పలుమారులు క్షత్రియులయిన వీరిని అందరిని చంపినందువల్ల నీకు ఏం లాభం కలిగింది ? ఇంక ఈ హింసను మానుకో.' అలాగే ! ఆయన తాతలు

ఋచీకాదులయిన మహర్షులు మహాత్ముడయిన ఆయనను "మహాభాగా! ఈ మరణకాండనుంచి విరమించు" అని చెప్పారు. తండ్రి వధను సహింపజాలని పరశురాముడు వారితో 'మీరు నన్ను ఈ పని నుండి నివారించటం తగదు.' అని అన్నాడు. పితరులు అన్నారు - 'విజయశీలురలో ఉత్తముడవయిన రామా! క్షత్రియులను సంహరించటం నీకు తగదు. బ్రాహ్మణుడయి ఉండి నీవు రాజులను సంహరించవద్దు.'

30. బ్రాహ్మణగీత - 11.

పితృదేవతలు చెప్పారు - 'బ్రాహ్మణోత్తమా! ఈ విషయంలో పురాతనమయిన ఒక ఇతిహాసాన్ని చెపుతారు. అది విని నీవు అలానే చేయవలసింది. పూర్వం మహాతపస్వి అయిన అలర్కుడు అనే రాజర్షి ఉండేవాడు. ఆయన ధర్మజ్ఞుడు, నిజం చెప్పేవాడు, మహాత్ముడు, మిక్కిలి దృఢంగా వ్రతాలు ఆచరించేవాడు. సముద్రపర్యంతం గల ఈ సమస్త భూమండలాన్ని ధనుస్సుతో మాత్రమే జయించి చాలా దుష్కర కర్మను ఆచరించాడు. తరువాత ఆయన మనస్సు సూక్ష్మమయిన తత్త్వం మీద నిలిపాడు. మహామతీ! మహత్కార్యారంభాన్ని వదలి, చెట్టుమొదట నివసిస్తున్న ఆయన సూక్ష్మ తత్త్వవిచారణ చేస్తూ ఇలా ఆలోచించాడు. 'నాకు మనస్సు వల్లనే బలం కలిగింది. మనస్సును జయిస్తేనే నాకు సరి అయిన విజయం కలుగుతుంది. ఇంద్రియాలు అనే శత్రువులు నన్ను చుట్టుముట్టి ఉన్నాయి. కాబట్టి బయటి శత్రువులమీద దండెత్తకుండా నా అంతఃశత్రువుల మీదకే నా బాణాలు గురిపెడతాను. ఈ మనస్సు చంచలత్వం కారణంగా మానవులచేత నానావిధాల పనులు చేయిస్తుంటుంది. కాబట్టి ఈ మనస్సు మీద మిక్కిలి పదునయిన మొనలు గల బాణాలను ప్రయోగిస్తాను.' మనస్సు చెప్పింది - 'అలర్కా! ఈ బాణాలు నన్ను ఏమాత్రం గాయపరచలేవు. అంతేకాదు నీ మర్మస్థానాలనే ఛేదిస్తాయి. మర్మస్థానాలు చీలిపోవటం వల్ల నీవే మరణిస్తావు. కాబట్టి నన్ను చంపగలిగే వేరే బాణాలను గురించి ఆలోచించు.'

అది విన్న తరువాత అలర్కుడు బాగా ఆలోచించి, ఇలా అన్నాడు. 'ఈ ముక్కు అనేకమయిన సువాసనలను వాసన చూసికూడా ఇంకా అలాంటివి కావాలని కోరుతుంటుంది. కాబట్టి ముక్కును గురిచూచి పదునయిన బాణాలను ప్రయోగిస్తాను.' నాసిక అన్నది - 'అలర్కా! ఈ బాణాలు నన్ను సంహరించలేకపోగా నీ మర్మస్థానాన్నే ఛేదిస్తాయి. మర్మస్థానాలు చీలిపోవటం వల్ల నీవే మరణిస్తావు. కాబట్టి నన్ను ఛేదించే వేరే

రకమయిన బాణాలను సంధించు.' అది విని ఆయన ఆలోచించి ఇలా అన్నాడు. 'ఈ నాలుక రుచికరమైన రసాలను ఎన్నిటినో తిని గూడా మళ్ళీ అవే కావాలని కోరుతుంది. కాబట్టి నేను ఈ నాలుక మీదనే పదునయిన బాణాలను వేస్తాను.' నాలుక చెప్పింది – 'అలర్కా! ఈ బాణాలు నన్ను ఏ రీతిగా గూడా చీల్చలేవు. నీ మర్మ స్థానాలనే ఛేదిస్తాయి. మర్మస్థానాలు ఛిన్నం కాగా నీవే మరణిస్తావు కాబట్టి నన్ను ఛేదించటానికి ఇంకొక రకమయిన బాణాలను ఎన్నుకో.' నాలుక మాటలు విని ఆయన ఆలోచించి తరువాత ఇలా అన్నాడు. 'చర్మం వివిధమయిన స్పర్శలను స్పృశించి కూడా మళ్ళీ వాటినే కోరుతుంటుంది. కాబట్టి చర్మాన్ని నానావిధాలయిన బాణాలతో చీల్చివేస్తాను.' చర్మం చెప్పింది – 'అలర్కా! నీ బాణాలు నన్ను ఏవిధంగా గూడా చీల్చలేవు. నీ మర్మస్థానాలనే చీల్చివేస్తాయి. నీ మర్మస్థానాలు చీలిపోవటం వల్ల నీవే మరణిస్తావు. కాబట్టి నన్ను చీల్చగల వేరే రకం బాణాలను గూర్చి ఆలోచించు.'

అది విని ఆయన బాగా ఆలోచించి ఇలా అన్నాడు. 'ఈ చెవి వివిధమయిన శబ్దాలను విని గూడా మళ్ళీ వాటినే కోరుతుంటుంది. కాబట్టి చెవిమీద పదునయిన బాణాలను ప్రయోగిస్తాను.' చెవి అన్నది. 'అలర్కా! నీ ఈ బాణాలు నన్ను ఏవిధంగా గూడా చీల్చివేయలేవు. నీ మర్మస్థానాన్నే ఛేదిస్తాయి. అందువల్ల నీవు ప్రాణాలు వదలుతావు. కాబట్టి నన్ను చీల్చివేయటానికి ఇంకొక రకమయిన బాణాలను గురించి ఆలోచించు.' అది విని ఆయన బాగా ఆలోచించి తరువాత ఇలా అన్నాడు. 'ఈ కన్ను చాలా రూపాలను చూచికూడా వాటినే కోరుతుంటుంది. కాబట్టి పదునయిన బాణాలతో కన్నులను కొడతాను.' కన్ను చెప్పింది – 'అలర్కా ! నీ ఈ బాణాలు నన్ను ఏ రీతిగాను ఛేదించలేవు. పైగా నీ మర్మస్థానాన్నే ఛేదిస్తాయి. మర్మస్థానం భిన్నమై మరణిస్తావు. కాబట్టి నన్ను చంపటానికి ఇతర బాణాలను గూర్చి ఆలోచించు.' అది విని ఆయన బాగా ఆలోచించి, మళ్ళీ ఈ మాటలు చెప్పాడు.

'ఈ బుద్ధి తన జ్ఞాన శక్తితో అనేకవిధాలయిన నిశ్చయాలు చేస్తుంటుంది. కాబట్టి బుద్ధిమీద పదునయిన బాణాలను ప్రయోగిస్తాను.' బుద్ధి చెప్పింది – 'అలర్కా! ఈ బాణాలు ఏ రీతిగా కూడా నన్ను స్పృశించలేవు. నీ మర్మస్థానాన్నే ఛేదిస్తాయి. మర్మస్థానం చీలిపోవటం వల్ల నీవే మరణిస్తావు. కాబట్టి నన్ను కొట్టగలిగే బాణాలు వేరే ఉన్నాయి. వాటిని గూర్చి ఆలోచించు.' బ్రాహ్మణుడు చెప్పాడు – 'దేవీ! తరువాత అలర్కుడు ఆ చెట్టుక్రిందనే కూర్చుని ఘోర తపస్సు చేశాడు. కాని దానివల్ల మనోబుద్ధులతో

గూడిన పంచేంద్రియాలను కొట్టగలిగే ఉత్తమ బాణం ఏదీ తోచలేదు. అప్పుడు సమర్థుడయిన ఆ రాజు ఏకాగ్రచిత్తుడయి ఆలోచించసాగాడు. చాలా కాలం బాగా ఆలోచించిన తరువాత కూడా బుద్ధిమంతులలో శ్రేష్ఠుడయిన అలర్కునికి యోగానికంటె ఇంకొకటి మేలు కలిగించేది స్ఫురించలేదు. ఆయన మనస్సు ఏకాగ్రం చేసి, నిశ్చలుడయి, స్థిరంగా కూర్చొని ధ్యానయోగసాధన చేయసాగాడు. బలశాలి అయిన ఆ రాజచంద్రుడు ధ్యానయోగం అనే ఒకే ఒక బాణంతో సర్వేంద్రియాలను వేగంగా కొట్టి, ఓడించాడు. ఆయన ధ్యానయోగంతో ఆత్మలో ప్రవేశించి, పరమసిద్ధిని (మోక్షాన్ని) పొందాడు. ఈ విజయంతో అలర్కుడు ఆశ్చర్యమగ్నుడయ్యాడు. ఈ గాథను గానం చేశాడు. 'ఇంతవరకు నేను బాహిర కార్యాలలో మగ్నుడినయి ఉన్నాను. **భోగతృష్ణాబద్ధుడనై రాజ్యాన్ని ఉపాసించాను. ధ్యానయోగాన్ని మించిన ఇంకొక సుఖం లేదు. అనే విషయం నాకు చాలా ఆలస్యంగా తెలిసింది.*** (పితామహులు చెప్పారు) పరశురామా! ఈ విషయాలు అన్నీ బాగా తెలుసుకొని క్షత్రియనాశనం చేయకు. ఘోరమయిన తపస్సు చెయ్యి. దానివల్ల నీకు మేలు కలుగుతుంది.' తన పితామహులు ఆ రీతిగా చెప్పగా జమదగ్ని పుత్రుడు పరశురాముడు ఘోరమయిన తపస్సు చేసి, పరమదుర్లభమయిన సిద్ధిని పొందాడు.

31. బ్రాహ్మణ గీత - 12.

బ్రాహ్మణుడు చెపుతున్నాడు. 'లోకంలో మూడు గుణాలే శత్రువులు. అవి వృత్తి భేదంతో తొమ్మిదిరకాలు అంటారు. హర్షం, ప్రీతి, ఆనందం అనే మూడు సాత్వికాలయిన గుణాలు. తృష్ణ, క్రోధం, ద్వేషం, అనే మూడు రాజసాలయిన గుణాలు. అలసట, అలస్యం, మోహం, అనే మూడు తామసాలయిన గుణాలు. శాంతచిత్తుడు, జితేంద్రియుడు, ఆలస్యం లేనివాడు, ధైర్యవంతుడయిన పురుషుడు శమదమాదులయిన బాణ సమూహాలతో వెనుక చెప్పిన గుణాలను ఛేదించి, ఇతరులను జయించటానికి ఉత్సాహపడతాడు. ఈ విషయంలో పూర్వకాలం విషయాలు తెలిసిన జనులు ఒక గాథను చెపుతుంటారు. పూర్వం శాంతచిత్తుడయిన అంబరీష మహారాజు ఈ గాథను గానం చేశాడు. దోషాల బలం పెరిగిపోగా సద్గుణాలు అణగిపోయే సమయంలో మహాయశస్వి అయిన అంబరీష మహారాజు బలవంతంగా రాజ్యాన్ని తన చేతులలోకి తీసుకొన్నాడు. ఆయన తనదోషాలను

---

* **భోగతృష్ణాసమాయుక్తైః పూర్వం రాజ్యముపాసితమ్ ।**
ఇతి పశ్చాన్మయా జ్ఞాతం యోగాన్నాస్తి పరం సుఖమ్ ॥ 31

అణచివేసి ఉత్తమగుణాలను ఆదరించాడు. ఇందువల్ల ఆయనకు గొప్ప సిద్ధి కలిగింది. ఆయన ఈ గాథ గానం చేశాడు. 'నేను అనేక దోషాలను జయించాను. సమస్త శత్రువులను నాశనం చేశాను. కాని ఇంకో గొప్పదోషం మిగిలిపోయింది. నశింపజేయదగినదయినా దాన్ని నేను ఇంతవరకు నాశనం చేయలేకపోయాను. దాని ప్రేరణవల్లనే ఈ ప్రాణికి వైరాగ్యం కలగదు. **తృష్ణావశుడైన మనుష్యుడు లోకంలో నీచ కర్మలనైపు పరుగుతీస్తాడు. జాగ్రత్తగా ఉండడు. దాని ప్రోత్సాహంతో ప్రేరితుడయినవాడు ఇక్కడ చేయగూడనివి గూడా చేస్తాడు. ఆ దోషం పేరు లోభం. దాన్ని జ్ఞానం అనే ఖడ్గంతో ఖండించి మానవుడు సుఖపడతాడు.** లోభం వల్ల తృష్ణ కలుగుతుంది. దానివల్ల చింతకలుగుతుంది. లోభి అయినవాడు మొదట అనేకమయిన రాజసగుణాలను పొందుతాడు. అవి కలిగిన తరువాత తామసగుణాలు గూడా అధికంగా కలుగుతాయి. ఆ గుణాల వల్ల ఈ దేహ బంధంలో ఇరుక్కొని, ఆతడు పలుమారులు జన్మిస్తుంటాడు. రకరకాలయిన కర్మలు చేస్తుంటాడు. చివరకు జీవితం అంతం అయ్యే సమయం రాగా ఆతని శరీరతత్వాలు విడిపోయి చెల్లాచెదరవుతాయి. ఆతడు మరణిస్తాడు. మళ్ళీ జనన మరణ బంధంలో పడతాడు. కాబట్టి ఈ లోభస్వరూపాన్ని బాగా తెలుసుకొని, దీన్ని ధైర్యంగా అణచివేసి, ఆత్మరాజ్యం మీద అధికారం పొందటానికి కాంక్షించాలి. **వాస్తవమయిన స్వరాజ్యం ఇదే. ఇది ఇంకో రాజ్యం ఏదీకాదు. ఆత్మను గూర్చి యథార్థ జ్ఞానం కలిగిన తరువాత అదే రాజ్యం అవుతుంది.** ఈ రీతిగా లోభం అనే ఒక దుర్గుణాన్ని ఖండించిన కీర్తిమంతుడయిన అంబరీష మహారాజు ఆత్మరాజ్యాన్ని పొంది, ఈ గాథ గానం చేశాడు.

32. బ్రాహ్మణగీత - 13.

బ్రాహ్మణుడు చెప్పాడు - 'భామినీ! ఈ విషయంలో బ్రాహ్మణజనకుల సంవాద రూపమైన పురాతనమయిన ఇతిహాసాన్ని ఉదాహరిస్తున్నారు. ఒకప్పుడు జనకమహారాజు ఏదో ఒక అపరాధంలో దొరికిన ఒక బ్రాహ్మణునికి శిక్ష వేస్తూ తన దేశాన్ని విడిచి వెళ్ళమని చెప్పాడు. అది విన్న బ్రాహ్మణుడు రాజోత్తమునితో ఇలా అన్నాడు. 'రాజా! నీ అధికారంలో ఉన్న రాజ్యపు సరిహద్దులను చెప్పవలసింది. ప్రభూ! ఇంకొకరాజుగారి రాజ్యంలో ఉండగోరుతున్నాను. భూపాలా! శాస్త్రానుసారం నీ మాటను నెరవేర్చగోరుతున్నాను.' యశోవంతుడయిన బ్రాహ్మణుడు ఇలా చెప్పగా జనక మహారాజు పలుమారులు

వేడినిట్టూర్పులు విడుస్తూ ఏమీ సమాధానం చెప్పలేదు. మహాతేజస్వి అయిన ఆ జనకమహారాజు కూర్చొని ఆలోచిస్తున్నాడు. రాహువు సూర్యుని ఆక్రమించినట్లుగా ఆ రాజుకు మోహం కలిగింది. ఒక్క క్షణం తరువాత మోహం వీడగా జనకుడు తేరుకొని, ఆ బ్రాహ్మణునితో ఇలా అన్నాడు. 'అయ్యా! నా తాత ముత్తాతల నుంచి వశమయి ఉన్న రాజ్యంలో నా అధికారం ఉంది. అయినా లోతుగా ఆలోచిస్తే సమస్త భూమండలాన్ని వెతికినా నాదేశం ఎక్కడ ఉన్నదో కన్పించటం లేదు. భూమండలంలో నా రాజ్యం ఎక్కడ ఉన్నదో తెలియక మిథిలానగరంలో వెతికాను. అక్కడ కూడా నిరాశ ఎదురుకాగా నా ప్రజలమీద నాకు గల అధికారాన్ని వెదికాను. కాని వారిపైనా నా అధికారం నిశ్చితంగా లేదు. అప్పుడు నాకు మోహం కలిగింది. ఆ మోహం వీడిన తరువాత నాకు ఒక నిశ్చయం కలిగింది. ఎక్కడా నా రాజ్యం లేదు. లేక అంతటా నా రాజ్యమే ఉంది. ఒక దృష్టితో చూస్తే ఈశరీరమే నాది కాదు. ఇంకొక దృష్టితో చూస్తే ఈ సమస్త భూమండలం నాదే అనిపిస్తుంది. **బ్రాహ్మణోత్తమా! ఇది నాది అయినట్లుగానే అందరిది అవుతుంది. కాబట్టి నీకు ఎంతకాలం ఎక్కడ ఉండాలనిపిస్తే అక్కడ అంతకాలం ఉండు. ఆ ప్రదేశాన్ని ఉపయోగించుకో.***

బ్రాహ్మణుడన్నాడు - 'రాజా ! తాతతండ్రులనుండి పరంపరగా వచ్చిన రాజ్యం అంతా వశమయి ఉండగా ఏ బుద్ధిని ఆశ్రయించి, దీనిమీద మమకారం వదిలావో చెప్పు. ఏ బుద్ధిని ఆశ్రయించి సమస్తమూ నీ రాజ్యమే అని అనుకొన్నావు? నాది అనేది ఏదీ లేదు అని ఎందువల్ల అనుకొంటున్నావు ?' జనకుడు చెప్పాడు - 'ఈ ప్రపంచంలో కర్మల వల్ల కలిగే అన్ని అవస్థలు ఆద్యంతాలు కలవే అనే విషయం నాకు బాగా తెలుసు. కాబట్టి ఏ వస్తువూ నాది అని అనిపించటం లేదు. ఈ వస్తువు ఎవరిది? ఈ ధనం ఎవరిది? అని వేదవాక్యం ఉన్నది గదా! కాబట్టి నేను నాబుద్ధితో ఆలోచిస్తే ఏ వస్తువూ నాది కాదు. అనిపిస్తున్నది. ఈ బుద్ధిని ఆశ్రయించి, నేను మమకారం వదలిపెట్టాను. ఏ బుద్ధిని ఆశ్రయించటం వల్ల అంతా నాదే అనేభావం కలుగుతుందో చెపుతాను విను.

ముక్కులోకి వచ్చిన వాసనను గూడా నేను నాకోసం కావాలని కోరను. కాబట్టి నేను జయించిన భూమి ఎల్లవేళలా నా వశంలోనే ఉంటుంది. నోటిలోకి వచ్చి ఉన్నా రసాలను నా కోసమని నేను కోరను. అందువల్ల నేను జలాన్ని జయించాను. అందువల్ల

---

* **యథా మమ తథాన్యేషామ్ ఇతి మన్యే ద్విజోత్తమ ।**
ఉష్యతాం యావదుత్సాహో భుజ్యతాం యావదుష్యతే ॥ 12

జలం నిరంతరం నా వశమయి ఉంటుంది. నా కన్నులకు విషయమయిన రూపాన్ని గాని, జ్యోతిని గాని నా సుఖం కోసం అనుభవించగోరను. కాబట్టి నేను జ్యోతిస్సును జయించాను. అందువల్ల నిత్యం జ్యోతిస్సు నా వశంలో ఉంటుంది. నా శరీరానికి తగలటం చేత స్పర్శ వల్ల కలిగే సుఖాలను నాకు కావాలని కోరను. అందువల్ల వాయువును జయించాను. కాబట్టి నిత్యం వాయువు నా వశంలో ఉంటుంది. నా చెవిలో పడిన శబ్దాలను నేను నా సుఖం కోసం కోరను. కాబట్టి నేను శబ్దాలను జయించాను. అందువల్ల అవి నిరంతరం నా వశంలో ఉంటాయి. నా మనస్సులోకి వచ్చే మంతవ్య విషయాలను కూడా నా సుఖం కోసం కోరను. కనుక నా మనస్సును జయించాను. కాబట్టి మనస్సు నిత్యం నా వశంలో ఉంటుంది. **నేను చేసే సమస్త కార్యారంభాలు దేవతలకోసం, పితృదేవతల కోసం, ప్రాణులకోసం, అతిథులకోసం మాత్రమే అవుతాయి.***' అప్పుడు బ్రాహ్మణుడు నవ్వుతూ ఇలా అన్నాడు. 'రాజా! జనకా నేను ధర్మదేవతను. నిన్ను పరీక్షింపగోరి ఇలా బ్రాహ్మణరూపం దాల్చి వచ్చాను. ప్రపంచంలో సత్త్వగుణం అనే నేమిని చుట్టుకొని ఎప్పుడూ వెనుకకు తిరగని బ్రహ్మప్రాప్తి రూపమయిన చక్రాన్ని త్రిప్పేవాడివి నీవు ఒక్కడివే.'

33. బ్రాహ్మణగీత - 14.

బ్రాహ్మణుడు చెప్పాడు - 'భీరూ! నీవు నీ బుద్ధితో నన్ను గద్దిస్తున్నావు. నేను అలాంటివాడిని కాను. నేను ఈ లోకంలో దేహాభిమానులవలె ఆచరించటం లేదు. నేను పాపపుణ్యాసక్తుడి నని నీవు చూస్తున్నావు. కాని నిజానికి నేను అలాంటి వాడిని కాను. బ్రాహ్మణుడిని, జీవన్ముక్త మహాత్ముడిని, వానప్రస్థుడిని, గృహస్థును, బ్రహ్మచారిని. అన్నీ నేనే. ఈ భూమండలం మీద కనిపించి దానియందు అంతటా నేను వ్యాపించి ఉన్నాను. లోకంలో ఉండే స్థావర జంగమ ప్రాణులకు అన్నింటికి కట్టెపుల్లలకు అగ్నిలాగా నేను అంతకుడిని అని తెలుసుకో. సంపూర్ణ భూమండలం మీద, స్వర్గంలోనూ ఉన్న రాజ్యాన్ని అంతటిని నా బుద్ధి తెలుసుకొంటుంది. **బుద్ధియే నాకు ధనం.** బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం సంన్యాసం ఈ ఆశ్రమాల్లో ఉండే బ్రహ్మవేత్తలయిన బ్రాహ్మణులు అందరి మార్గం ఒకటే. వారు అనేకవిధాలయిన వ్యాకులత్వ రహిత చిహ్నాలను ధరించి కూడా

---

* దేవేభ్యశ్చ పితృభ్యశ్చ భూతేభ్యోఽతిథిభిః సహ ।
ఇత్యర్థం సర్వ ఏవేతి సమారంభా భవంతి వై ॥ 24

ఒకే బుద్ధిని ఆశ్రయిస్తారు. **భిన్నభిన్న ఆశ్రమాలలో ఉన్నా వారి బుద్ధి శాంతి సాధనలో ఉంటుంది.** సర్వనదులు చివరకు సముద్రంలో కలిసినట్లు వారు తుదకు సత్స్వరూపమయిన బ్రహ్మాన్నే పొందుతారు. ఈ మార్గం బుద్ధిగమ్యమే గాని శరీర గమ్యంగాదు. సర్వకర్మలకు మొదట, చివర ఉంటాయి. **శరీరం కర్మకు కారణం అవుతుంది.** సుమంగళీ! అందువల్ల పరలోకం కోసం నీవు ఏమాత్రం భయపడవద్దు. నీవు పరమాత్మ భావనలో ఉండి చివరకు నా స్వరూపాన్నే పొందుతావు.'

34. బ్రాహ్మణగీతోప సంహారము - 15.

బ్రాహ్మణ స్త్రీ అడిగింది - 'నాథా ! నా బుద్ధి అల్పం, అంతంకరణం అపవిత్రం. మీరు సంక్షేపంగా మహత్తరజ్ఞానాన్ని ఉపదేశించారు. సంకీర్ణంగా ఉన్న ఆ ఉపదేశాలు తెలుసుకోవటం నాకు కష్టం. నేను అదివిని గూడా ధారణ చేయలేకపోయాను. కాబట్టి నాకు ఆ బుద్ధి ప్రాప్తించటానికి కావలసిన ఉపాయం చెప్పండి. ఆ ఉపాయం మీకే బాగా తెలుసు అని నా నమ్మకం.' బ్రాహ్మణుడు చెప్పాడు - **'బుద్ధి క్రింద ఉండే అరణి అని, గురువు పైన ఉండే అరణి** అని నీవు తెలుసుకో. తపస్సు, వేద, వేదాంత శ్రవణమననాలతో మథిస్తే ఆ అరణులనించి, జ్ఞాన మనే అగ్ని పుడుతుంది.' (యజ్ఞాదులలో అగ్నిని పుట్టించే రెండు కొయ్యలు అరణులు). బ్రాహ్మణపత్ని అడిగింది - 'నాథా! క్షేత్రజ్ఞుడు అనే పేరుతో ప్రసిద్ధుడై శరీరం లోపల ఉండే జీవుడు బ్రహ్మస్వరూపం అంటారు. గదా! అది ఎలా వీలవుతుంది? జీవాత్మ బ్రహ్మనియంత్రణలో ఉంటాడు గదా? నియంత్రణలో ఉండేవాడు ఆయన స్వరూపం ఎలా అవుతాడు? ఇది ఎక్కడా చూడం.'

బ్రాహ్మణుడు చెప్పాడు - 'దేవీ! నిజానికి క్షేత్రజ్ఞుడు దేహ సంబంధం లేనివాడు, నిర్గుణుడు, ఆయన సగుణుడు, సాకారుడు కావటానికి ఏకారణమూ కనిపించదు. అందుకు ఒక ఉపాయం చెపుతాను. దానితో గ్రహించటానికి వీలుకావచ్చు, కాకపోవచ్చు. ఆ క్షేత్రజ్ఞుని సాక్షాత్కారింప జేసుకోవటానికి మంచి ఉపాయం కన్పిస్తుంది. ఆయను చూడటం అనే క్రియను వదలివేస్తే తేనెటీగలు వాసనద్వారా తెలుసుకొన్నట్లు స్వయంగానే తెలుస్తుంది. కర్మ విషయక బుద్ధి నిజానికి బుద్ధికాకపోవటం వల్ల జ్ఞానంలాగా ప్రతీతమయినా అది జ్ఞానం కాదు. (కాబట్టి క్రియతో దాని సాక్షాత్కారం కాదు) **ఇది కర్తవ్యం, ఇదికాదు అనే విషయం మోక్షసాధనాల్లో చెప్పలేదు. ఏ సాధనాలలో చూచే, వినే బుద్ధి**

ఆత్మస్వరూపంగా నిశ్చితమవుతుందో అదే యథార్థమయిన జ్ఞానం అవుతుంది. ఈ విషయంలో కల్పింపదగిన అంశాలను అవ్యక్తరూపాలను, వ్యక్తరూపాలను వందలు, వేలుగా వీలయిననన్నింటిని కల్పించవచ్చు. ప్రత్యక్షంగా కన్పించే ఈ పథార్థాలన్నీ వాస్తవికమయిన అర్థయుక్తాలు కాజాలవు. ఇంతకంటే ఇంక ఏమీ లేదు. నేతి, నేతి - ఇది కూడా కాదు, ఇది కూడా కాదు, అనే ఈ అభ్యాసం చివరలో ఆ పరబ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుంది.

కృష్ణుడు చెప్పాడు. అర్జునా! ఆ తరువాత క్షేత్రజ్ఞ విషయంలో సంశయ యుక్తమయిన ఆమె బుద్ధి క్షేత్రజ్ఞ జ్ఞానానికంటే అతీతమయి క్షేత్రజ్ఞులతో యుక్తమయింది.' అర్జునుడు అడిగాడు. 'శ్రీకృష్ణా! ఆ బ్రాహ్మణస్త్రీ ఎవరు? ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడు ఎవరు ? వారిద్దరు ఈ సిద్ధిని పొందారు గదా. వారిద్దరిని గూర్చి చెప్పు.' **శ్రీకృష్ణభగవానుడన్నాడు - 'ధనంజయా! నా మనస్సు బ్రాహ్మణుడని తెలుసుకో. నా బుద్ధి బ్రాహ్మణస్త్రీ అని తెలుసుకో. క్షేత్రజ్ఞుడని చెప్పబడినవాడను నేనే.'**

35. గురుశిష్య సంవాదము - 1.

అర్జునుడు అడిగాడు - 'శ్రీకృష్ణా! నీ అనుగ్రహం వల్ల నా మనస్సు సూక్ష్మవిషయాల మీద ఆసక్తం అవుతున్నది. కాబట్టి తెలియదగిన పరబ్రహ్మ విషయాన్ని వివరించవలసింది.' శ్రీకృష్ణ పరమాత్మ అన్నాడు - 'అర్జునా! ఈ విషయంలో మోక్ష విషయంతో గూడిన గురుశిష్య సంవాదం గల పురాతనమయిన ఇతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. శత్రునాశకా! అర్జునా! ఒకనాడు ఉత్తమవ్రత పాలకుడు, ఆచార్యవర్యుడయిన ఒక బ్రాహ్మణుని మేధావి అయిన శిష్యుడు ఇలా ప్రశ్నించాడు. 'మహాత్మా! నేను మేలు కలిగించే మార్గంలో ప్రవృత్తుడనై మిమ్ములను శరణందాను. బ్రాహ్మణోత్తమా! తలవంచి నమస్కరించి, మిమ్ములను అడుగుతున్నాను. నేను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి.' అర్జునా! ఇలా అడుగుతున్న శిష్యునితో గురువు 'ద్విజా! నీకు ఏ విషయంలో సందేహం కలిగిందో అడుగు. దానికి తగిన సమాధానం అంతా చెపుతాను.' అన్నాడు. 'కురువంశ శ్రేష్ఠా! మహత్తర వాత్సల్యం గల గురువుగారు ఇలా అనగా శిష్యుడు దోసిలొగ్గి, అడిగిన విషయాన్ని చెపుతాను విను.

శిష్యుడు అడిగాడు - 'మహాత్మా! నేను ఎక్కడినుంచి వచ్చాను? మీరు ఎక్కడినుంచి వచ్చారు? చరా చరాత్మకమయిన ఈ ప్రాణుల సమూహం ఎక్కడినుంచి జన్మించింది ? దేనివల్ల ఈ ప్రాణి సమూహం బ్రతుకుతున్నది? వాటి ఆయువు ఎంత?

సత్యం అంటే ఏమిటి? తపస్సు అంటే ఏమిటి? సత్పురుషులు చెప్పిన గుణాలు ఏవి? ఏ మార్గాలు మంగళకరాలు? సుఖం అంటే ఏమిటి ? పాపం అంటే ఏమిటి? ఉత్తమవ్రతపాలకా! ఈ నా ప్రశ్నలకన్నింటికి ఉన్నది ఉన్నట్లుగా తగిన సమాధానాలు చెప్పవలసింది. మీ కన్నా ఇతరులు ఎవ్వరూ ఈ ప్రశ్నలకు సముచిత సమాధానాలు ఇవ్వలేరు. మీరు మోక్షధర్మాలు తెలియచేయటంలో నేర్పరు లని జనులు చెప్పుకొంటున్నారు. ఈ విషయాలు తెలుసుకోవాలని నాకు చాలా కుతూహలంగా ఉన్నది. ధర్మవేత్తలలో శ్రేష్ఠా! ఈ విషయాలు చెప్పవలసింది. మేము జననమరణ రూపసంసార భీతులం. మోక్షకాంక్షులం. సమస్త సందేహాలను విచ్ఛిన్నం చేయగలవారు మీ కన్నా ఇంకెవ్వరూ లేరు.'

శ్రీకృష్ణుడు చెప్పాడు - 'కురుకుల శ్రేష్ఠా! పార్థా! ఆ శిష్యుడు ఉత్తమ గుణసంపన్నుడు, శాంతుడు, ప్రియకార్యాలు చేసేవాడు. శరణందిన వాడు. తగిన రీతిగా ప్రశ్నలు అడుగుతున్నవాడు. గురువుకు నీడలాగా ఉండేవాడు. ఇంద్రియ నిగ్రహం గలవాడు, ప్రయత్నశీలుడు. బ్రహ్మచారి. మేధావి, ఉత్తమ నియమాలు పాటించేవాడు. అటువంటివాడు ఆ ప్రశ్నలను అడిగాడు. గురువు చెప్పాడు - 'వత్సా! బ్రహ్మదేవుడు వేదవిషయాలను ఆశ్రయించి నీవు అడిగిన ప్రశ్నలకు అన్నింటికి ఇంతకుముందే సమాధానాలు ఇచ్చి ఉన్నాడు. ఈ ప్రశ్నలకు సమాధానంగా పరమార్థ విచారం ఉన్నది. జ్ఞానమే పరబ్రహ్మమని, సంన్యాసమే ఉత్తమ తపస్సని మేము ఎరుగుదుము. అబాధితమయిన జ్ఞానతత్త్వాన్ని నిశ్చయపూర్వకంగా తెలుసుకొని సమస్త ప్రాణులు తనలోనే ఉన్నాయని తెలుసుకొనే వాడు సర్వవ్యాపకుడని భావిస్తారు. సంయోగ వియోగాలను, ఏకత్వానేకత్వాలను యథార్థంగా తెలుసుకొన్న విద్వాంసుడు దుఃఖవిముక్తుడవుతాడు. ఏ వస్తువును కోరనివాడు, ఏ విషయం గురించి మనస్సులో అభిమానం లేనివాడు ఈ లోకంలో ఉండికూడా బ్రహ్మభావాన్ని పొందుతాడు. మాయను, సత్యాది గుణాలను యథార్థంగా తెలుసుకొన్నవాడు, సర్వభూతాల విధానం తెలిసినవాడు, అహంకార మమకారాలు లేనివాడు ముక్తుడవుతాడు. ఈ విషయంలో సందేహం లేదు.

ఈ దేహం ఒక వృక్షం లాంటిది. అజ్ఞానం దీనికి మూలమయిన బీజం. బుద్ధి బోదె. అహంకారం శాఖలు. ఇంద్రియాలు తొర్రలు. పంచమహాభూతాలు దానికి విశేషావయవాలు. ఆ భూతాల విశేషభేదాలు చిరుకొమ్మలు. దీనికి నిరంతరం సంకల్పాలు అనే ఆకులు పుడుతుంటాయి. కర్మలు అనే పూలు పూస్తుంటాయి. శుభాశుభకర్మల వల్ల కలిగే సుఖదుఃఖాదులే దానికి కాసే పండ్లు. ఈ రీతి బ్రహ్మరూపమయిన బీజం

నుంచి వ్యక్తమయి ప్రవాహరూపంగా నిరంతరం ఉండే దేహం అనే వృక్షం సమస్త ప్రాణుల బ్రతుకులకు ఆధారం. దీనితత్త్వాన్ని చక్కగా తెలుసుకొని జ్ఞానమనే ఉత్తమ ఖడ్గంతో దీన్ని ఖండించేవాడు అమరుడయి జననమరణ విముక్తుడు అవుతాడు. మేధావీ! సనాతన జ్ఞాన విషయం జరిగింది, జరుగుతున్నది, జరగబోయేది అనే మూడు కాలాలు గలది, ధర్మాన్ని అర్థాన్ని, కామాన్ని నిశ్చయించేది, సిద్ధుల సమూహాలు బాగా తెలుసుకున్నది. పూర్వకాలంలో నిర్ణీతమయినది. బుద్ధిమంతులు తెలుసుకొని సిద్ధులు అయ్యేది, ఉత్తమమయినది. అది తెలిసిన విద్వాంసులు సిద్ధు లవుతారు. పూర్వకాలంలో ప్రజాపతి దక్షుడు, భరద్వాజుడు, గౌతముడు, శుక్రుడు, వసిష్ఠుడు, కశ్యపుడు, విశ్వామిత్రుడు, అత్రి అనే మహర్షులు తమ కర్మలతో సమస్త మార్గాలలో సంచరిస్తూ అమితంగా అలసిపోయారు. అప్పుడు అంతా కలిసి తమలో తాము చర్చించుకొంటూ మిక్కిలి వృద్ధుడయిన అంగిరసుడనే మునిని ముందుంచుకొని బ్రహ్మభవనంలో ఎలాంటి కల్మషంలేని బ్రహ్మదేవుని దర్శించారు. ఆ మహర్షులు అందరూ బ్రహ్మదేవునికి నమస్కరించి వినయయుక్తులయి నీవలెనే తమకు పరమశ్రేయస్కరమయిన దానిని గూర్చి ఇలా అడిగారు. 'శ్రేష్ఠకర్మను ఎలా చేయాలి? పాపంనుంచి ఎలా ముక్తులం కావాలి? ఏ మార్గాలు మాకు మేలు కలిగిస్తాయి? సత్యం అంటే ఏమిటి ? పాపం అంటే ఏమిటి ? మానవుడు దక్షిణాయనం, ఉత్తరాయణం అనే గతులను పొందే రెండు కర్మమార్గాలు ఏవి? ప్రళయం, మోక్షం అంటే ఏమిటి ? ప్రాణుల జనన మరణాలంటే ఏమిటి ?' ఈ విధంగా మునిశ్రేష్ఠులు అడిగితే పితామహుడు బ్రహ్మదేవుడు చెప్పింది శాస్త్రానుసారంగా పూర్తిగా చెపుతాను విను.

'ఉత్తమవ్రత పరిపాలకులయిన మహర్షులారా! చరాచర జీవులు అన్నీ సత్యరూపుడయిన పరమాత్మ నుండి జనించాయి. తపోరూపమయిన కర్మతో జీవిస్తున్నాయి. అవి తమకు కారణ రూపమయిన బ్రహ్మను మరచి తమకర్మానుసారం రాకపోకల చక్రంలో తిరుగుతున్నాయి. గుణాలతో కూడి ఉన్న సత్యమే పంచలక్షణాలు కలది అని నిశ్చయించారు. బ్రహ్మసత్యం. తపస్సు సత్యం. ప్రజాపతి కూడా సత్యస్వరూపమే. సత్యంనుంచే సమస్త ప్రాణులు జనించాయి. ఈ భౌతిక జగత్తు కూడా సత్యమయమే. కాబట్టి ఎల్లప్పుడు యోగపరాయణులై, కోపాన్ని సంతాపాన్ని అతిక్రమించి, నియమపాలకులై, సత్యాన్ని సేవించే బ్రాహ్మణులు సత్యాన్నే ఆశ్రయిస్తారు. పరస్పరం నియమాలలో ఉంచుకొనే వారు, ధర్మమర్యాదా

ప్రవర్తకులు, విద్వాంసులు అయిన బ్రాహ్మణులకు లోకక్షేమంకరమయిన సనాతన ధర్మాన్ని ఉపదేశిస్తాను. అలాగే వర్ణాశ్రమాలకు ప్రత్యేకంగా ఉన్న నాలుగు విద్యలను చెపుతాను. మేధావులయిన విద్వాంసులు నాలుగు పాదాలు గల ధర్మం నిత్యం అని చెపుతున్నారు. పూర్వకాలంలో మేధావులయిన వారు ఆశ్రయించిన బ్రహ్మభావానికి సునిశ్చిత సాధనమై, పరమ మంగళకరమై, శుభంకరమైన మార్గాన్ని మీకు ఉపదేశిస్తాను. ఏకాగ్రతచిత్తులయి వినండి. అత్యంతమూ దుర్విజ్ఞేయమై, సంపూర్ణంగా పరమ పద రూపమైన దాన్ని చెపుతాను వినండి. ఆశ్రమాల్లో బ్రహ్మచర్యమే ప్రథమాశ్రమమని చెప్పారు. గృహస్థాశ్రమం రెండవది. మూడోది వానప్రస్థం. దాని తరువాతది సంన్యాసాశ్రమం. కాబట్టి ఇది పరమ పద రూపం అని తెలుసుకోవాలి. అధ్యాత్మజ్ఞానం కలగనంతవరకు మానవుడు జ్యోతిని, ఆకాశాన్ని, సూర్యుని, ఇంద్రుని, ప్రజాపతిని చూస్తుంటాడు.

కాబట్టి మొదట ఆత్మజ్ఞానానికి తగిన ఉపాయం చెపుతాను. వినండి. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు అనే ద్విజాతులకు వానప్రస్థాశ్రమాన్ని విధించారు. అడవిలో ఉంటూ ముని వృత్తిని స్వీకరించి పండ్లు, గాలి, నీరు ఆహారంగా జీవితం గడుపుతుండటం వానప్రస్థాశ్రమలక్షణం. అన్ని వర్ణాలవారికి గృహస్థాశ్రమాన్ని విధించారు. విద్వాంసులు శ్రద్ధయే ధర్మలక్షణం అని చెప్పారు. ఈ రీతిగా మీకు దేవయాన మార్గాలను చెప్పాను. ధీరులయిన మహాత్ములు తమ కర్మలతో ధర్మ మర్యాదను అనుసరిస్తుంటారు. ఉత్తమవ్రతాన్ని ఆశ్రయించి, పైన చెప్పిన ధర్మాల్లో ఏ ఒక్కదాన్నయినా దృఢంగా అనుష్ఠించేవాడు కాలక్రమాన ప్రాణుల జనన మరణాలను ప్రత్యక్షంగా చూస్తాడు. ఇప్పుడు నేను యథార్థమయిన యుక్తులతో, పదార్థాలలో విభాగరూపంగా ఉండే సంపూర్ణతత్వాలను వివరిస్తాను. అవ్యక్త ప్రకృతి, మహత్తత్వం, అహంకారం, దశేంద్రియాలు, మనస్సు పంచ మహాభూతాలు, వాటి విశేషగుణాలయిన శబ్దాదులు అనే ఈ 24 తత్వాలు మొదటి సనాతన సృష్టి. జీవాత్మ ఒకటి. మొత్తం ఇరవై అయిదు తత్వాల సంఖ్య అని చెప్పారు. ఈ తత్వాల ఉత్పత్తి వ్యయాదులు చక్కగా తెలుసుకొనేవాడే సర్వప్రాణులలో ధీరుడు అని అంటారు. ఆయన ఎప్పుడూ మోహావిష్టుడుగాడు. సంపూర్ణతత్వాలను, గుణాలను, సమస్త దేవతలను యథాతథంగా తెలుసుకొన్నవాడు సమస్త పాపాలు తొలగి, బంధవిముక్తుడై సమస్త దివ్యలోక సుఖాన్ని అనుభవిస్తాడు.'

36. గురుశిష్య సంవాదము - 2.

బ్రహ్మ చెప్పాడు - 'మహర్షులారా! త్రిగుణాల సామ్యావస్థ అవ్యక్త ప్రకృతి అవుతుంది. అది అవ్యక్తాలయిన సమస్త ప్రాకృత కార్యాల్లో వ్యాపకం, అవినాశి, స్థిరమయింది. పైన చెప్పిన మూడుగుణాలలో విషమత్వం ఏర్పడినప్పుడు అవి పంచభూత రూపాలను ధరిస్తాయి. వాటివల్ల తొమ్మిది వాకిళ్ళు గల పుర (శరీర) నిర్మాణం జరుగుతుంది. ఈ పురంలో జీవాత్మను విషయాలమీదికి ప్రేరేపించే మనస్సుతో కూడా కలిసి పదకొండు ఇంద్రియాలు ఉన్నాయి. బుద్ధి ఈ నగరానికి ప్రభువు. పదకొండోది మనస్సు. పది ఇంద్రియాలకంటె శ్రేష్ఠం. దీనిలో మూడు స్రోతస్సులు (చిత్తం అనే నదీ ప్రవాహాలు) ఉన్నాయి. ఆ మూడు గుణమయాలయిన నాడులద్వారా పలుమారులు నిండుతూ ప్రవహిస్తుంటాయి. తమస్సు, రజస్సు, సత్త్వం అని ఈ మూడు గుణాలను చెపుతారు. ఇవి ఒకదానితో ఒకటి ప్రతిద్వంద్వులు. పరస్పరం ఆశ్రయించి ఉంటాయి. ఒకదాని సహాయంతో ఇంకొకటి నిలుస్తుంది. ఒకదాన్ని ఒకటి అనుసరిస్తుంటుంది. పరస్పరం కలుస్తుంటాయి. పంచభూతాలు త్రిగుణాత్మకాలు. తమస్సుకు సత్త్వం విరోధి, సత్త్వానికి రజస్సు విరోధి. రజోగుణానికి సత్త్వగుణం శత్రువు. సత్త్వగుణం తమోగుణం ప్రతిద్వంద్వి. తమోగుణాన్ని నిరోధిస్తే రజోగుణం ప్రవర్తిస్తుంది. రజోగుణాన్ని నిరోధిస్తే అక్కడ సత్త్వగుణం ప్రవర్తిస్తుంది. తమస్సు అంధకార రూపం, త్రిగుణమయం అని తెలుసుకోవాలి. దీనికి మోహం అని పేరు. అది అధర్మ లక్షణం. పాపాలు చేసేవారిలో తప్పక ఉంటుంది. ఈ తమోగుణ రూపం ఇతర గుణాలతో కలిసి కూడా కనిపిస్తుంటుంది. రజోగుణాన్ని, ప్రకృతిరూపం అని చెపుతారు. అది సృష్టి ఉత్పత్తికి కారణమవుతుంది. సర్వభూతాల్లో దీని ప్రవృత్తి కన్పిస్తుంది. ఈ కన్పించే జగత్తు అంతా దాని స్వరూపమే. ఉత్పత్తి, ప్రవృత్తులు దీని లక్షణాలు. సర్వభూతాలలో ప్రకాశం, లఘుత్వం (గర్వరాహిత్యం), శ్రద్ధ అనేవి సత్త్వగుణరూపాలు. గర్వంలేక పోవటాన్ని గొప్పవారు ప్రశంసిస్తారు.

ఇప్పుడు తాత్త్విక యుక్తులతో సంక్షేపంగా, విస్తారంగా ఈ త్రిగుణాల కార్యాలను యథార్థంగా వివరిస్తాను. వాటిని జాగ్రత్తగా వినండి. మోహం, అజ్ఞానం, త్యాగం లేకపోవటం, కర్తవ్యనిర్ణయం చేసుకోలేకపోవటం, నిద్ర, గర్వం, భయం, లోభం, మంచి పనులలో లోపాలు చూడటం, మతిమరపు, పరిణామాన్ని ఆలోచించకపోవటం, నాస్తికత్వం, చెడునడత, మంచిచెడులు తెలియకపోవటం, ఇంద్రియాల శైథిల్యం, హింసాదులయిన నిందిత దోషాలలో ప్రవర్తించటం, చేయదగినదానిని చేయగూడనిదిగాను, అజ్ఞానాన్ని జ్ఞానంగాను

భావించటం, శత్రుత్వం, పనిలో మనస్సు పెట్టకపోవటం, అశ్రద్ధ, మూర్ఖమయిన ఆలోచన, కుటిలత్వం, తెలివితక్కువతనం, పాపం చేయటం, అజ్ఞానం, సోమరితనం మొదలయినవాటివల్ల లావుకావటం, భక్తిభావం లేకపోవటం, ఇంద్రియజయం లేకపోవటం, నీచకర్మలలో ఆసక్తి అనే ఈ దుర్గుణాలు అన్నీ తమోగుణ కార్యాలు అని చెప్పారు. ఇవేకాక లోకంలో నిషిద్ధాలయిన భావాలు అన్నీ తమోగుణా లనే పేరుతోనే ఉన్నాయి. దేవతలను, బ్రాహ్మణులను, వేదాలను ఎల్లప్పుడు నిందించటం, దానం చేయకపోవటం, అభిమానం, మోహం, కోపం, ఓర్పులేకపోవటం, ప్రాణులమీద మాత్సర్యం అనేవి తామసుల చేష్టలు. విధి, శ్రద్ధ లేకుండా వ్యర్థకార్యాలను మొదలుపెట్టటం, దేశకాల పాత్రలను ఆలోచించకుండా వృధాగా దానం చేయటం, దేవతలకు, అతిథులకు పెట్టకుండా తినటం తామసుల పనులు. అతివాదం, క్షమాగుణం లేకపోవటం, మాత్సర్యం, అభిమానం, అశ్రద్ధ అనేవి తామసుల ప్రవర్తనలో ఉంటాయి. లోకంలో ఈ విధమయిన ప్రవర్తన గలవారు, పాపకార్యాలు చేసేవారు, ధర్మమర్యాదను భంగం చేసే మనుష్యులు తామసులు.

ఇలాంటి పాపాత్ములయిన మానవులకు మరుజన్మలో ఏయే జాతులు కలుగుతాయో చెపుతాను. వారిలో కొందరిని క్రింది నరకాలలో పడవేస్తారు. మరికొందరు పశుపక్ష్యాదులుగా జన్మిస్తారు. చెట్లు చేమలు, వృక్ష పర్వతాదులయిన జీవులు, పశువులు, వాహనాలు, రాక్షసులు, సర్పాలు, చీమలు, దోమలు, పురుగులు, పక్షులు, అండజ ప్రాణులు, నాలుగు కాళ్ళ జంతువులు, పిచ్చివారు, చెవిటివారు, మూగవారు, ఇంకా ఇతరమయిన పాపరోగాలు గల, మానవులు అందరూ తమోగుణంలో మునిగి ఉన్నవారు. తమ కర్మలకు తగిన లక్షణాలు గల ఈ దురాచారులు నిరంతరం దుఃఖంలో మునిగి ఉంటారు. వారి చిత్తవృత్తుల ప్రవాహం నీచ దశకు పోతుంటుంది. కాబట్టి వారిని అర్వాక్‌స్రోతసులు అని చెపుతారు. తమోగుణంలో మునిగి ఉండే ఆప్రాణులన్నీ తామసాలు.

ఇకమీద నేను ఆతామస జన్మలను పొందిన ప్రాణుల ఉన్నతి, సమృద్ధి ఎలా ఉంటుంది ? వారు పుణ్య కర్మలు చేసి, ఉత్తమ లోకాలు ఎలా పొందుతారో చెపుతాను. విపరీత జన్మలనందిన ప్రాణులు వారి పాపకర్మానుభవం పూర్తి అయిన తరువాత పూర్వజన్మ కృతపుణ్యం ఉదయించినప్పుడు పుణ్యకర్మల సంస్కారాల ప్రభావంతో స్వకర్మ నిష్ఠులయి, కళ్యాణకాములయిన బ్రాహ్మణులతో సమానులవుతారు. అంటే వారి వంశంలో జన్మిస్తారు. అక్కడ ప్రయత్నశీలురయి పైకి వస్తారు. దేవతల స్వర్గలోకానికి వెళ్తారు అని వేద వాక్కు ఉంది. పునరావృత్తి శీలమయిన సకామ కర్మానుష్ఠానం చేసే మానవులు

దేవభావాన్ని పొందిన తరువాత, అక్కడినుంచి ఇంకొక జన్మ పొందినప్పుడు, అక్కడ మర్త్యలోకంలో మానవులుగా జన్మిస్తారు. వారిలో ఎవరయినా (మిగిలిన పాపకర్మను అనుభవించటానికి) మళ్ళీ పాప జన్మగల చండాలురు, మూగవారు, ఆగి ఆగి మాట్లాడేవారు (నత్తి), సంకరజాతి వారు అవుతారు. తరచుగా వారు జన్మజన్మాంతరాలలో ఉత్తరోత్తరం ఉత్తమవర్ణాలను పొందుతారు. ఎవరయినా శూద్ర జన్మను దాటి గూడా, తామస గుణయుక్తులయి ఆ ప్రవాహంలోపడి, తమో గుణంలోనే ప్రవృత్తులు అవుతారు. భోగాసక్తినే మహామోహం అంటారు. ఈ మోహంలో పడిపోయి భోగసుఖాలను కోరే ఋషులు, మునులు, దేవతలు గూడా మోహితులవుతారు. (ఇక సాధారణ మనుష్యుల సంగతి వేరే చెప్పవలెనా?) తమస్సు (అవిద్య), మోహం (అస్మిత), మహామోహం (రాగం), క్రోధం అనే పేరుగల తామిస్రం, మృత్యురూపమయిన అంధతామిస్రం, ఇలా తామస ప్రకృతి పంచవిధమని చెప్పారు. క్రోధాన్నే తామిస్రం అంటారు. విప్రులారా! వర్ణం, గుణాలు, జాతి, తత్త్వాలను అనుసరించి నేను మీకు తమోగుణాన్ని గురించి పూర్తిగా యథావత్తుగా చెప్పాను. తత్త్వం కాని దానిలో తత్త్వదృష్టి పెట్టే మనుష్యుడు ఎవరయినా, ఈ విషయాన్ని బాగా గమనించి తెలుసుకొనేవాడు ఎలా అవుతాడు? ఈ విపరీత దృష్టియే తమోగుణానికి యథార్థమయిన గుర్తు. ఈ విధంగా తమోగుణ స్వరూపాన్ని, దానికార్యాలయిన నానావిధ గుణాలను చక్కగా వివరించాను. తమోగుణం వల్ల కలిగిన ఉత్తమ నీచజన్మలను గురించి కూడా చెప్పాను. ఈ గుణాలను సరిగా తెలుసుకొన్న మానవుడు సమస్త తామస గుణాలనుంచి ఎల్లప్పుడు విముక్తుడవుతాడు.'

37. గురుశిష్య సంవాదము - 3.

బ్రహ్మదేవుడు చెప్పాడు - 'శ్రేష్ఠమహర్షులారా! ఇప్పుడు నేను రజోగుణ స్వరూపాన్ని, దానికార్యాలయిన గుణాలను గూర్చి యథార్థంగా చెపుతాను శ్రద్ధగా వినండి. సంతాపం, రూపం, శ్రమ, సుఖం, దుఃఖం, చలి, వేడి, ఐశ్వర్యం, విగ్రహం, సంధి, హేతువాదం, మనస్సు నిర్మలంగా లేకపోవటం, సహనం, బలం, శౌర్యం, మదం, రోషం, వ్యాయామం, కలహం, ఈర్ష్య, కోరిక, చాడీలు చెప్పటం, యుద్ధం, మమకారం, కుటుంబ రక్షణ, వధించటం, బంధించటం, క్లేశం, కొనటం, అమ్మటం, ఛేదించటం, భేదించటం, చీల్చటానికి ప్రయత్నించటం, ఇతరుల మర్మ చ్ఛేదనకు యత్నించటం, ఉగ్రత్వం, నిష్ఠురంగా ఉండటం,

కేకలు పెట్టటం, ఇతరుల లొసుగులను చెప్పటం, లౌకిక విషయాలను ఆలోచించటం, పశ్చాత్తాపం, మాత్సర్యం, నానావిధాలయిన సాంసారిక భావనాభావితులు కావటం, అబద్ధం చెప్పటం, ఉత్తుత్తిగా దానం చేయటం, సంశయ పూర్ణంగా ఆలోచించటం, తిరస్కారంగా మాట్లాడటం, నిందించటం, స్తుతి చేయటం, ప్రశంసించటం, ప్రతాపం, బలాత్కరించటం, స్వార్థంతో రోగికి పరిచర్య, పెద్దలకు సేవ చేయటం, శుశ్రూష, తృష్ణ, ఇతరులను ఆశ్రయించటం, వ్యవహారకుశలత, నీతి, దుర్వ్యయం, దోషారోపణం, దానం తీసుకోవటం అనేవి రజోగుణ కర్మలు. లోకంలో స్త్రీలకు, పురుషులకు, భూతాలకు, ద్రవ్యాలకు, గృహాదులకు ప్రత్యేకంగా చేసే సంస్కారాలు రజోగుణ ప్రేరణ ఫలితాలే. సంతాపం, అవిశ్వాసం, సకామ వ్రతాలు, నియమాలు, కామ్యకర్మలు, వాపీకూప తటాకాదులయిన వివిధ కార్యాలు, స్వాహాకారం, నమస్కారం, స్వధాకారం, వషట్కారం, యజ్ఞం చేయించటం, వేదం చెప్పటం, యజ్ఞం చేయటం, వేదాధ్యయనం చేయటం, దానమివ్వటం, తీసుకోవటం, ప్రాయశ్చిత్తాలు, శుభకార్యాలు రజోగుణ క్రియలే. నాకు ఇదికావాలి, అది కావాలి అని విషయప్రాప్తికై ఉత్కంఠ కలగటానికి హేతువు రజోగుణమే.

ద్రోహం, మాయ, మోసం, గర్వం, దొంగతనం, హింస, అసహ్యం, పరితాపం, జాగారం చేయటం, డాంబికం, దర్పం, అనురాగం, సకామ భక్తి, విషయాలయందు ప్రేమ, సంతోషం, జూదమాడటం, లోకులతో వివాద పడటం స్త్రీ సంబంధాన్ని పెంపొందించుకోవటం, నృత్యగీత వాద్యాలలో ఆసక్తి అనేవి అన్నీ రాజసగుణ లక్షణాలని చెపుతారు. లోకంలో ఉండే భూతవర్తమాన భవిష్యత్ పదార్థాలను గురించి చింతించేవారు. ధర్మార్థ కామాల్లో నిరతులు, ఇష్టం వచ్చినట్లు నడుచుకొనే వారు, సమస్తమయిన కాంక్షితాలు సమృద్ధిగా ఉంటే వాటితో ఆనందించే మనుష్యులు రజోగుణ యుక్తులు. వీరిని అర్వాక్ స్రోతసులు అని చెపుతారు. ఇటువంటివారు ఈ లోకంలో మాటిమాటికి పుట్టి విషయానంద మగ్నులవుతు ు. ఇహలోక పరలోకాల్లో సుఖించగోరుతారు. సకామంగా దానాలు ఇస్తారు. తీసుకొంటారు. తర్పణాలు యజ్ఞాలు చేస్తారు. మహర్షులారా! మీకు రజోగుణం గలవారిని గురించి విస్తారంగా ఉన్నది ఉన్నట్లు చెప్పాను. రజోగుణ యుక్తుల ప్రవర్తనను చెప్పాను. ఈ రజోగుణ విశేషాలను బాగా తెలుసుకొన్న మానవుడు సర్వరాజసగుణాలనుంచి ముక్తుడవుతాడు.'

38. గురుశిష్య సంవాదము - 4.

బ్రహ్మదేవుడు చెప్పాడు - మునులారా! ఇకమీద లోకంలో సమస్త ప్రాణులకు హితమయినది, పవిత్రమయినది, సజ్జనుల ధర్మమయినది, మూడవది అయిన సత్త్వగుణాన్ని గురించి చెపుతాను. ఆనందం, ప్రసన్నత, ఉన్నతి, ప్రకాశం, సుఖం, ఉదారత, నిర్భయత్వం, సంతోషం, శ్రద్ధ, ఓర్పు, ధైర్యం, అహింస, సమత్వం, ఋజుప్రవర్తన, కోపరాహిత్యం, అసూయలేకపోవటం, పవిత్రత, నేర్పు, పరాక్రమం అనేవి సత్త్వగుణకార్యాలు. నానావిధ లోక విషయజ్ఞానం, సకామవ్యవహారం సేవ, శ్రమ, అనేవి వ్యర్థం అని భావించి క్షేమంకర విషయసాధనలో మగ్నుడయిన వాడు పరలోకంలో అక్షయ సుఖం పొందుతాడు. మమకార రహితుడు, నిరహంకారి, ఆశాహీనుడు, సర్వసముడు, అన్ని విషయాల్లో నిష్కాముడు కావటమే ఉత్తముల సనాతన ధర్మం. విశ్వాసం, లజ్జ, సహనం, త్యాగం, పవిత్రత, సోమరితనం లేకపోవటం, క్రూరతారాహిత్యం, మోహం లేకపోవటం, ప్రాణులయందు దయ, పీనాసితనం లేకపోవటం, హర్షం, తుష్టి, గర్వరాహిత్యం, వినయం, సాధుప్రవర్తన, శాంతికర్మతో శుద్ధ భావంతో ప్రవర్తించటం, పవిత్రమయిన బుద్ధి, ఆసక్తిలేకపోవటం, లౌకిక కాంక్షలలో ఉదాసీనత, బ్రహ్మచర్యం, సర్వవిధ త్యాగం, మమకార రాహిత్యం ఫలకాంక్షలేకపోవటం, నిరంతరం స్వధర్మపాలన అనేవి సత్త్వగుణ కార్యాలు. దానం, యజ్ఞం, అధ్యయనం, వ్రతం, పరిగ్రహం, ధర్మం, తపస్సు అనేవి కోరికతో చేసేవి వ్యర్థం అని భావించి పైన చెప్పిన రీతిగా నడుచుకుంటూ ఈ లోకంలో సత్యాన్ని ఆశ్రయించే వారు, వేదోత్పత్తికి స్థానమయిన పరమాత్మనిష్ఠలయి ఉండే బ్రాహ్మణులే ధీరులు, సాధుదర్శనులని భావిస్తారు. ఆ ధీరులయిన మానవులు సర్వపాప విముక్తులై శోకరహితులు అవుతారు. స్వర్గానికి వెళ్ళి అచటి భోగాలు అనుభవించటానికి అనేక శరీరాలు ధరిస్తారు. సత్త్వగుణ సంపన్నులయిన మహాత్ములు స్వర్గంలో ఉండే దేవతలవలె ఈశిత్వం, వశిత్వం, లఘుత్వం, అనే మానసిక సిద్ధులను పొందుతారు. వీరిని ఊర్ధ్వ స్రోతసులు, వైకారిక దేవతలు అని అంటారు. యోగ బలంతో స్వర్గానికి వెళ్ళిన తరువాత వారి చిత్తం ఆయా భోగాలతో కలిగే సంస్కారంతో వికృతం అవుతుంది. అప్పుడువారు కోరిన వస్తువులను విభజించుకొంటారు. ద్విజశ్రేష్ఠులారా! ఈ రీతిగా మీకు సాత్త్వికుల ప్రవర్తనను చెప్పాను. ఇది తెలుసుకున్నవాడు కోరింది అంతా పొందుతాడు. సత్త్వగుణ విశేషాలను వివరంగా చెప్పాను. ఆ గుణాలు ప్రవర్తించే తీరును చెప్పాను. ఈ గుణాలు తెలుసుకొన్న మానవుడు గుణాలను అనుభవిస్తాడుగాని ఆ గుణాలచేత బద్ధుడు గాడు.

39. గురుశిష్య సంవాదము - 5.

బ్రహ్మదేవుడు చెప్పాడు - 'మహర్షులారా! సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం అనే వాటిని మూడింటిని గురించి విడిగా చెప్పటం అసంభవం. అవి మూడు కలిసే కనిపిస్తాయి. ఈ గుణాలు పరస్పరం అనురక్తాలు అవుతాయి. అన్యోన్యం అనుప్రాణితం లవుతాయి. అన్యోన్యం ఆశ్రయించి ఉంటాయి. అన్నీ ఒక దాన్ని ఇంకొకటి అనుసరిస్తాయి. ఈ జగత్తులో సత్త్వగుణం ఉన్నంతవరకు రజోగుణం ఉంటుంది. తమోగుణం ఉన్నంతకాలం సత్త్వం ఉంటుంది. రజోగుణం కూడా అలాగే ఉంటుంది అనటంలో సందేహం లేదు. ఈ మూడు గుణాలు ఏదయినా నిమిత్తం వల్లగాని, నిర్నిమిత్తంగా గాని ఎల్లప్పుడు కలిసి ఉంటాయి. కలిసే సంచరిస్తాయి. సమూహమయి యాత్ర చేస్తాయి. శరీరంలో ఉంటాయి. ఇలాగయినా ఒకప్పుడు ఉన్నతి, అవనతి స్వభావంతో, ఒకదాన్ని ఒకటి అనుసరిస్తాయి. ఈ గుణాల్లో ఒకదానికి, ఆధిక్యం ఇంకొకదానికి న్యూనత కనిపిస్తుంటుంది. ఆధిక్యం ఎలా కలుగుతుందో చెపుతాను. పశుపక్ష్యాదులయిన తిర్యక్కులలో తమోగుణం అధికంగా ఉన్నచోట రజస్సు అల్పంగాను, సత్త్వం అల్పతరంగాను ఉంటాయి. రజోగుణం మధ్యస్రోతస్సులైన మనుష్యులలో రజోగుణం అధికంగాను, తమోగుణం అల్పంగాను, సత్త్వగుణం అల్పతరంగాను ఉంటాయి. ఊర్ధ్వ స్రోతస్సులైన - దేవజాతులలో సత్త్వగుణం అధికంగాను, తమోగుణం అల్పంగాను, రజోగుణం అల్పతరంగాను ఉంటాయి. సత్త్వగుణం ఇంద్రియాల ఉత్పత్తికి కారణం అవుతుంది. దాన్ని వైకారిక హేతువు అంటారు. అది ఇంద్రియాలను, వాటి విషయాలను ప్రకాశింప చేస్తుంది. సత్త్వగుణాన్ని మించిన ధర్మం ఇంకొకటి లేదని చెపుతారు. **సత్త్వగుణంలో ఉన్నవారు స్వర్గాది ఉత్తర లోకాలను పొందుతారు. రజోగుణం కలవారు మధ్యమలోకంలో మానవులుగా ఉంటారు. తమోగుణ కార్యరూపాలయిన నిద్రాప్రమాదాలస్యాదులలో ఉన్న తామసులయిన మానవులు అధోలోకాలను, నీచజన్మను, నరకాన్ని పొందుతారు. శూద్రునిలో తమోగుణం, క్షత్రియునిలో రజోగుణం, బ్రాహ్మణునిలో ఉత్తమమయిన సత్త్వగుణం ఉంటాయి. ఈ రీతిగా ఈ వర్ణత్రయంలో ముఖ్యంగా ఈ మూడుగుణాలు ఉంటాయి.*** కలిసి తిరిగే ఈ మూడు గుణాలు దూరం నుంచి కూడా కలిసి ఉన్నట్లే

---

* ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః మధ్యే తిష్ఠంతి రాజసాః ।
జఘన్యగుణసంయుక్తాః యాంత్యధస్తామసా జనాః ॥ 10
తమః శూద్రే రజః క్షత్రే బ్రాహ్మణే సత్త్వముత్తమమ్ ।
ఇత్యేవం త్రిషు వర్ణేషు వివర్తంతే గుణాస్త్రయః ॥ 11

కన్పిస్తాయి. తమోగుణం, సత్త్వగుణం, రజోగుణం విడిగా ఉంటాయని ఎప్పుడూ వినలేదు. సూర్యుడు ఉదయించగా చూసి, దురాచారులయినవారు భయపడతారు. ఎండకు బాధపడి బాటసారులు తీవ్ర సంతాపానికి లోనవుతారు. ఆదిత్యుడు సత్త్వగుణ ప్రధానుడు, దురాచారులయిన వ్యక్తులు తమోగుణ ప్రధానులు. బాటసారులకు గలిగే సంతాపం రజోగుణ జన్యం అని చెపుతారు. సూర్య ప్రకాశం, సత్త్వగుణం, వేడిమి రజోగుణం, అమావాస్యనాడు కలిగే గ్రహణం తమోగుణకార్యం అవుతుంది.

ఈ రీతిగా అన్నిజ్యోతీరూపాల్లోను మూడుగుణాలు అక్కడక్కడ ఆయా రీతులలో వ్యక్తమవుతాయి. విలీనం అవుతాయి. స్థావర ప్రాణులలో తమోగుణం అధికంగా ఉంటుంది. వాటిల్లో ఉండే పెరగటం అనే క్రియ రజోగుణం, వాటిల్లో గల జిడ్డు సత్త్వగుణం అవుతాయి. గుణభేదంతో దినం ముప్పిధం అని తెలుసుకోవాలి. రాత్రిగూడా త్రివిధం. మాసాలు, పక్షాలు, సంవత్సరాలు, ఋతువులు, సంధ్యలు గూడా మూడేసి భేదాలు కలిగి ఉంటాయి. త్రివిధాలయిన దానాలు ఇస్తారు. యజ్ఞం త్రిగుణాత్మకంగా జరుగుతుంది. లోకాలు, దేవతలు, విద్యలు, గతులు కూడా మూడేసి రీతులుగా ఉంటాయి. భూతకాలం, వర్తమానం, భవిష్యత్తు, ధర్మార్థకామాలు, ప్రాణాపానోదానాలు అన్నీ త్రిగుణాత్మకాలు. ఈ లోకంలో భిన్నభిన్న కాలాలలో, భిన్నభిన్న రీతులుగా లభించే వస్తువులు అన్నీ త్రిగుణాత్మకాలే. అంతటా త్రిగుణాల ఉనికి ఉన్నది. ఈ గుణత్రయం అవ్యక్తంగా, ప్రవాహరూపంగా నిత్యం. సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడుగుణాల సృష్టి సనాతనం. ప్రకృతిని తమస్సు, వ్యక్తం, శివం, ధామ, రజస్సు, జాతి, సనాతనం, వికారం, ప్రళయం, ప్రధానం, ప్రభవం, అప్యయం, అనుద్రిక్తం, అనూనం, వ్యాపకం, అచలం, ధ్రువం, సత్తు, అసత్తు, అవ్యక్తం, త్రిగుణాత్మకం అని చెపుతారు. అధ్యాత్మతత్త్వాన్ని చింతించేవారు వీటి జ్ఞానం కలిగి ఉండాలి. ప్రకృతికి గల ఈ పేర్లను, సత్త్వాదులయిన గుణాలను, సంపూర్ణ విశుద్ధ గతులను చక్కగా తెలుసుకొన్నవాడు గుణవిభాగతత్త్వజ్ఞు డవుతాడు. ఆతనిమీద సాంసారిక దుఃఖాల ప్రభావం పడదు. ఆతడు దేహం వీడినతరువాత సర్వగుణాలనుంచి సంపూర్ణంగా విముక్తుడవుతాడు.'

40. గురుశిష్య సంవాదము - 6.

బ్రహ్మదేవుడు చెప్పాడు - 'మహర్షులారా! మొదట అవ్యక్త ప్రకృతినుండి మహత్తరాత్మ స్వరూపమయిన మహా బుద్ధితత్త్వం కలిగింది. ఇది అన్ని గుణాలకు

ఆదితత్త్వం. దీన్ని ప్రథమ సర్గం అంటారు. మహత్తరాత్మ, మతి, విష్ణువు, జిష్ణువు, శంభువు, వీర్యవంతుడు, బుద్ధి, ప్రజ్ఞ, ఉపలబ్ధి, ఖ్యాతి, ధృతి, స్మృతి, అనే పర్యాయ వాచకాలయిన పేర్లతో ఆ ఆత్మను గుర్తించటం జరుగుతుంది. దాని తత్త్వాన్ని తెలుసుకొన్న విద్వాంసుడయిన బ్రాహ్మణుడు మోహం పొందడు. పరమాత్మ అన్నివైపుల చేతులు, కాళ్ళు, అన్నిదిక్కుల కన్నులు తలలు, ముఖాలు, అన్నివైపుల చెవులు కలిగి అంతటా వ్యాపించి ఉంటాడు. అందరి హృదయాల్లో విరాజిల్లే, పరమపురుషుడయిన పరమాత్మ ప్రభావం చాలా గొప్పది. అణిమ, లఘిమ, ప్రాప్తి మున్నగు సిద్ధులు ఆయన స్వరూపాలే. ఆయన సర్వశాసకుడు, జ్యోతిర్మయుడు, అవినాశి. ప్రపంచంలో ఉండే ఏవ్యక్తులు అయినా బుద్ధిమంతులు, సద్భావపరాయణులు, ధ్యాతలు, నిత్యయోగులు, ఆడిన మాట తప్పనివారు, ఇంద్రియాలను జయించినవారు, జ్ఞానులు ఉదారచిత్తులు, కోపవిజేతలు, ప్రసన్నచిత్తులు, ధీరులు మమకార రహితులు, అహంకారం లేనివారు, అందరు ముక్తులయి పరమాత్మను పొందుతారు. సర్వశ్రేష్ఠుడయిన పరమాత్మను తెలుసుకొన్నవాడు పుణ్యదాయకమయిన ఉత్తమగతి పొందుతాడు. పృధివి, వాయువు, ఆకాశం, జలం, జ్యోతి అనే అయిదు మహాభూతాలు అహంకారాన్నుంచి జనించాయి. ఆ పంచభూతాలతో, వాటి కార్యాలయిన శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే వాటితో సర్వప్రాణులు కూడి ఉంటారు. ధీరులయిన మహర్షులారా! పంచ మహాభూతాల వినాశ సమయంలో ప్రళయం కలుగుతుంది. అప్పుడు సమస్త ప్రాణులకు మహాభయం కలుగుతుంది. కాని సమస్త ప్రాణులలో ఆత్మజ్ఞానులయిన ధీరులకు అప్పుడు కూడా మోహం కలుగదు. ఆది సర్గంలో సర్వసమర్థుడు, స్వయంభువు అయిన విష్ణుదేవుడు వ్యక్తం అవుతాడు. ఈ రీతిగా బుద్ధిరూపుడు, హృదయగుహలో ఉన్నవాడు, ప్రభువు, విశ్వరూపుడు, పురాణ పురుషుడు, హిరణ్మయుడయి జ్ఞానులకు పరమగతి అయిన పరమాత్మను తెలుసుకొనే బుద్ధిమంతుడు బుద్ధిహద్దును దాటి పోతాడు.'

41. గురుశిష్య సంవాదము - 7.

బ్రహ్మచెప్పాడు - 'మహర్షులారా! మొదట ఉత్పన్నమయిన మహత్తత్త్వాన్ని అహంకారం అంటారు. అది అహంకార రూపంగా ప్రాదుర్భవించినపుడు దాన్ని రెండవ సర్గం అంటారు. ఆ అహంకారం భూతాది వికారాలకు కారణమయినప్పుడు దాన్ని వైకారికం అంటారు. ఇది రజోగుణ రూపంగాబట్టి తైజసం అవుతుంది. దీనికి చేతనమయిన

ఆత్మఆధారం. సమస్త ప్రజా సృష్టి దీన్నుంచే అవుతుంది. కాబట్టి దీన్ని ప్రజాపతి అంటారు. ఇది శ్రోత్రాదులయిన ఇంద్రియ రూపదేవతలకు, మనస్సుకు ఉత్పత్తికి స్థానం అవుతుంది. స్వయంగా దేవరూపం కాబట్టి దీన్ని త్రిలోక కర్త అన్నారు. ఈ జగత్తు అంతా అహంకార రూపం. కాబట్టి దీన్ని అభిమంత అంటారు. అధ్యాత్మజ్ఞానంతో తృప్తులు, ఆత్మచింతన పరులు, స్వాధ్యాయమనే యజ్ఞంలో సిద్ధులు అయిన మునులకు ఈ సనాతనలోకం ప్రాప్తిస్తుంది. సమస్త భూతాలకు ఆది అయి, సమస్త భూతాలను ఉత్పన్నం చేసే ఆ అహంకారానికి ఆధారమయిన జీవాత్మ అహంకారం ద్వారా సమస్తగుణాలను సృష్టిస్తాడు. వాటిని అనుభవిస్తాడు. ఈ చేష్టాశీలమయిన జగత్తు అంతా వికారాలకు కారణమయిన అహంకారరూపమే. ఆ అహంకారమే తన తేజస్సుతో సమస్త జగత్తును రజోమయం (భోగకాంక్షగలదానిని) చేస్తుంది.'

42. గురుశిష్య సంవాదము - 8.

బ్రహ్మ చెప్పాడు - 'మహర్షులారా! అహంకారాన్నుంచి పృథివి, వాయువు, ఆకాశం, జలం, జ్యోతి అనే పంచమహాభూతాలు జనించాయి. ఈ పంచ మహాభూతాలలో అంటే వీటి శబ్ద స్పర్శ రూప రస గంధాలనే విషయాలతో సర్వప్రాణులు మోహాన్ని పొందుతారు. మహర్షులారా! మహాభూతాలు నశించిన సమయంలో ప్రళయం కలిగినప్పుడు సమస్త ప్రాణులకు మహాభయం కలుగుతుంది. ఏ మహాభూతాన్నుంచి ఏది జనిస్తుందో అది దానిలోనే లీనం అవుతుంది. ఇవి అనులోమ క్రమంలో ఒకదాని తరువాత ఇంకొకటి వ్యక్తం అవుతాయి. విలోమ క్రమంలో ఇవి ఒకదానిలో ఇంకొకటి లీనం అవుతాయి. ఈ రీతిగా స్థావర జంగమాత్మకమయిన ప్రాణి సమూహం లీనమయినా స్మరణశక్తి గల యోగులు ఎప్పుడూ లీనం కారు. శబ్ద స్పర్శ రూపరసాలు, గంధం అనే వీటిని నిగ్రహించే క్రియలు కారణరూపాన్నుంచి (సూక్ష్మమనః స్వరూపాలు కావటం చేత) నిత్యాలు. కాబట్టి ప్రళయకాలంలో ఇవికూడా లయంకావు. అనిత్యమయిన స్థూల పదార్థాలను మోహం అని పిలుస్తారు. లోభం, లోభం వల్ల కర్మలు, వాటినుండి పుట్టే సమస్త ఫలాలు సమానభావంతో చూస్తే వాస్తవంగా ఏమీకావు. శరీరంలోని బాహ్యాంగాలు రక్తమాంస సంఘాతాలు. కాబట్టి ఒకదాని సహాయంతో ఇంకొకటి ఉంటాయి. కాబట్టి వాటిని దీనాలు, కృపణాలు అన్నారు. ప్రాణం, అపానం, ఉదానం, సమానం, వ్యానం అనే అయిదు వాయువులు నియతంగా శరీరంలో ఉంటాయి. కాబట్టి ఇవి సూక్ష్మాలు. మనస్సు, వాక్కు బుద్ధులతో కలిపి వీనిని

లెక్కిస్తే ఇవి ఎనిమిది అవుతాయి. చర్మం, ముక్కు, శోత్రం, కన్నులు, నాలుక, వాక్కు అనే ఇంద్రియాలు వశంలో ఉండేవాడు మనస్సు శుద్ధమయినవాడు, బుద్ధిస్థిరంగా ఉండేవాడు, పైన చెప్పిన ఎనిమిది అగ్గులచేత మనస్సు దగ్ధం కానివాడు అద్వితీయమయి, శుభకరమయిన ఆ పరబ్రహ్మను పొందుతాడు.

ద్విజోత్తములారా! అహంకారం నుంచి ఉత్పన్నమయిన మనస్సుతో కూడా పదకొండు ఇంద్రియాలను గూర్చి ప్రత్యేకించి చెపుతాను వినండి. చెవి, చర్మం, కన్నులు, నాలుక, ముక్కు, పాదాలు, గుదం, ఉపస్థ, చేతులు, వాక్కు అనే ఈ పది ఇంద్రియ సమూహం. మనస్సు పదకొండవ ఇంద్రియం. మానవుడు మొదట ఈ ఇంద్రియగ్రామాన్ని జయించాలి. తరువాత ఆతనికి బ్రహ్మసాక్షాత్కారం కలుగుతుంది. ఈ ఇంద్రియాల్లో అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు. చెవి మొదలయిన అయిదింటిని జ్ఞానేంద్రియాలు అంటారు. అవికాక మిగిలిన అయిదు కర్మేంద్రియాలు. మనస్సుకు జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలతో సంబంధం ఉంది. బుద్ధి పన్నెండవది. ఈ రీతిగా పదకొండు ఇంద్రియాలను గూర్చి చెప్పాను. ఈ తత్త్వాలను బాగా తెలుసుకొన్న పండితులు తాము కృతార్థులు అయినట్లు భావిస్తారు. ఇప్పుడు సమస్తమయిన జ్ఞానేంద్రియాలకు గల భూత, అధిభూతాదులయిన వివిధ విషయాలను చెపుతాను. ఆకాశం మొదటి భూతం. చెవిదానికి అధ్యాత్మ ఇంద్రియం. శబ్దం దానికి అధిభూత విషయం. దిక్కులు దానికి అధి దైవతాలు. (అధిష్ఠాతలయిన దేవతలు). ద్వితీయ భూతం వాయువు. చర్మం అధ్యాత్మం. స్పర్శ అధిభూతం. విద్యుత్తు దానికి అధిదైవతం. మూడవ భూతం జ్యోతిస్సు. కన్ను దానికి ఆధ్యాత్మం. రూపం అధిభూతం. సూర్యుడు దానికి అధిదైవతం. నాలుగోది జలం. జిహ్వ ఆధ్యాత్మం. రసం అధిభూతం. చంద్రుడు దానికి అధిదైవతం. భూమి అయిదవ భూతం. ముక్కు అధ్యాత్మం. గంధం అధిభూతం. వాయువు దానికి అధిదైవతం. ఈ పంచ భూతాలలో అధ్యాత్మం, అధిభూతం, అధిదైవతం అనే మూడు భేదాలను భావించారు.

ఇప్పుడు కర్మేంద్రియాలకు సంబంధించిన వివిధ విషయాలను చెపుతాను. తత్త్వవేత్తలయిన బ్రాహ్మణులు రెండు కాళ్ళను అధ్మాత్మం అన్నారు. వెళ్ళవలసిన స్థానాన్ని అధిభూతం అంటారు. విష్ణువు వాటికి అధిదైవతం. క్రిందికిపోయే అపానానికి గుదం అధ్యాత్మం అంటారు. మల విసర్జనం దానికి అధిభూతం. మిత్రుడు అక్కడ అధిదైవతం. సమస్త ప్రాణులను జన్మింపజేసే ఉపస్థ అధ్యాత్మం. వీర్యం అధిభూతం, ప్రజాపతి అధిదైవతం. చేతులు అధ్యాత్మం. పనులు అధిభూతం. ఇంద్రుడు అధిదైవతం. ప్రపంచంలో మొదటి

దేవత అయిన వాక్కును అధ్యాత్మం అంటారు. వక్తవ్యం (చెప్పవలసింది) అధిభూతం. అగ్ని దానికి అధిదేవత. పంచభూతాలను నడిపించే మనస్సును అధ్యాత్మం అంటారు. సంకల్పం అధిభూతం. చంద్రుడు దానికి అధిదైవతం. సమస్త సంసారాన్ని పుట్టించే అహంకారం అధ్యాత్మం. అభిమానం దానికి అధిభూతం. రుద్రుడు అధిదైవతం. అయిదు ఇంద్రియాలను, ఆరవదయిన మనస్సును తెలుసుకొనే బుద్ధిని అధ్యాత్మం అన్నారు. మంతవ్యం దానికి అధిభూతం. దానికి బ్రహ్మ అధిదైవతం.

జలం, స్థలం, ఆకాశం అనే మూడు ప్రాణులకు స్థానాలు, నాల్గవది లేదు. ప్రాణుల జన్మలు అండజాలు, ఉద్భిజాలు, స్వేదజాలు, జరాయుజాలు అని నాలుగు విధాలుగా ఉంటాయి. దేహధారుల జన్మలు నాలుగు విధాలుగా ఉంటాయి. ఇవ్వేకాక ఆకాశంలో సంచరించే ప్రాణులు, పొట్టతో పాకే ప్రాణులు - సర్పాదులు అండజాలు అని తెలుసుకోవాలి. చెమట వల్లపుట్టే పేలు మొదలయి కీటాలను స్వేదజాలు అంటారు. క్రమంగా రెండవదయిన ఈ జన్మమొదటి దానికంటె తక్కువది. ద్విజశ్రేష్ఠులారా! సమయాన్ని అనుసరించి నేలను చీల్చుకొని పుట్టే ప్రాణులను ఉద్భిజాలు అంటారు. రెండు కాళ్ళు గలవి, అంతకంటె ఎక్కువ పాదాలు గలవి, అడ్డంగా, వంగి తిరిగేవి, వికారమయినవి జరాయుజాలు. తపస్సు, పుణ్యకర్మానుష్ఠానం అనే రెండు విధాలు బ్రాహ్మణత్వానికి సనాతన హేతువులు అని తెలుసుకోవాలి. కర్మానుష్ఠానంలో అనేక భేదాలు ఉన్నాయి. వాటిల్లో, పూజలు, దానాలు, యజ్ఞాలలో హోమం చేయటం అనేవి ముఖ్యం. బ్రాహ్మణ వంశంలో జన్మించినవానికి వేదాధ్యయనం కూడా పుణ్యకార్యమే అని పెద్దల మాట. ఈ విషయాన్ని విధిపూర్వకంగా తెలుసుకొన్నవాడు సర్వపాపవిముక్తుడు అని తెలుసుకోండి. ఈ రీతిగా మీకు నేను అధ్యాత్మవిధిని ఉన్నదున్నట్లు చెప్పాను. ధర్మజ్ఞులారా! జ్ఞానులయినవారు ఈ విషయాలు చక్కగా తెలుసుకోవాలి. ఇంద్రియాలను, వాటి విషయాలను, పంచభూతాల ఐక్యాన్ని తెలుసుకొని దాన్ని మనస్సులో చక్కగా ధారణ చెయ్యాలి. మనస్సు క్షీణించటంతోపాటు సమస్త వస్తు క్షయం కాగా మానవునికి జన్మసుఖం (లౌకిక సుఖభోగాదులు) కావాలనే కోరిక కలుగదు. జ్ఞాన సంపన్నమయిన అంతఃకరణం గల విద్వాంసులకు దానిలోనే సుఖానుభవం కలుగుతుంది. మహర్షులారా! కోమల కఠోరభావాలతో సర్వప్రాణులలో ఉంటూ, మానసిక సూక్ష్మ భావనలు మేల్కొల్పే శుభకరమయిన నివృత్తి విషయాన్ని ఉపదేశిస్తాను. సర్వసుఖాలకు బ్రహ్మ యొక్కటే ఆధారం. అది సగుణమైనా నిర్గుణం. అభిమానరహితం. అద్వితీయం. భేద భావరహితం.

తాబేలు తన సర్వాంగాలను లోపలికి ముడుచుకొన్నట్లు తనకామనలను అన్నివైపులనుంచి సంకుచితం చేసుకొని రజోగుణ రహితుడయిన విద్వాంసుడు సర్వబంధ విముక్తుడు, నిత్యసుఖి అవుతాడు. కోరికలను తనలోనే అణచుకొని తృష్ణారహితుడయి, ఏకాగ్రచిత్తుడు, సర్వ ప్రాణి మిత్రుడు, హితుడు అయినవాడు బ్రహ్మప్రాప్తికి పాత్రుడు అవుతాడు. విషయాభిలాష గల సర్వేంద్రియాలను నిరోధించి, జనసముదాయ స్థానాన్ని వదలటంవల్ల మునికి అధ్యాత్మజ్ఞాన తేజస్సు అధికంగా ప్రకాశిస్తుంది. యోగి ప్రసన్నచిత్తుడయి సమస్త ప్రాణులను తన అంతఃకరణంలో ఉన్నట్లుగా చూసేటప్పుడు ఆయన స్వయంజ్యోతి రూపుడయి సూక్ష్మాతి సూక్ష్మం, సర్వోత్తమ మయిన పరమాత్మను పొందుతాడు. శరీరం అగ్నిరూపం, దానిలో రుధిరం ప్రవాహం, వాయువు స్పర్శ, భూమి రక్తమాంసాలు, ఆకాశం చెవులు, రోగ శోకాదులతో నాలుగువైపులా ఆవృతమయిన దది, అయిదు ప్రవాహాలు గలది, పంచభూతాలతో చక్కగా కూడి ఉన్నది, తొమ్మిది ద్వారాలు గలది, జీవేశ్వరులు దేవతలుగా గలది, రజోగుణమయం, అదృశ్యం (అశాశ్వతం) అయినది, వాతపిత్తకఫాలు అనే త్రిధాతువులు గలది, సంసర్గరతం, జడం. సర్వలోక సంచారం దుఃఖదాయకమయి, బుద్ధిని ఆశ్రయించి, ఈ లోకంలో కాలచక్రం ప్రవర్తిస్తుంటుంది. ఈ కాలచక్రం ఘోరమయినది, అగాధమయినది, మోహమనే పేరుగల మహాసముద్రం. ఇది దేవతలతో కూడిన సమస్త జగత్తును సంక్షిప్తం చేస్తుంది. విస్తారం చేస్తుంది. సమస్తాన్ని జాగృతం చేస్తుంది.

నిరంతరం ఇంద్రియ నిగ్రహం వల్ల మానవుడు కామాన్ని, క్రోధాన్ని, భయాన్ని, లోభాన్ని, ద్రోహాన్ని, అసత్యాన్ని వదలరాని దుర్గుణాలను వదులుతాడు. లోకంలో మూడు గుణాలు గల పాంచభౌతికమయిన దేహాభిమానాన్ని వదిలేవాని హృదయాకాశంలో పరబ్రహ్మ రూపమయిన ఉత్తమ పదం లభిస్తుంది. పంచేంద్రియాలు అనే ఒడ్డు, మనోవేగమనే మహాజలరాశి, లోపల మోహమయమయిన సుడిగుండాలు గల దేహం అనే నదిని దాటి కామక్రోధాలను జయించేవాడు, సర్వదోషవిముక్తుడయి పరబ్రహ్మసాక్షాత్కారం పొందుతాడు. మనస్సును హృదయకమలంలో నిలుపుకొని, ధ్యానంతో తనలోనే ఆత్మదర్శనానికి ప్రయత్నించేవాడు సర్వప్రాణులలో సర్వజ్ఞుడవుతాడు. ఆతని అంతఃకరణంలో పరమాత్మ సాక్షాత్కారానుభవం కలుగుతుంది. ఒక దీపాన్నుంచి వందల కొలది దీపాలను వెలిగించినట్లు పరమాత్మ ఒక్కడే అంతట అనేక రూపాల్లో లభిస్తాడు అని నిశ్చయించుకొని, జ్ఞాని సర్వవిరూపాలు ఒక తత్త్వాన్నుంచే ఉత్పన్నమయినట్లు

నిస్సందేహంగా చూస్తాడు. నిజానికి ఆ పరమాత్మయే విష్ణువు, మిత్రుడు, వరుణుడు, అగ్ని, ప్రజాపతి, ధాత, విధాత ప్రభువు, సర్వవ్యాపి, సర్వప్రాణుల హృదయం, మహాత్మరూపంగా ప్రకాశిస్తుంటాడు. ఆ పరమాత్మనే బ్రాహ్మణ సమూహాలు, దేవతలు, అసురులు, యక్షులు, పిశాచులు, పితరులు, పక్షులు, రాక్షసులు, భూతగణాలు, సమస్త మహర్షులు ఎల్లవేళల స్తుతిస్తుంటారు.'

43. గురుశిష్య సంవాదము - 9.

బ్రహ్మ చెప్పాడు - 'మహర్షులారా! మనుష్యులలో రాజు రజోగుణం గల క్షత్రియుడు. వాహనాల్లో ఏనుగు, మృగాలలో సింహం, పశువులలో గొర్రె, కలుగులలో ఉండే వాటిల్లో అన్నిటిలో సర్పం, గోజాతిలో వృషభం, స్త్రీలలో పురుషుడు ప్రధానులు. మట్టిచెట్టు, నేరేడు, రావి, బూరుగు, చంద్ర, మేషశృంగం, లోపలబోలు గలవి, వెదురు అనేవి లోకంలో వృక్షరాజాలు అనటంలో సందేహం లేదు. హిమవంతం, పారియాత్రం, సహ్యం, వింధ్యం, త్రికూటం, శ్వేతం, నీలం, భాసం, కోష్ఠవంతం, గురుస్కంధం, మహేంద్రపర్వతం, మాల్యవంతం అనేవి పర్వతరాజాలు. గణాల్లో మరుద్గణం, గ్రహాలలో సూర్యుడు, నక్షత్రాలలో చంద్రుడు అధిపతులు. పితరులకు యముడు అధిపతి. నదులకు సముద్రం రాజు. జలానికి వరుణుడు రాజు. మరుద్గణాలకు ఇంద్రుడు రాజు. ఉష్ణప్రధానమయిన వాటికి సూర్యుడు అధిపతి, నక్షత్రాలకు చంద్రుడు. భూతాలకు నిత్యాధీశ్వరుడు అగ్ని, బ్రాహ్మణులకు అధిపతి బృహస్పతి. ఓషధులకు అధిపతి చంద్రుడు - బలిష్ఠులలో శ్రేష్ఠుడు విష్ణుదేవుడు. రూపాలకు అధిపతి సూర్యుడు. పశుపతి ఈశ్వరుడు. దీక్షగ్రహించేవారికి యజ్ఞం, దేవతలకు ఇంద్రుడు, దిక్కులకు ఉత్తర దిక్కు, బ్రాహ్మణులకు ప్రతాపవంతుడయిన చంద్రుడు, సర్వవిధరత్నాలకు కుబేరుడు అధిపతి, ఇంద్రుడు దేవతలకు అధిపతి. ప్రజలకు అధిపతి ప్రజాపతి, ఇది భూతాధిపతుల సర్గం. నేనే సర్వప్రాణులకు మహాధిపతిని బ్రహ్మమయుడను. నా కన్నా, విష్ణువు కన్నా అధికమయిన ప్రాణి లేదు. బ్రహ్మమయుడయిన మహావిష్ణువు రాజాధిరాజు. ఆయననే ఈశ్వరుడని తెలుసుకోవాలి. ఆ శ్రీహరియే సర్వకర్త. ఆయనకు కర్త ఎవరూ లేరు. నరులకు, కిన్నరులకు, యక్షులకు, గంధర్వులకు, ఉరగులకు, రాక్షసులకు, దేవతలకు, దానవులకు, నాగులకు అందరికి ఆయనయే అధీశ్వరుడు. కాముకులయిన పురుషులు వెంటబడే అందరిలో సునయన లయిన స్త్రీలు ప్రధానలు. మహేశ్వరి, మహాదేవి, పార్వతి అని పిలువబడే మంగళమయి

అయిన ఉమాదేవిని స్త్రీలలో సర్వోత్తములాలు అని తెలుసుకోండి. రమింపదగిన స్త్రీలలో సువర్ణాలంకృతలగు అప్సరసలు ప్రధానలు. రాజులు ధర్మంగా పాలించగోరుతారు. బ్రాహ్మణులు ధర్మసేతువులు, కాబట్టి రాజు ద్విజుల రక్షణకు ప్రయత్నించాలి. శ్రేష్ఠ పురుషులకు బాధలు, కష్టాలు కలిగించే రాజ్యాధిపతి అయిన రాజు సమస్త గుణహీనుడు అవుతాడు. మరణానంతరం నీచ గతినందుతాడు. ద్విజశ్రేష్ఠులారా! సజ్జనులను చక్కగా రక్షించే రాజులు ఈ లోకంలో సుఖిస్తారు. మరణానంతరం సుఖపడతారు.

ఇక అందరికి నియమమయిన ధర్మలక్షణం చెపుతాను. అహింస పరమధర్మం. హింస అధర్మ లక్షణం గలది. తేజో లక్షణులు దేవతలు. మానవులకు యజ్ఞాదులే లక్షణం. శబ్దం ఆకాశానికి లక్షణం. వాయువుకు స్పర్శ లక్షణం. జ్యోతిస్సులకు రూపం లక్షణం. జలానికి రసం లక్షణం. సర్వప్రాణులను ధరించే భూమికి గంధం లక్షణం. స్వరవ్యంజనాలతో శుద్ధమయిన వాక్కు లక్షణం శబ్దం. చింతనం – ఆలోచించటం మనోలక్షణం. నిశ్చయత్వం బుద్ధి లక్షణం. మనస్సుతో చింతించే వస్తువులను బుద్ధితో నిశ్చయిస్తాడు. నిశ్చయం ద్వారానే బుద్ధిని తెలుసుకోవచ్చు. ఇందులో సందేహం లేదు. మనస్సు లక్షణం ధ్యానం, సజ్జన-లక్షణం బయటికి తెలియదు (అది ఆయనకే తెలుస్తుంది). యోగ లక్షణం ప్రవృత్తి. సంన్యాస లక్షణం జ్ఞానం. కాబట్టి బుద్ధిమంతుడయిన పురుషుడు జ్ఞానాన్ని ఆశ్రయించి, సంన్యాసం స్వీకరించాలి. జ్ఞానయుక్తుడయిన సంన్యాసి ద్వంద్వాతీతుడై జరామృత్యువులను అతిక్రమించి, పరమగతిని పొందుతాడు.

మహర్షులారా! ఇంతవరకు మీకు నేను లక్షణ సహితమయిన ధర్మాన్ని యధావిధిగా చెప్పాను. ఇకమీద ఏ గుణాన్ని ఏ ఇంద్రియంతో సరిగా గ్రహించాలో చెపుతాను. పృథివికి ఉండే గంధాన్ని వాయువు గ్రహిస్తుంది. ముక్కులో ఉండే వాయువు గంధాన్ని గ్రహించటంలో సహాయపడుతుంది. నీటికి ఉండే రసాన్ని జిహ్వ గ్రహిస్తుంది. జిహ్వయందు ఉండే సోముడు రసాన్ని తెలుసుకోవటంలో సహాయపడతాడు. జ్యోతిస్సుగుణం రూపం. దాన్ని కంటితో గ్రహిస్తాడు. చక్షుస్సులో ఎల్లప్పుడు ఉండే ఆదిత్యుడు రూపాన్ని తెలుసుకోవటంలో సహకరిస్తాడు. స్పర్శ గుణం వాయువు లక్షణం. త్వక్కు (చర్మం)తో అది తెలుస్తుంది. చర్మంలో నిరంతరం ఉండే వాయువు స్పర్శ తెలియటంలో సహకరిస్తుంది. ఆకాశ గుణమయిన శబ్దాన్ని చెవి గ్రహిస్తుంది. శబ్దం తెలుసుకోవటానికి చెవిలో ఉండే సర్వదిక్కులు సహకరిస్తాయని చెపుతారు. మనస్సు గుణం చింత. దానిని ప్రజ్ఞ గ్రహిస్తుంది. హృదయంలో ఉండే చేతన (ఆత్మ) మనస్సుకు చింతన అనే కార్యంలో తోడవుతుంది. నిశ్చయంతో

బుద్ధిని, జ్ఞానంతో మహత్తత్త్వాన్ని గ్రహించటం జరుగుతుంది. వీటి కార్యాలవల్లనే వీని సత్త నిశ్చయమవుతుంది. వాస్తవంగా ఇంద్రియాతీతాలు కావటం వల్ల, బుద్ధ్యాదులు అవ్యక్తాలే అవుతాయి. ఇందులో సంశయం లేదు. స్వయం ప్రకాశకుడు, నిర్గుణుడు కావటం వల్ల నిత్యుడు, క్షేత్రజ్ఞుడయిన ఆత్మకు జ్ఞాపకమయిన లింగం (గుర్తు) ఏదీలేదు. కేవలం జ్ఞానమే దాని లక్షణం (స్వరూపం) అంటారు. గుణాల ఉత్పత్తిలయాలకు కారణమయిన అవ్యక్తప్రకృతిని క్షేత్రజ్ఞ డంటారు. నేను దానిలో లీనమై నిరంతరం దానివల్ల తెలుసుకొంటూ ఉంటాను. వింటుంటాను. ఆత్మ క్షేత్రాన్ని తెలుసుకుంటుంది. కాబట్టి దాన్ని క్షేత్రజ్ఞుడు అంటారు. క్షేత్రజ్ఞుడు ఆది, మధ్య, అంతం గల సమస్తమయిన ఉత్పత్తి శీలాలయిన అచేతనాలయిన గుణాల కార్యాన్ని, వాటిక్రియలను చక్కగా తెలుసుకొంటాడు. కాని మాటిమాటికి జనించే గుణాలు ఆత్మను తెలుసుకోలేవు. గుణాలకు, గుణాల కార్యాలకు చాలా దూరంలో ఉండే పరమమూ, మహత్తరమూ, సత్స్వరూపమయిన క్షేత్రజ్ఞుని ఎవ్వరూ ఎరుగరు. కానీ ఆయనకు సమస్తం తెలుసు. కాబట్టి ఈలోకంలో సర్వదోషక్షయం అయినవాడు, గుణాతీతుడు, ధర్మజ్ఞుడయిన పురుషుడు సత్వాన్ని (బుద్ధిని) గుణాలను వదలి, క్షేత్రజ్ఞుని శుద్ధ స్వరూపమైన పరమాత్మలో ప్రవేశిస్తాడు. ఆ క్షేత్రజ్ఞుడు సుఖదుఃఖాది ద్వంద్వ రహితుడు, ఎవరికి నమస్కరించనివాడు, స్వాహాకారరూపమయిన యజ్ఞం చేయనివాడు, అచలుడు, అనికేతుడు. ఆయన పరమ విభువు.'

44. గురుశిష్యసంవాదము - 10.

బ్రహ్మ చెప్పాడు - 'మహర్షులారా! ఇప్పుడు నేను సర్వపదార్థాల నామలక్షణాలతో సహా ఆదిమధ్యాంతాలకు, వాటిని గ్రహించటానికి తగిన ఉపాయాలను యథార్థంగా చెపుతాను. మొదటిది పగలు, తరువాత రాత్రి. (కాబట్టి పగలు రాత్రికి ఆది, పగటికి రాత్రి ఆది) శుక్ల పక్షం మాసానికి, శ్రవణా నక్షత్రం నక్షత్రాలకు, శిశిరం ఋతువులకు ఆది అవుతున్నాయి. గంధాలకు ఆదికారణం పృథివి. రసాలకు జలం మొదటి కారణం. రూపాలకు జ్యోతిర్మయుడయిన ఆదిత్యుడు, స్పర్శలకు వాయువు మొదటి కారణమని చెపుతారు. శబ్దానికి ఆకాశం ఆదికారణం. గంధాదులు పంచభూతాలనుంచి ఉత్పన్నమయిన గుణాలు.

ఇకమీద నేను భూతాల ఉత్తమాదులను వివరిస్తాను. ఆదిత్యుడు సమస్తగ్రహాలకు ఆది. జఠరాగ్ని సర్వప్రాణులకు ఆది అని చెపుతారు. సావిత్రి సర్వవిద్యలకు, ప్రజాపతి

దేవతలకు మొదటివారు. ఓంకారం సర్వవేదాలకు, ప్రాణం వాక్కుకు ఆది. ఈలోకంలో నియతమయిన ఉచ్చారణగలది సావిత్రి అని చెపుతారు. ఛందస్సులకు గాయత్రి ఆది. ప్రజలకు సృష్టి ఆరంభకాలం, నాలుగు కాళ్ళ జంతువులకు గోవు. మానవులకు బ్రాహ్మణులు ఆది అవుతారు. ద్విజోత్తములారా! పక్షులలో డేగ, యజ్ఞాల్లో ఉత్తమాహుతి, పాకుతూపోయే వాటిల్లో అన్నిట్లో సర్పమూ శ్రేష్ఠమయినవి. అన్ని యుగాలకు కృతయుగం మొదటిది. ఇందులో సంశయంలేదు. సర్వరత్నాలలో బంగారం, ఓషధులలో యవలు శ్రేష్ఠమయినవి. నమలదగిన, తినదగిన వాటిల్లో అన్నిటిలో అన్నం పరమోత్తమం. ద్రవాకారం గల త్రాగదగిన పదార్థాలలో నీరు ఉత్తమం. సమస్త స్థావర ప్రాణులలో సామాన్యంగా బ్రహ్మక్షేత్రం - వటజాతి వృక్షవిశేషం శ్రేష్ఠం అంటారు, పవిత్రమని చెపుతారు. సమస్త ప్రజాపతులకు నేనే ఆది అనటంలో సందేహం లేదు. నాకు అచింత్యమయిన ఆత్మస్వరూపుడు విష్ణుదేవుడు ఆది. ఆయననే స్వయంభువు అని అంటారు. పర్వతాలు అన్నింటికి అగ్రజుడు మహామేరువు దిక్కులకూ, విదిక్కులకు తూర్పుదిక్కు ఆది అవుతుంది. సమస్త నదులలో త్రిపథగ అయిన గంగానది మొదటిది అంటారు. అలాగే సరోవరాలు అన్నింటిలో మొదట కలిగింది సాగరం. దేవతలు, దానవులు, భూతాలు, పిశాచాలు, సర్పాలు, రాక్షసులు, నరులు, కిన్నరులు, యక్షులు, వీరందరికి శంకరుడు ప్రభువు. సమస్త జగత్తునకు ఆది కారణం బ్రహ్మస్వరూపుడయిన మహావిష్ణువు. ముల్లోకాల్లో ఆయనను మించిన ప్రాణి ఇంకొకటి లేదు.

అన్ని ఆశ్రమాలకన్నా మిన్న అయినది గృహస్థాశ్రమం అనటంలో సందేహం లేదు. సమస్త జగత్తుకు ఆది, అంతం అవ్యక్త ప్రకృతియే. పగళ్ళు అన్నింటికి అంతం సూర్యాస్తమయం. రాత్రులకు అంతం సూర్యోదయం, సుఖానికి ఎల్లవేళలా అంతం దుఃఖమే. ఎప్పుడూ దుఃఖానికి అంతం సుఖమే అవుతుంది. అన్నివిధాల కూడబెట్టటానికి నాశనమే అంత్యం. ఉన్నతులు అన్నీ పతనంతోనే అంతమవుతాయి. కలయికలు వియోగాంతాలు అవుతాయి. జీవితం మరణంతో అంతమవుతుంది. నిర్మితమయిన వాటికి అన్నింటికి వినాశమే అంతం. పుట్టిన వానికి మరణం తప్పదు. ఈలోకంలో చరాచరమయినది అంతా అశాశ్వతమే. యజ్ఞాలు, దానాలు, తపస్సు, అధ్యయనం, వ్రతాలు, నియమాలు - ఇవి అన్నీ అంతమయ్యేవే. జ్ఞానానికి మాత్రం అంతం ఉండదు. కాబట్టి విశుద్ధమయిన జ్ఞానంతో ప్రశాంతచిత్తుడయి, అహంకార మమకారాలు లేకుండా ఉండేవాడు సర్వపాప విముక్తు డవుతాడు.'

45. గురుశిష్య సంవాదము - 11.

బ్రహ్మదేవుడు చెప్పాడు - 'మహర్షులారా! మనస్సు మానవుల వేగవంతమయిన (దేహమనే) మనోహర కాలచక్రం నిరంతరం చలిస్తున్నది. ఇది మహత్తత్త్వం మొదలు స్థూలభూతాలవరకు ఇరువదినాలుగు తత్త్వాలతో నిర్మితమయి ఉన్నది. దీనివేగం ఎప్పటికీ ఆగదు. ఇది సంసార బంధనానికి అనివార్య కారణం అవుతుంది. ముసలితనం, శోకం దీన్ని చుట్టుముట్టి ఉన్నాయి. ఇది రోగాలు, దుర్వ్యసనాల ఉత్పత్తికి స్థానం. ఇది దేశకాలానుసారం సంచరిస్తుంటుంది. బుద్ధి-ఈ కాలచక్రానికి సారం. మనస్సు స్తంభాలు. ఇంద్రియ సముదాయం బంధనాలు. పంచ మహాభూతాలు దీనికి బోదె. అజ్ఞానం దీనికి ఆవరణం. శ్రమ వ్యాయామం దీని శబ్దాలు. రేయింబవళ్ళు ఈ చక్రాన్ని చలింపజేస్తుంటాయి. శీతోష్ణాలు దీనికి ఆవరణమండలం. సుఖదుఃఖాలు దీనికి సంధులు. ఆకలిదప్పులు దీనికి కీలకాలు. ఎండనీడలు రేకలు. కన్నులు మూయటం, తెరవటంతో దీని చలనత్వం వ్యక్తమవుతుంది. ఘోరమోహరూపమయిన జలం (దుఃఖాశ్రువుల)తో ఇది వ్యాప్తం.

ఇది నిరంతరం గతిశీలం, అచేతనం అవుతుంది. మాసపక్షాదులతో దీని గణన జరుగుతుంది. ఇది ఎప్పుడూ ఒకే అవస్థలో ఉండదు. క్రింద, పైన, మధ్య ఉండే లోకాల్లో సంచరిస్తుంటుంది. తమోగుణ వశమయి ఉండటం వల్ల పాపపంకంలో ప్రవర్తిస్తుంటుంది. రజోగుణవేగం దీన్ని భిన్నభిన్న కార్యాల్లో లగ్నం చేస్తుంది. ఇది మహాగర్వంలో ఉద్దీప్తం అవుతుంటుంది. త్రిగుణానుసారం దీని ప్రవృత్తి ఉంటుంది. మానసిక చింతయే ఈ చక్రానికి చుట్టూ ఉండే పట్టా. ఇది నిరంతరం శోకమృత్యువులకు వశీభూతం, క్రియాకారణయుక్తం అయి ఉంటుంది. ఆసక్తియే దీని పొడవు, వెడల్పులు. లోభతృష్ణలే ఈ చక్రాన్ని క్రిందికి, పైకి త్రిప్పటానికి కారణాలవుతాయి. అద్భుతమయిన అజ్ఞానం దీని ఉత్పత్తికి కారణం. భయమోహాలు దీన్ని అన్నివైపులనుంచి చుట్టుముట్టి ఉన్నాయి. ఇది ప్రాణులను మోహంలో పడవేసేది, ఆనంద ప్రీతులకోసం సంచరించేది, కామక్రోధాలను సంపాదించుకొనేది. రాగద్వేషా లనే ద్వంద్వంతో గూడిన జడదేహ రూపమయిన ఈ కాలచక్రమే దేవతలతో కూడా సమస్త జగత్తు సృష్టికి కారణం. తత్త్వజ్ఞానం కలగటానికి కూడా ఇదే కారణం. ఈ దేహమయమయిన కాలచక్ర ప్రవృత్తిని, వృత్తులను ఎల్లప్పుడు బాగా తెలుసుకొనేవాడు ఎప్పుడూ మోహంలో పడడు. అతడు సమస్తవాసనల నుండి సర్వవిధ ద్వంద్వాల నుండి, సర్వపాపాల నుండి విముక్తుడయి పరమగతిని పొందుతాడు.

బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సంన్యాసం అనే నాలుగు ఆశ్రమాలు గార్హస్థ్య మూలకాలు అని చెప్పారు. ఈ ప్రపంచంలో విధినిషేధ రూపమయిన శాస్త్రం

ఏదయినా చెప్పి ఉంటే దాంట్లో విద్వాంసుడు కావటం ద్విజునికి మంచిది. మొదట సమస్తసంస్కార సంపన్నుడయి, వేదోక్త విధానంగా అధ్యయనం చేస్తూ, బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించాలి. తరువాత తత్త్వవేత్త అయినవాడు సమావర్తన సంస్కారం చేసుకొని ఉత్తమగుణవంతమయిన కులంలో వివాహం చేసుకోవాలి. తన భార్యయందే ప్రేమకలిగి ఉండటం, నిరంతరం సత్పురుషుల ఆచారాలను పాటించటం, జితేంద్రియుడు కావటం గృహస్థులకు పరమావశ్యకం. దేవతలకు, అతిథులకు పెట్టగా మిగిలింది తినటం, వేదోక్త కర్మలలో ఎల్లప్పుడు నిరతుడై ఉండటం, తన శక్త్యనుసారం సంతోషంగా యజ్ఞాలు చేయటం, దానాలు ఇవ్వటం గృహస్థుకు సముచితమయిన కార్యాలు. మనన శీలుడయిన గృహస్థు కాళ్ళు, చేతులు, కన్నులు, మాటలు, శరీరాలతో కలిగే చాపల్యాలను వదలాలి. అంటే వీటితో ఎలాంటి అనుచిత కార్యాలు చేయరాదు. ఇదియే శిష్టాచారం. ఎల్లవేళల యజ్ఞోపవీతం ధరించి ఉండాలి. స్వచ్ఛ వస్త్రాన్ని ధరించాలి. ఉత్తమ వ్రతపాలన చేయాలి. శౌచం, సంతోషం మొదలయిన నియమాలు, సత్యం అహింసాదులయిన నియమాలను పాటిస్తూ యథాశక్తి దానం చేస్తుండాలి. ఎల్లప్పుడు శిష్టులతో కలిసి ఉండాలి. శిష్టాచారాన్ని పాటిస్తూ, స్త్రీ, జిహ్వ చాపల్యాలను జయించాలి. వేణుదండాన్ని, జలంతో ఉన్న కమండలాన్ని ధరించాలి.

మందకొడితనం లేకుండా ఆయన ఎల్లప్పుడు మూడు కమండలాలను ధరించాలి. వాటిల్లో ఒకటి ఆచమనానికి, ఇంకొకటి కాళ్ళు కడుక్కోవటానికి, మూడోది శౌచక్రియ నిర్వర్తించటానికి ఉపయోగించాలి.

బ్రాహ్మణుడు వేదాధ్యయనం, అధ్యాపనం, యజ్ఞం చేయటం, చేయించటం, దానం ఇవ్వటం, దానం తీసుకోవటం అనే ఆరింటిని గ్రహించాలి. బ్రాహ్మణునికి బ్రతుకు తెరువుకు మూడు కర్మలున్నాయని తెలుసుకోండి. యజ్ఞం చేయించటం, వేదం చెప్పటం, పవిత్రుని నుండి దానం తీసుకోవటం అనేవి ఆ మూడు. ఇంక మిగిలిన మూడు కర్మలు దానం, అధ్యయనం, యజ్ఞం చేయటం అనేవి ధర్మసంపాదనకు కావాలి. ధర్మజ్ఞుడయిన బ్రాహ్మణుడు క్రిందివానిని మూడింటిని అనుష్ఠించటంలో జాగ్రత్తగా ఉండాలి. ఇంద్రియజయం, మిత్రభావంతో ఉండటం, ఓర్పుగా ఉండటం, సర్వప్రాణులయందు సమానత్వం, మననశీలత, ఉత్తమవ్రత పాలనం, పవిత్రంగా ఉండటం కలిగి గృహస్థు ఎల్లప్పుడు జాగరూకుడై, తన శక్తిననుసరించి పైవాటిని అనుసరించాలి. అట్టివాడు స్వర్గాన్ని జయిస్తాడు.'

46. బ్రహ్మచారి వానప్రస్థ సన్యాసుల ధర్మములు

బ్రహ్మదేవుడు చెప్పాడు - 'మహర్షులారా! ఈ రీతిగా వెనుక చెప్పిన పద్ధతి ప్రకారం గృహస్థు యథావిధిగా ఆచరించాలి. యథాశక్తిగా అధ్యయనం చేస్తూ, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ స్వధర్మ నిరతుడు కావాలి. విద్వాంసుడు, సర్వేంద్రియాలను అదుపులో ఉంచుకొనేవాడు, ముని వ్రతపాలకుడు, గురువుకు సంతోషం, మేలు చేయటంలో తత్పరుడు, సత్యధర్మపరుడు, శుచి అయి ఉండాలి. గురువు అనుమతి తీసుకొని భుజించాలి. ఆహారాన్ని నిందించకుండా తినాలి. భిక్షాన్నాన్ని హవిస్సుగా భావించి, గ్రహించాలి. ఒకేచోట ఉండాలి. ఏకాసనం మీద కూర్చుండాలి. నియమిత సమయంలో తిరగాలి. పవిత్రుడు, ఏకాగ్రతచిత్తుడయి రెండు పూటలా అగ్నిలో హోమం చేయాలి. ఎల్లప్పుడు మారేడు, లేక మోదుగ దండాన్ని ధరించాలి. పట్టు గుడ్డను గాని, నూలు బట్టను గాని, కృష్ణాజినాన్ని గాని, కాషాయ వస్త్రం గాని ధరించవచ్చు. ముంజెగడ్డిత్రాడు మొలత్రాడు చేసుకోవాలి. జటాధారి కావాలి. ప్రతిరోజు స్నానం చేయాలి. జందెం వేసుకోవాలి. వేదాధ్యయనం చేయాలి. లోభం ఉండరాదు. నియమపూర్వకంగా వ్రతపాలన చేయాలి. ఎల్లప్పుడు నియమపరాయణుడయి శ్రద్ధగా శుద్ధజలంతో నిత్యం దేవతర్పణం చేయాలి. ఇట్టి బ్రహ్మచారిని లోకులు ప్రశంసిస్తారు.

• ఈరీతిగా ముందు చెప్పబోయే ఉత్తమగుణయుక్తుడు, జితేంద్రియుడు అయిన వానప్రస్థుడు ఉత్తమ లోకాలను జయిస్తాడు. ఆయన ఉత్తమ స్థానం పొంది, ఈ లోకంలో మళ్ళీ జన్మించడు. వాన ప్రస్థుడయిన ముని సర్వసంస్కారాలతో శుద్ధుడయి, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, ఇంటిమీద మోహం వదలి, గ్రామాన్నుంచి బయటకు వెళ్ళి, అడవికి వెళ్ళి నివసించాలి. మృగచర్మాన్ని గాని, నారబట్టను గాని ఆయన ధరించాలి. ఉదయ సాయం సమయాల్లో స్నానం చేయాలి. ఎల్లప్పుడు అడవిలోనే ఉండాలి. మళ్ళీ గ్రామంలో ప్రవేశించరాదు. తగిన కాలంలో అతిథులను పూజించాలి. వారిని సత్కరించాలి. వనంలో లభించే పండ్లను, ఆకులను, దుంపలను, నివ్వరి ధాన్యాన్ని ఆహారంగా తీసుకోవాలి. ప్రవహించే జలాన్ని, స్వచ్ఛ వాయువును తదితరాలయిన ఆటవిక వస్తువులనే తీసుకోవాలి. తన వ్రతానుసారం పరాకులేకుండా క్రమంగా పైన చెప్పిన వస్తువులను ఉపయోగించాలి. తన నివాసానికి వచ్చిన అతిథిని పండ్లు, దుంపలు భిక్షగా ఇచ్చి, సత్కరించాలి. ఎల్లప్పుడు జాగరూకుడయి తనవద్ద ఉన్న ఆహారం నుండే అతిథికి భిక్ష పెట్టాలి. దేవతలకు, అతిథులకు పెట్టిన తరువాత మౌనంగా ఆహారం స్వీకరించాలి. మనస్సులో ఎవరితో పోటీ పడరాదు. తేలిక

అయిన ఆహారం తినాలి. దేవతలను ఆశ్రయించాలి. ఇంద్రియ నిగ్రహం గలిగి మైత్రితో, ఓర్పుతో ఉండాలి. జుట్టు గడ్డం, మీసాలు పెంచాలి. నిత్యమూ హోమం చేయాలి. వేదాధ్యయనం చేయాలి. సత్యధర్మ పరాయణుడయి ఉండాలి. దేహ పవిత్రతతో, సర్వదా సమర్థుడయి నిరంతర వనవాసి అయి, చిత్తం ఏకాగ్రం చేసి, జితేంద్రియుడయిన వానప్రస్థుడు స్వర్గాన్ని జయిస్తాడు. గృహస్థు, బ్రహ్మచారి, వానప్రస్థుడు ఎవరయినా మోక్షాన్ని కాంక్షిస్తే ఉత్తమమయిన వృత్తిని ఆశ్రయించాలి.

వానప్రస్థ సమయాన్ని పూర్తిచేసి, సర్వప్రాణులకు అభయం ఇచ్చి, కర్మత్యాగ పూర్వకమయిన సంన్యాసాన్ని స్వీకరించాలి. ఆయన సర్వప్రాణుల సుఖం కోరుతూ మైత్రితో, సర్వేంద్రియాలను నియమించి, మౌనంగా ఉండాలి. యాచించకుండానే దైవసంకల్పం వల్ల లభించిన భిక్షతోనే బ్రతుకు గడపాలి. ప్రాతఃకాలంలో నిత్యకర్మానుష్ఠానం చేసిన తరువాత గృహస్థుల ఇండ్లలో వంట ఇంటిలోనించే వచ్చే పొగ ఆగిన తరువాత, ఇంటిలోని వారు అందరు భుజించిన తరువాత, వంటపాత్రలు తోమిన తరువాత సంన్యాసి భిక్షచేయదలచాలి. భిక్ష సమృద్ధిగా లభిస్తే సంతోషించరాదు. దొరకకపోతే బాధపడరాదు. భిక్షను ఎక్కువగా సంపాదించరాదు. ప్రాణాలు నిలుపుకోటానికి మాత్రమే భిక్ష సంపాదించుకోవాలి. సంన్యాసి జీవించటం కోసం మాత్రమే భిక్షాటనం చేయాలి. తగిన సమయందాకా ఎదురుచూడాలి. ఏకాగ్రచిత్తుడయి ఉండాలి. సాధారణ వస్తువులు కావాలని కోరుకోరాదు. అధిక గౌరవాదరాలు గలిగే చోట భుజించరాదు. సంన్యాసి గౌరవ ప్రతిష్ఠలను అసహ్యించుకోవాలి. ఆయన తినగా మిగిలింది, చేదుగా, వగరుగా, కారంగా ఉండే ఆహారాన్ని తీసుకోరాదు. భోజనం చేసేటప్పుడు మధుర రసాలను ఆస్వాదించరాదు. కేవలం ప్రాణాలు నిలుపుకొనే ఉద్దేశ్యంతోనే, ప్రాణధారణకోసమే ఉపయోగించే ఆహారమే భుజించాలి. మోక్షతత్త్వం తెలిసిన సంన్యాసి ఇతర ప్రాణులకు బాధ కలిగించకుండానే భిక్ష లభిస్తే దాన్నే స్వీకరించాలి. భిక్షాటన సమయంలో దాత ఇచ్చే అన్నం కాక ఇతరమయిన ఆహారాన్ని ఎప్పుడూ కోరరాదు. ఆయన తన సంన్యాస ధర్మాన్ని బాహాటంగా ప్రకటించరాదు. రజోగుణ దూరుడయి నిర్జన ప్రదేశంలో చరించాలి. ఎవ్వరూలేని ఇల్లు గాని, అరణ్యం గాని, చెట్టు గాని, నది గాని నివాసం చేసుకోవాలి. లేకపోతే పర్వత గుహలో ఉండవచ్చు. గ్రీష్మకాలంలో ఒకరాత్రి ఒకే గ్రామంలో ఉండాలి. వర్షాకాలంలో ఒకేచోట ఉండాలి.

సూర్యకాంతి ఉన్నంతవరకు సంన్యాసి దారివెంట నడవాలి. ఆయన పురుగులాగా మెల్లమెల్లగా భూమిమీద సంచరించాలి. ప్రయాణించేటప్పుడు జీవుల మీద దయకలిగి,

నేలను చూస్తూ నడవాలి. ధనాదులు కూడబెట్టరాదు. ఎక్కడా కూడా ఆసక్తి పూర్వకంగా నివసించరాదు. మోక్షధర్మం బాగా తెలిసిన సంన్యాసి పవిత్రమయిన శుద్ధజలంతో తన పనులు ఆచరించాలి. ప్రతిదినం ప్రవహించే జలంతో స్నానం చేయాలి. అహింస, బ్రహ్మచర్యం, సత్యం, ఋజుత్వం, కోపం లేకుండటం, అసూయలేకుండటం, బహిరింద్రియనిగ్రహం, కపటం లేకుండటం అనే ఎనిమిది వ్రతాలను జాగ్రత్తగా పాటించాలి. ఇంద్రియాలను వశం చేసుకోవాలి. ప్రవర్తన ఎప్పుడూ పవిత్రంగా ఉండాలి. కపటత్వం, వంచనా ఉండకూడదు. ప్రతిరోజు అప్రయత్న సిద్ధంగా లభించిన ఆహారం తీసుకోవాలి. అది కూడా లభించాలనే కోరిక ఉండరాదు. శరీరయాత్రకు సరిపోయేది, ప్రాణధారణకు అవసరమయిన ఆహారం భుజించాలి. ధర్మంగా లభించింది తినాలి. ఇష్టమయిన ఆహారం తినరాదు. ఆహారం, కప్పుకొనేది, ధరించేది తప్ప ఇతరమయినది ఏమాత్రం గ్రహించరాదు. తనకు తినటానికి ఎంతకావాలో అంతే తీసుకోవాలి. ఎక్కువ తీసుకోరాదు. సంన్యాసి ఇంకొకరి కోసం భిక్షను తీసుకోరాదు. దైన్యంతో సంవిభాగ పూర్వకంగా దేన్నయినా ఎప్పుడయినా ఈయ దలపరాదు. ఇతరుల సొత్తు తీసుకోరాదు. అడగకుండా తీసుకోరాదు. ఏదయినా మంచి వస్తువును ఉపయోగించి, దానికోసం తహతహ లాడరాదు. నేల, నీరు, ఆహారం, ఆకులు, పూలు, పండ్లు ఎవ్వరి అధికారంలో లేకుండా ఉన్నవి లభిస్తే క్రియాశీలుడయిన సంన్యాసి తీసుకోవచ్చు. ఆయన శిల్పాది విద్యలతో జీవించరాదు. బంగారం కావాలని కోరరాదు. ఎవ్వరినీ ద్వేషించరాదు. ఉపదేశకుడు కారాదు. ధనాదులు నిలువచేసుకొన దగదు. శ్రద్ధతో లభించిన పవిత్రాన్నాన్ని భుజించాలి. మనస్సులో ఏ నిమిత్తాన్ని ఉంచుకోరాదు. అందరితో అమృత సమంగా, మధురతాపూర్వకంగా ప్రవర్తించాలి. ఏ ప్రాణితో కూడా అతి పరిచయం తగదు.

హింసతో, కామనతో ఉన్న కర్మలను అన్నింటిని, లౌకిక కర్మలను స్వయంగా అనుష్ఠించరాదు. ఇతరుల చేత చేయించరాదు. సర్వపదార్థాల మీద ఆసక్తి నతిక్రమించి, అల్పసంతుష్టుడయి అంతట సంచరించాలి. స్థావర జంగమ ప్రాణులు అన్నిటియందు సమభావం కలిగి ఉండాలి. ఇతరుని ఎవ్వనిని ఉద్విగ్నుని చేయరాదు. తాను దేనివల్లా, ఎవరి వల్లా ఉద్విగ్నుడు కారాదు. సర్వప్రాణుల విశ్వాస పాత్రుడయిన వాడు మోక్ష విషయవేత్తలలో ముందుంటాడు. సంన్యాసి భవిష్యత్తు గురించి ఆలోచించరాదు. గతించినదానికి చింతించరాదు. వర్తమానాన్ని ఉపేక్షించాలి. కాలానికి ఎదురుచూస్తూ చిత్తవృత్తులను సమాధానిస్తూ ఉండాలి. కంటితో, మనస్సుతో, మాటలతో దేనిని ఎక్కడా దోషదృష్టితో

చూడరాదు. ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని దుష్కార్యం చేయరాదు. తాబేలు తన అవయవాలను అన్నింటినీ అన్నివైపులనుంచి ముడుచుకొన్నట్లు సంన్యాసి సర్వేంద్రియాలను విషయాలనుంచి, ఉపసంహరించి ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని దుర్బలాలను చేసి, చేష్టారహితుడు కావాలి. సర్వ తత్త్వజ్ఞానం పొందాలి. ద్వంద్వాల చేత ప్రభావితుడు కారాదు. ఎవరికి నమస్కరించరాదు. గృహకార్యాన్ని (అగ్ని హోత్రాదులను) త్యజించాలి. అహంకార మమకారాలు ఉండరాదు. యోగక్షేమాల ఆలోచన ఉండరాదు. మనస్సును జయించాలి. నిష్కాముడు, నిర్గుణుడు, శాంతుడు, ఆసక్తిరహితుడు, నిరాశ్రయుడు, ఆత్మపరాయణుడు, తత్త్వం తెలిసినవాడు ముక్తుడవుతాడు. ఇందులో సందేహం లేదు.

ఆత్మకు పాదాలు, హస్తాలు, పృష్ఠభాగం లేవని, శిరస్సు, ఉదరం లేవని, గుణకర్మలు లేవని, కేవలమని, నిర్మలమని, స్థిరమని; వాసన, రసం, స్పర్శ, రూపం, శబ్దం లేవని; జ్ఞేయం, అనాసక్తం, ఎముకలు, మాంసంగల శరీరం లేనిదని, ఎలాంటి చింతలు లేనిదని, వినాశరహితమని, దివ్యమని, ఎల్లప్పుడూ కూటస్థమని, సర్వప్రాణులలో ఎల్లప్పుడు ఉంటుందని చక్కగా తెలుసుకొన్న మానవులు ఎప్పుడూ మృతులు కారు. ఆ ఆత్మతత్త్వం దగ్గరకు బుద్ధి, ఇంద్రియాలు, దేవతలు, వేదాలు యజ్ఞాలు, లోకాలు, తపస్సు, వ్రతాలు పోలేవు. కేవలం జ్ఞానవంతులకు మాత్రమే గమనం గలది, ఆ చోటు. అది బాహ్య చిహ్నారహితం అంటారు. కాబట్టి బాహ్య చిహ్నారహిత ధర్మాన్ని తెలుసుకొని దాన్ని యథార్థ రూపంతో ఉపచరించాలి. గుహ్యధర్మంలో ఉన్న విద్వాంసునికి విజ్ఞానానికి అనుగుణంగా ఆచరించటం ఉచితం. మూఢుడుకాకపోయినా మూఢునివలె ఆచరించాలి. కాని తాను చేసే ఏ పనితోగూడా ధర్మాన్ని కళంకితం చేయరాదు. ఇతరులు నిరంతరం అవమానిస్తున్నా తాను శాంతుడయి, సజ్జనుల ధర్మాన్ని నిందించకుండా తన కర్తవ్యాన్ని యథావిధిగా ఆచరించాలి. ఇలాంటి సత్ప్రవర్తన సంపన్నుడయిన సంన్యాసి ఉత్తముడని చెపుతారు. ఇంద్రియాలను, వాటి విషయాలను పంచ మహాభూతాలను మనస్సు, బుద్ధి, అహంకారం, ప్రకృతి, పురుషుడు - వీటిని అన్నింటిని గురించి విచారించి, వీటితత్త్వాన్ని ఉన్నది ఉన్నట్లుగా నిశ్చయించుకొనేవాడు సర్వబంధ విముక్తుడయి, స్వర్గానికి వెళ్తాడు. అంత సమయంలో ఈ తత్త్వాల జ్ఞానం పొంది, ఏకాంతంలో కూర్చుండి పరమాత్మను ధ్యానించే తత్త్వవేత్త ఆకాశంలో చరించే వాయుతుల్యుడయి, సర్వవిధాలయిన ఆసక్తుల నుంచి విముక్తుడయి, పంచకోశ రహితుడు, నిర్భయుడు, నిరాశ్రయుడు ముక్తుడయి పరమాత్మను పొందుతాడు.'

47. గురుశిష్య సంవాదము - 1.

బ్రహ్మదేవుడు చెప్పాడు - 'మహర్షులారా! నిశ్చిత విషయాలను చెప్పేవారు, వేదాలకు కారణమయిన పరమాత్మస్థితు లయిన వృద్ధ బ్రాహ్మణులు సంన్యాసాన్ని తపస్సు అని చెపుతున్నారు. జ్ఞానమే పరబ్రహ్మస్వరూపంగా భావిస్తున్నారు. వేదవిద్యకు ఆధారమయిన బ్రహ్మ అజ్ఞానులకు మిక్కిలి దూరమయినది. అది నిర్ద్వంద్వం, నిర్గుణం, నిత్యం, అచింత్యం, గుణయుక్తం, సర్వశ్రేష్ఠం, ధీరులు జ్ఞాన తపస్సులతో ఆ పరమాత్మ సాక్షాత్కారం పొందుతారు. నిర్మలమయిన మనస్సుగలవారు, పవిత్రులు, రజోగుణవిముక్తులు, నిర్మలాంతకరణులు, నిత్యం సంన్యాస పరాయణులు, బ్రహ్మజ్ఞులు అయిన పురుషులు తపస్సుతో క్షేమంకరమయిన మార్గాన్ని ఆశ్రయించి, పరమాత్మను పొందుతారు. **(పరమ్మాతము ప్రకాశింపజేసే) తపస్సు దీపం అని, ఆచారం ధర్మసాధకమని, జ్ఞానం పరబ్రహ్మ స్వరూపమని, సంన్యాసమే ఉత్తమ తపస్సు అని జ్ఞానులు చెపుతారు.*** తత్వాన్ని పూర్తిగా నిశ్చయించుకొని జ్ఞాన స్వరూపమై, నిరాధారమై, సర్వప్రాణుల లోపల ఉండే ఆత్మను తెలుసుకొనేవాడు సర్వవ్యాపకుడవుతాడు. **సంయోగాన్ని గూడా వియోగంగా చూచేవాడు, అలాగే నానాత్వంలో ఏకత్వం చూసేవాడు, అన్ని విధాల దుఃఖవిముక్తు డవుతాడు.**** ఏమీ కొంచెం కూడా కోరనివాడు, దేన్నీ అవమానించనివాడు ఈ లోకంలో ఉన్నా బ్రహ్మస్వరూపం కావటానికి సమర్థుడవుతాడు. సర్వభూతాల్లో ప్రధానమయిన ప్రకృతిని, దాని గుణాలను, తత్వాన్ని చక్కగా తెలుసుకొని, అహంకార మమకార రహితుడయినవాడు ముక్తుడు కావటంలో సందేహం లేదు.

ద్వంద్వ రహితుడు, నమస్కరింప గోరనివాడు, స్వధాకారం (పితృకార్యం) చేయని సంన్యాసి సమధికశాంతితోనే నిర్గుణం, ద్వంద్వాతీతం, నిత్యమయిన తత్వాన్ని పొందుతాడు. శుభకరాలు, అశుభకరాలు, గుణమయాలైన సమస్త కర్మలను, సత్య సత్యాలను త్యజించి, ముక్తుడవుతాడు. ఇందులో సంశయం లేదు. ఈ దేహం ఒక వృక్షం వంటిది. అజ్ఞానం దీనికి మూలం. బుద్ధి బోదె, అహంకారం కొమ్మలు, ఇంద్రియాలు అంకురాలు, తొర్రలు పంచభూతాలై దీన్ని విశాలం చేస్తాయి. దీని శోభను పెంపొందింపజేస్తాయి.

---

* తపః ప్రదీప ఇత్యాహుః ఆచారో ధర్మసాధకః ।
జ్ఞానం వై పరమం విద్యాత్ సన్యాసం తప ఉత్తమమ్ ॥ 5

**యో విద్వాన్ సహవాసం చ వివాసం చైవ పశ్యతి ।
తత్తైవైకత్వనానాత్వే స దుఃఖాత్ ప్రతిముచ్యతే ॥ 7

దీనికి ఎల్లప్పుడు సంకల్పం అనే ఆకులు పుడుతుంటాయి. కర్మ రూపమయిన పూలు పూస్తుంటాయి. శుభాశుభకర్మల వల్ల ప్రాప్తించే సుఖదుఃఖాదులే దీనికి ఎప్పుడూ పండే పండ్లు. ఈరకంగా బ్రహ్మరూపమయిన విత్తునుంచి పుట్టి, ప్రవాహరూపంగా నిరంతరం ఉండే ఈదేహ మనే వృక్షం సమస్త ప్రాణులకు జీవనాధారం అవుతున్నది. బుద్ధిమంతుడయిన వ్యక్తి తత్త్వజ్ఞాన మనే ఖడ్గంతో ఈ వృక్షాన్ని ఛిన్నభిన్నం చేసి జన్మ, మృత్యు, జర లనే భ్రమణంలో పడవేసే ఆసక్తి రూపమయిన బంధనాలను ఖండించేవాడు. అహంకార మమకారరహితుడయ్యేవానికి ఆ సమయంలో తప్పక ముక్తి కలుగుతుంది. ఇందులో సందేహం లేదు. ఈ వృక్షం మీద ఉండే మనోబుద్ధు లనే రెండు పక్షులు నిత్యం క్రియాశీలాలు అయినా అచేతనాలు. ఈ రెండింటికంటె శ్రేష్ఠమయిన మరొకటి (ఆత్మ) ఉంది. అది జ్ఞానసంపన్న మని చెపుతారు. సంఖ్యారహితమయిన సత్యం మూలప్రకృతి. అచేతనం. దానికంటే భిన్నమయిన జీవాత్మను అంతర్యామి అయిన పరమాత్మ జ్ఞానసంపన్నం చేస్తాడు. క్షేత్రాన్ని తెలుసుకొనే జీవాత్మ సమస్త తత్త్వాలను తెలుసుకొన్నప్పుడు గుణాతీతమయి సర్వపాప విముక్తం అవుతుంది.'

48. గురుశిష్య సంవాదము-2 జీవాత్మ, పరమాత్మల స్వరూప వివేచనము.

బ్రహ్మ చెప్పాడు - 'మహర్షులారా! అవ్యక్తం, ఉత్పత్తిశీలం, వినాశరహితం అయిన పరిపూర్ణ వృక్షాన్ని కొంతమంది బ్రహ్మ స్వరూపంగా భావిస్తారు. కొంతమంది మహత్తర బ్రహ్మవనంగా తలుస్తారు. కొంతమంది దీనిని అవ్యక్తబ్రహ్మమని, మరికొంతమంది పరమమయిన అనామయంగా తలుస్తారు. అంతకాలంలో ఆత్మధ్యానం చేసి శ్వాసతీసుకొన్నంత కాలమయినా సమభావంలో ఉండేవాడు అమృతత్వాన్ని (మోక్షాన్ని) పొందటానికి అధికారి అవుతాడు. ఒక్క నిమిషమయినా తన మనస్సును ఆత్మలో ఏకాగ్రం చేయగలవాడు అంతఃకరణం ప్రసన్నంకాగా విద్వాంసులు పొందే అక్షయగతిని పొందుతాడు. పది లేక పన్నెండు ప్రాణాయామాలతో మళ్ళీ మళ్ళీ ప్రాణాలను సంయమనం చేసేవాడు ఇరువది నాలుగు తత్త్వాలకు అతీతమయిన ఇరువది అయిదవ తత్త్వం - పరమాత్మను పొందుతాడు. ఈ రీతిగా మొదట మనస్సును ప్రసన్నం చేసుకొన్నవాడు తాను కోరిన వస్తువును పొందుతాడు. అవ్యక్తానికంటె ఉత్కృష్టమయిన సత్యరూపమయిన ఆత్మ అమరం అవుతుంది. కాబట్టి సత్యరూప మయిన ఆత్మమహత్త్వం తెలిసిన విద్వాంసులు ఈ లోకంలో సత్యం కంటే ఇతరాన్ని ప్రశంసించరు. ద్విజశ్రేష్ఠులారా! అంతర్యామి అయిన పరమాత్మ

సత్స్వరూపమయిన ఆత్మలో ఉన్నాడని మనం అనుమాన ప్రమాణంతో తెలుసుకొంటాం. ఈ తత్త్వం తెలుసుకోకుండా పరమాత్మను పొందటం అసంభవం. క్షమ, ధృతి, అహింస, సమత్వం, సత్యం, కపటం లేకుండటం, జ్ఞానం, త్యాగం, సంన్యాసం అనేవి సాత్త్విక ప్రవర్తన అని చెపుతారు.

విద్వాంసులు, ఈ అనుమాన ప్రమాణంతోనే సత్స్వరూపమయిన ఆత్మ పరమాత్మల మననం చేస్తారు. ఇందులో ఆలోచించవలసింది ఏమీ లేదు. క్షేత్రజ్ఞుడు, సత్త్వం ఒకటే అనటం యుక్తియుక్తం కాదని జ్ఞానంలో బాగా స్థితులయిన విద్వాంసులు చెపుతారు. వారు ఇలా చెపుతారు - 'క్షేత్రజ్ఞుని కంటె సత్త్వం వేరు. ఆ తత్త్వం అవిచార సిద్ధం. ఈ రెండు ఒకేచోట ఉన్నా యథార్థానికి భిన్నమయినవే' అని తెలుసుకోవాలి. ఈ రకంగానే ఇతర విద్వాంసులు ఇరువురి ఏకత్వ నానాత్వాలను అంగీకరిస్తూ నిర్ణయం చేస్తారు. మశకోదుంబరాలలో ఏకత్వం ఉంది. నానాత్వం ఉంది అలాగే ఇదీ అంటారు. (మేడిపండులో సూక్ష్మజీవులుంటాయి). నీరు, చేప భిన్నమయినవే. అయినా చేప నీటిలో కలిసి ఉండటం మనకు కనిపిస్తుంది. ఇలాంటిదే తామరాకుమీద నీటి బిందువులు ఉండటం కూడా. గురువు ఈ ప్రకారంగా చెప్పగా మునిశ్రేష్ఠ లయిన ఆ బ్రాహ్మణులు మళ్ళీ సందేహం కలిగి లోకపితామహుడయిన బ్రహ్మను ఇలా అడిగారు.'

49. గురుశిష్య సంవాదము - 3.

ఋషులు అడిగారు - 'పితామహా! ఈ లోకంలో ఉన్న సమస్త ధర్మాలలో ఏది అనుష్ఠించాలో చెప్పండి. ధర్మానికున్న వివిధ మార్గాలలో ఒకదానితో ఒకటి కొట్టబడినట్లు కన్పిస్తున్నది. శరీరనాశం తరువాత ధర్మఫలం లభిస్తుందని కొందరు చెపుతారు. అది నిజంకాదని కొందరు అంటారు. కొంతమంది అన్ని ధర్మాలను సంశయిస్తుంటారు. ఇంకా కొంతమంది అలాంటి సంశయం ఏమీ లేదంటారు. ఒకడు ధర్మం అనిత్యం అంటే ఇంకొకడు నిత్యం అంటాడు. ధర్మమనేదే లేదని ఒకడంటే ఉందని ఇతరులు అంటారు. అది ఏకరూపమని ఒకరు, రెండురకాలని ఇంకొకరు, ధర్మం మిశ్రమం అని మరొకరు చెపుతారు. వేదశాస్త్రజ్ఞులు, తత్త్వదర్శులయిన బ్రాహ్మణులు బ్రహ్మ ఏకమే అని అంటారు. ఇతరులు చాలామంది జీవేశ్వరులు భిన్న లంటారు. ఇంకా కొందరు సమస్తము యొక్క సత్త భిన్నమూ, అనేక ప్రకారమూ అంటారు. దేశకాలాల ఉనికిని కొందరు అంగీకరిస్తారు. ఇతరులు వానికి ఉనికి లేదంటారు. కొందరు జడలను, జింక

చర్మాన్ని ధరిస్తారు. కొందరు బోడిగుండుతో ఉంటారు. కొందరు దిగంబరులుగా ఉంటారు. కొంతమంది స్నానం చేయటానికి ఇష్టపడరు. మరికొంత మంది జనులు స్నానం చేయగోరుతారు. తత్త్వదర్శనులు, బ్రహ్మవేత్తలయిన బ్రాహ్మణులు స్నానం శ్రేష్ఠం అని భావిస్తారు. కొంతమంది ఆహారం తీసుకోవటం మంచిది అంటారు. ఇంక కొంతమంది ఆహారం తీసుకోకపోవటానికి ఇష్టపడతారు. కొందరు కర్మను ప్రశంసిస్తారు. ఇంక కొందరు పరమశాంతిని ప్రశంసిస్తారు. కొందరు మోక్షాన్ని ప్రశంసించగా మరికొందరు నానావిధ భోగాలను మెచ్చుకొంటారు. డబ్బు కావాలని కొందరు కోరుకోగా అది అక్కర లేదు అని కొందరి ఉద్దేశం. చాలామంది తమ ఇష్టదేవతానుగ్రహ ప్రాప్తికి సాధన చేస్తారు. అది ఏమీ అవసరం లేదని కొందరి అభిప్రాయం.

కొందరు అహింసా నిరతులు కాగా ఇంకా కొందరు హింసా పరాయణులు. కొందరు పుణ్య యశస్సంపన్నులు కాగా మరికొందరు అవి ఏవీ లేవు అని అంటారు. కొంతమంది సద్భావాసక్తులుగా ఉంటారు. ఇంక కొంతమంది సంశయమగ్నులు. కొందరు కష్టపడుతూ ధ్యానం చేస్తారు. మరి కొందరు సుఖంగా ధ్యాననిష్ఠులవుతారు. కొందరు బ్రాహ్మణులు యజ్ఞం గొప్పదని చెప్పగా దానం గొప్పదని ఇంక కొందరు అంటారు. తపస్సును కొందరు ప్రశంసించగా వేదాధ్యయనాన్ని మరికొందరు మెచ్చుకుంటారు. జ్ఞానమే సంన్యాసమని కొందరనగా భౌతికవాదులు స్వభావం గొప్పదంటారు. కొంతమంది సమస్తాన్ని ప్రశంసించగా మరికొంతమంది దాన్ని మెచ్చుకోరు. దేవశ్రేష్ఠా! ఈ రీతిగా ధర్మవ్యవస్థను అనేక రీతులుగా, పరస్పర విరుద్ధంగా చెప్పారు. కాబట్టి మేము ధర్మవిషయంలో మోహితులం అయినాం. అందువల్ల దేన్నీ నిశ్చయించుకోలేకపోతున్నాం. ఇదే క్షేమంకరమార్గం. ఇది శుభంకరమార్గం అనే రీతి మాటలు విని మానవులు సందేహంలో పడుతున్నారు. తాను ఆసక్తుడయిన ధర్మాన్నే ఆతడు ఆదరిస్తున్నాడు. ఈ కారణంవల్ల మా బుద్ధి చలిస్తోంది. సంకల్ప వికల్పాల్లో పడి మా మనస్సు కూడా ఊగిసలాడుతున్నది. కాబట్టి బ్రహ్మదేవా! నిజానికి క్షేమదాయక మార్గమేదో చెప్పగోరుతున్నాం. పరమ గుహ్యమయిన తత్త్వం ఏదో మీరు మాకు చెప్పండి. ఇంకా బుద్ధి క్షేత్రజ్ఞులకు సంబంధం ఎందువల్ల కలిగింది ? ఈ రీతిగా ఆ బ్రాహ్మణులు అడుగగా సమస్త సృష్టికర్త, ధర్మాత్ముడు, బుద్ధిమంతుడు, భగవంతుడయిన చతుర్ముఖుడు ఉన్నది ఉన్నట్లుగా ఆ విషయాన్ని చెప్పాడు.'

50. గురుశిష్య సంవాదము - 4.

బ్రహ్మదేవుడు చెప్పాడు - 'ఉత్తమ మహర్షులారా! మీరు అడిగిన దానికి సమాధానం చెపుతాను. గురువు ఉత్తమ శిష్యుని పొంది చెప్పినదాన్ని వినండి. ఆ విషయం అంతా చక్కగా విని ధారణ చేయండి. సర్వప్రాణులను హింసించకపోవటమే సర్వోత్తమ కర్తవ్యం అని చెపుతారు. ఈ సాధనం ఉద్వేగరహితం, సర్వశ్రేష్ఠం. ఉత్తమ ధర్మలక్షణం ఇది. నిశ్చిత విషయాన్ని సాక్షాత్కరించుకొన్న వృద్ధులు జ్ఞానమే పరమశ్రేయస్సాధనమని చెప్పారు. కాబట్టి పరమశుద్ధమయిన జ్ఞానం చేతనే సమస్త పాపముక్తు డవుతాడు. ప్రాణిహింస చేసేవాళ్ళు, నాస్తిక వృత్తిని ఆశ్రయించినవారు లోభ మోహాలతో గూడి నరక గాములు అవుతారు. పరాకులేకుండా సకామ కర్మానుష్ఠానం చేసేవాళ్ళు ఈ భూలోకంలో పలుమారులు జన్మిస్తూ సంతోషిస్తుంటారు. మిక్కిలి శ్రద్ధాసక్తులు గలిగి, నిష్కాములయి, సమత్వయోగంతో కర్మానుష్ఠానం చేసేవారిని ధీరులు ఉత్తమ దృష్టిగలవారు అని భావిస్తారు. ఉత్తమ మహర్షులారా ! ఇకమీద సత్యక్షేత్రాలకు సంయోగం, వియోగం ఎలా జరుగుతుందో చెపుతాను వినండి. ఈ రెండింటికీ విషయ విషయిభావ సంబంధం చెపుతారు. ఇందులో ఎల్లప్పుడు పురుషుడు విషయి కాగా సత్యం విషయం అని భావించారు.

వెనుకటి అధ్యాయంలో దోమ, మేడిపండు దృష్టాంతం వివరించాను. అనుభూతమయ్యే అచేతన సత్యం నిత్యస్వరూపమయిన క్షేత్రజ్ఞుని ఎరుగదు. కాని క్షేత్రజ్ఞుడు అనుభవించేది ఆత్మ అని, అనుభవింపబడేది సత్యం అనే విషయం తెలుసుకొంటాడు. విద్వాంసులు సత్యాన్ని ద్వంద్వ యుక్తమని చెపుతారు. క్షేత్రజ్ఞుడు నిర్ద్వంద్వుడు, నిష్కలుడు, నిత్యుడు, నిర్గుణాత్మకుడు అని చెపుతారు. ఈ క్షేత్రజ్ఞుడు సమభావంతో అంతటా చక్కగా ఉండి, జ్ఞానాన్ని అనుసరిస్తుంటాడు. తామరాకు నిర్లిప్తమయి నీటిని ధరించినట్లు క్షేత్రజ్ఞుడు ఎల్లప్పుడు సత్యాన్ని అనుభవిస్తుంటాడు. తామరాకు మీద పడి ఉన్న జలబిందువులు దాన్ని తడపలేనట్లే విద్వాంసుడు సమస్త గుణాలతో సంబంధం కలిగి ఉన్నా అతనికేదీ అంటదు. కాబట్టి క్షేత్రజ్ఞుడు నిజానికి అసంగుడు. ఇందులో సందేహం లేదు. పురుషుడు అనుభవింపదగిన ద్రవ్యమాత్రానికి సత్యమని పేరు అనేది నిశ్చితం. ద్రవ్యానికి, కర్తకు సంబంధం ఉన్నట్లే ఈ రెండింటికి సంబంధం ఉన్నది. మానవుడు దీపం తీసుకొని చీకట్లో వెళ్ళినట్లు పరతత్త్వ కాంక్షులయిన సాధకులు సత్యమనే దీపకాంతిలో సాధన మార్గంలో పయనిస్తుంటారు. దీపంలో ద్రవ్యం గుణం ఉన్నంతవరకు దాని ప్రకాశం వ్యాపిస్తుంటుంది. ద్రవ్యం గుణం క్షీణించగా దీపం మాయం అవుతుంది. విప్రులారా !

ఈ రీతిగా సత్త్వగుణం వ్యక్తం అవుతుంది అని తెలుసుకోండి. మళ్ళీ మీకు ఇంకో విషయం చెపుతాను. బుద్ధి నిర్మలంగా లేనివానికి వెయ్యి ఉపాయాలతో చెప్పినా జ్ఞానం కలగదు. బుద్ధిమంతుడు నాలుగోవంతు ప్రయత్నంతోనే జ్ఞానం పొంది సుఖపడతాడు. ఈ రీతిగా ధర్మసాధనోపాయాన్ని తెలుసుకోవాలి. ఉపాయం తెలిసిన ప్రజ్ఞావంతుడు మిక్కిలి సుఖపడతాడు. దారి బత్తెం లేకుండా త్రోవనవెళ్ళే మనుష్యుడు తీవ్రమయిన కష్టంతో వెళ్తాడు. మధ్యలో నశించవచ్చు కూడా. ఇలాగే పూర్వపుణ్యం లేనివాడు యోగమార్గ సాధనలో లగ్నుడయినప్పుడు యోగసిద్ధి అనేఫలం కష్టం మీద లభించవచ్చు. లభించకపోవచ్చు. పురుషుడు తన శ్రేయస్సును సంపాదించుకోగలగటమే పూర్వజన్మ శుభాశుభ సంస్కారాలను తెలుపుతుంది. అంతకుముందు తెలియని సుదూరమయిన మార్గంలో త్వరగా నడిచి వెళ్ళవలసివస్తే ఆతడు వెళ్లవలసినచోటికి వెళ్లలేడు. ఈ దశ తత్త్వజ్ఞాన రహితు డయిన అజ్ఞానికి కలుగుతుంది.

కాని అదే మార్గంలో గుర్రాలు కట్టి వేగంగా వెళ్ళే రథం మీద ప్రయాణించే నరుడు త్వరగా తన లక్ష్యాన్ని చేరినట్లు, ఉన్నత పర్వతాన్ని ఎక్కి క్రింది భూమిని చూడనట్లు జ్ఞానవంతుల ఉత్తమ గతి ఉంటుంది. రథం మీద వెళ్ళుతున్న మూర్ఖుడు ఎత్తయిన పర్వతం దగ్గరకు వెళ్ళి కష్టపడతాడు. కాని బుద్ధిమంతుడు రథం వెళ్ళినంతవరకు రథం మీద వెళ్ళి, రథంపోవటానికి వీలుగాని త్రోవలో రథం వదలి నడచిపోతాడు. ఇలాగే తత్వాన్ని, యోగాన్ని తెలిసిన బుద్ధిమంతుడు, గుణజ్ఞుడయి బాగా తెలుసుకొని ఉత్తరోత్తరం ముందుకు వెళ్తాడు. ఒక వ్యక్తి అజ్ఞానం వల్ల నావలేకుండా భయంకరమయిన సముద్రంలో దిగి, చేతులతోనే ఈతకొట్టి, దాన్ని దాటగలనని అనుకొంటే ఆతడు తన మరణాన్ని కోరుకోవటంలో సందేహం లేదు. (అలాగే జ్ఞాననౌక సహాయం లేకుండా మానవుడు భవసాగరం దాటలేడు) జలమార్గ విభాగం తెలిసిన బుద్ధిమంతుడు మంచి తెడ్డు/ చుక్కాని గల నావనెక్కి, అలసట లేకుండా నీటిలో ప్రయాణించి సరస్సును దాటి, నావను నిర్మముడై వదలిపెట్టి, ఒడ్డును చేరుతాడు. (అలాగే సంసారసాగరాన్ని దాటిన తరువాత బుద్ధిమంతుడు వెనుకటి సాధన సామగ్రి మీద మమకారం వదలుతాడు). ఈ విషయాన్ని వెనుక రథంమీద వెళ్ళేవాడు, నడచివెళ్ళేవాడు అనే దృష్టాంతంతో చెప్పాను. పడవ నడిపేవాడు దాని మీద ఉండే మమకారంతో నిత్యం దానిలోనే ఉన్నట్లు స్నేహవశాన మోహయుక్తుడయిన వాడు నిరంతరం సంసారంలోనే తిరుగుతుంటాడు.

పడవనెక్కి, నేలమీద ప్రయాణించటం శక్యం కాదు. అలాగే రథాన్ని ఎక్కి, నీటిలో ప్రయాణించ వీలుగాదు. అలాగే చేసిన విచిత్ర కర్మ వేరేవేరే చోట్లకు చేరుస్తుంది. లోకంలో ఎవరు ఏ కర్మ చేస్తే వారు ఆకర్మఫలాన్నే పొందుతారు. గంధం, రసం, రూపం, స్పర్శ, శబ్దం లేనిదై, మునులు బుద్ధితో మననం చేసే దాన్ని ప్రధానం అని చెపుతారు. ప్రధానానికి గల ఇంకొక పేరు అవ్యక్తం. అవ్యక్త కార్యం మహత్తత్త్వం. ప్రకృతినుంచి ఉత్పన్నమయిన మహత్తత్త్వ కార్యం అహంకారం. అహంకారాన్నుంచి మహాభూతాలను సృజించే గుణం ఉత్పన్నం అయింది. రూపరసాది విషయాలు పంచ మహాభూతాల కార్యాలు. అవి విడివిడిగా గుణాలు అనేపేరుతో ప్రసిద్ధాలు. అవ్యక్త ప్రకృతి కార్యరూపం, కారణరూపం కూడా అవుతుంది. ఈ రీతిగానే మహత్తత్త్వంకూడా కారణ కార్యరూపాలు అవుతుందని వింటాం. అహంకారం కారణ రూపం అయి కూడా కార్యరూపంగా గూడా మాటిమాటికి పరిణతి పొందుతుంటుంది. పంచ మహాభూతాల (పంచతన్మాత్రల)లో గూడా కారణకార్యత్వా లనే రెండు ధర్మాలు ఉన్నాయి. అవి శబ్దాది విషయాలను ఉత్పన్నం చేస్తాయి. కాబట్టి వాటిని బీజధర్మాలు అని అంటారు. పంచభూతాల్లోనిదైన ఆకాశానికి ఒకటే గుణం ఉన్నది అంటారు. వాయువుకు రెండు గుణాలు, తేజస్సుకు మూడు గుణాలు, నీటికి నాలుగు గుణాలు ఉన్నవని చెపుతారు. భూమికి అయిదు గుణాలు ఉన్నవని తెలుసుకోవాలి. ఈ భూదేవి చరాచర ప్రాణులతో నిండి ఉంది. సమస్త జీవులకు జన్మనిచ్చేది. శుభాశుభాలను నిర్దేశించేది ఈ దేవియే.

ద్విజశ్రేష్ఠులారా! శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం - అనే అయిదు గుణాలు భూమికి ఉన్నాయని తెలుసుకోవాలి. వీటిల్లో కూడా భూమికి విశిష్టమయిన గుణం గంధం. అది అనేక విధాలని భావించారు. ఆ గంధానికి ఉండే అనేక గుణాలను వివరంగా చెపుతాను. ఇష్టం (సుగంధం), అనిష్టం (దుర్గంధం), మధురం, ఆమ్లం, కారం, నిర్హారి (దూరందాకా వ్యాపించేది), మిశ్రితం, స్నిగ్ధం, రూక్షం, విశదం అని గంధం పదిరకాలని చెపుతారు. శబ్దం, స్పర్శ, రూపం, ద్రవ్యం అనేవి జలగుణాలని భావిస్తారు. ఇక రసాన్ని గురించి చెపుతాను. రసం అనేక రకాలని అంటారు. తీపి, పులుపు, కారం, చేదు, వగరు, ఉప్పు అని జలమయమయిన రసం ఆరు విధాలు. తేజస్సుకు శబ్దం, స్పర్శ, రూపం అనే మూడుగుణాలు ఉన్నాయని చెపుతారు. తేజస్సుకు గుణం రూపం. ఆ రూపం అనేక రకాలని చెపుతారు. తెలుపు, నలుపు, ఎరుపు, నీలం, పచ్చ, ఎరుపు, పొట్టి, పొడుగు, సన్నని, లావు, చతురస్రం, వృత్తాకారం అని తేజస్సు

రూపం పన్నెండు రూపాల విస్తారం గలది. శబ్దం, స్పర్శ అనే రెండు గుణాలు వాయువుకుంటాయని చెపుతారు. వాయువు సహజగుణం స్పర్శ. ఆ స్పర్శ కూడా అనేకరకాలని అంటారు. ఎండు, చల్లన, వెచ్చన, స్నిగ్ధత, విశదం, కఠినం, నిగనిగ, తేలికదనం, పిచ్చిలం, దారుణం, మృదుత్వం అని వాయువుకుండే స్పర్శగుణభేదాలు పన్నెండు అని చెప్పారు. ధర్మజ్ఞులు, తత్త్వ దర్శనులు అయిన బ్రాహ్మణ విధి విధానంగా చెప్పారు. (ఇందులో పదకొండుగుణాలే ఉన్నాయి) ఆకాశానికి శబ్దం అనే ఒకటే గుణం ఉందని చెప్పారు. శబ్దానికి ఉండే అనేకగుణాలను విస్తారంగా చెపుతాను. షడ్జం, ఋషభం, గాంధారం, మధ్యమం, పంచమం, నిషాదం, ధైవతం, ఇష్టమయినది, ఇష్టంకానిది, శిష్టం అని ఆకాశ సంభవమయిన శబ్దానికి పది ప్రత్యేక విభాగాలు ఉన్నాయి అని తెలుసుకోవాలి. పంచభూతాల్లో ఆకాశం శ్రేష్ఠం, అహంకారం దానికంటే గొప్పది, దానికంటె బుద్ధిశ్రేష్ఠం. బుద్ధికంటే ఆత్మ శ్రేష్ఠం. దానికంటే పరమయినది అవ్యక్త ప్రకృతి. దానికంటే శ్రేష్ఠుడు పురుషుడు. సమస్త భూతాల హెచ్చుతగ్గులను, సమస్త కర్మలవిధులను తెలిసినవాడు, సమస్తప్రాణులను ఆత్మగా చూసే వ్యక్తి, అవినాశి అయిన పరమాత్మను పొందుతాడు.'

51. బ్రాహ్మణగీత - అనుగీత ఉపసంహారము.

బ్రహ్మదేవుడు చెప్పాడు - 'మహర్షులారా! పంచభూతాల ఉత్పత్తిలో, నియమించటంలో మనస్సు సమర్థమయినట్లే స్థితికాలంలో గూడా మనస్సే పంచభూతాలకు ఆత్మ అవుతుంది. ఆ పంచ మహాభూతాలకు కూడా నిత్యమూ ఆధారం మనస్సే అవుతుంది. బుద్ధి ప్రకాశింపజేసే ఐశ్వర్యాన్ని క్షేత్రజ్ఞుడంటారు. మంచి గుర్రాలను సారధివలె ఇంద్రియాలను మనస్సు అదుపులో పెడుతుంది. ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఎల్లప్పుడు క్షేత్రజ్ఞునితో కలిసి ఉంటాయి. క్షేత్రజ్ఞుడు శరీర మనే రథాన్ని అధిరోహిస్తాడు. ఆ రథానికి గుర్రాలు ఇంద్రియాలు. సారథి బుద్ధి. ఆ రథమెక్కి, నలువైపులా పరుగెత్తుతుంటాడు. బ్రహ్మమయమయిన రథం ఎల్లప్పుడు ఉండేది, మహత్తర మయినది. ఇంద్రియా లనే ఉత్తమాశ్వాలు గలది, మనస్సు సారథి అయినది, బుద్ధి అనే చెన్నకోల గలిగి ఉంది. ఈ రీతిగా బ్రహమ్మమయ రథాన్ని తెలుసుకొన్న విద్వాంసుడు సమస్త ప్రాణులలో మోహవశుడు గాడు. ఈ జగత్తు ఒక బ్రహ్మవనం. అవ్యక్త ప్రకృతి దీనికి ఆది అవుతుంది. పంచ మహాభూతాలు, దశేంద్రియాలు, మనస్సు ఒకటి, మొత్తం కలిసి పదునారు విశేషాలదాకా

ఇది విస్తరించి ఉంది. ఇది చరాచర ప్రాణులతో నిండి ఉంది. సూర్యచంద్రాదుల వెలుగులతో ప్రకాశిస్తున్నది. గ్రహ నక్షత్రాలతో శోభిస్తున్నది. నదులు, పర్వతాల సమూహాలతో అన్నివైపులా అలంకృతమై ఉన్నది. నానావిధ జలాలతో నిండి ఉంది. సర్వభూతాలకు, సమస్తప్రాణులకు ఇదే గతి. ఈ మహావనంలో క్షేత్రజ్ఞుడు సంచరిస్తున్నాడు.

ఈ లోకంలో ఉన్న స్థావర జంగమప్రాణులే మొదట ప్రకృతిలో లీనం అవుతాయి. తరువాత పంచ భూతాల కార్యాలు లీనమవుతాయి. కార్యరూపగుణలయం తరువాత పంచ భూతాలు లీనం అవుతాయి. ఈ రీతిగా ఈ భూత సముదాయం ప్రకృతిలో లీనం అవుతుంది. దేవతలు, గంధర్వులు, మనుష్యులు, పిశాచాలు, అసురులు, రాక్షసులు స్వభావ సృష్టులేగాని వీరి సృష్టికి ప్రక్రియలు గాని, కారణాలు గాని లేవు. విశ్వసృష్టిని చేసే-మరీచ్యాదులయిన బ్రాహ్మణులు సముద్ర తరంగాల లాగా పంచ మహాభూతాల నుంచి ఉత్పన్నులు అవుతారు. తరువాత సమయానుసారం వాటిల్లోనే లీనమవుతారు. ఈ విశ్వాన్ని సృష్టించే ప్రాణులకంటే పంచమహాభూతాలు అన్నివిధాల శ్రేష్ఠాలు. ఈ పంచమహాభూతాలనుంచి ముక్తుడైనవాడు పరమగతి నందుతాడు. శక్తియుక్తు డయిన ప్రజాపతి మనస్సుతోనే ఈ సమస్తం సృజించాడు. అలాగే ఋషులు కూడా తపస్సుతోనే దేవత్వాన్ని పొందారు. కందమూలఫలాలు ఆహారంగా గల సిద్ధులయిన మహాత్ములు ఇక్కడ తపః ప్రభావంతోనే చిత్తం ఏకాగ్రం చేసి, ముల్లోకాల విశేషాలను దర్శిస్తారు. ఆరోగ్య సాధనాలయిన ఓషధులు, నానావిధాలయిన విద్యలు తపస్సుచేతనే సిద్ధిస్తాయి. సర్వ సాధనాలకు తపస్సే మూలం. **పొందటానికి కష్టమైనది. అభ్యసించ అలవికానిది, అణచవీలుగానిది, సాంగత్యం సంపాదించ కష్టమయినది - సమస్తం తపస్సుతో సాధ్యం అవుతుంది. తపః ప్రభావం అనుల్లంఘనీయం.*** మద్యపానం చేసినవాడు, బ్రాహ్మణ హత్య చేసినవాడు, దొంగ, గర్భపాతం చేసేవాడు గురు భార్యాగామి అయిన మహాపాపాత్ముడు, కూడా తీవ్రంగా తపస్సు చేసి మహాపాప విముక్తుడవుతాడు. మనుష్యులు, పితరులు, దేవతలు, పశువులు, మృగాలు, పక్షులు, ఇంకా ఇతర చరాచర ప్రాణులు నిత్యం తపస్సులో లగ్నమయి సిద్ధిని సంపాదిస్తాయి. అలాగే మహామాయాశక్తులయిన దేవతలు తపస్సు వలననే స్వర్గంలో నివసిస్తున్నారు. సోమరితనం వీడి అహంకార యుక్తులయి

* **యద్దురాపం దురామ్నాయం దురాధర్షం దురన్వయమ్ ।**
తత్ సర్వం తపసా సాధ్యం తపో హి దురతిక్రమమ్ ॥ 17

సకామకర్మానుష్ఠానం చేసేవారు ప్రజాపతి లోకానికి వెళ్తారు. **అహంకార మమకారాలు లేని మహాత్ములు శుద్ధమయిన ధ్యాన యోగంతో మహోత్తమ లోకాల నందుతారు.*** ధ్యానయోగాన్ని ఆశ్రయించి ఎల్లప్పుడు ప్రసన్న చిత్తులయి ఉండే ఆత్మవేత్తలలో శ్రేష్ఠులయినవారు సుఖరాశి అయిన పరమాత్మలో ప్రవేశిస్తారు. ధ్యానయోగాన్నుంచి వెనుదిరిగి అంటే ధ్యానంలో సఫలులుకాక మమకారాహంకార రహిత జీవితం గడిపే నిష్కాములయిన వారు కూడా మహా పురుషుల ఉత్తమ - అవ్యక్తలోకాల్లో లీనులవుతారు. స్వయంగానే ఆ సమత్వాన్ని పొంది అవ్యక్తం నుంచే ప్రకటమవుతారు. కేవలం సత్త్వాన్ని ఆశ్రయించి తమోగుణ రజోగుణాలనుంచి విముక్తిని పొందుతారు. సర్వపాపవిముక్తుడయి ఉండి సమస్త సృష్టినిచేసే ఆ అఖండాత్మను క్షేత్రజ్ఞుడని తెలుసుకోవాలి. ఆ జ్ఞానం పొందిన వ్యక్తియే వేదవేత్త అవుతాడు. మునిచింతనతో చేతన సమ్యక్ జ్ఞానాన్ని పొంది మనస్సును, ఇంద్రియాలను ఏకాగ్రం చేసి, పరమాత్మ ధ్యానంలో ఉండాలి. ఎవని చిత్తం దేనిలో లగ్నం అవుతుందో అతడు తప్పక ఆ స్వరూపమే అవుతాడు. ఇది సనాతనం, గోపనీయం అయిన విషయం. అవ్యక్తం నుంచి పదునారు విశేషాలదాకా సమస్తం అవిద్యాలక్షణమని చెపుతారు. ఇది గుణాల విస్తారమే అని తెలుసుకోవాలి. రెండక్షరాల పదం మమ (ఇదినాది) అనేది మృత్యురూపం. మూడు అక్షరాలు న మమ (నాదికాదు) అనేది సనాతన పరబ్రహ్మ ప్రాప్తికరం అవుతుంది. మందబుద్ధులయిన కొంతమంది మానవులు (స్వర్గాదిఫలదాయ కాలయిన) కర్మలను ప్రశంసిస్తారు. మహాత్ములయిన జ్ఞాన వృద్ధులు కర్మను ప్రశంసించరు. సకామ కర్మానుష్ఠానం వలన జీవుడు పదునారు వికారాలతో నిర్మితమయిన స్థూలదేహం ధరించి, జన్మిస్తాడు. ఈతడు ఎల్లప్పుడు అవిద్యా గ్రస్తు డవుతాడు. ఇంతేకాక కర్మిష్ఠి అయినవాడు దేవతలకు గూడా అనుభవింపదగిన విషయం అవుతాడు. కాబట్టి కొంతమంది విద్వాంసులు కర్మలయందు ఆసక్తులు కారు. **ఈ పురుషుడు జ్ఞానమయుడు గాని కర్మమయుడు గాడు.** ఈ రీతిగా చేతనాత్మ అమృత స్వరూపం, నిత్యం, ఇంద్రియాతీతం, సనాతనం, జితాత్మం, అసంగం, అని తెలుసుకొన్నవాడు ఎప్పుడూ మృత్యుపాశంతో బద్ధుడుకాడు. ఆత్మ అపూర్వం (అనాది), అకృతం (జన్మలేనిది), నిత్యం, అచలం, అగ్రాహ్యం, అమృతాశనం అనే దృష్టిగలవాడు, ఈ గుణాలను చింతించటం

---

* ధ్యానయోగేన శుద్ధేన నిర్మమా నిరహంకృతాః ।
ఆప్నువంతి మహాత్మానః మహాంతం లోకముత్తమమ్ ॥ 22

వలన స్వయంగా గూడా అగ్రాహ్యుడు (ఇంద్రియాతీతుడు), నిశ్చలుడు, అమృత స్వరూపుడు అవుతాడు. **చిత్తం శుద్ధంచేసే సర్వసంస్కారాలను సంపాదించి, మనస్సును ఆత్మధ్యానంలో లగ్నం చేసేవాడే శుభంకర బ్రహ్మప్రాప్తిని పొందుతాడు. ఇందులో సందేహం లేదు. అంతఃకరణం పూర్తిగా స్వచ్ఛం అయిన తరువాత సాధకునికి ప్రసన్నత కలుగుతుంది. కలలోనుంచి మేల్కొన్నవానికి స్వప్నం ఉపశమించినట్లు చిత్తశుద్ధియే ప్రసన్నతా లక్షణం. జ్ఞాననిష్ఠులు, జీవన్ముక్తులు అయిన మహాత్ముల ఉత్తమగతి ఇదే. వారు సమస్త ప్రవృత్తులను శుభా శుభఫలాలు ఇచ్చేవానినిగా భావిస్తారు.** ఇదే విరక్తుల ఉత్తమ గతి. ఇదే సనాతన ధర్మం, ఇదే జ్ఞానులు పొందదగిన స్థానం. ఇదే అనిందితమయిన సదాచారం. సర్వభూతాల పైన సమభావం ఉంచటం, లోభం, కోరిక లేకపోవటం, అంతటా సమదృష్టి గల జ్ఞానియే ఈ పరమగతిని పొందుతాడు. బ్రహ్మర్షి శ్రేష్ఠులారా! ఈ రీతిగా సమస్తం మీకు వివరించాను. ఈ రకంగా ఆచరించి, త్వరగా సిద్ధిని పొందండి.'

గురువు చెప్పాడు - 'వత్సా! ఈ విధంగా గురువయిన బ్రహ్మదేవుడు చెప్పగా అదే రీతిగా ఆచరించి, ఉత్తమ లోకాలను పొందారు. మహాభాగా! నీ చిత్తం శుద్ధమయినది. కాబట్టి నీవు కూడా నీకు చెప్పిన బ్రహ్మదేవుని ఉపదేశం చక్కగా పాటించు. దీనివల్ల నీకు కూడా సిద్ధి కలుగుతుంది. శ్రీకృష్ణుడు చెప్పాడు - కుంతీపుత్రా! ఈ రీతిగా గురువు చెప్పిన ఉత్తమ ధర్మాన్ని అనుష్ఠించాడు. అందువల్ల మోక్షం పొందాడు. కురుకులశ్రేష్ఠా? శిష్యుడు కృతకృత్యుడయి శోకించనవసరం లేని ఉత్తమగతిని పొందాడు.' అర్జునుడు అడిగాడు - 'జనార్దనా! శ్రీకృష్ణా! ఈ బ్రాహ్మణుడు ఎవరు? ప్రభూ! నేను వినదగినదయితే దీన్ని నాకు చెప్పవలసింది.' శ్రీకృష్ణుడు చెప్పాడు - "మహాబాహూ! అర్జునా! నేనే గురువును. నామనస్సే శిష్యుడు అని తెలుసుకో. నీ ప్రీతికోసం ధనంజయా! రహస్యమయిన దీన్ని చెప్పాను. నామీద నీకు ప్రేమ ఉంటే అధ్యాత్మ విషయం గల దీన్ని చక్కగా ఆచరించు. ఈ ధర్మాన్ని పూర్తిగా ఆచరిస్తే సర్వపాప విముక్తుడవు అయి, విశుద్ధ మోక్షాన్ని పొందుతావు. మహాబాహూ! పూర్వం నేను యుద్ధకాలం సంప్రాప్తించినప్పుడు ఈ ఉపదేశాన్నే చెప్పాను. కాబట్టి దీనిమీద మనస్సుపెట్టు. భరతవంశశ్రేష్ఠా! మా తండ్రి వాసుదేవుని చూసి చాలాకాలమయింది. ఫాల్గునా! నీకు ఇష్టమయితే నేను ఆయనను దర్శించటానికి వెళ్తాను." ఇలా శ్రీకృష్ణుడు చెప్పగా అర్జునుడు ఇలా సమాధానం చెప్పాడు. "శ్రీకృష్ణా! ఇవ్వాళనే

హస్తినాపురానికి వెళ్దాం. అక్కడ ధర్మాత్ముడయిన యుధిష్ఠిర మహారాజు వద్దకు వెళ్ళి, ఆయన అనుమతి తీసుకొని, ద్వారకకు వెళ్ళవచ్చు."

52. శ్రీకృష్ణుని ద్వారకాగమనము.

వైశంపాయనుడు చెప్పాడు - 'జనమేజయా ! అప్పుడు శ్రీకృష్ణుడు దారుకునితో గుర్రాలను పూన్చి రథాన్ని సిద్ధం చేయి.' అని ఆజ్ఞాపించాడు. అంతట దారుకుడు నిమిషంలో తిరిగి వచ్చి **రథం సిద్ధం** అని చెప్పాడు. ఇలాగే అర్జునుడు కూడా తన సేవకులకు రథాన్ని సిద్ధం చేయమని మనం ఇప్పుడు హస్తినాపురానికి వెళ్ళాలని చెప్పాడు. అర్జునుడు ఇలా చెప్పగా సైనికులు, ప్రయాణానికి సిద్ధమయ్యారు. అమిత తేజస్వి అయిన అర్జునునికి ఆ విషయం నివేదించారు. తరువాత శ్రీకృష్ణార్జునులు రథం ఎక్కి, వివిధవిషయాలను మాట్లాడుకొంటూ ప్రసన్నచిత్తులయి వెళ్ళారు. మహాతేజస్వి అయిన ధనంజయుడు శ్రీకృష్ణునితో మళ్ళీ ఇలా అన్నాడు. "శ్రీకృష్ణా! నీ అనుగ్రహం వల్ల యుధిష్ఠిర మహారాజు జయం పొందాడు. శత్రువులను అణచివేశాడు. శత్రురహితమయిన రాజ్యం పొందాడు. మధుసూదనా! మా పాండవుల కందరికి నీవు దిక్కయినావు. నీవు అనే నావను ఆధారం చేసుకుని కౌరవు లనే సముద్రం దాటాం. విశ్వకర్మా! నీకు నమస్కారం. విశ్వాత్మా ! నీవు సర్వోత్తముడవు. నీవు అనుకొన్నట్లుగానే నిన్ను తెలుసుకొన్నాను. మధుసూదనా! నీ తేజస్సు వలన ఎల్లప్పుడు సర్వప్రాణుల ఉత్పత్తి జరుగుతుంది. నీవే సర్వప్రాణులకు ఆత్మవు. నానావిధ లీలలు నీ మనో వినోదానికే. భూమి ఆకాశం నీ మాయయే! ప్రభూ! స్థావరజంగమాత్మకమయిన ఈ విశ్వం అంతా నీలోనే ఉంది. నీవే నాలుగు విధాలయిన ప్రాణులను సృష్టిస్తావు. పృథివిని, అంతరిక్షాన్ని, ఆకాశాన్ని నీవే సృష్టించావు. నీ నవ్వే నిర్మలమయిన వెన్నెల. నీ ఇంద్రియాలే ఋతువులు. నిరంతరం వీచే వాయువు నీ ప్రాణమే. నీ క్రోధమే సనాతనమయిన మృత్యువు. నీ ప్రసన్నతలోనే లక్ష్మీదేవి ఉన్నది. ఆ శ్రీదేవి నిత్యం నీ వక్షఃస్థలంలోనే నివసిస్తుంది. రతి, తుష్టి, ధృతి, ఓర్పు, మేధస్సు, కాంతి, చరాచర ప్రపంచమూ నీలోనే ఉంది. అనఘా! యుగాంతంలో జరిగే మహా ప్రళయం నీవే అని చెపుతారు.

సుదీర్ఘకాలమయినా నీ అనంతగుణాలు వర్ణించటం నాకు శక్యం కాదు. పద్మనేత్రా ! ఆత్మ, పరమాత్మ నీవే. నీకు నమస్సు. తేరిపారజూడరాని మహాత్మా! దేవర్షి

నారదుడు, దేవలుడు, వ్యాసమహర్షి, భీష్మపితామహుడు నిన్ను గూర్చి చెప్పగా నాకు తెలిసింది. ఈ జగత్తు అంతా నీతో నిండినిబిడమయి ఉంది. మానవులకు నీవే ఏకైక అధిపతివి. నాపై అనుగ్రహం ఉంచి చేసిన ఉపదేశాన్ని అంతా నేను ఆచరిస్తాను. పాపాత్ముడు, కౌరవవంశీయుడయిన దుర్యోధనుని చంపటం అనే అద్భుతమయినకృత్యం నీవు మాకు ప్రియం చేయటానికి ఆచరించావు. మొదట నీవే శత్రుసేనను దగ్ధం చేయగా తరువాత నేను యుద్ధంలో దాన్ని జయించాను. నీవు చేసిన ఆ మహత్కార్యం వల్లనే నాకు జయం కలిగింది. యుద్ధంలో నీ బుద్ధి, పరాక్రమాలతో దుర్యోధనుడు, కర్ణుడు, పాపాత్ముడయిన సైంధవుడు, భూరిశ్రవుడు అనేవారిని వధించటానికి ఉపాయం యథావిధిగా నాకు దృష్టిగోచరం అయింది. దేవకీనందనా! నీవు ప్రేమతో, ప్రసన్నతతో చెప్పినది అంతా చేస్తాను. ఈ విషయంలో నేను ఆలోచించ నవసరంలేదు. అనఘా! ధర్మజ్ఞా! ధర్మాత్ముడయిన యుధిష్ఠిర మహారాజు వద్దకు వెళ్ళి నీవు ద్వారకకు వెళ్ళటానికి ఆజ్ఞ ఇవ్వమని అడుగుదాం. ప్రభూ ! నీవు ద్వారకా నగరానికి వెళ్ళటం నాకు ఇష్టమే. జనార్దనా ! త్వరగానే నీవు నా మేనమామ అయిన వసుదేవుని, దుర్ధర్షుడయిన బలరాముని, అలాగే ఇతర వృష్ణివంశశ్రేష్ఠులను చూస్తావు.' ఈ రీతిగా మాట్లాడుకొంటూ వారిద్దరు సంతోషంతో జనసమ్మర్దంతో నిండిన హస్తినాపురం ప్రవేశించారు.

మహారాజా! వారు ఇంద్రభవనంలాంటి ధృతరాష్ట్ర మహారాజు భవనానికి వెళ్లారు. అక్కడ జననాధుడయిన ధృతరాష్ట్రుని, మహామేధావి అయిన విదురుని, యుధిష్ఠిర మహారాజును దర్శించారు. అజేయు డయిన భీమసేనుని, నకుల సహదేవులను, ధృతరాష్ట్రుని సేవిస్తూ పరాజయం పాలు గాని యుయుత్సుని, మహామేధావిని అయిన గాంధారిని, కుంతిని, ద్రౌపది, సుభద్ర మొదలయిన ఆ భరత వంశీయ స్త్రీలను, గాంధారి పరిచారికలను అందరిని చూశారు. శత్రునాశకు లయిన వారిద్దరు ధృతరాష్ట్రమహారాజు దగ్గరకు వెళ్ళి, తమ పేర్లు చెప్పుకొని ఆయన పాదాలకు నమస్కరించారు. తరువాత గాంధారి, కుంతి, ధర్మరాజు, భీములను సమీపించి వారికి ఆ మహాత్ములు పాదవందనం చేశారు. ఆ తరువాత విదురుని కుశల ప్రశ్నలు వేశారు. మహాత్ముడు, వైశ్య స్త్రీ పుత్రుడయిన యుయుత్సుని ఆలింగనం చేసుకొన్నారు. వారి అందరితో కలిసి శ్రీకృష్ణార్జునులు ధృతరాష్ట్రుని వద్ద కూర్చున్నారు. రాత్రి కాగా మేధావి అయిన ధృతరాష్ట్ర మహారాజు ఆ కురువీర శ్రేష్ఠులను, శ్రీకృష్ణుని తమనివాసాలకు పంపించాడు. రాజాజ్ఞను పొంది వారందరు తమ

తమ నివాసాలకు వెళ్ళారు. పరాక్రమవంతు డయిన శ్రీకృష్ణుడు అర్జునుని ఇంటికి వెళ్లాడు. ఆయనను తగినరీతిగా పూజించారు. ఆయన అవసరాలకు తగిన సమస్త పదార్థాలను అక్కడ సమకూర్చారు. భోజనానంతరం మేధావి అయిన శ్రీకృష్ణుడు అర్జునునితో గూడా నిద్రించాడు. తెల్లవారగా ఉదయం చేయవలసిన సంధ్యావందనాది కృత్యాలను యథావిధిగా నిర్వర్తించారు. పరమపూజితులయిన ఆ మిత్రులు ఇరువురు మహాబలుడయిన ధర్మరాజు అమాత్యులతో కూడి ఉన్న సౌధానికి వెళ్ళారు. పరమ సుందరమూ, చక్కగా అలంకృత మయిన ఆ గృహాన్ని ప్రవేశించి, శ్రీ కృష్ణార్జునులు దేవేంద్రుని అశ్వినీదేవతలు వలె ధర్మరాజును దర్శించారు. శ్రీకృష్ణార్జునులు యుధిష్ఠిరుని వద్దకు వచ్చారు. ప్రీతుడయిన ఆ రాజు అనుమతింపగా వారిద్దరు కూర్చున్నారు. తరువాత మేధావి, రాజశ్రేష్ఠ డయిన ధర్మరాజు వారిద్దరిని చూసి, వారు ఏదో చెప్పదలచుకొన్నారని తెలిసి ఇలా అన్నాడు.

'శ్రీకృష్ణార్జునులారా! మీరు ఏదో చెప్పదలచుకున్నా రనుకుంటాను. మీరు చెప్పింది వెంటనే చేస్తాను. అది ఏమిటో చెప్పండి. ఆలోచించనక్కరలేదు.' ఈ విధంగా ఆయన అనగా సంభాషణ చతురుడయిన అర్జునుడు వినయంగా ఆయన వద్దకు చేరి, ఆ ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'మహారాజా! ప్రతాపవంతుడయిన ఈ వాసుదేవుడు ఇక్కడ చాలాకాలం నుంచి ఉన్నాడు. మీ అనుమతి తీసుకొని తన తండ్రిని చూడగోరుతున్నాడు. మీకు ఇష్టమయితే మీ అనుమతి తీసుకొని ద్వారకానగరానికి వెళ్ళగోరుతున్నాడు. కాబట్టి అనుమతించటం సముచితం.' అర్జునుని పలుకులు విని, ధర్మజుడు కృష్ణునితో ఇలా అన్నాడు. 'పద్మపత్రాక్షా ! మధుసూదనా! ప్రభూ! మీ తండ్రి వసుదేవుని చూడటానికి ఇవ్వాళే బయలుదేరి వెళ్ళు. నీకు మేలు అగుగాక. మహాబాహూ! కేశవా! నీవు వెళ్ళటం నాకు ఇష్టమే. మా మేనమామ వసుదేవుని, దేవకీ దేవిని చూసి చాలాకాలం అయింది. మహామేధావీ! మాధవా! మా మేనమామ వసుదేవుని వద్దకు, బలదేవుని వద్దకు వెళ్ళి నామాటగా సముచితంగా వారిని గౌరవించు. శ్రీకృష్ణా! నీవు బలవంతులలో శ్రేష్ఠుడయిన భీముని, అర్జునుని, సహదేవుని, నకులుని నిత్యమూ స్మరించగోరుతాను. మహాభుజా! ఆనర్తదేశీయులయిన వృష్ణులను, మీ తండ్రిని చూచిన తరువాత నేను చేయబోయే అశ్వమేధయాగానికి తిరిగి రావాలి. కేశవా ! వివిధ మయిన రత్నాలను, ఇతర సంపదలను, ఇంకా నీ మనస్సుకు నచ్చినది అంతా తీసుకొని వెళ్ళు. మహావీరా! ఈ సమస్త భూమండలం నీ ప్రసాదంగా మాకు లభించింది. శత్రువులు అందరు హతులయ్యారు.' యుధిష్ఠిరుడు ఇలా చెప్పగా పురుషశ్రేష్ఠుడయిన శ్రీకృష్ణుడు

ఇలా అన్నాడు.

"మహాబాహూ! రత్నాలు, ధనం, సమస్త భూవలయం అంతా నీదే. అంతేకాదు, మా ఇంటనున్న ధనం తదితరాలు అన్నింటికి నీవే ప్రభువువు." ధర్మజుడు అలాగేనని ఆయన మాటలను ఆదరించాడు. ఆయన సమ్మానం గ్రహించి శ్రీకృష్ణుడు తన మేనత్త కుంతీదేవి వద్దకు వెళ్ళి ఆమెతో మాట్లాడాడు. ఆమె వద్ద తగిన సత్కారం పొంది, ఆమెకు ప్రదక్షిణం చేశాడు. చతుర్భుజుడయిన శ్రీకృష్ణుడు ఆమె అభినందనలు స్వీకరించాడు. అలాగే విదురాదులు అందరు పూజించారు. తరువాత ఆయన హస్తినాపురం నుంచి రథంమీద బయటకు వచ్చాడు. తరువాత శ్రీకృష్ణుడు కుంతీదేవి యుధిష్ఠిరుల అనుమతితో చెల్లెలు సుభద్రను రథం ఎక్కించుకొని, పౌరజనులందరు కూడి ఉన్న నగరంనుంచి బయలుదేరాడు. ఆ శ్రీకృష్ణుని వానరధ్వజుడయిన అర్జునుడు, సాత్యకి, నకుల సహదేవులు, అగాధ బుద్ధిగల విదురుడు, మహాగజం లాగా పరాక్రమించే భీముడు స్వయంగా అనుసరించారు. శ్రీకృష్ణుడు కౌరవరాష్ట్రాన్ని పెంపొందింపజేసేవారందరినీ, విదురునీ వెనుకకు పంపి, దారుకునితో, సాత్యకితో త్వరగా రథం పోనీయమన్నాడు. అనంతరం శత్రుగణాలను మర్దించే ప్రతాపవంతుడు శ్రీకృష్ణుడు సాత్యకి వెంటరాగా శత్రువులను సంహరించి, అమరావతి వెళ్ళిన మహేంద్రునివలె ద్వారకానగరానికి బయలుదేరాడు.'

53. ఉత్తంకో పాఖ్యానము - 1.

శత్రునాశకులు, భరతవంశశ్రేష్ఠ లయిన పాండవులు ఆ రీతిగా బయలుదేరి వెళ్ళుతున్న శ్రీకృష్ణుని ఆలింగనం చేసుకొని, అనుయాయులతో కూడా వెనుదిరిగారు. అర్జునుడు పలుమారులు శ్రీకృష్ణుని కౌగలించుకొన్నాడు. తరువాత కన్పించినంతవరకు కన్నులు ఆర్పకుండా ఆయనను పలుమారులు చూశాడు. అర్జునుడు శ్రీకృష్ణుని పైపెట్టిన చూపును అతికష్టం మీద మరల్చుకొన్నాడు. శ్రీకృష్ణుడు కూడా అర్జునుని మీద నిలిపిన చూపును వెనుకకు త్రిప్పుకొన్నాడు. రాజా! ఆ శ్రీకృష్ణ దేవుని ప్రయాణ సమయంలో కలిగిన అద్భుత శకునాలను చెపుతాను, విను. వాయువు శ్రీకృష్ణుని రథానికి ముందు మార్గంలో చిన్నచిన్న రాళ్ళు, దుమ్ము, ముళ్ళు తొలగిపోయేటట్లు తీవ్ర వేగంతో వీచింది. శ్రీకృష్ణుని ముందు ఇంద్రుడు, స్వచ్ఛమయిన సువాసనగల జలం వర్షించాడు. దివ్య పుష్పవృష్టి కురిపించాడు. ఈ విధంగా మరుభూమిలో సమతల ప్రదేశంలోకి వెళ్ళి, మహాబాహుడైన శ్రీకృష్ణుడు మునిశ్రేష్ఠుడయిన ఉత్తంకుని దర్శించాడు. శ్రీకృష్ణుడు ఆయనను

తగురీతిగా పూజించాడు. ఆయన పూజలనందుకొని కృష్ణుడు మునిని కుశలమడిగాడు. ఆయనను గౌరవించి, బ్రాహ్మణ శ్రేష్ఠుడైన ఉత్తంకుడు మాధవుని ఇలా అడిగాడు. 'శ్రీకృష్ణా! నీవు కురుపాండవుల నివాసానికి వెళ్ళి. వారి సోదర స్నేహం నిశ్చలంగా ఉండేటట్లు చేశావా? ఆ విషయం నాకు వివరించవలసింది. వృష్ణివంశశ్రేష్ఠా! నీకు బంధువులు, నిరంతరం చాలా ఇష్టులు అయిన ఆ ఇరుపక్షాల వారిని ఏకం చేసి, తిరిగి వస్తున్నావా కేశవా ? పంచపాండవులు, ధృతరాష్ట్రకుమారులు నీతో కలిసి లోకాల్లో విహరిస్తారా? రక్షకుడ వయిన నీవు కౌరవులు అందరిని శాంతింప చేయగా ఇప్పుడు పాండవులు, రాజులు తమ రాజ్యాలలో సుఖంగా ఉన్నారా? వత్సా! నీ ప్రయత్నం చేత కౌరవ పాండవుల ఐక్యం తప్పక కలుగుతుంది అని నాకు గట్టి నమ్మకం ఉండేది. నాయనా! నీవు భరత వంశీయులకోసం చేసిన ప్రయత్నం సఫలం అయిందా?'

భగవానుడు చెప్పాడు – 'మహర్షీ! పూర్వం నేను కౌరవులను ఉపశమింపజేయటానికి గట్టిగా ప్రయత్నించాను. కాని వారిని సంధికి ఏవిధంగా కూడా అనుకూలురను చేయటం వీలుకాలేదు. అందువల్ల ఆ కౌరవులు అందరు పుత్రులతో, బంధువులతో మరణించారు. మహర్షీ! ప్రారబ్ధ విధానాన్ని బుద్ధితోగాని, బలంతో గాని ఎవ్వరూ రూపుమాపలేరు. అనఘా! నేను, భీష్ముడు, విదురుడు చేసిన ఉపదేశాలను ఆ కౌరవులు పెడచెవిన పెట్టారని నీవు పూర్తిగా వినే ఉంటావు. తరువాత ఉభయపక్షాలవారు పరస్పరం ఎదుర్కొని, యుద్ధంలో మరణించారు. శత్రువులను చంపి, తమ పుత్రులు మరణించగా పంచపాండవులు మిగిలారు. కుమారులు, బంధువులతో గూడా కౌరవులు అందరూ హతులయ్యారు.' ఈ విధంగా శ్రీకృష్ణుడు చెప్పగా ఉత్తంకుడు కోపపూర్ణుడయి కోపంతో కన్నులు పెద్దవి చేసి, శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

'శ్రీకృష్ణా! సమర్థుడివయి ఉండి కూడా నీవు నీ బంధువులయిన కౌరవులను రక్షించలేదు. కాబట్టి నిన్ను శపిస్తాను. ఇందులో సందేహం లేదు. నీవు బలవంతంగా వారిని పట్టుకొని నివారించగలవు. అయినా అలా చేయలేదు. కాబట్టి మధుసూదనా! కోపపూర్ణుడనై నిన్ను శపిస్తాను. మాధవా! నీవు సమర్థుడివి అయి కూడా మిథ్యాచారాన్ని అనుసరించావు. ఇది విచారకరం. యుద్ధంలో అన్ని దిక్కులనుంచి వచ్చిన ఆ కురువంశీయులు నశించారు. నీవు వారిని ఉపేక్షించావు.' శ్రీకృష్ణుడన్నాడు – 'భృగునందనా! నేను చెప్పేది అంతా సవిస్తారంగా విను. భార్గవా! తపస్వివయిన నీవు నా వినయ వచనాలను విను. నీకు అధ్యాత్మతత్వం చెపుతాను, విను. తరువాత నన్ను శపించు. ఏ వ్యక్తి అయినా

నన్ను అల్పమయిన తపస్సుతో తిరస్కరించలేడు. తపస్వి శ్రేష్ఠా! నీ తపస్సు నష్టం కావటం నాకిష్టం లేదు. నీవు మహత్తర తపస్సు చేశావు. గురువులను సంతోషపెట్టావు. ద్విజశ్రేష్ఠా! నీవు బాల్యంనుంచే బ్రహ్మచర్యాన్ని అనుష్ఠించావు అని నాకు తెలుసు. కాబట్టి చాలా కష్టపడి సంపాదించిన నీ తపస్సు వృధాగా వ్యయం కావటం నాకు ఇష్టం లేదు.'

54. ఉత్తంకోపాఖ్యానము - 2.

ఉత్తంకుడు అడిగాడు – 'కేశవా! పవిత్రమయిన అధ్యాత్మ విషయాన్ని యథావిధిగా చెప్పవలసింది. అది విని నీకు మేలు కలగాలని ఆశీర్వదిస్తాను. లేకపోతే శాపం ఇస్తాను.' శ్రీకృష్ణుడు చెప్పాడు. 'తమస్సు, రజస్సు, సత్త్వం అనే మూడు గుణాలు నన్ను ఆశ్రయించినవే అని తెలుసుకో. రుద్రులు, వసువులు, నానుంచి పుట్టారని తెలుసుకో. సర్వభూతాలు నాలో ఉన్నాయి. నేను సర్వ భూతాలలో ఉన్నాను. ఈ విషయంలో నీకు సంశయం అక్కర లేదు. అలాగే దైత్యగణాలు యక్షులు, గంధర్వులు, రాక్షసులు నాగులు, అప్సరసలు అందరు నానుంచే జనించారని తెలుసుకో. విద్వాంసులు చెప్పే సత్తు, అసత్తు, వ్యక్తం, అవ్యక్తం, అక్షరం, క్షరం, అన్నీ నాస్వరూపమే. మునీంద్రా! నాలుగు ఆశ్రమాలలో నాలుగు ధర్మాలుగా ఉన్న సర్వ వైదిక ధర్మాలు నా స్వరూపమే అని తెలుసుకో. అసత్తు, సత్తులు, సదసత్తుల కన్న పరమయిన అవ్యక్త జగత్తు సనాతనుడను, దేవదేవుడను అయిన నాకంటె వేరుగా లేదు. భృగువంశశ్రేష్ఠా! ఓంకారంతో ఆరంభమయ్యే వేదాలు నేనే అని తెలుసుకో. యజ్ఞంలోని యూపం, సోమం, చరువు, దేవతలను తృప్తి పరచే హోమం, హోత, హవ్యసామగ్రి నానుండే జనించిన వని తెలుసుకో ! భృగునందనా! అధ్వర్యుడు, కల్పకం, చక్కగా సంస్కరింపబడిన హవిస్సు – ఇవి అన్నీ నా స్వరూపాలే. మహత్తర యజ్ఞంలో ఉద్గాత ఉచ్చైస్స్వరంతో సామగానం చేయటం నా స్తుతియే. బ్రాహ్మణా ! ప్రాయశ్చిత్తకర్మల శాంతిపాఠం, మంగళ పాఠం చేసే బ్రాహ్మణులు విశ్వకర్మనయిన నన్నే స్తుతిస్తారు. ద్విజశ్రేష్ఠా! **సర్వప్రాణుల మీద దయ చూపటం అనే రూపంగల ధర్మం నా మానవమయిన జ్యేష్ఠపుత్రుడని తెలుసుకో.** ఆ ధర్మంలో ప్రవర్తిస్తూ పాపకర్మనివృత్తులయిన మానవులతో నేను ఎల్లప్పుడు ఉంటాను. సాధుశ్రేష్ఠా! నేను ధర్మరక్షణకు, ధర్మసంస్థాపనకు ముల్లోకాల్లో అనేక జాతుల్లో అవతరించి, ఆయా రూపాలతో, వేషాలతో వాటికి తగినట్లు ప్రవర్తిస్తాను.

నేనే విష్ణువును బ్రహ్మను, ఇంద్రుడను. సర్వభూతాల ఉత్పత్తి ప్రళయాలకు కారణం నేనే. సర్వప్రాణుల సృష్టి సంహారాలు నా పనులే. అధర్మంగా ప్రవర్తించే వారిని శిక్షించే వాడిని, నా మర్యాదను అతిక్రమించని ఈశ్వరుడను నేనే. యుగాలు మారినప్పుడు ప్రజలకు మేలుకోరి, భిన్నభిన్న యోనులలో ప్రవేశించి, ధర్మమర్యాదను స్థాపిస్తాను. భృగునందనా! నేను దేవజాతిలో జన్మించినప్పుడు దేవుని లాగా ఉండి దేవతల వలెనే అన్నీ ఆచరిస్తాను. ఇందులో సంశయం లేదు. నేను గంధర్వజాతిలో జన్మించినప్పుడు గంధర్వుని వలెనే ప్రవర్తిస్తాను, ఆచరిస్తాను. ఇది నిస్సంశయం. నాగజాతిలో జనించినప్పుడు నాగుని వలెనే ప్రవర్తిస్తాను. యక్షరాక్షస జాతులలో జన్మిస్తే ఆ జాతులవారివలె ప్రవర్తిస్తాను. మానవజన్మతో ఇప్పుడు నేను అవతరించాను. కాబట్టి కౌరవుల మీద నా సర్వేశ్వరశక్తిని ఉపయోగించక మొదటనే దీనతతో సంధికోసం ప్రార్థించాను. కాని వారు మోహగ్రస్తులవటంచేత నా హిత వచనాలు వినలేదు. తరువాత క్రోధపూర్ణుడనయి, నేను కౌరవులను భయపెట్టాను. వారికి యథార్థంగా కలగబోయే యుద్ధ పరిణామాలను చూపించాను. కాని వాళ్లు అధర్మయుక్తులు, కాలగ్రస్తులు. కాబట్టి నా మాటలను వినలేదు. ధర్మంగానే వారు హతులయ్యారు. అందువల్ల స్వర్గానికి వెళ్ళారు. ఇందులో సందేహం లేదు. ద్విజోత్తమా! ధర్మాచరణం వల్ల పాండవులు సమస్తలోకాలలో ప్రఖ్యాతులయ్యారు. ఇంతవరకు నీవు అడిగినది అంతా చెప్పాను.'

55. ఉత్తంకోపాఖ్యానము - 3.

ఉత్తంకుడు అన్నాడు - 'జనార్దనా! జగత్తుకు కర్తవు నీవు అని ఎరుగుదును. ఇప్పుడు నీవు చెప్పిన అధ్యాత్మిక విషయం నీ ప్రసాదమే అనటంలో నాకు సందేహం లేదు. అచ్యుతా! శత్రుసంతాపకా! ఇప్పుడు నా చిత్తం సుప్రసన్నం అయింది. నీయందు భక్తిపూర్ణం అయింది. నీకు శాపం ఇద్దాం అనే భావం అంతరించింది. జనార్దనా! అనల్పమయిన నీ అనుగ్రహానికి నేను కొంచెంగానయినా పాత్రుడ నయితే నీ విశ్వరూపాన్ని దర్శింపజేయవలసినది. దాన్ని నేను చూడగోరుతున్నాను.' ధీమంతుడయిన శ్రీకృష్ణుడు ఉత్తంకుని ప్రార్థనకు ప్రీతుడయి పూర్వం అర్జునుడు చూచిన, శాశ్వత, వైష్ణవ విశ్వరూపాన్ని దర్శింపజేశాడు. ఉత్తంకుడు ఆ విశ్వరూపాన్ని దర్శించాడు. దాని స్వరూపం మహత్తరం. వేలకొలది సూర్యులవలె ప్రకాశిస్తున్నది. ఉజ్జ్వలమయిన సూర్యునిలాగా ఉంది. అన్నివైపులా ఆ ముఖాలు ఉన్నాయి. అది సమస్తాకాశాన్ని ఆవరించి ఉంది. అద్భుతమూ, ఉత్కృష్టమూ

అయిన విష్ణుదేవుని ఆ రూపాన్ని చూసి, ఉత్తంకుడు పరమాశ్చర్యం పొందాడు.

ఉత్తంకుడు అన్నాడు - సర్వాత్మా! నారాయణా! పరాత్పరా! పరమాత్మా, పద్మనాభా!, పుండరీకాక్షా! మాధవా! నీకు నమస్కారం. హిరణ్యగర్భరూపుడవు, సంసారసాగరాన్నుంచి ఉద్ధరించేవాడివి. పురాణ పురుషుడివి. అంతర్యామి వయిన నీకు నమస్కారం. అజ్ఞానం అనే చీకటికి సూర్యుడివి, సంసారమనే వ్యాధికి మహౌషధానివి. సంసారసముద్రానికి ఆవలిఒడ్డు వయిన నీకు నమస్కారం. నాకు గతికావలసింది. సర్వవేదాలచేత తెలుసుకోదగిన తత్త్వరూపుడివి సర్వదేవమయుడివి, నిత్యుడివి, భక్తప్రియుడి వయిన వాసుదేవునికి నమస్కారం. జనార్దనా! నీవు దయతలచి నన్ను శోకమోహాలనుంచి ఉద్ధరించు. అనేక పాపకర్మబద్ధుడి నయిన నన్ను రక్షించు.

విశ్వకర్మా! నీకు నమస్కారం. సమస్త విశ్వోత్పత్తికి స్థానమయిన విశ్వాత్మా! నీ పాదాలు భూమిని వ్యాపించాయి. శిరస్సు ఆకాశాన్ని ఆవరించింది. అచ్యుతా! నీ జఠరం భూమ్యాకాశాల మధ్య భాగాన్ని ఆవరించింది. నీభుజాలు దిక్కులను చుట్టివేశాయి. ఈ సమస్తం నీవే అయి ఉన్నావు. దేవా! ఉత్తమమూ, అవినాశి అయిన నీ ఈ దివ్యరూపాన్ని ఉపసంహరించు. శాశ్వతుడ వయిన నిన్ను మళ్ళీ నీ పూర్వరూపంలో చూడగోరుతున్నాను.' వైశంపాయనుడు చెప్పాడు - 'జనమేజయా ! ప్రసన్నచిత్తుడయిన గోవిందుడు వరం కోరుకోమన్నాడు. అప్పుడు ఉత్తంకు డిలా అన్నాడు. "మహాతేజా! పురుషోత్తమా! కృష్ణా! నీ ఈ దివ్యరూపాన్ని దర్శించాను. ఈ వరం ఈనాటికి చాలు." శ్రీకృష్ణుడు మళ్ళీ ఆయనతో ఇలా అన్నాడు. "మహర్షీ! ఈ విషయంలో వేరుగా ఆలోచించవద్దు. నా దర్శనం అమోఘం. కాబట్టి కావలసిన వరం అడగటం నీ కర్తవ్యం." ఉత్తంకుడు అన్నాడు - దేవా! నేను తప్పక ఈ కర్తవ్యం చేయవలసి ఉంటే దుర్భరమయిన ఈ మరుభూములలో ప్రాణులకు ఇష్టమయిన జలం కలగటం నాకు కావలసిన వరం.' తరువాత పరమాత్మ ఆ దివ్యతేజోవంతమయిన విశ్వరూపం ఉపసంహరించి 'మహర్షీ! నీకు జలం కావలసినప్పుడు నన్ను స్మరించవలసింది.' అని చెప్పి ద్వారకానగరానికి వెళ్ళాడు. తరువాత ఒకసారి ఉత్తంకుడు మరుభూమిలో తిరుగుతున్నప్పుడు దప్పిక కలిగి శ్రీకృష్ణుని స్మరించాడు. అంతట మేధావి అయిన మహర్షి బురద కొట్టుకొన్న ఒక చండాలుని దర్శించాడు. కుక్కల సమూహం ఆతనిచుట్టూ ఉంది. దిగంబరుడు. శరీరం అంతా మలినంగా ఉంది. భయంకరుడు. నడుముకు ఖడ్గాన్ని కట్టుకొని ఉన్నాడు. ధనుర్బాణాలు ధరించాడు. ఆయన క్రింద పాదాల దగ్గర ఒక రంధ్రం నుంచి సమృద్ధిగా జలధార పడుతున్నది. అది ఉత్తంకుడు చూచాడు. మునిని గుర్తించినంతనే ఆయన పెద్దగా నవ్వుతూ "ఉత్తంకా! నా వద్దకు రా. నేను ఇచ్చే ఈ జలం గ్రహించు. దప్పికగొన్న నిన్ను చూచిన నాకు దయ

కలిగింది." చండాలుడు ఇలా చెప్పగా ఆయన ఆ జలాన్ని అభినందించలేదు. ఆ జలం తీసుకోటానికి నిరాకరించాడు. అప్పుడు ధీమంతుడయిన ఉత్తంకుడు కఠోర వచనాలతో శ్రీకృష్ణుని ఆక్షేపించాడు. చండాలుడు ఆ జలం త్రాగమని పలుమారులు చెప్పాడు. ఉత్తంకుడు ఆ జలం త్రాగలేదు. ఆయన మిక్కిలి కుపితుడయ్యాడు. ఆయన అంతఃకరణం క్షోభచెందింది. తన నిశ్చయం మీద దృఢంగా నిలిచిన ఆయన చండాలునికి సమాధానం చెప్పాడు. మహారాజా! ముని నిరాకరించగా కుక్కలతో కూడా ఆ చండాలుడు అక్కడనే అంతర్ధానం చెందాడు. అది చూచి ఉత్తంకుడు మనస్సులో చాలా సిగ్గు పడ్డాడు. 'శత్రునాశకుడయిన శ్రీకృష్ణుడు నన్ను మోసగించాడు' అని అనుకొన్నాడు.

అప్పుడు శంఖచక్రగదాధరుడయిన శ్రీకృష్ణ భగవానుడు ఆ మార్గంలోనే వ్యక్తమయ్యాడు. ఆయనను చూసి, మహామతి ఉత్తంకుడు, 'పురుషోత్తమా! ఉత్తమ బ్రాహ్మణునికి చండాలుడు స్పృశించిన అపవిత్ర జలం ఇవ్వటం నీకు సముచితం గాదు.' అన్నాడు. ఈ రీతిగా మాట్లాడిన ఆ మునితో మహాబుద్ధి అయిన శ్రీకృష్ణుడు మృదుమధురవచనాలతో నచ్చచెపుతూ ఇలా అన్నాడు. 'మహర్షీ! ఎలాంటి రూపంధరించి అక్కడ ఆ జలం నీకు ఈయవచ్చునో ఆ రూపంతో ఇచ్చాను. కాని నీవు దాన్ని తెలుసుకోలేక పోయావు. నేను నీకోసమని వజ్రాయుధుడయిన ఇంద్రుని ఉత్తంకునికి అమృతం జలరూపంగా ఇమ్మని చెప్పాను. నా మాటలు విన్న దేవేంద్రుడు 'దేవా! ఈ విధంగా చేస్తే మర్త్యుడు అమృతం త్రాగి అమర్త్య డవుతాడు. కాబట్టి ఈయనకు ఇంకొక వరం ఇవ్వు' అని పలుమారులు చెప్పాడు. కాని నేను ఈ మునికి అమృతాన్నే ఇవ్వాలి అని గట్టిగా చెప్పాను. అప్పుడు దేవేంద్రుడు నన్ను ప్రసన్నుని చేసుకొని మళ్ళీ ఈవిధంగా అన్నాడు. 'మహామతీ! ఉత్తంకునికి తప్పకుండా ఇవ్వవలసివస్తే నేను చండాల రూపం ధరించి మహాత్ముడయిన భార్గవ వంశీయునకు అమృతం ఇస్తాను. ఉత్తంకుడు దీన్ని గ్రహించేటట్టయితే ఆయనకు అమృతం ఇవ్వటానికి ఇదిగో వెళ్ళుతున్నాను. ఆయన తీసుకోవటానికి అంగీకరించకపోతే ఏ రీతిగాను అమృతం ఇవ్వను.' ఆ విధంగా ఇంద్రుడు షరతుపెట్టి ఆ రూపంతో నీ వద్దకు వచ్చాడు. ఆయన అమృతం ఇస్తుంటే నీవు అది తీసుకోవటానికి నిరాకరించావు. నీవు చండాలరూపి అయిన ఇంద్రుని వరాన్ని నిరాకరించావు. ఇది నీవు చేసిన పెద్ద తప్పు. కాని నీ కోరిక తీర్చటానికి నేను చేయబోయేది చెపుతాను విను. "బ్రాహ్మణా! తీవ్రమయిన నీ జలకాంక్షను తప్పక సఫలం చేస్తాను. నీకు జలపానేచ్ఛ కలిగే రోజుల్లో మరుప్రదేశంలో జలంతో

నిండిన మేఘాలు ఏర్పడుతాయి. భృగునందనా! ఆ మేఘాలు చాలా రసవంతమయిన జలం ఇస్తాయి. అందువల్ల ఆ మేఘాలు ఉత్తంకమేఘాలు అనే పేరుతో ప్రఖ్యాతాలవుతాయి.' అని శ్రీకృష్ణుడు చెప్పగా ఆ బ్రాహ్మణుడు సంతోషించాడు. భరతవంశీయా! ఈనాటికీ ఎడారి భూముల్లో ఉత్తంకాలు అనే మేఘాలు వర్షిస్తాయి.'

56. ఉత్తంకోపాఖ్యానము - 4.

జనమేజయుడు అడిగాడు - 'వైశంపాయన మహర్షీ! మహాత్ముడయిన ఉత్తంకముని ఉత్పత్తికారణమయిన విష్ణుదేవునికి శాపం ఇవ్వదలచాడు కదా! అలాంటి గొప్ప తపస్సు ఆయన ఏం చేశాడు ?' వైశంపాయనుడు చెప్పాడు - 'జనమేజయా! ఉత్తంకుడు మహాతపస్వి, గురుభక్తుడు, తేజస్వి. ఆయన జీవితంలో గురువును తప్ప మరొక దేవతను పూజించలేదు. భారతా! ఆ కాలంలో గురుకులంలో ఉన్న ఉత్తంకునికి వలె తమకు గురుభక్తి కలగాలని కోరుకొనేవారు. జనమేజయా! గౌతమ శిష్యులు అనేకులకు ఉత్తంకుని మీద చాలా ప్రేమ, స్నేహం అప్పుడు కలిగింది. ఉత్తంకుని మనోనిగ్రహానికి, పవిత్రతకు, ఉత్తమక్రియలకు, చక్కని గురుసేవకు గురువు గౌతముడు సంతోషించాడు. తరువాత కొంతకాలానికి గౌతమమహర్షి వేలకొలది తన శిష్యులకు విద్యాబోధ చేసి వారిని ఇండ్లకు పంపించాడు. మిక్కిలి ప్రేమ ఉండటం వల్ల ఉత్తంకుని ఇంటికి పంపటానికి ఇష్టపడలేదు. వత్సా! జనమేజయా! క్రమంగా ఆ ఉత్తంక మహామునికి ముసలితనం కలిగింది. గురుభక్తుడయిన ఆ ముని ఆ విషయాన్ని తెలుసుకోలేకపోయాడు. రాజేంద్రా! ఒకసారి ఆయన కట్టెలను తీసుకురావటానికి అడవికి వెళ్ళాడు. ఉత్తంకుడు పెద్దకట్టెలమోపు నెత్తిన పెట్టుకొని తీసుకొనివచ్చాడు. రాజా! అలసిపోయి, ఆకలిగొన్న ఆయన పెద్దకట్టెలమోపు బరువు మోయలేక పోయాడు. దాన్ని క్రిందపడవేశాడు. ఆ కట్టెలమోపులో వెండిలాగా మెరుస్తున్న ఆయన ఒక జడ ఇరుక్కొన్నది. అప్పుడు ఆ జడ ఆ కట్టెలతో గూడా నేలమీద పడ్డది. భారతా! ఆ పెద్దబరువు వల్ల ఆయన ఆకలిదప్పుల వల్ల బాగా వికలుడయ్యాడు. తన వృద్ధావస్థను చూసి, ఆయన ఆర్తస్వరంతో ఏడ్చాడు. అప్పుడు ధర్మజ్ఞ, పద్మవదన, విశాలలోచన అయిన గురుపుత్రిక తండ్రి ఆజ్ఞ ననుసరించి, తలవంచి, ఉత్తంకుని కన్నీటిని చేతితో పట్టింది. ఆ కన్నీటి బిందువులతో ఆమె అరచేతులు కాలాయి. అందువల్ల ఆమె చేతిలోనుంచి క్రిందపడిన ఉత్తంకుని కన్నీటి బిందువులను భూమి ధరింపలేకపోయింది.

అప్పుడు గౌతముడు ప్రసన్నచిత్తుడయి ఉత్తంకుని ఇలా అడిగాడు. 'వత్సా! ఇవ్వాళ నీ మనసు శోకంతో ఎందుకు వ్యాకులం అవుతున్నది? విప్రర్షీ ! ఆ విషయం వివరంగా నిస్సంకోచంగా చెప్పు. నాకు వినాలని ఉంది.' ఉత్తంకుడు చెప్పాడు - 'గురుదేవా! నా మనస్సు నిరంతరం మీయందే లగ్నమయింది. మీకు ప్రీతిని కలిగించదలచే నేను మీ భక్తి తత్పురుడ నయ్యాను. మీ యందే ఆసక్తి ఉంది. అందువల్ల నేను లౌకిక సుఖాలను తెలుసుకోలేక పోయాను. మీద పడ్డ ఈ ముసలితనం కూడా తెలియలేదు. మీ వద్ద నూరు సంవత్సరాలు ఉన్నాను. ఇంతవరకు ఇంటికి వెళ్ళటానికి అనుమతి లభించలేదు. ద్విజశ్రేష్ఠా! నా తరువాత మీ వద్దకు వచ్చిన వందల వేలకొలది శిష్యులు తమ విద్యను పూర్తిచేసుకొని తమ ఇండ్లకు వెళ్ళారు. నేను మాత్రం ఇలాగే మీ వద్ద ఉన్నాను.' గౌతముడు అన్నాడు - 'ద్విజశ్రేష్ఠా! నీవు చేసిన గురుశుశ్రూషవల్ల నీ మీద నాకు చాలా ప్రేమ కలిగింది. అందువల్ల ఇంతకాలం గడిచింది. ఈ విషయం నా దృష్టిలోకి కూడా రాలేదు. భృగువంశీయా! నీకు ఇక్కడినుంచి వెళ్ళవలెనని ఉంటే ఆలస్యం చేయకుండా నా అనుమతి తీసుకొని మీ ఇంటికి వెళ్ళు.' ఉత్తంకుడు అడిగాడు - 'గురుదేవా! మీకు గురుదక్షిణ ఏమి ఇవ్వాలో చెప్పండి. ఆ గురుదక్షిణను మీకు సమర్పించి మీ అనుజ్ఞ తీసుకొని వెళ్తాను.' గౌతముడు అన్నాడు - 'గురువులను సంతోషింపజేయుటమే గురుదక్షిణ అని సజ్జనులు చెపుతారు. బ్రాహ్మణా! నీవు చేసిన గురుసేవకు నేను సంతుష్టుడిని అయ్యాను. ఇందులో సందేహం లేదు. భృగువంశశ్రేష్ఠా! ఈ రీతిగా నేను పరిపూర్ణంగా సంతుష్టిడి నయ్యానని తెలుసుకో! ఇవ్వాళ నీవు పదహారేళ్ళ యువకుడివి అయితే నా పుత్రిక అయిన ఈ కన్యను నీకు ఇచ్చి వివాహం చేస్తాను. ఈమె తప్ప ఇంకొక స్త్రీ నీ తేజస్సును తట్టుకోలేదు.' ఉత్తంకుడు ఆ తరువాత తపోబలంతో యువకుడయి యశస్విని అయిన ఆమెను భార్యగా గ్రహించాడు. గురువుగారి ఆజ్ఞను స్వీకరించి, ఆయన గురుపత్నితో ఇలా అన్నాడు. 'అమ్మా! గురుదక్షిణగా నేను ఏమి ఇవ్వాలో ఆజ్ఞాపించండి. నా ధనాన్ని ప్రాణాలనయినా సమర్పించి మీకు సంతోషాన్ని ప్రీతిని కలిగించగోరుతున్నాను. ఈ లోకంలో దుర్లభమూ, అత్యద్భుతమూ, మహత్తరమయిన రత్నాన్ని గూడా నా తపోబలంతో తీసుకురాగలను. ఇందులో సంశయం లేదు.'

అహల్య చెప్పింది - 'అనఘా! విప్రా! నీ గురుభక్తికి సంతుష్టను అయ్యాను. కుమారా! ఈ మాటయే చాలు. నీకు మేలు కలుగుతుంది. నీకు ఇష్టమయిన చోటికి వెళ్ళు.' ఉత్తంకుడు మళ్ళీ ఇలా అన్నాడు. 'అమ్మా! నీకు ఇష్టమయిన నా కర్తవ్యమేమిటో

ఆజ్ఞాపించు.' అహల్య చెప్పింది – 'సౌదాసుని భార్య ధరించే దివ్యమయిన మణికుండలాలను తీసుకురా! గురుకార్యం చక్కగా నెరవేరుతుంది. నీకు మేలు కలగాలి.' ఉత్తంకుడు **అలాగే తెస్తాను** అని ప్రతిజ్ఞ చేసి గురుపత్ని ప్రీతికోసం వాటిని తీసుకురావటానికి వెళ్ళాడు. ఉత్తంకుడు నరభక్షకుడయిన సౌదాసుని మణికుండలాలు యాచించటానికి అక్కడినుంచి త్వరగా వెళ్ళాడు. గౌతముడు "ఉత్తంకుడు ఇవ్వాళ కనపడటం లేదే. ఎక్కడికి వెళ్ళాడో?" అని భార్యను అడిగాడు. ఆమె **మణికుండలాలు తేవటానికి వెళ్ళాడు** అని చెప్పింది. ఆయన భార్యతో "నీవు చేసింది. మంచిపనికాదు. శాపగ్రస్తుడయిన ఆ రాజు బ్రాహ్మణుడయిన ఉత్తంకుని చంపివేస్తాడు." అని అన్నాడు. అహల్య అన్నది – 'మహాత్మా! ఈ విషయం నాకు తెలియక ఆ బ్రాహ్మణుని ఆ పనికి నియోగించాను. మీ అనుగ్రహం వల్ల ఆతనికి ఎలాంటి ఆపద స్వల్పంగా కూడా కలగరాదు.' అది విని పత్నితో గౌతముడు **అలాగే జరుగుగాక** అన్నాడు. ఉత్తంకుడు నిర్జనవనంలో రాజును దర్శింపవెళ్ళాడు.

57. ఉత్తంకోపాఖ్యానము - 5.

పాడవైన గడ్డం మీసాలతో, మానవరక్తంతో తడిసి, భయంకరంగా కన్పిస్తున్న సౌదాస రాజును ఉత్తంకుడు చూచాడు. వికృతరూపం చూసికూడా బ్రాహ్మణుడు ఏమాత్రం గాబరా పడలేదు. యమధర్మరాజు వంటి ఆ రాజు లేచి, ఎదురువెళ్ళి, ఆయనతో ఇలా అన్నాడు. 'ద్విజశ్రేష్ఠా! పగటి ఆరవ కాలంలో ఆహారం వెతుక్కుంటున్న నా వద్దకు నీవు స్వయంగా రావటం నా అదృష్టం.' ఉత్తంకుడన్నాడు – 'రాజా! నేను గురుదక్షిణకోసం సంచరిస్తూ ఇక్కడికి వచ్చానని తెలుసుకో. గురుదక్షిణకోసం ప్రయత్నిస్తున్న వానిని హింసించదగదని విద్వాంసులు చెప్పారు.' రాజు అన్నాడు – 'ద్విజశ్రేష్ఠా! పగలు ఆరవభాగంలో నాకు ఆహారం తీసుకోవాలి అని నిర్ణయం ఉంది. ఆకలిగొన్న నేను నిన్ను వదలటం అశక్యం.' ఉత్తంకుడన్నాడు – 'మహారాజా! అలాగే అగుగాక. ఒక షరతు పెడుతున్నాను. మాగురువు గారికి దక్షిణనివ్వటం అనే పని అయిన తరువాత మళ్ళీ వచ్చి నీకు వశమవుతాను. రాజశ్రేష్ఠా! మా గురువుగారికి ఇస్తానని ప్రతిజ్ఞ చేసిన వస్తువు నీ అధీనంలో ఉంది. రాజేంద్రా! దానికోసం నిన్ను యాచిస్తున్నాను. నీవు ప్రతినిత్యం బ్రాహ్మణశ్రేష్ఠులకు రత్నాలను ఇస్తుంటావు. ఈ భూమండలంలో నీవు దాతగా ప్రసిద్ధుడవు. రాజోత్తమా ! దానం తీసుకోవటానికి నేను అర్హుడనని తెలుసుకో. రాజేంద్రా! నీ అధీనంలో ఉన్న గురుదక్షిణను

గురువులకు సమర్పించి, నీకు మాట ఇచ్చినవిధంగా మళ్ళీ వస్తాను, నీకు వశం అవుతాను. యథార్థంగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఇది ఏమాత్రం అబద్ధం కాదు. ఇంతకుముందు ఎప్పుడూ పరిహాసానికి కూడా అబద్ధం చెప్పలేదు. ఇతర విషయాలలో ఇంక చెప్పవలసింది ఏముంది?' సౌదాసుడు అన్నాడు - 'నీ గురుదక్షిణ అయిన వస్తువు నా అధీనంలో ఉంటే అది నీకు లభించినట్లే అనుకో ! ఏదైనా వస్తువు నావద్దనుంచి తీసుకోవటం తగుననుకొంటే అదేదో ఇప్పుడు చెప్పు.' ఉత్తంకుడు చెప్పాడు - 'పురుషశ్రేష్ఠా! నీవు చేసే దానం ఎప్పుడయినా స్వీకరించటం తగుననే నా ఉద్దేశ్యం. అలాంటి నేను నిన్ను మణికుండలాలు యాచించవచ్చును.' సౌదాసుడు అన్నాడు - 'విప్రర్షీ ! ఆ మణికుండలాలు నా భార్యకే తగినవి. కాబట్టి అవికాక ఇంకొక వస్తువును కోరుకో. సువ్రతా! దాన్ని నీకు ఇస్తాను.' ఉత్తంకుడన్నాడు - 'ఈ నెపం పెట్టటం వ్యర్థం. నీకు నామీద విశ్వాసం ఉంటే నాకు మణికుండలాలు ఇయ్యి. రాజా! సత్య వచనుడివి కావలసింది.'

ఆ రాజు ఉత్తంకునితో మళ్ళీ ఇలా అన్నాడు. 'మహాత్మా! ఆ మణి కుండలాలు నీకు ఇమ్మని నేను చెప్పానని చెప్పు. ద్విజశ్రేష్ఠా! రాణి ఉత్తమ వ్రతాన్ని పాటించేది. ఇలా నీవు చెపితే నామాట ప్రకారం ఆమె నీకు కుండలాలు ఇస్తుంది. సందేహం లేదు.' ఉత్తంకుడన్నాడు - 'నరాధిపా! నీ భార్యను నేను ఎక్కడ చూడ వీలవుతుంది? నీవు నీ భార్య వద్దకు స్వయంగా ఎందుకు వెళ్ళవు ?' సౌదాసుడన్నాడు - 'అడవిలోని ఒక సెలయేటి దగ్గర నీవు ఆమెను చూడవచ్చు. ఇవ్వాళ పగలు ఆరవభాగంలో నేను ఆమెను చూడవీలుగాదు.' అలా రాజు చెప్పగా ఉత్తంకుడు అక్కడినుంచి మదయంతి వద్దకు వెళ్ళి, తనరాకకు కారణం ఆమెకు తెలియజెప్పాడు. ఆ రాణి సౌదాసుని మాటలు విని, మహామేధావి అయిన ఉత్తంకునితో ఇలా అన్నది. 'అనఘా! నీవు చెప్పింది సరే. నీవు అబద్ధం చెప్పవు. ఈ విషయంలో ఏదయినా ఒక గుర్తు రాజుగారి దగ్గరనుంచి నీవు తీసుకురావాలి.

ఈ నా మణికుండలాలు దివ్యములయినవి. దేవతలు, యక్షులు, మహర్షులు అనేకమయిన ఉపాయాలతో అపహరింపదలచి "ఏలోపాలు జరుగుతాయా" అని ఆలోచిస్తుంటారు. ఈ కుండలాలను నేలమీద పెడితే నాగులు అపహరిస్తారు. అపవిత్రులయి వీటిని ధరిస్తే యక్షులు కాజేస్తారు. వీటిని ధరించి నిద్రిస్తే దేవతలు బలవంతంగా లాక్కుంటారు. ద్విజశ్రేష్ఠా! ఇలాంటి లోపాలు ఉన్నప్పుడు అపహరిస్తారు. కాబట్టి దేవతలు, యక్షులు, రాక్షసులు, నాగుల విషయంలో తగుజాగరూకతతో మెలగాలి. ద్విజశ్రేష్ఠా! ఇవి

పగలు, రాత్రి ఈ బంగారం కురిపిస్తాయి. రాత్రిపూట నక్షత్రాల, తారల కాంతిని అపహరిస్తాయి. మహాత్మా! వీటిని ధరిస్తే ఆకలి దప్పుల భయం ఎక్కడిది? విషంవల్ల, అగ్నివల్ల, క్రూరమృగాలవల్ల ఎప్పుడూ భయం ఏమాత్రం ఉండదు. ఎత్తు తక్కువవారు వీటిని ధరిస్తే కురుచ అవుతాయి. తగినంత బాగా ఎత్తు ఉన్నవారు ధరిస్తే వారి ఎత్తుకు తగిన ఆకారంలో ఉంటాయి. పరమపూజ్యాలయిన ఈ నా కుండలాలు ఇలాంటి మహత్తు కలవి. వీటి గొప్పతనం ముల్లోకాల్లో వారికి తెలుసు. కాబట్టి రాజుగారి దగ్గరినుంచి తగిన గుర్తు తీసుకురా.'

58. ఉత్తంకోపాఖ్యానము - 6.

ఉత్తంకుడు సౌదాసునివద్దకు వెళ్ళి గుర్తును అడిగాడు. ఆ ఇక్ష్వాకువంశ శ్రేష్ఠుడు ఆయనకు అభిజ్ఞానం ఇచ్చాడు. సౌదాసుడు అన్నాడు - పత్నీ! ఇప్పుడు నాకు పట్టిన గతి క్షేమకరం కాదు. ఇప్పుడు ఇంతకంటే వేరుగతి లేదు. ఈనా ఉద్దేశ్యం తెలుసుకొని, ఈ బ్రాహ్మణునికి మణికుండలాలు ఇయ్యి.' ఉత్తంకుడు మదయంతి వద్దకు వెళ్ళి ఆమె భర్త సౌదాసుడు చెప్పింది చెప్పాడు. ఆ మాటలు విని ఆమె ఆ మణికుండలాలు ఆయనకు ఇచ్చింది. మదయంతి నుండి ఆ మణికుండలాలు తీసుకొన్న ఉత్తంకుడు సౌదాసుని వద్దకు వెళ్ళి 'రాజా! నీ గూఢవచనాల అభిప్రాయం ఏమిటి ? దాన్ని విన గోరుతున్నాను.' అన్నాడు. సౌదాసుడు అన్నాడు - 'బ్రాహ్మణా! సృష్టి ప్రారంభం నాటి నుంచి క్షత్రియులు విప్రులను పూజిస్తున్నారు. అయినా బ్రాహ్మణుల నుంచి క్షత్రియులకు అనేక దోషాలు కలుగుతున్నాయి. నేను బ్రాహ్మణులకు సర్వదా ప్రణతులు అర్పిస్తున్నాను. ఒక బ్రాహ్మణుని శాపం వల్ల నాకు ఈ దుర్గతి కలిగింది. నేను మదయంతితో పాటు ఇక్కడ ఉంటున్నాను. ఈ దుర్గతి నుంచి విముక్తి కలిగే ఉపాయం నాకు ఏదీ కన్పించటం లేదు. ద్విజా! ఇప్పుడు ఈ లోకంలో ఉండి సుఖపడటానికి పరలోకంలో స్వర్గభోగాలు అనుభవించటానికి నాకు ఇంకో గతి కన్పించటం లేదు. ఏ రాజయినా బ్రాహ్మణులతో విరోధించి, ఈ లోకంలో సుఖపడటంగాని, పరలోకంలో సుఖపడటం గాని శక్యంకాదు. ఇది నా సందేశాభిప్రాయం. ఇప్పుడు నీవు కోరిన మణికుండలాలు నీకు ఇచ్చాను. నీవు ఇచ్చిన మాటను ఇప్పుడు సఫలం చెయ్యి.' ఉత్తంకుడన్నాడు - 'రాజా! అలాగే చేస్తాను. మళ్ళీ వచ్చి నీకు వశం అవుతాను. శత్రుసంతాపకా! ఇప్పుడు ఒక ప్రశ్న అడగటానికి నీ వద్దకు తిరిగి వచ్చాను.' సౌదాసుడు అన్నాడు - 'విప్రా! నీ ఇష్టమయినట్లు అడుగు.

దానికి సమాధానం చెపుతాను. నీ సందేహం పోగొడ్తాను. ఈ విషయంలో నేను ఆలోచించవలసింది ఏమీ లేదు.'

ఉత్తంకుడన్నాడు - **'తన మాటను అదుపులో ఉంచుకొన్నవాడు - సత్యవాది అయినవాడు బ్రాహ్మణుడు అని ధర్మ నిపుణతగాంచిన పెద్దలు చెపుతారు. మిత్రుల విషయంలో విషమంగా ప్రవర్తించే వాడు దొంగ అని అంటారు. రాజా!** ఇప్పుడు నీవు నాకు మిత్రుడివి అయ్యావు. పురుషశ్రేష్ఠా! నాకు ఉత్తమమయిన సలహాను ఇయ్యి. నాకు కావలసిన గురుదక్షిణ లభించింది. నీవు నరభక్షకుడివి. అలాంటి నీ వద్దకు నేను తిరిగి రావటం తగునా? తగదా?' సౌదాసుడు అన్నాడు - 'ద్విజశ్రేష్ఠా! ఇప్పుడు సముచితమయిన మాట చెప్పాలంటే నీవు నావద్దకు మళ్ళీ ఏ పరిస్థితిలోను రావద్దు అనే చెపుతాను. ఇదే నీకు శ్రేయస్కరం అని నాకు అనిపిస్తున్నది. విప్రా! మళ్ళీ నా వద్దకు తిరిగి వస్తే నీకు మరణం కలగటం నిశ్చయం. వివేకవంతుడయిన సౌదాస మహారాజు తనకు హితకరమూ, సముచితమయినది చెప్పగా విని, ఉత్తంకుడు ఆయన అనుమతి తీసుకొని మదయంతి వద్దకు వెళ్ళాడు. గురుపత్నికి ప్రియం చేయదలచిన ఆయన దివ్యకుండలాలు తీసుకొని గౌతముని ఆశ్రమానికి చాలావేగంగా వెళ్ళాడు. దమయంతి కుండలాల రక్షణకు చెప్పిన విధంగా వాటిని కృష్ణాజినంలో కట్టి తీసుకు వెళ్తున్నాడు. బాగా ఆకలిగొన్న బ్రహ్మర్షి పండ్ల బరువుతో వంగి ఉన్న, ఒకమారేడు చెట్టును చూచాడు. ఉత్తంకుడు ఆ చెట్టు ఎక్కుతూ ఆ కృష్ణ మృగచర్మాన్ని ఒక కొమ్మకు కట్టాడు. తరువాత ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు మారేడు పండ్లను కోసి క్రిందపడవేయ సాగాడు. మారేడు పండ్లమీదనే ఆయన దృష్టినిలపడటం వల్ల అవి ఎక్కడ పడుతున్నవో గమనించలేదు. అందువల్ల ఆ పండ్లు కొన్ని కృష్ణాజినంలో పడ్డాయి. దానిలోనే ఆయన కుండలాలను కట్టి ఉంచాడు. మారేడు పండ్ల దెబ్బలు తగలటం వల్ల ఆ జింక చర్మం ముడి ఊడిపోయింది. అది కుండలాలతో కూడా వెంటనే క్రింద పడింది. చెట్టుకు వేసిన ముడి ఊడిపోయి, కృష్ణాజినం నేలబడగా ఐరావత వంశంలో జన్మించిన తక్షకుడు ఆయన కుండలాలను చూశాడు. ఆతడు వాటిని నోటకరచుకొని, చాలా వేగంగా అక్కడ ఉన్న ఒక పుట్టలో ప్రవేశించాడు.

కుండలాలను సర్పరాజు అపహరించి పోతుండగా చూసి, పరమక్రుద్ధుడయిన ఉత్తంకుడు చెట్టుమీది నుంచి దూకి, దుఃఖపరవశుడయి ఒక కర్ర తీసుకొని, పుట్ట త్రవ్వసాగాడు. కోపం, అమర్షలతో సంతప్తుడయిన బ్రాహ్మణశ్రేష్ఠుడు దాదాపు ముప్పది

అయిదు దినములు ఎలాంటి గాబరా లేకుండా నిర్విరామంగా బిలం త్రవ్వసాగాడు. సహించ వీలుగాని ఆయన వేగాన్ని భూదేవి తట్టుకోలేకపోయింది. దండ కాష్ఠం పోట్లతో శరీరం గాయపడగా మిక్కిలి వ్యాకులత చెందింది. ఉత్తకుండు నాగలోకానికి త్రోవ ఏర్పరచాలనే నిశ్చయంతో భూమిని త్రవ్వుతున్న సమయంలో మహాతేజస్వి, వజ్రాయుధం చేతదాల్చిన ఇంద్రుడు గుర్రాలు పూన్చిన రథం ఎక్కి, ఉత్తంకుడు ఉన్న చోటికి వచ్చాడు. ఉత్తంకుని కష్టంచూసి, బాధపడుతూ ఇంద్రుడు బ్రాహ్మణ వేషం ధరించి, ఆయనవద్దకు వచ్చాడు. ఆయన చేసేది అశక్యమని తలంచాడు. ఉత్తంకా! ఇక్కడినుంచి నాగలోకం వేల యోజనాల దూరంలో ఉంది. అక్కడికి దారి ఏర్పరచటం అనే పని కర్రతో త్రవ్వటం వల్ల సాధ్యం కాదని నేను అనుకొంటాను.' ఉత్తంకుడు అన్నాడు - 'ద్విజశ్రేష్ఠా! నాగలోకానికి వెళ్ళటం, ఆ కుండలాలను సంపాదించటం శక్యంకాకపోతే నీవు చూస్తుండగానే ప్రాణాలు వదలుతాను.'

ఉత్తంకుని దృఢనిశ్చయం నుంచి మరల్చటం అశక్యంకాగా ఇంద్రుడు ఆ విప్రుని దండంలో వజ్రాస్త్రాన్ని ప్రవేశపెట్టాడు. జనమేజయా! అప్పుడు వజ్రాయుధపుదెబ్బలతో భూమి చీలిపోతూ, నాగలోకానికి మార్గాన్ని ఏర్పరచింది. ఉత్తంకుడు ఆ త్రోవన నాగలోకంలో ప్రవేశించాడు. వేలకొలది యోజనాల వైశాల్యం గల నాగలోకాన్ని దర్శించాడు. మహాభాగా! దానికి నలువైపులా దివ్యమయిన ప్రాకారాలు ఉన్నాయి. అవి బంగారు ఇటుకలతో నిర్మితాలు. మణులతో ముత్యాలతో అలంకృతాలు. అందులోని దిగుడు బావులకు స్ఫటికమణుల మెట్లు ఉన్నాయి. అక్కడి నదులలో జలం నిర్మలంగా ఉంది. అనేకమయిన పక్షుల సమూహంతో ఉన్న వృక్షాలను ఆయన చూశాడు. నూరుయోజనాల పొడవు, అయిదు యోజనాల వెడల్పుగల ఆ లోక ముఖద్వారాన్ని భృగువంశశ్రేష్ఠుడు చూచాడు. ఉత్తంకుడు ఆ నాగలోకం చూసి, చాలా దీనుడయ్యాడు. కుండలాలను తీసుకురావటానికి వీలుకాదని నిరాశచెందాడు. ఆ సమయంలో ఆయన దగ్గరికి నల్లని, తెల్లని వెంట్రుకలు గల తోక ఉన్న ఒక గుర్రం వచ్చింది. దానిముఖం, కన్నులు, ఎర్రగా ఉన్నాయి. అది తేజస్సుతో ప్రజ్వలిస్తున్నట్లుంది. అది ఆయనతో ఇలా అన్నది. 'విప్రా! నా అపాన మార్గంలో ఊదు. అందువల్ల ఐరావత పుత్రుడు తెచ్చిన నీ కుండలాలు నీకు లభిస్తాయి. పుత్రా! ఈ పని చేయటంలో నీవు ఏమాత్రం అసహ్యించుకోకు. గౌతముని ఆశ్రమంలో ఉన్నప్పుడు ఈ పని చాలాసార్లు చేశావు.' ఉత్తంకుడు అడిగాడు - గురువుగారి ఆశ్రమంలో మిమ్ములను

చూశాను అనే విషయం నాకు ఎలా తెలుస్తుంది ? అక్కడ ఉన్నప్పుడు పలుమారులు నేను చేసినదేమిటి? ఇదంతా వినదలచుకొన్నాను.'

అశ్వం అన్నది – 'విప్రా! మీ గురువుకు కూడా నేను గురువును అని తెలుసుకో. మీ గురువుగారికోసం నీవు నన్ను నిరంతరం పూజించావు. అది అంతా నీవు పరమ పవిత్రుడవయి యథావిధిగా చేశావు. కాబట్టి ఆలస్యం లేకుండా నేను చెప్పినట్లు చెయ్యి. నీకు మేలు కలిగిస్తాను. ఉత్తకుండు అగ్నిదేవుడు చెప్పినట్లు చేశాడు. ఘృతమయమయిన జ్వాలలు గల అగ్నిదేవుడు అందుకు సంతోషించి నాగలోకం దహింపదలచి ప్రజ్వరిల్లాడు. ఉత్తంకుడు ఊదటం మొదలుపెట్టగా ఆ గుర్రం రోమకూపాలనుంచి నాగలోకానికి భయకారకమయి దట్టమయిన పొగ ఏర్పడ్డది. తీవ్రంగా పెరిగిపోతున్న ఆ పొగచేత నాగలోకంలో ఏదిఎక్కడ ఉన్నదో ఏ మాత్రం తెలియలేదు. ఐరావతుని గృహంలో హాహాకారాలు వ్యాపించాయి. వాసుకిమొదలయిన నాగరాజుల గృహాలు అన్నింటా పొగనిండింది. ఆ రీతిగా పొగ కమ్మివేయటం వల్ల వారిగృహాలు అంధకారబంధురాలు అయ్యాయి. మంచు కప్పిన అడవులు, పర్వతాలలాగా కన్పించాయి. పొగవల్ల నాగుల కన్నులు ఎర్రబడ్డాయి. వారు అగ్నితాపంతో సంతప్తులయ్యారు. మహాత్ముడయిన భృగువంశీయుని ఉద్దేశ్యం తెలుసుకోవటానికి వారంతా కలిసివచ్చారు. మహర్షి నిశ్చయం విన్నవారందరి కన్నులు భయంతో సంచలించాయి. ఆయనను యథావిధిగా వారు పూజించారు. వృద్ధులనుంచి పిల్లల దాకా నాగులు అందరు దోసిలొగ్గి, శిరస్సులు వంచి, నమస్కరించి 'మహాత్మా! ప్రసన్నుడివి కావలసింది' అని ప్రార్థించారు. ఆ నాగులు అందరు ఆయనను ప్రసన్నుని చేసుకొని, అర్ఘ్య పాద్యాలను సమర్పించి, పరమపూజ్యాలయిన ఆ కుండలాలను సమర్పించారు. ఆ నాగులు పూజించిన తరువాత తేజోవంతుడయిన ఉత్తంకుడు అగ్ని దేవునికి ప్రదక్షిణం చేసి, గురువుగారి ఇంటికి వెళ్ళాడు. ఆయన త్వరగా గురువుల నివాసానికి వెళ్ళి గురుపత్నికి ఆ దివ్యకుండలాలను ఇచ్చాడు. వాసుకి ప్రముఖులయిన నాగరాజులు చేసినది అంతా గురువు గారికి ఉన్నదిఉన్నట్లు ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు విన్నవించాడు. మహాత్ముడయిన ఆ ఉత్తంకుడు ముల్లోకాల్లో సంచరించి ఆ దివ్యకుండలాలు తెచ్చాడు. భరతవంశశ్రేష్ఠా! ఉత్తంకుడు గొప్ప తపస్సు కలిగి ఇంతగొప్ప ప్రభావం కలిగినవాడు. నీవు అడిగినదానికి ఇదే సమాధానం.'

59. శ్రీకృష్ణుని ద్వారకా ప్రవేశము.

జనమేజయుడు అడిగాడు – 'ద్విజశ్రేష్ఠా! మహాబాహువు, మహాయశస్వి అయిన శ్రీకృష్ణుడు ఉత్తంకునికి వరం ఇచ్చిన తరువాత ఏంచేశాడు?' వైశంపాయనుడు చెప్పాడు – 'జనమేజయా! శ్రీకృష్ణుడు ఉత్తంకునికి వరం ఇచ్చి, సాత్యకితో గూడా చాలా వేగంగా పరుగెత్తే గుర్రాలు గల రథం మీద ద్వారకానగరానికి వెళ్ళారు. ఆయన దారిలో సరస్సులను, నదులను, అడవులను, పర్వతాలను దాటి, రమ్యమయిన ద్వారకానగరాన్ని సమీపించాడు. రైవతక పర్వతం మీద గొప్ప ఉత్సవం జరుగుతుండగా శ్రీకృష్ణుడు సాత్యకితో కూడా వెళ్ళాడు. పురుషశ్రేష్ఠా! ఆ పర్వతం నానా రూపమయిన, విచిత్ర రత్నమయమయిన శంఖాలతో అలంకృతమయి విలసిల్లింది. అందమయిన బంగరు మాలికలతో, పూలమాలికలతో, వస్త్రాలతో, కల్పవృక్షాలతో ఆవృతమయి ఉన్న ఆ మహాశైలం అపూర్వశోభతో విరాజిల్లింది. వృక్షాకారంతో అలంకృతమయిన సువర్ణదీపాలు ఆస్థానశోభను ఉద్దీప్తంచేస్తున్నాయి. ఆ పర్వతం మీద ఉన్న గుహలు, సెలఏళ్ళు ఉన్నచోట్ల పగటిపూట వలె ఉంది. నాలుగువైపులా విచిత్రమయిన జెండాలు ఎగురుతున్నాయి. వాటికి కట్టిన చిరుగంటలు మ్రోగుతున్నాయి. స్త్రీ పురుషుల కంఠస్వరాలు అక్కడ మధురంగా విన్పిస్తున్నాయి. ఇందువల్ల ఆ పర్వతం సంగీతమయం అనిపిస్తుంది. భారతా! ముని గణాలతో మేరుపర్వతం శోభిల్లినట్లు ద్వారకావాసులు అందరితో ఆ పర్వతం మిక్కిలి దర్శనీయంగా ఉంది. ఆ పర్వతశిఖరంమీద హర్షోన్మత్తులయిన స్త్రీ పురుషుల సుమధుర శబ్దాలు స్వర్గలోకం వరకు వ్యాపిస్తున్నట్లుంది. కొందరు ఆటలు మొదలయిన వాటిలో ఆసక్తులయి ఇతర కార్యాలమీద దృష్టి ఉంచటం లేదు. అనేకులు ఆనందమత్తు లయ్యారు. కొందరు ఎగురుతూ దూకుతున్నారు. ఉచ్చైఃస్వరంతో కోలాహలం చేస్తున్నారు. కిలకిలారావాలు చేస్తున్నారు. ఈ ధ్వనులతో ఆ పర్వతం ప్రతిధ్వనిస్తూ మనోహరంగా ఉంది.

ఆ పర్వతం మీద జరుగుతున్న ఆ మహోత్సవం పరమశోభాకరంగా ఉంది. అక్కడ దుకాణాలు, బజారులు వెలిశాయి. భక్ష్యభోజ్యపదార్థాలు కావలసిన వన్నీ లభిస్తున్నాయి. అన్నివైపులా సంచరించటానికి వీలుగా ఉంది. వస్త్రాలు, పూలమాలికలు గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. వీణలను, వేణువులను, మృదంగాలను మ్రోగిస్తున్నారు. వీటి అన్నిటివలన అచటి శోభ ఇనుమడిస్తున్నది. అక్కడ దీనులకు, అంధులకు, అనాథులకు నిరంతరం సురామైరేయాలతో కలిసిన భక్ష్యభోజ్య పదార్థాలను పెడుతున్నారు. మహావీరా! ఆ పర్వతం మీద పుణ్యకార్యాలు చేయటానికి అనేక గృహాలను, ఆశ్రమాలను నిర్మించారు. వాటిల్లో

పుణ్యాత్ములు ఉంటారు. ఆ సమయంలో రైవతక పర్వతం వృష్ణివంశ వీరుల విహారస్థలం అయింది. ఆ పర్వతం అసంఖ్య గృహాలతో గూడి దేవలోకంలాగా విరాజిల్లింది.

భరతశ్రేష్ఠా! ఆ సమయంలో దేవతలు, గంధర్వులు, మహర్షులు అంతర్హితులయి శ్రీకృష్ణుని వద్దకు వచ్చి, ఆయనను స్తుతించసాగారు. గంధర్వులు అన్నారు – సర్వధర్మాలను సాధించేవాడు. రాక్షసులను సంహరించేవాడు, దేవా! నీవే, సృష్టి చేసేది, సృజించే జగత్తు, దానికి కారణం నీవే. ఆధారం నీవే, సర్వధర్మాలు, వేదం తెలిసినవాడవు నీవే. మాయతో నీవు చేసేది మాకు ఏమీ తెలియదు. సర్వకారణం నీవని శరణమని, పరమేశ్వరుడవని మాత్రం మాకు తెలుసు. బ్రహ్మాదులకు సామీప్యాన్ని, శరణు ఇచ్చేది నీవే. నీకు నమస్కారం.' వైశంపాయనుడు చెప్పాడు – ఈ రీతిగా మానవేతరులు స్తుతించి శ్రీకృష్ణుని పూజించగా ఆ పర్వతం స్వర్గసమానమయింది.

ఈ రీతిగా వారి అందరిచేత పూజింపబడుతూ ఆయన శుభకరమయిన తన భవనాన్ని ప్రవేశించాడు. సాత్యకి తన భవనానికి వెళ్ళాడు. మహేంద్రుడు రాక్షసులమీద పరాక్రమం చూపివచ్చినట్లు దుష్కరకార్యం చేసి, శ్రీకృష్ణుడు చాలా కాలం ప్రవాస కారణంగా ప్రసన్నచిత్తుడయి స్వభవనంలో ప్రవేశించాడు. అలా తిరిగి. ద్వారకానగరానికి వస్తున్న మహాత్ముడయిన శ్రీకృష్ణుని దేవతలు ఇంద్రుని ఎదుర్కొన్నట్లు భోజులు, అంధకులు, వృష్ణులు ఎదుర్కొన్నారు. మేధావి అయిన శ్రీకృష్ణుడు వారిని తగురీతిగా గౌరవించి క్షేమాదికం అడిగాడు. సంతోషంతో దేవకీ వసుదేవులకు నమస్కరించాడు. ఆ తల్లిదండ్రులు ఆయనను ప్రేమగా కౌగిలించుకొన్నారు. తీయని మాటలతో ఆయనకు సాంత్వనం కల్పించారు. మహాభోజుడయిన శ్రీకృష్ణుని వృష్ణివంశీయులందరూ చుట్టూ చాలా దగ్గరగా కూర్చున్నారు. మహాతేజస్వి అయిన ఆయన పాదప్రక్షాళనానంతరం విశ్రాంతి తీసుకొన్నాడు. తరువాత తండ్రి వసుదేవుడు మహా యుద్ధాన్ని గురించి ఇలా అడిగాడు.

60. వసుదేవునికి శ్రీకృష్ణుడు మహాభారతయుద్ధమును సంక్షేపముగా చెప్పుట.

'వృష్ణినందనా! నేను ప్రతిదినం మాటల సందర్భంలో కొందరు చెప్పగా పరమాద్భుతమయిన మహాభారత సంగ్రామాన్ని గురించి విన్నాను. కౌరవపాండవుల యుద్ధం ఎలా జరిగిందో చెప్పు. మహాబాహూ! ఆ యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూచినవాడవు, దాని స్వరూపం బాగా తెలిసినవాడవు నీవు. కాబట్టి ఆ సంగ్రామ వృత్తాంతాన్ని యథాతథంగా చెప్పవలసింది. మహాత్ములయిన పాండవులకు భీష్మ, కర్ణకృప ద్రోణశల్యాదులతో ఆ మహాయుద్ధం ఏ రీతిగా జరిగింది ? అస్త్రశస్త్ర నిపుణులు, నానావేషాలు, నానా ఆకారాలు

గలవారు, నానా దేశాలలో నివసించే ఇతర క్షత్రియ వీరులు ఎలా యుద్ధం చేశారు ?' తల్లిదేవకీ దేవి ఎదుట తండ్రి వసుదేవుడు ఇలా అడగగా యుద్ధంలో కౌరవవీరులు మరణించిన వృత్తాంతం శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు. - 'తండ్రీ! మహాత్ములయిన వారి అత్యద్భుత వీర కృత్యాలు అసంఖ్యాకం. కాబట్టి వాటిని వివరంగా చెప్పటం అనేక సంవత్సరాలయినా పూర్తికాదు. ఆ రాజుల వీరకృత్యాలను ప్రాధాన్యాన్ని బట్టి సంగ్రహంగా చెపుతాను విను.

దేవతలకు ఇంద్రునివలె భీష్ముడు పదకొండు అక్షౌహిణులు గల కౌరవులకు సేనాపతి అయ్యాడు. శోభావంతు డయిన అర్జునుడు రక్షకుడుగా ఉండగా పాండవుల ఏడు అక్షౌహిణుల సేనకు ధీమంతుడయిన శిఖండి ముందు నడిచాడు. మహాత్ములయిన కౌరవ పాండవులకు మధ్య రోమాంచం కలిగేటంత మహాయుద్ధం పదిరోజులు జరిగింది. అప్పుడు యుద్ధం చేస్తున్న భీష్ముని అర్జునునితో కలిసి శిఖండి అనేక బాణాలతో కొట్టాడు. తరువాత ఆ భీష్ముడు అంపశయ్య మీద ఉండి దక్షిణాయనం వదలి ఉత్తరాయణం రాగా కాలం చేశాడు. అనంతరం అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడయిన ద్రోణుడు సేనాపతి అయ్యాడు. ఆయన దైత్యసేనకు శుక్రాచార్యునివలె దుర్యోధనునికి రక్షకు డయ్యాడు. ద్విజశ్రేష్ఠ డయిన ఆయన యుద్ధాన్ని శ్లాఘించేవాడు. ఆ ద్రోణుడు కృపాచార్యుడు, కర్ణుడు మున్నగు వారు రక్షకులై చుట్టూ ఉండగా మిగిలిన తొమ్మిది అక్షౌహిణుల సేనతో నిలిచాడు. మిత్రుడు రక్షకుడుగా ఉన్న వరుణునివలె మేధావి, మహాస్త్రవేత్త అయిన ధృష్టద్యుమ్నుడు భీముడు రక్షకుడుగా పాండవసేనకు నాయకు డయ్యాడు. పాండవసేన చుట్టి ఉన్న ధృష్టద్యుమ్నుడు ద్రోణుడు తన తండ్రికి చేసిన అవమానాన్ని గుర్తు తెచ్చుకొని, ఆయనను చంపటానికి యుద్ధంలో మహా పరాక్రమం ప్రదర్శించాడు. ద్రోణ ధృష్టద్యుమ్నుల యుద్ధంలో అనేక దిక్కులనుంచి వచ్చిన వీరులయిన అనేక రాజులు హతులయ్యారు. భయంకరమయిన ఆ మహాయుద్ధం అయిదురోజులు జరిగింది. అప్పుడు మిక్కిలి అలసిన ద్రోణుడు ధృష్టద్యుమ్నునికి వశమయి మరణించాడు.

దుర్యోధనుని సేనలో హతులు కాగా మిగిలిన అయిదు అక్షౌహిణుల సేనకు కర్ణుడు సేనాపతి అయ్యాడు. మహావీరులు ఎందరో మరణించగా మిగిలిన పాండవుల మూడు అక్షౌహిణుల సేనలు అర్జునుని నాయకత్వంలో నిలిచినాయి. తరువాత రెండవరోజున భయంకరుడయిన కర్ణుడు అర్జునుని ఎదుర్కొని అగ్నిలోపడిన మిడుతలాగా మరణించాడు. కర్ణుడు చనిపోగా కౌరవులు నిరుత్సాహులయి, పరాక్రమం తరిగి, మిగిలిన మూడు

అక్షౌహిణుల సేనతో శల్యుని చుట్టూ నిలిచారు. వాహనాదులు అనేకం హతంకాగా నిరుత్సాహులయిన పాండవులు మిగిలిన ఒక అక్షౌహిణి సేనతో యుధిష్ఠిరుని పరివేష్టించారు. కురురాజయిన యుధిష్ఠిరుడు ఒక అర్ధదినంలో చేయవీలుగాని మహత్తర వీరకృత్యంచేసి మద్రదేశాధిపతి అయిన శల్యుని సంహరించాడు. శల్యుడు చనిపోగా మహాపరాక్రమవంతుడు, మహా మనస్వి అయిన సహదేవుడు కలహబీజం నాటిన శకునిని సంహరించాడు. శకుని చనిపోగా దుర్యోధనునికి మహాదుఃఖం కలిగింది. యుద్ధంలో ఆయన సైనికులు చాలామంది హతులయ్యారు. అందువల్ల ఆయన ఒక్కడే గద చేత దాల్చి రణరంగం నుంచి పారిపోయాడు. మిక్కిలిక్రోధపూర్ణుడు ప్రతాపవంతుడయిన భీముడు ఆయనను వెంబడించాడు. ద్వైపాయన హ్రదంలోని నీళ్ళల్లో ఉన్న ఆయనను చూశాడు. చనిపోగా మిగిలిన సైన్యంతో సరస్సులో ఉన్న ఆ దుర్యోధనుని చుట్టుముట్టి, పంచ పాండవులు సంతోషంతో సమీపించారు. భీమసేనుని వాగ్బాణాలతో బాగా గాయపడిన దుర్యోధనుడు వేగంగా నీటిలోనుంచి బయటకు వచ్చి, గదాహస్తుడయి యుద్ధానికి సిద్ధమయి పాండవుల వద్దకు వచ్చాడు.

తరువాత మహా సంగ్రామంలో సమస్త రాజులు చూస్తుండగా భీముడు పరాక్రమించి, దుర్యోధనుని సంహరించాడు. తరువాత పాండవసైన్యాన్ని యుద్ధశిబిరంలో నిద్రిస్తుండగా తండ్రి వధకు సహించలేని ద్రోణపుత్రుడు అశ్వత్థామ సంహరించాడు. పుత్రులు, సైన్యం, మిత్రులు, చనిపోగా సాత్యకితో గూడా నేను, పంచ పాండవులు మిగిలాం. కౌరవ పక్షంలో కృపాచార్య కృతవర్మలు, అశ్వత్థామ బ్రతికి బయట పడ్డారు. పాండవపక్షాన్ని ఆశ్రయించటం వల్ల కౌరవుల్లో ఒకడయిన యుయుత్సువు మిగిలాడు. కౌరవరాజయిన సుయోధనుడు బంధువులతో కూడా చనిపోగా విదురసంజయులు ధర్మరాజు వద్దకు వచ్చారు. ప్రభూ! ఈ రీతిగా మహాభారతయుద్ధం పదునెనిమిది రోజులు జరిగింది. అందులో హతులయిన రాజులు వీరస్వర్గాన్ని అలంకరించారు.' వైశంపాయనుడు చెప్పాడు 'మహారాజా! శరీరం గగుర్పొడిచేటంత భయంకరమయిన ఆ యుద్ధ వృత్తాంతాన్ని విన్న వృష్ణివంశీయులు దుఃఖంతో శోకంతో వ్యాకులులు అయ్యారు.'

61. శ్రీకృష్ణుడు అభిమన్యు వధను చెప్పుట.

వైశంపాయనుడు చెప్పాడు – 'జనమేజయా! ప్రతాపవంతు డయిన వాసుదేవుడు తండ్రి ముందు మహాభారత యుద్ధ కథను చెపుతూనే ఆ కథ మధ్యలో మహామతి అయిన ఆయన వసుదేవునికి అప్రియం కలగగూడదని, దౌహిత్రుడు అయిన అభిమన్యుని

వృత్తాంతం చెప్పలేదు. అది విని ఆయన దుఃఖంతో సంతప్తుడు కాగూడదనే భావంతో ఆ వృత్తాంతం వదిలివేశాడు. కాని సుభద్ర రణంలో తన పుత్రవధను శ్రీకృష్ణుడు వదలివేశాడని గుర్తించింది. 'కృష్ణా! అభిమన్యునివధను చెప్పు' అని అంటూనే నేలమీద పడిపోయింది. పుత్రిక పడిపోవటం చూచిన వాసుదేవుడు కూడా దుఃఖంతో మూర్ఛితుడయి నేలమీద పడ్డాడు. తరువాత మనుమని వధ వల్ల కలిగిన దుఃఖంతో పీడితుడయి వసుదేవుడు కృష్ణునితో ఇలా అన్నాడు. 'శ్రీకృష్ణా నీవు ఈ భూమండలం మీద సత్యవాదిగా ప్రసిద్ధుడివి. శత్రునాశకా! నా మనుమని వధను గురించి ఎందుకు చెప్పలేదు? ఇప్పుడయినా నీ మేనల్లుని మరణ వృత్తాంతం వివరంగా చెప్పు. వాడి కన్నులు నీ కన్నులు లాగనే అందంగా ఉంటాయి. శ్రీకృష్ణా! అభిమన్యుని శత్రువులు యుద్ధంలో ఎలా వధించారు ? కాలం రాక ముందు మానవునికి మరణం చాలా కష్టం. ఈ దారుణమయిన విషయం విని, దుఃఖంతో నా హృదయం నూరుముక్కలు కాలేదు. పద్మనయనా! యుద్ధసమయంలో సుభద్రతో ఏం చెప్పమన్నాడు? చంచలనయనుడయిన నా ప్రియదౌహిత్రుడు నాకు ఏమి చెప్పమన్నాడు ? వాడు యుద్ధంలో వెనుదిరిగి పారిపోతూ శత్రువుల చేతిలో హతుడు కాలేదు గదా! గోవిందా! అతడు యుద్ధంలో భయంతో వికృత ముఖుడు కాలేదుగదా! కృష్ణా! ప్రభావ సంపన్నుడయిన అతడు చిన్నతనం వల్ల నా వద్ద వినయంతో తన పరాక్రమ ప్రశంస చేసుకొనేవాడు. నా పుత్రిక ప్రియపుత్రుడయిన అభిమన్యుడు యుద్ధంలో నిత్యమూ ద్రోణునితో, భీష్మునితో, బలవంతులలో శ్రేష్ఠుడయిన కర్ణునితో పోటీ పడుతుండేవాడు. అందువల్ల ద్రోణకర్ణ కృపాచార్యులు సంహరించగా నేలపడ లేదు గదా! కేశవా! అది అంతా నాకు వివరంగా తెలుపవలసింది.

ఈ విధంగా మనుమని గూర్చి దుఃఖిస్తున్న తండ్రి వసుదేవునికి అంతకంటే ఎక్కువ దుఃఖిస్తున్న శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు. 'యుద్ధరంగంలో అభిమన్యుడు ముఖం వికృతం చేసుకోలేదు. దుస్తరమయిన సంగ్రామంలో ఆతడు వెన్నుచూపలేదు. భూపాలకులను వందలు, వేలకొలది గుంపులు గుంపులుగా సంహరించి, అతడు ద్రోణ కర్ణులతో యుద్ధం చేస్తూ, అలసిపోయి దుఃశాసన పుత్రుని చేత హతుడయ్యాడు. ప్రభూ! అతనితో శత్రువులలో ఒక్కొక్కడే పోరాడి ఉంటే యుద్ధంలో ఇంద్రుడయినా వాడిని చంపలేడు. అప్పుడు సంశప్తకులు అర్జునుని పిలిచి, యుద్ధంలో దూరంగా తీసుకుపోయారు. ఆ సమయంలో మిక్కిలి క్రుద్ధులయిన ద్రోణాదులు యుద్ధంలో వానిని చుట్టుముట్టారు. తండ్రీ ! తరువాత యుద్ధరంగంలో మహత్తరమయిన శత్రువధను చేసి నీమనుమడు దుశ్శాసన కుమారునిచే

హతుడయ్యాడు. అభిమన్యుడు వీరస్వర్గానికి వెళ్ళి ఉండటం నిశ్చయం, కాబట్టి మహామతీ! శోకం త్యజించు. పవిత్ర హృదయులయిన సజ్జనులు సంకటస్థితి ఏర్పడినా ఇంతగా ఖిన్నులుగారు. యుద్ధభూమిలో మహేంద్రునితో సమానమయిన ద్రోణ కర్ణాదులను ఎదిరించి యుద్ధం చేసిన అభిమన్యుడు వీర స్వర్గానికి ఎందుకు వెళ్ళడు ? శత్రుపురాలను జయించే ఆతడు శస్త్రాల దెబ్బలతో పవిత్రుడయి ఉత్తమగతిని పొందాడు. చెనక శక్యంగాని మహావీరా! తండ్రీ! దుఃఖించకు. శోకవశుడవు కావద్దు. వీరుడయిన అతడు చనిపోగా దుఃఖంతో ఆర్తురాలయిన ఈ నా చెల్లెలు పుత్రుని వద్దకువెళ్ళి కురరివలె విలపించింది. దుఃఖమగ్నురాలయి ద్రౌపది వద్దకు వెళ్లి 'అక్కా ! మన పిల్లలు ఎక్కడ ఉన్నారు ?వారిని నేను చూడగోరుతున్నాను.' ఈమె దుఃఖవాక్యాలు విని కౌరవస్త్రీలు అందరూ ఆర్తలయి ఈమె చేతులు పట్టుకొని కరుణాజనకంగా విలపించారు. సుభద్ర ఉత్తరవద్దకు వెళ్ళి 'కల్యాణీ! నీభర్త ఎక్కడికి వెళ్ళాడు? నీవు త్వరగా వాడికి నా రాకను చెప్పు. విరాట కుమారీ! నా మాట విన్పించినంతనే ఇంట్లోంచి వేగంగా వచ్చే నీ భర్త ఇవ్వాళ ఎందుకు రాడు? అభిమన్యూ! మహారథులయిన నీ మేనమామలు కుశలంగా ఉన్నారు. యుద్ధం చేయదలచి ఇక్కడికి వచ్చిన నీ క్షేమం అడిగారు. శత్రునాశకా! యుద్ధవృత్తాంతం ఇవ్వాళ జరిగింది నాకు వెనుకటివలెనే చెప్పు. ఇంతగా విలపిస్తున్న నాకు ఇవ్వాళ సమాధానం చెప్పవేమి ?'

ఈ రీతిగా ఏడుస్తున్న సుభద్రయొక్కవిలాపం విని, కుంతీదేవి మిక్కిలి దుఃఖార్త అయి మెల్లగా ఇలా అన్నది. 'సుభద్రా! శ్రీకృష్ణుని చేత, సాత్యకి చేత, తండ్రి అర్జునునిచేత లాలితుడయిన బాలుడు అభిమన్యుడు యుద్ధభూమిలో కాలధర్మం చెందాడు. యాదవపుత్రీ! మర్త్యధర్మమే ఇలాంటిది. కాబట్టి దుఃఖించకు. శత్రువులకు అజేయుడయిన నీ పుత్రుడు పరమవీరగతిని పొందాడు. సుభద్రా! మహాత్ములయిన క్షత్రియుల గొప్పకులంలో జన్మించావు. కాబట్టి చంచలనయనుడయిన పుత్రుని కోసం శోకించకు. కళ్యాణీ! గర్భవతి అయిన ఉత్తరను చూడు. ఇంక దుఃఖించకు. ఈమె త్వరలోనే అభిమన్యుని పుత్రుని కంటుంది.' కుంతీదేవి ఈ రీతిగా ఈ సుభద్రను ఓదార్చి, దుస్తరమయిన శోకం వీడి, ఆతని శ్రాద్ధానికి కావలసినవి సిద్ధంచేయించింది. ధర్మజ్ఞుడయిన యుధిష్ఠిరుని, భీముని ఆదేశించి, యమతుల్యు లయిన నకుల సహదేవులను అనుమతించి, కుంతీ దేవి అభిమన్యుని ఉద్దేశించి, అనేక దానాలు ఇప్పించింది. తరువాత కుంతీదేవి బ్రాహ్మణులకు అనేక గోవులను దానం చేయించి, వారిని తృప్తి పరిచి, ఉత్తరతో ఇలా అన్నది. "పవిత్రురాలా!

విరాటపుత్రీ! ఈ విషయంలో ఇంక సంతాపం చెందకు. భర్తకోసం దుఃఖించకు. నీ గర్భంలో ఉన్న శిశువును రక్షించుకో." కుంతీదేవి ఈ విధంగా చెప్పి విరమించింది. ఆమె అనుమతి తీసుకొని నేను ఈ మన సుభద్రను తీసుకొచ్చాను. పూజ్య ! ఈ రీతిగా నీ దౌహిత్రుడు మరణించాడు. దుర్దర్షా! సంతాపం వదలు. మనస్సు దుఃఖితం చేయవద్దు.'

62. వ్యాసుడు అశ్వమేధము చేయ యుధిష్ఠిరుని అనుమతించుట.

ధర్మాత్ముడయిన వసుదేవుడు కుమారుని మాటలు విని, ఊరడిల్లి, శోకం త్యజించి, అభిమన్యునికి యథావిధిగా శ్రాద్ధ విషయక దానాలు ఇచ్చాడు. అదే రీతి శ్రీకృష్ణుడు మహాత్ముడు, తన తండ్రికి చాలా ఇష్టుడు, తనకు మేనల్లుడయిన అభిమన్యునికి ఔర్ధ్వదైహిక క్రియలు చేశాడు. ఆయన అరువది వేలమంది మహాతేజస్వులయిన బ్రాహ్మణులకు యథావిధిగా సర్వగుణ సంపన్నమయిన (షడ్రసోపేతమయిన) భోజనాలు పెట్టించాడు. శ్రీకృష్ణుడు వారికి వస్త్రాలను ఇచ్చాడు. ఆ బ్రాహ్మణులకు ధనాశ తీరేటంత ధనం దానం చేశాడు. అది రోమాంచం కలిగింది. బంగారాన్ని, గోవులను, శయ్యలను, వస్త్రాలను సమృద్ధిగా ఇస్తున్న ఆయనను ఆ బ్రాహ్మణులు ఆశీర్వదించారు. శ్రీకృష్ణుడు, బలరాముడు, సత్యకుడు, సాత్యకి అభిమన్యుని శ్రాద్ధవిధులు నిర్వర్తించారు. వారందరు మిక్కిలి శోక సంతప్తులయ్యారు. వారికి శాంతి కలుగలేదు. అలాగే వీరులయిన పాండవులు హస్తినాపురంలో అభిమన్యుడు లేకపోవటం వల్ల అశాంతులయ్యారు. రాజేంద్రా! విరాటపుత్రిక ఉత్తర భర్తృ దుఃఖంతో ఆర్తురాలయి చాలారోజులు ఆహారం ముట్టలేదు. అప్పటి ఆమె దశ అందరికి కరుణాజనకం అయింది. ఆమె గర్భంలో ఉన్న బాలకుడు అప్పుడు క్షీణించసాగాడు.

అంతట ధీమంతుడయిన వ్యాసమహర్షి ఈ విషయం దివ్యదృష్టితో తెలుసుకొని వారివద్దకు వచ్చి కుంతీదేవితో ఉన్న ఉత్తరతో ఇలా అన్నాడు - 'కీర్తిమతీ! ఈ శోకం వీడు. నీకు మహాతేజస్వి అయిన పుత్రుడు కలుగుతాడు. శ్రీకృష్ణుని ప్రభావం వల్ల, నేను చెప్పటంవల్ల ఈ కలగబోయే బాలకుడు పాండవుల తరువాత భూమండలాన్ని పరిపాలిస్తాడు.' ఆ మహర్షి ధర్మరాజు వింటుండగా అర్జునుని చూసి, వారిని సంతోషపెడుతూ ఇలా అన్నాడు. 'నీకు మహామేధావి, మహాభాగ్యశాలి అయిన మనుమడు కలుగుతాడు. ఆతడు సముద్రం వరకు గల సమస్త భూమండలాన్ని ధర్మానుసారం పరిపాలిస్తాడు. కాబట్టి శోకించకు. ఈ విషయంలో విచారపడాలిసినది ఏమీలేదు. నేను చెప్పేది అంతా సత్యం అవుతుంది. ఇంతకు పూర్వం వృష్ణి వంశ వీరుడయిన శ్రీకృష్ణుడు చెప్పింది అంతా

అలాగే జరుగుతుంది. ఈ విషయం ఇంకోరకంగా తలంచవలసినపని లేదు. వీరుడయిన అభిమన్యుడు తన పరాక్రమంతో జయించి, అక్షయమయిన దేవలోకాలకు వెళ్ళాడు. కాబట్టి నీవు గాని, ఇతర కురువీరులు గాని విచారపడవలదు.' ఈ రీతిగా తాతగారు వ్యాసమహర్షి చెప్పగా ధర్మాత్ముడయిన అర్జునుడు శోకం వీడి సంతోషపూర్ణుడయ్యాడు. జనమేజయా! నీ తండ్రి కూడా ఆ ఉత్తరాగర్భంలో శుక్లపక్ష చంద్రునిలాగా అభివృద్ధి పొందాడు. తరువాత వ్యాసమహర్షి యుధిష్ఠిర మహారాజును అశ్వమేధం చెయ్యమని ప్రోత్సహించి, అంతర్ధానం చెందాడు. నాయనా! మేధావి ధర్మరాజుకూడా వ్యాసమహర్షి మాటలు విని, ధనం తీసుకురావటం కోసం వెళ్ళటానికి నిశ్చయించుకొన్నాడు.

63. ద్రవ్యానయనోపక్రమము - 1.

జనమేజయుడు అడిగాడు - 'బ్రహ్మర్షీ! మహాత్ముడయిన వ్యాసుడు చెప్పింది విని, యుధిష్ఠిరుడు మళ్ళీ ఏం చేశాడు? మరుత్తుడు భూమిలో దాచిన రత్నాదులను ఆయన ఎలా సంపాదించాడు ? ద్విజశ్రేష్ఠా! ఈ విషయం అంతా నాకు వివరంగా చెప్పగోరుతున్నాను.' వైశంపాయనుడు చెప్పాడు. 'జనమేజయా! వ్యాసమహర్షి మాటలు విన్న యుధిష్ఠిరుడు సముచితకాలంలో సోదరులయిన భీమును, అర్జునుని నకుల సహదేవులను పిలిపించి ఇలా అన్నాడు. "మహావీరులారా! మహాత్ముడు, ధీమంతుడు, కురువంశీయుల మేలుకోరే వ్యాసమహర్షి ఆత్మీయతతో చెప్పింది అంతా మీరు విన్నారు కదా! తపోవృద్ధుడు, మహాత్ముడు, మంచి మనస్సుగలవారికి సంపద కలగాలని కోరేవాడు, గురువు, ధర్మశీలుడు, అద్భుత కార్యాలు చేసిన వ్యాసమహర్షి, భీష్ముడు, ధీమంతుడయిన శ్రీకృష్ణుడు సమయానుసారంగా ఇచ్చిన సలహాలను సముచితంగా చేయగోరుతున్నాను. ప్రస్తుత సమయంలోను భవిష్యత్తులోను అదే మనకు హితమయినది. బ్రహ్మవాది అయిన వ్యాసమహర్షి వచనం పరిణామంలో మనకు శుభకరం అవుతుంది. కురుశ్రేష్ఠులారా! ఇప్పుడు ఈ భూమి మీద ధనం, రత్నాలు నాశనం అయ్యాయి. కాబట్టి మన ఆర్థిక విషమతను పోగొట్టటానికి మరుత్తుని ధనం గురించి చెప్పాడు. ఈ ధనం మనకు సరిపోతుందనుకొంటే అది తేవటానికి మనకు సామర్థ్యం ఉన్నదనుకొంటే వ్యాసమహర్షి చెప్పినట్లు, ధర్మానుసారం దాన్ని తేవటానికి యత్నించండి. భీమసేనా! ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటో చెప్పు.' ఈ రీతిగా రాజు చెప్పగా భీమసేనుడు దోసిలి పట్టి ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'మహాబాహూ! వ్యాసమహర్షి చెప్పినరీతిగా ధనం తీసుకురావటం గురించి నీవు చెప్పింది

నాకు నచ్చింది. ప్రభూ! మనం ఇప్పుడు మరుత్తుని ధనం పొందేటట్లయితే యజ్ఞం చేసినట్లే అని నా అభిప్రాయం. మహారాజా! మాకు మేలుకలుగుగాక. మనం మహాత్ముడయిన శంకరుని శరణుపొంది, ఆయనను తగురీతిగా అర్చించి, ఆ ధనం తీసుకువద్దాం. మనం వాక్కులతో, బుద్ధితో, అర్చనాది కర్మలతో దేవదేవేశుడయిన ఆయనను, ఆయన అనుచరులను ప్రసన్నులను చేసుకొని ఆ ధనం సంపాదిద్దాం. భయంకరంగా కన్పించే, ఆ ద్రవ్యరక్షకులు కూడా వృషభధ్వజుడయిన శంకరుడు ప్రసన్నుడయినప్పుడు వశం అవుతారు.

సదా ప్రసన్నచిత్తుడు, సర్వసమర్థుడు పరమేశ్వరుడయిన మహాదేవుడు భక్తులకు అమరత్వమే ప్రసాదిస్తాడనగా సువర్ణవిషయం వేరే చెప్పాలా? పూర్వం వనంలో ఉన్న అర్జునునికి మహత్తర పాశుపతాస్త్రాన్ని రౌద్రాస్త్రాన్ని, బ్రహ్మ శిరోస్త్రాన్ని ప్రసన్నుడై ఇచ్చిన ఆయన ధనం ఎందుకివ్వడు ? మనం అందరం ఆయన భక్తులం ఆయన మనకు ప్రసన్నుడు. కౌరవనందనా ? ఆయన ప్రసాదం వల్ల మనకు రాజ్యం వచ్చింది. అభిమన్యు వధ జరుగగా అర్జునుడు సైంధవ వధకు ప్రతిజ్ఞ చేశాడు. రాత్రిపూట అర్జునుడు కృష్ణునితో గూడా శంకరుని ప్రసన్నుని చేసుకొని పాశుపతాస్త్రం పొందాడు. రాత్రి తెల్లవారగా ఆ ప్రభువు శంకరుడు అర్జునుని ముందుండి అర్జునుడు చూస్తుండగానే శత్రుసైన్యాన్ని భూలంతో సంహరించాడు. మహారాజా! మహాధనుష్కులు, యుద్ధకుశలులు ద్రోణకర్ణ ప్రభృతులతో ఆ మహాకౌరవసేనను గొప్ప విలుకాడు, బహురూపుడు అయిన మహేశ్వరుడు తప్ప ఇంకొకడెవడు మనుష్యులతోనైనా ఓడించగలడు? ఆయన అనుగ్రహం వల్లనే నీ శత్రువులు హతులయ్యారు. అశ్వమేధయాగ పూర్తిని కూడా ఆ మహాదేవుడే చేస్తాడు.'

భీముడు చెప్పినమాటలు విన్న వెంటనే యుధిష్ఠిరుడు పరమానందం చెందాడు. అర్జునుడు మున్నగు వారు కూడా 'అది నిజమే' అని పలికారు. ఈ రీతిగా సమస్త పాండవులు రత్నాలు తేవలెనని నిశ్చయించుకొని ధ్రువమనే పేరుగల నక్షత్రం గల రోజున సేనా ప్రయాణానికి ఆజ్ఞ ఇచ్చారు. తరువాత బ్రాహ్మణులు స్వస్తి వాచనం చేయగా దేవశ్రేష్ఠుడు మహేశ్వరుని అంతకుముందే పూజించి మోదకాలు, పాయసం, పండ్ల గుజ్జు, అరిసెలతో, మహేశ్వరుని సంతృప్తుని చేసి, వారి ఆశీస్సులు తీసుకొని, పాండవులందరు చాలా సంతోషంతో ప్రయాణం ప్రారంభించారు. బయలుదేరిన వారికి, బ్రాహ్మణశ్రేష్ఠులు, పౌరశ్రేష్ఠులు సంతోష పూర్ణమనస్కులయి శుభాశంసన వచనాలు పలికారు. తరువాత పాండవులు అగ్నులతో గూడి ఉన్న బ్రాహ్మణులకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి బయలుదేరారు. ప్రయాణానికి ముందు వారు పుత్ర శోకంతో వ్యాకులులయిన గాంధారీ ధృతరాష్ట్రుల నుండి, కుంతీదేవి నుండి అనుజ్ఞ తీసుకొన్నారు. ధృతరాష్ట్ర పుత్రుడయిన యుయుత్సుని తమ వంశానికి మూలభూతులయిన గాంధారీ ధృతరాష్ట్ర

కుంతీదేవుల రక్షణకు నియోగించి పౌరుల, విద్వాంసులయిన బ్రాహ్మణుల, గౌరవ సత్కారాలు అందుకొంటూ నియమస్థులు, పవిత్రవ్రతులు, వీరు లయిన పాండవులు బయలుదేరారు.

64. ద్రవ్యానయనోపక్రమము - 2.

వైశంపాయనుడు చెప్పాడు - 'జనమేజయా! తరువాత పాండవులతో కూడా వచ్చిన మనుష్యులు, వాహనాలు సంతోషపూర్ణంగా తమ రధాల మహాఘోషతో భూమండలాన్ని నింపుతూ ప్రయాణం ప్రారంభించారు. సూతులు, మాగధులు, వందులు వారి వారి గుణాదులను స్తుతిస్తున్నారు. ఆదిత్యులు తమ కిరణాలతో చుట్టుకొన్నట్లు పాండవులు తమ తమ సైన్య పరివృతులయి ఉన్నారు. శిరస్సుపైభాగాన తెల్లగొడుగు విరాజిల్లుతున్న యుధిష్ఠిరుడు పూర్ణిమ నాటి నక్షత్రరాజు చంద్రునివలె విలసిల్లాడు. దారిపొడవునా ఆనంద పూర్ణులయిన పౌరులు సముచితంగా యథావిధిగా ఇస్తున్న జయధ్వానాలు గల ఆశీస్సులను స్వీకరించాడు. యుధిష్ఠిర మహారాజును వెంబడించి వెళ్తున్న సైనికుల కోలాహల ధ్వనులు ఆకాశాన్ని స్తబ్ధం చేసి ప్రతిధ్వనిస్తున్నాయి. రాజా! అనేక సరస్సులను, సరిత్తులను, వనాలను, ఉపవనాలను, పర్వతాలను అతిక్రమించి మహారాజు యుధిష్ఠిరుడు మరుత్తుని ధనం చోటికి వెళ్లాడు. అక్కడ ఒక్క సమతలమయి, సుఖకరమయిన స్థానంలో యుధిష్ఠిర మహారాజు తపస్సు, విద్య, ఇంద్రియ నిగ్రహం గల బ్రాహ్మణులతో, రాజపురోహితుడయిన ధౌమ్య మహర్షిని ముందుంచుకొని సైనికులతో కూడా శిబిరంలో ఉన్నాడు. అనేకరాజులు, బ్రాహ్మణులు, పురోహితులు తగిన విధంగా శాంతి కర్మలను నిర్వర్తించి యుధిష్ఠిరుని, ఆయన మంత్రులను యథావిధిగా మధ్యనుంచుకొని వారిని అన్నివైపులనుంచి చుట్టుకొని ఉన్నారు. బ్రాహ్మణులు అక్కడ నిర్మింపజేసిన శిబిరంలో తూర్పునుంచి పడమటి వైపు, ఉత్తరం నుంచి దక్షిణంవైపు పోయే ఆరు మార్గాలు ఉన్నాయి. ఆ శిబిరం నవఖండాలుగా ఉంది. యుధిష్ఠిర మహారాజు మత్తగజాలకై తగిన స్థావరాలను యథావిధిగా నిర్మింపజేసి, బ్రాహ్మణులతో ఇలా అన్నాడు.

'ద్విజశ్రేష్ఠులారా! ఈ కార్యసిద్ధికి ఏ శుభ నక్షత్రం, శుభదినం యోగ్యం అని మీరు భావిస్తే దాన్ని నిశ్చయించండి.' ఇక్కడే ఉండగా మన సమయం ఎక్కువ వృథా కారాదు. ద్విజులారా! ఈ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చి ఇప్పుడు చేయవలసింది ఆలస్యం లేకుండా నిర్వర్తించండి. యుధిష్ఠిరుని ఈ మాట విని, ధర్మరాజు సంతోషాన్ని

కోరిన పురోహితులతో గూడా ఆ బ్రాహ్మణులు ఇలా అన్నారు. 'రాజా! ఇవ్వాళే శుభ నక్షత్రం గల శుభదినం. కాబట్టి మేము శ్రేష్ఠతమ క్రియారంభం చేస్తాం. మేము నేడు కేవలం నీరు మాత్రం త్రాగి ఉంటాం. మీరు కూడా ఇవ్వాళ ఉపవాసం చేయాలి. ఆ రాజశ్రేష్ఠులు ఆ ద్విజోత్తముల మాటలు పాటించి ఉపవాసం చేశారు. దర్భచాపల మీద రాత్రిపూట ఉన్నవారు యజ్ఞంలో ప్రజ్వలిస్తున్న అగ్నులవలె భాసిల్లారు. తరువాత బ్రాహ్మణ శ్రేష్ఠుల మాటలు వింటున్న ఆ మహాత్ములకు రాత్రి గడిచింది. తెల్లవారిన తరువాత ద్విజశ్రేష్ఠులు యుధిష్ఠిరునితో ఇలా అన్నారు.

65. ద్రవ్యానయనము.

రాజా ! మహాత్ముడయిన శంకరునికి పూజ చేయండి. పూజ చేసిన తరువాత మనం మన అభీష్టసిద్ధికి ప్రయత్నిద్దాం.' యుధిష్ఠిరుడు బ్రాహ్మణుల మాటలు విని, శివునికి తగిన రీతిగా నైవేద్యం సమర్పించాడు. తరువాత ఆయన పురోహితుడు యథావిధిగా సంస్కరించిన ఘృతంతో అగ్నిదేవుని తృప్తిపరచటానికి మంత్ర సిద్ధమయిన చరువును సిద్ధం చేశాడు. దానిని సమర్పించటానికి దైవసన్నిధికి వెళ్ళాడు. నరనాథా! ఆయన మంత్రపూతమయిన పుష్పాలను తీసుకొని మోదకాలు, పాయసం, పండ్లగుజ్జు, విచిత్రపుష్పాలను, లాజలను, ఇంకా ఇతర వస్తువులతో ఉపహారం సమర్పించాడు. వేదవేత్త అయిన పురోహితుడు విధి పూర్వకంగా దైవానికి అత్యంత ప్రియమయిన సమస్త కర్మలను నిర్వర్తించి, తరువాత శివదేవుని పార్షదులకు ఉత్తమ పూజను సమర్పించాడు. ఆ తరువాత యక్షప్రభువు కుబేరునికి మణిభద్రునికి, ఇతర యక్షులకు, భూతాధిపతులకు అన్నం, పండ్ల గుజ్జు తిల మిశ్రిత జలాంజలులను నివేదించి అర్చించాడు. అనంతరం పురోహితుడు కుండలతో అన్నాన్ని బలిగా అర్పించాడు. అప్పుడు భూపతి బ్రాహ్మణులకు వేలకొలది గోవులను దానం చేసి రాత్రించరులయిన భూతాలకు గూడా బలులను ఇచ్చాడు. రాజా! దేవదేవుడు పరమేశ్వరుని ఆ నివాస ప్రదేశం ధూపసుగంధంతో వ్యాపించి, పుష్పాలతో అలంకరింపబడటం చేత మహా సౌందర్యాన్ని సంతరించుకొన్నది. యుధిష్ఠిరుడు, రుద్రునికి, ఆయన గణాలు అన్నింటికి యథావిధిగా పూజచేసి వ్యాసమహర్షిని ముందుంచుకొని రత్న నిధి వద్దకు వెళ్ళాడు. ఆయన అక్కడ నానావిధాలయిన విచిత్ర పుష్పాలతో అపూపాలతో, కృసరంతో ధనాధ్యక్షుడైన కుబేరుని పూజించి, ఆయనకు ప్రణమిల్లాడు. తరువాత ఆ సామగ్రితోనే శంఖాదులయిన నిధులను, సమస్త నిధిపాలకులను పూజించి

శ్రేష్ఠబ్రాహ్మణులను అర్చించాడు. స్వస్తివాచనాలు చేసిన ఆ బ్రాహ్మణుల పుణ్యాహవాచన మంత్ర ఘోషతో తేజస్వి, శక్తిశాలి అయిన యుధిష్ఠిరుడు చాలా సంతోషంతో ఆ ధనం కోసం త్రవ్వించాడు.

కొద్దిసేపట్లోనే నానాప్రకారాలు, విచిత్రాలు, మనోహరాలు అయిన వేలకొలది సువర్ణ పాత్రలు, గంగాళాలు, కలశాలు, కూజాలు, చెంబులు, గిన్నెలు, పాత్రలు లభించాయి. అప్పుడు ధర్మరాజు వాటిని అన్నింటిని పైకి తీయించాడు. ఆ వస్తువులను తీసుకొనిపోవటానికి పెద్దపెద్ద పెట్టెలను తెచ్చారు. రాజా! ఒక్కొక్క పెట్టెలో పెట్టిన పాత్రను బరువు తులలో తూచినట్లు రెండు వైపులా సమానంగా ఉంది. వాటిని తీసుకుపోవటానికి తగిన వాహనాలు గూడా యుధిష్ఠిరుడు కట్టించాడు. రాజా! అరువది వేల ఒంటెలు, ఒక కోటి ఇరువది లక్షలు గుర్రాలు, లక్ష ఏనుగులు ఒక లక్షరథాలు, ఒక లక్ష బండ్లు, అన్ని ఆడ ఏనుగులు ఉన్నాయి. వాటిని మోసుకుపోవటానికి సిద్ధమయిన గాడిదలు, మానవుల సంఖ్య ఇంత అని చెప్పవీలుగాదు. యుధిష్ఠిరుడు అక్కడ త్రవ్వించి ఎత్తించిన ధనం పదహారు కోట్ల ఎనిమిది లక్షల ఇరవై నాలుగు వేల బారువుల బరువు ఉంది. పైన చెప్పిన అన్ని వాహనాల మీద ధనాన్ని ఎత్తించి, యుధిష్ఠిరుడు మళ్ళీ మహాదేవుని అర్చించాడు. వ్యాసమహర్షి ఆజ్ఞను గైకొని ధౌమ్యుని ముందుంచుకొని హస్తినాపురానికి ప్రయాణమయ్యాడు. రాజా ! వాహనాల మీద భారం అధికం కావటం వల్ల రెండేసి క్రోసుల దూరంలో మజిలీలు వేశారు. ద్రవ్యభారంతో చాలా శ్రమ పడుతూ ఆ మహాసేన కురుశ్రేష్ఠుల హర్షాన్ని పెంపొందింపజేస్తూ, చాలా కష్టంమీద పురాభిముఖంగా ధనంతో వెళ్ళుతున్నది.

66. పరీక్షిజ్జన్మ వృత్తాంతము.

జనమేజయా! ఈ సమయంలోనే మహా పరాక్రమవంతుడయిన శ్రీకృష్ణుడు వృష్ణివంశీయులతో కూడా హస్తినాపురానికి వచ్చాడు. ఆయన ద్వారకానగరానికి వెళ్ళేటప్పుడు ధర్మరాజు చెప్పినట్లు అశ్వమేధ యజ్ఞ సమయం సమీపించటంతో పురుషోత్తముడు శ్రీకృష్ణుడు ముందుగానే వచ్చాడు. ప్రద్యుమ్నునితో, సాత్యకితో, చారుదేష్ణునితో, సాంబునితో, గదునితో, కృతవర్మతో, వీరుడయిన సారణునితో, నిశరునితో, ఉల్ముకునితో శ్రీకృష్ణుడు కలిసి వచ్చాడు. ఆయన బలరాముని ముందుంచుకొని సుభద్రతో గూడా వచ్చాడు. ద్రౌపదిని, ఉత్తరను, కుంతీ దేవిని చూడటం, భర్తలు మరణించిన క్షత్రియ స్త్రీలను ఓదార్చటం ఆయన రాకలో ప్రధానోద్దేశ్యాలు. వారి రాక విన్నంతనే ధృతరాష్ట్రుడు,

మహామేధావి విదురుడు, లేచి నిలచి ముందుకు వెళ్ళి, వారికి స్వాగత సత్కారాలు చేశారు. మహాతేజస్వి పురుషోత్తముడయిన శ్రీకృష్ణుడు విదుర యుయుత్సువులచేత అర్చితుడయి అక్కడే ఉన్నాడు. జనమేజయా! అక్కడ వృష్ణివంశ వీరులు ఉన్న సమయంలోనే శత్రువీర నాశకుడయిన మీ తండ్రి పరీక్షిత్తు పుట్టాడు. మహారాజా! ఆ రాజపుత్రుడు బ్రహ్మాస్త్ర పీడితుడయి జననంతో సంతోషాన్ని, మరణంతో దుఃఖాన్ని పెంపొందిస్తూ నిశ్చేష్టుడు, శవమయినాడు. అక్కడ ఉన్న జనుల హర్షపూర్వక సింహనాదాలతో ఏర్పడిన ధ్వని అన్ని మూలలా వ్యాపించింది. మళ్ళీ సద్దుమణిగింది. అప్పుడు ఇంద్రియాలు అన్నీ వ్యధజెందగా శ్రీకృష్ణుడు సాత్యకి వెంట రాగా చాలా వేగంగా అంతఃపురంలో ప్రవేశించాడు. తన తండ్రి తోబుట్టువయిన కుంతీదేవి త్వరగా పరుగెత్తుకు రా అని అంటూ వేగంగా తాను వస్తూ ఉండటం చూచాడు. రాజా! ఆమె వెనుక ద్రౌపది, యశస్విని అయిన సుభద్ర, ఇంకా బంధువుల స్త్రీలు కరుణాజనకంగా రోదిస్తున్నారు. రాజశ్రేష్ఠా! అప్పుడు కుంతీదేవి శ్రీకృష్ణుని సమీపించి, కన్నీటితో గొంతు బొంగురుపోగా ఇలా అన్నది.

'శ్రీకృష్ణా! దేవకీదేవి నీవు జన్మించటం వల్ల ఉత్తమ సంతానవతి అయింది. ఇప్పుడు నీవే మాకు గతి, ఆధారం. మా వంశం అంతా నీమీద ఆధారపడి ఉంది. యదువంశ వీరా! కేశవా! నీ మేనల్లుని ఈ కొడుకు అశ్వత్థామచే హతుడయి పుట్టాడు. ప్రభూ! వాడిని బ్రతికించు. యదునందనా! ప్రభూ! అశ్వత్థామ గడ్డిపోచను అస్త్రంగా ప్రయోగించినప్పుడు మృతుడయి పుట్టిన వీనిని బ్రతికిస్తానని నీవు ప్రతిజ్ఞ చేశావు. నాయనా! వీడు మృతుడయి పుట్టాడు. పురుషశ్రేష్ఠా! వీడిని ఉత్తరను, సుభద్రను, ద్రౌపదిని, నన్ను ఇప్పుడు చూడు. ధర్మరాజును, భీమును, అర్జునుని, నకులుని సహదేవుని మమ్ములను అందరిని నీవే కాపాడు. వీడిమీదనే పాండవుల ప్రాణాలు ఆధారపడి ఉన్నాయి. పాండురాజుకు, మామామ విచిత్రవీర్యునికి పిండ ప్రదాత వీడే. దశార్హవంశీయా! నీకు శుభం కలుగుగాక. నీకు చాలా ఇష్టుడు, నీతో సమానుడు అయిన అభిమన్యుడు మృతుడయినా వాడికి ఇప్పుడు ప్రియం కలిగించు. కృష్ణా! పూర్వం అభిమన్యుడు చెప్పిన తనకు ఇష్టమయిన మాటలు ఉత్తరం చెపుతుంటుంది. ఈ మాటలు వాస్తవాలు అవటంలో సందేహం లేదు. అప్పుడు అభిమన్యుడు ఉత్తరతో ఇలా అన్నాడట. కల్యాణీ! నీ పుత్రుడు మా మేనమామ ఇంటికి వెళ్తాడు. వృష్ణులు, అంధకుల వద్దకు వెళ్ళి అక్కడ ధనుర్వేదం అధ్యయనం చేస్తాడు. విచిత్రమయిన అస్త్రాలను, నీతిశాస్త్రాన్ని గ్రహిస్తాడు. నాయనా! శత్రునాశకుడయిన సుభద్రా సుతుడు ప్రేమపూర్వకంగా ఈ మాటలు చెప్పాడట. ఈ మాటలు నిస్సందేహంగా

సత్యం కావాలి. మధుసూదనా! ఈ వంశానికి హితంకోరి, మంగళకరమయినది ఆచరించు' అని మేము అందరం నమస్కరించి యాచిస్తున్నాం.' ఇతర స్త్రీలు, విశాలలోచన అయిన కుంతీదేవి ఈ రీతిగా చెప్పి దుఃఖంతో ఆర్తురాలయి చేతులు పైకెత్తి నేలమీద పడ్డారు. మహారాజా! ఆ స్త్రీలు, అందరూ కన్నీరు నిండిన కనులతో శ్రీకృష్ణుని మేనల్లుని కుమారుడు మృతుడయి జన్మించాడు అని అన్నారు. భారతా! ఈ రీతిగా పలికిన కుంతీదేవిని శ్రీకృష్ణుడు లేవదీసి, కూర్చోపెట్టాడు. నేలబడిన తన మేనత్తను ఓదార్చాడు.

67. పరీక్షిత్తును బ్రతికింపుమని సుభద్ర శ్రీకృష్ణుని ప్రార్థించుట.

కుంతీదేవి లేచి కూర్చున్న తరువాత సుభద్ర శ్రీకృష్ణుని చూసి దుఃఖించింది. శోకార్త అయి ఇలా అన్నది. 'మేధావి అయిన అర్జునుని మనుమని చూడు. కౌరవులు నశించిన తరువాత వీడు పుట్టాడు. కాని వీనికి కూడా ఆయువు తీరింది. ద్రోణపుత్రుడు అశ్వత్థామ భీముని వధింప ప్రయోగించిన గడ్డిపోచ బాణం ఉత్తరమీద, నామీద, అర్జునుని మీద పడింది. కేశవా! ఆ ఇషీకాస్త్రం పగిలిన నా గుండెలలో గాటంగా నాటుకొని ఉంది. ఇప్పుడు పుత్రసహితుడయిన అభిమన్యుని చూడలేను గదా! అభిమన్యుని పుత్రుడు పుడుతూనే మరణించాడు అనేమాట విన్న తరువాత ధర్మాత్ముడు ధర్మరాజయిన యుధిష్ఠిరుడు ఏమంటాడు? భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు ఏమనుకొంటారు. శ్రీకృష్ణా! ఈ దినం అశ్వత్థామ పాండవుల సర్వస్వం దోచేశాడు. శ్రీకృష్ణా! సోదరులు అందరికి అభిమన్యుడంటే చాలా ఇష్టం. ఇందులో సంశయం లేదు. ద్రోణపుత్రుని అస్త్రంతో నిర్జితులయిన వారు ఈ విషయం వింటే ఏమంటారో? జనార్దనా! అభిమన్యు కుమారుడు మృతుడయి పుట్టిన దానికంటే ఇంకా పెద్ద దుఃఖం ఏముంటుంది ? శ్రీకృష్ణా! శిరస్సు వంచి నమస్కరించి, ఇవ్వాళ నిన్ను ప్రసన్నుని చేయగోరుతున్నాను. ఈ కుంతీదేవి, ద్రౌపదిని, ఈ స్త్రీలను చూడు పురుషోత్తమా !

మాధవా! అశ్వత్థామ పాండవులకు సంబంధించిన గర్భాలను సంహరిస్తున్నప్పుడు క్రుద్ధుడవయి నీవు ఆయనతో ఇలా అన్నావు. "నరాధమా! బ్రాహ్మణబ్రువుడా! నీ కోరిక నెరవేరకుండా చేస్తాను. అర్జునుని పుత్రుడయిన అభిమన్యుని పుత్రుని నేను బ్రతికిస్తాను." శ్రీకృష్ణా! నీ మాటను విని, నీ బలం తెలిసి నిన్ను ప్రసన్నుని చేసుకోగోరుతున్నాను. అభిమన్యు పుత్రుడు జీవించుగాక. వృష్ణివంశశ్రేష్ఠా! ఈ రీతిగా ప్రతిజ్ఞ చేసి నీవు మంగళకర వాక్కును నిర్వహించకపోతే నేను మరణించటం ఖాయం అని తెలుసుకో. పరాభవింపవీలుగాని

మహావీరా! నీవు జీవించి ఉండగా అభిమన్యుని ఈ పుత్రుడు బ్రతకకపోతే నీ వల్ల ఏం ప్రయోజనం? దుర్ధర్షవీరా! మేఘం వర్షించి ఎండిపోతున్న పైరును బ్రతికించినట్లు నీ కన్నులవంటి కన్నులుగల అభిమన్యుని మృతపుత్రుని బ్రతికించు. శత్రుదమనా! కేశవా! నీవు ధర్మాత్ముడివి, సత్యవచనుడివి, సత్య పరాక్రముడివి, అలాంటి నీవు నీ మాటను నిజం చేసి చూపించాలి. నీవు కోరుకుంటే - తలిస్తే ఈ ముల్లోకాలూ మరణించినా జీవింపజేయగలవు. అలాంటప్పుడు నీకు ఇష్టుడయిన మేనల్లుని పుత్రుని బ్రతికించటం నీకు పెద్దపని కాదు. శ్రీకృష్ణా! నీ ప్రభావం తెలిసినదాన్ని కాబట్టి నిన్ను యాచిస్తున్నాను. పాండవుల మీద ఈ మహానుగ్రహం చూపు. మహాబాహూ! ఈమె నా సోదరి, మృత పుత్ర, దుఃఖితురాలు, శరణందినది, దయనీయ అయిన అబల దయతలచ తగినది అని అనుగ్రహించు.'

68. ఉత్తరావిలాపము, శ్రీకృష్ణ ప్రార్థనము.

వైశంపాయనుడు చెప్పాడు - 'రాజేంద్రా! జనమేజయా! ఇలా సుభద్ర అనగా కేశి రాక్షస నాశకుడయిన కేశవుడు దుఃఖాకులుడయి అక్కడ ఉన్న వారినందరిని హర్షింపజేస్తూ **అలాగే** అన్నాడు. పురుషశ్రేష్ఠా! ప్రభువయిన శ్రీకృష్ణుడు ఈ మాటతో ఎండకు అలమటించిన వానిని నీటితో సంతోషపెట్టినట్లు వారిని ఆనందింపజేశాడు. మానవశ్రేష్ఠా! తెల్లటి పూలమాలికలతో విధి పూర్వకంగా అలంకృతమయిన నీ తండ్రి పురిటి ఇంటిలోనికి వేగంగా వెళ్ళాడు. మహాభుజా! ఆ పురిటింట అన్నిదిక్కులా నిండుకుండలను పెట్టారు. నేతితో తడిసిన తిందుక కాష్ఠాలు ప్రజ్వలిస్తున్నాయి. ఆవాలను చల్లారు. ధీరరాజా! ఆపురుటింటికి నాల్గువైపులా అగ్నిని ప్రజ్వలింపజేశారు. సేవించటానికి వచ్చిన వృద్ధస్త్రీలు ఆ స్థానాన్ని చుట్టుకొని ఉన్నారు. తమ తమ కర్తవ్యాలలో నిపుణులయిన వైద్యులు నలువైపుల సిద్ధంగా ఉన్నారు. తేజస్వి అయిన శ్రీకృష్ణుడు అక్కడ అన్నివైపులా రాక్షసనివారకాలయిన ద్రవ్యాలను నిపుణులయిన వారు ఏర్పరిచి ఉంచటం చూశాడు. నీతండ్రి జన్మించిన ఇంటిని ఈ రీతిగా అవసరమయిన వస్తువులతో అలంకరించటం చూసి శ్రీకృష్ణుడు సంతుష్టుడయి **బాగుంది** అని మెచ్చుకొన్నాడు. శ్రీకృష్ణుడు హర్షపూర్ణమయిన ముఖంతో ఇలా అంటున్నప్పుడు ద్రౌపది త్వరగా వెళ్ళి ఉత్తరతో ఇలా అన్నది. "కళ్యాణీ! నీకు మామవంటివాడు, అచింత్య స్వరూపుడు, పరాజయం పొందనివాడు, ప్రాచీన ఋషి అయిన మధుసూదనుడు నీ వద్దకు వస్తున్నాడు" అంది. ఈ మాటలు విన్న ఉత్తర

కన్నులు తుడుచుకొని దుఃఖించటం మానింది. తన శరీరం అంతా వస్త్రంతో కప్పుకొన్నది. శ్రీకృష్ణుడు భగవంతుడనే విశ్వాసం ఆమెకు ఉన్నది. ఆయన రావటం చూసి తపస్విని అయిన ఉత్తర వ్యథిత హృదయంతో డగ్గుత్తికతో ఇలా అన్నది.

'శ్రీకృష్ణా! మేము దంపతులం సంతాన హీనులం అయినాము. చూచావా! అభిమన్యుడు యుద్ధంలో హతుడు కాగా నేను పుత్రశోకహత నయ్యాను. మధుహంతా! తలవంచి నిన్ను ప్రార్థిస్తున్నాను. అశ్వత్థామ అస్త్రంతో దగ్ధుడయిన ఈ నా పుత్రుని బ్రతికించు. పుండరీకాక్షా! ధర్మరాజు గాని భీముడు గాని నీవు గాని 'ఈ గడ్డిపోచ ఈ శిశువు యొక్క అమాయిక మాతను చంపుగాక' అని అని ఉంటే నేను ఒక్కతెనే మరణించేదాన్ని. ఈ స్థితిలో ఈ అనర్థం జరిగేది కాదు. దుర్బుద్ధి అయిన ఆ ద్రోణపుత్రుడు గర్భంలో ఉన్న వీనిని బ్రహ్మాస్త్రంతో వధించినందువల్ల ఏమి ఫలం పొందాడు? శత్రునాశకుడయిన నిన్ను తలవంచి, నమస్కరించి, ప్రసన్నుని చేసుకొని యాచిస్తున్నాను. గోవిందా! వీడు బ్రతకకపోతే ప్రాణాలు వదలుతాను. నేను ఈ పిల్లవాడి మీద పెట్టుకొన్న ఆశలను అన్నింటినీ ద్రోణపుత్రుడు అశ్వత్థామ నాశనం చేశాడు. ఇంక నేను ఎందుకు బ్రతకాలి ? జనార్దనా! పిల్లవానిని ఒడిలో పెట్టుకొని సంతోషంతో మీకు నమస్కరించాలని కోరిక ఉండేది. కాని విధి దాన్ని వ్యర్థం చేసింది. చంచలనేత్రుడయిన అభిమన్యు పుత్రుడు బ్రహ్మాస్త్రంతో హతుడు కాగా నా మనస్సులో ఉన్న కోరికలు అన్నీ నిష్ఫలం అయ్యాయి. మధుసూదనా ! చంచలాక్షుడయిన అభిమన్యుడు, నీకు చాలా ఇష్టుడని విన్నాను. ఆయన పుత్రుడు బ్రహ్మాస్త్రం చేత హతుడయినాడు. వీడిని చూడు. ఈ పిల్లవాడు నిజంగా వీని తండ్రివలెనే కృతఘ్నుడు క్రూరుడు, అందువల్లనే పాండవ రాజ్యశ్రీని వదలి యమలోకానికి వెళ్ళాడు. కేశవా! వీరా! అభిమన్యూ! నీవు మరణిస్తే నీతో పాటు నేను స్వర్గానికి త్వరగానే వస్తాను అని యుద్ధభూమి వద్ద ప్రతిజ్ఞ చేశాను. కృష్ణా! క్రూరురాలిని. జీవితం మీద మమకారం వల్ల అలా చేయలేక పోయాను. ఇప్పుడు నేను అభిమన్యుని వద్దకు వెళ్ళితే ఆయన ఏమంటాడో కదా!'

69. ఉత్తరా విలాపము, శ్రీకృష్ణుడు మృతబాలుని బ్రతికించుట.

వైశంపాయనుడు చెప్పాడు - 'జనమేజయా! తపస్విని అయిన ఉత్తర పిచ్చిదానివలె ఇలా పలికి దయనీయయై పుత్రప్రేమతో నేలమీద పడిపోయింది. పుత్రరూపమయిన కుటుంబం హతం కాగా పడిపోయిన ఉత్తరను చూసి కుంతీదేవి దుఃఖార్తయై, ఎలుగెత్తి

ఏడ్చింది. ఆమెతో పాటు భరతవంశీయ స్త్రీలు విలపించారు. పాండవుల నివాసం ఒక్క క్షణకాలం ఆర్తస్వరాలతో ప్రతిధ్వనించి చూడరానిది అయింది. వీరా! రాజేంద్రా! పుత్రశోకంతో ఉత్తర మూర్ఛపోయింది. ఉత్తర తేరుకొని ఆ పిల్లవానిని ఒడిలోకి తీసుకొని మళ్ళీ ఇలా అన్నది. 'నాయనా! ధర్మం తెలిసినవాడి కుమారుడివై ఉండి కూడా వృష్ణివంశ మహావీరుడు శ్రీకృష్ణునికి నమస్కరించకపోవటం అధర్మం అని తెలుసుకోలేదా! పుత్రా ! నీవు స్వర్గంలో ఉన్న మీ నాన్న వద్దకు వెళ్ళి, నా మాటగా ఇలా చెప్పు. మహావీరా! మరణకాలం రాకుండా ప్రాణులు ఏ రీతిగాను మరణించలేరు. కాబట్టే భర్త, పుత్రుడు లేకపోయినా, మరణించవలసినా, ఎలాంటి మంగళాలు లేకుండా దరిద్రురాలినై బ్రతుకుతున్నాము. లేకపోతే ధర్మరాజు గారి ఆజ్ఞ తీసుకొని ఘోరమయిన విషాన్ని తింటాను. లేక అగ్నిలో దూకుతాను. అలాకాకపోయినా వత్సా! మానవునికి మరణించటం చాలా కష్టం అనిపిస్తుంది. భర్త, పుత్రుడు లేని నా గుండె నూరు వక్కలు కాలేదు గదా! నాయనా! లే! ఆర్తురాలు, అయిన మీ ముత్తవ్వ (కుంతీదేవి)ని చూడు. నీ కోసం ఈమె ఆర్తురాలై, వ్యధితయై, దీనురాలై శోక సముద్రంలో మునిగి ఉంది. చూడు. పుజ్యారాలు ద్రౌపదిని చూడు. మీ నాయనమ్మ సుభద్రను చూడు. వేటగాడు కొట్టిన లేడివలె తీవ్రంగా దుఃఖార్తనయిన నన్ను చూడు. నాయనా! లే ! జగన్నాధుడు, ధీమంతుడు అయిన శ్రీకృష్ణుని పద్మపత్రాలవంటి నయనాలు గల ఈ ముఖం చూడు. చంచలనేత్రుడయిన మీ తండ్రి ముఖం అచ్చంగా ఇలాగే ఉండేది.' ఈ విధంగా ఏడుస్తూ మళ్ళీ పడిపోయిన ఉత్తరను చూసి, ఆ స్త్రీలు అందరూ లేవదీశారు. లేచి ధైర్యంగా కూర్చున్న ఉత్తర దోసిలొగ్గి, కృష్ణునికి మళ్ళీ నేలమీద కూర్చొనే నమస్కరించింది.

పురుషశ్రేష్ఠుడయిన శ్రీకృష్ణుడు ఉత్తర దుఃఖాన్ని విని ఆ తరువాత ఆచమనం చేసి బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించాడు. నిర్మల మనస్కుడు స్వమహిమ నుండి చ్యుతుడు గాని శ్రీకృష్ణుడు ఆ బాలుని జీవింపజేయ ప్రతిజ్ఞ చేశాడు. సర్వజగత్తుకు వినిపిస్తూ ఇలా అన్నాడు. 'పుత్రీ! ఉత్తరా! నేను అసత్యం చెప్పను. నేను చేసిన ప్రతిజ్ఞ తప్పక నిజం అవుతుంది. దేహవంతులు అందరూ చూస్తుండగానే ఇప్పుడే ఈ బాలకుని బ్రతికిస్తాను. నేను ఇంతకుముందు ఆటల్లోనయినా అబద్ధం చెప్పలేదు. యుద్ధంలో ఎప్పుడూ వెనుదిరుగ లేదు. ఈ శక్తి ప్రభావం వలన ఈ బాలుడు జీవించు గాక. నాకు ధర్మం, బ్రాహ్మణులు విశేషంగా ప్రియులు అయితే పుడుతూనే మరణించిన ఈ అభిమన్యు పుత్రుడు జీవించుగాక. అర్జునునితో ఎప్పుడయినా విరోధించానేమో గుర్తు లేదు. ఈ సత్యం

ప్రభావంతో మృతుడయిన ఈ బాలుడు జీవించుగాక. సత్యం, ధర్మం నిరంతరం నాలో స్థిరంగా ఉంటే అభిమన్యు కుమారుడు, మృతుడు అయిన ఈ శిశువు జీవించుగాక. కంసుని, కేశిని నేను ధర్మానుసారం చంపి ఉంటే ఆ సత్యంతో ఈ బాలుడు బ్రతుకుగాక.' ఈ రీతిగా శ్రీకృష్ణుడు అనగా ఆ బాలునిలో చేతన కలిగింది. ఆ శిశువు మెల్లమెల్లగా హస్తాదులయిన అవయవాలు కదిలించసాగాడు.'

70. పాండవులు హస్తినా పురమునకు వచ్చుట.

వైశంపాయనుడు చెప్పాడు - 'రాజా! శ్రీకృష్ణుడు బ్రహ్మాస్త్రాన్ని శాంతింపజేయగానే ఆ పురిటిల్లు నీ తండ్రి తేజస్సుతో దేదీప్యమానం అయింది. అప్పుడు బాలకులను సంహరించే సమస్తరాక్షసులు ఆ ఇంటిని వదలివెళ్ళారు. కేశవా! బాగు బాగు, అని ఆకాశంలోనుంచి ఒక వాక్కు వినిపించింది. నరేంద్రా! జ్వలించే ఆ అస్త్రం బ్రహ్మదేవుని చేరింది. అప్పుడు మీ తండ్రి పునర్జీవితు డయ్యాడు. తరువాత బాలుడు బలానుసారం తగిన ఉత్సాహంతో కాళ్ళుచేతులు కదలించసాగాడు. రాజా ! అప్పుడు భరతవంశీయ స్త్రీలు చాలా ఆనందించారు. శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారం వారు బ్రాహ్మణుల చేత స్వస్తివాచనం చేయించారు. సంతోషపూర్ణులయిన ఆ స్త్రీలు శ్రీకృష్ణుని ప్రశంసించారు. నదిని దాటేవారు నావ దొరికితే సంతోషించినట్లు భరత వంశీయుల భార్యలు కుంతి, ద్రౌపది, సుభద్ర, ఉత్తర ఇంకా ఇతర స్త్రీలు మనస్సులలో ఆనందపడ్డారు. తరువాత మల్లులు, నటులు, జ్యోతిష్కులు, 'సుఖంగా ఉన్నారా' అని పరిశీలించే సేవకులు, సూతులు, మాగధుల సమూహాలు కురువంశ స్తోత్రంతో పాటు ఆశీస్సులను ఇస్తూ, శ్రీకృష్ణుని ప్రశంసించారు. ఉత్తర ఆనందంతో తగిన సమయంలో లేచి, యదునందనుడయిన శ్రీకృష్ణునికి పుత్రుని తీసుకొని, నమస్కరించింది. శ్రీకృష్ణుడు సంతోషంతో విశేషంగా అనేక రత్నాలను ఇచ్చాడు. ఇరత యాదవులు బహుమతులు ఇచ్చారు. మహారాజా! సత్యవాక్కు అయిన జనార్దనుడు నీ తండ్రికి నామకరణం చేశాడు. 'కౌరవ వంశం క్షీణిస్తుంటే ఈ అభిమన్యు కుమారుడు జనించటం వల్ల ఈ పిల్లవానికి పరిక్షిత్తు అనే పేరు కలుగుతుంది' అని చెప్పాడు. ఇలా నామకరణం అయిన తరువాత నీ తండ్రి కాలక్రమాన పెరగసాగాడు. ఆయన సర్వజనులకు ఆనందకారకు డయ్యాడు.

భారతా! మీ తండ్రి పుట్టిన తరువాత ఒకనెలకాగా అప్పుడు పాండవులు సమృద్ధిగా రత్నాలు తీసుకొని వచ్చారు. పాండవులు నగరాన్ని సమీపించారని తెలియగానే

యాదవులు వారికి ఎదురువెళ్ళారు. రాజపురుషులు హస్తినాపురాన్ని అనేక పూలమాలికల సమూహంతో, రంగురంగుల జెండాలతో, నానావిధ ధ్వజాలతోను అలంకరించారు. నరనాథా ! నగరవాసులు తమతమ గృహాలను అలంకరించారు. విదురుడు పాండవులకు సంతోషకరంగా 'దేవాలయాల్లో నానావిధ పూజలు చేయాలి' అని ఆజ్ఞాపించాడు. అక్కడి రాజవీధులను అన్నింటిని పూలతో అలంకరించారు. నర్తకుల నృత్యాలతో, గాయకుల గాన రవాలతో ఆ నగరంలో సముద్ర ఘోషవలె కలకలం ఏర్పడింది. రాజా! ఆ సమయంలో ఆ నగరం కుబేరుని అలకా పురంలాగా కన్పించసాగింది. అక్కడ అన్నివైపులా ఏకాంత ప్రదేశాల్లో స్త్రీలతో వందులు నిలిచి ఉన్నారు. అందువల్ల ఆ పట్టణ శోభ ఇనుమడించింది. ఆ సమయంలో గాలి బాగా వీచటం వల్ల జెండాలు రెపరెపలాడాయి. అవి దక్షిణ ఉత్తర కురుదేశాల శోభను చూపిస్తున్నట్లు ఉన్నాయి. "రాజకార్యభారం వహించే పురుషులు ఇవ్వాళ దేశం అంతటా ఉత్సవాలు నిర్వహించాలి. జనులందరు రత్నభూషణాలు, ఉత్తమాలంకారాలు ధరించి, ఈ ఉత్సవంలో పాల్గొనాలి" అని చాటించారు.

71. వ్యాస శ్రీకృష్ణులు యజ్ఞము చేయుమని యుధిష్ఠిరుని ఆజ్ఞాపించుట.

వైశంపాయనుడు చెప్పాడు - 'జనమేజయా! పాండవులు సమీపానికి వచ్చారని విన్న శ్రీకృష్ణుడు అమాత్యులతో, మిత్రులతో వారిని కలవటానికి వెళ్ళాడు. వారు కలిసి న్యాయానుసారం పాండవులను చూడదలచి ఎదురువెళ్ళారు. పాండవులు కూడా ధర్మానుసారం యాదవులతో కలిసి హస్తినాపురంలోకి ప్రవేశించారు. ఆ మహా సైన్యంలో అశ్వాదుల గిట్టల తాకిడి వల్ల కలిగిన, బండి చక్రాల రాపిడివల్ల కలిగిన మహాధ్వనితో భూమి, అంతరిక్షం, ఆకాశం సమస్తం నిండింది. సంతుష్టులయిన పాండవులు అమాత్యులతో, మిత్రగణాలతో కలిసి ధనకోశాలను ముందుంచుకొని తమ నగరం ప్రవేశించారు. వారందరు కలిసి ధృతరాష్ట్రమహారాజు వద్దకు సంతోషంగా వెళ్ళి, తమ పేర్లు చెప్పుకొంటూ ఆయన పాదాలు పట్టుకొని, నమస్కరించారు. తరువాత వారు సుబల పుత్రిక గాంధారికి, అలాగే కుంతీదేవికి నమస్కరించారు. విదురుని పూజించారు. యుయుత్సుని కలిసి, ఆతని పూజలందుకొంటూ ఆ పాండవులు విలసిల్లారు. భారతా! ఆ తరువాత పరమాశ్చర్యకరమూ, విచిత్రమూ, పరమాద్భుతమూ అయిన మీ తండ్రి జన్మవృత్తాంతం విన్నారు. మహా మేధావి, శ్రీకృష్ణుడు చేసిన పనిని విని, పూజ్యుడు అయిన శ్రీకృష్ణుని పూజించారు.

తరువాత కొన్ని రోజులకు మహాతేజస్వి, సత్యవతీ కుమారుడు అయిన వ్యాసుడు హస్తినాపురానికి వచ్చాడు. ఆ మహర్షిని కురువంశశ్రేష్ఠులు సముచిత రీతిగా పూజించారు. వృష్ణి అంధక వీరశ్రేష్ఠులతో పాండవులు ఆయనను సేవిస్తూ కూర్చున్నారు. అక్కడ అనేక విషయాలను చెప్పిన తరువాత ధర్మపుత్రుడు యుధిష్ఠిరుడు వ్యాసమహర్షితో ఇలా అన్నాడు.

'మహాత్మా! మీ అనుగ్రహ విశేషం వల్ల మేము ఈ రత్నాదులను తెచ్చాం. దీన్ని అంతను అశ్వమేధ మహాయజ్ఞంలో ఉపయోగించగోరుతున్నాను. ఆ యాగం చేయటానికి మీ అనుమతి కోరుతున్నాను. మేము అందరము మీకు, మహాత్ముడయిన శ్రీకృష్ణునికి అధీనులం.' వ్యాసమహర్షి అన్నారు - 'రాజా! నిన్ను అనుమతిస్తున్నాను. తరువాత చేయవలసింది చెయ్యి. సమృద్ధ దక్షిణలతో అశ్వమేధయాగం యథావిధిగా నిర్వర్తించు. రాజేంద్రా! అశ్వమేధం సర్వపాపాలను పోగొట్టి పవిత్రం చేస్తుంది. ఆ యజ్ఞం చేసి, నీవు సర్వపాపవిముక్తిడివి అవుతావు. ఇందులో సందేహం లేదు.' ఆయన ఇలా చెప్పిన తరువాత యుధిష్ఠిరుడు అశ్వమేధం చేయ నిశ్చయించుకొన్నాడు. శ్రీకృష్ణద్వైపాయన వ్యాసుని నుండి అన్ని విషయాలలో అనుమతి తీసుకొని, యుధిష్ఠిరుడు హసుదేవుని సమీపించి, ఇలా అన్నాడు. 'పురుషశ్రేష్ఠా! నీ చేత దేవకీ దేవి సత్సంతానవతి అయింది. ఇక్కడ నేను చెప్పేది చేయగోరుతున్నాను. యదునందనా! నీ ప్రభావంతో సంపాదితమయిన భోగాలను అనుభవిస్తున్నాం. పరాక్రమంతో మేధాసంపదతో నీవు ఈ భూమండలాన్ని జయించావు. నీవే మాకు పరమ ఆచార్యుడవు. కాబట్టి నీవే యజ్ఞదీక్షను వహించు. నీవు యజ్ఞం చేస్తే నేను పాపరహితుడిని అవుతాను. నీవే యజ్ఞం, అక్షరుడివి, సమస్తం, ధర్మం, ప్రజాపతి, నీవే సర్వప్రాణులకు దిక్కు అని నా దృఢమనోనిశ్చయం.' శ్రీకృష్ణుడు అన్నాడు - 'నీవే సమస్తానికి దిక్కు అని నా దృఢమనో నిశ్చయం అని చెప్పదగినవాడివి నీవే. రాజా! సమస్త కురువీరులలో నీవు ఒక్కడివి మాత్రమే ధర్మంతో విరాజిల్లుతున్నావు. మేమందరం నీకు అనుయాయులం. నీవే మాకు రాజువు, గురువువు అని మా ఉద్దేశ్యం. భారతా! నా అనుజ్ఞతో నీవు ఈ యాగం చేయి. నీవే ఈ యజ్ఞ ఫలం పొందాలి. మేము ఏయే పనులు చేయాలనుకుంటున్నావో వాటిల్లో మమ్ములను నియోగించు. అనఘా! నిజంగా నిన్ను అనుమతిస్తున్నాను. నేను చేయవలసినది అంతా చేస్తాను. మహారాజువయిన నీవు ఈ యాగం చేస్తే భీమసేనుడు, అర్జునుడు, నకుల సహదేవులు ఈ యాగం చేసినవారే అవుతారు.'

72. యజ్ఞ సామగ్రి సంపాదించుట.

కృష్ణుడు ఇలా చెప్పగా యుధిష్ఠిరుడు వ్యాసుని సంబోధించి ఇలా అన్నాడు. 'మహర్షీ! అశ్వమేధ యాగం చేయవలసిన కాలం నీకు తెలుసు. నా యజ్ఞం మీ అధీనంలో ఉంది. తగిన సమయంలో నన్ను దీక్షితుని చేయగోరుతాను.' వ్యాసమహర్షి అన్నాడు - 'కుంతీపుత్రా! నేను, పైలుడు, యాజ్ఞవల్క్యుడు మేము అందరం వచ్చి యజ్ఞ సమయం ఆసన్నమయినప్పుడు నీ యజ్ఞవిధానాన్ని చక్కగా సుసంపన్నం చేస్తాం. సందేహం లేదు. చైత్రమాసంలో నీ యజ్ఞ దీక్ష జరుగుతుంది. కాబట్టి యజ్ఞానికి అవసరమయిన సామగ్రిని అంతను అప్పటిలోపల సమకూర్చుకొనవలసింది. అశ్వవిద్య తెలిసిన సూతులు, బ్రాహ్మణులు యజ్ఞార్థసిద్ధికోసం పవిత్రాశ్వాన్ని పరీక్షించాలి. యజ్ఞానికి ఎన్నుకొన్న అశ్వాన్ని శాస్త్రానుసారం వదలిపెట్టు. అది దీప్తిమంతమయిన నీ యజ్ఞ యశస్సును విస్తరింపజేస్తూ సముద్ర పర్యంతమయిన భూమండలాన్ని చుట్టి రావాలి.'

వైశంపాయనుడు చెప్పాడు - 'రాజేంద్రా! వ్యాసుడు ఇలా చెప్పగా రాజయిన పాండునందనుడు సరే ! అని, వ్యాసమహర్షి మాటప్రకారం అన్ని పనులు పూర్తిచేశాడు. రాజేంద్రా! ఆయన మనస్సులో సంకల్పించిన వస్తువులను అన్నింటిని యుధిష్ఠిర మహారాజు వ్యాస మహర్షికి నివేదించాడు. అంతట మహాతేజస్వి అయిన వ్యాసమహర్షి ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'రాజా! మేము అందరం ఉత్తమయోగం కలిగినప్పుడు నీకు దీక్ష ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాం. కురునందనా! ఈ లోపల నీవు బంగారంతో చేసిన స్రుగ్, కూర్చ తయారు చేయించు. ఇంకా కావలసిన సువర్ణమయ వస్తువులను కూడా సిద్ధం చేయించు. ఇవ్వాళనే శాస్త్ర విధిని అనుసరించి, యజ్ఞాశ్వాన్ని క్రమంగా సమస్తభూమండలాన్ని చుట్టి రావటానికి వదలాలి. అది అన్నిదిక్కులా స్వేచ్ఛగా సంచరించటానికి తగిన ఏర్పాట్లను అన్నింటినీ చెయ్యాలి.' యుధిష్ఠిరుడు చెప్పాడు - 'బ్రహ్మర్షీ! దీన్ని ఎలా వదలాలో, ఎలా భూమండలం అంతా తిరిగి రావాలో దానికి తగిన విధానం మీరే చేయండి. భూమండలం మీద స్వేచ్ఛగా సంచరించే దీని రక్షణకు ఎవరిని పంపాలో మీరే చెప్పాలి.' ఇలా అడగగా వ్యాసమహర్షి ఇలా చెప్పాడు. 'అర్జునుడు ధనుర్ధారులందరిలో శ్రేష్ఠుడు, జయశాలి, సహనం గలవాడు. తాను ఈ అశ్వాన్ని రక్షిస్తాడు. నివాతకవచులనే రాక్షసులను అంతం చేసిన ఆతడు భూమిని జయించటానికి సమర్థుడు. ఆతని అస్త్రాలు, కవచం, ధనుస్సు, అమ్ములపొదులు దివ్యమయినవి. ఆతడు దీని వెంట వెళ్తాడు. రాజా! ఆతడు ధర్మవిషయాల్లో, అర్థవిషయాల్లో నిపుణుడు. అన్ని విద్యలలో ఆరితేరినవాడు. శాస్త్రవిధానాన్ని అనుసరించి

ఆతడు నీయజ్ఞాశ్వాన్ని సంచరింపజేస్తాడు. అభిమన్యుని తండ్రి వీరుడు అయిన అర్జునుడు దీన్ని రక్షిస్తాడు. నరనాథా! కుంతీపుత్రుడు, మహాపరాక్రమవంతుడు, తేజోవంతుడు అయిన భీమసేనుడు, నకులుడు రాజ్యరక్షణకు సమర్థులు. కురువంశీయా! బుద్ధిమంతుడు, సహదేవుడు కుటుంబరక్షణ విషయాలను అన్నింటిని పర్యవేక్షిస్తాడు.' వ్యాసమహర్షి! ఇలా చెప్పగా కురుకులాలంకారమయిన యుధిష్ఠిరుడు సమస్తకార్యాలను యథోచితంగా నిర్వర్తించాడు. అర్జునుని పిలిచి అశ్వరక్షణకు ఇలా ఆదేశించాడు.

"వీరా! అర్జునా! ఇటురా! ఈ అశ్వరక్షణ చేయి. దీన్ని నీవు తప్ప ఇంకొక మానవుడు రక్షింపనర్హుడు కాడు. మహాబాహూ! నిన్ను ఎదిరించే రాజులతో వీలయినంత వరకు యుద్ధం చేయవలసిన అవసరం లేకుండా ఉండేటట్లు చూడు. మహాబాహూ! నీవు ఆ రాజులు అందరికి ఇది నా యజ్ఞం అని చెప్పు. ఈయజ్ఞానికి తగిన సమయంలో దయచేయవలసింది అని వారికి అందరిని తెలియజెయ్యి." ధర్మాత్ముడయిన ఆయన సోదరుడు అర్జునునితో ఇలా చెప్పి, భీముని నకులుని నగర రక్షణకు నియోగించాడు. తరువాత ధృతరాష్ట్ర మహారాజు సమ్మతి తీసుకొని, యుధిష్ఠిరుడు యోద్ధలకు అధిపతి అయిన సహదేవుని కుటుంబ రక్షణకార్యంలో నియోగించాడు.

73. ససైన్యుడై అర్జునుడు అశ్వము వెంటపోవుట.

దీక్షాకాలం సమీపించినప్పుడు వ్యాసాదులయిన మహా ఋత్విక్కులు యుధిష్ఠిర మహారాజుకు అశ్వమేధ యజ్ఞదీక్షనిచ్చారు. పశుబంధకార్యాన్నిచేసి, దీక్షితుడయిన ధర్మరాజు ఋత్విక్కులతో పాటు శోభిల్లాడు. వ్యాసమహర్షి అశ్వమేధయజ్ఞానికి నిర్ణీతమయిన అశ్వాన్ని స్వయంగానే శాస్త్రీయ విధిని అనుసరించి, వదిలాడు. రాజా! యజ్ఞదీక్షితుడయిన ధర్మరాజు సువర్ణ మాలికను, బంగరు కంటెను దాల్చి, ప్రజ్వలిస్తున్న అగ్నివలె విలసిల్లాడు. కృష్ణాజినం, చేతిలో దండం, పట్టుబట్ట ధరించిన ధర్మతనూభవుడు యజ్ఞంలో ప్రజాపతివలె తేజస్సుతో వెలిగాడు. నరేంద్రా! అలాగే ఋత్విక్కులు అందరు సమాన వేషధారులయినారు. అర్జునుడు ప్రజ్వలిస్తున్న అగ్నిలాగా వెలిగాడు. అర్జునుడు ధర్మరాజు ఆజ్ఞానుసారం ఆ యజ్ఞీయాశ్వాన్ని విధి పూర్వకంగా అనుసరించాడు. రాజా! చేతివ్రేళ్ళకు ఉడుము చర్మపు కవచం గల అర్జునుడు గాండివాన్ని ఊపుతూ సంతోషంతో ఆ అశ్వాన్ని అనుసరించాడు. బయలుదేరి వెళ్ళుతున్న కురుశ్రేష్ఠు డయిన అర్జునుని చూడటానికి పిల్లలనుంచి పెద్దలవరకు హస్తినాపుర ప్రజలు వచ్చారు. యజ్ఞాశ్వాన్ని, దానివెంట వెళ్ళే అర్జునుని చూడవలెననే

కోరికతో వచ్చిన జనం పరస్పరం తోసుకోవటం వల్ల వారి శరీరాలు చెమటపట్టాయి. అర్జునుని చూస్తున్న జనం చేస్తున్న హర్షధ్వానాల ధ్వని ఆకాశాన్ని, దిక్కులను పూరించింది. ఇదిగో చూడండి! తేజోవంతమయిన యజ్ఞాశ్వం వెళ్తున్నది. దానివెంట మహాబాహువయిన అర్జునుడు ఉత్తమధనుస్సును ధరించి వెళ్తున్నాడు.

ఉదారబుద్ధి అయిన అర్జునుడు పౌరజనులు అంటున్న ఈ మాటలు విన్నాడు. "భరతనందనా! నీకు మేలు కలుగుగాక. క్షేమంగా వెళ్ళిరా!" ఇంక కొందరు మనుష్యులు "ఈజనసమ్మర్దంలో అర్జునుడూ కన్పట్టంలేదు. ఆయన ధనుస్సు కన్పడటం లేదు. అయినా భయంకరమయిన గాండివ ధనుస్సు ధ్వని ఇదిగో వింటున్నాం. అర్జునునకు మేలు కలుగుగాక. ఆయనకు మార్గమధ్యంలో ఎలాంటి ఆపద కలుగకుండుగాక. తిరిగివచ్చిన తరువాత ఈయనను చూస్తాం. తప్పకుండా తిరిగి వస్తాడు." అని అన్నారు. ఈ రీతిగా పలుకుతున్న స్త్రీ పురుషులు మధురమయిన మాటలను ఉదారబుద్ధి అయిన అర్జునుడు విన్నాడు. యజ్ఞక్రియలు బాగా తెలిసి, వేదాలలో పారంగతుడయిన యాజ్ఞవల్క్యుని శిష్యుడు విఘ్నశాంతి కోసం అర్జునునితో కూడా వెళ్ళాడు. ధర్మరాజు ఆజ్ఞానుసారం వేదపారంగతులయిన అనేక బ్రాహ్మణులు, క్షత్రియులు అర్జునుని వెంట విధి పూర్వకంగా వెళ్ళారు. శ్రేష్ఠ మహీపాలా! పాండవులు అస్త్ర తేజస్సుతో జయించిన సమస్త దేశాలలో ఆ యజ్ఞాశ్వం సంచరించింది. ఆ దేశాలలో అర్జునుడు చేసిన మహత్తర, విచిత్ర యుద్ధ వృత్తాంతాలను నీకు చెపుతాను విను. ఆ గుర్రం భూమికి ప్రదక్షిణంగా సంచరించింది. ఆ విషయం విను. ఆ అశ్వశ్రేష్ఠం అనేక రాజుల రాజ్యాలను మర్దిస్తూ మొట్టమొదట ఉత్తర దిక్కుకు వెళ్ళింది. శ్వేతవాహనుడు, మహారథుడు అయిన అర్జునుడు దానివెంట మెల్లమెల్లగా వెళ్ళాడు. మహారాజా! భారత యుద్ధంలో హతులయిన క్షత్రియుల బంధువులు అర్జునునితో యుద్ధం చేశారు. ఆ వేలకొలది రాజులసంఖ్య ఇంత అని లెక్కవేయలేం. రాజా! మహాభారత యుద్ధంలో ఓడిపోయిన ఖడ్గ ధనుర్ధారులయిన కిరాతులు, యవనులు, మ్లేచ్ఛులు అందరు అర్జునుని ఎదిరించారు. యుద్ధదుర్మదులు, హృష్టపుష్ట నరులు, వాహనాలు గల ఆర్య రాజులు అర్జునుని ఎదుర్కొన్నారు. భూపతీ! ఈ రీతిగా నానా దేశాలనుంచి వచ్చిన రాజులతో అర్జునునికి యుద్ధాలు అనేకం జరిగాయి. పూతాత్మా! రాజా! రెండుపక్షాల యోధులకు చాలా శ్రమ సాధ్యాలయిన అర్జునుని మహా యుద్ధాలను నీకు చెపుతాను.'

74. అర్జునుడు త్రిగర్తులను జయించుట.

వైశంపాయనుడు చెప్పాడు - 'జనమేజయా! కురుక్షేత్రయుద్ధంలో త్రిగర్త వీరులు హతులయ్యారు. వారి పుత్రులు, పౌత్రులు అర్జునునితో వైరం పెట్టుకొన్నారు. త్రిగర్త దేశంలో ప్రవేశించిన అర్జునునికి వారితో యుద్ధం జరిగింది. ధర్మజుని అశ్వమేధాశ్వం తమదేశం సరిహద్దులలోకి వచ్చిందని తెలుసుకొని ఆ వీరులు, రథికులు అమ్ముల పొదులు కట్టుకొన్నవారు, కవచధారులు బాగా అలంకరించిన ఉత్తమాశ్వాలతో గూడి, చుట్టుముట్టి, ఆ అశ్వాన్ని పట్టుకొన యత్నించారు. అప్పుడు అర్జునుడు వారు చేయదలచుకొన్నది తెలుసుకొన్నాడు. ఆ వీరులకు శాంతి పూర్వకంగా చెపుతూ యుద్ధం కాకుండటానికి ప్రయత్నించాడు. తమోగుణ రజోగుణాలతో కప్పబడి, ఆ త్రిగర్తులు ఆయన మాటలను పెడచెవిన పెట్టి, బాణాలు ప్రయోగించారు. అర్జునుడు వాటిని ధ్వంసం చేశాడు. భారతా! అప్పుడు అర్జునుడు నవ్వుతూ వారితో ఇలా అన్నాడు. 'ధర్మం తెలియని పాపాత్ములారా! వెనుదిరిగి వెళ్ళండి ! జీవిత రక్షణమే మీకు మేలు అవుతుంది. బయలుదేరేటప్పుడు ధర్మరాజు అయిన యుధిష్ఠిరుడు, 'అర్జునా! బంధువులు మరణించి ఉన్నవారిని చంపదగదు.' అని వారించాడు. అందువల్ల అర్జునుడు ఇలా ప్రవర్తించాడు. ధీమంతుడయిన ధర్మరాజు మాటలు అంగీకరించి ఉండటంవల్ల త్రిగర్తులను వెనుదిరిగి పొండు అని చెప్పాడు. కాని వారు వెనుదిరుగలేదు. అప్పుడు ధనంజయుడు త్రిగర్త రాజయిన సూర్యవర్మను యుద్ధంలో బాణసమూహ ప్రయోగంతో ఓడించి, పెద్దగా నవ్వాడు. అప్పుడు త్రిగర్తులు రథఘోషతో, చక్రాల ధ్వనులతో సర్వ దిక్కులను పూరిస్తూ, అర్జునుని మీదికి వచ్చారు. రాజేంద్రా! సూర్యవర్మ తన అస్త్ర నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ వంగిన కణుపులు గల అనేక బాణాలను అర్జునుని మీద వేశాడు. అలాగే ఆ రాజు అనుయాయులయిన మహాధానుష్కులు, ఇతరులు అర్జునుని వధింపగోరి బాణవర్షం కురిపించారు. అర్జునుడు అల్లెత్రాటి నుంచి వదలిన అనేక బాణాలతో అనంతమయిన వారి బాణ సమూహాన్ని ఛేదించాడు. ఆ బాణాలు నేలమీద పడ్డాయి. ఆ సూర్యవర్మ తమ్ముడు తేజస్వి, యువకుడయిన కేతువర్మ అన్నకు బదులుగా అర్జునునితో యుద్ధం చేశాడు. అర్జునుడు తన మీదికి వస్తున్న ఆతనిని చూశాడు. పదునయిన బాణాలు వేసి ఆతనిని అర్జునుడు సంహరించాడు.

కేతువర్మ మరణించగా మహారథుడయిన ధృతవర్మ రథం మీద వేగంగా అక్కడకు దూకి, అర్జునుని బాణాలతో ముంచేశాడు. మహాతేజస్వి అయిన అర్జునుడు

బాలుడయిన ధృతవర్మ బాణవేగాన్ని చూసి, బాగా సంతోషించాడు. అతడు బాణాలు సంధించటం కాని తీసుకోవటం గాని అర్జునునికి కన్పించలేదు. కాని కేవలం బాణాలు వేయటమే చూశాడు. ఆయన యుద్ధభూమిలో కొంత సేపు మనస్సులోనే ధృతవర్మను మెచ్చుకొన్నాడు. యుద్ధంలో ఆతని హర్షోత్సాహాలను పెంపొందిస్తూ ఉన్నాడు. పాములె కుపితుడయిన ధృతవర్మతో మహాబాహువు అయిన కురువీరుడు నవ్వుతూ సంతోషంతో యుద్ధం చేశాడు కాని ఆతన్ని సంహరించలేదు. అర్జునుడు అలా రక్షిస్తుండగా ధృతవర్మ అర్జునునిమీద తేజోవంతమయిన ఒక బాణం వేశాడు. ఆ బాణం వేగంగావచ్చి అర్జునుని చేతిని గాయపరిచింది. మూర్ఛనందిన ఆయన గాండీవాన్ని వదలాడు. అది నేల మీద పడింది. అర్జునుని చేతినుంచి పడుతున్న ఆ ధనుస్సు రూపం ఇంద్ర ధనుస్సులాగా ఉంది. ఆ దివ్యమయిన మహాధనుస్సు నేలపడగా మహా యుద్ధరంగంలో రాజపుత్రుడయిన ధృతవర్మ పెద్ద ధ్వనితో నవ్వాడు. ఇందువల్ల అర్జునునికి రోషం పెంపొందింది. ఆయన చేతి రక్తాన్ని తుడుచుకొని, దివ్యమయిన ఆ ధనుస్సు తీసుకొని, బాణవర్షం కురిపించాడు. అప్పుడు అర్జునుని పరాక్రమాన్ని ప్రశంసిస్తూ, నానావిధ ప్రాణులు చేసిన కోలాహల శబ్దం ఆకాశం అంటింది. కాలునివలె, అంతకుని వలె కుపితుడయిన అర్జునుని చూసి, త్రిగర్త యోధులు నాలుగు దిక్కులనుంచి వచ్చి చుట్టుముట్టారు. అలా సమీపించిన వారు, ధృతవర్మను రక్షించటానికి అర్జునుని చుట్టుముట్టారు. అందుకు ధనంజయుడు క్రుద్ధుడయ్యాడు. అంతట ఆయన వజ్రాయుధ సమమయిన ఇనుపములుకులు గల అనేక బాణాలతో వారిలో పదునెనిమిది మంది యోధులను సంహరించాడు. వారు చెల్లాచెదరు కావటం చూసి, అర్జునుడు అట్టహాసం చేస్తూ, పాము ఆకారం గల బాణాలతో వారిని కొట్టసాగాడు. రాజా! అర్జునుని బాణాలతో గాయపడిన త్రిగర్త మహారథులు అందరికి యుద్ధోత్సాహం నశించింది. అందువల్ల నాలుగు దిక్కులకు పారిపోయారు. సంశప్తకులను నాశనం చేసిన పురుష శ్రేష్ఠుడయిన ఆయనతో వారు అనేకులు "అర్జునా! మేము అందరం నీవశమయినాం. నీ సేవకులం పార్థా! వినీతులం. నీ సేవకు సిద్ధంగా ఉన్న మమ్ములను ఆజ్ఞాపించు. నీకు ఇష్టమయినది అంతా చేస్తాం." వారి ఈ మాటలు విన్న అర్జునుడు "రాజులారా! మీ ప్రాణాలు రక్షించుకోండి. నా ఆజ్ఞను పాలించటమే అందుకు తగిన ఉపాయం" అని అన్నాడు.

75. అర్జునునికి వజ్రదత్తునితో యుద్ధము.

అశ్వమేధాశ్వం ప్రాగ్జ్యోతిషానికి వచ్చి, అక్కడ సంచరించసాగింది. అక్కడ భగదత్త పుత్రుడు వజ్రదత్తుడు ఆ రాజ్యాన్ని పాలిస్తున్నాడు. భరతశ్రేష్ఠా! యుధిష్ఠిరుని అశ్వమేధాశ్వం తన దేశపు పొలిమేరలలోకి వచ్చిందని ఆతడు విన్నాడు. నగరం నుంచి బయటకు వచ్చిన భగదత్త మహారాజు యుద్ధానికి సిద్ధమయ్యాడు. భగదత్త సుతుడయిన ఆ రాజు ఎదురుగా వస్తున్న అశ్వాన్ని బలవంతంగా పట్టుకొని నగరం వైపు వెళ్ళాడు. అర్జునుడు అది చూసి, గాండీవ ధనుష్టంకారం చేస్తూ, వేగంగా ఆతని వెంటనంటాడు. అప్పుడు గాండీవంనుంచి వచ్చి తగిలిన బాణాలతో మోహితుడయిన ఆ రాజు అశ్వాన్ని వదలిపెట్టి, నగరంలో ప్రవేశించి, కవచం ధరించాడు. ఆ రాజోత్తముడు గజరాజాన్ని ఎక్కి, నగరంలోనుంచి బయటకు వచ్చి, అర్జునుని ఎదుర్కొన సిద్ధమయినాడు. ఆ మహారథునికి శిరస్సుపైన తెల్లని గొడుగు ఉన్నది. తెల్లని వింజామర సేవకులు వీస్తున్నారు. ఆతడు బాల్యం వలన, అజ్ఞానం వలన పాండవ మహారథుడయిన అర్జునుని సమీపించాడు. అర్జునుని సమరానికి పిలిచాడు. ఆ వజ్రదత్తుడు క్రోధపూర్ణుడయి శ్వేతవాహనుడయిన అర్జునుని వైపు పర్వతంలాగా విశాల శరీరంగల్గి, గండస్థలం నించి మదధారలు స్రవిస్తున్న తన ఏనుగును తోలించాడు. అది మహా మేఘంలాగా మదధారలను కారుస్తున్నది. శత్రువుల ఏనుగును నిలువరించగలదు. శాస్త్రానుసారం దాన్ని యుద్ధానికి సిద్ధం చేశారు. అది ప్రభువుకు అధీనంలో ఉండేది, యుద్ధంలో నివారింప వీలుగానిది.

వజ్రదత్తుడు అంకుశంతో పొడి, బలిష్ఠమయిన ఆ ఏనుగును ముందుకు పోవటానికి ప్రేరేపించగా, అది ఆకాశంలో ఎగురుతున్నట్లు ముందుకు దూకింది. తన మీదికి దూకుతున్న ఆ ఏనుగును చూసి, అర్జునుడు క్రుద్ధుడయినాడు. ఆయన నేలమీదనే ఉండి ఏనుగు మీదున్న వజ్రదత్తునితో యుద్ధం చేశాడు. అప్పుడు క్రుద్ధుడయిన వజ్రదత్తుడు మిడుతలలాగా వేగంగల్గి, అగ్నిలాగా మండుతున్న తోమరా లనే ఆయుధాలను అర్జునుని మీదికి వేగంగా వదిలాడు. ఆకాశంలో వస్తూ తన వద్దకు ఆ తోమరాలు రాకముందే గాండీవంలోనుంచి విముక్తాలయిన బాణాలతో ఆకాశంలోనే వాటిని రెండు, మూడు ముక్కలు చేశాడు. భగదత్తకుమారుడు తానువేసిన తోమరాలు ముక్కలు కావటం చూసి, పాండునందనుని మీద బాణాలు నిరంతరంగా వేశాడు. అప్పుడు క్రుద్ధుడయిన అర్జునుడు బంగారు పుంఖాలు గలవై, సూటిగాపోయే బాణాలను అంతకంటే వేగంగా భగదత్తకుమారుని మీద వేశాడు. ఆ బాణాలు చాలా తీవ్రంగా తగలటం వల్ల మహాతేజస్వి

అయిన వజ్రదత్తుడు బాగా గాయపడి ఆ మహాయుద్ధంలో నేలమీద పడ్డాడు. అయినా ఆతడు స్మృతి తప్పలేదు. తరువాత ఆతడు మళ్ళీ ఏనుగునెక్కి యుద్ధంలో కలత చెందక జయకాంక్షి అయి అర్జునుని వైపు ఆ ఏనుగును తోలాడు. అప్పుడు అర్జునుడు కుపితుడయి కుబుసం విడిచిన పాములవంటి, మండుతున్న అగ్ని జ్వాలల వంటి బాణాలను ఆ ఏనుగు మీద ప్రయోగించాడు. ఆ బాణాలు బాగా తగలటం చేత గాయపడిన గజరాజం రక్తం కారుతుండగా వర్షధారలు పడటం వల్ల ఎర్రని గైరికాది ధాతువులతో గూడిన మహాపర్వతం లాగా ఉంది.'

76. అర్జునుడు వజ్రదత్తుని జయించుట.

వైశంపాయనుడు చెప్పాడు – 'భరతశ్రేష్ఠా! ఈ విధంగా వజ్రదత్తునితో అర్జునునకు యుద్ధం వృత్రాసురునితో ఇంద్రునకు వలె మూడు రోజులు జరిగింది. తరువాత నాలుగవనాడు మహాబలుడయిన వజ్రదత్తుడు వికటాట్టహాసం చేసి, ఇలా అన్నాడు. 'అర్జునా! యుద్ధంలో కదలకుండా ఉండు. నానుండి ప్రాణాలతో తప్పించుకుపోలేవు. నిన్ను చంపి మా తండ్రికి యథావిధిగా తర్పణం చేస్తాను. వృద్ధుడయిన నా తండ్రి భగదత్తుడు నీ తండ్రికి మిత్రుడు, అయినా నీవు ఆయనను వృద్ధుడు కాబట్టి చంపావు. నేను ఆయనకు బాలుడనయిన పుత్రుడను. నాతో యుద్ధం చేయి.' ఇలా చెప్పి క్రుద్ధుడయిన వజ్రదత్త రాజు అర్జునుని మీదికి ఏనుగును తోలాడు. మేధావి అయిన వజ్రదత్తుడు తోలిన ఏనుగు ఆకాశంలోకి ఎగురుతున్నట్లు అర్జునుని వైపు పరుగెత్తింది. ఆ గజరాజం నల్లని మేఘం నీలశైలం మీద వర్షించినట్లు అర్జునుని మీద తొండంతో జలం కురిపించింది. వజ్రదత్తుడు పురికొల్పిన ఆ గజం మేఘం లాగా మాటిమాటికి ఘీంకరిస్తూ ఛీత్కారాలు చేస్తూ అర్జునుని మీదికి దూకింది. రాజా! వజ్రదత్తుడు ప్రేరేపించిన ఆ గజరాజం నృత్యం చేస్తున్నట్లు అర్జునుని వైపు వేగంగా దూసుకువచ్చింది. ఆ విధంగా తనమీదికి వజ్రదత్తుని ఏనుగు వస్తుంటే అర్జునుడు గాండీవ ధారి అయి చలించలేదు. భారతా! అర్జునుడు అశ్వసంచారం అనే కార్యానికి వజ్రదత్తుని వలన విఘ్నం కలగటం వల్ల వెనుకటి వైరాన్ని గుర్తు తెచ్చుకొని, ఆ రాజు మీద తీవ్రంగా కోపించాడు. క్రుద్ధుడయిన అర్జునుడు చెలియలికట్ట సముద్రాన్నివలె ఆ ఏనుగును బాణవర్షంతో నిలువరించాడు. శోభాయుక్తమయిన ఆ గజరాజం అర్జునుడు అడ్డుకొనగా శరీరం అంతా బాణాల మయం అయి, ముళ్ళు గల ఏదుపందివలె ఉంది.

ఏనుగును నిలువరించటం చూసి, భగదత్త పుత్రుడయిన ఆ రాజు క్రోధ పరవశుడయి అర్జునునిమీద పదునయిన బాణాలను వేశాడు. కాని అర్జునుడు శత్రు సంహారకాలయిన బాణాలతో వజ్రదత్తుని బాణాలను వెనుకకు మరల్చాడు. అది అద్భుతంగా ఉంది. అందుకు తీవ్రంగా కోపించిన ప్రాగ్జ్యోతిషరాజు ఆ గజరాజును మళ్ళీ అర్జునుని మీదికి తోలాడు. బలిష్ఠమయిన ఆ గజరాజం తన మీదికి వచ్చి పడటం చూసి, అర్జునుడు అగ్నితుల్యమయిన బాణాన్ని ఏనుగుమీద వేశాడు. రాజా! ఆ బాణం దెబ్బలు మర్మ ప్రదేశంలో తగలటం వల్ల ఆ ఏనుగు వజ్రాయుధం దెబ్బతిన్న కొండవలె వెంటనే నేలగూలింది. అర్జునుని బాణపు దెబ్బతిని, పడుతున్న ఆ ఏనుగు వజ్రపు దెబ్బతిగిలిన మహా పర్వతం నేలలోకి క్రుంగిపోతున్నట్లు ఉంది. వజ్రదత్తుని ఏనుగు నేలగూలగా అర్జునుడు నేలమీద నిలిచిన వజ్రదత్తుని **భయపడవద్దు** అన్నాడు. అశ్వం వెంట నేను బయలుదేరినప్పుడు యుధిష్ఠిరుడు 'అర్జునా ! రాజులను ఏ పరిస్థితిలోను చంపవద్దు. ఇది చేస్తే అంతా సవ్యంగా జరిగినట్లే. ధనంజయా! యుద్ధంలో యోధులను గూడ చంపవద్దు. మీరు అందరు మీ మిత్రులతో గూడా యుధిష్ఠిరుని అశ్వమేధానికి రండి. ఆ యజ్ఞోత్సవ సుఖాన్ని అనుభవించండి అని ఆ రాజులతో చెప్పు.' అనే మా అన్నగారి మాటలు ప్రకారం రాజా! నిన్ను చంపను లే. నీకు భయంలేదు. క్షేమంగా నీ ఇంటికి వెళ్ళు. మహారాజా! రాబోయే చైత్రపూర్ణిమాతిథినాటికి నీవు హస్తినాపురానికి రా ! అప్పుడు ధీమంతుడయిన ధర్మజుని యజ్ఞం జరుగుతుంది.' అర్జునుడు ఇలా చెప్పగా ఆయన చేతిలో ఓడిన వజ్రదత్తుడు 'అలాగే' అన్నాడు.

77. అర్జునుడు సింధుదేశ వీరులతో పోరాడుట.

వైశంపాయనుడు చెప్పాడు. 'భారతా! భగదత్త పుత్రుని జయించి, ప్రసన్నుని చేసి పంపిన తరువాత అధ్వమేధాశ్వం సింధు దేశానికి వెళ్ళింది. మహారాజా! మహాభారతయుద్ధంలో హతులు కాగా మిగిలిన వారితో, హతులయిన వారిపుత్రులతో అర్జునునికి యుద్ధం జరిగింది. సింధుదేశానికి అర్జునుడు వచ్చాడని విన్న ఆ సింధు దేశ రాజులు దాన్ని సహించక పాండవశ్రేష్ఠుని ఎదిరించారు. విషంతో సమానంగా భయంకరులయిన సింధురాజులు తమరాజ్యంలోకి ప్రవేశించిన అశ్వమేధాశ్వాన్ని పట్టుకొన్ని, భీముని తమ్ముడయిన అర్జునునికి ఏ మాత్రం భయపడలేదు. యజ్ఞాశ్వానికి దగ్గరలో ధనుర్ధారి అయి పదాతిగా నిలిచి ఉన్న అర్జునుని ఆ రాజులు సమీపించారు. పూర్వం మహాభారత యుద్ధంలో

ఓడిన, మహావీరులయిన ఆ రాజులు అర్జునుని జయింపదలచి చుట్టుముట్టారు. వారు అర్జునునితో తమ గోత్రనామాలను, వివిధమయిన తమ వీరకృత్యాలను చెపుతూ అర్జునుని మీద బాణవర్షం కురిపించారు. ఏనుగులు కూడా ముందుకు కదలకుండా ఉండేటంత ఎక్కువ బాణాలను కురిపిస్తూ, వారు యుద్ధంలో జయం కోరుతూ, అర్జునుని చుట్టుముట్టారు. యుద్ధంలో మహాభయంకర కార్యాలు చేసేవాడై. పదాతిగా ఉన్న అర్జునుని ఆ సింధుదేశ వీరులు చూసి, అందరు రథాల మీద ఉండి ఆయనతో యుద్ధం చేశారు. నివాత కవచులను సంశప్తకులను, సైంధవుని చంపిన మహావీరుడయిన అర్జునుని బాణాలతో కొట్టారు. ఆ వీరులు వేలకొలది రథాలతో, పదివేల అశ్వాలతో అర్జునుని ఒక మూల బంధించినట్లుగా చేసి, తమ మనస్సులో ఆనందపడ్డారు. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు సింధురాజు జయద్రధుని సంహరించిన విషయాన్ని ఆ వీరులు మరచిపోకుండా గుర్తు చేసుకొన్నారు.

అప్పుడు వారు అందరు మేఘంవలె బాణ వర్షం కురిపించారు. వారు కురిపిస్తున్న బాణవర్షంలో ఉన్న అర్జునుడు మేఘాలమాటున ఉన్న సూర్యునిలాగా విలసిల్లాడు. బాణాలతో కప్పబడిన ఆ పాండవ శ్రేష్ఠుడు పంజరంలో తిరిగే పక్షిలాగా విలసిల్లాడు. రాజా! ఆ రీతిగా అర్జునుడు బాణపీడితుడు కాగా లోకత్రయం హాహాకారాలు చేసింది. సూర్యుడు కాంతిహీనుడయ్యాడు. అప్పుడు శరీరం జలదరింపజేసే మహా వాయువు తీవ్రంగా వీచింది. రాహువు సూర్యచంద్రులను ఒక్కసారే మ్రింగాడు. నాలుగువైపుల చెల్లాచెదరుగా పడుతున్న ఉల్కలు సూర్యుని డీకొన్నాయి. రాజా! కైలాస మహాపర్వతం కంపించింది. సప్తర్షులు, దేవర్షులు గూడా భయంతో దుఃఖశోకాలు కలిగి వేడి నిట్టూర్పులు విడిచారు. వెనకచెప్పిన ఉల్కలు చంద్రునిలో ఉన్న కుందేలు గుర్తును భేదించి చంద్రమండలానికి నలువైపులా పడ్డాయి. దిక్కులన్నీ పొగ నిండగా విపరీతంగా కన్పించాయి. గాడిదలరంగు, ఎరుపురంగు కలవగా ఏర్పడే వర్ణంవంటి వర్ణం గల మేఘాలు ఇంద్రధనుస్సుతో, మెరుపులతో ఆకాశం ఆవరించి మాంసాన్ని, రక్తాన్ని కురిశాయి. భరతశ్రేష్ఠా! వీరుడయిన అర్జునుడు శరవర్షంతో ఆవరింపబడగా ఇవి అన్నీ కలిగాయి. అది ఆశ్చర్యకరంగా ఉన్నది. ఆ బాణసమూహం అన్ని దిక్కులనుంచి కప్పివేయగా అర్జునుని మోహం ఆవరించింది. అప్పుడు ఆయన చేతినుంచి గాండీవం, చేతి తొడుగులు క్రిందపడ్డాయి. మహారధు డయిన ఆయన మోహావిష్టుడు, అచేతనుడు కాగా సైంధవులు మహత్తరమయిన బాణసమూహం ఆయన మీద ప్రయోగించారు.

అర్జునుడు మూర్ఛితుడు కావటం తెలుసుకొన్న దేవతలు అందరు భీత మనస్కులయి ఆయనకు శాంతికారక పనులు చేశారు. అపుడు దేవఋషులు, సప్తర్షులు, బ్రహ్మర్షులు పార్థునికి జయం కలగాలని మంత్రజపం చేశారు. రాజా! అర్జునుని తేజస్సును దేవతలు ఉద్దీప్తం చేశారు. పరమాస్త్రాలు తెలిసిన ఆయన యుద్ధరంగంలో పర్వతంలాగా నిశ్చలంగా నిలిచాడు. అర్జునుడు దివ్యమయిన గాండీవంనారిని లాగాడు. అప్పుడు ఆది యంత్రధ్వనివలె తీవ్రంగా ధ్వనించింది. మహేంద్రుడు వర్షాలను కురిపించినట్లు అర్జునుడు ధనుస్సుతో శత్రువుల మీద బాణవర్షం కురిపించాడు. అప్పుడు తమరాజుతో కూడా సైంధవయోధులు అందరు మిడుతల దండు కప్పివేసిన వృక్షాలలాగా అర్జునుబాణాలు కప్పివేయగా కన్పించలేదు. గాండీవధ్వని విని, కొందరు సైంధవులు భయపడ్డారు. ఇంకొంతమంది భయార్తులై పారిపోయారు. మరికొంతమంది శోకార్తులయి కన్నీరు కార్చారు. వేరేకొందరు శోకించారు. అర్జునుడు అప్పుడు అలాతచక్రంవలె తిరిగి తిరిగి బాణసమూహంతో సైంధవులను గాయపరిచాడు. వజ్రాయుధం ధరించిన మహేంద్రునివలె శత్రునాశకుడైన అర్జునుడు ఇంద్రజాలంవలె అన్ని దిక్కులా బాణసమూహాన్ని ప్రయోగించాడు. పార్థుడు మేఘ సమూహంలాంటి సైంధవసైన్యాన్ని చీల్చివేసి, శరత్కాలంలో సూర్యునివలె ప్రకాశించాడు.

78. సైంధవుల ఓటమి.

అప్పుడు గాండీవధారి, మహావీరుడు అయిన అర్జునుడు యుద్ధరంగంలో తేరిపారజూడరాని వాడయి హిమవత్పర్వతంవలె నిలిచి, యుద్ధానికి సిద్ధమయ్యాడు. భారతా! తరువాత ఆ సైంధవ వీరులు అందరు మళ్ళీ ఏకమయి, క్రోధ పూర్ణులయి బాణవర్షం కురిపించారు. అప్పుడు మహాబాహువు, అర్జునుడు మరణించేకోరికతో మళ్ళీ యుద్ధానికి నిలిచిన సైంధవులను నవ్వుతూ "మీ శక్తిని అంతా ఉపయోగించి యుద్ధం చేయండి. నన్ను జయించ ప్రయత్నించండి. మీరు చేయవలసినవన్నీ పూర్తి చేసుకోండి. మీకు చాలా భయంకర సమయం ఆసన్నమయింది. ఇక చూడండి. మీ బాణాలవలను ఛిన్నభిన్నం చేసి, మీ అందరితో యుద్ధానికి సిద్ధంగా ఉన్నాను. సర్వసంసిద్ధంగా ఉండండి. యుద్ధాసక్తులయిన మీ పాగరు అణుస్తాను" అని అర్జునుడు రోషంతో అన్నాడు. భారతా! అప్పుడు తన పెద్దన్న యుధిష్ఠిరుడు జయేచ్ఛగల క్షత్రియులను యుద్ధంలో చంపవద్దని, జయించవలసింది అని చెప్పిన విషయం ఆయనకు గుర్తువచ్చింది. ధర్మరాజు వచనానుసారం అర్జునుడు ఇలా అనుకొన్నాడు. 'మహారాజు రాజులను చంపవద్దు అన్నాడు గదా!

మంగళకరమయిన ఈ ధర్మరాజు మాట అబద్ధం ఎందుకవుతుంది? రాజులు హతులు కారాదు. యుధిష్ఠిర మహారాజు ఆజ్ఞను పాటించాలి. ఇందుకు ఏం చెయ్యాలి?' అని ఆలోచించాడు పురుషశ్రేష్ఠుడు అర్జునుడు. ధర్మం తెలిసినవాడు గాబట్టి యుద్ధదుర్మదులయిన సైంధవులతో ఇలా అన్నాడు. 'యుద్ధానికి సిద్ధంగా నాఎదుటనున్న మిమ్ముచంపను. మీకు మేలుకలిగే మాట చెపుతాను. పరాజయాన్ని అంగీకరించి. నేను మీ వాడిని. మేము మీ చేతిలో ఓడిపోయాం అని నా ఎదుటకి వచ్చి చెప్పేవానిని కాపాడుతాను. ఈ నామాట విని మీకు మేలు కలిగేటట్లు చేయండి. అలా కాకపోతే నా బాణపీడితులయి ఇక్కట్ల పాలవుతారు.' అని వారితో పలికి అర్జునుడు మిక్కిలి కుపితుడయి వియాభిలాషులయిన సైంధవులతో యుద్ధం చేశాడు.

రాజా ! అప్పుడు సైంధవులు అర్జునునిమీద వంగిన కణుపులు గల కోటి బాణాలను ప్రయోగించారు. సర్పాలలాంటి క్రూరబాణాలు వచ్చిపడుతుంటే అర్జునుడు వాటిని పదునయిన బాణాలతో ముక్కలు చేశాడు. రాతిమీద పదును పెట్టబడి, గ్రద్ద ఈకలు గల ఆ బాణాలను ఆయన వేగంగా ఖండించి, ఆ సమరంలో ఒక్కొక్కని ఒక్కొక్క బాణంతో ఛేదించాడు. ఆ తరువాత మరణించిన జయద్రధుని గుర్తుచేసుకొని సింధుదేశ రాజులు మళ్ళీ అర్జునుని మీద ప్రాసాలను, శక్తులను విసిరారు. కాని కిరీటివారి ఉద్దేశ్యాన్ని వ్యర్థం చేశాడు. ఆయన వారి ఆయుధాలను మధ్యలోనే ఛేదించి గర్జించాడు. విజయాభిలాషతో దూకుతున్న ఆయోధుల శిరస్సులను వంగిన ములుకులు గల బాణాలతో ఖండించి క్రిందపడవేశాడు. వారిలో కొంతమంది పారిపోతున్నారు. ఇంక కొందరు ఎదుర్కొంటున్నారు. మరికొందరు వెనుదిరుగుతున్నారు. వారందరి కోలాహల ధ్వని జల పూర్ణమయిన మహాసముద్ర ఘోషలాగా ఉంది. అర్జునుడు వధిస్తున్నా ఆసైంధవవీరులు బలంతో, ఉత్సాహంతో ఆయనతో పోరాడారు. కొద్దిసేపట్లోనే అర్జునుడు యుద్ధరంగంలో సైంధవుల అధికభాగం సేనను మూర్ఛితులను చేశాడు. వారి వాహనాలు, సేనలు అలసిపోయాయి. సైంధవసేనలు అన్నీ దెబ్బతిన్నవని తెలుసుకొని ధృతరాష్ట్రుని కూతురు దుఃశ్శల వీరుడయిన సురథుని పుత్రుని – తన మనుమని తీసుకొని, అర్జునుని వద్దకు రథం మీద వచ్చింది. అందరు యుద్ధం విరమించి, శాంతంగా ఉండాలని ఆమె ఉద్దేశ్యం.

ఆమె అర్జునుని వద్దకు వచ్చి ఆర్త స్వరంతో దుఃఖించింది. సమర్థుడయిన అర్జునుడు ఆమెను చూసి ధనుస్సు దించాడు. ధనుస్సును వదలిన అర్జునుడు సోదరిని తగురీతిగా ఓదార్చి, 'నన్ను ఏం చేయమంటావు?' అని అడిగాడు. ఆమె ఇలా చెప్పింది.

'భరతశ్రేష్ఠా! వీడు నీచెల్లెలి మనుమడు. పురుషశ్రేష్ఠా! ఈ శిశువు నీకు నమస్కరిస్తున్నాడు. వీడిని చూడు.' అని ఆమె చెప్పగా 'వీడి తండ్రి ఏడి ? ఎక్కడ ఉన్నాడు?' అని అడుగగా దుఃశ్శల ఇలా అన్నది. 'నా మనుమడయిన వీని తండ్రి పితృశోకంతో తీవ్రసంతాపం చెంది విషాదంతో ఆర్తుడయి మరణించిన విషయం చెపుతాను. విను. అనఘా! ధనంజయా! పూర్వం భారతయుద్ధంలో తన తండ్రిని చంపావని విన్నాడు. అశ్వమేధాశ్వంతో నీవు యుద్ధానికి వస్తున్నావని విని, తండ్రి మరణదుఃఖంతో ఆర్తుడయి మరణించాడు. అనఘా! 'అర్జునుడు వచ్చాడు' అన్నవార్తతో నీ పేరు వినటంతోనే నా కుమారుడు విషాదంతో ఆర్తుడయి, నేలగూలి, మరణించాడు. ప్రభూ! నేలగూలిన వాడిని చూసి, వాడి కుమారుని తీసుకొని నీ శరణుగోరి నీ వద్దకు వచ్చాను.' అని చెప్పి ధృతరాష్ట్రపుత్రిక ఆర్తస్వరంతో దుఃఖించింది. దీనురాలయిన ఆమె దీనంగా తలవంచి ఉన్న అర్జునునితో ఇలా అంది.

'కురుకులశ్రేష్ఠా! నీచెల్లెలిని, చెల్లెలి మనుమని చూడు. ధర్మజ్ఞా! మమ్ములను దయచూడు. కురురాజు దుర్యోధనుని, మూర్ఖుడయిన జయద్రధుని మరిచిపో ! అభిమన్యునికి శత్రువీర నాశకుడయిన పరీక్షిత్తు కలిగినట్లే మహాభుజా! ఈ నా పౌత్రుడు సురథునికి కలిగాడు. నరశ్రేష్ఠా! ఈ నా పౌత్రుని తీసుకొని సర్వయోధులు శాంతులు కావటానికి నీ వద్దకు వచ్చాను. నా ఈ మాట విను. మహాబాహూ! ఆ మందమతి సురథుని పుత్రుడు నీ వద్దకు వచ్చాడు. కాబట్టి ఈ బాలుని అనుగ్రహించటం నీకు సముచితం. శత్రునాశకా! వీడు తలవంచి నిన్ను ప్రసన్నుని చేసుకొని, శాంతించగోరుతున్నాడు. మహాబాహూ! ధనంజయా! ఇక శాంతించు. పార్థా! తాత తండ్రులు మరణించినవాడు. ఏమీ తెలియని ఈ పసివానికి ప్రసన్నుడివి కావలసింది. కోపవశుడివి కావద్దు. ఈ పిల్లవాడి తాత (సైంధవుడు) అయోగ్యుడు, క్రూరుడు. నీకు చాలా ద్రోహం చేశాడు. ఆయనను మరచి వీడి మీద దయచూపు. '

ఈ విధంగా దుఃశల దయాజనకంగా చెప్పింది. ధనంజయుడు గాంధారీ దేవిని, ధృతరాష్ట్రమహారాజును స్మరించి శోకార్తుడయి క్షత్రియధర్మాన్ని నిందించాడు. 'ఆక్షత్రియ ధర్మానుసారమే నేను బంధువులనందరిని వధించాను.' అని పలికి అర్జునుడు ఆమెను ఓదార్చి, ఆమెయందు దయచూపాడు. చెల్లెలిని కౌగలించుకొని, ఆదరించి, సంతోషంగా ఆమెను ఇంటికి పంపించాడు. తరువాత సుముఖి అయిన దుఃశల ఆ సైంధవ వీరులను మహాయుద్ధం నుంచి విరమింపజేసి, అర్జునుని పూజించి, అంతఃపురానికి వెళ్ళింది. ధనంజయుడు ఈ రీతిగా సైంధవ వీరులను జయించి, ఇష్టానుసారం

పరుగెత్తుతున్న యజ్ఞాశ్వాన్ని అనుసరించాడు. మహేశ్వరుడు ఆకాశంలో మృగాన్ని వెంబడించినట్లే అర్జునుడు యజ్ఞాశ్వాన్ని అనుసరించాడు. ఆ అశ్వం యథేచ్ఛగా క్రమంగా ఆయా దేశాలలో తిరిగింది. అర్జునుని వీరకార్యాన్ని పెంపొందింపజేస్తూ తన ఇష్టంవచ్చినట్లు సంచరించింది. ఈ రీతిగా ఆ అశ్వం సంచరిస్తూ అర్జునునితో కూడా మణిపూరరాజు రాజ్యంలోకి వెళ్ళింది.

79. అర్జున బభ్రువాహనయుద్ధము.

జనమేజయా! మణిపూరాధిపతి బభ్రువాహనుడు తన తండ్రి వచ్చాడని విని, బ్రాహ్మణులను ముందు ఉంచుకొని, వినయవిధేయతలతో సమృద్ధిగా ధనం తీసుకొని, నగరం నుంచి బయటకు వచ్చాడు. ఈ విధంగా మణిపురాధిపతి తనకు ఎదురువస్తుంటే మేధావి అయిన అర్జునుడు క్షత్రియధర్మాన్ని గుర్తు తెచ్చుకొని ఆయనను ఆదరించలేదు. ధర్మాత్ముడు అర్జునుడు కోపంతో ఇలా అన్నాడు. 'వత్సా! నీ ఈ పద్ధతి బాగా లేదు. నీ క్షత్రియధర్మాన్నుంచి బహిష్కృతుడివి అయినట్లున్నావు. పుత్రకా! యుధిష్ఠిరుని యజ్ఞాశ్వాన్ని రక్షిస్తూ నీ దేశంలోకి వచ్చిన నన్ను ఎదిరించి, యుద్ధం ఎందుకు చేయలేదు ? యుద్ధానికి వచ్చిన నన్ను సౌమ్యంగానే ఎదుర్కొన్న నీవు క్షత్రియధర్మాన్నించి బహిష్కృతుడివి. దుర్బుద్ధివి ఛీ! ఇది నింద్యం. సామంతో నన్ను ఒక స్త్రీలాగా ఎదుర్కొన్నావు. నీవు జీవించినందువల్ల ఎలాంటి పురుషార్థం లేదు. ఓరీ! దుర్బుద్ధీ! నేను ఆయుధాలను వదిలేసి వచ్చినట్లయితే నరాధమా! నీయీ ప్రవర్తన సముచితం అయ్యేది.' తన భర్త అర్జునుడు బభ్రువాహనుని ఇలా అన్నాడని విని, దాన్ని సహించక సర్పపుత్రిక ఉలూపి భూమిని ఛేదించుకొనివచ్చింది. పుత్రుడు బభ్రువాహనుడు తలవంచి ఆలోచించటం, యుద్ధంచేయ గోరిన తండ్రి పలుమారులు నిందించటం చూచింది. అప్పుడు సర్పరాజపుత్రి ఉలూపి అక్కడికి వచ్చి ధర్మవిశారదుడయిన బభ్రువాహనునితో ధర్మబద్ధమయిన మాట ఇలా చెప్పింది.

'పుత్రా! నేను నీకు సవతి తల్లిని. నాగపుత్రికను ఉలూపిని అని తెలుసుకో. నా ఆజ్ఞను పాటించు. అందువల్ల నీకు ఉత్తమధర్మం ప్రాప్తిస్తుంది. కురుశ్రేష్ఠుడయిన తండ్రితో యుద్ధం చెయ్యి. ఇలా చేస్తే ఈయన సంతోషిస్తాడు. సందేహం లేదు. ఈ రీతిగా సవతి తల్లి రోషాన్ని పెంచగా మహాతేజస్వి, రాజు బభ్రువాహనుడు యుద్ధం చేయ మనస్సులో నిశ్చయించుకొన్నాడు. ఆయన బంగారుకవచం, తేజోవంతమయిన

శిరస్త్రాణం ధరించాడు. వందలకొలది అమ్ములపొదులతో నిండిన రథశ్రేష్ఠాన్ని ఆరోహించాడు. ఆ రథంలో సమస్తమయిన ఆయుధ సామగ్రి ఉంది. మనోవేగం గల అశ్వాలను దానికి పూన్చారు. చక్రం తదితర సామగ్రి అందులో ఉన్నాయి. ఆ రథం కూడా సువర్ణమయమే. దానిమీద సింహలాంఛనం గల ధ్వజం రెపరెపలాడుతున్నది. బభ్రువాహనరాజు దాన్ని ఎక్కి, అర్జునునితో యుద్ధానికి వెళ్ళాడు. బభ్రూవాహనుడు వచ్చి, అశ్వశిక్షా విశారదులయిన వారిచేత అర్జునరక్షితమయిన యజ్ఞాశ్వాన్ని పట్టించాడు. గుర్రాన్ని పట్టుకోవటం చూసి, సంతుష్ట మనస్కుడయిన అర్జునుడు రథంమీద ఉన్న పుత్రుని తాను నేలమీదనించి ఎదుర్కొన్నాడు. బభ్రువాహనరాజు అక్కడ వీరుడయిన అర్జునుని, సర్పాలవంటి పదునయిన బాణసమూహాలతో గాయపరిచాడు. ఉత్సాహంతో తండ్రీ కొడుకులు ప్రసన్నులయి పోరాడుతున్నారు. వారిద్దరి ఆ యుద్ధం దేవాసుర సంగ్రామంలాగా ఉంది. ఈ లోకంలో అది సాటిలేనిదిగా జరిగింది.

బభ్రువాహనుడు నవ్వుతూ నరశ్రేష్ఠుడు అర్జునుని వంగిన కణుపు గల ఒక బాణం మెడ ఎముకకు తగిలేటట్టు వేశాడు. అర్జునుని ఛేదించి, ఆ బాణం పిడితో కూడా పుట్టలోకి పాముపోయినట్లు భూమిలో ప్రవేశించింది. అర్జునునికి దాని వల్ల గాఢవేదన కలిగింది. అర్జునుడు ఉత్తమమయిన తన ధనుస్సును ఆసరాగా చేసుకొని, దివ్యతేజస్సున ప్రవేశించి, మృతతుల్యుడయ్యాడు. అర్జునుడు కొంతసేపటికి తేరుకొని పుత్రుని ప్రశంసించాడు. అర్జునుడు ఆయనతో ఇలా అన్నాడు. 'మహాబాహూ! చిత్రాంగదా కుమారా ! చాలా బాగుంది. ఈ పని నీకు తగినది. పుత్రా! ఇది చూసి సంతోషిస్తున్నాను. పుత్రా! ఇదిగో బాణాలు వేస్తున్నాను. యుద్ధంలో స్థిరంగా ఉండు.' అని చెప్పి శత్రునాశకుడు అర్జునుడు బాణవర్షం కురిపించాడు. బభ్రువాహనుడు గాండీవంలోనుంచి వెలువడిన వజ్రంలాగా, మెరుపులు లాగా మెరుస్తున్న ఆ బాణాలను అన్నింటిని బాణాలతో రెండు మూడు ముక్కలుగా ఖండించాడు. అప్పుడు అర్జునుడు దివ్యబాణాలతో బంగరుతాటి చెట్టువంటి ధ్వజాన్ని రథం మీదినుంచి కూల్చాడు. పెద్దశరీరం గల ఆ రథాశ్వాలను అర్జునుడు నవ్వుతూ బాణాలతో నిర్జీవాలను చేశాడు. మిక్కిలి కుపితుడయిన ఆ రాజు రథం మీదినుంచి దిగి, పాదచారి అయి అర్జునునితో యుద్ధం చేశాడు.

రాజశ్రేష్ఠుడయిన అర్జునుడు పుత్రుని పరాక్రమానికి సంతోషించాడు. అందువల్ల ఇంద్రకుమారుడయిన అర్జునుడు పుత్రుని ఎక్కువగా బాధించలేదు. బభ్రువాహనుడు తన తండ్రి యుద్ధ విముఖుడయినాడని భావించాడు. పాములవంటి బాణాలతో మళ్ళీ

బలిష్ఠుడయిన ఆతడు తండ్రిని గాయపరిచాడు. అంతట బభ్రువాహనుడు బాల్యోచితమయిన అవివేకం వల్ల పదునయిన మంచిములుకుగల బాణంతో తండ్రి గుండెలలో తీవ్రంగా కొట్టాడు. రాజా! తీవ్రబాధను కలిగించే ఆ బాణం అర్జునుని మర్మస్థానం చీల్చి, లోపల దూరింది. కురునందనుడయిన అర్జునుడు పుత్రుని బాణం తీవ్రంగా తగలటం వల్ల గాయపడి, మూర్ఛితుడయి నేలమీద పడ్డాడు. కౌరవశ్రేష్ఠుడు, వీరుడయిన అర్జునుడు పడిపోగా చిత్రాంగదా పుత్రుడు బభ్రువాహనుడు కూడా మూర్ఛపోయాడు. బభ్రువాహనుడు తీవ్రంగా యుద్ధం చేశాడు. అర్జునుని బాణ సమూహంతో తీవ్రంగా గాయపడ్డాడు. హతుడయిన తండ్రిని చూసి, ఆయన కూడా యుద్ధభూమిలో అచేతనుడయి పడిపోయాడు. భూమిని కౌగలించుకున్నాడు. భర్త హతుడయ్యాడు. పుత్రుడు నేలమీద పడ్డాడు. ఇది చూసి భయపడిన చిత్రాంగద యుద్ధభూమిలోకి వెళ్ళింది. మణిపూర రాజపుత్రిక శోకంతో హృదయం సంతప్తం కాగా, తీవ్రంగా వణికిపోతూ, ఏడుస్తూ, మృతుడయిన పతిని చూచింది.

80. అర్జునుని పునర్జీవనము.

వైశంపాయనుడు చెప్పాడు – 'జనమేజయా! భయస్వభావ అయిన చిత్రాంగద తీవ్రంగా దుఃఖించింది. శోకసంతప్త అయి మూర్ఛపోయి నేలమీద పడింది. దివ్యశరీరధారిణి ఆదేవి మూర్ఛనుండి తేరుకొని ఎదురుగా ఉన్న నాగపుత్రిక ఉలూపిని చూసి, ఇలా అన్నది. 'ఉలూపీ! ఇదిగో చూడు. యుద్ధవిజేత అయిన మన భర్త నీకారణంగా నా పుత్రుని బాణంతో యుద్ధభూమిలో హతుడయి పడి ఉన్నాడు. సోదరీ ! నీవు ఆర్యధర్మం తెలిసిన దానివి. పతివ్రతవు. అలాంటి నీకారణంగా నీ భర్త యుద్ధంలో హతుడయ్యాడు. కాని ఈ ధనంజయుడు నీకు సర్వవిధాల అపకారం చేసి ఉంటే నా అభ్యర్థనను అనుసరించి, క్షమించు. ఈ అర్జునుని బ్రతికించు. పూజ్యురాలా! నీవు ధర్మం తెలిసినదానివి. ముల్లోకాల్లో ప్రసిద్ధురాలివి. పుత్రునిచేత భర్తను చంపించి దుఃఖించటం లేదు, చింతించటం లేదు. ఇందుకు కారణం ఏమిటి? పన్నగపుత్రీ! నాపుత్రుడు మరణించినా దుఃఖించటం లేదు. నాపుత్రుని చేత ఈ రీతిగా ఆతిథ్యం పొందిన భర్తకోసమే ఏడుస్తున్నాను.' ఈవిధంగా కీర్తిమతి చిత్రాంగద పన్నగపుత్రిక ఉలూపితో అని, భర్త వద్దకు వెళ్ళి ఇలా అన్నది.

'కౌరవ రాజ ముఖ్యుడా! నాకు ప్రియుడా! లే. మహాబాహూ! నీకోసం నేను ఈ యజ్ఞాశ్వాన్ని వదలివేస్తున్నాను. ప్రభూ! నీవు ఈ ధర్మరాజ యజ్ఞాశ్వాన్ని అనుసరించి

వెళ్ళాలి గదా! నేలమీద పడి ఉన్నావేమిటి ? నా ప్రాణాలు, కౌరవుల ప్రాణాలు నీ అధీనంలో ఉన్నాయి. ఇతరులకు ప్రాణభిక్షను పెట్టే ఆ నీవు ప్రాణాలు ఎందుకు వదిలావు? (అని పలికి మళ్ళీ ఉలూపితో అన్నది.) భర్త నేలబడి ఉన్నాడు. ఉలూపీ! బాగా చూడు. ఈ నా కుమారుని ప్రోత్సహించి భర్తను చంపించావు. ఇందుకు నీకు దుఃఖం కలగటం లేదా? మరణించిన ఈ బాలుడు శాశ్వతంగా నేలపడి ఉండుగాక. అరుణనేత్రుడు, నిద్రను జయించిన వాడు, ఈ విజయుడు జీవించు గాక. ఇదే ఉత్తమం. కల్యాణీ! పురుషులకు అనేక భార్యలు ఉండటం తప్పు కాదు. దోషంకాదు. కాని స్త్రీలకు బహుభర్తలుండటం దోషం. పాపహేతువు అవుతుంది. కాబట్టి నీ బుద్ధిక్రూరం కారాదు. బ్రహ్మదేవుడు భార్యాభర్తలకు శాశ్వత సఖ్యాన్ని కలిగించాడు. ఇది అవ్యయం. (నీకు గూడా ఈయనతో అదే సంబంధం ఉంది). ఈ సఖ్య మహత్త్వం తెలుసుకో. కాబట్టి నీకు ఈయనతో కలిగిన సఖ్యం సార్థకం అయ్యే ఉపాయం చూడు. నా పుత్రునితో భర్తను చంపించిన నీవు మళ్ళీ బ్రతికించి, చూపించకపోతే నేను ఇప్పుడే ఇక్కడే మరణిస్తాను. దేవీ! పతిని, పుత్రుని కోల్పోయి నేను దుఃఖంలో మునిగిఉన్నాను. ఇక్కడే నీవు చూస్తుండగానే ప్రాయోపవేశం చేస్తాను. ఇందులో సందేహం లేదు.'

నరనాథా! నాగకన్యతో ఇలాచెప్పి ఆమెకు సవతి చిత్రవాహనుని పుత్రిక చిత్రాంగద మరణాంతమయిన ఉపవాసం చేయసంకల్పించి మౌనంగా ఉంది. తరువాత విలపించి విరమించిన చిత్రాంగద భర్తపాదాలు పట్టుకొని దీనంగా కూర్చున్నది. దీర్ఘంగా నిట్టూరుస్తూ పుత్రుని వైపు చూడసాగింది. అంతట బభ్రువాహనుడు యుద్ధభూమిలో మూర్ఛనుంచి తేరుకొన్నాడు. తల్లిని చూసి, ఇలా అన్నాడు. 'ఇంతవరకు సుఖంగా పెరిగిన మా అమ్మ మరణించిన భర్తతోపాటు మరణించ సిద్ధమయి కూర్చున్నది. ఇంతకంటే దుఃఖకరమయింది. ఇంకేముంటుంది? యుద్ధంలో శత్రువులను సంహరించేవాడు, శస్త్రధారులు అందరిలో శ్రేష్ఠుడు, అయిన నా తండ్రి అర్జునుని - నా చేతిలోనే మరణించిన వానిని చూస్తున్నది. విశాలవక్షః స్థలంగలవాడు, దీర్ఘబాహుడు అయిన తన భర్త హతుడు కావటం చూసి, కూడా నాతల్లి చిత్రాంగద దృఢహృదయం పగిలిపోలేదు గదా? అందువల్ల అంతకాలం రాకుండా మానవునికి మరణించటం చాలా కష్టం అని అనుకొంటాను. ఆహా! ఈ సంకట సమయంలో కూడా నేను గాని నా తల్లిగాని మరణించలేదు గదా! పుత్రుడనయిన నాచేతిలో మరణించిన కురువీరుని సువర్ణకవచం నేలపడి ఉంది. జనులారా! చూడండి. అయ్యా! బ్రాహ్మణులారా! పుత్రుడినయిన నాచేత హతుడయిన వీరుడు, వీరశయనం

మీద శయనించిన నా తండ్రిని చూడండి. కురుశ్రేష్ఠుడయిన యుధిష్ఠిరుని యజ్ఞాశ్వం వెంట శాంతి కర్మలు చేయటానికి వెళ్తున్న బ్రాహ్మణులారా! యుద్ధంలో నాచేతిలో మరణించిన ఈయనకు ఏ శాంతిచేస్తారు ? బ్రాహ్మణశ్రేష్ఠులారా! మిక్కిలి క్రూరుడను, పాపాత్ముడను. యుద్ధరంగంలో తండ్రిని చంపిన నాకు ఇప్పుడు ప్రాయశ్చిత్తం ఏమిటో చెప్పండి. ఇవ్వాళ పితృహంతకుడి నయిన నాకు పన్నెండు సంవత్సరాలు కఠినవ్రతానుష్ఠానం కష్టం. క్రూరుడిని, తండ్రిని చంపిన నాకు ఒకటే ప్రాయశ్చిత్తం ఉంది. ఈయన చర్మాన్ని కప్పుకొని ఉంటాను. నా తండ్రి మస్తక కపాలాలను ధరించి పన్నెండు సంవత్సరాలు సంచరిస్తాను. తండ్రిని చంపిన నాకు ఇప్పుడు ఇంతకంటే ఇతరమయిన ప్రాయశ్చిత్తం లేదు. నాగశ్రేష్ఠ కుమారీ! నేను చంపిన నీ భర్తను చూడు. యుద్ధంలో ఇవ్వాళ అర్జునుని సంహరించి, నీకు ప్రియం చేశానని అనుకొంటాను. అమ్మా! ఇకనేను ఈ శరీరం దాల్చి ఉండలేను. నా తండ్రి పోయిన త్రోవనే నే పోతాను. మాతా! గాండీవధారి అయిన మా తండ్రి, నేను మరణించగా సంతోషించు. తండ్రి లేకుండా నేను జీవించలేను అని నేను సత్య ప్రతిజ్ఞ చేస్తున్నాను. మహారాజా! బభ్రువాహనుడు ఇలా పలికి, దుఃఖ శోకపీడితుడయి ఆచమనం చేశాడు. దుఃఖంతో మళ్ళీ ఇలా అన్నాడు.

'చరాచరమయిన సమస్త ప్రాణులారా! ఇప్పుడు నా మాట వినండి ! మాతా! ఉలూపీ! నీవుకూడా విను. నేను నిజం చెపుతున్నాను. నరశ్రేష్ఠుడు, నాతండ్రి అయిన విజయుడు సజీవుడయి లేవకపోతే ఈ రణభూమిలోనే నా శరీరం శుష్కింపజేస్తాను. తండ్రిని చంపిన నాకు ఎక్కడా, ఎలాంటి ఉద్ధరణోపాయం లేదు. గురు (పితృ) వధ చేత పీడితుడి నయిన నేను నరకానికి పోవటం నిశ్చయం. వీరుడయిన క్షత్రియుని హత్య చేస్తే వేయిగోదానాలు చేసి, నరుడు ఆ పాప విముక్తుడు అవుతాడు. ఈ రీతిగా తండ్రిని చంపిన నాకు పాపవిముక్తి దుర్లభం. ఈ ధనంజయుడు ఒక్కడే మహాతేజస్వి అయిన వీరుడు, ధర్మాత్ముడు. ఈయనను వధించి నేను మహాపాపం చేశాను. నాకు ఏమి ప్రాయశ్చిత్తం ఉంటుంది ?' అర్జునపుత్రుడు ఈ విధంగా పలికాడు. ఆచమనం చేసి, ప్రాయోపవేశం చేసి మౌనం పాటించాడు. మణిపురాధిపతి బభ్రువాహనుడు పితృశోకం ఆక్రమించగా తల్లితో కూడా ప్రాయోపవేశం చేశాడు. అప్పుడు ఉలూపి సంజీవన మణిని స్మరించింది. నాగుల జీవనానికి ఆధారమయిన ఆ మణి ఆమె స్మరించినంతనే అక్కడికి వచ్చింది. కురువంశీయా, జనమేజయా! నాగప్రభుపుత్రిక ఉలూపి ఆ మణిని తీసుకొని సైనికుల మనస్సులను సంతోషపెట్టే మాట ఇలా అన్నది. 'పుత్రా! బభ్రువాహనా!

దుఃఖించకు, లే ఈ అర్జునుడు నీ చేతిలో ఓడిపోలేదు. ఇంద్రునితో గూడా దేవతలు ఈయనను జయించలేరు. కీర్తిమంతుడు, పురుషశ్రేష్ఠుడు అయిన నీ తండ్రికి మేలుచేయటానికే మోహినీ మాయను ప్రదర్శించాను. రాజా! నీవు ఈయన పుత్రుడివి. శత్రువీరసంహారకుడు, కురువంశశ్రేష్ఠుడయిన ఈ అర్జునుడు యుద్ధంలో పోరాడుతున్న నీవంటి వీరపుత్రుని పరాక్రమం తెలుసుకోగోరుతున్నాడు. వత్సా! అందుకే నిన్నూ యుద్ధానికి ప్రేరేపించాను. ప్రభూ!, పుత్రా! ఈ విషయంలో నీకు పాపం కలుగుతుందని అణుమాత్రమయినా శంకించవద్దు. మహాత్ముడయిన ఈయన పురాతన ఋషి, సనాతనుడు, వినాశ రహితుడు, పుత్రా ! యుద్ధంలో ఈయనను ఇంద్రుడయినా జయించలేడు. ప్రజానాథా ! ఈ దివ్యమణిని నేను తెచ్చాను. ఇది నిరంతరం యుద్ధంలో మృతులయిన పన్నగాధిపులను జీవింపజేస్తుంటుంది. కాబట్టి దీన్ని నీ తండ్రి గుండెల మీద పెట్టు, అప్పుడు పాండవ వీరుడైన అర్జునుడు బ్రతకటం నీవు చూస్తావు.' అని ఉలూపి చెప్పగా అమిత తేజస్వి, ఏ పాపం చేయని బభ్రువాహనుడు తండ్రిమీద ప్రేమతో అర్జునుని హృదయం మీద ఆ మణిని ఉంచాడు. ఆ మణిని అలా పెట్టినంతనే అర్జునుడు పునర్జీవితుడయ్యాడు. చాలాసేపు పడుకొని నిద్రలేచిన వానివలె అరుణలోచనాలను నలుపుకొంటూ లేచాడు.

మనస్వి, మహాత్ముడు అయిన అర్జునుడు చైతన్యవంతుడయి లేచాడు. తండ్రిని చూసి, బభ్రువాహనుడు ప్రణామం చేశాడు. ప్రభూ! పురుషశ్రేష్ఠుడు శోభాయుక్తుడు అయిన అర్జునుడు లేవగా ఇంద్రుడు దివ్యపుష్పవర్షం కురిపించాడు. మ్రోగించకుండానే దుందుభులు మేఘాలు గర్జించినట్లు మ్రోగాయి. బాగు, బాగు అని సాధువాదాలు ఆకాశంలోనుంచి పెద్దధ్వనితో విన్పించాయి. అర్జునుడు స్వస్థుడయి లేచి నిలిచాడు. బభ్రూవాహనుని దగ్గరకు తీసుకొని కౌగలించుకొని, శిరస్సును ఆఘ్రాణించాడు. కొంతదూరంలో బభ్రువాహనుని తల్లి దుఃఖంతో పీడిత అయి ఉలూపితో గూడి ఉండటం చూశాడు. అర్జునుడు అప్పుడు ఇలా అడిగాడు. 'శత్రునాశకా! యుద్ధభూమి అంతా శోకం విస్మయం, సంతోషంతో కన్పిస్తున్నదేమిటి ? నీకు తెలిసి ఉంటే చెప్పు. నీ తల్లి చిత్రాంగద యుద్ధభూమికి వచ్చిందేమి? నాగరాజపుత్రి ఉలూపి ఎందుకు ఇక్కడికి వచ్చింది ? నా మాట ప్రకారం నీవు యుద్ధం చేశావని ఎరుగుదును. స్త్రీలు ఇక్కడికి రావటానికి కారణం తెలుసుకో గోరుతున్నాను.' అప్పుడు మణిపూరాధిపతి తలవంచి నమస్కరించాడు. తండ్రి ప్రసన్నుడు కాగా ఈ విషయం ఉలూపిని అడుగు అన్నాడు.

81. ఉలూపి జరిగినది చెప్పుట.

అర్జునుడు అడిగాడు – 'ఉలూపీ! నీవు వచ్చిన పని ఏమిటి? అలాగే మణిపురాధిపతి తల్లి యుద్ధభూమికి రావటానికి కారణం ఏమిటి ? నాగపుత్రీ! ఈ రాజక్షేమాన్ని కోరుతున్నావా? లేక నా మేలు కోరుతున్నావా! నేనుగాని, బభ్రువాహనుడు గాని తెలియక నీకు ఏదయినా అనిష్టమయింది చేయలేదు గదా! నీకు సవతి, అయిన చిత్రాంగద నీ విషయంలో ఏమీ అపరాధం చేయలేదు గదా!' అప్పుడు నాగరాజకుమారి ఉలూపి నవ్వుతూ ఇలా అన్నది. 'ఆర్యా! నీవు గాని బభ్రువాహనుడు గాని, నాకు దాసీలాగా ఉండే ఈతని తల్లి చిత్రాంగి గాని నా విషయంలో ఎలాంటి అపరాధం చేయలేదు. ఇంతవరకు నేను చేసింది అంతా చెపుతాను. విను. కురుశ్రేష్ఠా! నన్ను కోపించకు. తలవంచి, నమస్కరించి, నిన్ను ప్రసన్నుని చేసుకొంటాను. ప్రభూ! ఇదంతా నీమేలుకోసమే చేశాను. మహాబాహూ! అది అంతా విను. పూర్వం మహాభారతయుద్ధంలో నీవు అధర్మంగా శంతను పుత్రుడైన భీష్ముని చంపావు. పార్థా! ఆ పాపానికి ఈ ప్రాయశ్చిత్తం చేశాను. వీరా! భీష్ముడు నీతో యుద్ధం చేస్తుండగా నీవు ఆయనను గూల్చలేదు. శిఖండితో యుద్ధం చేస్తుంటే ఆతనిని ముందుంచుకొని నీవు ఆయనను చంపావు. ఆ పాపానికి తగిన శాంతిని చేసుకోకుండా నీవు ప్రాణత్యాగం చేస్తే ఆ పాపకర్మ ఫలితంగా నీవు నరకంలో పడటం నిశ్చయం. పుత్రుని వల్ల నీవు పరాజితుడివి కావటం అనేదే ఆ పాపానికి శాంతి అని వసువులు, గంగాదేవి ఈ ప్రాయశ్చిత్తం నీకు విధించారు.

రాజా! పూర్వం భీష్ముడు హతుడు అయినప్పుడు గంగా తీరంలో ఉన్న వసువులు చెప్పింది నేను విన్నాను. వసువులు అనే దేవతలు, గంగాతీరంలో కలిసి స్నానం చేసి, భాగీరథి అంగీకారంతో ఈ ఘోరవచనం చెప్పారు. ఈ భీష్ముడు సంగ్రామంలో ఇతరులతో పోరుతున్నాడు. తనతో యుద్ధం చేయని ఈయనను అర్జునుడు పడగొట్టాడు. ఈ అపరాధం కారణంగా మేము ఈనాడు అర్జునునికి శాపం ఈయదలచుకొన్నాం. అది విని గంగాదేవి 'అలాగే కానివ్వండి' అన్నది. అది విన్న నేను ఇంద్రియాలు వ్యధచెందగా మా ఇంటికి వెళ్ళి మా తండ్రికి చెప్పాను. ఆయన అది విని, మహావిషాదం పొందాడు. నా తండ్రి వసువుల వద్దకు వెళ్ళి, వారిని పలుమారులు ప్రార్థించి, ప్రసన్నులను చేసుకొని, నిన్ను క్షమింపవలసిందిగా వేడుకొన్నాడు. వారు ఆయనతో ఇలా అన్నారు. 'మహాభాగా! ఆ అర్జునుని పుత్రుడు, మణిపూరాధిపతి యుద్ధరంగ మధ్యంలో బాణాలతో నేలపడవేసినప్పుడు ఆయన శాపవిముక్తుడు అవుతాడు. ఇక నీవు వెళ్ళవచ్చు' అన్నారు. మా తండ్రి ఈ

విషయం నాతో చెప్పాడు. అది విన్న నేను నిన్ను శాపవిముక్తుని చేశాను. ప్రభూ! నిన్ను యుద్ధాలలో దేవరాజు ఇంద్రుడయినా ఓడించలేడు. తానే పుత్రుడుగా జన్మిస్తాడు. (ఆత్మానై పుత్రనామాసి) అని చెప్పారు. కాబట్టి పుత్రునిచేత నీవు పరాజితుడివి అయ్యావు. స్వామీ! ఇందులో నాదోషం ఏమీ లేదని నా ఉద్దేశ్యం. నీవు ఏమి అనుకొంటున్నావు?' అని ఉలూపి అడుగగా విజయుడు ప్రసన్న మనస్కుడయి ఇలా అన్నాడు.

'దేవీ! నీవు చేసింది అంతా నాకు ఇష్టమే.' అని అర్జునుడు మణిపూరాధిపతి పుత్రునితో చిత్రాంగద, కౌరవ్య పుత్రిక ఉలూపి వింటుండగా అన్నాడు. 'రాజా! రాబోయే చైత్రమాసంలో పూర్ణిమనాడు యుధిష్ఠిరుని అశ్వమేధయాగం జరగబోతున్నది. అమాత్యులతో, తల్లులు ఇద్దరితో అక్కడికి రావలసింది.' అర్జునుడు ఇలా చెప్పగా ధీమంతుడైన బభ్రువాహనుడు కన్నీరు నిండిన నేత్రాలతో తండ్రితో ఇలా అన్నాడు. 'ధర్మజ్ఞా! తండ్రీ! నీ ఆజ్ఞానుసారం నేను బ్రాహ్మణులతో గూడి అశ్వమేధ మహా యజ్ఞానికి వస్తాను. ధర్మజ్ఞా! భార్యలతో గూడా నీవు నన్ను అనుగ్రహించటానికి నీ పట్టణం మణిపురంలోకి రావలసింది. ఈ విషయంలో ఆలోచించవద్దు. ప్రభూ! ఒక్కరాత్రి మీ ఇంట్లో సుఖంగా ఉండి మరునాడు అశ్వంవెంట వెళ్ళవచ్చు.' ఇలా పుత్రుడు చిత్రాంగదాసుతుడు చెప్పగా, కుంతీకుమారుడు నవ్వుతూ ఇలా అన్నాడు. 'మహాబాహూ! నేను దీక్షలో ఉన్నానని నీకు తెలుసు. విశాలాక్షా! అందువల్ల నీ నగరంలో ప్రవేశింపజాలను. నరశ్రేష్ఠా! ఈ యజ్ఞాశ్వం స్వేచ్ఛగా సంచరిస్తుంది. కాబట్టి ఇక్కడ నేను ఉండవీలుగాదు. నీకు శుభం కలుగుగాక. ఇక వెళ్తాను.' భరతశ్రేష్ఠుడు, ఇంద్రకుమారుడు అయిన అర్జునుడు అక్కడ పుత్రునిచే యథావిధిగా పూజితుడయ్యాడు. ఆయన భార్యలు ఇద్దరి అనుమతీ తీసుకొని, బయలుదేరాడు.

82. మగధరాజు మేఘసంధి పరాజయము.

దీని తరువాత ఆ యజ్ఞాశ్వం సముద్రం వరకు ఉన్న భూమండలం అంతా సంచరించి, వెనుదిరిగి, హస్తినాపురం వైపు పోసాగింది. అర్జునుడు కూడా గుర్రాన్ని అనుసరించి తిరిగి వస్తూ అనుకొనకుండానే రాజగృహనగరానికి వెళ్ళాడు. అర్జునుడు తననగరానికి సమీపంగా రావటం చూసి, వీరుడయిన సహదేవపుత్రుడు క్షత్రియ ధర్మానుసారం ఆయనను యుద్ధానికి పిలిచాడు. తరువాత ఆయన ధనుస్సు, బాణాలు చేతి తొడుగులు ధరించి రథంమీద నగరంనుంచి బయటకువచ్చాడు. మేఘసంధి పదాతి అయిన అర్జునుని ఎదిరించాడు. మహారాజా! మహాతేజస్వి అయిన మేఘసంధి అర్జునుని సమీపించి, యుద్ధకౌశలం

లేకపోయినా బాలభావం వల్ల ఇలా అన్నాడు. 'భరతవంశీయా! ఈ అశ్వం వెనకాల తిరుగుతున్నావేమిటి? ఇది స్త్రీల మధ్య తిరుగుతున్నట్లుంది. ఈ అశ్వాన్ని అపహరిస్తాను. దీన్ని విడిపించుకోవటానికి ప్రయత్నించు. నా పిత్రాదులు యుద్ధంలో ఇది వరకు ఎన్నడు స్వాగత సత్కారాలు చేసి ఉండకపోతే ఆ లోటు ఇప్పుడు తీరుస్తాను. యుద్ధరంగంలో నీకు సముచితమయిన ఆతిథ్యం ఇస్తాను. మొదట నీవు ప్రహరించు. తరువాత నేను ప్రహరిస్తాను.' ఆ మాటలు విని అర్జునుడు నవ్వుతూ ఇలా సమాధానం చెప్పాడు. 'రాజా! నా పెద్దన్న గారు 'నీకు మార్గంలో అడ్డుతగిలిన వారిని అదుపుచెయ్యి.' అనే వ్రతదీక్షను ఇచ్చారు. ఈ విషయం నీకు కూడా బాగా తెలుసు. కాబట్టి నీవు ముందు నీ శక్తిననుసరించి ప్రహరించు. నీ మీద నాకు కోపం ఏమీలేదు.' అని చెప్పగా మగధరాజు ఇంద్రుడు వర్షం కురిపించినట్లు వేలకొలది బాణాలను వర్షిస్తూ అర్జునుని కొట్టాడు. అప్పుడు గాండివధారి, గాండీవంతో ప్రయోగించిన బాణాలతో ఆతడు ప్రయత్న పూర్వకంగా వేసిన బాణాలను నిష్ఫలం చేశాడు. అర్జునుడు ఆతని బాణ సమూహం వ్యర్థం చేసి, ప్రజ్వలిస్తున్న నోళ్ళుగల సర్పాలవంటి బాణాలను వదిలాడు. ఆయన మేఘసంధి ధ్వజం, పతాక దండం, రథం, యంత్రం, అశ్వాలు, తదితరమయిన రథాంగాల మీద బాణాలు వేశాడు కాని ఆతని శరీరం మీద, సారథి మీద వేయలేదు. అర్జునుడు కావాలనే ఆతని శరీరం రక్షించాడు. కాని మేఘసంధి అది అంతా తన పరాక్రమం అనుకొని అర్జునుని మీద బాణాలు వేయసాగాడు.

మగధాధిపతి బాణాలతో తీవ్రంగా గాయపడిన అర్జునుడు వసంతకాలంలో బాగా పుష్పించిన మోదుగు చెట్టువలె విరాజిల్లాడు. కురునందనా! అర్జునుడు ఆతనిని కొట్టటం లేదు. కాని మగధరాజు పాండవశ్రేష్ఠుని తీవ్రంగా గాయపరచసాగాడు. అందువల్ల విశ్వవిఖ్యాతుడయిన అర్జునుని దృష్టిలో అంతవరకు నిలవగలిగాడు. తీవ్రంగా కోపించిన అర్జునుడు గాండీవాన్ని బాగా లాగి, బాణాలు వేసి, ఆయన రథాశ్వాలను చంపాడు. సారథి శిరస్సును హరించాడు. చిత్రమయిన ఆతని గొప్ప విల్లును ఒక బాణంతో ముక్కలు చేశాడు. ఆతని చేతితొడుగులను, పతాకను, ధ్వజాన్ని నేలగూల్చాడు. గుర్రాలు లేక, ధనుస్సు లేక, సారథి చనిపోగా ఆ రాజు వ్యథచెంది గదను తీసుకొని వేగంగా అర్జునుని మీదికి దూకాడు. అతడు వస్తుండగానే అర్జునుడు ఆతని చేతిలో ఉన్న బంగారు గదను గ్రద్ద ఈకలు గల బాణాలతో అనేక ఖండాలు చేశాడు. ఆ గద పిడి విరిగింది. ముక్కలయింది. ఆ స్థితిలో ఆ గద చేతిలోనుంచి జారిపోయిన ఆడపాములె

క్రింద పడింది. రథం, ధనుస్సు నష్టంకాగా, గద కూడా దూరం అయిన మేఘసంధితో అర్జునుడు అనునయంగా ఇలా అన్నాడు. 'పుత్రా! నీవు క్షత్రియధర్మాన్ని పూర్తిగా ప్రదర్శించావు. ఇక ఇంటికి వెళ్ళు. నీవు ఇంకా బాలుడివి. యుద్ధభూమిలో నీవు ఇంతగా పరాక్రమించటం చాలా గొప్పతనం. యుధిష్ఠిరుడు యుద్ధంలో రాజులను చంపవద్దు అని ఆదేశించాడు. రాజా! అందువల్ల నాతో యుద్ధంలో అపరాధం చేసినా జీవించి ఉన్నావు.'

అర్జునుని మాటలు విన్న మేఘసంధికి ఈయన నన్ను ప్రాణాలతో వదిలాడు అని అర్థమయింది. నీవు చెప్పింది నిజమేనని అర్జునుని వద్దకు వచ్చి, దోసిలొగ్గి, గౌరవించాడు. 'అర్జునా! నీకు శుభం కలుగుగాక. ఓడిపోయాను. ఇక యుద్ధం చేయ ఉత్సహించను. ఇంక నేను ఏమేమి చేయాలో చెప్పు. అది పూర్తి అయినట్లే భావించు.' అర్జునుడు ఆయనను సముదాయించి మళ్ళీ ఇలా అన్నాడు. 'రాజా! చైత్రపూర్ణిమనాడు మా రాజు చేయబోయే అశ్వమేధ యాగానికి రావలసింది.' ఆ మాటలు విన్న సహదేవుని కుమారుడు మేఘసంధి ఆ గుర్రాన్ని, యుద్ధంలో మేటి అయిన అర్జునుని యథావిధిగా పూజించాడు. తరువాత ఆ అశ్వమేధాశ్వం సముద్ర తీరంలో వంగ, పుండ్ర, కోసల దేశాలకు స్వేచ్ఛగా వెళ్లింది. రాజా! ఆయా ప్రాంతాలలో అనేక విధాలయిన అపరిమిత మ్లేచ్ఛ సేనలను అర్జునుడు గాండీవధనుస్సుతో జయించాడు.'

83. అర్జునుడు ద్వారకా పంచనాథ గాంధారములకేగుట.

వైశంపాయనుడు చెప్పాడు – 'రాజా! మగధరాజుచే పూజితుడయిన అర్జునుడు దక్షిణ దిక్కుకు వెళ్ళి, అశ్వమేధాశ్వాన్ని సంచరింపజేశాడు. బలిష్ఠమై, స్వేచ్ఛాసంచారం గల అశ్వమేధ హయం అటునించి తిరిగి చేది దేశంలో అందమయిన శుక్తిమతీ (మాహిష్మతీ) పురాన్ని చేరింది. శిశుపాలపుత్రుడు శరభుడు మొదట యుద్ధం చేశాడు. తరువాత ఆ అశ్వాన్ని పూజించాడు. రాజా! అలా పూజితమయిన అశ్వం, కాశీ, అంగ, కోసల, కిరాత, తంగణ దేశాలలో సంచరించింది. అక్కడ అర్జునుడు తగిన రీతిగా వారు చేసిన పూజలను గ్రహించాడు. అక్కడినుండి తిరిగి కుంతీకుమారుడు దశార్ణదేశానికి వెళ్ళాడు. అక్కడ బలవంతుడు, శత్రునాశకుడు అయిన చిత్రాంగదుడు అనే రాజు ఉన్నాడు. విజయునికి ఆతనితో మిక్కిలి భయంకర యుద్ధం జరిగింది. పురుషశ్రేష్ఠుడయిన కిరీటి ఆతనిని వశం చేసుకొన్నాడు. తరువాత నిషాదరాజైన ఏకలవ్యుని దేశానికి వెళ్ళాడు. అప్పుడు ఏకలవ్యుని పుత్రుడు యుద్ధంతో ఆయనకు స్వాగతం పలికాడు. అర్జునుడు అక్కడ

నిషాదులతో గగుర్పాటు కలిగించే యుద్ధం చేశాడు. యుద్ధాలలో ఓటమి ఎరుగని అర్జునుడు యజ్ఞానికి విఘ్నం కలిగించవచ్చిన ఏకలవ్యపుత్రుని జయించాడు. మహారాజా! అర్జునుడు నిషాదరాజపుత్రుని జయించి, ఆతనిచే పూజితుడయి, మళ్ళీ దక్షిణ సముద్రతీరానికి గుర్రం వెంట వెళ్ళాడు.

అక్కడ కూడా ద్రవిడులు, ఆంధ్రులు, రౌద్రులు, మాహిషకులు, కోలాచల ప్రాంతంలో ఉండే వీరులతో కిరీటికి యుద్ధం జరిగింది. వాళ్లందరిని మృదుల పరాక్రమంతోనే జయించి, విజయుడు యజ్ఞాశ్వాన్ని అనుసరించి, సురాష్ట్రదేశానికి గోకర్ణానికి, ప్రభాసానికి వెళ్ళాడు. తరువాత యుధిష్ఠిరుని యజ్ఞాశ్వం వృష్ణివీరులచే పాలితమయి, సుందరమయిన ద్వారకానగరాన్ని సమీపించింది. రాజా! యాదవ కుమారకులు ఆ యజ్ఞాశ్వాన్ని బలవంతంగా పట్టుకొని, యుద్ధానికి సిద్ధమయ్యారు. కాని ఉగ్రసేన మహారాజు వారిని నివారించాడు. తరువాత అర్జునుని మేనమామ వసుదేవుని తీసుకొని వృష్ణి అంధక వంశరాజైన ఉగ్రసేనుడు నగరం బయటకు వచ్చాడు. వారు ఇద్దరు సంతోషంతో అర్జునుని కలిశారు. వారు భరతకుల శ్రేష్ఠుడైన అర్జునుని యథావిధిగా ఆదరించారు. చాలాగొప్పగా గౌరవించారు. తరువాత వారి అనుజ్ఞను తీసుకొని, అర్జునుడు గుర్రంతో పాటు అక్కడినుంచి వెళ్ళాడు. తరువాత ఆ హయం సముద్రానికి పడమటి వైపుగల దేశాలలో సంచరిస్తూ సమృద్ధమయిన పంచనద ప్రదేశానికి వెళ్ళింది. కురువంశీయా! ఆ యజ్ఞాశ్వం అక్కడినించి స్వేచ్ఛగా సంచరిస్తూ, అర్జునుడు వెంటరాగా, గాంధార దేశానికి వెళ్ళింది. తరువాత అర్జునునికి పూర్వవైరాన్ని అనుసరించే గాంధార రాజు శకునిపుత్రునితో ఘోరయుద్ధం జరిగింది.

84. శకుని పుత్రుని పరాజయము.

రాజా! గాంధారులలో మహారథుడు, వీరుడు అయిన శకుని కుమారుడు గొప్పసేనతో గూడి అర్జునుని ఎదిరించాడు. ఆ యోధులు తమ రాజైన శకుని వధను సహించలేక ధనుస్సులు పట్టుకొని గజ హయ, రథాలు, పతాకా ధ్వజాల సముదాయమూ గల మహాసైన్యంతో అర్జునుని ఎదిరించారు. పరాజయం ఎరుగని అర్జునుడు వారికి మేలు కలిగించే యుధిష్ఠిరుని మాటలను వినిపించాడు. కాని వారు దాన్ని లెక్కచేయలేదు. సామవచనాలతో అర్జునుడు వారిస్తున్నా కోపపూర్ణులయినవారు హయాన్ని చుట్టుముట్టి తీసుకుపోయారు. అందువల్ల అర్జునుడు కోపించాడు. తరువాత అర్జునుడు స్వల్ప ప్రయత్నంతోనే గాండీవం నుంచి విడిచిన పదును గల క్షురప్రాలతో వారి శిరస్సులను

ఖండించాడు. మహారాజా! బాణవర్షంతో తీవ్రంగా పీడితులయిన వారు పార్థునిచేతిలో చనిపోతూ యజ్ఞ హయాన్ని వదలి పారిపోయారు. గాంధారులు నిరోధిస్తున్నా పాండునందనుడు పేరుపేరున పిలిచి వారి శిరస్సులు నేల గూల్చాడు. ఈ రీతిగా గాంధారవీరులు అంతటా చనిపోతుండగా శకుని పుత్రుడు గాంధారరాజు అర్జునుని అడ్డుకొన్నాడు. క్షత్రియధర్మాన్ని అనుసరించి యుద్ధంచేస్తున్న ఆ రాజుతో పార్థుడు ఇలా అన్నాడు. "వీరా! యుధిష్ఠిరుని శాసనానుసారం నేను రాజులను చంపరాదు. ఇక యుద్ధం చాలు. నీకు నేడే పరాజయం కలుగదగదు." ఆ మాటలు విని కూడా అజ్ఞానంతో మోహితుడయిన ఆతడు ఇంద్రునితో సమానంగా వీరకార్యాలు చేసే అర్జునుని మీద బాణాలు వేశాడు.

అప్పుడు అమేయమయిన ఆత్మబలం గల అర్జునుడు జయద్రథుని శిరస్సును వలె అర్ధచంద్రబాణంతో ఆతని శిరస్త్రాణాన్ని అపహరించాడు. అది చూచి గాంధారులు అందరు పరమాశ్చర్యం పొందారు. ఆయన కావాలనే గాంధార రాజును చంపలేదు అని తెలుసుకున్నారు. గాంధార రాజపుత్రుడు పారిపోవాలని తలచి నీచ జంతువులతోవలె వారందరితో వెళ్ళసాగాడు. అలా పారిపోతున్న వారి తలలను అర్జునుడు పదునయిన వంగిన ములుకులు గల బాణాలతో వేగంగా ఖండించాడు. గాండీవంనుంచి పార్థుడు ప్రయోగించి విడిచిన అనేక బాణాలతో వారి పైకెత్తిన భుజాలను ఖండించాడు. వారికి ఇది తెలియలేదు. నరులు, గజాలు, అశ్వాలు గల్గి తొట్రుపాటుతో పారిపోతున్న ఆ సైన్యంలో అధికభాగం హతమయింది, ధ్వంసంమయింది. మాటిమాటికి యుద్ధభూమిలో గిరగిరా తిరిగింది. శ్రేష్ఠ వీరకార్యాలు చేసే మహావీరుడు అర్జునుడు శత్రువులను నేలగూలుస్తున్నాడు. శత్రుసేనలో అర్జునుని ఎదిరించగలవారే కన్పించలేదు. అంతట గాంధార రాజమాత భయపడి మంత్రులను, వృద్ధులను ముందు ఉంచుకొని ఉత్తమమయిన అర్ఘ్యం తీసుకొని నగరాన్నుంచి బయటకు వచ్చింది. ఆమె వచ్చిన వెంటనే రణంలో వ్యగ్రతలేని యుద్ధదుర్మదుడు అయిన పుత్రుని వారించింది. అనాయాసంగా వీరకర్మలు చేసే అర్జునుని ప్రసన్నుని చేసుకున్నది. అర్జునుడు ఆమెను గౌరవించి ప్రసన్నుడయ్యాడు. శకునికుమారునికి నచ్చచెపుతూ ఇలా అన్నాడు. "నాతో యుద్ధం చేయాలనే నీ ఆలోచన నాకు ఇష్టం కాదు. నీవు నాకు సోదరుడివే. రాజా! మా పెత్తల్లి గాంధారిని తలచి, ధృతరాష్ట్ర సంబంధం వల్ల నీవు బ్రతికావు. నీ అనుచరులందరు హతులయ్యారు. ఇలా చేయకు. ఉపశమించు. నీతో నాకు శత్రుత్వం ఉండరాదు. ఎప్పుడూ మాతో ఇలా ఉండకు. రాబోయే చైత్ర పూర్ణిమకు అశ్వమేధ యాగానికి రావలసింది."

85. అశ్వమేధారంభము - 1.

వైశంపాయనుడు చెప్పాడు - "రాజా! పార్థుడు ఈ రీతిగా పలికి స్వేచ్ఛాసంచారి అయిన హయం వెంట వెళ్ళాడు. తరువాత యజ్ఞాశ్వం హస్తినాపురం వైపు తిరిగి వెళ్ళసాగింది. యుధిష్ఠిరుడు యజ్ఞాశ్వం తిరిగి వస్తున్నదని చారులవల్ల విన్నాడు. అర్జునుడు క్షేమంగా ఉన్నాడని తెలిసి ఆయన మనస్సులో సంతోషించాడు. గాంధారదేశంలో, ఇతర దేశాల్లో అర్జునుని వీరకార్యాలను గురించి తెలుసుకొని యుధిష్ఠిరుడు సంప్రీతుడయ్యాడు. కురునందనా! ఆ రోజు మాఘమాసంలో శుక్లపక్షం ద్వాదశీతిథి. ఆనాడు పుష్యమీ నక్షత్ర యోగం రాగా మహాతేజస్వి, యుధిష్ఠిరుడు తన సోదరులు భీముడు, నకులుడు, సహదేవుడు అనే ముగ్గురిని పిలిపించాడు. ధర్మాత్ములలో శ్రేష్ఠుడు భీమసేనునితో ఇలా అన్నాడు. 'భీమసేనా! నీ తమ్ముడు అర్జునుడు యజ్ఞాశ్వంతో కూడా వస్తున్నాడు. ఈ విషయం అర్జునుని అనుసరించి వెళ్ళినవారు వచ్చి చెప్పారు. యజ్ఞాన్ని ఆరంభించవలసిన సమయం దగ్గర పడుతున్నది. యజ్ఞాశ్వం తిరిగి వస్తున్నది. మాఘ పూర్ణిమ రాబోతున్నది. ఇంక యజ్ఞానికి ఒక నెలమాత్రమే మిగిలి ఉంది. వేదపారగులయిన బ్రాహ్మణులను ఇప్పుడు పంపాలి. అశ్వమేధ యాగసిద్ధికి తగిన యజ్ఞం చేయదగిన ప్రదేశాన్ని వారు చూచి నిర్ణయించాలి." అని అనగా భీముడు తన తమ్ముడు వస్తున్నాడని విని ఆనందించాడు. రాజాజ్ఞను నిర్వర్తించాడు.

తరువాత భీమసేనుడు యజ్ఞ కార్యం చేయించటంలో నిపుణులయిన బ్రాహ్మణులను ముందు ఉంచుకొని ప్రాజ్ఞులయిన స్థపతులతో గూడా బయలుదేరి వెళ్ళాడు. ఆయన మద్దిచెట్లతో నిండి సుందరమయిన ప్రదేశాన్ని ఇష్టపడ్డాడు. దాన్ని కొలిపించాడు. తరువాత భీమసేనుడు అక్కడ ఉత్తమ మార్గాలతో శోభిల్లుతున్న యజ్ఞభూమిని శాస్త్రానుసారం నిర్మింపజేశాడు. ఆ భూమిలో అనేక ప్రాసాదాలు నిర్మించారు. వాటిలో నేల అంతా మణులతో నిర్మితం. ఆ యాగశాలను బంగారంతో రత్నాలతో అలంకరించారు. దాన్ని శాస్త్రానుసారం సిద్ధంచేశారు. అక్కడ సువర్ణమయాలు, విచిత్రమయిన స్తంభాలను, పెద్ద సింహద్వారాలను నిర్మించారు. ధర్మాత్ముడయిన భీమసేనుడు యజ్ఞశాలల ప్రదేశాలను స్వచ్ఛకాంచనమయంగా నిర్మింపజేశాడు. అంతఃపురస్త్రీలకు నానాదేశాల నుంచి వచ్చే రాజులకు, అనేక ప్రదేశాలనుంచి దేశాల నుంచి వచ్చే బ్రాహ్మణులకు తగిన నివాసాలను యథావిధిగా భీమసేనుడు నిర్మింపజేశాడు. మహాబాహూ జనమేజయా! అలాగే యుధిష్ఠిర మహారాజు ఆజ్ఞ ప్రకారం అనాయాసంగా వీరకార్యాలను చేసే భీమసేనుడు రాజులను

ఆహ్వానించటానికి దూతలను పంపించాడు. రాజోత్తమా! ఆ రాజులు అందరు కురురాజు యుధిష్ఠిరుని ప్రీతి కోసం అనేక రత్నాలను, స్త్రీలను, అశ్వాలను, ఆయుధాలను తీసుకొనివచ్చారు. మహాత్ములయిన ఆ రాజులు శిబిరాల్లో ప్రవేశించేటప్పుడు ఆకాశాన్ని అందేటంత మహధ్వని గర్జించే సాగర ఘోషలాగా ఉంది. కురువంశ వర్ధనుడు యుధిష్ఠిరుడు నూతనంగా వచ్చిన ఈ అతిథులను తగు రీతిగా గౌరవించటానికి ఆహారపానీయాలను అలౌకిక శయనాసనాలను సిద్ధం చేయ ఆజ్ఞాపించాడు.

ధర్మరాజు ఆ రాజుల వాహనాలకు వివిధమయిన శాలలను, వాటికి ఆహారంగా ధాన్యాన్ని చెరకు గడలను, ఆవుపాలను, సిద్ధంచేయమని ఆజ్ఞాపించాడు. ధీమంతుడయిన ధర్మరాజు చేయబోయే ఆ మహాయజ్ఞానికి బ్రహ్మవాదులయిన అనేక మునుల సమూహాలు విచ్చేశారు. మహారాజా! బ్రాహ్మణశ్రేష్ఠులు తమ తమ శిష్యులతోపాటు అక్కడకురాగా యుధిష్ఠిరుడు వారినందరిని స్వాగత పూర్వకంగా ఆహ్వానించాడు. మహతేజస్వి, యుధిష్ఠిరుడు దంభం వదలి వారందరిని స్వయంగానే వారికి నిర్ణీతాలయిన నివాసాలవరకు అనుసరించి వెళ్ళాడు. ఆ తరువాత స్థపతులు, శిల్పులు, తదితరులు ధర్మరాజు వద్దకు వచ్చి యజ్ఞశాల పనులన్నీ పూర్తి అయినాయని విన్నవించారు. అది విని ధర్మరాజు సోదరులతో కూడా ఆనందించాడు. ఆ యజ్ఞం ప్రారంభం అయిన తరువాత మాట నేర్పుగలవారు, యుక్తివాదులయిన విద్వాంసులు ఒకరినొకరు జయించాలనే కోరికతో అక్కడ అనేక విధాల తర్కించసాగారు. భారతా! దేవేంద్ర వైభవంతో భీమసేనుడు ఏర్పరచిన ఉత్తమ యజ్ఞవిధానాన్ని వచ్చిన రాజులు అంతా చూచారు. అక్కడ సువర్ణమయ మహద్వారాలను శయ్యలను, ఆసనాలను, విహారస్థలాలను, అనేక రత్న సమూహాలను వారు చూచారు. ఆ యజ్ఞంలో ఘటాలు, పాత్రలు, గంగాళాలు, కలశాలు, చెంబులను, ఆ రాజులు చూచారు. అక్కడ ఉన్న వన్నీ సువర్ణనిర్మితాలు తప్ప ఇతరాలు లేవు. శాస్త్రానుసారం కర్రతో నిర్మితాలయిన యూపాలు కూడా సువర్ణాలంకృతాలే. తగిన సమయంలో స్థాపితాలయిన అవి తేజోవంతంగా ఉన్నాయి. ప్రభూ! అక్కడికి తెచ్చిన స్థలంలో జనించినవి, జలంలో పుట్టినవి అయిన సమస్త పశువులు, వారు విన్నవి. తదితరాలను ఆ రాజులు చూచారు. ఆవులు, గేదెలు, వృద్ధస్త్రీలు, జీవజాతాలయిన జంతువులు, క్రూర జంతువులు, పక్షులు మావినుంచి పుట్టినవి, గ్రుడ్డు నుండి పుట్టినవి, స్వేదం వల్ల కలిగినవి. నేలచీల్చుకుని పుట్టినవి. పర్వతాలమీద జనించినవి, సముద్ర తటజాతాలు అయిన ప్రాణులను ఆ

రాజులు చూచారు. ఈ రీతిగా పశువులతో, గోవులతో, ధనధాన్యాలతో సమృద్ధమయి ఆనందపూర్ణమయిన యజ్ఞశాలను చూచి ఆ రాజులు అందరు పరమాశ్చర్యం పొందారు.

బ్రాహ్మణులకు, వైశ్యులకు అక్కడ సర్వసమృద్ధమయిన నానావిధరుచికరమయిన అన్నం అక్కడ ఉన్నది. ప్రతిరోజు లక్షమంది బ్రాహ్మణులు భోజనం చేయగా అక్కడ మేఘగర్జనతో సమంగా ధ్వనించే భేరిని మ్రోగించారు. ఈ రీతిగా దుందుభి దినంలో అనేక సారులు మ్రోగేది. రాజా! ధీమంతుడయిన ధర్మరాజు యజ్ఞం ఈ రీతిగానే ప్రతిదినం జరిగింది. అక్కడ పర్వతాలవంటి అన్నపురాశులు సిద్ధం చేసేవారు. పెరుగు కాలువలు, నేతి సరస్సులను జనం చూశారు. రాజా! అనేక జనపదాలతో గూడిన సమస్త జంబూ ద్వీపం అంతా ఒకేచోట ఉన్నట్లు ఆ మహాయజ్ఞంలో కన్పించింది. అక్కడికి వేలకొలది జనులు పాత్రలు అనేకం తీసుకొచ్చారు. రాజా! అక్కడ వేలకొలది మనుష్యులు బ్రాహ్మణులకు నానావిధ ఆహార పదార్థాలను వడ్డించారు. వారు అందరు సువర్ణహారాలను, స్వచ్ఛ మణిమయకుండలాలను అలంకరించు కొన్నారు. రాజు అనుయాయులు అక్కడ బ్రాహ్మణులకు అనేక విధాల అన్న పానీయాలను, రాజోచిత భోజనం వడ్డించారు."

86. అశ్వమేధారంభము - 2.

వైశంపాయనుడు చెప్పాడు - "జనమేజయా! యుధిష్ఠిర మహారాజు అశ్వమేధ యాగానికి వచ్చిన వేదవేత్తలను, భూపాలురయిన రాజులను చూచి భీమసేనునితో ఇలా అన్నాడు. నరశ్రేష్ఠా! నరపాలురు పూజ్యులుగదా! కాబట్టి ఈ వచ్చిన భూపాలురను తగిన విధంగా పూజించవలసింది. అని యశస్వి అయిన నరేశ్వరుడు చెప్పగా మహాతేజస్వి, పాండునందనుడు భీమసేనుడు తమ్ములు నకులసహదేవులతో కలసి అలాగే చేశాడు. ఇంతలోనే ప్రాణధారులు అందరిలో శ్రేష్ఠుడు గోవిందుడు వృష్ణులతో బలరాముని ముందుంచుకొని వచ్చాడు. ఆయనతో పాటు సాత్యకి, ప్రద్యుమ్నుడు, నిశఠుడు, సాంబుడు, కృతవర్మ కూడా ఉన్నారు. మహారథుడు భీముడు వారిని కూడా తగువిధంగా పూజించాడు. వారందరు రత్నాన్విత మహాభవనాలలో ప్రవేశించారు. మామూలు సంభాషణ తరువాత శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుని దగ్గర అనేక యుద్ధాలతో చిక్కిపోయిన అర్జునుని గూర్చి చెప్పాడు. శత్రువులను అణచివేసే అర్జునుని గూర్చి కుంతీ కుమారుడు ధర్మజుడు పలుమారులు ప్రశ్నించాడు. జగన్నాథుడు అర్జునుని గూర్చి ఆయనతో ఇలా అన్నాడు. "రాజా! అనేక యుద్ధాలు చేసి పాండవశ్రేష్ఠుడు అర్జునుడు చిక్కిపోయాడని ద్వారకానివాసి,

నాకు ఆప్తుడు ఒకడు చెప్పాడు. ప్రభూ ! ఆతడు దగ్గరలోనే ఉన్నాడు అని చెప్పాడు. కాబట్టి కుంతీనందనా! అశ్వమేధ యజ్ఞసిద్ధికి చేయవలసిన పనులను చేయవలసింది." అని చెప్పగా యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. "మాధవా! అదృష్టం వల్ల ఆ అర్జునుడు క్షేమంగా తిరిగి వస్తున్నాడు. యదునందనా! పాండవబలంలో ముందుండే అర్జునుడు పంపించిన సందేశం నీవు ఇక్కడ చెప్పగా తెలుసుకోగోరుతున్నాను."

ధర్మరాజు ఈ విధంగా అనగా వృష్ణి అంధకులకు అధిపుడు, మాటనేర్పుగల శ్రీకృష్ణుడు ధర్మాత్ముడయిన యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "మహారాజా! నావద్దకు వచ్చిన వ్యక్తి అర్జునుడు చెప్పింది గుర్తుచేసుకొని ఇలా చెప్పాడు - శ్రీకృష్ణా! తగు సమయంలో నీవు నామాటగా ఇది చెప్పవలసింది. కురుశ్రేష్ఠా! సమస్తరాజులు యజ్ఞం చూడవస్తారు. అలా వచ్చిన గొప్పవారిని పూజించటం మన కర్తవ్యం. అని చెప్పి మళ్ళీ ఆయన నాతో ఇలా అన్నాడు - మాన్యా! నీవు నాబదులుగా యుధిష్ఠిరునితో చెప్పు. పూర్వం రాజసూయ యజ్ఞంలో అర్ఘ్యం ఇచ్చేటప్పుడు కలిగిన దుర్ఘటన లాంటిది ఈసారి జరగరాదు. శ్రీకృష్ణా! యుధిష్ఠిర మహారాజు ఇలాగే చెయ్యాలి. దానిని నీవు గూడా అనుమతించు రాజా! రాజద్వేషం వల్ల మళ్ళీ ఈ ప్రజలందరు నశించకుండా ఉండాలి. అని కూడా చెప్పవలసింది. కుంతీనందనా! ఆ పురుషుడు ఈ విషయం కూడా చెప్పాడు - అది చెపుతాను, విను. రాజా! మన యజ్ఞానికి మణిపూర ప్రభువు, నా ప్రియపుత్రుడు మహాతేజస్వి బభ్రువాహనుడు వస్తాడు. ప్రభూ! ఆతనిని నీవు నా బదులుగా తగిన రీతిగా ఆదరించవలసింది. ఆతడు నాయందు ఎల్లప్పుడు భక్తుడు, అనురక్తుడు గూడా అయి ఉన్నాడు." ఈ మాటలు విన్న ధర్మరాజు ఆ మాటలు మెచ్చుకొని ఇలా అన్నాడు."

87. అర్జునుని పునరాగమనము.

"శ్రీకృష్ణా! నాకు చాలా ఇష్టమయిన మాట విన్నాను. ప్రభూ! ఈ మాట చెప్పటానికి నీవే అర్హుడివి. పవిత్రమయిన అమృతరసం వలె అది నన్ను ఆనందింపజేస్తున్నది. హృషీకేశా! విజయునికి రాజులతో మళ్ళీ అనేక యుద్ధాలు జరిగాయని విన్నాను. విజయుడయిన ఆ పార్థుడు ధీమంతుడు అయినా ఎందుకని సుఖహీనుడు అవుతున్నాడా ! అని నా మనస్సు బాధపడుతున్నది. జనార్దనా ! పాండునందనుడు అర్జునుడు నిరంతరం దుఃఖభాజనుడు అవుతున్నాడే అని ఏకాంతంలో చింతిస్తుంటాను. కృష్ణా! సర్వసల్లక్షణాలతో

పూజ్యమయిన ఆతని శరీరంలో ఈ అనిష్టకరమయిన లక్షణం ఉందా ? దానివల్లనే ఈ దుఃఖాలు పొందుతున్నాడు. కుంతీనందనుడు అర్జునుడు చాలా ఎక్కువ కష్టాలు నిరంతరం పడుతుంటాడు. అర్జునుని శరీరంలో నింద్యమయిన దేదీ కనిపించదు. ఆ విషయం నేను వినదగినదయితే వివరింపగోరుతాను." అని అడుగగా భోజరాజవంశవర్ధనుడు, హృషీకేశుడు విష్ణువు చాలా సేపు ఆలోచించి యుధిష్ఠిరునికి ఇలా సమాధానం చెప్పాడు. "నరేంద్రా! పురుషశ్రేష్ఠుడయిన అర్జునునికి పిక్కలు సగటున ఉండవలసిన దానికంటే పెద్దవిగా ఉన్నాయి. ఇంతకంటే ఆతని శరీరంలో వేరే అవలక్షణం నాకూ ఏమీ కన్పించలేదు. పురుషశ్రేష్ఠుడయిన ఆతడు పిక్కలు బాగా లావుగా ఉండటం వల్లనే నిరంతరం మార్గాలలో నడవవలసి వస్తుంది. అతడు దుఃఖభాజనం కావటానికి ఇంతకంటే ఇంకొకటి నాకు కనపడటం లేదు." ధీమంతుడయిన శ్రీకృష్ణుడు ఇలా చెప్పాక వృష్ణివంశశ్రేష్ఠునితో ధర్మజుడు "ప్రభూ! నీవు చెప్పింది యథార్థమే" అన్నాడు. ద్రుపద పుత్రిక కృష్ణ ఆయనను ఈర్ష్యతో పక్కచూపులతో ఉపాలంభించింది. కేశిహంత శ్రీకృష్ణుడు దాన్ని ఆదరంగా స్వీకరించాడు. తనకు ప్రియుడయిన అర్జునుని సఖుడు హృషీకేశుడు సమంగా అలాగే ఉంటాడు. అక్కడ ఉన్న భీమాదులయిన కౌరవులు, యజ్ఞం చేయించే బ్రాహ్మణులు అర్జునునికి సంబంధించిన ఈ విచిత్రవిషయం విని ఆనందించారు.

అక్కడివారు ఇలా మాట్లాడుకొంటూ ఉండగానే అర్జునుని వద్దనుంచి దూత వచ్చాడు. బుద్ధిమంతుడయిన ఆ దూత కురుశ్రేష్ఠుడయిన యుధిష్ఠిరుని వద్దకు వచ్చి నమస్కరించాడు. 'నరశ్రేష్ఠుడు అర్జునుడు వస్తున్నాడు' అని విన్నవించాడు. అది విని ఆనందబాష్పాలు నిండిన కన్నులతో యుధిష్ఠిర నృపతి తనకు ప్రియవార్త చెప్పినందుకు ఆతనికి సమృద్ధిగా ధనం ఇచ్చాడు. తరువాత రెండవరోజున కురువంశశ్రేష్ఠుడు, నరోత్తముడు అర్జునుడు వస్తుండటం వల్ల పెద్దధ్వని వెలువడింది. ఉచ్చైఃశ్రవంతో సమానమయిన వేగం గల యజ్ఞాశ్వం సమీపిస్తుండగా దాని గిట్టల తాకిడికి లేచిన దుమ్ము ఆకాశంలో శోభాకరంగా విలసిల్లింది. అక్కడ ఉన్నవారు అందరూ 'పార్థా! అదృష్టం వల్ల నీవు క్షేమంగా వచ్చావు. యుధిష్ఠిర మహారాజు ధన్యుడు.' అనే సంతోష సూచకాలయిన మాటలను అర్జునుడు విన్నాడు. 'యుద్ధంలో రాజులను జయించి భూమండలాన్ని అంతను అశ్వాన్ని సంచరింపజేసిరాగల వీరుడు అర్జునునికంటే వేరెవరు ఉన్నారు? గతించిన మహాత్ములు సగరాదులయిన రాజులు ఎవరూ గూడా ఇలాంటి వీరకార్యం చేసినట్లు ఎన్నడూ వినలేదు. అర్జునా! నీవు చేసిన దుష్కరమయిన ఈ వీరకృత్యాన్ని ఇకముందు

రాబోయే రాజులు కూడా చేయలేరు.' ఈ రీతిగా జనులు పలుకుతున్న చెవులకు ఇంపయిన మాటలు వింటూ ధర్మాత్ముడు ఫాల్గునుడు యజ్ఞవాటానికి చేరాడు. అప్పుడు యుధిష్ఠిర మహారాజు అమాత్యులతోను, యదునందనుడు శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని ముందుంచుకొని అర్జునునికి ఎదురు వెళ్ళారు. అర్జునుడు పెదతండ్రి ధృతరాష్ట్రుని పాదాలకు, ధీమంతుడు ధర్మరాజు పాదాలకు నమస్కరించాడు. భీమాదులను గౌరవించి శ్రీకృష్ణుని ఆలింగనం చేసుకున్నాడు. వారిచే అర్చితుడయి, వారిని శాస్త్రానుసారం పూజించి మహాబాహువు అర్జునుడు సముద్రం దాటదలచినవాడు ఒడ్డును చేరినట్లు విశ్రమించాడు. ఇదే సమయంలో ధీమంతుడు రాజు బభ్రువాహనుడు తల్లులతో కలసి కౌరవుల వద్దకు వచ్చాడు. మహాబాహువయిన ఆయన తనకంటె పెద్దవారయిన కౌరవులకు, వృద్ధులకు, ఇతర రాజులను నమస్కరించాడు. వారు ఈయనను అభినందించారు. తరువాత ఆయన నాయనమ్మ కుంతీదేవి శ్రేష్ఠమహాభవనంలోకి ప్రవేశించాడు."

88. అశ్వమేధారంభము - 3.

"మహాబాహువు బభ్రువాహనుడు పాండవుల భవనంలోకి ప్రవేశించాడు. మిక్కిలి సుందరమయిన కంఠంతో తన పేరుచెప్పుకొని నాయనమ్మకు నమస్కరించాడు. తరువాత రాజమాత చిత్రాంగద, ఉలూపి కుంతీదేవిని, ద్రౌపదీదేవిని వినయంతో సమీపించి నమస్కరించారు. చిత్రాంగద ఉలూపి సుభద్రను, ఇంకా ఇతర కురువంశ స్త్రీలను సముచిత రీతిని దర్శించారు. వారిద్దరికి కుంతీదేవి వివిధ రత్నాలను బహూకరించింది. ద్రౌపది, సుభద్ర, ఇతర స్త్రీలు, వారిద్దరికి బహుమతులు ఇచ్చారు. తరువాత రాజమహిషులు ద్రౌపదీ సుభద్రలు చాలా విలువయిన గొప్ప ఆసనాల మీద కూర్చున్నారు. అర్జునుని మేలుకోరే కుంతీదేవి వారిద్దరిని స్వయంగా ప్రత్యేకించి ఆదరించింది. మహాతేజస్వి బభ్రువాహనరాజు కుంతీదేవి సత్కారాన్ని పొందాడు. ధృతరాష్ట్రమహారాజును యథావిధిగా పూజించాడు. బభ్రువాహనుడు మహారాజు యుధిష్ఠిరుని, భీమాదులయిన ఇతర పాండవులను వినయంతో సమీపించి నమస్కరించాడు. బభ్రువాహనుని వారందరు ప్రేమగా కౌగలించుకున్నారు. సముచిత సత్కారం చేశారు. మహారథులయినవారు సంతుష్టులయి ఆయనకు ధనం కూడా బహూకరించారు. బభ్రువాహన నృపతి చక్రగదాధరుడు శ్రీకృష్ణుని, ప్రద్యుమ్నుని వలె వినయంగా సమీపించి నమస్కరించాడు. శ్రీకృష్ణుడు ఆ రాజుకు మిక్కిలి విలువయినది, అందరు ప్రశంసించెడి దివ్యాశ్వాలను పూన్చినది, సువర్ణాలంకృతము,

అయిన రథాన్ని బహూకరించాడు. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు విడివిడిగా బభ్రువాహనుని సత్కరించి ధనం ఇచ్చారు.

తరువాత మూడవరోజున వాగ్మి, సత్యవతీ నందనుడు, వ్యాసమహర్షి యుధిష్ఠిరుని వద్దకు వచ్చి ఇలా అన్నాడు. "కౌంతేయా! ఈ వేళనుండి యాగం ఆరంభించు. ఇది నీకు తగినది. యజ్ఞం చేయదగిన సమయం ఆసన్నమయింది. యాజకులు తొందర చేస్తున్నారు. రాజేంద్రా! నీ ఈ యాగంలో ఎలాంటి లోటు లేదు. ఏ లోపం లేకపోవటం వల్ల ఇది అహీనం (సర్వాంగపూర్ణం) అని చెప్పవచ్చు. ఇందులో సువర్ణం అనే ద్రవ్యం అధికంగా ఉంటుంది. కాబట్టి ఇది బహుసువర్ణకం అని ప్రఖ్యాతం అవుతుంది. మహారాజా! ఇలాగే దక్షిణను మూడు రెట్లు ఎక్కువ చెయ్యి. ఇందులో బ్రాహ్మణులు ప్రధానకారణం, మూడురెట్లు దక్షిణ ఎక్కువ కావటం వల్ల ఈ యజ్ఞం మూడు యజ్ఞాలతో సమం అవుతుంది. నరనాథా ! ఇక్కడ నీవు నేడు బహుదక్షిణలయిన అశ్వమేధాల ఫలాన్ని పొంది జ్ఞాతులను వధించటంతో చేసిన పాపాన్ని పోగొట్టుకుంటావు. కురునందనా! నీవు చేయబోయే అశ్వమేధావభృధస్నానం పరమపవిత్రం. ఉత్తమం, పావనం అయినది." ఈ రీతిగా మహామేధావి వ్యాసమహర్షి చెప్పగా యుధిష్ఠిరుడు అశ్వమేధయాగ సిద్ధికోసం దీక్షలో ప్రవేశించాడు. అంతట మహాబాహువు ఆ రాజు సమృద్ధమయిన అన్నం, దక్షిణలు గల్గి, సమస్తకామనలతో గుణాలతో గూడిన అశ్వమేధం అనే మహాయజ్ఞాన్ని ఆరంభించాడు.

రాజా! అక్కడ వేదవేత్తలయిన యజ్ఞం చేయించేవారు సర్వజ్ఞులు కాబట్టి సర్వకర్మలను నిర్వర్తించారు. వారు సర్వత్ర సంచరించి సజ్జనులవద్ద అభ్యసించిన కర్మకాండను ఆచరింపజేశారు. వారుచేసినదాంట్లో పొరపాటు గాని, తప్పు గాని లేదు. ఏ కర్మను వదలలేదు. సగంమాత్రమే చేయలేదు. ఆ శ్రేష్ఠబ్రాహ్మణులు ప్రతిపనిని పద్ధతిప్రకారం సముచితంగా పూర్తిచేశారు. రాజా! అక్కడ బ్రాహ్మణశ్రేష్ఠులు ప్రవర్గ్యం అనే ధర్మానుకూల కర్మను యథోచితంగా నిర్వర్తించి శాస్త్రానుసారం సోమాభిషవం సోమలతరసం తీయటం అనే పనిని చేశారు. రాజా! తరువాత సోమపాయులలో శ్రేష్ఠులు, శాస్త్రానుసారం ప్రవర్తించే విద్వాంసులు సోమరసం తీసి దానితో క్రమంగా సమయత్రయంలో చేయవలసిన సవనాలు చేశారు. ఆ యజ్ఞానికి వచ్చిన వారిలో ఎంత తక్కువ వాడయినా దీనుడుగాని, దరిద్రుడు గాని, ఆకలిగొన్నవాడు గాని, దుఃఖితుడుగాని లేడు. మహాతేజస్వి, శత్రునాశకుడు అయిన భీమసేనుడు రాజాజ్ఞానుసారం, భోజనానికి వచ్చినవారికి నిరంతరం భోజనం పెట్టించాడు. యజ్ఞవేది నిర్మాణంలో నిపుణులయిన యాజకులు ప్రతిదినమూ శాస్త్రోక్తవిధి ననుసరించి

సర్వకార్యాలు నిర్వర్తించారు. బుద్ధిమంతుడయిన యుధిష్ఠిరుని యజ్ఞంలోని సదస్యులలో ఒక్కడు గూడా షడంగాలలో విద్వాంసుడు గానివాడు, బ్రహ్మచర్యవ్రతం పాటించనివాడు, అధ్యాపనంలో కుశలుడు గానివాడు, వాదవివాదాలలో ప్రవీణుడుగాని వాడుగాని లేడు.

భరతశ్రేష్ఠా! తరువాత యూపస్థాపన సమయం ఆసన్నం కాగా యాజకులు యజ్ఞభూమిలో ఆరు మారేడు, చండ్రవి ఆరు, మోదుగవి ఆరు, దేవదారువుని రెండు, విరిగి చెట్టుది ఒకటి లెక్కన మొత్తం ఇరువది ఒక్క యూపాలు కురురాజు యుధిష్ఠిరుని యజ్ఞంలో నిలిపారు. భరతశ్రేష్ఠా! అలంకారం కోసం అనేకమయిన బంగారు యూపస్తంభాలను భీముడు ధర్మరాజు ఆజ్ఞానుసారం స్థాపింపజేశాడు. రాజర్షియుధిష్ఠిరుని యజ్ఞంలో వస్త్రాలతో అలంకృతాలయిన యూపస్తంభాలు ఆకాశంలో సప్తర్షులతో చుట్టూ ఉన్న ఇంద్రానుయాయులయిన దేవతలలాగా శోభిల్లాయి. యజ్ఞవేదినిర్మాణానికి అక్కడ బంగారు ఇటుకలను తయారు చేశారు. వాటితో నిర్మితమయిన యజ్ఞవేదిక దక్షప్రజాపతి యజ్ఞ వేదికలాగా విలసిల్లింది. ఆ యజ్ఞమండపంలో అగ్నిచయనానికి నాలుగు స్థానాలను నిర్మించారు. దానిలో ప్రతిదాని పొడవు 18 మూరలు, వెడల్పు 18 మూరలు ఉంది. ప్రత్యేక వేదిక సువర్ణమయ పక్షాలు గల గరుడాకారంలో ఉంది. దాన్ని త్రికోణాకారంలో నిర్మించారు. తరువాత విద్వాంసులు శాస్త్రోక్తవిధిననుసరించి, పశువులను ఏర్పరిచారు. భిన్నభిన్న దేవతలను ఉద్దేశించి పశుపక్షులను శాస్త్రోక్తమయిన వృషభాలను, జలచరాలను, అన్నింటిని అగ్నిస్థాపన కార్యంలో యాజకులు ఉపయోగించారు. కుంతీనందనుడు, మహాత్ముడయిన యుధిష్ఠిరుని యజ్ఞంలో నిలిపిన యూపాలకు మూడు వందల పశువులను బంధించారు. వాటన్నింటిలో ప్రధానమయినది ఆ అశ్వరత్నమే. సాక్షాత్తు దేవర్షులతో నిండి ఉన్న యుధిష్ఠిరుని ఆ యజ్ఞం మంచిశోభవంతంగా ఉన్నది. గంధర్వుల మధురసంగీతం అప్సరసల నాట్యం దానిశోభను ఇనుమడింపజేశాయి. ఆ యజ్ఞమండపం కింపురుషులతో నిండి ఉంది. కిన్నరులు దానిశోభను పెంపొందిస్తున్నారు. దానికి నలువైపులా సిద్ధులకు, విప్రులకు నివాసాలను ఏర్పరిచారు. వాటితో అది ఆవృతమయి ఉన్నది. వ్యాసశిష్యులు శ్రేష్ఠబ్రాహ్మణులు ఆ సదస్సులో ఎల్లప్పుడు ఉండేవారు. వారు సర్వశాస్త్రాలు రచించిన వారు. యజ్ఞాలు చేయించటంలో నిపుణులయిన వారు. ఆ సభలో నారదుడు, మహాతేజస్వి తుంబురుడు, విశ్వా వసువు, చిత్రసేనుడు, ఇంకా ఇతర సంగీత విద్యావేత్తలు ఉన్నారు. సంగీతనిపుణులు, నాట్యవిద్వాంసులు అయిన గంధర్వులు ప్రతిదినం యజ్ఞ క్రియల మధ్య ఆ బ్రాహ్మణులను తమ విద్యలతో ఆనందపరిచేవారు."

89. అశ్వమేధ యజ్ఞసమాప్తి.

వైశంపాయనుడు చెప్పాడు - "జనమేజయా! బ్రాహ్మణశ్రేష్ఠులు యథావిధిగా అన్య పశువులను శ్రపణం చేశారు. ఆ అశ్వాన్ని గూడా శాస్త్రానుసారం ఆలంభనం చేశారు. రాజా! తరువాత యాజకులు విధిపూర్వకంగా అశ్వాన్ని శ్రపణం చేసి దాని సమీపంలో మంత్రం, ద్రవ్యం, శ్రద్ధ అనే కళాత్రయం గల మనస్వినీ ద్రౌపదీ దేవిని శాస్త్ర విధిననుసరించి కూర్చోబెట్టారు. భరతశ్రేష్ఠా! బ్రాహ్మణులు శాస్త్రానుసారం ఆశ్వము వపను తీసి పరాకులేకుండా యథావిధిగా శ్రపణం చేశారు. ఆ వపాహోమం వల్ల వచ్చిన ధూమవాసనను ధర్మరాజు అనుజులతో గూడా ఆఘ్రాణించాడు. అది సర్వపాపాలను పోగొడుతుంది. నరపాలా! అశ్వశరీరంలో మిగిలిన అంగాలను అన్నింటిని ధీరులయిన మొత్తం పదునారు ఋత్విక్కులు అగ్నిలో హోమం చేశారు. భగవానుడు వ్యాస మహర్షి శిష్యులతో గూడా ఇంద్రుని తేజస్సు వంటి తేజస్సు గల యుధిష్ఠిరుని యజ్ఞం సమాప్తం చేసి ఆయనను ఆశీర్వదించాడు. తరువాత యుధిష్ఠిరుడు బ్రాహ్మణులకు యథావిధిగా వేయికోట్ల బంగారు నాణాలను దానం చేశాడు. వ్యాస మహర్షికి సమస్తభూమిని దానం చేశాడు. రాజా ! సత్యవతీ సుతుడు వ్యాసముని యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "రాజశ్రేష్ఠా! నీవు ఇచ్చిన ఈ భూమిని నీకే వదలి వేస్తున్నాను. దీని మూల్యాన్ని నాకు ఇవ్వు బ్రాహ్మణులు ధనార్థులు గదా!" ధీమంతుడు మహా మనస్వి, యుధిష్ఠిరుడు సోదరులతో కలసి మహాత్ములయిన రాజుల మధ్యలో ఆ బ్రాహ్మణులతో ఇలా అన్నాడు. "బ్రాహ్మణశ్రేష్ఠులారా! అశ్వమేధం అనే మహాయజ్ఞంలో భూమిని దక్షిణగా ఇచ్చే విధానం ఉన్నది. కాబట్టి అర్జునుడు జయించిన ఈ సమస్త భూమిని నేను ఋత్విక్కులకు ఇచ్చాను. ఇక నేను అడవికి వెళ్తాను. మీరు చాతుర్హోత్ర యజ్ఞ ప్రమాణానుసారం భూమిని నాలుగుభాగాలు చేసి మీరు పంచుకోండి. ద్విజశ్రేష్ఠులారా! నేను బ్రాహ్మణధనం తీసుకోటానికి ఇష్టపడను. నాసోదరుల అభిప్రాయం కూడా ఇదే." అని యుధిష్ఠిరుడు పలుకగా ఆయన సోదరులు, ద్రౌపది ఏక కంఠంతో మహారాజు చెప్పింది నిజం అన్నారు. ఈ మహా త్యాగాన్ని విన్నవారి రోమాలు నిక్కబొడిచాయి. భరతవంశీయా జనమేజయా! అప్పుడు అంతరిక్షం నుంచి సాధువాదాలు వినిపించాయి. అలాగే ప్రశంసిస్తున్న బ్రాహ్మణ సమూహాల మహాస్వనం విన్పించింది.

అప్పుడు కృష్ణ ద్వైపాయనుడు యుధిష్ఠిరునితో బ్రాహ్మణుల మధ్యన ఉండి ఆయనను అభినందిస్తూ ఇలా అన్నాడు. "రాజా! నీవు ఈ పృథివిని నాకు ఇచ్చావు. దీన్ని

నీకు తిరిగి నేను ఇస్తున్నాను. నీవు ఈ బ్రాహ్మణులకు బంగారం ఇయ్యి. ఈ భూమి నీదే అగుగాక." అప్పుడు వాసుదేవుడు (ధర్మరాజు) యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "వ్యాసభగవానుడు చెప్పినట్లే చేయటం నీకు సముచితం." అని చెప్పగా ఆ కురుశ్రేష్ఠుడు సోదరులతో గూడా మనస్సు సంతోషపడగా ప్రతి ఒక్క బ్రాహ్మణునికి యజ్ఞానికని ఆయన ఒక్కొక్క కోటిని మూడు రెట్లు దక్షిణ ఇచ్చాడు. మరుత్తును అనుకరిస్తూ ఈ కురురాజు చేసిన మహాదానం ఈ లోకంలో ఇంకొక రాజు చేయబోడు. విద్వాంసుడు కృష్ణ ద్వైపాయన మహాముని ఆ సువర్ణ రాశి తీసుకొని బ్రాహ్మణులకు ఇచ్చాడు. వారు దాన్ని నాలుగు భాగాలు చేసి తీసుకున్నారు. యుధిష్ఠిరుడు భూమి మూల్యంగా ధనం ఇచ్చి తన సోదరులతో కలసి ఆనందించాడు. ఆయన పాపాలు నశించాయి. స్వర్గం మీద అధికారం పొందాడు. అనంతమయిన ఆ సువర్ణరాశిని తీసుకొని ఋత్విక్కులు మహదానందంతో మహోత్సాహంతో బ్రాహ్మణులకు పంచి పెట్టారు. యజ్ఞశాలలో ఉన్న సమస్త సువర్ణాన్ని, సువర్ణభూషణాలను, హిరణ్యద్వారాలను, యూపాలను, ఘటాలను, పాత్రలను, ఇటుకలను యుధిష్ఠిరుని అనుమతితో బ్రాహ్మణులు పంచుకొన్నారు. బ్రాహ్మణులు తీసుకుపోయిన తరువాత మిగిలిన సువర్ణాన్ని క్షత్రియులు వైశ్యులు, శూద్రులు, మ్లేచ్ఛ జాతులవారు తీసుకువెళ్ళారు. తరువాత ఆ బ్రాహ్మణులు అందరు ధర్మరాజు ఇచ్చిన ఆ ధనంతో తృప్తిపొంది తమ నివాసాలకు వెళ్ళారు. ఆ మహాసువర్ణరాశిలో తన భాగంగా వచ్చిన దాన్ని మహాతేజస్వి వ్యాసభగవానుడు ఆదరంతో కుంతీదేవికి బహుమతిగా ఇచ్చాడు. మామగారు ప్రీతిగా ఇచ్చినదాన్ని ఫీసుకొని కుంతీదేవి మనస్సులో సంతోషించింది. దానితో ఆమె అనేక మహాపుణ్య కార్యాలు చేసింది. ధర్మరాజు యజ్ఞాంతంలో అవబృధ స్నానం చేసి పాపరహితుడయ్యాడు. దేవతల పూజలందుకొన్న ఇంద్రునివలె సోదరులచే సమ్మానితుడయి విరాజిల్లాడు. మహారాజా! భూపాలురు చుట్టూ ఉన్న పాండవులు తారా సమూహాలతో గూడిన గ్రహాలలాగా విరాజిల్లారు. ఆ తరువాత పాండవుడు యజ్ఞానికి వచ్చిన రాజులకు వివిధ రత్నాలను, గజాలను, అశ్వాలను, భూషణాలను, స్త్రీలను, వస్త్రాలను, బంగారాన్ని ఇచ్చాడు. రాజా! కుంతీకుమారుడు అంతులేని ఆ ధనాన్ని దానం చేస్తూ రాజసమూహ మధ్యంలో అపరకుబేరునిలాగా విరాజిల్లాడు. అలాగే మహావీరుడు, రాజు అయిన బభ్రువాహనునికి సమృద్ధిగా ధనం ఇచ్చి ఆయన నివాసానికి పంపాడు. భరతశ్రేష్ఠా! దుశ్శల పౌత్రుడయిన బాలకుని సోదరి సంతోషం కోసం ఆతని తండ్రి రాజ్యంలో

అభిషిక్తుని చేశాడు. యుధిష్ఠిరుడు ఆ రాజులకు సమృద్ధిగా ధనం ఇచ్చి గౌరవించి వారి రాజ్యాలకు పంపాడు. యుధిష్ఠిరుడు సోదరులతో కలిసి శ్రీకృష్ణుని, బలరాముని, ప్రద్యుమ్నాదులయిన వేలకొలది వృష్ణి వంశీయ వీరులను యథావిధిగా పూజించి వారి రాజ్యానికి పంపాడు. భరతశ్రేష్ఠా! ధీమంతుడయిన ధర్మరాజు అశ్వమేధయాగం ముగిసింది. ఆ మహాయాగంలో నానావిధ ఆహారాలు, ధనాలు, రత్నాలు రాశులుగా ఉండేవి. దేవతలకు మనస్సులలో సమధిక కాంక్షలను రేకెత్తించే వస్తు సాగరం తరంగితమయింది. నేతి బురద గల అనేక చెరువులు ఉండేవి. అన్ని పర్వతాలు, విలసిల్లాయి. భరత శ్రేష్ఠా! రసంతో నిండిన బురదలేని నదులు ప్రవహించాయి. (పిప్పలి శొంఠి కలిపి పెసరపప్పుతో తయారు చేసే రసాన్ని ఖాండవం అంటారు. దాంట్లోనే చక్కెర కలిపితే దాన్ని ఖాండవ రాగం అంటారు) భక్ష్యభోజ్య పదార్థాలు రాగ ఖాండవాలు సమధికంగా తయారు చేశారు. వాటిని వచ్చినవారు తిన్నారు. అనేక పశువులు అక్కడ కట్టి ఉన్నాయి. అక్కడివారికి వాటి అంతు తోచలేదు. ఆ యజ్ఞశాలలోకి వచ్చిన జనం మత్త ప్రమత్తులయి ఆనందించారు. యువతీ జనులు ప్రీతినందారు. ఆయజ్ఞవాటిక మృదంగశంఖధ్వనులతో మనోహరం అయింది. ఎవరికి ఏది కావాలంటే అది వారికి ఇస్తాం. అందరు స్వేచ్ఛగా భోజనం చేయండి. అని ఘోషణ రేయింబవళ్ళు విన్పించింది. ఎప్పుడూ ఆగలేదు. సంతుష్టులు పుష్టులు అయిన జనులు గల ఆ యజ్ఞశాల చర్చ నానా దేశవాసులు చాలా రోజులు చేస్తుండేవారు. భరతశ్రేష్ఠుడు యుధిష్ఠిరుడు కావలసిన రత్నాలతో రసాలతో ధనధారలను కురిపించి కృతార్థుడు పాపరహితుడయి హస్తినాపురం ప్రవేశించాడు."

90. నకులోపాఖ్యానము.

జనమేజయుడు అడిగాడు - "వైశంపాయనమునీ! నా పితామహుడు, ధీమంతుడయిన ధర్మరాజు యజ్ఞంలో కలిగిన ఆశ్చర్యకరవిషయాన్ని చెప్పవలసింది." వైశంపాయనుడు చెప్పాడు - "రాజశ్రేష్ఠా! ప్రభూ! అశ్వమేధ మహాయజ్ఞం పూర్తికాగా మహదాశ్చర్యకరమయిన విషయం జరిగింది. అది చెపుతాను విను. ద్విజశ్రేష్ఠులు, జ్ఞాతులు, సంబంధులు, బంధువులు, దీనులు, అంధులు, కృపణులు దానాదుల చేత సంతుష్టులయ్యారు. భారతా! యుధిష్ఠిరుడు చేసిన మహాదానాలను నలుదిక్కుల ప్రశంసించారు. ధర్మరాజు శిరస్సుమీద పుష్పవర్షాలు కురిశాయి. ఇవి అన్ని జరుగగా ఆ యజ్ఞ వాటంలోకి నల్లని

కనులు గల్గి శరీరంలో ఒకవైపు బంగారమయిన ఒక ముంగిస వచ్చింది. అది ఒక్కసారిగా ఉరుములాగా గర్జించింది. కలుగులో ఉండే ఆ మహత్తరమయిన ముంగిస మృగాలు పక్షులు భయపడేటట్లు ఒక మారు అలా పెద్దగా అరిచి మానవభాషలో ఇలా అన్నది. "నరనాథులారా ! కురుక్షేత్రంలో ఉంఛవృత్తి చేస్తూ మహాదాత అయిన బ్రాహ్మణుని ఒక శేరు పేలపిండి దానంతో మీరు చేసిన యజ్ఞం సమానం కాదు."

పాలంలో పంటకోసి తీసుకొనిపోయిన తరువాత పడి ఉండే గింజలు ఏరుకొనటం ఉంఛవృత్తి. ఉంఛః కణశ ఆదానం. అమరకోశం.

రాజా! ఆ ముంగిస మాటలు విన్న అక్కడ ఉన్న బ్రాహ్మణశ్రేష్ఠులు పరమాశ్చర్యం పొందారు. తరువాత ఆ బ్రాహ్మణులందరు ముంగిస వద్దకు వచ్చారు. "ముంగిసా! సాధు మహాపురుషులు గల ఈయజ్ఞశాలకు నీవు ఎక్కడినుంచి వచ్చావు ? నీకు ఉన్నబలమెంత ? నీకున్న శాస్త్రజ్ఞానం ఏమిటి ? మేము చేయించిన ఈ అశ్వమేధ యజ్ఞాన్ని నిందించే నీవు ఎవరివో మాకు ఎలా తెలుస్తుంది ? మేము నానావిధమయిన యజ్ఞ సామగ్రిని సమకూర్చుకొని వాటితో శాస్త్ర విధిని అతిక్రమించకుండా ఈ యజ్ఞాన్ని పూర్తిచేశాము. ఇందులో శాస్త్ర బద్ధమయి, న్యాయానుసారులయిన ప్రత్యేక కర్తవ్యాలను తగినట్లు చేశాము. మేము శాస్త్రదృష్టితో పూజింపదగినవారిని యథావిధిగా పూజించాము. మంత్రాలు చదువుతూ అగ్నిలో ఆహుతులు వేశాము. ఇవ్వదగినవాటిని అసూయారహితంగా దానం చేశాము. నానావిధాలయిన దానాలతో బ్రాహ్మణులు, న్యాయమయిన యుద్ధంతో క్షత్రియులు, శ్రాద్ధాలతో పితృదేవతలు, రక్షణతో వైశ్యులు, సర్వకామనలు, పూర్తిచేయటం ద్వారా స్త్రీలు, దయతో శూద్రులు, దానాలు చేసిన తరువాత మిగిలిన వస్తువులతో ఇతర జనులు, సంతుష్టులయ్యారు. యుధిష్ఠిరుని వినయ ప్రవర్తనతో పవిత్రతతో జ్ఞాతులు చుట్టాలు, హవిస్సులతో దేవతలు, శరణాగతులు సంతోషించారు. ఇవి అన్నీ యథావిధిగా జరిగినా నీవు ఏ లోపం జరిగిందని విన్నావో, చూచావో చెప్పు. ఈ బ్రాహ్మణుల ఎదుట, వీరి ఇచ్ఛానుసారం పూజాదులు జరిగినా లోపం ఏమిటో నిజం చెప్పు. నీ మాటలు నమ్మదగినట్లు ఉన్నాయి. నీవు మేధావిగా కన్పిస్తున్నావు. దివ్యరూపధారివిగా ఉన్నావు. ఇప్పుడు నీవు బ్రాహ్మణులతో ఉన్నావు. కాబట్టి నీవు మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి."

అని బ్రాహ్మణులు అందరూ అడగగా ఆ ముంగిస నవ్వుతూ ఇలా అన్నది. "ద్విజులారా! నేను అబద్ధం చెప్పలేదు. పొగరుగా పలుకలేదు. ద్విజశ్రేష్ఠులారా! ఆ బ్రాహ్మణుడు చేసిన శేరు పేలపిండి దానంతో మీరు చేయించిన యజ్ఞం సమానం కాదు. అని నేను

చెప్పింది, మీరు విన్నది యథార్థమే. ద్విజోత్తములారా! దీనికి కారణం నేను తప్పక చెప్పాలి. ఉన్నది ఉన్నట్లు జరిగింది జరిగినట్లు చెపుతాను, దీన్ని మీరు శాంతచిత్తులయి వినండి. కురుక్షేత్రంలో ఉంఛ వృత్తిలో ఉన్న మహాదాత బ్రాహ్మణునికి సంబంధించినది నేను చూచినది, అనుభవించినది ఉత్తమ మయినది అద్భుతమయినది. బ్రాహ్మణులారా! ఆ దానమహత్త్యంతో ఆ ద్విజుడు భార్యాపుత్ర స్నుషలతో స్వర్గం పొందాడు. దానిచేత నా శరీరంలో సగం బంగారం అయింది.ఆ విషయం అంతా చెపుతాను." ముంగిస చెప్పింది – "ద్విజులారా! న్యాయంగా లభించింది. కురుక్షేత్ర నివాసి బ్రాహ్మణుడు చేసిన చిన్నపాటి దానం ఉత్తమఫలాన్ని నేను చూచింది మీకు చెపుతాను. ఇది కొన్ని రోజుల పూర్వం జరిగిన వృత్తాంతం. ధర్మజ్ఞులయిన అనేక బ్రాహ్మణులు నివసించే ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రంలో ఉంఛవృత్తిని అవలంబించిన ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన పావురంలాగా గింజలు ఏరి తెచ్చి దానితో తన కుటుంబం పోషించేవాడు. ధర్మాత్ముడు, ఇంద్రియజయం గల ఆయన పవిత్రప్రవర్తనతో భార్యాపుత్రస్నుషలతో తపస్సు చేసుకొనేవాడు. ఉత్తమ నియమసంపన్నుడయిన ఆ విప్రుడు తనవారితో కూడా ఆరవకాలంలో అంటే మూడురోజులకు ఒకసారి భోజనం చేసేవాడు. ఒక్కొక్కప్పుడు ఆయనకు షష్ఠకాలంలో ఆహారం లభించదు. అయినా తరువాత ఇంకొక షష్ఠకాలం వచ్చినప్పుడే లభించిన ఆహారం భుజించేవాడు.

బ్రాహ్మణులారా! వినండి. ఒకప్పుడు అక్కడ మిక్కిలిభయంకరమయిన క్షామం సంభవించింది. ఆ రోజుల్లో ధర్మాత్ముడయిన ఆ బ్రాహ్మణుని వద్ద ఆహారం లేదు. చేలల్లో పంటలూ ఎండిపోయాయి. అందువల్ల ఆయన అన్నివిధాలా ద్రవ్యహీనుడయ్యాడు. పలుమారులు, షష్ఠకాలం వచ్చేది. ఆ సమయంలో ఆయనకు భోజనం ఉండేది కాదు. అప్పుడు వారు అందరు ఆకలితో ఉండేవారు, ఒకరోజు జ్యేష్ఠమాసం శుక్లపక్షంలో మధ్యాహ్నం సూర్యుడు తీవ్రంగా తపింపజేస్తున్నాడు. అప్పుడు ఆ కుటుంబం అంతా గింజలు ఏరి తెచ్చుకోవటానికి బయలుదేరింది. తపోమగ్నుడయిన ఆ బ్రాహ్మణుడు ఎండతో, ఆకలితో, పీడితుడయ్యాడు. ఆకలి శ్రమ కల ఆయనకు ఉంఛధాన్యం లభించలేదు. ఆయనకు ఆహారానికి ఒక్క గింజ కూడా దొరకలేదు. అందువల్ల ఆ కుటుంబంలోని అందరితోపాటు ఆకలితో పీడితుడయినా కాలం గడిపాడు. అతికష్టంగా ఆ బ్రాహ్మణుడు ప్రాణరక్షణ చేసుకున్నాడు. తరువాత ఒక రోజు షష్ఠకాలం వచ్చేసరికి ఆయన ఒక సేరు ధాన్యం సంపాదించాడు. తపస్వులయిన ఆ బ్రాహ్మణులు ఆధాన్యాన్ని పిండిచేశారు. జపం,

నిత్యకర్తవ్యం, పూర్తిచేసి అగ్నిలో ఆహుతులు వేసిన తరువాత వారు ఆ పిండిలో తలా నాలుగో భాగం విభజించుకొని తినటానికి సిద్ధమయ్యారు. ఆహారం తీసుకోబోతున్న వారి వద్దకు ఒక బ్రాహ్మణాతిథి వచ్చాడు. వచ్చిన ఆ అతిథిని చూచి వారు మనసులో ఆనందించారు. అ ిథికి నమస్కరించి క్షేమాదికం అడిగారు.

బ్రాహ్మణ ుంబంలోని వారందరు నిర్మలమనస్కులు, జితేంద్రియులు, శ్రద్ధగల వారు, స్వాధీనచిత్తులు, అసూయ క్రోధం లేనివారు, సజ్జనులు, మాత్సర్యం లేనివారు, ధర్మం తెలిసినవారు ఆ ఉత్తమ బ్రాహ్మణులు అభిమానాన్ని, మదాన్ని, క్రోధాన్ని వదలినవారు - ఆకలితో అలమటిస్తున్న అతిథి బ్రాహ్మణునికి తమ బ్రహ్మచర్యం, గోత్రప్రవరలు చెప్పుకొని తమ కుటీరంలోకి తీసుకువచ్చారు. అనఘా! ఇదిగో అర్ఘ్యం, ఇదిగో పాద్యం, ఇదిగో ఆసనం. ఇవన్నీ మీ కోసం సిద్ధంగా ఉన్నాయి. ద్విజశ్రేష్ఠా! న్యాయంగా సంపాదించిన పవిత్రమయిన ఈ సక్తుపిండిని నీకు ఇస్తున్నాను. దీనిని తీసుకొని ఆరగించండి. మీకు మేలు కలుగుగాక. రాజేంద్రా ! ఇలా చెప్పి విప్రుడిచ్చిన సక్తుపిండిలో నాలుగో భాగం తీసుకొని భక్షించాడు. కాని ఆయనకు తృప్తి కలుగలేదు. ఉంఛవృత్తి అయిన ఆ బ్రాహ్మణుడు ఆకలి తీరని ఆ అతిథిని చూచి ఈయనకు ఇంక ఆహారం ఎలాగా? అని ఆలోచించసాగాడు. ఆ విప్రుని భార్య భర్తతో నా భాగం సక్తుపిండిని ఇవ్వండి. ఈ ద్విజోత్తముడు అది తిని సంతుష్టడయితే ఈయన తన ఇష్టంవచ్చిన చోటికి వెళ్తాడు. ఆ ద్విజసత్తముడు ఇలా మాట్లాడుతున్న ఆ సాధ్వి ఆకలిగొని ఉన్నదని తెలుసుకొని ఆ సక్తుపిండిని తీసుకోదలచలేదు. విద్వాంసుడయిన ఆ విప్రశ్రేష్ఠుడు తన భార్యస్థితిని ఊహించాడు. ఆమె వృద్ధురాలు. ఆకలిగొని ఉన్నది. అలసి వాడిపోయి ఉంది. శరీరంలో చర్మం, ఎముకలు మాత్రమే ఉన్నాయి. వణుకుతున్నది. అది చూచి భార్యతో భర్త ఇలా అన్నాడు.

'కల్యాణీ! భార్యను పురుగులు, పక్షులు, మృగాలు కూడా రక్షిస్తాయి. పోషిస్తాయి. కాబట్టి నీవు ఇలా అనరాదు. **తాను పురుషుడయి ఉండి గూడా స్త్రీచేత తనను రక్షించుకొనేవాడు, పోషించుకొనేవాడు దయనీయుడు అవుతాడు.** అతడు పతితుడవుతాడు. అపకీర్తి పాలవుతాడు. దీప్తిమంతమయిన ఉత్తమలోకాలకు చేరడు. ధర్మం అర్థం, కామంతో చేయవలసిన పనులు, సేవ, వంశ సంతతి అనేవి భార్యధనాలు, స్వధర్మంకూడా భార్యాశ్రితమే. భార్యారక్షణం తన కర్తవ్యం అని భావించనివాడు భార్యారక్షణలో అసమర్థుడయిన పురుషుడు ఈ లోకంలో అపకీర్తిపాలయి నరకానికి పోతాడు.' అని

భర్త అనగా భార్య ఇలా అంది. 'ద్విజోత్తమా! మనకు ఇద్దరికి ధర్మం, అర్థం సమానం. కాబట్టి పేలపిండిలో నాభాగమయిన నాలుగోభాగాన్ని పావుసేరు తీసుకుని ప్రసన్నుడివి కమ్ము. ద్విజశ్రేష్ఠా! స్త్రీల సత్యపాలనం, రతి, ధర్మం, సద్గుణాలతో సంపాదించే స్వర్గం, ఇతర లౌకిక కాంక్షలు అన్నీ భర్త అధీనంలోనే ఉంటాయి. తల్లి రజస్సు, తండ్రి వీర్యం అనే రెండూ కలియటంతోనే వంశపరంపర కొనసాగుతుంది. స్త్రీకి భర్తయే పరమదైవం. స్త్రీలకు కలిగే రతిసుఖం, పుత్రఫలప్రాప్తి భర్త ప్రసాదమే అవుతాయి. రక్షించటం వల్ల, పాలించటం వల్ల నీవు నాకు పతివి. భరించటం, పోషించటం వల్ల భర్తవు. పుత్రుని ప్రసాదించటం వల్ల వరదుడివి. కాబట్టి నాభాగమయిన పేలపిండిని తీసుకొనవలసింది. నీవు గూడా వయస్సు మీద పడగా వృద్ధుడివి, ఆకలిగొని ఉన్నావు, బాగా దుర్బలుడివి, ఉపవాసాలతో బాగా అలసిపోయావు, చిక్కిపోయావు, కాబట్టి నీవు ఆకలిబాధను తట్టుకొన్నట్లే నేనూ తాళగలను.' ఆ గృహస్థ బ్రాహ్మణుడు భార్య మాటలప్రకారం, సక్తుపిష్టం తీసుకుని ద్విజశ్రేష్ఠా! ఈ సత్తుపిండిని తీసుకోండి. అన్నాడు. ఆ బ్రాహ్మణుడు అది తీసుకొని భుజించాడు. కాని సంతుష్టుడు కాలేదు. ఉంఛవృత్తి బ్రాహ్మణుడు అది గుర్తించి ఈయనకు ఇంకా ఆహారం ఎలా పెట్టాలా! అని ఆలోచనాపరుడయ్యాడు.

పుత్రుడన్నాడు - 'సత్పురుషశ్రేష్ఠా! జనకా! నా భాగమయిన సత్తుపిండిని బ్రాహ్మణునికి ఇవ్వవలసింది. ఇది పుణ్యకార్యం అని భావిస్తాను. అందువలన ఈ పని చేస్తున్నాను. నేను ప్రయత్న పూర్వకంగా మిమ్ములను రక్షించాలి. వృద్ధుడయిన తండ్రిని పాలించటాన్ని సాధుపురుషులు కోరుతుంటారు. ముసలితనంలో ఉన్న తండ్రిని పాలించటమే పుత్రుడు ఉండటానికి ఫలం. బ్రహ్మర్షీ ! మూడు లోకాల్లో ఈ శ్రుతి ప్రసిద్ధమైఉంది. ప్రాణాలు శరీరంలో ధరించి ఉంటేనే మీరు తపస్సు చేయ వీలవుతుంది. దేహధారులకు శరీరంలో ఉండే ప్రాణమే పరమధర్మం గదా!' తండ్రి అన్నాడు - 'నాయనా! నీకు వెయ్యి ఏండ్లు వచ్చినా నా ఉద్దేశ్యంలో బాలుడివే. తండ్రి పుత్రుని కని ఆతని వల్ల కృతకృత్యుడు అవుతాడు. పిల్లలకు ఆకలెక్కువగా ఉంటుంది. అని నాకు తెలుసు. పుత్రా! వృద్ధుడనయి నా ప్రాణాలు నిలబెట్టుకొంటాను. నీవు బలిష్ఠుడిగా ఉండాలి. వయస్సు ఎక్కువ కావటం వల్ల ఆకలి నన్ను బాధించదు. పుత్రా! బహుకాలం తపస్సు చేశాను. మరణం అంటే నాకు భయం లేదు.' పుత్రుడు అన్నాడు - 'తండ్రీ! నేను సంతానాన్ని. పురుషుని రక్షించటం వల్లనే సంతానాన్ని పుత్రుడు అన్నారు. ఇంతేకాక పుత్రుడు తండ్రికి ఆత్మఅని చెప్పారు. కాబట్టి మీరు మీ ఆత్మ అయిన పుత్రునితో

మిమ్ములను రక్షించుకోండి.' తండ్రి అన్నాడు - 'పుత్రా! నీవు. రూపంతో, శీలంతో, ఇంద్రియనిగ్రహంతో నీవు నాతో సమానుడివి. అనేక విధాల నిన్ను పరీక్షించాను. కాబట్టి నీ భాగమయిన సత్తుపిండిని తీసుకొంటాను.' అని చెప్పి ఆ ద్విజశ్రేష్ఠుడు మనస్సులో సంతోషించాడు. అప్పుడు ఆయన నవ్వుతూ ఆ సక్తుపిష్టాన్ని అతిథి బ్రాహ్మణునికి ఇచ్చాడు.

ఆ సత్తుపిండి భుజించి గూడా అతిథి సంతృప్తినందలేదు. అదిచూచి ధర్మాత్ముడయిన ఉంఛవృత్తి బ్రాహ్మణుడు చాలా సంకోచపడ్డాడు. ఆయన కోడలు గూడా ఉత్తమశీలసంపన్నురాలు. ఆమె బ్రాహ్మణునికి సంతోషం కలిగించగోరి మామగారివద్దకు సత్తుపిండి తీసుకొనివెళ్ళి సంతోషంతో ఇలా అన్నది. 'బ్రాహ్మణోత్తమా! శ్వశురా! మీ సంతానమయిన పుత్రుని వల్లనాకు సంతానం కలుగుతుంది. కాబట్టి నాభాగమయిన సత్తుపిండిని తీసుకొని అతిథికి సమర్పించండి. మీ దయవల్ల నాకు అక్షయలోకాలు సంప్రాప్తించాయి. మానవుడు పుత్రునిద్వారా దుఃఖం కలుగని ఉత్తమలోకాలను పొందుతాడు. ధర్మము, దానితోగూడి అర్థకామాలు అనే మూడు స్వర్గప్రాప్తి కలిగిస్తాయి. ఆహవనీయం, గార్హపత్యం, దక్షిణాగ్ని అనే మూడు స్వర్గసాధనాలు. అలాగే పుత్ర, పౌత్ర ప్రపౌత్రులు అనే సంతానత్రయం అక్షయస్వర్గ ప్రాప్తికి సాధనం అవుతుంది. పుత్రుడు పితరులను ఋణాన్నుంచి తరింపజేస్తాడని, పుత్రపౌత్రులతో ఉత్తమలోకాలను పొందుతాడని వింటాము.' మామగారు అన్నాడు - 'ఉత్తమ వ్రతాలు, ఆచారాలు గల కోడలా! గాలికి నీశరీరం అంతా కృశించింది. రంగుమారింది. బాగా అలసట చెంది ఉన్నావు. నీ మనస్సు కూడా ఆకలితో విహ్వలం అయింది. శుభప్రవర్తనగల కల్యాణీ! ధర్మాన్ని ధ్వంసం చేసి నీవద్ద నుండి పేలపిండిని ఎలా తీసుకునేది ? అమ్మా నీవు ఇలా అనటం తగదు. సౌభాగ్యవతీ! మూడురోజులకొక సారి ఆహారం స్వీకరించే వ్రతంగలదానివి, పవిత్రత, శీలం, తపస్సులతో గూడినదానివి, చాలా కష్టపడుతూ నిరాహారంగా ఉన్న నిన్ను ఎలా చూడగలను? చిన్నదానివి, ఆకలిగొన్నదానివి, స్త్రీవి అయిన నిన్ను మామనయిన నేను ఎల్లప్పుడు రక్షించాలి. బంధువులనందరిని ఆనందపరిచే నీవు ఉపవాసాలతో చాలా అలసట చెంది ఉన్నావు.'

కోడలు అన్నది - ప్రభూ! మహాత్మా! నాకు గురువయిన భర్తకు మీకు గురువులు. నాదైవానికి మీరు దేవత. మీరు దేవుని మించిన దేవులు. అందువల్ల ఈ సక్తువులను గ్రహించండి. ఈ దేహం, ప్రాణం, ధర్మం అన్నీ పెద్దలు మీ సేవకోసమే. ద్విజోత్తమా! మీ అనుగ్రహం వల్లనే మేము ఉత్తమలోకాలు పొందగలం. బ్రాహ్మణోత్తమా!

నేను మీయందు దృఢభక్తిగల దాన నని రక్షించదగినదాన నని యోగక్షేమాలు విచారించదగినదానిని అని భావించి అతిథికోసం నాభాగమయిన సత్తుపిండిని తీసుకోవలసింది.' మామగారు అన్నాడు - 'కోడలా! సాధ్వివి అయిన నీవు ఇలా అనటం వల్ల ఉత్తమశీలప్రవర్తనలతో శోభిల్లుతున్నావు. ధార్మికమయిన నియమాలతో గూడి నీవు పెద్దల సేవలో తత్పరురాలవయినావు. ధర్మాత్ములలో శ్రేష్ఠురాలవయిన మహాభాగా! నీ మాట పాటించి నీభాగమయిన సత్తుపిండిని తీసుకుంటున్నాము.' అని పలికి ఆయన ఆసక్తువులను తీసుకొని అతిథి బ్రాహ్మణునికి ఇచ్చాడు. తరువాత ఆ విప్రుడు సాధువు, మహాత్ముడయిన ఉంఛ ద్విజుని దానానికి సంతుష్టుడయ్యాడు.

వాస్తవానికి ఆ శ్రేష్ఠబ్రాహ్మణ రూపంలో వచ్చింది సాక్షాత్తూ ధర్మదేవత. వాఙ్నిపుణతగల ధర్ముడు సంతోషించి ఉంఛవృత్తి ద్విజునితో ఇలా అన్నాడు. "ద్విజోత్తమా! న్యాయంగా నీవు సంపాదించి యథాశక్తిగా పవిత్రము, ధార్మికమయి నీవు చేసిన దానానికి సంప్రీతుడినయ్యాను. ఆహా! నీవు చేసిన దానాన్ని స్వర్గ లోకనివాసులు స్వర్గంలో ప్రశంసా ఘోష చేస్తున్నారు. దేవర్షులు, దేవతలు, గంధర్వులు, దేవశ్రేష్ఠులు, దేవదూతలు నీవు చేసినదానానికి ఆశ్చర్యపరవశులయి ఆకాశం నించి పుష్పవర్షం భూమిమీద కురిపిస్తున్నారు. చూడు. బ్రహ్మర్షులలోకంలో విమానాల్లో సంచరించే బ్రహ్మర్షులు నీ దర్శనం కోరుతున్నారు. కాబట్టి బ్రాహ్మణశ్రేష్ఠా! స్వర్గానికి వెళ్ళు. పితృలోకంలో ఉన్న మీ పితరులనందరినీ తరింపజేశావు. ఇకముందు రాబోయే అనేక యుగాల్లో నీ తరాల వారు కూడా నీ పుణ్య మహిమచేత తరిస్తారు. ద్విజా! నీవు పాటించిన బ్రహ్మచర్యం, దానం, యజ్ఞం, తపస్సు, సాంకర్యం లేని ధర్మానుష్ఠానం అనేవాటి ప్రభావం వల్ల స్వర్గానికి వెళ్ళు. ఉత్తమ వ్రతాన్ని పాటించిన ద్విజోత్తమా! ఉత్తమమయిన శ్రద్ధతో నీవు తపస్సు ఆచరిస్తున్నావు. దానిచేత, నీవు చేసిన దానం చేత దేవతలు సంప్రీతులయ్యారు. నీవు కష్టకాలంలో పవిత్రమయిన మనస్సుతో నీ సర్వస్వమూ అయిన ఆహారం దానం చేశావు. ఈ సర్వోత్తమ కార్యం వల్ల నీవు స్వర్గాన్ని జయించావు. **ఆకలి ప్రజ్ఞను తొలగిస్తుంది. ధర్మబుద్ధిని పోగొడుతుంది. ఆకలివల్ల జ్ఞానం లోపిస్తుంది. ఆతడు దిటవు కోల్పోతాడు. ఆకలిని జయించినవాడు స్వర్గాన్ని జయిస్తాడు.** ఇది నిశ్చయం. మానవునిలో దాన రుచి పెంపొందినప్పుడు ధర్మం కుంటుపడదు. నీవు పుత్రప్రేమను భార్యాప్రేమను చూడకుండా ధర్మమే గొప్పది అని తెలుసుకొన్నావు. దానిముందు ఆకలి దప్పులను లెక్కపెట్టలేదు. **మానవులు అన్నింటికంటే**

ముందు న్యాయపూర్వకంగా ధనసంపాదనకు ఉపాయం తెలుసుకోవటమే సూక్ష్మవిషయం. ఆ ధనాన్ని యోగ్యునికి ఇవ్వటం అంతకంటే శ్రేష్ఠం. సామాన్య కాలంలో చేసేదాని కంటే శ్రేష్ఠకాలంలో దానం చేయటం ఇంకా గొప్పది. కాలాని కంటే శ్రద్ధ ఇంకా ఉత్తమం. స్వర్గద్వారం అత్యంత సూక్ష్మం. అజ్ఞానం వల్ల నరులు దీన్ని చూడలేరు.

స్వర్గద్వారానికి ఉండే గడియ లోభమనే బీజంతో నిర్మితం. దాని ద్వారం మమకారంతో గుప్తం అవుతుంది. కోపాన్ని జయించినవారు. ఇంద్రియ విజేతలు తపోయుక్తులు యథాశక్తిగా దానం చేసే బ్రాహ్మణులు దాన్ని చూస్తారు. శ్రద్ధగా దానం చేసేవాడు వేయి ఇచ్చే శక్తి ఉంటే వంద దానం చెయ్యాలి. నూరు ఇవ్వగలవాడు పది ఇవ్వాలి. ఏమీ లేనివాడు కనీసం నీళ్ళయినా దానం చేస్తే వీరందరికి వచ్చే పుణ్యఫలం సమానం అవుతుంది. బ్రాహ్మణా! రంతిదేవుడు అనే రాజు ధనం ఏమీ లేకపోవటం చేత పవిత్రమనస్సుతో జలదానం చేశాడు. దాని ఫలితంగా స్వర్గానికి వెళ్ళాడు. **నాయనా! న్యాయంగా లభించినవి, శ్రద్ధతో పవిత్రమయిన స్వల్పదానాలతో ధర్మదేవత సంతోషించినంతగా అధర్మంగా సంపాదించి చేసిన పెద్దపెద్ద దానాలతో సంతోషించదు.*** నృగమహారాజు బ్రాహ్మణులకు వేలగోదానాలు చేశాడు. కాని తరువాత ఆయన ఒకరికి దానమిచ్చిన గోవునే ఇంకొకరికి దానం చేశాడు. అన్యాయ ప్రాప్త ధనదానం వల్ల ఆయన నరకానికి వెళ్ళాడు. ఉశీనరపుత్రుడు, ఉత్తమ వ్రతపాలకుడయిన శిబి మహారాజు తన శరీర మాంసాన్ని దానం చేయటం చేత పుణ్యాత్ములు పొందే స్వర్గ లోకంలో ఆనందిస్తున్నాడు. విప్రశ్రేష్ఠా! మానవునికి ధనం మాత్రమే పుణ్యహేతువు కాదు. సాధుపురుషులు తమశక్త్యనుసారం సుగమంగా పుణ్యం ఆర్జిస్తారు. న్యాయపూర్వంకంగా సంపాదించిన అన్నదానం చేయటం వల్ల కలిగే ఉత్తమపుణ్యం నానావిధాలయిన యజ్ఞాలు చేయటం చేత కలుగదు. **దాత కోపం వల్ల దానఫలం నాశనం చేస్తాడు. లోభం వల్ల స్వర్గానికి వెళ్ళడు. న్యాయంగా సంపాదించిన దానితో జీవితం గడిపేవాడు, దాన మహిమ తెలిసినవాడు దానతపస్సులతో స్వర్గానికి వెళ్తాడు.**** ఈ దానం చేత నీవు సంపాదించిన ఫలంతో అనేకమయిన

---

* న ధర్మః ప్రీయతే తాత దానైర్దత్తైర్మహాఫలైః ॥ 98
న్యాయలబ్ధైర్యథా సూక్ష్మైః శ్రద్ధాపూతైః స తుష్యతి ।

**క్రోధాద్దానఫలం హంతి లోభాత్స్వర్గం న గచ్ఛతి ॥102
న్యాయవృత్తిర్హి తపసా దానవిత్స్వర్గమశ్నుతే ।

రాజసూయ యాగాలు, అనేక దక్షిణలతో చేసిన బహు అశ్వమేధాల వల్ల గలిగే ఫలం సమానం కాదు. బ్రాహ్మణా! ఒక సేరు పేలపిండిని దానం చేసి నీవు అక్షయ బ్రహ్మలోకం జయించావు. విప్రా! పాపరహితమయిన బ్రహ్మ నివాసానికి సుఖంగా వెళ్ళు. ద్విజశ్రేష్ఠా! మీ కుటుంబంలోని అందరి కోసం దివ్యమయిన వాహనం వచ్చింది. మీ ఇష్టానుసారం ఈ దివ్య విమానం ఎక్కండి. ద్విజా! ఇటుచూడు నేను ధర్మదేవతను. నీవు శరీరాన్ని ఉద్ధరించావు. నీ కీర్తి లోకంలో స్థిరంగా ఉంటుంది. భార్యాపుత్రులు, కోడలితో గూడా దేవలోకానికి వెళ్ళు." అని ధర్మదేవత పలుకగా ఆ బ్రాహ్మణుడు భార్యాపుత్రస్నుషలతో స్వర్గానికి వెళ్ళాడు. ధర్మజ్ఞుడైన ఆ బ్రాహ్మణుడు భార్యా పుత్రస్నుషలతో స్వర్గానికి వెళ్ళిన తరువాత నేను కన్నంలోనించి వెలుపలకు వచ్చాను.

అప్పుడు సత్తుపిండి సువాసన ఆఘ్రాణించటం చేత అక్కడ నీటిచే తడిసిన బురద తగలటం వల్ల, అక్కడ పడ్డ దివ్యపుష్పాల రాపిడివల్ల, మహాత్ముడయిన ఆ బ్రాహ్మణుడు దానం చేసిన అన్నకణాల మీద మనసుపోవటం చేత, ఆయన తపో మహిమ చేత నా తల బంగారం అయింది. బ్రాహ్మణులారా! సత్యప్రతిజ్ఞుడయిన ఆ బ్రాహ్మణుని సక్తుదానం వల్ల నా శరీరంలో సగం భాగం సువర్ణమయం అయింది. ద్విజులారా! ఆ ధీమంతుని తపః ఫలంగా సువర్ణమయమయిన ఈ పార్శ్వాన్ని చూడండి. ఇప్పుడు నా శరీరం రెండవ వైపు ఇలా సువర్ణమయం ఎలా అవుతుందా ! అని చింతామగ్నుడి నయ్యాను. ఈ ఉద్దేశ్యంతో నేను సంతోషంతో ఉత్సాహంతో అనేక తపోవనాలకు, యజ్ఞాలకు, వెళ్ళాను. ధీమంతుడు, కురురాజు యుధిష్ఠిరుని ఈ అశ్వమేధయజ్ఞాన్ని గురించి విని గంపెడాశ పెట్టుకొని ఇక్కడికి వచ్చాను. కాని నా ద్వితీయ పార్శ్వాన్ని ఈ యజ్ఞం సువర్ణమయం చేయలేదు. బ్రాహ్మణశ్రేష్ఠులారా! అందువల్లనే నేను నవ్వుతూ ఈ యజ్ఞం ఆ బ్రాహ్మణుని సేరు సత్తుపిండి దానంతో సమానం కాదని చెప్పాను. అప్పుడు నా శరీరార్ధభాగాన్ని ఆసత్తుపిండి కణాలు బంగారం చేశాయి. ఆ పిష్టక కణాలతో గూడా ఈ యజ్ఞం సమం కాదు అని నా ఉద్దేశ్యం." అని ఆ ముగింప అశ్వమేధ యాగంలో ద్విజశ్రేష్ఠులతో చెప్పి, అంతర్ధానం చెందింది. ఆ బ్రాహ్మణులు తమ ఇండ్లకు వెళ్ళారు. శత్రుపురాలను జయించిన జనమేజయా! అశ్వమేధ మహాయజ్ఞంలో జరిగిన ఆశ్చర్యకర విషయం నీకు చెప్పాను. రాజా! ఆ యజ్ఞంలో జరిగిన ఈ సంఘటన విని నీవు ఆశ్చర్యపడవద్దు. ఏ యజ్ఞం చేయకుండా కేవలం తపోబలంతోనే ఇలాంటి వేల

కోట్ల మహర్షులు స్వర్గానికి వెళ్ళారు. ఏ ప్రాణికి, ద్రోహం చేయకుండటం, సంతోషం, శీలం, సదాచారపాలనం, తపస్సు, ఇంద్రియ నిగ్రహం, సత్యం, పలకటం న్యాయంగా సంపాదించింది దానం చేయటం అనే వాటిల్లో ఒక్కొక్కగుణమే గొప్ప యజ్ఞాలతో సమానం అవుతుంది.*"

91. హింసామిశ్రిత యజ్ఞ, ధర్మముల నింద.

జనమేజయుడు అడిగాడు – "మహర్షీ! రాజులు యజ్ఞాలలో ఆసక్తులవుతారు. మహర్షులు తపస్సునందు ఆసక్తులవుతారు. బ్రాహ్మణులు మనోనిగ్రహంలో ఉంటారు. మనో నిగ్రహం కలిగిన తరువాత ఇంద్రియనిగ్రహం స్వతఃసిద్ధమవుతుంది. అందువల్ల యజ్ఞఫలంతో సమానం ఈ లోకంలో ఏకర్మా నాకు కన్పించదు. యజ్ఞ విషయంలో ఇది నా అభిప్రాయం. నిస్సందేహంగా ఇదే సరైంది. అనేకరాజులు, బ్రాహ్మణశ్రేష్ఠులు యజ్ఞానుష్ఠానం చేసి ఈ లోకంలో మహత్తర కీర్తి పొందారు. మరణానంతరం స్వర్గానికి వెళ్ళారు. వేయి కన్నులవేలుపు ఇంద్రుడు సమృద్ధిగా దక్షిణలు గల నూరుయజ్ఞాలు చేసి సమస్త దేవరాజ్యాన్ని పొందాడు. భీమార్జునులు ప్రముఖంగా గల యుధిష్ఠిరుడు సమృద్ధ సంపదలతో, పరాక్రమంతో దేవరాజు వంటివాడు గదా! మహాత్ముడయిన ఆ రాజు చేసిన అశ్వమేధ మహాయజ్ఞాన్ని ఆ ముంగిస ఎందుకు నిందించింది ?" వైశంపాయనుడు చెప్పాడు – "భరత వంశీయ నరపాలా! యజ్ఞశ్రేష్ఠ విధానాన్ని, దాని ఫలాన్ని ఉన్నది ఉన్నట్లు చెపుతాను. అది విను. రాజా! పూర్వకాలంలో ఒకప్పుడు ఇంద్రుని యజ్ఞం జరుగుతున్నది. సమస్త మహర్షులు మంత్రోచ్చారణం చేస్తున్నారు. ఋత్విక్కులు తమ తమ పనులలో నిమగ్నులయి ఉన్నారు. యజ్ఞ కర్మలు చాలా గొప్పగా విస్తారంగా సాగుతున్నాయి. ఉత్తమ గుణవంతమయిన ఆహుతులను అగ్నిలో వేస్తున్నారు. దేవతలను ఆహ్వానిస్తున్నారు. అనేక మహర్షులు అక్కడికి వచ్చి ఉన్నారు. బ్రాహ్మణులు చాలా సంతోషంతో వేదమంత్రాలను సస్వరంగా ఉచ్చరిస్తున్నారు. వేగంగా కర్తవ్య నిర్వహణం చేసే అధ్వర్యువులు ఎలాంటి శ్రమలేకుండా తమ తమవిధులను నిర్వర్తిస్తున్నారు. ఇంతలో పశువుల ఆలంభనం (వధ) సమయం ఆసన్నమయింది. పశువులను పట్టారు. అప్పుడు అక్కడ ఉన్న మహర్షులకు వాటిమీద దయకలిగింది. అప్పుడు తపోధనులయిన మహర్షులు దీనంగా ఉన్న పశువులను చూచారు. ఇంద్రుని వద్దకు

* అద్రోహః సర్వభూతేషు సంతోషః శీలమార్జవమ్ ।
తపో దమశ్చ సత్యం చ ప్రదానం చేతి సమ్మితమ్ ॥119

వచ్చి యజ్ఞంలో ఈ పశువధ విధానం మేలుగాదు. పురందరా! నీవు మహత్తర ధర్మాభిమానివి, అయినా పశువధకు సన్నద్ధుడివయ్యావు. ఇది నీ అజ్ఞానమే. యజ్ఞంలో పశువధ విధానం శాస్త్రంలో కన్పించదు. ప్రభూ! నీవు చేసిన ఈ యజ్ఞారంభం ధర్మానికి హానికరం. హింస ధర్మమని ఎక్కడా లేదు. కాబట్టి ఇది ధర్మానుకూలం కాదు. నీకిష్టమయితే బ్రాహ్మణులు శాస్త్రానుసారం ఈ యజ్ఞం చేస్తారు. శాస్త్రవిధిననుసరించి యజ్ఞం చేయటం వల్ల నీకు ఉత్తమధర్మప్రాప్తి కలుగుతుంది. మహేంద్రా! మూడు సంవత్సరాల పాతవయిన గింజలతో యజ్ఞం చేయి. ఈధార్మిక యజ్ఞం ఉత్తమగుణవంతము, ఉత్తమ ఫలదాయకము."

తత్త్వద్రష్టలయిన మహర్షులు చెప్పిన ఆ విషయాన్ని అభిమాన మోహవశుడయిన ఇంద్రుడు స్వీకరించలేదు. ఇంద్రుని ఆ యజ్ఞంలో ఉన్న మహర్షుల మధ్య ఈ విషయంలో గొప్పవివాదం చెలరేగింది. భారతా! ఒక పక్షంవారు జంగమాల'(పశుపక్ష్యాదులు)తో చెయ్యాలని, ఇంకో పక్షంవారు స్థావరాలతో (పండ్లు, అన్నం మొదలయినవానితో) చెయ్యాలని వాదించసాగారు. భరతనందనా! తత్త్వదర్శనులయిన మహర్షులు ఈ వివాదం వల్ల ఖిన్నులయ్యారు. అప్పుడు వారు ఇంద్రుని సలహాతో వసుమహారాజును ఇలా అడిగారు. 'మహామతీ! మాకు సంశయం కలిగింది. కాబట్టి ఈ విషయంలో సత్యం నీవు చెప్పవలసింది. మహాభాగా! యజ్ఞాల విషయంలో శాస్త్రాల అభిప్రాయం ఏమిటి? యజ్ఞం ముఖ్య పశువులతో చెయ్యాలా! లేక బీజాలతో రసాలతో చేయాలా?' ఇది విన్న వసురాజు రెండుపక్షాలలో ఏది సారవంతం ? ఏది నిస్సారం? అనే విషయం ఆలోచించకుండా "ఎప్పుడు ఏ వస్తువు దొరికితే దానితోనే యజ్ఞం చేయాలి అన్నాడు. ఇలా చెప్పి అసత్యనిర్ణయాన్ని చెప్పటం వల్ల చేదిదేశరాజు వసువు రసాతలానికి వెళ్ళాడు.

కాబట్టి ఏదయినా సందేహం కలిగినప్పుడు స్వయంభువు, బ్రహ్మ ప్రజాపతి తప్ప అన్ని తెలిసిన వాడయినా ఒక్కడు మాత్రమే సందిగ్ధవిషయంలో నిర్ణయం చేయరాదు. పాపాత్ముడు, అపవిత్ర బుద్ధి అయిన వాడు అంతకుముందు చేసిన దానాలు అన్నీ ఎన్నయినా అనాహతాలయి నష్టం అవుతాయి. అధర్మంలో ప్రవృత్తుడయి దుర్బుద్ధి, దురాత్ముడు, హింసకుడు అయినవాడు చేసే దానాలవల్ల ఆతనికి ఇహలోకపరలోకాల్లో కీర్తి కలుగదు.-అన్యాయంగా సంపాదించిన ధనంతో మూర్ఖుడు ధర్మవిషయంలో సంశయిస్తూ యజ్ఞం చేస్తే ఆ ధర్మఫలం లభించదు. ధార్మికచిహ్నాలు ధరించి పాపాత్ముడయిన పురుషాధముడు లోకంలో తనపైన విశ్వాసం పెంచుకోవటం కోసం బ్రాహ్మణులకు

దానం చేస్తాడు గాని ధర్మం కోసం గాదు. బ్రాహ్మణుడు పాపకర్మతో ధనం సంపాదించి అడ్డు ఆపులేక రాగమోహాలకు వశుడయితే పాపగతిని పొందుతాడు. ఆతడు లోభమోహాలకు వశుడయి కూడబెట్టటానికి వశుడవుతాడు. పీనాసితనంతో పోగుచేస్తాడు. బుద్ధిని అపవిత్రం చేసే పాపాచారంతో ప్రాణులకు ఉద్వేగం కలిగిస్తాడు. ఈ విధంగా మోహవశుడయి అన్యాయంతో ధనం సంపాదించినవాడు దానితో దానం గాని యజ్ఞంగాని చేస్తే పాపంవల్ల వచ్చిన ఆ ధనం వల్ల మరణానంతరం సత్ఫలితాన్ని పొందలేడు. తపోధనులు ధర్మాత్ములయినవారు ఉంఛవృత్తితో సంపాదించిన దాన్ని, పండ్లను, దుంపలను, కూరలను, జలపాత్రను, తమ శక్త్యనుసారం దానం చేసి స్వర్గానికి వెళ్తారు. **ఇదే ధర్మం, ఇదే మహాయోగం, దానం, భూతదయ, బ్రహ్మచర్యం, సత్యం, కరుణ, ధైర్యం, ఓర్పు అనేవి సనాతన ధర్మానికి సనాతనమయిన మూలం. పూర్వకాలంలో విశ్వామిత్రాదులయిన రాజులు దీనితోనే సిద్ధిని పొందారు.** విశ్వామిత్రుడు, అసితుడు, జనక మహారాజు, కక్షసేనుడు, ఆర్ష్టిషేణుడు, సింధుద్వీపభూపాలుడు అనేవారు అనేకులయిన ఇతర రాజులు, తపోధనులు, న్యాయంగా సంపాదించిన ధనాన్ని దానం చేయటం వల్ల సత్యాన్ని చెప్పటం చేత పరమసిద్ధిని పొందారు. భారతా! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులతో ఎవరయినా తపస్సును ఆశ్రయిస్తే దానధర్మాలనే అగ్నితో దగ్ధులయి బంగారం లాగా శుద్ధులయి స్వర్గానికి వెళ్తారు."

92. అగస్త్యమహర్షి యజ్ఞవృత్తాంతము.

జనమేజయుడు అడిగాడు - "మహాత్మా! ధర్మంగా సంపాదించిన ధనం దానం చేయటం చేత స్వర్గం లభించేటట్లయితే ఈ విషయం అంతా నాకు స్పష్టం చేయవలసింది. చక్కగా చెప్పటంలో నీవు శ్రేష్ఠుడివి. ఉంఛవృత్తితో సంపాదించిన ఆయనకు పిష్టాన్ని దానం చేయటం వల్ల మహా ఫలం కలిగిందని చెప్పారు. అది నిస్సంశయంగా బాగుంది. కాని అన్నియజ్ఞాల్లో ఈ ఉత్తమ నిశ్చయం ఎలా కార్యకారి అవుతుంది ? ద్విజశ్రేష్ఠా! ఇది అంతా నాకు సంపూర్ణంగా చెప్పవలసింది." వైశంపాయనుడు చెప్పాడు - "శత్రునాశకా! జనమేజయా! అగస్త్యుని మహాయజ్ఞంలో పూర్వం జరిగిన విషయంగల ఈ పురాతనమయిన ఇతిహాసాన్ని ఈ సన్నివేశంలో ఉదాహరిస్తారు. మహారాజా! పూర్వకాలంలో సర్వప్రాణులహితంలో ఆసక్తుడయిన మహాతేజస్వి అగస్త్యుడు పన్నెండు సంవత్సరాలు జరిగే యజ్ఞ దీక్షలో ప్రవేశించాడు. ఆ మహాత్ముని యజ్ఞంలో అగ్నివలె తేజోవంతులు

హోతలయ్యారు. వారిలో దుంపలు ఆహారమయినవారు, ఫలాలే తినేవారు, అశ్మకుట్టులు (తినదగినవాటిని రాతిమీద నలగగొట్టితినేవారు), సూర్యకిరణాలు త్రాగేవారు, అడిగిపెట్టిన ఆహారం తినేవారు, యజ్ఞశిష్టాన్న భోజనులు తత్త్వ విచారం చేసేవారు మొదలయిన యతులు, భిక్షువులు వచ్చారు. వారందరు ప్రత్యక్షంగా స్వధర్మ పాలకులు, క్రోధం జయించినవారు. ఇంద్రియ విజేతలు, మనోనిగ్రహ పరులు, హింస, దంభంలేనివారు. వారు నిరంతరం పవిత్ర వృత్తిలో ఉండేవారు. ఇంద్రియాలచేత బాధితులు కాని మహర్షులు ఆ యజ్ఞం చేయించటానికి వచ్చారు. భగవానుడు అగస్త్యుడు ఆ యజ్ఞానికి పవిత్రమయిన అన్నాన్ని పోగుచేశాడు. ఆ సమయంలో ఆ యజ్ఞానికి అదే యోగ్యము అయింది. ఆయన కాక ఇతర మహర్షులు అనేకులు గొప్ప యజ్ఞాలు చేశారు. భరతసత్తమా! ఈ రీతిగా ఆయజ్ఞం జరుగుతుండగా వేయి కన్నుల వేలుపు ఇంద్రుడు వర్షం కురవకుండా ఆపాడు. రాజా! మహాత్ముడయిన అగస్త్యమహర్షి యజ్ఞ విరామ సమయంలో నిర్మలాంతఃకరణులయిన మునులమధ్య ఇలా చర్చ జరిగింది. ఎలాంటి మాత్సర్యంలేని అగస్త్య మహర్షి యజమానుడు శ్రద్ధా పూర్వకంగా అందరికి అన్నం పెడుతున్నాడు. కాని ఇక్కడ మేఘాలు వర్షించటం లేదు. ఇలాంటప్పుడు ఇక ముందు పంటలు ఎలా పండుతాయి? విప్రులారా! అగస్త్య మహర్షి ఈ మహా యజ్ఞాన్ని పన్నెండు సంవత్సరాలు చేస్తాడు. ఈ పన్నెండేళ్ళు దేవరాజు ఇంద్రుడు వాన కురిపించడు. మీరందరు ఈ విషయం ఆలోచించి ధీమంతుడు, మహా తపస్వి, మహర్షి అయిన అగస్త్యుని ఈ యజ్ఞం నిర్విఘ్నంగా జరిగేటట్లు అనుగ్రహించండి."

అని వారు చెప్పగా ప్రతాపవంతుడయిన అగస్త్యుడు తలవంచి నమస్కరించి వారిని ప్రసన్నులను చేస్తూ ఇలా అన్నాడు. "ఇంద్రుడు పన్నెండు సంవత్సరాలు వర్షించకపోతే ధ్యానంతో మాత్రమే మానసిక యజ్ఞం చేస్తాను. ఇది ఈ యజ్ఞానికి సనాతనమయిన విధి. పన్నెండు సంవత్సరాలు ఇంద్రుడు వానకురిపించకపోతే స్పర్శయజ్ఞం చేస్తాను. ఈ యజ్ఞ విధి సనాతనం. ఇంద్రుడు ద్వాదశ వర్షాలు వర్షించకపోతే నేను వ్రతనియమాలను పాటిస్తూ ధ్యానంతో ధ్యేయరూపంలో ఉండి ఈ యజ్ఞాలను అనుష్ఠిస్తాను. ఆ బీజ యజ్ఞాన్ని నేను అనేక సంవత్సరాలనుండి సమకూర్చుకొని ఉన్నాను. ఆ బీజాలతోనే యజ్ఞం చేస్తాను. దీనికి విఘ్నం జరగదు. నా ఈ సత్రయాగాన్ని ఏ రీతిగా గూడా విఘ్నం చేయవీలు గాదు. ఇంద్రుడు వర్షించినా వర్షించకపోయినా ఫరవాలేదు. నా అభ్యర్థనను ఇంద్రుడు కావాలనే సఫలం చేయకపోతే నేనే ఇంద్రుడినవుతాను. ప్రజలను బ్రతికిస్తాను.

ఏ ఆహారంలో ఎవరు పుట్టారో వారికి ఆ ఆహారమే లభిస్తుంది. అలాగే నేను మాటిమాటికి అధికాహారాన్ని కూడా సిద్ధం చేస్తాను. ముల్లోకాల్లో బంగారం గాని, ఇతర ధనంగాని ఉంటే అది అంతా ఈ దినం ఇక్కడికి రావాలి. దేవలోకంలోని అప్సరసల సమూహాలు, కిన్నరులతో గూడా గంధర్వులు, విశ్వాసువు, తదితరులూ వచ్చి నా యజ్ఞాన్ని ఉపాసింతురుగాక. ఉత్తర కురువర్షంలో ఉన్న ధనం అంతా స్వయంగానే ఇక్కడ నా యజ్ఞాలకు రావాలి. స్వర్గం స్వర్గనివాసులు, ధర్మదేవత స్వయంగానే రావాలి." ప్రజ్వలించే అగ్నితుల్య తేజస్వి, మహత్తర కాంతిమంతుడు, అగస్త్య మహర్షి, ఇలా అన్నవెంటనే ఆయన తపః ప్రభావం వల్ల సమస్త వస్తువులు అక్కడకు వచ్చాయి. ఆ మహర్షులు అందరు ఆనందపూర్ణులై ఆయన తపోబలాన్ని ప్రత్యక్షంగా చూచారు. ఆశ్చర్యమగ్నులయిన వారందరు ఏక కంఠంగా అర్థవంతమయిన ఈ మాటలు అన్నారు.

"మహర్షీ! మీ మాటలకు మేము చాలా సంతోషించాము. నీ తపస్సు వ్యయంకావటం మాకు ఇష్టం లేదు. మేము నీ ఆ యజ్ఞాలతోనే సంతోషించాము. న్యాయంగా సంపాదించిన ఆహారాన్నే కోరుతాము. మేము వెదుకుతున్న యజ్ఞం దీక్ష, హోమాలు, ఇంకా తదితరాలు అన్నీ మాకు ఇక్కడ లభించాయి. న్యాయంగా సంపాదించిన అన్నమే మా ఆహారం. మేము ఎల్లప్పుడు మా కర్మలలో ఆసక్తులమయి ఉన్నాము. మేము బ్రహ్మచర్యాన్ని అనుష్ఠించి వేదప్రాప్తిని కోరుతున్నాము. చివరకు న్యాయంగానే మేము ఇల్లు విడిచి వచ్చాం. ధర్మశాస్త్రంలో కన్పించే విధానాన్ని అనుసరించే తపస్సు చేస్తాం. మీకు హింసారాహిత బుద్ధియే చాలా ఇష్టం. కాబట్టి నీ యజ్ఞాల్లో ఎల్లప్పుడు ఈ హింసారాహిత్యాన్నే ప్రతిపాదించవలసింది. ద్విజశ్రేష్ఠా! ఇలా చేయటంవల్ల మేము సంతోషిస్తాం. యజ్ఞం సమాప్తం అయిన తరువాత నీవు సెలవిచ్చినప్పుడే మా నివాసాలకు వెళ్తాం." ఆ మహర్షులు అలా చెపుతుండగానే మహాతేజస్వి, దేవరాజు, అయిన మహేంద్రుడు అగస్త్య మహర్షి తపోబలం చూచి వర్షం కురిపించ ప్రారంభించాడు. ఆ యజ్ఞం పూర్తి అయ్యేటంత వరకు ఇంద్రుడు కోరినంతగా వర్షించాడు. దేవాధిపతి బృహస్పతిని ముందుచుకొని అగస్త్య మహర్షి యజ్ఞశాలకు స్వయంగా వచ్చి ప్రసన్నుని చేసుకొన్నాడు. ఆ యజ్ఞం యధావిధిగా పూర్తి అయిన తరువాత అగస్త్య మహర్షి ఆనందపూర్ణుడయి ఆ మహామునులను యధావిధిగా పూజించి వీడ్కొలిపాడు.

జనమేజయుడు అడిగాడు - "వైశంపాయన మహర్షీ! "సువర్ణమయమయిన శిరస్సుతో ముంగిస రూపంలో వచ్చి మనుష్యభాషలో మాట్లాడిన వారెవరు" అని

అడుగుతున్నాను. సమాధానం చెప్పండి." వైశంపాయనుడు చెప్పాడు - "జనమేజయా! ఇంతకుముందు ఈ విషయం నీవు అడగలేదు. మేము చెప్పలేదు. ఆ ముంగిస ఎవరో అది మానుషవాక్కుతో ఎందుకు పలికిందో చెపుతా విను. పూర్వకాలంలో ఒకప్పుడు జమదగ్ని మహాముని పితృశ్రాద్ధాన్ని సంకల్పించాడు. హోమధేనువు అక్కడకు వచ్చింది. ఆ మహర్షి స్వయంగానే దానిపాలు పిదికాడు. ఆయన గట్టిది, శుభ్రమయిన క్రొత్తకుండలో ఆ పాలు పోసి ఉంచాడు. ఆ పాత్రలో ధర్మదేవత క్రోధరూపంలో ప్రవేశించింది. ధర్మదేవత ఆయనను పరీక్షింపదలచింది. "ఆయనకు ఇష్టంగాని పని చేస్తే ఏంచేస్తాడో చూద్దాం" అని భావించింది. అందువల్ల ఆ పాలను క్రోధస్పర్శతో దూషితం చేసింది. రాజా! జమదగ్నికి అది తెలిసింది. కాని ధర్మదేవతను కోపించలేదు. తరువాత ఆ ధర్మదేవత బ్రాహ్మణరూపంలో అక్కడికి వచ్చింది. ఓడిపోయినందున అమర్షశీలమయిన క్రోధం ఆయనతో ఇలా అంది. 'భృగువంశశ్రేష్ఠా! నీచేతిలో ఓడి పోయాను. భృగువంశీయులు తీవ్రకోప స్వభావులు అని లోకంలో ఉన్న అపవాదం అసత్యమని నీచేత పరాజితుడనయిన నాకు ఇప్పుడు తెలిసింది. సజ్జనా! క్షమాగుణం గల మహాత్ముడయిన నీకు ఇప్పుడు వశమయి ఉన్నాను. నీ తపోబలానికి భయపడుతున్నాను. ప్రభూ ! నాకు ప్రసన్నుడివి కావలసింది.' జమదగ్ని అన్నాడు - 'క్రోధా ! నిన్ను నేడు ప్రత్యక్షంగా చూచాను. నీవు నిశ్చింతగా ఇక్కడినించి వెళ్ళవచ్చు. నీవు ఎలాంటి అపకారమూ చేయలేదు. అందువల్ల నీ మీద నాకు కోపం లేదు. నేను పితృదేవతలను ఉద్దేశించి ఈ పాలు సిద్ధం చేశాను. మహానుభావులయిన వారిది ఈ క్షీరం. ఇది తెలుసుకొని ఇక నీవు వెళ్ళవచ్చు.' అని ఆయన చెప్పినంతనే ధర్ముడు భయంకలిగి అక్కడే అంతర్ధానం చెందాడు. పితృదేవత శాపం వలన ఆయన ముంగిస అయ్యాడు. ఆ శాపాంతం గోరి ఆయన వారిని ప్రసన్నులను చేసుకొన్నాడు. నీవు ధర్మరాజు యుధిష్ఠిరుని ఆక్షేపించిన తరువాత శాపవిముక్తిని పొందుతావు. అని వారు చెప్పారు. వారే ఆ ముంగిసకు యజ్ఞస్థానాలను ధర్మారణ్యాన్ని గురించి చెప్పారు. ఆ ముంగిస ధర్మరాజు యజ్ఞాన్ని నిందించే ఉద్దేశ్యంతోనే పరుగెత్తుకుంటూ ఆ యజ్ఞశాలకు వచ్చింది. ధర్మపుత్రుడు యుధిష్ఠిరుని ఆక్షేపిస్తూ సేరు పేలపిండి దానం మహత్యాన్ని చెప్పి ఆయన క్రోధ రూపమయి ధర్ముడు శాపవిముక్తుడయ్యాడు. ధర్మరాజు యుధిష్ఠిరునిలో నిలిచాడు. ఈ రీతిగా మహాత్ముడు యుధిష్ఠిరుని యజ్ఞం సమాప్తం కాగా ఈ సంఘటన జరిగింది. ఆ ముంగిస మేము చూస్తుండగానే మాయమయింది."

(వైష్ణవధర్మపర్వము)

ధర్మవిషయమయి యుధిష్ఠిరప్రశ్న.

శ్రీకృష్ణుడు ధర్మమహిమను, స్వమహిమను చెప్పుట.

జనమేజయుడు అడిగాడు - "వైశంపాయనా! పూర్వం మాతాతగారు యుధిష్ఠిరుడు చేసిన యజ్ఞం పూర్తికాగా ఆయనకు ధర్మ విషయక సందేహం కలుగగా శ్రీకృష్ణుని ఏమని ప్రశ్నించాడు?" వైశంపాయనుడు చెప్పాడు. "జనమేజయా ! యుధిష్ఠిర మహారాజు అశ్వమేధ యజ్ఞం అయిన తరువాత శ్రీకృష్ణునికి నమస్కరించి ఇలా అన్నాడు. "తత్త్వ దర్శనులు, తపస్సులగు వశిష్ఠాది మహర్షులు భాగవతులు ఉత్తమమయిన రహస్య వైష్ణవ ధర్మాన్ని వినదలచి శ్రీకృష్ణుని చుట్టూ కూర్చున్నారు. యుధిష్ఠిరుడు అడిగాడు. భక్త వత్సలా! నేను స్వచ్ఛమయిన భక్తిభావంతో నీపాద సన్నిధికి చేరాను. దేవా! నన్ను నీ భక్తుడి నని నాయందు ప్రేమగల వాడి నని తెలుసుకొని ఉంటే ధర్మ రహస్యాలను అన్నింటిని యధావిధిగా తెలుసుకొనగోరుతున్నాను. నీ అనుగ్రహాన్ని పొంద దగినవాడి నయితే నాకు వైష్ణవ ధర్మాలను చెప్పవలసినది. ఇంతకు ముందు నేను మనువు, వశిష్ఠుడు, కశ్యపుడు, గర్గుడు, గౌతముడు, గోపాలుడు, పరాశరుడు ధీమంతుడయిన మైత్రేయుడు ఉమామహేశ్వరులు, నందీశ్వరుడు చెప్పిన పవిత్ర ధర్మాలను విన్నాను. బ్రహ్మదేవుడు, కుమారస్వామి, ధూమాయనుడు, కాండుడు, వైశ్వానరుడు, భార్గవుడు, మార్కండేయుడు, యాజ్ఞవల్క్యుడు చెప్పినవి, భారద్వాజుడు, బృహస్పతి నిర్మించినవి, కుణికుడు, కుణిబాహుడు, విశ్వామిత్రుడు నిర్మించినవి; సుమంతుడు, జైమిని రచించినవి, శకుని, పులస్త్యుడు, పులహుడు. అగ్నిదేవుడు, అగస్త్యుడు, ముద్గలుడు, శాండిల్యుడు, శలభాయనుడు, వాలఖిల్యులు, సప్తర్షులు, ఆపస్తంబుడు, శంఖుడు, లిఖితుడు చెప్పిన ధర్మాలను, ప్రజాపతి, యముడు, మహేంద్రుడు, వ్యాఘ్రుడు, వ్యాసుడు, విభాండకుడు చెప్పిన ధర్మాలను కూడా విన్నాను. నారదుడు, కపోతుడు చెప్పిన ధర్మాలను విన్నాను. విదుర వాక్యాలను, భృగువు, అంగిరసుడు చెప్పిన వాటిని విన్నాను. క్రౌంచుడు, మృదంగుడు హారీతకుడు, పిశంగుడు, కపోతుడు, సుబాలకుడు, ఉద్దాలకుడు, ఔశనుడు వైశంపాయనుడు ఇంకా ఇతర మహర్షులు ఎందరో చెప్పిన అనేక ధర్మాలను విన్నాను. దేవా! ఈ సమస్త ధర్మాల కన్నా నీ ముఖ కమలంనుంచి వెలువడే ధర్మాలు పరమ పవిత్రాలు, పావనాలు కావడం వల్ల ప్రత్యేకత కలవి అని నా అభిప్రాయం. అచ్యుతా! కేశవా! అందువల్ల నిన్ను శరణువేడినవాడిని, నీ భక్తుడిని అయిన నాకు పవిత్రాలు, శ్రేష్ఠాలు అయిన నీ ధర్మాలను చెప్పవలసింది."

వైశంపాయనుడు చెప్పాడు. రాజా ఈ విధంగా యుధిష్ఠిరుడు అడగగా సమస్త ధర్మాలు తెలిసిన శ్రీకృష్ణుడు సంతోషించాడు. సూక్ష్మార్థాలుగల ధర్మాలను ధర్మపుత్రునికి ఇలా చెప్పాడు. "యుధిష్ఠిరా! నీవు ధర్మం కోసం ఇంతగా యత్నిస్తున్నావు. కాబట్టి నీకు లోకంలో దుర్లభమయినది ఏదీ ఉండదు. ధర్మాన్ని విన్నా, చూచినా, చెప్పినా, ఆచరించినా, ఆమోదించినా అది మానవుని ఇంద్ర

పదాన్ని చేరుస్తుంది. ధర్మమే నరునికి తండ్రి, తల్లి, నాధుడు, మిత్రుడు, సోదరుడు సఖుడు, ప్రభువు అవుతుంది. ధర్మం వల్లనే ధనాదులు, కామములు, భోగాలు, సుఖాలు కలుగుతాయి. ధర్మం వల్లనే ఉత్తమమయిన ఐశ్వర్యం కలుగుతుంది. ధర్మాచరణంచేతనే ఉత్తమ స్వర్గం లభిస్తుంది. ఈ విశుద్ధ ధర్మాన్ని సేవిస్తే మహాభయంనుంచి అది రక్షిస్తుంది. ధర్మం వల్లనే బ్రాహ్మణత్వం దేవత్వం సిద్ధిస్తాయి. ధర్మం నరుని పవిత్రుని చేస్తుంది. మానవునికి కాలక్రమాన పాపం క్షీణిస్తే అప్పుడు ధర్మాన్ని ఆచరించాలనే బుద్ధి పుడుతుంది. **దుర్లభమయిన మానవజన్మ వేలకొది జన్మల తరువాత జీవునికి లభిస్తుంది. అలాంటి మానవజన్మ కలిగినా ధర్మం ఆచరించనివాడు ఆత్మవంచన చేసుకున్నవా డవుతాడు.*** కుత్సితుడు, దరిద్రులు, కురూపులు, రోగిష్టులు, ఇతరులు ద్వేషించదగినవారు మూర్ఖులు పూర్వజన్మలో సద్ధర్మాన్ని ఆచరించలేదు. సుదీర్ఘమయిన ఆయువు గలవారు, శూరులు, పండితులు, భోగాలు అనుభవించేవారు, ఆరోగ్యవంతులు, సౌందర్యవంతులు పూర్వజన్మలో ఉత్తమ ధర్మాన్ని ఆచరించారు. ఈ రీతిగా పవిత్ర ధర్మాన్ని ఆచరిస్తే అది ఉత్తమ గతిని కలిగిస్తుంది. అధర్మాన్ని ఆచరించేవాడు పశుపక్ష్యాది జన్మలలో పడతాడు. పాండునందనా! భక్తుడి నయిన నీకు రహస్యమయి సర్వోత్తమయిన పరమ ధర్మాన్ని చెపుతాను, శ్రద్ధగా విను. యుధిష్ఠిరా ! నీవు నాకు ఇష్టుడివి. సమధికంగా నన్ను నిరంతరం శరణందినవాడివి. నీవు అడిగితే అత్యంత రహస్యమయిన ఆత్మతత్త్వాన్నే చెపుతాను. అలాంటప్పుడు ధర్మసంహితను గురించి చెప్పేదేముంది ? ఈ మానవజన్మను ధర్మాన్ని చక్కగా నిలపటానికి దుష్టులను నశింపజేయటానికి నామాయచేత నాయందు కల్పించు కొని అవతరింపజేశాను. నేను పొందిన ఈ మానవదేహాన్ని నిర్లక్ష్యంగా మామూలుగా భావించి స్వీకరించే మూఢులు సంసారంలో మునిగిపోయి అనేక పశుపక్ష్యాదిజన్మలను పొందుతుంటారు. నాభక్తులలో నన్ను జ్ఞాననేత్రంతో సర్వ ప్రాణులలోఉన్నట్లు చూచేవారిని నా సమీపానికి తీసుకువెళ్తాను. సాయుజ్యాన్ని కలిగిస్తాను. నా భక్తులు నశించరు. నా భక్తులు పాపరహితులు. నా భక్తుల మానవజన్మ సఫలం అవుతుంది. నా భక్తులు పాపాసక్తులయినా నీళ్ళతో లిప్తం కాని తామరాకు వలె వారు సర్వపాపరహితు లవుతారు. నాయనా! వేలకొది జన్మల కాలం తపస్సు చేసి శుద్ధాంతఃకరణులయిన మానవులకు భక్తి కలుగుతుంది. ఇందులో సందేహం లేదు. మిక్కిలి రహస్యమైనది, కూటస్థము, నిశ్చలము, శాశ్వతము అయిన నా పరమ రూపాన్ని నాభక్తులు చూచినంత సులభంగా దేవతలు కూడా దర్శింపలేరు. నా అపర స్వరూపం నేను అవతారం దాల్చినప్పుడు కన్పిస్తుంది. ప్రపంచంలోని సమస్తజీవులు దాన్ని సమస్త పదార్థాలతో పూజిస్తారు. అనేక కోట్ల కల్పాలు వచ్చాయి వెళ్ళాయి కాని దేవతలు దర్శించే నా వైష్ణవ రూపాన్ని నా భక్తులచేత దర్శింప జేస్తాను.

సృష్టి స్థితి లయాలు అనే మూడింటిని చేసేవాడిని నేనే అని చక్కగా తెలుసుకొని

---

* **జన్మాంతరసహస్రైస్తు మనుష్యత్వం హి దుర్లభమ్ ।**
తద్ గత్వాపీహ యో ధర్మం న కరోతి స్వవంచితః ॥

శరణందిన వానిని నేను అనుగ్రహించి సంసారం నుంచి విముక్తుని చేస్తాను. దేవతలకు మొదలు నేనే. బ్రహ్మాదులనందరిని నేనే సృష్టించాను. నేను నా ప్రకృతిని ఆశ్రయించి ఈ జగత్తును అంతను నేను సృష్టిస్తాను. అవ్యక్త పరమేశ్వరుడినైన నేను తమోగుణానికి మూలం. రజోగుణంలోఉండి ఉత్కృష్టమయిన సత్వ గుణంలో కూడా వ్యాపించి ఉన్నాను. నాకు లోభం లేదు. బ్రహ్మనుండి స్వల్ప కీటం వరకు అన్నింటిలో నేను వ్యాపించి ఉన్నాను. ద్యులోకం నాశిరస్సు అని తెలుసుకో. సూర్యచంద్రులు నా నేత్రాలు. గోవులు, అగ్ని బ్రాహ్మణుడు నాకు ముఖం. వాయువు నా ఉచ్ఛ్వాసనిశ్వాసాలు. ఎనిమిది దిక్కులు నాబాహువులు. నక్షత్రాలు నాకు అలంకారాలు. సర్వప్రాణులకు అవకాశం ఇచ్చే అంతరిక్షం నా వక్షఃస్థలం. మేఘాలు, వాయువు సంచరించే మార్గం అవ్యయమయిన నా ఉదరం అని తెలుసుకో. ద్వీపాలు సముద్రాలతో కూడి సర్వప్రాణులను ధరించే భూమండలం నా పాదాలు అని తెలుసుకో. ఆకాశంలో నేను ఒక గుణంతోను, వాయువులో రెండు గుణాలతోను, అగ్ని యందు మూడు గుణాలతోను, జలంలో నాలుగు గుణాలతోను, పృధివిలో పంచ గుణాలతోను ఉంటాను. ఆ నేనే తన్మాత్రాదులతో, పంచభూతాలలో శబ్దాదులయిన అయిదుగుణాలతో ఉంటాను. నాకు వేల కొలది శిరస్సులు, వేలకొలది ముక్కులు, వేలకొలది కన్నులు, వేలకొలది బాహువులు, ఉదరాలు, ఊరువులు, పాదాలు ఉన్నాయి. నేను భూమిని అన్నివైపులనుంచి ధరించి నాభినుంచి పది అంగుళాలు పైన అందరి హృదయాల్లో విరాజిల్లుతున్నాను. సర్వ ప్రాణులలో ఆత్మగా ఉన్నాను. ఇందువల్ల నేను సర్వవ్యాపిని అయినాను. నేను అచింత్యుడను, అనందుడను, నశించనివాడిని, జన్మలేని వాడిని, ఆది లేనివాడిని, అవధ్యుడను, అప్రమేయుడిని, అవ్యయుడిని, ద్వంద్వాతీతుడను మమకార రహితుడను, నిష్కలుడను, ఎల్లాంటి మార్పు లేనివాడిని, అమృతత్వానికి ఆది కారణాన్ని, సుధ, స్వధ స్వాహా అనేవి నేనే. నేనే నా తేజస్సుతో, తపస్సుతో నాలుగురకాలయిన ప్రాణి సముదాయాన్ని స్నేహ పాశమనే త్రాళ్ళతో కట్టి నా మాయతో ధరిస్తున్నాను. నేను చతురాశ్రమ ధర్మాలు, నాలుగు విధాలయిన హోతలతో జరిగే యజ్ఞ ఫలాన్ని అనుభవించే వాడిని. చతుర్వ్యూహాలు, చతుర్యజ్ఞాలు, నాలుగు ఆశ్రమాలను ఏర్పరిచిన వాడిని.

నేను ప్రళయకాలాల్లో జగత్తును అంతను ఉపసంహరించి నా గర్భంలో దాచి దివ్యయోగంతో పాలకడలిలో పవళిస్తాను. వేయి యుగాల ప్రమాణంగల బ్రహ్మదేవుని రాత్రి సమయంలోను మహార్ణవంలో ఉండి తరువాత స్థావరజంగ మాత్మకయిన ప్రపంచాన్ని సృజిస్తాను. ప్రతికల్పంలో కూడా సర్వప్రాణులను సంహరిస్తాను. సృష్టిస్తాను. నామాయచేత మోహితులు కావటం వల్ల ఆ ప్రాణులు నన్ను తెలుసుకోలేవు. ప్రళయకాలంలో దీపం ఆరిపోయినట్లు సమస్త వ్యక్త సృష్టి లోపించినప్పుడు వెదుకదగిన నా అదృశ్యరూపగతిని వారు తెలుసుకో లేరు రాజా! నేను ప్రతిష్ఠితుడు కానిది ఏదీ లేదు. నాలో ప్రతిష్ఠితం కాని ప్రాణి ఏదీలేదు. ఈ జగత్తులో ప్రాణి ఎంత పెద్దదయినా, ఎంత చిన్నదయినా నేను ఆయాప్రాణులతో, అంతే స్వరూపంతో జీవుడినయి ఉంటాను. ఇంక పలు మాటలు ఎందుకు? ఒక సత్యం నీకు చెపుతున్నాను. కడచిపోయినది, రాబోయేది సమస్తమూ నేను సుమా! ఈ సమస్త ప్రాణులను నేను సృష్టించాను ఇవి అన్ని మన్మయములే కాని మాయామోహితాలయి నన్నే తెలుసుకోలేవు.

ఈ రీతిగా దేవతలు, అసురుల మానవులతో గూడిన ఈ జగత్తు అంతా నానుంచే జనిస్తుంది. నాలోనే లీనం అవుతుంది."

చతుర్వర్ణముల కర్మ ఫలితాలు - ధర్మవృద్ధికి, పాపక్షయానికి ఉపాయాలు.

శ్రీకృష్ణుడు ఈ రీతిగా "ఈ జగత్తు అంతా తననుండి జనించిందే" అని చెప్పి ధర్మరాజుకు జగత్తుకు ఉద్దేశించిన పవిత్ర ధర్మాలను చెప్పాడు. పవిత్రము, పాపాలు నశింపచేసేది, పవిత్రము, మహత్తరమయిన ధర్మశాస్త్రాన్ని విను. మానవుడు పవిత్రుడు ఏకాగ్రచిత్తుడయి తపోమగ్నుడయి స్వర్గాన్ని, యశస్సును, ఆయువును ఇచ్చేది, తెలియదగిన ధర్మాన్ని వింటే శ్రద్ధాళువయిన ఆతనికి ప్రత్యేకించి నాభక్తుని పూర్వజన్మలో సంచితమయిన పాపాలన్నీ వెంటనే నశిస్తాయి. వైశంపాయనుడు చెప్పాడు. ఈ విధంగా కేశవుడు చెప్పిన యథార్థము, పుణ్యము అయిన విషయం విని సంతుష్టమనస్కులయిన దేవతలు, బ్రహ్మర్షులు, గంధర్వులు, అప్సరసలు, భూతాలు, యక్షులు, గ్రహాలు, గుహ్యకులు, నాగులు, మహోత్ములయిన వాలఖిల్యులు, పరమతత్త్వాన్ని దర్శించిన యోగులు, పంచోపాసనచేసే భగవద్భక్తులు, ఉత్తమమయిన వైష్ణవధర్మాన్ని వినటానికి, భగవద్వాక్యాలు ధారణచేయటానికి సమధికంగా ఉత్కంఠకలిగి అక్కడికి వచ్చారు. వారి మనస్సు ఇంద్రియాలు అత్యంతం ఆనందపరవశాలయ్యాయి. వచ్చిన తరువాత వారందరు తలలు వంచి భగవంతునికి ప్రణమిల్లారు.

భగవంతుని దివ్యదృష్టిపడటంచేత వారందరు పావవిముక్తులయ్యారు. ఆ వచ్చిన వారిని చూచి యుధిష్ఠిరుడు తలవంచి శ్రీహరికి నమస్కరించాడు. ధర్మ విషయమై ఇలా ప్రశ్నించాడు. యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! బ్రాహ్మణునికి క్షత్రియునికి, వైశ్యునికి, శూద్రునికి ఎలాంటి గతులు కలుగుతాయి ?"

శ్రీకృష్ణభగవానుడు ఇలా చెప్పాడు. "యుధిష్ఠిరా! బ్రాహ్మణాదివర్ణాల ధర్మాలను క్రమంగా విను. బ్రాహ్మణునికి దుష్కరం ఏదీ ఉండదు. శిఖ, యజ్ఞోపవీతాలు గలవారు, సంధ్యోపాసనచేసేవారు. పూర్ణాహుతి చేసిన వారు, శాస్త్రానుసారం హోమం చేసేవారు. వైశ్వదేవం చేసినవారు, అతిథిపూజ చేసేవారు, ఉదయసాయంకాలాల్లో హోమాలు చేసేవారు, శూద్ర భోజనం చేయనివారు, డాంబికం లేని వారు, అబద్ధం చెప్పనివారు. స్వభార్యనే ప్రేమించేవారు, పంచమహాయజ్ఞాలను చేసేవారు. నిత్యాగ్ని హోత్రులు, అహుతులు తీసికొని దక్షిణాగ్ని మొదలయిన మూడగ్నులు పాపాలను దగ్ధం చేయగా పవిత్రులులయిన బ్రాహ్మణులు, నిష్పాపులు బ్రహ్మలోకానికి వెళ్తారు. క్షత్రియులలో గూడా రాజసింహాసనాన్ని ఆరోహించిన తరువాత స్వధర్మాన్ని అనుష్ఠించేవాడు, ప్రజలను బాగా పరిపాలించేవాడు, పన్నుగా ప్రజల ఆదాయంలో ఆరవభాగం మాత్రమే తీసుకొనేవాడు, యజ్ఞాలు, దానాలు చేసేవాడు, ధీరుడు, స్వభార్యాసక్తుడు, శాస్త్రాన్ని అనుసరించేవాడు, తత్త్వం తెలిసినవాడు, ప్రజలకు మేలు కలిగించే పనులలో ఆసక్తుడు. నిత్యము విప్రుల కొర్కెలు తీర్చేవాడు. పోష్యులను రక్షించటంలో ఆసక్తుడు, ఆడితప్పనివాడు, నిత్యము పవిత్రుడు, లోభం, దంభంలేనివాడు అయిన క్షత్రియుడు కూడా దేవతలు సేవించే ఉత్తమగతిని

పొందుతాడు. వ్యవసాయం, గోపోషణలో తత్పరుడు స్వధర్మాన్ని చక్కగా పాటించేవాడు, దానధర్మనిరతుడు, విప్రసేవ చేసేవాడు. ఆడితప్పనివాడు, ఎల్లవేళల పవిత్రుడుగా ఉండేవాడు, లోభం, దంభం లేనివాడు, కపటం లేనివాడు, తన భార్యయందే ఆసక్తుడు, హింస, ద్రోహం చేయనివాడు, వర్తకుల ధర్మాన్ని వదలనివాడు, దేవతలను బ్రాహ్మణులను పూజించే వైశ్యుడు అప్సరసలచే పూజింపబడుతూ స్వర్గానికి వెళ్తాడు. నిరంతరం బ్రహ్మణ క్షత్రియ వైశ్యులనే మూడు వర్ణాల శుశ్రూషాసక్తుడు, అందులోను ప్రత్యేకించి విప్రులవద్ద ప్రవర్తించేవాడు, అడగకుండానే దానం చేసేవాడు, సత్యం చెప్పేవాడు, పవిత్రతగలవాడు, గురువులను, దేవతలను పూజించేవాడు. పరస్త్రీల యందు పరాఙ్ముఖుడయిన వాడు, ఇతరులను ఎవ్వరిని పీడించకుండానే తన శిష్య వర్గాన్ని భరించేవాడు, సమస్త జీవులకు అభయాన్ని ఇచ్చే శూద్రుడుగూడా స్వర్గాన్ని పొందుతాడు. ఈ రీతిగా ధర్మాన్ని మించిన సాధనం ఇంకొకటిలేదు. దాన్నే నిష్కామభావంతో ఆచరిస్తే సంసార బంధ మోక్షం కలుగుతుంది. పాపకర్మలను పారద్రోలటానికి ధర్మాన్ని మించింది వేరొకటిలేదు. **కాబట్టి దుర్లభమయిన మానవజన్మ పొంది ఎల్లవేళలా ధర్మాన్ని అనుష్ఠించాలి. ధర్మపరులయిన వారికి లోకంలో దుర్లభమయినదేమీ లేదు.*** *నరనాథా ! లోకంలో బ్రహ్మదేవుడు ఏ వర్ణం వారికి ఏ ధర్మం విధించాడో ఆ ధర్మాన్ని అతడు యథావిధిగా ఆచరించి దానితో తన పాపాలను నశింపజేసుకోవాలి. తనకు జన్మతః విహితమయిన ధర్మకర్మను ఎవ్వరూ వదలరాదు. అదే అతని ధర్మం. దానితోనే సిద్ధిని పొందుతాడు. గుణ రహిత మయినా స్వధర్మం పాపకర్మను పారద్రోలుతుంది. ఇలాగే పాపం పెరిగిపోతే ధర్మం కూడా క్షీణిస్తుంది."*

యుధిష్ఠిరుడు అడిగాడు-"దేవదేవేశ్వరా! భగవానుడా! శుభాశుభకర్మల క్రమక్షయవృద్ధులను వినవలె నని నాకు కుతూహలంగా ఉంది. శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. రాజా! నీవు అడిగిన ధర్మతత్వం చాలా సూక్ష్మమయినది. సనాతన మయినది. చాలా కష్టంతో తెలియదగినది. మహాత్ములయిన వారు కూడా దానిలో నిమగ్నులయ్యారు. అది చెపుతాను విను. సహజంగా చల్లనినీరు తీవ్రమయిన వేడిమి చుట్టూ ముట్టితే వెంటనే వేడెక్కుతుంది. చల్లదనం నశిస్తుంది. ఈ రీతిగానే పుణ్యంగాని, పాపంగాని ఎక్కువయి ఉన్నది స్వల్పంగా ఉన్నదానిని చాలా తొందరగా నశింపజేస్తుంది. ఈవిషయంలో సందేహంలేదు. రాజేంద్రా! ఆ పుణ్య పాపాలు రెండూ సమానంగా ఉన్నప్పుడు వాటిల్లో దేన్నయినా దాచిపెడితే వృద్ధి నందుతుంది. చెప్పుకొంటే నశిస్తుంది. మహారాజా! బహిరంగంగా చెప్పుకోవటంచేత, పశ్చాత్తాపపడడం చేత పాపం దాదాపుగా నశిస్తుంది. మానవా! అలాగే చేయడం చేత ధర్మం నశిస్తుంది. ఆ రెండిటిని దాచిపెట్టుకొంటే బాగా పెరిగిపోతాయి. సందేహంలేదు కాబట్టి వీవేని సర్వప్రయత్నాలతో పాపాన్ని దాచుకోరాదు. అందువల్ల నశింపజేసుకోవటానికి పాపాన్ని ప్రయత్న పూర్వకంగా ప్రకటించుకోవాలి. ఆ కారణం వల్ల నిత్యమూ పాపాన్ని వివరంగా చెప్పుకోవాలి. ధర్మాన్ని దాచుకోవాలి."

---

* తస్మాద్ ధర్మః సదా కార్యః మానుష్యం ప్రాప్య దుర్లభమ్ ।
న హి ధర్మానురక్తానాం లోకే కించన దుర్లభమ్ ॥

వ్యర్థ జన్మ - దానజీవన వర్ణనము - దాన లక్షణము, దానార్హ పాత్రులు.

వైశంపాయనుడు చెప్పాడు - "జనమేజయా ! ధర్మపుత్రుడు, శ్రీకృష్ణుని మాటలు విని మళ్లీ శ్రీహరిని మరోధర్మాన్ని గురించి అడిగాడు. "పురుషోత్తమా! నరులకు ఎన్ని జన్మలు వ్యర్థాలు ? వ్యర్థ దానాలు ఏవి ? ఎవరి జీవితం వృథా అయినది ? పురుషోత్తమా! ఎటువంటి స్థితిలో చేసిన దాన ఫలాన్ని మానవుడు ఈలోకంలో అనుభవిస్తాడు ? గర్భస్థుడయిన వాడు ఏ దాన ఫలం పొందుతాడు ? బాల్య, యౌవన, వార్ధక్యాల్లో మానవుడు ఏయే దాన ఫలాలు పొందుతాడు ? సాత్వికి రాజసతామస దానాలు ఎలా ఉంటాయి ? వాటి చేత ఎవరికి తృప్తి కలుగుతుంది ? ఎలాంటి దానం ఉత్తమం ? ఆ దానాలకు ఫలం ఏమిటి ? ఏ దానం ఊర్ధ్వగతిని ఇస్తుంది. ఏ దానం మధ్యగతిని పొందిస్తుంది ? ఏ దానం అధమగతిని కలిగిస్తుంది ? నాకు చెప్ప గోరుతున్నాను. మధుసూదనా ! ఇది తెలుసుకోగోరుతున్నాను. నాకు మిక్కిలి కుతూహలంగా ఉన్నది. నీ వచనం సత్యమయినది. పుణ్యమయినది."

శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! నేను నీకు న్యాయానుసారం యధార్థం, ఉత్తమం అయిన ఉపదేశం చేస్తాను. ఈ విషయం పరమపవిత్రము, సర్వపాపాలను పోగొడుతుంది. నరనాథా ! పదునాలుగు జన్మలు వ్యర్థమయినవి. ఏబది అయిదు దానాలు నిష్ఫలమయినవి. నిరర్థకమయిన మానవ జన్మలు ఆరు అని చెప్పారు. రాజా! వాటిని అన్నిటిని క్రమంగా చెపుతాను. ధర్మాన్ని నాశనంచేసేవారు, లోభులు, పాపులు, బలివైశ్వదేవాదులు చేయక భుజించేవారు, పరస్త్రీలోలురు, భోజనంలో భేదం చూపేవారు, అబద్ధం చెప్పేవారు - వీరి జన్మలు వ్యర్థం. బంధువులంతా బాధలపాలయి ఉండగా తానొక్కడే మధురభక్ష్యాలు తినేవాడు; తల్లిని, తండ్రిని, ఉపాధ్యాయుని, గురువును, మేమామను, మేనత్తను కొట్టేవాడు, తిట్టేవాడు; బ్రాహ్మణుడయి ఉండి గూడా సంధ్యోపాసనచేయనివాడు; అగ్నిని ఉపాసింపనివాడు; శూద్రాన్నం తినే బ్రాహ్మణుడు; యుధిష్ఠిరా! నాకుగాని, శంకరునికిగాని బ్రహ్మకుగాని బ్రాహ్మణులకుగాని భక్తులుకాని పాపాత్ముల పుట్టుక వ్యర్థం అని తెలుసుకో.

అశ్రద్ధగా గాని, అవమానించిగాని, ఆడంబరంగాగాని, పాషండులకు మేలు కలిగేటట్లు ఇచ్చేదానం, శూద్రాచారంగల బ్రాహ్మణునికి ఇచ్చింది, ఇచ్చి గొప్పగా చెప్పుకొనేది, కోపంగా ఇచ్చేది, ఇచ్చిన తరువాత బాధపడే దానం, కపటంతో సంపాదించి ఇచ్చేది, అబద్ధాలు చెప్పి సంపాదించి ఇచ్చేది, బ్రాహ్మణుని సొత్తు ఇవ్వడం, దొంగతనం చేసి సంపాదించి ఇవ్వడం, కళంకితుడయిన వాని ఇంటినుండి తెచ్చి ఇచ్చేది, పతితుతడయిన బ్రాహ్మణునికి చేసిన దానం, వేదం ముక్క కూడా రాని వానికి ఇచ్చేది, అందరిని యాచించే వానికి ఇచ్చేదానం, సంస్కార హీనుడయిన పతితుడయిన వానికి, సన్యాసం తీసుకుని మళ్లీ సంసారి అయిన వానికి ఇచ్చేది, వేశ్యాసాంగత్యం కలవానికి ఇచ్చేది, ఇల్లరికపు అల్లునికి ఇచ్చేదానం, గ్రామం మొత్తంలో యాచించే వానికి చేసేదానం, కృతఘ్నునికి ఇచ్చేది, ఉపపాతకాలు చేసిన వానికి ఇచ్చిన దానం, వేదాన్ని అమ్ముకొనే వానికిచేసిన దానం, స్త్రీకి వశుడయిన వానికి చేసిన దానం, రాజసేవలో ఉన్నవానికి ఇచ్చింది, జ్యోతిష్కునికి ఇచ్చేది, శూద్ర స్త్రీ

సంబంధం కలవానికి, తాంత్రికునికి ఇచ్చింది, ఆయుధ జీవికి ఇచ్చినది, ఉద్యోగికి ఇచ్చేది, పాములు పట్టే వానికి ఇచ్చినది. పురోహితునికి ఇచ్చేది, వైద్యునికి ఇచ్చేది, వ్యాపారం చేసేవానికి ఇచ్చేది, క్షుద్రమంత్ర ప్రయోగాదులతో బ్రతికేవానికి చేసే దానం, శూద్రుని వద్ద పనిచేసే వానికి చేసే దానం, జీతం తీసుకుని దేవాలయంలో పూజచేసే వానికి చేసే దానం, దేవునిసొమ్ము తినేవానికి ఇచ్చినది, బొమ్మలు వేసుకునే వానికి ఇచ్చింది, రంగస్థలంలో వేషాలు వేసే వానికి ఇచ్చింది, మాంసం అమ్ముకొని బ్రతికే వానికి చేసేదానం, సేవకునికి దానం చేసేది, నామమాత్ర బ్రాహ్మణునికి ఇచ్చింది. ఉపదేశం చేసేశక్తిలేనివానికి, వడ్డీ వ్యాపారం చేసే వానికి ఇచ్చేది, అచార రహితునికి చేసేదానం, అగ్నిహోత్రం చేయని వానికి ఇచ్చేది, సంధ్యావందనం చేయని వానికి ఇచ్చేది, శూద్ర బహుళ గ్రామంలో ఉండే వానికి ఇచ్చేది, వేషధారి అయిన వానికి ఇచ్చేది, సమస్తమూ తినే వానికి ఇచ్చేది, నాస్తికునికి ఇచ్చింది, ధర్మవిక్రేతకు ఇచ్చేది, నీచవృత్తి చేసే వానికి, అబద్ధపుసాక్ష్యం ఇచ్చేవానికి, కపట నీతిని ఆశ్రయించి గ్రామాలలో కలహాలు కల్పించేవానికి ఇచ్చిన దానం - రాజశ్రేష్ఠా! ఈ దానాలన్నీ వృధా అవుతాయి. ఇందులో సందేహం లేదు యుధిష్ఠిరా! ఇంద్రియలోలురు, విప్రనామ ధారులు అయిన ఈ బ్రాహ్మణాధములు, తననుగాని, దాతనుగాని తరింపచేయలేరు. రాజేంద్రా! వీరికి అనేక దానాలు చేసినా అవి అన్నీ బూడిదలో వేసిన ఆజ్యాహుతివలె వ్యర్థాలవుతాయి. వారికిచ్చిన దానాల వలన ఏ కొంచెము ఫలం కలిగినా దాన్ని రాక్షసులు, పిశాచులు ఆనందంతో అపహరిస్తారు.

యుధిష్ఠిరా! ఇంతవరకు వృధాదానాలను గురించి చెప్పాను. ఇంక వ్యర్థ జీవితాలు గురించి చెపుతాను. విను. నన్నుగాని, శంకరునిగాని, భూదేవతలయిన బ్రాహ్మణులను గాని శరణందని నరాధములయిన మానవులు వృథా జీవను లవుతారు కేవలం హేతువాద తర్కశాస్త్రాల్లోనే ఆసక్తులు, నాస్తిక మతావలంబకులు, అనాచారులు, దేవతలను నిందించే మానవులు వ్యర్థజీవనులు. నాస్తిక శాస్త్రాలను పరించి బ్రాహ్మణులను నిందించే నరాధములయిన నరులు వ్యర్థంగా జీవిస్తుంటారు. దుర్గాదేవిని, కుమారస్వామిని, వాయుదేవుని, అగ్నిని, జలాన్ని, సూర్యుని, తండ్రిని, తల్లిని, గురువును, ఇంద్రుని, చంద్రుని, మూర్ఖులు అనాచారులయినిందించే నరులు వృధాగా జీవిస్తుంటారు. సమృద్ధిగా ధనం ఉన్నా దానధర్మాలు చేయకుండా తాను ఒక్కడే మృష్టాన్నం తినేవాడు వృధాగా బ్రతికేవాడే అవుతాడు. ఇంతవరకు వృధాజీవితాన్ని గురించి చెప్పాను. ఇప్పుడు నీకు దాన కాలాన్ని గురించి చెపుతాను.

తమోగుణం ఆవేశించిన చిత్తం గల మనుష్యుడు చేసే దానఫలాన్ని అతడు మాతృగర్భంలో ఉన్నప్పుడే అనుభవిస్తాడు. ఈర్ష్య మాత్సర్యం కల మానవుడు దానలోభంతో ఆడంబరంగా చేసే దాన ఫలాన్ని బాల్యావస్థలో అనుభవిస్తాడు. శ్రద్ధతోగూడిన వాడు, పవిత్రుడు, ఇంద్రియాలు మనస్సు ప్రసన్నంగా ఉండి యధావిధిగా స్నానంచేసి చేసేదాని ఫలాన్ని యౌవనంలో పొందుతాడు. ఈయదగిన వస్తువును స్వయంగా తెచ్చి భక్తి పూర్వకంగా సత్పాత్రునకు చేసే దాన ఫలం మరణ పర్యంతం సర్వకాలాల్లో అనుభవిస్తాడని తెలుసుకో.

యుధిష్ఠిరా! దానమూ. దాన ఫలము రాజసము, సాత్త్వికమని, తామసమని మూడు రకాలుగా ఉంటుంది దాని గతి కూడా మువ్విధంగా ఉంటుంది. అది విను. దానం చేయటం నాకర్తవ్యం అని తెలుసుకొని తనకు ఎలాంటి ఉపకారం చేయని బ్రాహ్మణునికి చేసే దానం సాత్త్వికం అని తెలుసుకో. పాండునందనా! శ్రోత్రియుడు, దరిద్రుడు, పోషించవలసిన పెద్ద కుటుంబంగల వానికి సంతోషంతో చేసే దానాన్ని సాత్త్వికదానం అంటారు. వేదంలో ఒక్క అక్షరం రాని వాడు, అంతకుముందు తనకు ఉపకారం చేసినవాడు, మంచి సంపదగల వానికి చేసే దానం రాజసం అంటారు. పాండుకుమారా! చుట్టానికి, తప్పుడుపనులుచేసే వానికి అపాత్రుడయిన వానికి ఏదో ఒక ఫలితాన్ని కోరి చేసే దానం రాజసం అంటారు. వైశ్వదేవం చేయని వానికి, శ్రోత్రియుడుకాని వానికి దొంగతనాలు చేసేవానికి ఇచ్చేదానం తామసం అంటారు. కోపంతో, తిరస్కారంతో, క్లేశంతో నిర్లక్ష్యంగా సేవకునికి ఇచ్చేదానాన్ని తామసదానం అంటారు. నరనాథా ! దేవతలు, పితృదేవతలు, మునులు, అగ్నులు సాత్త్వికదానాన్ని గ్రహిస్తారు. దాన్ని ఉపయోగించి సంతోషపడతారు. దానవులు, దైత్యసమూహాలు, గ్రహాలు, యక్షులు, రాక్షసులు పితృదేవతలు, దేవతలు పరిహరించిన రాజసదాన ఫలాన్ని అనుభవిస్తారు. తామస దాన ఫలాన్ని పాపాత్ములు అపవిత్రకర్మల నాచరించే ప్రేతాలు,పిశాచాలు అనుభవిస్తాయి. ఇప్పుడు త్రివిధగతిని విను.

సాత్త్వికదానాలకు ఉత్తమ ఫలం, రాజసదానాలకు మధ్యమ ఫలం తామసదానాలకు అధమఫలం కలుగుతుంది. పిలిచి ఇచ్చేదానాలకు మధ్యమ ఫలం అడిగే వారికి ఇచ్చేదాన ఫలం అధమం అవుతుంది. అడగకుండా ఇచ్చేవాడు ఉత్తమగతిని, పిలిచి ఇచ్చేవాడు మధ్యమగతిని అడిగిన తరువాత ఇచ్చేవాడు అధమగతిని పొందుతాడు. దైవిక గతి ఉత్తమం అని తెలుసుకోవాలి. మానుషీగతి మధ్యమం తిర్యగ్గతి నీచమయినది. అని ఈగతి మూడు విధాలని చెపుతారు ఉత్తమ పాత్రులకు, అగ్నిహోత్రాలుచేసే బ్రాహ్మణులకు ఇచ్చేదానం అక్షయ్యం అని చెపుతారు. రాజా! దరిద్రులయిన శ్రోత్రియ బ్రాహ్మణులను స్వయంగా పోషించు. సంపదలు గల బ్రాహ్మణులను రక్షించు. దరిద్రులు, ధనంలేనివారిని మంచిదానాలు ఇచ్చి పూజించు, రోగికే ఔషధాలు ఇవ్వాలి. కాని ఆరోగ్యంగా ఉన్నవానికి ఔషధాలు ఎందుకు ? దానం ఇచ్చేవాని పాపం తీసుకునే వానిని పొందుతుంది. తీసుకునే వాని పుణ్యం ఇచ్చే వానిని పొందుతుంది. అందువల్ల పరలోకంలో మేలు కోరుకొనేవాడు ఎల్లప్పుడు దానం చేయాలి. వేద విద్యను అభ్యసించి పవిత్ర ప్రవర్తనతో జీవించేవాడు భూదాన్నం స్వీకరించని విద్వాంసులను దానభాండాగారాలను చేయాలి. తమ భక్తులు భోజనం చేయగా మిగిలిన ఆహారాన్ని వేయిరెట్లుగా భావించి అది లభించటానికి ఎదురు చూసే భార్యలు గల బ్రాహ్మణులను భోజనానికి నియంత్రించవలసింది దరిద్రకులంలోని బ్రాహ్మణులను భోజనానికి పిలిచి నిరాశగా పంపివేయరాదు. అందువల్ల వారి ఆశ హతమవుతుంది. నాభక్తులు, నాయందే మనస్సు నిలిపినవారు, నన్ను శరణందినవారు, నన్ను పూజించేవారు, నియమ పూర్వకంగా సదాసక్తులు అయిన వారిని ప్రయత్న పూర్వకంగా పూజించాలి. యుధిష్ఠిరా! వారిని పవిత్రులను చేయటానికి నేను రెండు సంధ్యాకాలాల్లో నిలుస్తాను. ఇది నా నియమం. కాబట్టి

పాపరహితులయిన నాభక్తులు 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీయాన్ని మనశ్శుద్ధికోసం సంధ్యాసమయంలో జపించాలి. సంధ్యావందనం అష్టాక్షరజపం వలన ఇతర బ్రాహ్మణుల పాపఫలం గూడా నశిస్తుంది. అందువల్ల పవిత్రతకోసం ఉదయసాయం సంధ్యలు రెండింటిలో సంధ్యావందనం చేయాలి. సంధ్యావందన జపాలు చేసే విప్రుని దైవ కార్యాలలో, పితృశ్రాద్ధాదులలో నియోగించాలి. వారిని ఎప్పుడు నిందించరాదు. అలా నిందిస్తే అతడు శ్రాద్ధాన్ని అగ్ని కట్టెలను కాల్చినట్లు దగ్ధం చేస్తాడు. **మహాభారతం, మనుస్మృతి, ఆరు అంగాలతో గూడిన వేదాలు, ఆయుర్వేద శాస్త్రాలు అనే నాలుగూ సిద్ధమయిన ఉపదేశాన్ని ఇచ్చేవి. కాబట్టి కుతర్కంతో వీటిని ఖండించరాదు.*** ధర్మం తెలిసినవాడు దైవకార్యాల్లో బ్రాహ్మణుని పరీక్షించరాదు. బ్రాహ్మణ పరీక్షవల్ల యజమానికి తీవ్రనింద కలుగుతుంది. బ్రాహ్మణులను నిందించటం చేత మానవుడు కునకజన్మను పొందుతాడు. దోషారోపణంచేయటం వల్ల గాడిదగా జన్మిస్తాడు. అవమానించటంవల్ల పురుగుగా జన్మిస్తాడు. ద్వేషించటం వల్ల కీటకంగా జన్మిస్తాడు. నివురుగప్పిన నిప్పులాగే ఉండే వారు బ్రాహ్మణులు. వారు మంచినడవడి కలిగి ఉన్నా చెడ్డ నడవడిగల వారయినా, సంస్కారహీనులయినా, సంస్కార సంపన్నులయినా అవమానించరాదు **వివేకం గల వ్యక్తి క్షత్రియుని, వేదవేత్త యయిన బ్రాహ్మణుని, సర్పాన్ని బలహీనుడయి ఉన్నా ఏ సమయంలోనూ అవమానించరాదు.**** అవమానాన్నందిన ఈ ముగ్గురు మానవుని దహించివేస్తారు. కాబట్టి బుద్ధిమంతుడు ప్రయత్నపూర్వకంగానే వీరిని అవమానించరాదు. సర్వావస్థలలో అగ్ని గొప్పదేవత అయినట్లుగానే అన్ని పరిస్థితులలో బ్రాహ్మణుడు గొప్పదైవం అవుతున్నాడు. వికలాంగులను, ఒంటికంటివారిని, గూనివారిని, మరగుజ్జులను అందరిని, వేదవేత్తలయిన వారితోపాటు దైవకార్యాల్లో నియోగించాలి. వారికి కోపం కలిగించరాదు. వారికి కీడుచేయరాదు. బ్రాహ్మణులకు క్రోధమే ఆయుధం. విప్రులు ఆయుధధారులు కారు. వజ్రాయుధంతో ఇంద్రుడు అసురులను సంహరించినట్లు, ఆ బ్రాహ్మణులు శత్రువులను మన్యువుతో సంహరిస్తారు. జాతి మాత్రంతోనే బ్రాహ్మణుడు మహా దైవంగా జన్మిస్తాడు. కుంతీనందనా! సమస్త ప్రాణులు ధర్మమనే ధనాగారానికి సామాన్య బ్రాహ్మణులే రక్షకులు కాగా నిత్యం సంధ్యావందనం చేసే బ్రాహ్మణులను గూర్చి వేరే ఇంకేం చెప్పాలి. వారి ముఖాల ద్వారానే దేవతలు హవిస్సులు, పితృదేవతలు కవ్యాలను స్వీకరిస్తారు. కాబట్టి వారిని మించి ఇంకా ఏ ప్రాణి అధికమైంది ఉన్నది ? బ్రాహ్మణుని జన్మమే శాశ్వతమయిన ధర్మమూర్తి, ధర్మంకోసం ఆయన జన్మించాడు. బ్రహ్మ భావాన్ని పొందటానికి సమర్థుడు ఆయనయే. బ్రాహ్మణుడు తన సొత్తునే అనుభవిస్తున్నాడు తన దానినే ధరిస్తున్నాడు. తనదే ఇస్తున్నాడు. బ్రాహ్మణుని దయవలనే ఇతర జనులు భుజిస్తున్నారు. కాబట్టి వారిని అవమానించరాదు. బ్రాహ్మణులు ఎల్లప్పుడూ

---

* భారతం మానవో ధర్మో వేదాః సాంగాశ్చికిత్సితమ్ ।
ఆజ్ఞాసిద్ధాని చత్వారి న హంతవ్యాని హేతుభిః ॥

**క్షత్రియం చైవ సర్పం చ బ్రాహ్మణం చ బహుశ్రుతమ్ ।
నావమన్యేత మేధావీ కృశానపి కదాచన ॥

నా భక్తులే. బృహదారణ్యకోపనిషత్తులో వర్ణితమయిన నా నిగూఢమయిన నిష్కలమయిన స్వరూపజ్ఞానం గల బ్రాహ్మణులను ప్రయత్న పూర్వకంగా పూజించు. పాండుకుమారా! నీయింటిలోగాని విదేశాల్లోగాని, రేయింబవళ్లు నా భక్తులయిన బ్రాహ్మణుని శ్రద్ధగా పూజించు.

విప్రునితో సమానమయిన దైవంగాని, గురువుగాని, ఉత్తమ బంధువుగాని, నిధిగాని లేదు. విప్రునికన్నా గొప్ప తీర్థంగాని పుణ్యంగాని పవిత్రతగాని, పావనత్వంగాని, ధర్మంగాని, పరమగతిగాని లేదు. పాపకర్మవల్ల నరకంలో పడిపోతున్న మానవుని సత్పాత్రమయిన బ్రాహ్మణుడు రక్షిస్తాడు. బ్రహ్మచర్యాశ్రమాన్నుంచే అగ్నిని పూజించే వారు, శాంతస్వభావులు, శూద్రాన్నాన్ని వదిలివేసినవారు నాభక్తులయి నన్ను అర్చించేవారికి చేసిన దానం అక్షయం అవుతుంది. నా భక్తుడయిన బ్రాహ్మణుని ఉత్తమ దానాలతో పూజించినా, నమస్కరించినా, గౌరవించినా, దర్శించినా, సంభాషించినా ఆతనిని ఆయన ఉత్తమగతికి చేరుస్తాడు. నా లీలలను గుణాలను కీర్తించే ధ్యానించే వ్యక్తులను దర్శించి, స్పృశించి మానవుడు పాపాలనుంచి విముక్తుడవుతాడు. నాభక్తులు, ప్రాణాలను నాపైనే పెట్టుకున్న వారు, నేనే దిక్కు అయినవారు, శుద్ధ శుక్లశోణిత సంజాతులు, శ్రోత్రియులు ఇంద్రియాలను నియమించుకొన్నవారు, శూద్రాన్నాన్ని గ్రహించని మహాత్ములు - దర్శనమాత్రంతోనే జనులను పవిత్రులను చేస్తారు. ఇలాంటి వారి ఇండ్లకు స్వయంగానే దానం చేయదలచిన వస్తువులను తీసుకొనివెళ్లి భక్తితోదానం చేయాలి. అలాంటి దానం కోటి దానాలతో సమానం అవుతుంది. రాజేంద్రా! మేలుకొనిగాని, నిద్రిస్తూగాని ఇతరదేశాలకు వెళ్లినప్పుడుగాని, స్వగృహంలోఉన్నప్పుడుగాని భక్తి భావంతో హృదయంలో నన్ను చూసే ద్విజోత్తముని పూజించినా దర్శించినా, స్పృశించినా, సంభాషించినా ఆయన ఆతనిని పవిత్రుని చేస్తాడు. పాండుకుమారా! ఈ రీతిగా సర్వావస్థలలో నా భక్తులకు చేసే సమస్త దానాలు స్వర్గమార్గ ప్రదాయకా లవుతాయి."

బీజయోనుల శుద్ధి - గాయత్రీ జపము - బ్రాహ్మణ మహత్త్వము - బ్రాహ్మణావమానఫలితము.

వైశంపాయనుడు చెప్పాడు. "సాత్త్విక రాజసతామసదానాలను, వాటి భిన్న భిన్న గతులను విభిన్నమయిన వివిధ ఫలాలను విని ధర్మరతుడయిన యుధిష్ఠిరుడు సంతోషించిన మనస్సుతో ధర్మామృతాన్ని ఆస్వాదించాడు. అయినా తృప్తి లేక మళ్ళీ శ్రీకృష్ణుని ఇలా అడిగాడు. లోకేశా! శ్రీకృష్ణా! పవిత్రమయిన శుక్రరజస్సులతో పవిత్రంగా జన్మించిన పురుషుని లక్షణాలను చెప్పవలసింది. బీజదోషంవల్ల ఎలాంటి మానవులు జన్మిస్తారు? దేవేశ్వరా! ఆచారదోషాన్ని సంపూర్ణంగా చెప్పవలసింది. కేశవా! బ్రాహ్మణ వైశిష్ట్యాన్ని గుణ దోషాలను చెప్పగోరుతున్నాను." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! బీజ యోనుల పవిత్రతా పవిత్రతలను ఉన్నది ఉన్నట్లు చెపుతాను వినుము. ఆరెండిటి పవిత్రత వలన ఈలోకం నిలుస్తుంది. అపవిత్రత వలన నశిస్తుంది. బ్రహ్మచర్యాన్ని యధావిధిగా అనుష్ఠించినవాడు, బ్రహ్మచర్యం భంగంకాని వాడు అయిన బ్రాహ్మణుని బీజం అని తెలుసుకో. ఆతని బీజం శుద్ధమయినది.

తల్లిదండ్రుల ఉత్తమ వంశీయులు గలది, కన్యాత్వం భంగంగానిది, బ్రహ్మాదులయిన ఉత్తమ వివాహ విధిననుసరించి వివాహం అయినది ఉత్తమ స్త్రీ అవుతుంది. ఆమె యోని ఉత్తమ మయినది. నరశ్రేష్ఠా! మనస్సుతోగాని కర్మతోగాని, వాక్కుతో గాని పరపురుషుని పొందిన స్త్రీ యోని గర్భాధానానికి అర్హంకాదు. దూషిత యోనినుండి జనించినవారు దైవకార్యాల్లో, పితృకార్యాలలో దానంలో భోజనంలో, సంభాషణంలో, శయనంలో, సంబంధంలో యోగ్యులు కారు. కన్య అయిన స్త్రీకి జనించినవాడు, వివాహసమయంలో గర్భవతి అయిన దానికి కలిగినవాడు, భర్త బ్రతికి ఉండగా వ్యభిచారం వల్ల పుట్టినవాడు, భర్త మరణించిన తరువాత పరపురుషునివలన కలిగినవాడు, సన్యాసి వల్ల కలిగినవాడు, పతితుడయిన వానికి జనించినవాడు అనే ఈ ఆరుగురు బ్రహ్మ చండాలురు అవుతారు. వీరు కుక్కమాంసం తినేవానికన్నా కూడ నీచులు. ఎక్కడో ఒక చోట ఏదో ఒక స్త్రీతోగాని, శూద్ర స్త్రీతోగాని సంభోగం చేసే స్వేచ్ఛాచారి అయిన వాడు పాపాత్ముడు. అతని బీజం అపవిత్రమైనది. అపవిత్రమయిన ఆ బీజం పవిత్రమయిన యోనికి తగదు. కుక్క నాకిన హవిస్సువలె ఆ అపవిత్ర బీజం శుద్ధయోనిని దూషితం చేస్తుంది. వీర్యాన్ని ఆత్మ అన్నారు. అది సర్వదేవతల కన్నా గొప్పది. కాబట్టి పురుషుడు సమస్త ప్రయత్నాలు చేసి తన వీర్యాన్ని రక్షించుకోవాలి. మానవుడు బ్రహ్మచర్యాన్ని అనుష్ఠించటం వల్ల ఆయువును, తేజస్సును, బలాన్ని, వీర్యాన్ని, తెలివిని, సంపదను, గొప్పకీర్తిని పుణ్యాన్ని నా ప్రేమను పొందుతాడు. బ్రహ్మచర్యం అఖండంగా అనుష్ఠించి, గృహస్థాశ్రమాన్ని ఆశ్రయించి, బ్రహ్మయజ్ఞాది పంచమహాయజ్ఞాలను అనుష్ఠించేవారే భూమిమీద ధర్మాన్ని స్థాపించారు.

ప్రతినిత్యం సాయంకాల ప్రాతఃకాల సమయాలలో చక్కగా సంధ్యావందనం చేసేవారు వేదమయమయిన నావను నిర్మించి తాము దానితో తరిస్తారు. ఇతరులను తరింపజేస్తారు పవిత్రవేదమాత అయిన గాయత్రీదేవిని జపించేవ్యక్తి నాలుగు సముద్రాలు చుట్టూ గల భూమిని అంతను దానంగా తీసుకున్నా ప్రతిగ్రహదోషంచేత దుఃఖితుడు కాడు. ఆకాశంలో ఉండే కొన్ని గ్రహాలు అనిష్టస్థానాల్లో ఉండి అనిష్ట దాయకాలయినవి గూడా గాయత్రీ జప ప్రభావం వల్ల సౌమ్యాలు, మంగళకరాలు, శుభదాయకాలు అవుతాయి. మాంసాహారంగలవి, దారుణమయి, భయంకరమయి, మహాశరీరంగల పిశాచాలు కూడా ఆ బ్రాహ్మణునికి అనిష్టం కలిగించలేవు వేదవ్రతాచరణం గల పురుషులు భూమిమీద ఇతరులను పవిత్రులను చేయగలరు రాజా! ఆ గాయత్రీ మాత నాలుగు వేదాల కన్నా శ్రేష్ఠురాలు. యుధిష్ఠిరా! బ్రహ్మచర్యాన్ని అనుష్ఠించనివారు, వేదాధ్యయనం చేయనివారు, దుష్ట ఫలాలనిచ్చే కర్మల నాచరించే నామమాత్ర బ్రాహ్మణులయినా గాయత్రీ ప్రభావంవల్ల పూజ్యులవుతారు. ఆలాంటప్పుడు ప్రాతఃసాయం సంధ్యావందనం నిత్యం చేసేవాని గూర్చి చెప్పేది ఏముంది ? శీలము వేదాధ్యయనం దానం, పవిత్రత, కోమలత్వం, సారళ్యం అనే సద్గుణాలు బ్రాహ్మణునికి వేదానికన్నా మిన్న అయినవి అని ప్రజాపతి అయిన మనువు చెప్పాడు. **"భూః భువః సువః"** అనే మూడు వ్యాహృతులతో గాయత్రీమంత్ర జపం చేసే వాడు వేదాధ్యయన నిరతుడు తన భార్యను ప్రేమించే బ్రాహ్మణుడే జితేంద్రియుడు, విద్వాంసుడు ఈ భూమిమీద ఉండే దైవం అవుతాడు. నరశ్రేష్ఠా ! ప్రతినిత్యం

సంధ్యావందనం చేసే ఉత్తమద్విజులు బ్రహ్మలోకానికి వెళ్తా రనటంలో సందేహంలేదు. కేవలం గాయత్రీ మాత్రమే తెలిసిన బ్రాహ్మణుడు నియమాలను పాటిస్తుంటే శ్రేష్ఠుడవుతాడు. నాలుగువేదాల్లో విద్వాంసుడయినా అందరి అన్నం తినేవాడు అన్నీ అమ్మేవాడు నియమ రహితద్విజుడు ఉత్తముడు కాడు

పూర్వం బ్రహ్మదేవుడు, దేవతలు, ఋషిగణాలు అందరూ కలిసి త్రాసులో ఒక వైపు గాయత్రీ మంత్రాన్ని ఇంకొక వైపు నాలుగు వేదాలను తూచారు. అప్పుడు తక్కెడలో గాయత్రి ఉన్న పళ్ళెమే నాలుగు వేదాల కంటే బరువయిన దని నిర్ణయమైంది. పాండుపుత్రా! తుమ్మెదలు వికసించిన పూవునుండి మకరందాన్ని గ్రహించినట్లు సమస్తవేదాలనుంచి వాని సారభూతమయిన గాయత్రి గ్రహింపబడింది. రాజా! అందువల్ల సర్వవేదాలకు గాయత్రి ప్రాణం అంటారు. గాయత్రీ రహితమయిన వేదాలు నిర్జీవాలు అవుతాయి. నియమసదాచార భ్రష్టుడయిన బ్రాహ్మణుడు నాల్గువేదాలు చదివిన వాడయినా నింద్యుడవుతాడు. సచ్ఛీలం సత్ప్రవర్తన గలిగి గాయత్రీజపం మాత్రమే చేసే బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు. ప్రతిదినమూ సహస్రగాయత్రీ జపం శ్రేష్ఠం. శతజపం మధ్యమం, నూటికంటే తక్కువ పది గాయత్రీజపం అధమం అవుతాయి. కుంతీపుత్రా! సర్వపాపాలను నశింపజేసే గాయత్రీజపం చేయవలసింది " యుధిష్ఠిరుడు అడిగాడు. "త్రిలోక ప్రభూ ! శ్రీకృష్ణా ! నీవు సర్వభూతమయుడివి. నానాయోగములచేత పొందదగినవాడివి. సర్వశ్రేష్ఠా! ఏమి చేస్తే నీవు సంతుష్టుడి వవుతావు ?" శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "భారతా! ఎవరయినా వేయి బారువుల బరువుగల గుగ్గులు ధూపం నాకు సమర్పించినా, నిరంతరం నమస్కరించినా, సమృద్ధమయిన బహుమతులతో పూజించినా, ఋక్కులు, యజుస్సులు, సామముల స్తుతులతో ఎల్లప్పుడు స్తుతించినా, బ్రాహ్మణులను సంతృప్తులను చేయక పోతే నేను తృప్తుడను గాను భరతశ్రేష్ఠా! నిత్యము బ్రాహ్మణుని పూజిస్తే నేను పూజితుడను అవుతాను. సందేహం లేదు. బ్రాహ్మణుని పరుషంగా పలికితే ఆ కటువచనాలు నాకే చెందుతాయి. ద్విజుని పూజించేవారికి నేనే పరమగతి అవుతాను. నేను ద్విజరూపంతో భూలోకంలో ఉంటాను. నరోత్తమా! నాయందు మనస్సు నిలిపి ద్విజులను పూజించే మేధావిని నేను నా రూపంగా చూస్తాను. బ్రాహ్మణులు నా స్వరూపులు, కాబట్టి వారిలో గూనివారు, ఒంటికంటివారు, కురుచవారు, దరిద్రులు, రోగగ్రస్తులు అయిన వారిని గూడా అవమానించరాదు. సముద్ర పర్యంతమయిన భూమి నైగల ద్విజశ్రేష్ఠులు అందరూ నా స్వరూపమే. వారిని అర్చిస్తే నేను పూజితుడి నవుతాను. నేను ద్విజరూపంలో భూమి మీద ఉన్నానని జ్ఞాన హీనులయిన అనేకమానవులు తెలుసుకోలేరు. బ్రాహ్మణులను తిట్టి, నిందించి సంతోషించే వారు మరణించి యమలోనికి పోయినప్పుడు ఎర్రని కన్నులు గల క్రూర యమధర్మరాజు వారిని నేలమీద పడవేసి గుండెల మీద కాలుపెట్టి నిప్పులో పెట్టడంతో కాలి ఎర్రనైన పట్టకారుతో వారి నాలుక పీకివేస్తాడు. బ్రాహ్మణులను పాపదృష్టితో చూచే వారు బ్రాహ్మణభక్తులు కానివారు. వైదిక మర్యాదలను ఉల్లంఘించేవారు. ఎల్లవేళల బ్రాహ్మణులను ద్వేషించే వారు. యమలోకానికి వెళ్లినప్పుడు అక్కడ యముని ఆజ్ఞానుసారం పదునయిన ముక్కుగల బలిష్ఠాలయిన పెద్దపెద్ద పక్షులు వచ్చి ఒక్కక్షణంలో ఆ పాపాత్ముల కన్నులను పీకివేస్తాయి.

ఉత్తమ బ్రాహ్మణుని తీవ్రంగా కొట్టేవాడు, రక్తం కారేటట్లు చేసేవాడు, ఎముకలు ముక్కలు చేసేవాడు, ప్రాణాలు తీసేవాడు మరణానంతరం క్రమంగా ఇరువది యొక్క నరకాలకు పోతాడు. తరువాత ఆ పాపిని వేల సంవత్సరాలు తలక్రిందులు చేసి శూలంమీద కొరత వేస్తారు. తరువాత అగ్నిలో దగ్ధం చేస్తారు. ఆ దుర్బుద్ధి పాపం అంతా పరిహారం అయ్యేదాకా ఆ దారుణయాతనలను అనుభవిస్తూనే ఉంటాడు. బ్రాహ్మణులను కావాలనే వధించే కోరికతో వెళ్లేవానిని తామిస్రం అనే నరకంలో వేయి సంవత్సరాలు పక్వంచేస్తారు. కాబట్టి బ్రాహ్మణులను ఎప్పుడూ గూడా అశుభవచనాలు పలకగూడదు. వారికి కఠోరంగా పరుషంగా పలుకరాదు. వానిని అవమానించరాదు. బ్రాహ్మణులతో మధురంగా మాట్లాడుతూ పూజించే మానవోత్తములు నిస్సందేహంగా నన్ను అర్చించినవారు స్తుతించిన వారు అవుతారు. భారతశ్రేష్ఠా! బ్రాహ్మణులను భయపెట్టేవారు, తిట్టేవారు నన్నే తర్జించేవారు, నిందించేవారవుతారు."

యమలోకమార్గకష్టములు, వానినుండి విముక్త్యుపాయములు.

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవదేవేశా ! రాక్షసనాశకా ! నాకు చాలా కుతూహలంగా ఉంది కేశవా! సర్వజ్ఞా! యమలోకానికి, మానవలోకానికి మధ్య ఎంతదూరం ఉంటుందో చెప్పవలసింది. చర్మం ఎముకలు, మాంసంవీడినవాడు పంచభూతాలు వదలిన జీవునికి సమస్త సుఖదుఃఖాల అనుభవం ఎలా కలుగుతుందో సంపూర్ణంగా చెప్పవలసింది. మనుష్యలోకంలో జీవుడు తన పుణ్యపాపకర్మలతో బద్ధుడయి ఉంటాడని, మరణానంతరం అతనిని ఆజ్ఞానుసారం మహాఘోరమయిన వారు, భయంకర పరాక్రమాలు దురాధర్షులు అయిన యమదూతలు కఠినపాశాలతో బంధించి కొడుతూ తీసుకొని వెళ్తారని ఆజీవులు అటూ ఇటూ పారిపోవటానికి ప్రయత్నిస్తారని వింటాము. అక్కడ పుణ్యపాపాలు చేసేవారు సర్వవిధ సుఖదుఃఖాలను అనుభవిస్తారు. అని కూడా వింటాము. కాబట్టి మరణించిన వానిని తీవ్రప్రకృతులయిన యమదూతలు ఎలా తీసుకొనిపోతారో చెప్పవలసింది. కేశవా! యమలోకానికి వెళ్ళే జీవునికి రూపము, వర్ణమూ ఎలా ఉంటాయి ? వాని శరీర ప్రమాణం ఎలా ఉంటుంది ? ఆది అంతా చెప్పవలసింది."

శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "రాజా! నరనాథా ! నీవు నాభక్తుడివి. నీవు అడిగిన విషయాన్ని ఉన్నది ఉన్నట్లు చెపుతాను విను. యుధిష్ఠిరా మానవలోకానికి యమలోకానికి మధ్య ఉన్న దూరం ఎనుబది ఆరువేల యోజనాలు. ఆ త్రోవలో చెట్టునీడగాని చెరువుగాని, సరస్సుగాని, బావులుగాని దిగుడుబావులుకాని, కూపంగాని ఉండవు. మండపంగాని, సభగాని, చలివేంద్రగాని, ఇల్లుగాని, కొండగాని, నదిగాని బొరియగాని ఎక్కడా ఒక్కటీ ఉండదు.

గ్రామంగాని ఆశ్రమంగాని, ఉద్యానంగాని వనంగాని ఏలాంటి ఆశ్రమం ఆ త్రోవలో ఉండవు. జీవునికి మృత్యుకాలం ఆసన్నమయినప్పుడు అతడు వేదనలో తీవ్రంగా గిలగిలలాడుతాడు. అప్పుడు కారణతత్త్వదేహాన్ని వదలుతాడు. ప్రాణాలు గొంతులోకి వస్తాయి. వాయు వశుడయిన

జీవుడు పరవశుడై ఈ శరీరం నుంచి బయటపడి, వాయురూపం దాల్చిన జీవుడు ఇంకొక అదృశ్య శరీరంలో ప్రవేశిస్తాడు. ఆ శరీర రూపం రంగు, ఎత్తు, లావు పూర్వ శరీరం అంతే ఉంటాయి. ఆ శరీరంలో ప్రవేశించిన జీవుని ఎవ్వరూ చూడలేరు. దేహధారుల అంతరాత్మ అయిన జీవుడు ఎనిమిది అంగాలుకలిగిన యమలోకయాత్ర సాగిస్తాడు. ఆ శరీరాన్ని కోయటం వల్ల, ముక్కలు చేయుటవలన, దగ్ధం చేయటంవల్ల, కొట్టటం వల్ల నశించదు. అనేక రూపధరులు, ఘోరమయినవారు, ప్రచండులు ప్రచండమయిన ఆయుధాలు గలవారు, దురాధర్షులు అయిన యమదూతలు వచ్చి జీవుని బలాత్కారంగా తీసుకుపోతారు. అసమయంలో జీవుడు పుత్రులు, భార్యామయ మయిన మమకారబంధ బద్ధుడయి ఉంటాడు. పరవశుడయి బలవంతగా కొని పోబడతాడు. అప్పుడు ఆతడు చేసిన పాపపుణ్యాలు వెంటవస్తాయి. అప్పుడు దుఃఖపీడితులయిన బంధువులు కరుణాజనకంగా ఆతనికయి దుఃఖిస్తుంటారు. ఆతడు సమస్త బంధుజనులను విడిచి నిరపేక్షుడయి వెళ్తాడు. తల్లిదండ్రులు సోదరులు,మేనమామలు, భార్య,పుత్రులు, ఏడుస్తూ అతనిని వదలిపెడతారు. ఆ బంధువుల కన్నులు కన్నీటితోనిండి ఉంటాయి. అలాగే వారు చూస్తుంటారు. ఆ జీవుడు తన శరీరం వదలి వాయురూపుడయి వారికి ఎవ్వరికి కనపడకుండా వెళ్తాడు.

పాపకర్మలు చేసిన వారి త్రోవ కటికచీకటితో నిండి ఉంటుంది. ఆ త్రోవకు చివర కన్పించదు. అది భయంకరం, అయోమయం, దుస్తరం, దుర్గమం. చివరిదాకా దుఃఖదాయకమే అయి ఉంటుంది. యుమునికి అధీనంలో ఉండే దేవతలు అసురులు, మనుష్యులు మున్నగు జీవులు భూమిమీద ఉన్నవారు స్త్రీలుగాని, పురుషులుగాని, నపుంసకులుగాని, బాలురుగాని, వృద్ధులుగాని, యువకులుగాని, అపుడే జన్మించినవారుగాని గర్భస్థులుగాని వీరిలో ప్రతిఒక్కరు ఏదోఒక రోజున ఆ మహామార్గంలో ప్రయాణించవలసిందే. ఆ మహాపథం ఉదయంగాని, మధ్యాహ్నం గాని, సంధ్యాకాలంలో గాని ప్రదోషకాలంలోగాని, అర్ధరాత్రిగాని, తెల్లవారుజామున గాని ఎప్పుడయినా తెరిచే ఉంటుంది. ప్రచారకులు, చండశాసనులు తేరిపారజూడరాని యమదూతలకు వశులయి జీవులు ఆ మహాపథంలో వెళ్ళి యమలోకం చేరతారు. జీవులు ఒకచోట భయపడుతూ మరొకచోట పిచ్చివారయి, ఇంకొకచోట తొట్రుపడుతూ, ఏడుస్తూ, బాధతో ఆప్పులు యమలోకానికి వెళ్లలసివస్తుంది. యమదూతల ఆదలింపులు విని జీవులు ఉద్వేగు లవుతుంటారు. భయంతో విహ్వాలులు అవుతారు. వణికిపోతుంటారు. దూతల దెబ్బలు తినటంవల్ల శరీరంలో మహాబాధ కలుగుతుంది. అయినా వారి ఆదలింపులు వింటూ ముందుకు వెళ్ళాల్సిందే. ధర్మహీనులయినవారు కర్రల, రాళ్ళ, శిలల దండాల కొరవుల, కొరడాల, అంకుశాల దెబ్బలు తింటూ యమలోకానికి వెళ్లవలసివస్తుంది. ఇతరజీవులను హత్యచేసే యమదూతలు వెట్టే బాధలతో ఆర్తులవుతూ, కేకలు వెడుతూ, వెద్దగా ఆరుస్తూ వేదనతో ఆర్తులయి క్రింద పడతూ యమలోకానికి వెళ్లవలసి వస్తుంది. వెళ్లేటప్పుడు ఆజీవఘాతకులకు శక్తులు, భిందిపాలాలు, శంకువులు, తోమరాలు, బాణాలు, శూలాల దెబ్బలు తగులుతుంటాయి. కుక్కలు, వెద్దపులులు, నక్కలు, కాకులు వారిని నాలుగు దిక్కులనుండి గాయపరుస్తుంటాయి. మాంసం చీల్చే రాక్షసులు

కూడా వారిని బాధిస్తుంటారు. మాంసం తినేవారిని గేదెలు మృగాలు, పందులు, దుప్పులు ఆమార్గంలో వెళ్లేటప్పుడు గాయపరుస్తాయి. హింస్రక జంతువులు తింటాయి. పసిపిల్లలను హత్యచేసే పాపాత్ములను సూదిలాగా మిక్కిలి పదునయిన ముక్కులుగల ఈగలు నాలుగువైపులా కుడుతుంటాయి.

విశ్వాసంగల యజమానిని, మిత్రుని స్త్రీని చంపే వారు యమలోకానికి వెళ్ళేసమయంలో యమదూతలు ఆయుధాలతో గాయపరుస్తారు. ఇతరజీవులను తినేవారు, వాటికి దుఃఖం కలిగించేవారిని యమలోకానికి వెళ్లేటప్పుడు, రాక్షసులు,కుక్కలు భక్షిస్తాయి. వస్త్రాలను, శయ్యలను, పక్కలను, పరుపులను దొంగిలించేవారు ఆయాలోకమార్గంలో పిశాచాలవలె దిగంబరులయి తరమబడుతూ పరుగుతీస్తారు. ఇతరుల గోవులను ధాన్యాన్ని బంగారాన్ని, పాలాన్ని ఇంటిని, పరద్రవ్యాన్ని బలాత్కారంగా హరించి పాపం చేసేవారిని, రాళ్ళతో, కొరవులతో, దండాలతో, కాష్ఠాలతో, పేము బెత్తాలతో కొడుతుంటారు. గాయాల బాధతో ఆ పాపులు యమలోకానికి వెళ్తారు. నరకభయం ఏమాత్రం లేక బ్రాహ్మణుల సొత్తును అపహరించేవారు, తిట్టేవారు, ఎల్లప్పుడు కొట్టేవారిని యమలోకానికి వెళ్లేటప్పుడు యమదూతలు నోళ్లుఎండిపోయేటట్లు బంధిస్తారు. వారి నాలుకలను, కన్నులను, ముక్కులను చేదిస్తారు. వారి శరీరాలమీద దుర్గంధ భూయిష్ఠమయిన చీము, నెత్తురు, పోస్తారు. నక్కలు వారిని భక్షిస్తుంటాయి. భయంకరులు ప్రచండులు అయిన చండాలురు శరీరం అంతటా గాయపరుస్తూంటారు. అందువల్ల దయనీయంగా ఏడుస్తుంటారు. అక్కడికి వెళ్లిన పాపాత్ములను అమేధ్యకూపాల్లో యావజ్జీవం పడవేస్తారు. కోట్లకొలది సంవత్సరాలు నానాబాధలు పడుతూ కష్టాలు అనుభవిస్తారు. రాజా! వాటిల్లోనుంచి విముక్తులయిన నరాధములు ఈలోకంలో కోటిజన్మల వరకు అమేధ్యంలో పురుగులయి పుడతారు. ఈ లోకంలో ఏదానమూ చేయని జీవుల కరం నోరు దవడలు ఎండిపోగా యమలోకానికి వెళ్తూ యమదూతలను అన్నం నీరు ఇవ్వండి అని పలుమారులు దీనంగా అడుగుతూ వెళ్తుంటారు. స్వామీ! ఆకలి దప్పులతో ఆర్తులమయి ఉన్నాం. ఇవ్వాళ నడువలేము స్వామీ! మాకు అన్నం పెట్టించండి. నీళ్ళు ఇవ్వండి! అని ప్రార్థిస్తూంటే యమదూతలు వారిని యమలోకానికి చేరుస్తారు.

పాండునందనా! బ్రాహ్మణులకు నానావిధాలయిన దానాలు ఇచ్చేవారు సుఖంగా వాటి ఫలితాలను పొందుతారు. చక్కగా రుచికరంగా సిద్ధం చేసిన ఆహారాన్ని బ్రాహ్మణులకు, అందులోను శ్రోత్రియులకు అమితసంతోషంతో పెట్టే మహాత్ములు విచిత్రమయిన విమానాల్లో ఉత్తమ అప్సరసలు సేవిస్తుండగా యమలోకానికి పోతారు. ప్రతినిత్యమూ కపటం లేని సత్యవచనాలు పలికే మానవులు నిర్మలమయిన మేఘాలతో సమానమయిన వృషభాలు పూన్చిన విమానాలనెక్కి యమలోకానికి వెళ్తారు. కపిల గోవులు మొదలయిన పుణ్యగోదానాలను బ్రాహ్మణులకు, అందునా విశేషించి శ్రోత్రియులకు ఇచ్చే పుణ్యాత్ములు నిర్మల మేఘసమానమయినవి. ఎద్దులను పూన్చిన విమానాలమీద మహాపదంలో వెళ్తారు. యమలోకానికి వెళ్లి అప్సరసల సేవలను పొందుతారు. చెప్పులను, గొడుగును, శయ్యలను, వస్త్రాలను, ఆభరణాలను బ్రాహ్మణులకు దానం చేసేవారు. గుర్రాలమీద, ఎద్దులమీద, అలంకృతాలయిన ఏనుగులమీద ఎక్కి బంగారు గొడుగులు ప్రకాశిస్తుండగా యముని పురానికి వెళ్తారు. పండ్లను

సువాసన గలపూలను దానం చేసే మానవులు హంసలను పూన్చిన విమానాల మీద యమపురానికి వెళ్తారు. బ్రాహ్మణులకు నేతితో చేసిన నానావిధాహారాలను పెట్టే వారు నిర్మలమయిన వాయువేగంగల విమానాలమీద నానా విధ జనంతో నిండిన ప్రేతరాజలోకానికి వెళ్తారు. సమస్త జీవులకు ప్రతకునిచ్చే మంచి నీటిని దానం చేసేవారు చాలా సంతృప్తులయి హంసలు పూన్చిన విమానాలమీద యమలోకానికి వెళ్తారు. రాజా! నువ్వులనుగాని, తిలధేనువునుగాని, ఘృతధేనువును గాని, శాంతభావంగలిగి శ్రోత్రియులకు దానంచేసేవారు సూర్యమండలం లాంటి తేజోవంతమయిన నిర్మల విమానాలమీద గంధర్వుల స్తుతిగీతాలు వింటూ యమలోకానికి వెళ్తారు. ఈలోకంలో దిగుడుబావులను, బావులను, చెరువులను, సరస్సులను, నడిబావులను, నలుచదరంగా త్రవ్విన చెరువులను, జలపూర్ణమయి పశువులు త్రాగటానికి నూతిఒడ్డున నిలిపిన రాతితొట్లను ఏర్పరచిన పుణ్యాత్ములు మహాతేజోవంతులు నిత్యతృప్తులయిన పుణ్యాత్ములు దివ్యమయిన గంటలు మ్రోగే, చంద్రుని వలె కాంతి వంతాలు అయిన విమానాలను ఎక్కి వింజామరలు . విసనకర్రలతో అప్సరసలు వీస్తుండగా యమలోకానికి వెళ్తారు. ఈ లోకంలో చిత్రవిచిత్రమయినవి, విశాలమయినవి, మనోహరమయినవి. సుందరమయినవి, చూడదగిన దేవాలయాలను నిర్మించిన మహనీయులు నిర్మల మేఘ తుల్యులు, వాయువేగంగల విమానాలమీద నానాజనపదాలతో నిండిన యమలోకానికి వెళ్తారు. వారు ప్రసన్న చిత్తంతో సుఖంగా కూర్చుని ఉన్న యమధర్మరాజును దర్శిస్తారు. యమునిచేత పూజితులయి దేవలోకానికి వెళ్తారు.

పాదుకలను దానం చేసేవారు యమలోకానికి వెళ్లే మార్గంలో ఉత్తమ రథంమీద ఉన్న బంగారు పాద పీఠం మీద అడుగుపెట్టి వెళ్తారు. పెద్దతోటలను ఏర్పరచి, వాటిల్లో వృక్ష సమూహాలను పెంచి, ఎలాంటి పాలకులులేకుండా వాటిని పూలతో, పండ్లతో మనోహరంగా పెద్దచేసినవారు మహాపథంలో వెళ్లేటప్పుడు చక్కగా భూషణాలంకృతులయి, దివ్యవాహనాలను ఆరోహించి, పూజితులవుతూ మనోహరమయిన చల్లని చెట్ల నీడలలో సుఖంగా ప్రయాణిస్తారు ఉత్తమ విప్రులకు గుర్రాన్నిగాని, గోవునుగాని, ఏనుగునుగాని వాహనంగా ఇచ్చేవారు సువర్ణమయమయిన విమానాల మీద యమలోకానికి వెళ్తారు. భూదానంచేసేవారు అన్నికోరికలతో తృప్తులయి ఉదయించే సూర్యునివలె వెలిగే వృషభాలుగల విమానాలతో తమలోకానికి వెళ్తారు. ఉత్తములయిన బ్రాహ్మణులకు మిక్కిలి భక్తి పూర్వకంగా సుగంధ గంధాలను, సువాసనగల పూలను సమర్పించేవారు మరణానంతరం మంచి గంధాన్ని పూసుకుని, చిక్కని కాంతితో పూలమాలలను, సొమ్ములను దాల్చి అలంకృతులై తేజోవంతులయి విచిత్ర వాహనాల మీద యమధర్మరాజు పట్టణానికి వెళ్తారు. దీపదానం చేసేవారు జ్వలిస్తున్న అగ్నులవలె వెలుగొందుతూ పది దిక్కులను ప్రకాశింపజేస్తూ ఆ సూర్య సమానాకారంగల యానాలతో యమలోకానికి వెళ్తారు. గృహాలను, ఆశ్రమభూములను దానం చేసేవారు బంగరు వేదికలు గల్గి ఉదయసూర్యుని వలె ప్రకాశించే గృహాలతో యమధర్మరాజపురానికి వెళ్తారు. బ్రాహ్మణులకు నలుగు పిండి. కాళ్ళుకడుగుకోవడానికి పాదోదకాన్ని, తలంటికి కావలసిన తైలాన్ని పానీయాలను దానంచేసేవారు గుర్రాల మీద యమలోకానికి వెళ్తారు. సుదూర ప్రయాణంచేసే త్రోవలో అలిసిపోయిన బ్రాహ్మణులకు వసతి కల్పించి సేవించేవారు

చక్రవాకాలు కూర్చిన వాహనంమీద యమలోకానికి వెళ్తారు. బ్రాహ్మణులను స్వాగత వచనాలతో, ఆసనదానంతో పూజించేవాడు ఆ మహాపథంలో పరమానందంతో సుఖంగా వెళ్తారు.

"నమః సర్వసమేభ్యః" అని చెప్పి ప్రతిదినం నిత్యకృత్యంగా ఆవులకు నమస్కరించేవాడు ఆ మార్గంలో సుఖంగా ప్రయాణిస్తాడు. ప్రతిరోజు ప్రాతఃకాలంలో ప్రక్కమీదనుంచి లేస్తూనే "నమోఽస్తు విప్రదత్తాయై" అని పలుకుతూ నేలమీద కాలుమోపినవాడు స్నమస్తకామనలు తీరి, తృప్తుడై, సర్వాభరణభూషితుడయి దివ్యమయిన వాహనం మీద సుఖంగా యమలోకానికి వెళ్తాడు. మధ్యాహ్నం రాత్రులయందు మాత్రమే భోజనం చేసి మధ్యకాలంలో ఏమీ తినని వారు డంబంలేకుండా, అబద్ధం చెప్పకుండా ఉండేవారు హంసలు కట్టిన వాహనాలమీద సుఖంగా యమలోకానికి వెళ్తారు. జితేంద్రియులయి ఒకరోజు ఉపవాసం చేసి రెండవరోజు రాత్రిమాత్రమే భుజించేవారు నెమళ్ళపూన్చిన యానం మీద యమాలయానికి వెళ్తారు. ఒక సంవత్సరకాలం ఆరురోజుల తరువాత ఒక మారే భోజనం చేస్తూ కామక్రోధాలను వదలి జితేంద్రియుడయి, పవిత్రుడయి ఉండేవాడు ఏనుగుమీద వెళ్తాడు. మార్గంలో ఆతనికి జయజయ ధ్వానాలు వినిపిస్తాయి. ఈలోకంలో ఒక పక్షం పదిహేను రోజులు ఉపవాసంచేస్తూ ఉండేవారు దివ్య స్త్రీ సమూహసేవితమై వెడ్డపులులు కూర్చిన వాహనంమీద రమ్యమయిన ధర్మరాజపట్టణానికి వెళ్తారు ఇంద్రియాలను అదుపులో పెట్టుకొని ఒకమాసం అంతా ఉపవాసంచేసే వారు కూడా ఉదయ సూర్యుని వంటి వాహనాలమీద యమలోకానికి వెళ్తారు. గోవుల కోసం స్త్రీలకోసం, విప్రులకోసం (వాటి ప్రాణరక్షకై) ప్రాణాలను అర్పించేవారు సూర్యుని ప్రకాశం వంటి వెలుగుతో శోభిల్లుతూ, దేవకన్యకల సేవలు స్వీకరిస్తూ యమాలయానికి వెళ్తారు. సమృద్ధమయిన దక్షిణలతో యజ్ఞాలు చేసే ద్విజ శ్రేష్ఠులు హంసలు, బెగ్గురు పక్షులు కట్టిన వాహనాల మీద ఆ మార్గంలో పయనిస్తారు. ఇతరులను ఏమాత్రం పీడించకుండా తమకుటుంబాన్ని పోషించేవారు సువర్ణంలో ప్రకాశమానమయిన విమానాలమీద ఆ మార్గంలో సుఖంగా ప్రయాణిస్తారు."

జలాన్నదానముల అతిథిసత్కారముల మాహాత్మ్యము.

వైశంపాయనుడు చెప్పాడు. "ధర్మపుత్రుడు యమలోక మార్గాన్ని గురించి అందులో జీవుల గమనాన్ని గురించి విని సంతోషించాడు. మళ్లీ శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "దేవదేవేశా! జననమరణ రూప సంసారనాశనా! షడ్గుణైశ్వర్య సంపన్నా! సహస్రసూర్యసమానా! నీవు సర్వశోభాయుక్తుడవు. ధర్మజ్ఞా! సమస్తమూ నీనుంచే ఉత్పన్నమయింది. నీవు సర్వధర్మాలను ప్రవర్తింపజేసేవాడివి. సౌమ్య! అచ్యుతా! సమస్తదానాల ఫలం చెప్పగోరుతాను." ధీమంతుడయిన ధర్మపుత్రుడు ఈ రీతిగా అనగా హృషీకేశుడు ధర్మపుత్రునికి మహోన్నతి చేకూర్చే పుణ్యములూ ధర్మాలూ చెప్పసాగాడు. "పాండుపుత్రా! లోకంలో జలం జీవులకు పరమజీవనం అంటారు. జలం దానం చేయటం వలన తృప్తి కలుగుతుంది. జలగుణాలు దివ్యమయినవి. అవి పరలోకంలో గూడా మేలు కలిగిస్తాయి. రాజేంద్రా! యమలోకంలో ఫుష్పోదకి అనే పరమపవిత్ర మయిన నది ఉన్నది. అది జలదానం చేసేవారికి సంపూర్ణ కామనలను

ఈడేరుస్తుంది. అందులోని నీరు చల్లగాను, అక్షయంగాను, అమృత సమానంగాను ఉంటుది. చల్లని నీటిని దానం చేసినవారికి అది నిత్యము సుఖప్రదం అవుతుంది. యుధిష్ఠిరా! నీరు త్రాగినందువల్ల ఆకలి కూడా తీరుతుంది. కాని దప్పికగొన్నవాని దప్పిక అన్నం తింటే తీరదు. కాబట్టి వివేకి అయిన వారు దప్పిగొన్న వారికి ఎల్లప్పుడు జల దానం చేయాలి. జలం అగ్నికి మూర్తి. భూమికి కారణం. అమృతానికి ఉత్పత్తి స్థానం అయింది. కాబట్టి పండితులు సర్వప్రాణులకు నీరే మూలం అని చెపుతారు. నీటిచేతనే సర్వ ప్రాణులు జీవిస్తాయి. జలం నుంచే జన్మిస్తాయి. జలం తోనే జీవిస్తాయి. కాబట్టి దానాలు అన్నింటిలో జలదానం గొప్పది.

భరతవంశశ్రేష్ఠా ! బ్రాహ్మణులకు చక్కగా వండిన ఆహారం వడ్డించే వారు భోక్తలకు స్వయంగా ప్రాణదానం చేసిన వారే అవుతారు. అన్నం వల్లనే రక్తం, వీర్యం వీర్పడుతాయి. జీవుడు అన్నంలోనే ప్రతిష్ఠితుడు అవుతాడు. ఇంద్రియాలు, బుద్ధి అన్నం వల్లనే పుష్టినందుతాయి పాండునందనా! అన్నంలేకపోతే సర్వప్రాణులు నశిస్తాయి. తేజస్సు బలం, రూపం, బలం, వీర్యం, ధైర్యం, కాంతి, జ్ఞానం, తెలివి, ఆయువు అనేవి అన్నీ అన్నంలోనే ప్రతిష్ఠితా లయినాయి. సమస్తలోకాలలో నిత్యం ఉండే దేవతలు, మానవులు, తిర్యగ్జాతుల ప్రాణులలో సర్వకాలాల్లో అందరి ప్రాణాలు అన్నంలోనే నిలిచి ఉన్నాయి. అన్నమే ప్రజాపతిరూపం. అన్నమే ఉత్పత్తికి కారణం. కాబట్టి అన్నం సర్వభూతమయం అవుతుంది. జీవుడు అన్నమయు డవుతాడు. అని చెపుతారు. ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అనే పంచప్రాణవాయువులు అన్నమే ఆధారంగా కలిగి శరీరధారిని ధరిస్తున్నాయి. సర్వ ప్రాణులు ఆచరించే నిద్రించటం లేవటం, వెళ్ళటం, తీసుకోవటం, ఆకర్షించబడటం అనే సర్వకార్యాలు అన్నం వల్లనే జరుగుతున్నాయి. రాజేంద్రా! ప్రజాపతి సృష్టి అయిన స్థావర జంగమాత్మకాలయిన నాల్గువిధాల ప్రాణులు అన్నం వల్లనే జనిస్తున్నాయి. సమస్త విద్యాలయాలు, పవిత్రమయిన సర్వయజ్ఞాలు అన్నంవల్లనే లోకంలో ప్రవర్తితా లవుతున్నాయి. కాబట్టి అన్నం సర్వోత్తమం అంటారు. రుద్రాదులయిన దేవతలు, పితృదేవతలు, అగ్నులు అన్న ప్రదానం చేతనే ఆనందిస్తారు. కాబట్టి అన్నం విశిష్టమయినది.

బ్రహ్మదేవుడు ప్రతి కల్పంలోను సమస్త ప్రజలను సృష్టించాడు. అందువల్ల అన్న దానాన్ని మించిన దానం లేదు. పాండుపుత్రా! ధర్మార్థకామాలనే మూడు అన్నదానం వల్లనే ప్రవర్తిల్లుతున్నాయి. కాబట్టి ఆ అన్నదానాన్ని మించిన దానం లేదు. యక్షులు, రాక్షసులు, గ్రహాలు, సర్పాలు, దానవులు, ఇతర ప్రాణులు అన్నీ అన్నంతో సంతోషిస్తాయి. కాబట్టి అన్నమే సర్వోత్తమం అవుతుంది. రాజా! దంభం, అసత్యాన్ని వదలి, నాభక్తుడయి, వంటలో భేదాన్ని పాటించక శ్రోత్రియుడు, దరిద్రుడు అయిన బ్రాహ్మణునికి ఒక సంవత్సరం పాటు స్వధర్మానుష్ఠానంతో సంపాదించిన అన్నం దానం చేసే వానికి కలిగే పుణ్యఫలం చెపుతాను, విను. అతడు ఒక లక్ష సంవత్సరాల కాలం మహా గౌరవంతో దేవలోకంలో ఉంటాడు. అక్కడ తన ఇష్టానుసారం రూపందాల్చి స్వేచ్ఛా సంచారంతో ఉంటాడు. అప్సరసల సమూహం అతనిని పూజిస్తుంది. సమయానుసారం పుణ్యం క్షీణించగా ఆగతినుంచి క్రిందికి వచ్చి మానవలోకంలో బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. ఆరుమాసాలుగాని, వార్షికంగా వచ్చే

శ్రాద్ధపర్యంతంగాని దరిద్రబ్రాహ్మణునికి మొదటి భిక్షను పెట్టేవాని పుణ్యఫలాన్ని విను. వేయి గోవులను దానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందని చెప్పారో అంత పుణ్యఫలాన్ని నరుడుపొందుతాడు. సందేహంలేదు. పాండునందనా ! దేశకాలాల ననుసరించి వచ్చినవాడు మార్గాయాసంతో ఉన్న వాడు, ఆకలిగొన్నవాడు, అన్నం కోరే బ్రాహ్మణునికి అన్నం పెట్టాలి. దూరం నుంచి నడచి రావటం వల్ల కలిగిన శ్రమతో అలసినవాడు, దుమ్ముకొట్టుకున్న పాదాలుగలవాడు, ఆకలిదప్పులతో శ్రమతో బడలినవాడు, ఆర్తుడు, తొట్రుపడుతున్నవాడు, అయిన బ్రాహ్మణుడు అన్నంపెట్టేవారు ఎక్కడ ఉన్నారు ? అని అడుగుతూ ఇంటికివచ్చి యాచించే వానిని యథాశక్తిగా అన్నదానంతో గౌరవించాలి. ఆ అతిథియే దాతను స్వర్గం చేర్చేవాడు. నరశ్రేష్ఠా! ఆయన తృప్తుడయితే సర్వదేవతలు సంతుష్టులు అవుతారు.

కుంతీనందనా! అతిథి పూజచేత సంతోషించినంతగా అగ్నులు హవిస్సులు అర్పించటంచేత హోమాలచేత, పూలచేత, మైపూతల చేత సంతుష్టినందవు. పాండవశ్రేష్ఠా ! దేవుని నిర్మాల్యం తీసివేసి శుభ్రం చేయటం, బ్రాహ్మణ భోజనం తరువాత ఆ ప్రదేశం శుభ్రం చేయటం, అలసిపోయినవారి కాళ్ళుపట్టటం, వారికి పాదప్రక్షాళనం, వసతి కల్పించటం, శయ్యను, ఆసనాన్ని ఇవ్వటం అనే వాటిల్లో ఒక్కొక్కటి గోదానానికంటే ఉత్తమమయినది. బ్రాహ్మణులకు కాళ్ళుకడుక్కోవడానికి నీటిని, కాళ్లకు రుద్దుకోటానికి నేతిని, దీపాన్ని, అన్నాన్ని, వసతిని కల్పించేవారు యముని వద్దకు వెళ్లరు. రాజా! భక్తితో విప్రులకు అతిథ్యం ఇచ్చినా సేవచేసినా ముప్పది ముగ్గురు దేవతలను సేవించినట్లే అవుతుంది. **అంతకు ముందు దాతకు తెలిసినవాడు, అభ్యాగతుడు. తెలియనివాడు అతిథి అని చెపుతారు. బ్రాహ్మణుడు ఆ ఇద్దరిని పూజించాలి అని పౌరాణిక వచనం ఉంది.*** రాజేంద్రా! అతిథి పాదాలకు మూనెరాచి అన్న పానాలను అర్పించి గౌరవించే నరుడు నన్ను పూజించినట్లే సంతోషిస్తాను. ఇందులో సందేహం లేదు. నా అనుగ్రహాన్ని పొంది, త్వరగా పాపవిముక్తుడయి, చంద్రునితో సమానమయిన విమానంతో అతడు నాలోకానికి వెళ్తాడు. అలసిపోయిన అభ్యాగతుడు ఇంటికివస్తే ఆయనను సర్వదేవతలు పితృదేవతలు, అగ్నులు అనుసరించి వస్తారు. కాబట్టి ఆ బ్రాహ్మణుని పూజిస్తే వారందరూ పూజితులవుతారు. ఆయన నిరాశగా వెనుదిరిగితే పితృదేవలు నిరాశులై వెళ్తారు. అతిథి నిరాశతో దూత ఇంటినుంచి బయటకు వెళ్తే అతని పితృదేవతలు పదునైదు సంవత్సరాల కాలం అతడు ఇచ్చే భోజనం ఆరగించరు. దేశకాలాల నుసరించి ఇంటికి వచ్చిన విప్రుని బయటికి పంపేవాడు వెంటనే పతితు డవుతా డనటంలో సంశయం లేదు. దేశకాలాలనుసరించి చండాలుడయినా, అన్నంకోసం అతిథిగావస్తే, గృహస్థు ఎదురువెళ్లి తగురీతిగా సర్వదా పూజించాలి. అతిథిని సత్కరించనివాడు ఉన్ని బట్టలను ధరించటం, తనకోసం వంట చేసుకోవటం, అన్నం తినటం అనేవి అన్నీ ఎల్లప్పుడు వ్యర్థాలే అవుతాయి. అంగోపాంగాలనయిన వేదాలను ప్రతి దినం అధ్యయనం చేస్తున్న ద్విజుడు అతిథిని పూజించకపోతే అది అంతా వ్యర్థమే. పాకయజ్ఞాలతో పంచమహాయజ్ఞాలతో సోమయాగాదులతో యజించేవారు

---

* **అభ్యాగతో జ్ఞాతపూర్వ: హ్యజ్ఞాతోఽతిథిరుచ్యతే ।**
తయో: పూజాం ద్విజ: కుర్యాత్ ఇతి పౌరాణికీ శ్రుతి: ॥

ఇంటికి వచ్చిన అతిధిని పూజించక యశస్సును కాంక్షించి చేసే దానయజ్ఞాదులు అన్నీ, వ్యర్థం అవుతాయి. ఆశ మానవుని సమస్త సత్కర్మలను నాశనం చేస్తుంది. కాబట్టి మానవుడు శ్రద్ధాళువయి దేశకాలపాత్రలను, తన శక్తిని గమనించి కొద్దిగా నయినా సమంగానయినా,ఎక్కువగా నయినా అతిధి పూజలను చేయాలి. బుద్ధిమంతుడయిన వాడు ఇంటికి వచ్చిన అతిధికి ప్రసన్న చిత్తంతో, చిరునవ్వుతో స్వాగతం చెప్పి కూర్చోటానికి ఆసనం చూపించి అన్నపానాదులను ఇచ్చి పూజించాలి. తనకు ప్రేమపాత్రుడయినా, తన మేలుకోరేవాడయినా, ద్వేషించదగిన వాడయినా, పండితుడయినా, పామరుడయినా తను చేసే బలి వైశ్వ దేవాదులు అయిన తరువాత వచ్చిన అతిథి స్వర్గాన్ని చేర్చేవా డవుతాడు. యజ్ఞఫలాన్ని కోరేవాడు ఆకలిదప్పులతో శ్రమతో ఆర్తుడు, సరియైన దేశకాలాల్లో వచ్చిన అతిధిని సత్కరించి అన్నం పెట్టాలి. యజ్ఞంలో, శ్రాద్ధకర్మలో తనకన్నా శ్రేష్ఠులయిన వారిని యధావిధిగా భోజనం చేయించాలి. అన్నం మనుష్యులకు ప్రాణం అవుతుంది. అన్నం పెట్టేవాడు ప్రాణదాత అవుతాడు. కాబట్టి తనమేలు కోరుకొనేవాడు సమధికంగా అన్నదానం చేయాలి.

అన్నదానం చేసేవాడు సర్వభోగాలతో తృప్తుడయి, సర్వాభరణభూషితుడయి, ఉత్తమ స్త్రీల చేత సేవింపబడుతూ, పూర్ణచంద్రుని లాగా ప్రకాశించే విమానం ఎక్కి దేవలోకానికి వెళ్తాడు. దేవునివలే స్వర్గంలో కోటిసంవత్సరాలు విహరిస్తాడు. కాలానుసారం అక్కడినుంచి ఈ లోకానికి వస్తాడు. ఇక్కడ వేదశాస్త్రాల అర్థాన్ని తత్త్వాన్ని తెలుసుకొంటాడు. మహాకీర్తిమంతుడయిన బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. శ్రద్ధాపూర్వకంగా అతిధిసత్కారంచేసినవాడు మానవులలో జన్మిస్తాడు. మహాధనవంతుడు వేదవేదాంగాలు పూర్తిగా చదివినవాడు, సర్వ శాస్త్రార్థాల తత్వం తెలిసిన వాడు, సర్వభోగాలుగల బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. నరనాధా ! సత్యవాది, జితేంద్రియుడు, సమయ నియమం పెట్టుకోకుండా అతిధులందరిని శ్రద్ధాపూర్వకంగా సేవించేవాడు, ఆడితప్పనివాడు, కోపం జయించినవాడు. శాఖాధర్మ రహితుడు, అధర్మానికి భయపడేవాడు, ధర్మాత్ముడు, మాయామాత్సర్యాలు లేనివాడు, భోజనంలో భేదం పాటించనివాడు, నిత్య పవిత్రుడు, శ్రద్ధావంతుడు అయిన వ్యక్తి దివ్యవిమానంలో ఇంద్రలోకానికి వెళ్తాడు. అక్కడ అతడు దివ్యరూపం దాల్చి మహాకీర్తిమంతుడవుతాడు. అప్సరసలు ఆతని కీర్తి గానం చేస్తారు మన్వంతరకాలం అక్కడే దేవతలచేత పూజితుడయి విహరిస్తాడు. తరువాత మానవలోకానికి వచ్చి సర్వభోగాలుగల బ్రాహ్మణునిగా జన్మిస్తాడు."

భూదాన తిలదాన మాహాత్మ్యము, ఉత్తమ బ్రాహ్మణ మహిమ.

శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "పాండునందనా! ఇక మీద మహోత్తరమయిన భూదానాన్ని గురించి చెపుతాను. శ్రోత్రియుడు, దరిద్రుడు, నిత్యాగ్ని హోత్రి అయిన బ్రాహ్మణునికి రమణీయమయిన భూమిని దక్షిణతోకూడా ఇచ్చేవాడు అప్పుడే సర్వభోగాలతో సంతృప్తుడయి, సర్వరత్నాలంకారాలను ధరించి సర్వపాపాలు తొలగిపోగా సూర్యునిలాగా ప్రకాశిస్తుంటాడు మహాకీర్తి సంపన్నుడయిన అతడు బాలసూర్యునివలె ప్రకాశించేది, విచిత్రమయిన ధ్వజంతో శోభిల్లుతున్న దివ్యవిమానాన్ని ఎక్కి నాలోకానికి

వెళ్తాడు. భూదానం మించిన దానం ఇంకొకటిలేదు. భూమిని అపహరించటానికంటే మించిన పాపం ఇంకొకటి లేదు. కురువంశశ్రేష్ఠా! ఇతర దానాలు అన్నింటి పుణ్యఫలం సమయం వచ్చే నరికి క్షీణిస్తుంది. కాని భూదానం వల్ల కలిగిన పుణ్యం క్షీణించదు. రాజా! భూదానం చేసేవాడు బంగారం, మణులు, రత్నాలు, ధనం, సంపదలు మొదలయిన సమస్తదానాలు చేసినవా డవుతాడు. భూదానం చేసేవాడు సముద్రాలను, నదులను, పర్వతాలను, సమప్రదేశాలను, పల్లపు ప్రదేశాలను, సమస్త గంధాలను, రసాలను ఇచ్చినవా డవుతాడు. భూదాత నానావిధ పుష్పాలతో, ఫలాలతో, సంపన్నమయిన వృక్షాలను, కమలాలు, కలువల సమూహాలను దానం చేసినవా డవుతాడు. సమస్త దక్షిణలతో అగ్నిష్టోమాదులయిన యజ్ఞాలను చేసిన వారికి గూడా భూదానం చేస్తే కలిగేటంత ఫలం లభించదు. శ్రోత్రియునికి పంటతో నిండియున్న భూమిని దానం చేసేవాని పితృదేవతలు ప్రళయకాలపర్యంతం తృప్తు లవుతారు. రాజేంద్రా! బ్రాహ్మణునికి చేసిన భూదానం నాకు, శంకరునికి, సూర్యునికి ఇతర దేవతలకు సంప్రీతి కలిగిస్తుందని తెలుసుకో. యుధిష్ఠిరా ! భూదాన పుణ్యంవల్ల దాత పవిత్రుడయి నా సాలోక్యముక్తిని పొందుతాడు. ఈ విషయంలో ఆలోచించవలసిందిలేదు. బ్రతుకు తెరువు సరిగాలేక ఏ కొంచెం అయినా పాపం చేసిన పురుషుడు గోకర్ణమాత్రం భూమి దానం చేస్తే దానివల్ల శుద్ధుడవుతాడు. ఒక మాసం ఉపవాసం చేస్తే లేక ఒక కృచ్ఛచాంద్రయణవ్రతం చేస్తే కలిగే పుణ్యం గోకర్ణ మాత్రం భూమిని దానం చేస్తే కలుగుతుంది. సమస్త పుణ్యతీర్థాలలో స్నానంచేస్తే కలిగే పుణ్యం గోకర్ణమాత్ర భూదానం చేతనే కలుగుతుంది.

యుధిష్ఠిరుడు అడిగాడు. దేవదేవా! వాసుదేవా! గోకర్ణం ఎంత ప్రమాణం కొలత ఉంటుందో చెప్పవలసింది. శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. పాండుపుత్రా! గోకర్ణమాత్ర భూమి ప్రమాణం విను. తూర్పునించి పడమరకు దక్షిణం నుంచి ఉత్తరానికి ముప్పది ముప్పది దండాల కొలతగల భూమిని భూ ప్రమాణ తత్త్వం తెలిసినవారు గోకర్ణ ప్రమాణం గల భూమి అని చెపుతారు. (నాలుగు మూరల పొడవును ఒక దండం అంటారు) కురుశ్రేష్ఠా ! కట్టివేయకుండా ఎద్దులతో, దూడలతో, వంద ఆవులు స్వేచ్ఛగా ఉండే భూమి భాగాన్ని గూడా గోకర్ణం అని చెపుతారు. భూదానం చేసిన వాని సమీపానికి యమదూతలు పట్టుకోటానికి రారు. మృత్యుదండం, దారుణమయి కుంభీపాకనరకాలు, ఘోరమయిన వారుణపాశాలు భూదానం చేసిన వానికి కలుగవు. భూదాతకు రౌరవాదులయిన నరకాలు వైతరణినది, తీవ్రమయిన నరకబాధలు కష్టాలు కలుగవు. భూదానం చేసిన వానిని చిత్రగుప్తుడు, కలి, కాలుడు, కృతాంతుడు మృత్యుదేవత, సాక్షాత్తు భగవానుడు యముడు భూదాతను అదరిస్తారు. రాజా! భూదాతను రుద్రుడు, ప్రజాపతి ఇంద్రుడు దేవతలు, ఋషుల సమూహాలు సంతుష్టుడయిన నేను అర్చిస్తాము. బ్రతుకు తెరువులేక కుటుంబ సభ్యులు దుర్బలులు అయినవానికి ఆవులు, గుర్రాలు దుర్బలములు సన్ననివి అయినవానికి నిరంతరం అతిథిసత్కారం చేసేవానికి నర శ్రేష్ఠా! భూదానం చేయాలి. అదే పరలోకానికి ధనాగారం అవుతుంది. నరనాథా ! శ్రోత్రియుడు, ఆహితాగ్ని, వ్రతస్థుడు, దరిద్రుడు కుటుంబం కష్టాల్లో ఉన్న వ్యక్తికి భూదానం చేయాలి. దాది స్వయంగా పాలిచ్చి పుత్రుని పెంచినట్లు

దానంచేసిన భూమి దాతను అనుగ్రహిస్తుంది. ఆవు తన దూడకు తనపాలను ఇస్తూ పెంచినట్లు సర్వగుణాలతో కూడిన భూమి భూదాతకు మేలు చేస్తుంది. రాజా! నీటితో తడిసిన గింజలు మొలకెత్తినట్లు భూదాతకు ప్రతిదినము కోరికలు నెరవేరుతాయి. సూర్యతేజస్సు చీకటినంతను పారద్రోలినట్లు నరుని పాపాన్ని భూదానం పోగొడుతుంది. భూదానం చేస్తానని వాగ్దానం చేసిగాని, ఇచ్చిగాని వెనక్కు తీసుకొనేవారు వారుణ పాశబద్ధులయి చీమునెత్తురుల నరకంలో పడవేయబడతాడు. తాను ఇచ్చిన లేక ఇతరులు ఇచ్చిన భూమిని అపహరించేవారికి కలిగే నరకాన్నుంచి బయట పడటానికి ఎలాంటి ఉపాయం లేదు. ద్విజశ్రేష్ఠులకు దానం చేసిన భూమితో తాను బ్రతికే దుష్టాత్ముడయిన మూఢుడు ఇరువదియొక్క నరకాలలో పడతాడు. ఆ నరకాలనుంచి విముక్తుడయి కుక్కగా పుడతాడు. నాగలితో దున్ని గింజలు విత్తిన భూమినిగాని,పంటతో కళకళలాడుతున్న భూమినిగాని, జలసమృద్ధి గల భూమినిగాని దరిద్ర బ్రాహ్మణునికి దానం చేయాలి. రాజా! ఈ రీతిగా సంతోషపూర్ణమనస్సుతో దానం చేసినవాడు తలచుకున్న సర్వ కాంక్షలను పొందుతాడు. పూర్వం అనేక రాజులు భూదానం చేశారు. ఇప్పుడూ ఇస్తున్నారు. భూమి ఏకాలంలో ఎవరికి చెంది ఉంటేవానికి ఆకాలంలో ఆ భూదాన ఫలం లభిస్తుంది.

జీవిక దుర్భరమయి, గో సంపద తగ్గిన దరిద్రుడయిన బ్రాహ్మణునికి గోవును దానం చేసినవాడు సర్వపాపవిముక్తినంది కామరూపుడయి నిండు చందమామలాగా ప్రకాశించే విమానంలో తన ఇష్టానుసారం స్వర్గలోకంలో నివసిస్తాడు. స్వర్గనివాసకాలం సమాప్తమయిన తరువాత భూమి మీద జన్మించి మహాకీర్తిమంతుడు, శ్రీమంతుడు, సర్వజన పూజితుడు బలవంతుడయినరాజు అవుతాడు. దరిద్రుడయిన శ్రోత్రియ బ్రాహ్మణునికి తిల పర్వత దానంచేసే వానికి కలిగే ఫలితం చెపుతాను విను. పాండునందనా! పదివేల ఆంబోతులను చేస్తే కలిగేటంత పుణ్యం పొంది ఆదాత వెంటనే పాపరహితుడవుతాడు. సర్పం కుబుసం విడిచి స్వచ్ఛశరీరం పొందినట్లు నరుడు తిలదానంచెయ్యటం వలన పాపవిముక్తుడవుతాడు. నూవుల రాశిని దానం చేసేవారు సువర్ణ విభూషిత మయిన దివ్యవిమానాన్ని ఆరోహించి పితృలోకంలో సమ్మానితు డవుతాడు. మహాభుజా ! యుధిష్ఠిరా! నువ్వులు గోవులు, బంగారం, అన్నం, కన్యను, భూమిని బ్రాహ్మణులకు దానం చేస్తే ఈ లోకంనుంచి తరింపజేస్తాయి. రాజా! మంచి ప్రవర్తన గలవాడు, ఆహితాగ్ని, ఆచారహితుడు అయిన బ్రాహ్మణుని శాస్త్రానుసారం సంతోషపెట్టాలి. అది పరలోకంలో ఉపయోగపడుతుంది. ఆహితాగ్ని దరిద్రుడు, శ్రోత్రియుడు ఇంద్రియ విజేత, శూద్రాన్నం వదలిన బ్రాహ్మణుని ప్రయత్న పూర్వకంగా పూజించాలి.

నిత్యాగ్ని హోత్రి, దాన పాత్రుడు. అలాగే వేదవేత్త అయిన అగ్నిహోత్రి దానయోగ్యుడే. శూద్రాన్నం తిననివాడు యోగ్యులలో యోగ్యుడు. వేదమయపాత్రమయినవాడు. తపోమయమయిన పాత్రుడు, ఎక్కడా ఎవ్వరిభోజనం చేయనివాడు సత్పాత్రుడు. ఆ యోగ్యుడు తరింపజేస్తాడు నిత్యమూ వేదాధ్యయన తత్పరులు, ఇంద్రియాలు స్వాధీనమయినవారు, పంచమహాయజ్ఞపరులు అయిన వారిని నిత్యం పూజిస్తే వారు తరింపజేస్తారు. క్షమాశీలురు, జితేంద్రియులు వేదపూర్ణకర్ణులు, ఇంద్రియాలు వశమయినవారు, ప్రాణివధ చేయనివారు. తరింపజేయ సమర్థులు. నిత్యత్పరణ చేసేవాడు, నిత్యం

యజ్ఞోపవీతం దాల్చినవాడు, నిత్యం వేదాధ్యయనం చేసేవాడు. శూద్రాన్నం వదలినవాడు ఋతుకాలంలోను భార్యాగమనం చేసేవాడు, శాస్త్రానుసారం యజ్ఞం చేసిన బ్రాహ్మణుడు తరింపజేయ సమర్థుడు. నాభక్తుడు నాయందు ప్రేమగలవాడు, నేనే దిక్కుగా తలచినవాడు, సమస్తకర్మలను నాకు సమర్పించిన బ్రాహ్మణుడు తప్పక దాతను తరింపజేస్తాడు. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షర మంత్ర తత్త్వం తెలిసినవాడు, వాసుదేవాదిచతుర్వ్యూహాల తత్త్వం తెలిసినవాడు. ఎలాంటి దోషం లేక పంచ సమయోపాసనలు తెలిసిన బ్రాహ్మణుడు దాతను తరింపజేస్తాడు."

వివిధ దానముల మహిమ.

"మాధవా! ధర్మరూపమయిన ఈ అమృతాన్ని ఎంత విన్నా నాకు తృప్తిలేదు. దేవశ్రేష్ఠా! ఇంతవరకు నీవు చెప్పని ఇతరదానాలను, వాటి ఫలితాన్ని క్రమంగా చెప్పవలసింది." శ్రీకృష్ణ భగవానుడు అన్నాడు. "పాండునందనా! బ్రాహ్మణునిభక్తితో వస్త్రాలు పూలమాలలు, గంధాదులను ఇచ్చి విచిత్రమయిన అన్నంతో భోజనంపెట్టి పక్కతో శయ్యాదానంచేస్తే కలిగే పుణ్యఫలాన్ని విను. పాండుకుమారా! యథావిధిగా చేసిన గోదానం వల్ల కలిగే పుణ్యమంతపుణ్యం పొంది దాత పితృలోకంలో సమ్మానం పొందుతాడు. శయ్యాదానం చేసినవాడు వేయిమంది ఆహితాగ్నులను పూజిస్తే కలిగేటంతటి పుణ్యఫలాన్ని పొందుతాడు. శిల్పాన్ని, వేదవిద్యను మంత్రాన్ని, ఔషధులను బ్రాహ్మణునికి ఇచ్చేవానికి కలిగే పుణ్యఫలాన్ని విను. ఆయన వేదమంత్రబలంతో పయనించే సుందర విమానం ఎక్కి సప్తర్షుల లోకాలకు వెళ్తాడు. అక్కడ బ్రహ్మవాదులయిన మహర్షుల పూజలు అందుకుంటాడు. అక్కడ ముప్పది చతుర్యుగాల పర్యంతం దేవుని వలె విహరించి ఇక్కడ మనుష్యులలోకంలో వేదవేత్త అయిన విప్రుడుగా జన్మిస్తాడు. రాజా! ప్రయాణం చేయటంచేత త్రోవలో అలసిపోయిన దుర్బల బ్రాహ్మణునికి విశ్రాంతిని కల్పించే వాడు ఒక సంవత్సరం చేసిన పాపం నశిస్తుంది. తరువాత అతడు భక్తితో అయన పాదాలు కడిగితే పది సంవత్సరాలు చేసిన పాపం నిస్సందేహంగా తొలగుతుంది. అలాగే అతడు నేతితోగాని నూనెతోగాని ఆ బ్రాహ్మణుని పాదాలు రుద్ది గౌరవిస్తే పన్నెండు సంవత్సరాలు చేసిన పాపం త్వరగా తొలగుతుంది. రాజా! ఇంటికి వచ్చిన విప్రుని స్వాగతవచనాలతో ఆసనం ఇచ్చిగాని ఎదురువెళ్ళిగాని పూజించేవాడు. దేవతలకు ఇష్టుడవుతాడు. రాజా! బ్రాహ్మణునికి స్వాగతం చెప్పటంచేత అగ్నులు, ఆసనదానం చేత ఇంద్రుడు, లేచి ఎదురువెళ్ళటంచేత అతడి అతిథి ప్రియులయిన పితృదేవతలు సంతోషిస్తారు. నరనాథా ! అగ్ని ఇంద్రుడు పితృదేవతలు ప్రీతులు కావటంచేత అతడు ఒక సంవత్సరం చేసిన పాపం పోతుంది. విప్రునికి పూలమాలలతో అలంకృతమయిన ఆసనం ఇచ్చేవాడు మణులతో చిత్రితమయిన రథం ఎక్కి ఇంద్రభవనానికి వెళ్తాడు అక్కడ ఇంద్రుని ఆసనంమీద దివ్యస్త్రీలతో విరాజిల్లుతాడు. అరువదివేల ఏండ్లు అప్సరసలతో విహరిస్తాడు. యుధిష్ఠిరా! బ్రాహ్మణునికి వాహన దానం చేసేవాడు రత్నాలతో చిత్రమయిన వాహనం ఎక్కి దేవలోకానికి వెళ్తాడు. రాజా! అతడు అక్కడ అప్సరసలచే సేవితుడవుతూ ఇష్టానుసారం క్రీడించి ఈలోకంలో రాజు అవుతాడు. ఇందులో ఆలోచించవలసింది లేదు.

ఆకులు, పూలతో నిండి, పండ్లు పండినచెట్టును వస్త్రాలతో, ఆభరణలతో, అలంకరించి, గందంతో, పూలమాలలో పూజించి, శ్రోత్రియుడయిన బ్రాహ్మణునికి భోజనం పెట్టి దక్షిణతోపాటు దానంచేసేవానికి కలిగే పుణ్యఫలం చెపుతాను. విను. బంగారంతో విచిత్రరీతిగా అలంకృతమయి విరాజిల్లే విమానం ఎక్కి, అతడు దేవతల జయజయధ్వానాలు చేస్తుండగా స్వర్గానికి వెళ్తాడు. రమణీయమయిన ఇంద్రపురంలో కల్పవృక్షం అతడు మనస్సులో కోరుకున్నది ఇస్తుంది ఆ కల్ప వృక్షానికి ఎన్ని ఆకులు, పూలు పండ్లు ఉన్నవో అన్ని వేల సంవత్సరాలు అతడు ఇంద్రలోకంలో మహిమను పొందుతాడు. తరువాత స్వర్గాన్నుంచి దిగి మానవలోకానికి వచ్చి రధాలు ఏనుగులు, గుర్రాలతో నిండిన పట్టణాలు గల రాజ్యాన్ని రక్షిస్తాడు. రాజా! నాయందు గల భక్తితో నాకు ఆలయం నిర్మించి, అందులో నాప్రతిమను ప్రతిష్ఠించి, యధావిధిగా నాపూజ చేయించినా, లేక స్వయంగా భక్తితో పూజించినా అతనికి కలిగే పుణ్యఫలాన్ని విను. అతడు వేయి అశ్వమేధయాగాలు చేస్తే కలిగే పుణ్యఫలాన్ని పొందుతాడు. యుధిష్ఠిరా! నాలోకాన్నుంచి అతడు ఎప్పుడు బయటకి వస్తాడో నాకే తెలియదు.

దేవాలయంలోగాని, బ్రాహ్మణ గృహంలోగాని, గోశాలలోగాని నాలుగు వీధులు కలిసేచోటగాని దీపం వెలిగించే వానికి కలిగే పుణ్యఫలాన్ని విను. అతడు బంగరు వాహనం ఎక్కి, సర్వదిక్కులను వెలిగింపజేస్తూ, దేవ శ్రేష్ఠుల సేవలు అందుకొంటూ సూర్యలోకానికి వెళ్తాడు. మహాతపస్వి అయిన అతడు అక్కడ కోటి సంవత్సరాలు ఇష్టం వచ్చినట్లు క్రీడించి, ఈలోకంలో విప్రునిగా జన్మించి వేద వేదాంగపారగు డవుతాడు. బ్రాహ్మణునికి కమండలాన్నిగాని, గ్లాసుగాని, జలపాత్రనుగాని దానం చేసేవాడికి కలిగే పుణ్యఫలం విను. నరనాధా ! పంచగవ్యం త్రాగేవానికి కలిగే ఫలం నీటితో బిందెను దానం చేసే వానికి కలుగుతుంది. అతడు ఎల్లప్పుడు తృప్తిగా ఉంటాడు. అతనికి సుగంధపూరిత పదార్థాలు లభిస్తాయి. అతనికి మనస్సు, ఇంద్రియాలు సంతుష్టాలుగా ఉంటాయి. అతడు హంసలతో చక్రవాక పక్షులతో కూడి ప్రకాశిస్తున్న విమానంలో దివ్యులయిన గంధర్వులు సేవించే వరుణ లోకానికి వెళ్తాడు. జీవులకు పరమ జీవనమయిన పానీయాన్ని గ్రీష్మకాలంలోని మూడుమాసాలు దానం చేసేవానికి కలిగే పుణ్యఫలాన్ని విను. అతడు పూర్ణ చంద్రునివలె విరాజిల్లే విమానం మీద, అప్సరసల సేవలు పొందుతూ ఇంద్రలోకానికి వెళ్తాడు. తలంటుకు కాలసిన నూనెను దానం చేయటం చేత మానవుడు తేజోవంతుడు, చూడదగినవాడు, సుందరుడు, శూరుడు, పండితుడయిన బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. వస్త్రదానంచేసినవాడు, తేజోవంతుడు, ప్రియదర్శకుడు సుందరుడు, శ్రీమంతుడు ఎల్లప్పుడు స్త్రీలకు మనోరముడు అవుతాడు.

పాదరక్షలు, గొడుగును దానం చేసే నరశ్రేష్ఠుడు మహాతేజస్వియై సువర్ణంతో ప్రకాశించే శ్రేష్ఠమయిన రధాన్ని ఎక్కి, అప్సరస్సమూహంచేత సేవింపబడుతూ ఇంద్రలోకానికి వెళ్తాడు. పావుకోళ్ళను దానంచేసే వారు వృక్షాలతో నిర్మితమయిన విమానాలు నెక్కి దేవశ్రేష్ఠులసేవల నందుకొంటూ రమ్యమయిన యమలోకానికి వెళ్తారు. పలుదోమపుల్లను దానం చేసే మానవుడు మధురంగా మాట్లాడతాడు.

అతని నోరు సువాసనగా ఉంటుంది. అతడు శ్రీమంతుడు, మేధావి సౌభాగ్య సంపన్నుడు అవుతాడు. అతిథులు, కుటుంబసభ్యులు భోజనం చేసిన తరువాత భోజనం చేసేవాడు, నిత్యవ్రతనిష్ఠుడు సత్యభాషి క్రోధరహితుడు, స్నానాలతో పవిత్రుడయిన మానవుడు దివ్య విమానాన్ని ఆరోహించి స్వర్గానికి వెళ్తాడు. బ్రహ్మచారి, కోపవిజేత, సత్యం, పవిత్రతలు కలవాడు, ఒకసంవత్సరం రోజూ ఒకేమారు భోజనం చేసే వ్రతాన్ని అనుష్ఠించే మానవుడు మరణానంతరం దివ్య విమానం మీద ఇంద్రలోకానికి వెళ్తాడు. ఒక సంవత్సర పర్యంతం రెండు రోజులకు ఒకమారు భోజనం చేస్తూ బ్రహ్మచారి, ఇంద్రియ విజేత అయిఉంటే వాడికి కలిగే పుణ్యఫలం వినుు. విచిత్రమయిన ఈకలు కల నెమలి, విచిత్రమయిన జెండాతో విరాజిల్లే దివ్యయానాన్ని ఎక్కి స్వర్గానికి వెళ్తాడు.

రాజా! పవిత్రుడు, మత్పరాయణుడు అయిన వాడు నా శ్రీ విగ్రహం మీద మనస్సు పెట్టి నన్ను ధ్యానించేవాడు, విశేషించి చతుర్దశినాడు రుద్రుని యందు లేక దక్షిణామూర్తి దేవుని యందు ఏకాగ్రచిత్తుడయ్యేవాడు సిద్ధులు బ్రహ్మర్షులు, దేవతాసమూహాలచేత, పూజింపబడుతూ గంధర్వుల, భూతాలగానాలు వింటూ మహాతేజోవంతుడయి నన్నుగాని శంకరునిగాని ప్రవేశిస్తాడు. అతనికి మళ్లీ జన్మ కలుగదు. ఇది నిస్సంశయం. రాజేంద్రా! గోవులకోసంగాని, స్త్రీలకోసంగాని, గురువులకోసంగాని, బ్రాహ్మణుల కోసంగాని ప్రాణత్యాగం చేసేవారు స్వర్గానికి వెళ్తారు. అక్కడ సువర్ణమయ కామగమనంగల విమానంలో ఒక మన్వంతర కాలం దేవతాస్త్రీలచేత సేవింపబడుతూ ఆనందిస్తుంటారు. 'ఇస్తాను' అని చెప్పిన వస్తువును దానం చేయకపోవటంచేత, ఇచ్చిన దాన్ని తిరిగి తీసుకొనటంచేత జన్మించిన నాటినుండి చేసిన దానాల ఫలితం అంతా నశిస్తుంది. శాశ్వత సుఖాన్ని కోరేవారు తాను న్యాయంగా సంపాదించినది తనకు బాగా ఇష్టమయిన ద్రవ్యాన్ని గుణవంతుడయిన బ్రాహ్మణునికి దానం చేయాలి."

పంచమహాయజ్ఞాలు, విధి సహిత స్నానము, తదంగకర్మలు, భగత్ప్రియ పుష్పములు, భగవద్భక్త లక్షణము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! ఈ లోకంలో బ్రాహ్మణులు పంచమహాయజ్ఞాలను ఏ విధానంతో చేస్తారు ? దేవాధిపా ! వాటి నామాదులను సంపూర్ణంగా చెప్పవలసింది." శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "యుధిష్ఠిరా! పంచమహాయజ్ఞాలను గూర్చి చెపుతాను వినుు. వాటిని ఆచరించటంవల్ల గృహస్థు బ్రహ్మసాలోక్యాన్ని చెందుతాడు. పాండుకుమారా! ఋభు యజ్ఞం, బ్రహ్మయజ్ఞం, భూత యజ్ఞం, నృయజ్ఞం, పితృయజ్ఞం అని పంచ మహాయజ్ఞాలపేర్లు చెపుతారు. ఋభుయజ్ఞం తర్పణం. స్వాధ్యాయం బ్రహ్మయజ్ఞం. సమస్త ప్రాణులకు అన్నం బలిగా ఇవ్వడం భూతయజ్ఞం. అతిథులను పూజించటం నృయజ్ఞం. పితరులను ఉద్దేశించి చేసే శ్రాద్ధాదులు పితృయజ్ఞం అని చెపుతారు. హుతం, అహుతం, ప్రహుతం, ప్రాశితం, బలిదానం అనే అయిదు పాకయజ్ఞాలు అని చెపుతారు. వైశ్వదేవం మొదలయిన కర్మలలో దేవతలకొరకు చేసే హోమాన్ని పండితులు హుతం అని చెపుతారు.

దానం ఇచ్చిన వస్తువును అహుతం అంటారు. బ్రాహ్మణ భోజనం ప్రహుతం అంటారు. రాజేంద్రా! ప్రాణాగ్నిహోత్రవిధితో ప్రాణాలకు అర్పించిన అయిదు గ్రాసాలను ప్రాశితం అంటారు. గోవు మొదలయిన వాటి తృప్తికి ఇచ్చే ఆహారాన్ని బలిదానం అంటారు. ఈ అయిదు కర్మలను పాక యజ్ఞాలు అంటారు. కొంతమంది విద్వాంసులు పాక యజ్ఞాలను పంచమహాయజ్ఞాలు అని వ్యవహరిస్తారు. మహాయజ్ఞ స్వరూపం తెలిసినవారు బ్రహ్మ యజ్ఞాదులను పంచ మహాయజ్ఞాలు అని చెపుతారు. వీటిని అన్నిటికి మహాయజ్ఞాలు అని చెప్పారు. ఆకలిగొని ఇంటికి వచ్చిన బ్రాహ్మణులను యథాశక్తిగా గౌరవించాలి. నిరాశగా పంపరాదు. కావున విద్వాంసుడయిన ద్విజుడు ప్రతి దినం స్నానం చేసి ఈ యజ్ఞాలను చెయ్యాలి. ఇవి చేయకుండా భుజించే ద్విజుడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి."

యుధిష్ఠిరుడు అడిగాడు. "జనార్దనా! నీభక్తుడయిన నాకు స్నాన విధానం చెప్పవలసింది." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "పాండుసుతా! ద్విజులు సమస్త పాపాలనుంచి విముక్తులయ్యేది పవిత్రమయినది పాపనాశకమయిన స్నాన విధానం చెపుతా విను. మట్టిని, గోమయాన్ని, పువ్వులను, దర్భలను, పూలను తగిన రీతిగా తీసుకొని జలం వద్దకు వెళ్ళాలి. ద్విజశ్రేష్ఠుడు నదిలో స్నానం చేసి మళ్లీ వేరేచోట స్నానంచేయరాదు. సమృద్ధిగా నీరు గల జలాశయం ఉంటే దానిలో కాకుండా కొద్దినీరు ఉన్నదాంట్లో ఎప్పుడూ స్నానం చేయరాదు. జలసమీపానికి వెళ్లి అక్కడ బ్రాహ్మణుడు చక్కని పవిత్ర ప్రదేశంలో మట్టిని, ఆవుపేడను ఉంచాలి. తరువాత ఆ జలాశయానికి ఇవతల ప్రయత్న పూర్వకంగా కాళ్ళు కడుగుకొని రెండుసార్లు ఆచమనం చేసి ఆ జలాశయానికి ప్రదక్షిణం చేసి నమస్కరించాలి. పాండునందనా! జలం సర్వదేవతామయం. నాస్వరూపం అయినది. కాబట్టి ఆ నీటిని కొట్టగూడదు. ఆ జలాశయంలోని నీటితో దాని సమీప ప్రదేశాన్ని ఆలికి శుద్ధిచేయాలి. బుద్ధిమంతుడయిన వాడు నీటిలోకి వెళ్లి ఒక్కమారు మాత్రమే ఒకమునుక వేయాలి. ఒళ్లుతోముకోరాదు. తరువాత మళ్ళీ ఆచమనం చేయాలి. అరచేతిని ఆవు చెవిలాగా ముడిచి మూడుమారులు నీరు త్రాగాలి. తరువాత తన కాళ్ళమీద జలం చల్లుకొని రెండుసార్లు నీటితో నోరు తుడుచుకోవాలి. తరువాత మెడపైన గల కన్నులు, ముక్కు, చెవులను ఇంద్రియాలను ఒకమారు నీటితో స్పృశించాలి. తరువాత బుజాలను, హృదయాన్ని నాభిని స్పశించాలి. ప్రతి అవయవాన్ని జలంతో స్పశించి మళ్లీ నీటితో శిరస్సును స్పశించాలి. తరువాత **ఆపఃపునంతు** అనే మంత్రంతో మళ్లీ ఆచమనం చేయాలి. లేక ఆచమన సమయంలో ఓంకారంతో భూః మొదలయిన వ్యాహృతులతో **'పదనస్పతిం'** అనే ఋక్కును పలకాలి. ఆచమనం తరువాత మట్టిని తీసుకొని, మూడుభాగాలు చేసి **"ఇదం విష్ణుః"** అనే మంత్రం చెప్పి, దాన్ని క్రమంగా శరీరంలో పైన మధ్యలో క్రింది అవయవాలమీద పూసుకోవాలి. తరువాత వరుణ సూక్తాలతో జలానికి నమస్కరించాలి.

నది అయితే ప్రవాహానికి అభిముఖంగాను, ఇతర జలాశయాల్లో అయితే సూర్యుని ఎదురుగాను ఉండి స్నానం చేయాలి. ఓంకారం పలుకుతూ మెల్లగా మునుక వేయాలి. నీరు కల్లోలం చేయరాదు. తరువాత గోమయాన్ని చేత్తో తీసుకొని, దాన్ని మూడు భాగాలుగా చేసి, నీటితో తడిపి,

దాంతో వెనుకటివలె నే శరీరంలో పైన మధ్య క్రింద గల అంగాలకు పూసుకోవాలి. అప్పుడు ప్రణవం, వ్యాహృతులతో గాయత్రీమంత్రం పఠించాలి. తరువాత నాయందు చిత్తం నిలిపి, మళ్లీ ఆచమనం చేసి, **ఆపోహిష్ఠామయో** మొదలయిన నాలుగు ఋక్కులతో, గోసూక్తం, అశ్వసూక్తం, వైష్ణవ సూక్తం, వారుణ సూక్తం, సావిత్ర సూక్తం, ఇంద్ర సూక్తం, వామదైవ్య సూక్తం, నాకు సంబంధించిన ఇతర సోమ మంత్రాలను ఉచ్చరిస్తూ శుద్ధ జలం తనమీద చల్లుకోవాలి. తరువాత నీటిలోనించి బయటకు వచ్చి అఘమర్షణ సూక్తం జపించాలి లేకపోతే వ్యాహృతులతో గూడా గాయత్రీ మంత్రం జపించాలి. లేకపోతే గాలి బిగబట్ట గలిగినంత సేపు నన్ను స్మరిస్తూ ప్రణవ జపంచేయాలి. స్నానం తరువాత జలాశయం నుంచి బయటకు వచ్చి ఉతికిన శుభ్రమయిన ధోవతిని ఉత్తరీయాన్ని ధరించాలి. ఉత్తరీయాన్ని చంకలోనుంచి త్రాడులాగా వేసుకోరాదు. అలా చంకలో ఉత్తరీయం కట్టుకొని చేసిన వైదిక కర్మను సంతోషంతో రాక్షసులు, దైత్యులు దానవులు, ధ్వంసం చేస్తారు. కాబట్టి ప్రయత్న పూర్వకంగా కక్ష్యాపాశాన్ని ధరించరాదు బ్రాహ్మణుడు వస్త్రం ధరించిన తరువాత మెల్లగా కాళ్ళను, చేతులను మట్టితో తోముకొని కడుగుకోవాలి. తరువాత గాయత్రీమంత్రం పఠించి ఆచమనం చేయాలి.

తూర్పుముఖంగా గాని, ఉత్తర ముఖంగాగాని ఏకాగ్రచిత్తుడయి వేదాధ్యయనం చేయాలి. నీటిలో నిలిచి ఉన్న ద్విజుడు జలంతోనే ఆచమనం చేసి శుద్ధుడవుతాడు. నేలమీద ఉన్న వాడు అక్కడే ఆచమించి శుద్ధుడవుతాడు కాబట్టి జంలలోగాని స్థలంలోగాని ఉన్న ద్విజుడు ఆత్మశుద్ధి కోసం ఆచమనం చేయాలి. తరువాత నా మీద మనస్సు నిలిపి దర్భలమీద తూర్పుముఖంగా కూర్చొని దర్భలు దాల్చి ఏకాగ్రతతో ప్రాణాయామాన్ని చేయాలి. అంతట **ఏకాగ్రచిత్తంతో** సహస్ర గాయత్రీ జపంగాని, అష్టోత్తరశతంగాని జపం చేయాలి. తరువాత మందేహులు అనే రాక్షసుల వినాశంకోసం గాయత్రీ మంత్రంతో అభిమంత్రితమయిన జలం తీసుకొని సూర్యునికి అర్ఘ్య ప్రదానం చేయాలి. తరువాత ఆచమనం చేసిన **ఉద్వర్గోసి** అనే మంత్రంతో ప్రాయశ్చిత్తం కోసం జలం వదలాలి. పిమ్మట ద్విజుడు పూలు నీరు దోసిలితో తీసుకొని సూర్యునికి అర్ఘ్య మివ్వాలి. అకాశముద్రను పట్టాలి తరువాత సూర్యుని ఏకాక్షర మంత్రాన్ని పన్నెండుమారులు జపించాలి. సూర్యుని షడక్షరాది మంత్రాలను అరుసార్లు ఆవృత్తి చెయ్యాలి ఆకాశముద్రను దక్షిణం వైపు తిప్పి తనముఖంలో విలీనం చేయాలి దీని తరువాత చేతులు పైకెత్తి ఏకాగ్రచిత్తంతో సూర్యుని దర్శిస్తూ ఆయన మండలంలో నన్ను చతుర్భుజ తేజోమూర్తి అయిన నారాయణుని ధ్యానించాలి. **"ఉదుత్యం" "చిత్రందేవానాం" "తచ్చక్షు"** అనే మంత్రాలను, యధాశక్తిగా గాయత్రీ మంత్రాన్ని, నాకు సంబంధించిన సూక్తాలను జపించి నా నామమంత్రాలను పురుష సూక్తాన్ని పారాయణం చేయాలి ఆ తరువాత **హంసః శుచిషితత్** అనే మంత్రాన్ని చెప్పి సూర్యుని వైపు చూడాలి. ప్రదక్షిణపూర్వకంగా ఆయనకు నమస్కారం చేయాలి.

అంతట జలంతో నన్ను, బ్రహ్మను, శంకరుని, ప్రజాపతిని, దేవతలను దేవర్షులను,

అంగాలతో కూడా వేదాలను ఇతిహాసాలను, యజ్ఞాలను, పురాణాలను అన్నింటిని అప్సరసల సమూహాలను, ఋతువులను కళాకాష్ఠారూప సంవత్సరాలను, భూత సముదాయాన్ని, భూతాలను, సరిత్తులను, సాగరాలను, పర్వతాలను, వాటి నైన ఉండే దేవతలను, ఓషధులను, వనస్పతులను జలంతో తర్పితాలను చేయాలి. తర్పణ సమయంలో జందెమును మెడలో వేలాడునట్టు (నివీతంగా) ఉండి దోసిలితో జలాన్ని విడుస్తూ పై చెప్పిన ప్రతి ఒక దేవత పేరు చెపుతూ తృప్యతాం అని అంటూ జలం వదలాలి (ఇద్దరు దేవతలకు ఇచ్చేటపుడు "తృప్యేతాం" అని అంతకంటే ఎక్కువమందికి తర్పణం చేసేటప్పుడు "తృప్యంతాం" అని చెప్పాలి) విద్వాంసుడు, మంత్రద్రష్టలయిన మరీచ్యాదిఋషులను, నారదాది ఋషులను, నివీతిగా ఏకాగ్ర చిత్తంతో తర్పణం చేయాలి. తరువాత ప్రాచీనా వీతి అయి అంటే జందెం కుడి భుజం మీద ఉండేటట్లుగా ముందు చెప్పబోయే దేవతలకు పితృదేవతలకు తర్పణాలు చేయాలి. కవ్యవాట్టు, అగ్ని, సోముడు, వైవస్వతుడు, అర్యముడు, అగ్నిష్వాత్తులు, సోమపులు అనేవారు పితృసంబంధిదేవతలు. వీరికి తిలలతో జలాన్ని దర్భల మీద తర్పణం చేయాలి. అప్పుడు తృప్యంతాం అని అనాలి. తరువాత పితృతర్పణం మొదలు పెట్టాలి. వారిక్రమం ఇది. పిత, పితామహుడు, ప్రపితామహుడు, మాత, పితామహి, ప్రపితామహి, వీరేకాక గురువు, ఆచార్యుడు, మేనత్త, మాతామహి, ఉపాధ్యాయుడు, మిత్రుడు, బంధువులు విష్ణుడు ఋత్విక్కు , జ్ఞాతి సోదరుడు, మున్నగువారిలో మరణించిన వారిపై ఈర్ష్యాద్వేషాలను వదలి, దయగలిగి, కారుణ్యతర్పణ తర్పణం చేయాలి తర్పణం చేసిన తరువాత ఆచమనం చేసి స్నానసమయంలో ధరించిన వస్త్రాన్ని పిండాలి. ఆవస్త్రజలం కూడా కులంలో మరణించిన సంతానహీనుల భాగం అవుతుంది. అది వారికి స్నానానికి, త్రాగటానికి ఉపయోగపడుతుంది. కాబట్టి ఆ జలంతో వారికి తర్పణం చేయాలి. అని విద్వాంసులు అంటారు. వెనక చెప్పిన దేవతలకు పితరులకు తర్పణ చేయకుండా స్నానం చేసిన వస్త్రాన్ని ఉతకరాదు. అజ్ఞానం వల్ల తర్పణానికి ముందే వస్త్రాన్ని ఉతికేవాడు దేవతలకు ఋషులకు బాధకు డవుతాడు. తర్పణంచేసి, తరువాత ఆచమనం చేసి స్నానం చేసిన వస్త్రాన్నిపిండాలి ఆలాచేయకపోతే పితృదేవతలు నిరాశులయి తర్పణం చేసేవారిని శపించి వచ్చిన ద్రోవనే వెళ్తారు.

మట్టితో పాదాలు తోముకొని, కడుగుకొని, మళ్ళీ ఆచమనంచేసి, పవిత్రుడయి, దర్భల ఆసనం మీద కూర్చుని, దర్భలుచేతదాల్చి స్వాధ్యాయం మొదలుపెట్టాలి మొదట వేదాన్ని వరించి తరువాత ఆ వేదాంగాలను అధ్యయనం చెయ్యాలి. తనశక్తి ననుసరించి ప్రతిదినం చేసే అధ్యయనాన్ని స్వాధ్యాయం అంటారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదాన్ని అధ్యయనం చేయాలి. తరువాత యధాశక్తిగా ఇతిహాస పురాణాలను విడవకుండా చేయవలెను స్వాధ్యాయం అయిన తరువాత లేచి నిలచి దిక్కులకు, దిగ్దేవతలకు, బ్రహ్మకు, అగ్నికి, భూమికి, ఓషధులకు, వాగ్దేవతకు, వాచస్పతికి, నాకు, సరిత్తులకు నమస్కరించాలి. తరువాత ప్రణవంతో గూడా "నమోఽద్భ్యః" అనే మంత్రాన్ని పరించి వెనుకటి వలెనే జలదేవతకు నమస్కారం చేయాలి. దీని తరువాత ఋణిమ్నార్య ఆదిత్యాది నామాలను ఉచ్చరించి తన శిరస్సుమీదరెండు చేతులను జోడించి సూర్యునికి నమస్కరించాలి. ప్రణవజపం చేస్తూ ఏకాగ్రచిత్తంతో ఆయనను దర్శించాలి. తరువాత నాకు ఇష్టమయిన పూలతో

నన్ను ప్రతిదినం అర్చించాలి."

యుధిష్ఠిరుడు అడిగాడు. "మాధవా! అచ్యుతా! నీకు చాలా ఇష్టమయినవి, నీ నివాసమయిన పూలను నీ భక్తుడనయిన నాకు వివరించవలసింది." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! నాకు ఇష్టమయిన పుష్పాల పేర్లు చెపుతాను. సావధానంగా విను, రాజేంద్రా! కుముదం, కరవీరం, చణకం, సంపెంగ, మల్లె, జాజి, నంద్యావర్తం, నందికం, పలాశపుష్పాలు, పత్రాలు, గరిక , భృంగకం, వనమాల అనే పూలు నాకు చాలా ఇష్టమయినవి. రాజా! అన్ని పూవులకంటె వేయిరెట్లు ఉత్తమమయినది కలువ పువ్వు. దానికంటే ఉత్తమం పద్మం. దానికంటే గొప్పది శతదలం, దానికంటే గొప్పది సహస్ర పత్రం, అంతకంటే ఉత్తమం పుండరీకం. వేయి పుండరీకాలకంటే ఉత్తమమయినది తులసీదళం. పాండవా ! తులసి దళానికన్నా అధికమయినది వకపుష్పం. దానికన్న ఉత్తమం సౌవర్ణం. దాని కన్న ఇష్టమైనది లేదు. పూలు లేకపోతే తులసీ దళాలతో నన్ను అర్చించాలి. తులసిదళాలు లేకపోతే దాని కొమ్మలు, అవి దొరక్కపోతే తులసిచెట్టు ముక్కలు. అవీ లభించకపోతే తులసి చెట్టు ఉన్న చోటి మట్టితో నా భక్తుడు నన్ను పూజించవచ్చు రాజా నా అర్చనలో పనికి రాని పువ్వులను చెపుతాను. సావధానంగా విను. కింకిణి,మునిపుష్పం, ధుర్ధూరం, పాటలం అతిముక్తకం, పున్నాగం, నక్తమాలికం, యూథికం, క్షీరికా పుష్పం, నిర్గుండి, లాంగలి, జవ, కర్ణికారం, అశోకం శాల్మలీపుష్పం, కుకుభం, కోవిదారం, వైభీతకం, కురంటకపుష్పం, కల్పకం కాలకం, అంకోలం, గిరి కర్ణిక, నీలంరంగు గల పూలు, ఒకే రేకు గల పూలు, అనే వాటిని అన్నింటిని వదలి వేయాలి. జిల్లేడు పూలు, జిల్లేడు ఆకుల్లో పెట్టిన పూలు, వేపపూలు గూడా నా అర్చనకు పనికిరావు నరనాధా! నిషిద్ధం కాని పూల కన్నా ఇతరమయిన తెల్లని రేకులుగలవి, సువాసనగల పూలు లభించిన వాటితో నాభక్తుడు నన్ను అర్చించాలి."

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! నిన్ను ఏ విధానంతో పూజించాలి ? నీ శ్రీమూర్తులు ఎలా ఉంటాయి ? ఈ విషయం వైఖానసులు ఏమంటారు ? పాంచరాత్రులు ఏమని చెపుతారు ?" శ్రీ కృష్ణ భగవానుడు చెప్పాడు. "పాండునందనా! నా అర్చనా క్రమం అంతా చెపుతాను విను, వేదిక మీద కర్ణికలు గల అష్టదల కమలాలను వేయాలి. దానిమీద అష్టాక్షరం, లేక ద్వాదశాక్షర మంత్రంతో వైదిక మంత్రాలతో, పురుష సూక్తంతో, నా సూక్తాలతో నాశ్రీ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి. తరువాత బుద్ధిమంతుడయినవాడు సత్యస్వరూపుని, చ్యుతికాని నన్ను పూజించాలి. నృపశ్రేష్ఠా! మహారాజా! వైఖానస పండితులయినవారు నన్ను అనిరుద్ధుడు అంటారు. వారికంటే భిన్నులయిన పాంచరాత్రులు నన్ను వాసుదేవుడు, సంకర్షణుడు ప్రద్యుమ్నుడు. అనిరుద్ధుడు అనే చతుర్వ్యూహస్వరూపునిగా చెపుతారు. రాజేంద్రా! ఇవేకాక నామభేదంతో నాశ్రీమూర్తులు ఇతరమయినవి ఉన్నాయి. వాటి అన్నింటికి అర్థం ఒకటే అని తెలుసుకోవాలి. ఈవిధంగా బుద్ధిమంతుడు నన్ను అర్చించాలి." యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! నీ భక్తులు ఎలా ఉంటారు ? వారి నియమాలు ఏవి ?చ్యుతి లేని దేవాధిపా! నీ భక్తుడినయిన నాకు ఇది అంతా చెప్పవలసింది." శ్రీ కృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! ఇతర దేవతలకు ఎవరికి భక్తులుకాక కేవలం నన్నే శరణుపొందినవారు, భక్తులను ప్రేమించేవారు మాత్రమే భక్తులు అని చెప్పవచ్చు. పాండవశ్రేష్ఠా! స్వర్గాన్ని కీర్తిని ఇచ్చేవి. నాకు ప్రియమయిన వ్రతాలనే నా భక్తులు అనుష్ఠిస్తారు.

నాభక్తుడు నీటిని దాటేటప్పుడు ఒక వస్త్రాన్నే తప్ప ఇంకొకదాన్ని ధరించరాదు. ఆరోగ్యవంతుడయి ఉండి పగలు నిదురపోరాదు. మద్య మాంసాలను వదిలివేయాలి. బ్రాహ్మణులకు, గోవుకు, రావిచెట్టుకు అగ్నికి ప్రదక్షిణంగా వెళ్ళాలి. వాన వడేటప్పుడు పరిగెత్తరాదు. మొదట లభించే భిక్షను తృణించరాదు. ఉప్పు ఒక్కటే తినరాదు సౌభాంజనం, రంజనం అనే వాటిని తినరాదు. ఆవుకు పిడికెడు ఆహారం ప్రతిదినం ఇవ్వాలి. అన్నంలో పులుపు కలిపి తినరాదు. ఇతరుల ఇంటినుంచి తెచ్చింది, పాసిపోయినది, భగవంతునికి నివేదించని పదార్థాన్ని ప్రయత్నపూర్వకంగా వదిలివేయాలి. తాండ్ర, కానుగు చెట్ల నీడను దూరంగా వదలాలి. తనకు బాధకలిగించినా బ్రాహ్మణులను, దేవతలను నిందించరాదు.

సూర్యోదయం తరువాత క్రియాశీలి కానివాడు, బుద్ధిమంతుడు నాలుగు వేదాలు అధ్యయనం చేసిన బ్రాహ్మణుని దేహంలో నయినా ఆరుగురు వృషలులు ఉంటారని చెపుతారు. పాండవశ్రేష్ఠా ! క్షత్రియుని శరీరంలో ఏడుగురు వృషలులు అని తెలుసుకోవాలి. వైశ్యునిలో ఎనిమిది మంది వృషలులు అని చెప్పారు. శూద్రుని శరీరంలో ఇరువది యొక్క మంది వృషలులు ఉంటారని అంటారు. కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాహామోహం అనే ఆరుగురు వృషలులు బ్రాహ్మణుని శరీరంలో ఉన్నారని చెప్పారు. గర్వం, జడత్వం, అహంకారం, ఈర్ష్య ద్రోహం, పారుష్యం, (కఠినంగా మాట్లాడటం) క్రూరత్వం అనే ఏడుగురు వృషలులు క్షత్రియునిలో ఉన్నారని చెపుతారు. తీక్ష్ణత్వం, కపటం, మాయ, శఠత్వం దంభం, సారళ్యం లేక పోవటం, అసత్యం చెప్పటం అనే ఎనిమిది వృషలులు వైశ్యుని శరీరంలో ఉన్నారని చెప్పారు. దాహం, తినాలనే కోరిక, నిద్ర, సోమరితనం, నిర్దయ, కూరత్వం మానసికమయిన దిగులు, విషాదం, ప్రమాదం, ధైర్యం లేక పోవటం, భయం, గాబరా జడత్వం, పాపం, కోపం, ఆశ, అశ్రద్ధ, అనవస్థ, నిరంకుశత్వం, అపవిత్రత, మలినత్వం అనే ఇరువది యొక్క వృషలులు శూద్ర శరీరంలో ఉంటారని చెపుతారు. ఇవి శరీరంలో లేని వ్యక్తిని బ్రాహ్మణుడని చెపుతారు. కాబట్టి నాకు ఇపుడు కావాలనుకొనేవాడు సాత్వికుడయి కోపంలేకుండా, పవిత్రుడయి ఎల్లప్పుడు నన్ను అర్చించాలి. జిహ్వాచాంచల్యం లేనివాడు, ధైర్యవంతుడు, నాలుగు మూరలు ముందుచూపుతో వెళ్ళేవాడు, చంచల మనస్సును, వాక్కును వశం చేసుకున్నవాడు, భయరహితుడు నాభక్తుడని చెపుతారు. ఇలాంటి అధ్యాత్మజ్ఞానం కలిగి జితేంద్రియులయిన బ్రాహ్మణులు శ్రాద్ధంలో తృప్తి పూర్వకంగా భోజనం చేస్తే ఆ శ్రాద్ధకర్త పితరులు ఆ భోజనంతో తృప్తులవుతారు. ధర్మమే జయిస్తుంది. కాని అధర్మం కాదు. సత్యమే జయిస్తుంది కాని అసత్యంకాదు. ఓర్పే జయిస్తుంది. కాని కోపం కాదు. కాబట్టి బ్రాహ్మణుడు ఓర్పు కలిగి ఉండాలి.*"

కపిల గోదాన మాహాత్మ్యము - కపిల గోవులలో పది భేదములు.

వైశంపాయనుడు చెప్పాడు. "జనమేజయా! ధర్మపుత్రుడు దాన పుణ్యఫలాన్ని, తపస్సు పుణ్య ఫలాలను విని సంతోషించిన మనస్సుతో శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు "ప్రభూ! మాధవా!

* ధర్మో జయతి నాధర్మః సత్యం జయతి నానృతమ్ ।
క్షమా జయతి న క్రోధః క్షమావాన్ బ్రాహ్మణో భవేత్ ॥

పూర్వం చతుర్ముఖ బ్రహ్మ అగ్నిహోత్ర సిద్ధికోసం పుట్టించింది, ఎల్లవేళల పవిత్రమని చెప్పబడేది అయిన కపిలధేనువును బ్రాహ్మణునకు ఏవిధానంలో దానం చేయాలి ? మాధవా! పవిత్ర లక్షణాలుగలు ఆ ధేనువును ఏరోజున ఎలాంటి బ్రాహ్మణునకు దానం చెయ్యాలి ? బ్రహ్మదేవుడు కపిలధేనువులలో ఎన్ని భేదాలు చెప్పాడు ? కపిలధేనువు దానం చేయటం ఏమనుష్యుడు చెయ్యాలి ? అనే విషయాలను యధాతధంగా వినగోరు తున్నాను " అని మహా సభామధ్యంలో ధర్మపుత్రుడు అడుగగా శ్రీకృష్ణుడు కపిలధేనువుల సంఖ్యను, వాటి మాహాత్మ్యాన్ని చెప్పాడు. "పాండుపుత్రా! పవిత్రము, పాప నాశకమయిన విషయాన్ని విను, దీన్ని వినటం వల్ల పాపకర్మలు చేసిన నరుడయినా పాప విముక్తుడవుతాడు. పూర్వకాలంలో స్వయంభువు అయిన బ్రహ్మ అగ్ని హోత్రం కోసం బ్రాహ్మణులకోసం సమస్త తేజస్సులను ఏకంచేసి కపిల గోవును సృష్టించాడు. పాండుపుత్రా! కపిలగోవు పవిత్రమయిన వాటిలో పవిత్రమయినది. మంగళకరాల్లో మంగళకరం. పుణ్యకరమయిన వాటిలో పరమపుణ్యమయినది అది తపస్సులలో శ్రేష్ఠతపస్సు. వ్రతాలలో ఉత్తమవ్రతం, దానాల్లో శ్రేష్ఠదానం సమస్తం అక్షయం కావటానికి కారణం అవుతుంది. బ్రాహ్మణులు ప్రాతస్సాయం సమయాలలో కపిల గోవు పాలతో, పెరుగుతో, నేతితో అగ్నిహోత్రాలలో హోమం చేయాలి. ప్రభూ! కపిలగోవు నేతితోగాని, పెరుగుతోగాని, పాలతోగాని శాస్త్రోక్త విధానంతో అగ్నిహోత్రాలు చేసేవారు, పరమభక్తితో అతిధులను పూజించేవారు, శూద్రాన్నం తినినివారు, దంభం అనృతం వదలిన బ్రాహ్మణోత్తములు సూర్యునితో సమానంగా ప్రకాశించే విమానాల మీద సూర్యమండలం మధ్యనుంచి సర్వోత్తమమయిన బ్రహ్మలోకానికి వెళ్తారు.

పాండునందనా! బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారం కపిల ధేనువు కొమ్ముల చివర సర్వతీర్థాలు ప్రతినిత్యం నివసిస్తాయి. ప్రొద్దుటనే లేచి ప్రయత్నపూర్వకంగా కపిలధేనువు శిరస్సునుండి జారివడిన జలధారను తన శిరస్సుపైన ధరించే మానవుడు ఆ పుణ్యతీర్థ ప్రభావం చేత పాపాలు నాశనం కాగా, మూడు జన్మలలో చేసిన పాపాన్ని, ఆ పుణ్యం గడ్డిపోచను అగ్నివలె దహిస్తుంది. కపిలధేనువు పంచితాన్ని తీసుకొని తననేత్రాలయిన ఇంద్రియాలను తడుపుకొని దానితో స్నానం చేసేవాడు అస్నాన పుణ్యంతో పాపరహితుడవుతాడు అతడు మూడు జన్మలలో చేసిన పాపం నాశనమవుతుంది. ఇందులో సంశయంలేదు. రాజా! ప్రొద్దుననే లేచి మానవుడు భక్తితో కపిలగోవుకు పిడికెడు పచ్చి గడ్డిని వేస్తే అతడు ముప్పది రాత్రులు - ఒక నెలచేసిన పాపం అంతా నశిస్తుంది. ప్రొద్దుననే లేచి భక్తితో కపిలగోవుకు ప్రదక్షిణంచేసే వాడు భూమికి ప్రదక్షిణం చేసినట్లే అనటంలో సంశయం లేదు. పాండవా! కపిలధేనువు పంచగవ్యంలో స్నానంచేసి పవిత్రుడు అయ్యేవాడు గంగాదులయిన పుణ్య తీర్థాలలో స్నానంచేసినవా డవుతాడు. రాజా! కపిలధేనువును దర్శించి దాని అంభారవం వినేవాడు ఒకరోజు చేసిన పాపం పోగొట్టుకుంటాడు. వేయి సామాన్య గోవులను దానం చేసిన వానికి కలిగే ఫలం ఒక కపిలధేనువును దానం చేసిన వానికి కలిగే ఫలం సమానం అని లోకాలకు పితామహుడయిన బ్రహ్మదేవుడు చెప్పాడు. పారపాటున కపిలధేనువును సంహరించినవాడు వేయి సామాన్య గోవులను చంపిన పాపం పొందుతాడు ఇందులో సందేహంలేదు.

కపిలధేనువు పదిరకాలు అని బ్రహ్మదేవుడు స్వయంగా చెప్పాడు. మొదటిది స్వర్ణకపిల,

రెండోది గౌరపింగళ, మూడోది రక్త పింగాక్షి. నాలుగోది గళపింగళ, అయిదవది బభ్రువర్ణభ. ఆరోది శ్వేత పింగళ. ఏడోది రక్త పింగాక్షి. ఎనిమిదోది ఖుర పింగళ. తొమ్మిదవది పాటల పదవది పుచ్ఛపింగళ. ఈ పది విధాలయిన కపిలగోవులు ఎల్లప్పుడు మానవులను తరింప జేస్తాయి. నరనాధా ! అవి మంగళకరాలు, పవిత్రాలు, సర్వపాపాలు పోగొట్టేవి అవుతాయి. ఎద్దులు గూడా ఇలాగే పదిభేదాలుగా ఉంటాయని చెపుతారు ఆ ఎద్దులను బ్రాహ్మణుడు తనబండికి కట్టుకోవచ్చు. ఇతరవర్ణం వారు వాటిని ఎప్పుడూ పాలం దున్నటంలోగాని బండికి కట్టడంలోగాని ఉపయోగించరాదు బండికి కట్టిన ఎద్దులను హుంకారంతోగాని, ఆకులు గల కొమ్మతోగాని, తోలాలి కాని, కర్రతోగాని, తాడుతోగాని, వాటిని కొట్టరాదు. ఎద్దులు ఆకలి దప్పులతో శ్రమతో అలసిపోయి ఉంటేగాని, వాటి ఇంద్రియాలు కలత చెందినప్పుడుగాని బండికి కట్టరాదు. ఎద్దులకు ఆహారం పెట్టకుండా నీళ్లు పెట్టకుండా యజమాని తాను తినరాదు. త్రాగరాదు. సేవచేసే మానవునికి కపిలగోవు తల్లి. ఎద్దు తండ్రి. ప్రొద్దుటి వూటనే ఎద్దులను బండికి కట్టడం, వాటితో దున్నించటం సముచితం అని చెపుతారు మధ్యాహ్నసమయాన వాటికి విశ్రాంతి నివ్వాలి. సాయంత్రం అవసరమయితే వాటిని బండికి కట్టవచ్చు. ఏదయిన తొందరగా పని ఉన్నా,మార్గమధ్యంలో ఏదయినా ఆపద కలుగుతుందేమో అనే సంశయం కలిగినా ఎద్దులకు విశ్రాంతి లేకుండా బండిని కట్టవచ్చు. దానివల్ల పాపం కలుగదు. అవసరం లేనప్పుడు గూడా ఎద్దులను శ్రమపెడితే ఆ వ్యక్తి రౌరవాది నరకాలకు పోతాడు. ఎవడయినా అజ్ఞానంతో ఎద్దుల రక్తం చిందిస్తే ఆ పాపంతో అతడు నరకానికి వెళ్తాడు. ఇందులో సందేహం లేదు. అతడు నరకాలు అన్నింటిలో వందేసి ఏళ్లు ఉండి తరువాత మర్త్యలోకంలో ఎద్దుగా జన్మిస్తాడు. కాబట్టి సంసారవిముక్తి కోరేవాడు కపిలగోవును దానం చెయ్యాలి. అన్ని యజ్ఞాల్లో కపిల ధేనుదానం విధింపబడింది. కాబట్టి బ్రాహ్మణులు వాటిని యజ్ఞాల్లోనే దక్షిణగా ఇవ్వాలి. దరిద్రుడు శ్రోత్రియుడు, మహాతేజస్వి, బడలినవాడు అయిన బ్రాహ్మణునికి అగ్నిహోత్రంలో హోమం కోసమని ప్రయత్నపూర్వకంగా గోదానం చేసినవాడు ఆ దానంతో పవిత్రమనస్కుడయి నాలోకంలో ప్రతిష్ఠనందుతాడు.

కొమ్ములకు, గిట్టలకు బంగారుతొడుగులు వేసి కపిలగోవును వివత్కాలంలో ఉత్తరాయణ దక్షిణాయన పుణ్యకాలాల్లో దానం చేసేవాడు అశ్వమేధయాగ ఫలం పొందుతాడు. అశ్వమేధ తుల్యమయిన ఆ పుణ్యంతో నాలోకానికి వెళ్తాడు వేయి అగ్నిష్టోమాలతో ఒక వాజపేయం సమం అవుతుంది వేయి వాజపేయయాగాలతో ఒక అశ్వమేధం సమానం అవుతుంది. వేయి అశ్వమేధాలతో ఒక రాజసూయం తుల్యం అవుతుంది. పాండవా! శాస్త్రోక్త విధానంతో వేయి కపిలగోవులను దానం చేసే దాత రాజసూయ ఫలాన్ని పొంది నా లోకంలో ప్రతిష్ఠితుడవుతాడు. అతనికి పునరావృత్తి ఉండదు. దానం ఇచ్చిన గోవు తన విభిన్న గుణాలతో కామధేను వయి పరలోకంలో దాతవద్దకు చేరుతుంది అది స్వకర్మబద్ధుడయి ఘోరాంధకార పూర్ణమయిన నరకంలో పడుతున్న మనుష్యుని వాయు సహాయంతో పోతున్న నౌక మహాసముద్రంలో మునుగుతున్నదానిని రక్షించినట్లు ఉద్ధరిస్తుంది. మంత్ర పూర్వకంగా ఇచ్చిన ఔషధం నరుని రోగాన్ని పోగొట్టినట్లు సత్పాత్రునికి దానం చేసిన కపిల నరుని పాపం అంతా నాశనం

చేస్తుంది. సర్పం కుబుసం విడిచి కొంగ్రొత్త రూపాన్ని పొందినట్లు కపిలను దానం చేసినవాడు తన పాపాల నుంచి విముక్తుడయి మిక్కిలి శోభను పొందుతాడు. భవనంలో నిండి ఉన్న కటిక చీకటిని బాగా వెలిగే పెద్ద దీపం పోగొట్టినట్లు మానవుడు కపిల గోదానం వల్ల తనలో లీనమయి ఉన్న పాపాన్ని పోగొట్టుకుంటాడు. ఆహితాగ్ని, అతిథిప్రేమికుడు భూద్రాన్నానికి దూరంగా ఉండేవాడు జితేంద్రియుడు,సత్యవ్రతుడు నిత్యం అధ్యయనం చేసేవాడు అయినవానికి దానం చేసిన గోవు దాతను తప్పక ఉద్ధరిస్తుంది."

కపిల గోవుతో దేవనివాసము కపిలామాహాత్మ్యము. నరక స్వర్గప్రాపక పాప పుణ్యవర్ణనము.

ధర్మపుత్రుడు పుణ్యప్రదము, ఉత్తమమయిన కపిలా దానమును గూర్చి విని సంతుష్టమనస్కుడయి శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "బ్రాహ్మణునికి దానం చేసిన కపిలగోవు సర్వాంగాలలో దేవతలు ఏరీతిగా ఉంటారు ? దేవశ్రేష్ఠా! నీవు చెప్పిన పదిరకాల కపిల గోవులలో పుణ్యలోకాలు గలవి ఎన్ని ఉన్నాయి ?" యుధిష్ఠిరుడు ఇలా అడగగా కేశవుడు రహస్యమయిన వాటిల్లో పరమ రహస్యమయిన విషయాన్ని ఇలా చెప్పసాగాడు. "పుణ్యదాయకము ఉత్తమమయిన ఈ కపిలా దానాన్ని నాభక్తుడయి పొద్దునే లేచి చదివేవానికి కలిగే పుణ్యఫలాన్ని విను. ఈ అధ్యాయాన్ని పారాయణ చేసేవాడు మనస్సుతో, కర్మతో, వాక్కుతో రాత్రిచేసిన పాపాన్ని నశింపజేసుకుంటాడు. శ్రాద్ధకాలంలో ఈ అధ్యాయాన్ని పారాయణం చేస్తూ బ్రాహ్మణులను భోజనాదులతో తృప్తిపరచేవాని పితరులు మిక్కిలి ప్రసన్నులయి అమృతం భుజిస్తారు. నాయందు బుద్ధినిలిపి దీన్ని భక్తితో వినేవాడికి రాత్రి చేసిన పాపం అంతా త్వరగా నశిస్తుంది.

ఇకమీద నీకు కపిలధేనువుల విశేషం చెపుతాను. రాజా! ఇంతకు ముందు పది కపిల ధేనువులను గూర్చి నీకు చెప్పాను. వాటిలో నాలుగు శ్రేష్ఠమయినవి. పాపనాశకాలు, పుణ్యదాయకాలు. సువర్ణ కపిల, రక్త పింగళ, పింగళాక్షి, పింగళ పింగళ అనే ఈ నాలుగు కపిలగోవులు శ్రేష్ఠమయినవి. పవిత్రాలు, పాప నాశకాలు వీటిని దర్శించినా, నమస్కరించినా ఆ నరుని పాపం నశింపజేస్తాయి. పాపాలను, నాశనం చేసే ఈ గోవులు ఉన్నవాని ఇంటిలో సంపద, విజయం, విశాలకీర్తి నిత్యనివాసం చేస్తాయి. వీటి పాలతో శంకరుడు, పెరుగుతో దేవతలు, అందరు ప్రీతులవుతారు. వీటి నేతితో అగ్నిదేవుడు ప్రీతుడవుతాడు. కపిలధేనువు పాలను గాని, పెరుగునుగాని నేతినిగాని పాయసాన్నిగాని శ్రోత్రియులకు ఒక్కమారు ఇచ్చినా నరుడు పాపవిముక్తు డవుతాడు. జితేంద్రియుడయి, అహోరాత్రం ఉపవాసం ఉండి, కపిలా పంచగవ్యం పుచ్చుకునే వానికి చాంద్రాయణ వ్రతం చేసినదానికంటే ఎక్కువ పుణ్యం కలుగుతుంది. క్రోధాన్ని, అసత్య భాషణాన్ని వదలి, నాయందు మనస్సు నిలిపి, శుభముహూర్తంలో కపిలాగోపంచగవ్యం ఆచమించేవాని అంతఃకరణం పరిశుద్ధం అవుతుంది. విసవయోగంలో భిన్న భిన్న మంత్రాలను ఉచ్చరిస్తూ, నా ప్రతిమనుగాని, శంకరుని చిహ్నాన్నిగాని స్నానం చేయించేవాడు

అశ్వమేధయాగఫలం పొందుతాడు. అతడు పాప విముక్తుడయి, శుద్ధమనస్సుతో, ఆకాశంలో విలసిల్లే విమానం మీద నాలోకానికిగాని, రుద్రలోకానికిగాని వెళ్తాడు. అందువల్ల వరంలో మేలు కోరుకొనే వాడు కపిల ధేనువును దానం చెయ్యాలి. రాజా! అగ్ని హోత్ర పరుడయిన బ్రాహ్మణునికి కపిలగోదానం చేసేటప్పుడు దాని కొమ్ముల వైభాగంలో విష్ణువు, ఇంద్రుడు ఉంటారు.

కొమ్ముల మొదట చంద్రుడు వజ్రధారి ఇంద్రుడు, కొమ్ములమధ్య భాగంలో బ్రహ్మ, నుదుట శంకరుడు ఉంటారు. చెవులలో అశ్వనీదేవతలు, కన్నులలో చంద్రసూర్యులు దంతాలలో మరుత్తులు, నాలుకలో సరస్వతీదేవి, రోమకూపాలలో మునులు, చర్మంలో ప్రజాపతి, నిఃశ్వాసములలో షడంగాలు, పదక్రమాలుగల వేదాలు ఉంటాయి. ముక్కు పుటాల్లో సుగంధం, మంచివాసనగల పుష్పాలు, పెదిమలో వసువులు అందరు, ముఖంలో అగ్ని ఉంటారు. చంకలలో సాధ్యదేవతలు, మెడలో పార్వతీదేవి, పృష్ఠ భాగంలో నక్షత్రసమూహాలు, మూపురంలో ఆకాశం, అపానంలో సర్వతీర్థాలు, పంచితంలో స్వయంగా గంగాదేవి, అష్టైశ్వర్యమయి అయిన లక్ష్మీదేవి గోమయంలో ఎల్లప్పుడు ఉంటారు. నాసికలో జ్యేష్ఠాదేవి ఉంటుంది. తొడలలో పితృదేవతలు, తోకలో రమాదేవి ఉంటుంది. ఇరుపార్శ్వాలలో విశ్వేదేవతలు అందరూ ఉంటారు. ఆ గోవుల వక్షఃస్థలంలో శక్తిధరుడయిన కుమారస్వామి ప్రీతుడయి ఉంటాడు. పిక్కలు మోకాళ్ళు, ఉరఃప్రదేశాల్లో పంచవాయువులు, గిట్టలమధ్య గంధర్వులు, గిట్టల చివర పన్నగాలు ఉంటాయి. ఆ గోవు స్తనాలు నాలుగింటిలో సముద్రాలు నాలుగు ఉంటాయి. రతి, మేధ, క్షమ, స్వాహా, శ్రద్ధ, శాంతి, ధృతి, స్మృతి, కీర్తి, దీప్తి, క్రియ, కాంతి, తుష్టి, పుష్టి, సంతతి, దిక్కులు, విదిక్కులు, కపిలధేనువును ఎల్లప్పుడు సేవిస్తుంటాయి. దేవతలు, పితృగణాలు, గంధర్వులు అప్సరస్సమూహాలు, లోకాలు, ద్వీపాలు, సముద్రాలు, గంగాదినదులు, దేవతలు, పితృ గణాలు, సాంగాలయిన యజ్ఞాలతో గూడిన వేదాలు సంతోషంతో వివిధ మంత్రాలతో కపిలగోవును స్తుతిస్తుంటాయి. విద్యాధరులు, సిద్ధులు, భూతాలు తారాగణాలు పుష్పవృష్టి కురిపిస్తూ సంతోషంతో నృత్యం చేస్తారు. ఆహా! ఈ కపిల ధేనువు రత్నమే. ఇది పవిత్రమయినది. సర్వదుఃఖాలూ పోగొట్టే ఉత్తమమయినది. ఇది ధర్మార్జితం. శుద్ధం, శ్రేష్ఠం. అమూల్యం అని ఆకాశంలోని దేవతలంతా జపిస్తూ ఉంటారు. సర్వదేవతలూ నమస్కరించే పుణ్యమయి కపిలాదేవీ నీకు నమస్కారం, బ్రహ్మాదులు నిన్ను అగ్నికుండంనుంచి పైకి తీశారు. నీ ప్రభ విస్తృతం. నీశక్తి గొప్పది. కపిలాదేవీ! సమస్త తీర్థాలు నీ స్వరూపమే. నీవు అందరికి మేలు కలిగిస్తావు."

యుధిష్ఠిరుడు అడిగాడు. "హ్యవకవ్యాలకు తగిన సమయం ఏది? అక్కడ పూజింప దగిన బ్రాహ్మణులెవరు? వదలవలసిన వారు ఎవరు?" శ్రీ కృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! దైవకార్యాలను పూర్వాహ్ణంలోను, పితృకార్యాలను అపరాహ్ణంలోను చేయవలసినవని తెలుసుకోవాలి. సకాలంలో చేయనిదానం రాజసం అని భావిస్తారు. జనమధ్యంలో ప్రకటించినది, అబద్ధం చెప్పేవాడు తినగా మిగిలినది, కుక్క ఎంగిలి చేసినది. ఈ ఆహారం రాక్షసాహారం అని చెపుతారు. పతితులు, జడులు, పిచ్చివారు అయిన బ్రాహ్మణులు దైవకార్యాల్లో పితృ కార్యాల్లో పూజింప అర్హులు కారు.

నపుంసకుడు, ప్లీహ రోగం కలిగినవాడు, కుష్ఠురోగి, క్షయ రోగంగలవాడు, మూర్ఛరోగం గలవాడు పితృకర్మలలో పూజ్యుడుగాడు. వైద్యులు, పూజారులు, అసత్యనియమాలు గలవారు. సోమరసం అమ్ముకొనేవారు శ్రాద్ధంలో పూజకు అర్హులు కారు. గాయకులు, నర్తకులు, గంతులు వేసేవారు. వాద్యాలు మ్రోగించేవారు, వ్యర్థప్రలాపం చేసేవారు. యుద్ధంచేసేవారు శ్రాద్ధంలో పూజింపదగరు. అగ్నిహోత్రం చేయనివారు. శవవాహకులు, దొంగలు, శాస్త్ర విరుద్ధకార్యాలు చేసేవారు శ్రాద్ధ పూజ్యులు కారు. అపరిచితులు, గణపుత్రులు, తండ్రి ఎవరో తెలియనివారు అయిన బ్రాహ్మణులు, పుత్రికా ధర్మానుసారం తల్లి తండ్రి ఇంటిలో ఉండే వారు శ్రాద్ధపూజ్యతను పొందదగరు. యుద్ధం చేసే బ్రాహ్మణుడు వ్యాపారం చేసే ద్విజుడు, ప్రాణులను అమ్మే విప్రుడు శ్రాద్ధసత్కృతికి అర్హులుకారు. వ్రతాచరణ తత్పరులు, స్వాధ్యాయతత్పరులు, గాయత్రీమంత్రం తెలిసిన వారు, సత్క్రియా నిష్ఠులయిన ద్విజులు శ్రాద్ధపూజార్హులు సత్పాత్రమయిన బ్రాహ్మణుడు లభించినదే శ్రాద్ధకాలం అవుతుంది. ద్విజుడు,పెరుగు నెయ్యి, దర్భలు, పూలు, ఉత్తమక్షేత్రం లభించిన సత్కాలంలోనే శ్రాద్ధం పెట్టాలి. సత్పవర్తన నిరతులు, స్వల్ప వృత్తితో జీవించేవారు, దుర్బలులు, తపస్వులు, భిక్షాచరణం చేసేవారు, యాచకులుగా వస్తే వారికి ఇచ్చినది మహా ఫలదాయకం అవుతుంది. యుధిష్ఠిరా ! బ్రాహ్మణుని గూర్చి పూర్తిగా తెలుసుకోవాలి. శ్రోత్రియుడు, దరిద్రుడు, తనకు ఉపకారం చేయని వేదవేత్త అయిన బ్రాహ్మణునికి దానం చెయ్యి.

ధర్మజ్ఞా ! నీవు చేసే దానం అక్షయం, సఫలం కావాలనుకొంటే, అది నీకు, శ్రోత్రియులకు ప్రియమయి ఉండాలి యుధిష్ఠిరా! నరకానికి పోయేవారిని గురించి చెపుతాను విను. పరభార్యలను అపహరించేవారు, పరస్త్రీలతో వ్యభిచరించేవారు, ఒకని భార్యను ఇంకొకనితో కలిపేవారు నరకానికి వెళ్తారు. చాడీలు చెప్పేవారు, సంధి నియమాలను నిరాకరించేవారు. ఇతరుల ధనంతో బ్రతికేవారు, వర్ణాశ్రమ బాహ్యులు, పాషండులు, పాపాత్ములు, వారిని సేవించేవారు అందరూ నరకానికి పోయేవారే. ఓర్పుగలవారు, ఇంద్రియ నిగ్రహం గలవారు, బలహీనులు, బుద్ధిమంతులు అయి చాలకాలం తమతో ఉన్నవారిని తమ పని అయిన తరువాత వదలివేసేవారు నరక గాములు అవుతారు. చిన్న పిల్లలకు, ముసలివారికి, బడలినవారికి ఆహారం పెట్టకుండా తినే వారు నరకానికి వెళ్తారు. యుధిష్ఠిరా ! ఈ రీతిగా ప్రాచీన మహర్షులు నరకగాములను గూర్చి చెప్పారు ఇక స్వర్గానికి వెళ్లేవారిని గురించి చెపుతాను విను.

దానంతో, తపస్సుతో, సత్యంతో, ఇంద్రియనిగ్రహంతో ధర్మాన్ని అనుసరించేవారు స్వర్గగాములు అవుతారు. ఇప్పపువ్వుల కల్లు, మాసం మద్యం ముట్టనివారు, నియమతత్పరులు, పరభార్యా విముఖులు అయినవారు స్వర్గానికి వెళ్తారు. తల్లి దండ్రులను సేవించేవారు, సోదరులయందు ప్రేమగలవారు స్వర్గగాములు అవుతారు. భోజన సమయంలో బయటకు వచ్చిన అతిథిసేవచేసేవారు. అతిధిప్రియులు, అతిధులకయి ఇంటితలుపు ఎప్పుడూ తెరచి ఉంచేవారు స్వర్గగాములు అవుతారు. దరిద్రుల ఆడపిల్లలకు పెళ్లి చేసేవారు, తాము వివాహమాడే వారు స్వర్గగాములు. శ్రద్ధాపూర్వకంగా

మధురసాలను, ధాన్యాన్ని, ఔషధులను ఇచ్చే నరులు స్వర్గగాములు అవుతారు మార్గంలో ఉండే వాటిని తెలుసుకోగోరు బాటసారులకు మేలు కీళ్లను, ఎత్తు పల్లాలను చక్కగా చెప్పేవారు స్వర్గగాములు. అమావాస్య, పూర్ణిమ, చతుర్దశి అష్టమి, ఉదయసాయం సమయాలు, ఆర్ద్రా నక్షత్రంలో, జన్మనక్షత్రాలలో, విషవకాలంలో, శ్రవణా నక్షత్రంలో స్త్రీ సంయోగం చేయని నరులు స్వర్గానికి వెళతారు. యుధిష్ఠిరా! నీకు హవ్యకవ్యాల విధానాన్ని, నరక స్వర్గాలకు వెళ్లేవారిని, ధర్మాధర్మాలను చెప్పాను. మళ్లీ ఇంక ఏమి వినాలనుకుంటున్నావు."

బ్రహ్మహత్యతో సమానమైన పాపాలు.
అన్నదానాలు - త్యాజ్యాన్నములు - ధర్మాధర్మప్రశంస

యుధిష్ఠిరుడు అడిగాడు "దేవా ! మానవుడు బ్రాహ్మణుని హింసించకుండానే బ్రహ్మ హత్యాపాతకాన్ని ఎలా పొందుతాడు ? ఈ విషయం పరిపూర్ణంగా సరిగా చెప్పవలసింది " శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా ! బ్రతుకుతెరువులేక బాధపడుతున్న బ్రాహ్మణుని భిక్షకు పిలిచి ముందు ఇస్తానని చెప్పి తరువాత ఏమీ ఇవ్వని వానిని బ్రహ్మహత్య చేసినవాడు అని చెప్పారు. భారతా! దుష్టబుద్ధి కలిగినవాడు మధ్యస్థుడై బ్రహ్మ వేత్త అయిన బ్రాహ్మణ జీవికను హరిస్తే వానిని బ్రహ్మహత్య చేసినవాడు అంటారు. ఆశ్రమంలోగాని, దేవాలయంలోగాని, గ్రామంలోగాని, నగరంలోగాని క్రుద్ధుడై నిప్పుపెట్టి కాల్చిన వానిని బ్రహ్మ హత్యచేసిన వాడు అంటారు. భూనాయకా! దప్పిక గొన్న ఆవుల సముదాయానికి నీరు అందకుండా విఘ్నం కలించే వానిని బ్రహ్మఘాతి అంటారు. లోకంలో సుప్రసిద్ధమయి, ప్రచారంలో ఉన్న వేదవచనాన్ని గాని, మునులు రచించిన శాస్త్రవచనాన్నిగాని, అజ్ఞానంతో నిందించే వానిని బ్రహ్మఘ్నుడు అంటారు. గ్రుడ్డివాని, కుంటివాని, మందమతి అయిన వాని సర్వస్వం అపహరించేవానిని బ్రాహ్మణహత్యచేసిన వాడంటారు. గురువును అగౌరవంగా నీవు అని పిలిచినగాని, ఆయన మీద హుంకారం చేసిగాని ఆయన ఆజ్ఞను అతిక్రమించి ప్రవర్తించే మూఢాత్ముని బ్రహ్మఘాతి అంటారు. తనకు లభించిన స్వల్పమయిన దాన్ని గూడా కొండంతగా భావించేవాని, అది నశిస్తే దుర్దశ పొందేవాని సర్వస్వాన్ని హరించే వాడిని బ్రాహ్మణ హంత అంటారు."

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవశ్రేష్ఠా ! అన్నిదానాల్లో విశిష్టమయిన దానాన్ని చెప్పవలసింది. భోజనం చేయదగని విప్రులను గూర్చి వివరించగోరుతాను." శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "రాజా! బ్రహ్మాదులయిన దేవతలందరు అన్నదానాన్నే ప్రశంసిస్తారు అన్నదానంతో సమానమయినదానం ఇంతకు పూర్వం లేదు ఇకముందు ఉండదు అన్నము ఈలోకంలో బలదాయకం అవుతున్నది. అన్నం ఆధారంగానే ప్రాణాలు నిలుస్తాయి. రాజా! ఎవరు పెట్టే అన్నం తినరాదో చెపుతాను, తెలుసుకో యజ్ఞదీక్షితుడు, నీచుడు, కోపంగా ఉన్నవాడు, మోసగాడు, శాపగ్రస్తుడు, నంపుంసకుడు, పాకంలో భేదం కల్పించేవాడు, వైద్యుడు, దూత, ఎంగిలి తినేవాడు, వర్ణ సంకరుడు సూతకం వచ్చినవాడు, శూద్రుని ఎంగిలి, శత్రువు, పతితుడు పెట్టే అన్నం తినకూడదు. చాడీకోరు, యజ్ఞఫలాన్ని అమ్మేవాడు, నటుడు, నేతగాడు, కృతఘ్నుడు అంబష్ఠుడు, నిషాదుడు, నాటకాలు ఆడేవాడు, బంగారం పనిచేసేవాడు

వీణవాయించి బ్రతికేవాడు, ఆయుధాలు అమ్మేవాడు, సూతులు, మద్య విక్రేతలు, వైద్యుడు, రజకుడు, స్త్రీజితుడు, క్రూరుడు, గేదెలు మేపేవాడు వీరి అన్నం స్వీకరించరాదు. పదిరోజులు సూతకం తీరని వారి, వేశ్యల అన్నం తినరాదు. రాజాన్నం తేజస్సును, శూద్రాన్నం బ్రహ్మ వర్చస్సును, బంగారు పనివాని అన్నం ఆయువును, చర్మకారుని అన్నం కీర్తిని హరిస్తాయి. జన సమూహం పెట్టే అన్నం, వేశ్య పెట్టే అన్నం చీము, వ్యభిచారిణి భర్త అన్నం వీర్యసమం, వడ్డీ వ్యాపారి అన్నం మలంతో సమం. కాబట్టి వీటిని వదలిపెట్టాలి. పైవారు పెట్టే అన్నం తెలియక తింటే మూడు రోజులు ఉపవాసం చేయాలి. తెలిసి బ్రాహ్మణులు కావలెనని ఒక్కమారు తిన్నా ప్రాజాపత్యవ్రతం చేయాలి.

దానాల ఫలం యధాతధంగా విను. నీటిని దానం చేసేవాడు తృప్తిని పొందుతాడు. అన్నదాత అక్షయ సుఖం పొందుతాడు. గృహదాత ఉత్తమ గృహాలను, రజితదాత చక్కని స్వరూపాన్ని, వస్త్రదాత చంద్రసాలోక్యాన్ని, అశ్వదాత అశ్వనీదేవతల సాలోక్యాన్ని పొందుతాడు. ఎద్దును ఇచ్చేవాడు అధిక సంపదను, గోదాత గోలోకాన్ని, వాహనాన్ని, మంచాన్ని ఇచ్చే వాడు ఉత్తమభార్యను, అభయం ఇచ్చేవాడు ఐశ్వర్యమూ పొందుతాడు. ధాన్యదాత శాశ్వత సౌఖ్యాన్ని, వేదదాత బ్రహ్మసామ్యాన్ని పొందుతారు. అన్నిదానాల్లో వేదదానం గొప్పది. సువర్ణం, భూమి గోవు అశ్వం, మేక, వస్త్రం, శయ్య ఆసనం మొదలయిన వాటిని ఆదరపూర్వకంగా ఇచ్చేవాడు పూజితుడయి తీసుకునేవాడు వీరు ఇద్దరు స్వర్గానికి వెళతారు. అలాకాక అనుచితంగా ఇచ్చేవాడు, తీసుకొనేవాడు నరకానికి పోతారు. విద్వాంసుడు ఆబద్ధమాడరాదు. తపస్సు చేసి గర్వించరాదు. కష్టాల్లో ఉన్న బ్రాహ్మణులను అవమానించరాదు. దానం చేసి దాన్ని పదిమందికి చెప్పుకోరాదు. యజ్ఞఫలం అసత్యం వల్ల, గర్వం వల్ల తపస్సు, బ్రాహ్మణులను అవమానించటం చేత ఆయువు, దానం వెల్లడి చేయటం వల్ల నశిస్తాయి. ప్రాణి ఒకడే జన్మిస్తాడు. ఒకడే మరణిస్తాడు. తన పుణ్యాన్ని తానే అనుభవిస్తాడు. తాను చేసిన పాపం తానే అనుభవిస్తాడు. మరణించిన వాని శరీరం కర్రలాంటిది మట్టి పెళ్ల లాంటిది. నేలమీద పడిఉంటే బంధువులు పెడమొగం పెట్టి వెనక్కు వెళతారు. కాని ఆవ్యక్తి చేసిన ధర్మం అతని వెంటవస్తుంది. మానవుని మనస్సు ముందు ముందుచేయవలసిన పనులను లెక్కవేసుకుంటుంది. కాని కాలుడు అతని నాశన శీలమయిన శరీరం చూచి నవ్వుతుంటాడు. కాబట్టి ధర్మాన్నే సహాయకునిగా భావించి నిరంతరం దాన్ని సంపాదిస్తుండాలి. ధర్మ సహాయంతో మానవుడు దుస్తరమయిన నరకాన్ని దాటగలడు. జలసమృద్ధిగల చెరువులను, సత్రాలను, బావులను, చక్కని చలివేంద్రాలను వీర్పరచినవారు, అన్నదానం చేసినవారు, తీయగా మాట్లాడే పుణ్యాత్ములు యముని దృష్టికి దూరం అవుతారు."

ధర్మశౌచలక్షణము, భిక్షుక అభ్యాగతులసత్కారము శిష్టాచారము దానపాత్రత, బ్రాహ్మణుల, అన్నదాతల ప్రశంస.

యుధిష్ఠిరుడు అడిగాడు. "జనార్దనా ! విద్వాంసులు ధర్మం అనేక ప్రాకారములు బహుద్వారాలు గలదని చెప్పారు. ఆ ధర్మానికి లక్షణాలు ఏమిటో చెప్పు." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా!

ధర్మం శౌచములవిధిని సంగ్రహంగా చెపుతా విను. **అహింస, సత్యం, కోపం లేకపోవుట, దయ, ఇంద్రియ నిగ్రహం, శాంతి, ఋజు ప్రవర్తన అనేవి ధర్మ లక్షణాలు.*** బ్రహ్మచర్యం, తపస్సు, క్షమ, మద్యమాంసాలు విడవటం, దండం ధర్మమర్యాదలను అతిక్రమించకుండా ఉండటం, శమం అనేవి శౌచ లక్షణాలు. బాల్యంలో విద్యాభ్యాసం చేయాలి. యౌవనంలో వివాహమాడాలి. ముసలితనంలో మునివృత్తిని అనుసరించాలి. నిరంతరం ధర్మాన్ని ఆచరించాలి. బ్రాహ్మణులను అవమానించరాదు. గురువులను నిందించరాదు. సన్యాసులకు, మహాత్ములకు అనుకూలంగా ప్రవర్తించాలి. ఇది సనాతనమయిన ధర్మం. బ్రాహ్మణులకు యతి గురువు. నాలుగు వర్ణాలకు బ్రాహ్మణుడు గురువు. స్త్రీలకు భర్తయే గురువు. ప్రజలందరికి రాజు గురువు. ఏకదండం ధరించిన వాడుగాని త్రిదండిగాని, జడలు దాల్చినవాడుగాని, జుట్టులేనివాడుగాని, కాషాయ వస్త్రాలు, దండంధరించిన పన్యాసి గాని నిస్సంశయంగా పూజ్యుడవుతాడు. కాబట్టి వరలోకంలో హితాన్ని కోరుకొనేవారు నాభక్తులను నాకు సమస్త కర్మలను సమర్పించినవారు, నాశరణాగతులను ప్రయత్న పూర్వకంగా పూజించాలి. బ్రాహ్మణులను కొట్టరాదు. గోవును ఎప్పుడూ కొట్టరాదు. వీరిని కొట్టే బ్రాహ్మణుడు భ్రూణహత్యా సమపాపాన్ని పొందుతాడు. నోటితో అగ్నిని ఊదరాదు. కాళ్లు నిప్పుతో కాచుకోరాదు. కాలితో అగ్నిని త్రొక్కరాదు. వీపు కాచుకోతగదు. కుక్కలు చండాలురు మున్నగువారు తగిలిన తరువాత చలికాచుకోరాదు. అగ్నినర్వదేవమయుడు. కాబట్టి ఎల్లపుడు పవిత్రుడుగా ఉండి అగ్నిని స్పృశించాలి. మలమూత్రాలు విసర్జించిన తరువాత బుద్ధిమంతుడు అగ్నిని స్పశించరాదు. మలమూత్రాలు శరీరంలో ఉన్నంతవరకు వ్యక్తి అపవిత్రుడవుతాడు."

యుధిష్ఠిరుడు అడిగాడు. "జనార్దనా ! చేసిన దానానికి మహాఫలం కలిగించే శ్రేష్ఠబ్రాహ్మణులు ఉంటారు. ఎలాంటి వారికి దానం చేయాలి ? అది నాకు వివరంగా చెప్పవలసింది." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! క్రోధరహితులు, సత్యపరాయణులు నిరంతరం ధర్మ లగ్న చిత్తులు, జితేంద్రియులు అయిన బ్రాహ్మణులే శ్రేష్ఠులు. వారికి దానం చేస్తేనే మహాఫలం కలుగుతుంది. అభిమాన రహితులు, దేన్నయినా సహించేవారు, శాస్త్రార్థం తెలిసినవారు, ఇంద్రియ విజేతలు, సర్వప్రాణుల హితం కోరేవారు, అందరితో స్నేహంగా ఉండేవారికి చేసిన దానం మహాఫలప్రదాయకం అవుతుంది. లోభరహితులు, పవిత్రులు విద్వాంసులు, సంకోచశీలురు, సత్యంచెప్పేవారు. స్వధర్మపరాయణులు అయినవారి కిచ్చింది మహాఫలప్రదం. ప్రతినిత్యం అంగాలతో గూడా నాల్గు వేదాలను అధ్యయనంచేసేవాడు, శరీరంలో శూద్రాన్నం లేనివాడు దాన పాత్రమని ఋషులు చెపుతారు. పవిత్రమనస్సు శాస్త్రీయజ్ఞానం, సదాచారం, ఉత్తమ శీలం గల ఒక్క బ్రాహ్మణుడయినా దానం తీసుకుంటే దాత సమస్తవంశం ఉద్ధరింపబడుతుంది. ఇలాంటి బ్రాహ్మణునికి గోవును, అశ్వాన్ని, ధనాన్ని దానం చేయాలి. సజ్జనులచే సన్మానాలందిన ఏ బ్రాహ్మణుని గుణగణాలను విని, దూరంగా ఉన్నా, ఆయనను పిలిపించి ప్రయత్న పూర్వకంగా పూజా సత్కారాలు చేయాలి."

---

* అహింసా శౌచమక్రోధమ్ ఆవృశంస్యం దమః శమః ।
ఆర్జవం చైవ రాజేంద్ర నిశ్చితం ధర్మలక్షణమ్ ॥

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవదేవా! ధర్మాధర్మాల విధానాలను పూర్వం భీష్ముడు విస్తారంగా చెప్పాడు ఆయన వాక్యాలలోని సారభూతమయిన ధర్మాన్ని నీవు చెప్పవలసింది." శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "రాజా! స్థావర జంగమాత్మకమయిన ఈ జగత్తును అన్నమే భరిస్తున్నది. అన్నం వల్లనే ప్రాణం ఉత్పన్నం అవుతుంది. అది ప్రత్యక్ష విషయం. ఇందులో సందేహం లేదు. తనమేలు కోరుకొనేవాడు అవసరమయితే భార్య ఆహారంలో కొంత మిగిల్చి అయినాసరే దేశకాలపాత్రలను విచారించి, భిక్షుకునికి శక్తిని అనుసరించి తప్పక అన్నం పెట్టాలి పిల్లవాడయినా, ముసలివాడయినా బ్రాహ్మణుడు ప్రయాణం చేసి అలసిపోయి ఇంటికి వస్తే, గృహస్థు ఆయనను ప్రీతితో గురువును వలె అర్చించాలి. పరలోకంలో మేలు కలగటం కోసం మానవుడు తనకు కలిగిన కోపాన్ని దిగమింగుకొని, మాత్సర్యం వదలి, సౌశీల్యంతో సంతోషంగా అతిథిని పూజించాలి. అతిథిని అవమానించరాదు. అబద్ధమయిన మాట చెప్పరాదు. వచ్చిన వాని గోత్రం, శాఖ, అధ్యయన విషయం ప్రశ్నించరాదు. పరలోకంలో హితంకోరుకొనేవాడు చండాలుడయినా, కుక్క మాంసం తినే వాడయినా ఎవడయినాసరే సరయిన సమయంలో ఇంటికి వస్తే అన్నం పెట్టి గౌరవించాలి. యుధిష్ఠిరా! ఎవరయినా ఇంటిముందు వాకిలి మూసివేసి సంతోషంగా భోజనం చేసేవాడు స్వర్గద్వారాన్ని స్వయంగా మూసివేసుకున్నట్లే సుమా! పితరులను, దేవతలను, ఋషులను, విప్రులను, అతిథులను నిరాశ్రయులయిన వ్యక్తులను అన్నంపెట్టి పూజించే వాని పుణ్య ఫలం చాలాగొప్పది. నానారకాల పాపాలు చేసి కూడా ఆడిగేవాడికి అన్నంపెట్టేవాడు అందరిలోను బ్రాహ్మణునికి అన్నంపెట్టేవాడు సర్వ పాప విముక్తుడు అవుతాడు. లోకంలో అన్నదాత ప్రాణదాత అవుతాడు. ప్రాణదాత సమస్త ప్రదాత అవుతాడు. కాబట్టి మేలుకోరుకునేవాడు విశేషంగా అన్నదానం చేయాలి. అన్నాన్ని అమృతం అంటారు. అన్నమే ప్రజలకు జన్మనిచ్చేది. అన్నం నశిస్తే శరీరంలో ఉండే పంచధాతువులు నశిస్తాయి. బలిష్ఠుడయిన పురుషుడయినా అన్నం తినటం మానివేస్తే బలం నశిస్తుంది కాబట్టి శ్రద్ధతోగాని, అశ్రద్ధతోగాని అధికంగా దానం చేయాలి. సూర్యుడు తన కిరణాలతో నేలలో ఉండే జలాన్ని అంతా తీసుకుంటాడు వాయువు సూర్యుని నుండి ఆ జలం తీసుకుని మేఘాలలో ఉంచుతుంది. భారతా! ఇంద్రుడు మేఘంలో ఉండే అలాంటి జలాన్ని భూమిమీద వర్షిస్తాడు ఆ జలంతో తడిసిన భూదేవి సంతోషిస్తుంది. సమస్త ప్రజలకు జీవనాధారమయిన పంటలు ఆ భూమి మీదనే మొలుస్తాయి మాంసం, మేదస్సు ఎముకలు, మజ్జ అనేవి నానావిధాలయిన అన్నాలవల్లనే వీర్పడతాయి "

భోజనవిధి, గోగ్రాస ప్రదాన విధానము, తిలమాహాత్మ్యము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "మధుసూదనా! అన్నదాన ఫలం విని సంతసించాను. దేవదేవా! ఇక భోజన విధిని చెప్పవలెను." శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "పాండుపుత్రా! ద్విజుల భోజన విధానం చెపుతా విను. శ్రేష్ఠ ద్విజుడు స్నానంచేసి, పవిత్రుడయి, అగ్నిహోత్రం నిర్వర్తించిన తరువాత శుద్ధము పవిత్రమయిన ప్రదేశంలో కూర్చోవాలి బ్రాహ్మణుడయితే చతురస్రమండలాన్ని, క్షత్రియుడు గోళాకారాన్ని,

వైశ్యుడయితే అర్ధచంద్రాకార మండలాన్ని నేలమీద చేయాలి. తరువాత కాళ్లుకడుగుకొని ఆ మండలం మీద ఏర్పరచిన శుద్ధాసనం మీద తూర్పు ముఖంగా కూర్చొని రెండు కాళ్ళతోకాని, ఒక కాలితోకాని భూమిని స్పృశిస్తుండాలి. ద్విజుడు ఒకే వస్త్రాన్ని ధరించిగాని, శరీరం అంతా కప్పుకొని గాని భోజనం చేయరాదు. అలాగే పగిలిన పాత్రలోగాని, విస్తరిని బోర్లా వేసుకొనిగాని భుజించరాదు. మొట్టమొదట సంతుష్టమయిన మనస్సుతో అన్నానికి నమస్కరించాలి. అన్నంతప్ప ఇతరం ఏమీ చూడరాదు. భోజన సమయంలో వడ్డించిన అన్నాన్ని నిందించరాదు. నిందించిన అన్నాన్ని రాక్షసులే తింటారు. భోజనం మొదలు పెట్టేముందు చేతితో నీరు తీసుకొని అన్నానికి ప్రదక్షిణంగా త్రిప్పాలి మంత్రం పఠించి విడివిడిగా పంచ ప్రాణాలకు అన్నాన్ని ఆహుతిగా తీసుకోవాలి. రాజా! ప్రాణాహుతులు చేసేటప్పుడు స్థిరచిత్తుడు జాగరూకుడయి నాలుకకు రుచితెలియకుండా ప్రాణాహుతులు వేయాలి. పాండునందనా ! అన్నం అన్నాదుడు పంచ ప్రాణాల తత్వం తెలిసి ప్రాణాగ్ని హోత్రం చేసేవాడు పంచవాయువుల యాగం చేస్తాడు. దీనికి విపరీతంగా భోజనం చేసే మూర్ఖ బ్రాహ్మణుడు అన్నంతో అసురులను, ప్రేతాలను, రాక్షసులను మాత్రమే తృప్తులను చేస్తాడు.

ప్రాణాహుతులు ఇచ్చి తరువాత నోరు పట్టేటంత మాత్రం ముద్దలను ఒక్కొక్కదాన్ని తినాలి. నోరు పట్టడానికి మించిన ముద్ద మిగిలింది ఆతని ఉచ్ఛిష్టమని అంటారు. తినగా ముద్దలో మిగిలిన అన్నం నోటిలో నిలిచి బయటకు వచ్చింది తినరానిదని తెలుసుకోవాలి. దాన్ని తింటే చాంద్రాయణవ్రతం చెయ్యాలి. తన ఎంగిలి తానే తినేవాడు (ఒకమారుతిని వదలి వేసిన దాన్ని మళ్ళి తినేవాడు) కృచ్ఛ చాంద్రాయాణాన్నిగాని ప్రాజాపత్యాన్ని చేయాలి. స్త్రీ భుజించిన పాత్రలో భుజించేవాడు. స్త్రీ ఎంగిలి తినేవాడు, స్త్రీతో ఒకేపాత్రలో భుజించేవాడు పాపాత్ముడు, మద్యపానం చేసేవాడు అవుతాడు తత్వదర్శనులయిన మునులు అతని పాపం పోవటానికి ఎలాంటి ప్రాయిశ్చిత్తం చూడలేదు త్రాగేటప్పుడు నీటి బిందువులు పడిన అన్నం తినదగిందికాదు. అది తిన్నవాడు చాంద్రాయణ వ్రతం చేయాలి. బ్రాహ్మణుడు భూమిని, దిక్కులను చూడకుండా యధావిధిగా భోజనంచెయ్యాలి తన ఎంగిలి ఎవరికీ పెట్టగూడదు. అన్నం అధికంగా గాని, తక్కువగాగాని ఎప్పుడూ తినకూడదు. ప్రతిదినమూ తనకు బాధ కలుగనంత మాత్రమే తినాలి. వెంట్రుకలు, పురుగులు ఉన్నది, నోటితో ఊదిచల్లార్చిన అన్నం తినకూడదని తెలుసుకోవాలి. దాన్ని తింటే చాంద్రాయణ వ్రతం చెయ్యాలి. భోజనం చేసే చోటినుంచి లేచిన తరువాత మళ్లీముట్టుకున్నది. కాలుతగిలినది, దాటినది, అయిన అన్నం రాక్షసాన్నమని తెలుసుకోవాలి. అందువల్ల దాన్నివదలివేయాలి. ఆచమనం చేయకుండానే భోజనం చేసే ద్విజుడు భోజనం చేసే ఆసనం నుంచి లేచేటట్టయితే త్వరగా స్నానం చెయ్యాలి లేక పోతే అతడు అపవిత్రుడు అవుతాడు "

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! ఆవులముందు పిడికెడు గడ్డి వేసే విధానాన్ని తిలలమాహాత్మ్యాన్ని, చెరుకు చంద్రునినుంచి ఉత్పన్నమయిన వృత్తాంతాన్ని చెప్పవలసింది." శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "రాజా! వృషభాలు జగత్తుకు తండ్రులు, గోవులు తల్లులు అని తెలుసుకోవాలి. వాటి పూజచేత పితృదేవతలు పూజింపబడినట్లే. వాటి పేడతో అలికితే సభాభవనాలు చలివేంద్రలు,

ఇండ్లు దేవాలయాలు శుద్ధం అవుతాయి. వానిని మించిన ప్రాణి ఇంకేముంది ? మానవుడు తాను భోజనం చేయక ముందు ఒక సంవత్సరం పాటు ఇతరుల ఆవుకు పిడికెడు వేసి తినిపిస్తే అతనికి ప్రత్యేక సమయంలో గోసేవచేసిన ఫలం లభిస్తుంది. **"ఆవులు అన్నీ నాకు తల్లులు, ఎద్దులు అన్నీ నాకు తండ్రులు. తల్లులారా! నేను ఇచ్చే పిడికెడు గడ్డిని స్వీకరించండి."*** అని ఆవు ముందు గడ్డి వేసి చెప్పాలి. ఈ మంత్రం చదివిగాని, లేక గాయత్రీమంత్రం ఉచ్చరించిగాని ఏకాగ్రచిత్తంతో అభిమంత్రించి ఆవులకు పిడికెడు గడ్డిని పెట్టేవానికి కలిగే పుణ్యఫలాన్ని విను అతడు తెలిసిగాని, తెలియకగాని చేసిన పాపం అంతా దానివల్ల నశిస్తుంది. దుఃస్వప్నం కూడా నశిస్తుంది నారాయణుని నుండి ఆవిర్భవించిన తిలలు పాప వినాశకాలు. శ్రాద్ధంలో నువ్వులు ముఖ్యమని ప్రశంసిస్తారు. తిలదానం గూడా ఉత్తమమయినది నువ్వులను దానం చేయాలి. తినాలి ప్రొద్దునేలేచి తిలలతో నలుగుపెట్టుకొని స్నానం చేయాలి. సర్వ పాపాలు పారద్రోలే తిలలను తిలలు తిలలు అని ఉచ్చరించాలి. రాజా! బ్రాహ్మణుడు స్వయంగా నువ్వులను గాను గాడరాదు. అలా చేయటం వల్ల రౌరవ నరకానికి పోతాడు. యుధిష్ఠిరా! చంద్రుడు ఇక్షువంశంలో జన్మించాడు. ద్విజులు చంద్రవంశంలో జన్మించారు. కాబట్టి ద్విజశ్రేష్ఠుడు చెరుకుగాను గాడరాదు."

ఆపద్ధర్మములు. శ్రేష్ఠాశ్రేష్ఠ బ్రాహ్మణులు. శ్రాద్ధమునకు ఉత్తమ కాలము. మానవధర్మసారవర్ణనము.

యుధిష్ఠిరుడు ఆడిగాడు. "దేవా! నీ అనుగ్రహంవలన ధర్మాధర్మాల సంగ్రహాన్ని, భుజించదగిన భుజించ దగని అన్నాలను గూర్చి విన్నాను. ఇంక ఆపద్ధర్మాన్ని చెప్పవలసింది " శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "రాజా! దేశంలో కరువు ప్రబలినపుడు దేశానికి ఆపద కలిగినప్పుడు, పురుడు, సూతకం వచ్చినప్పుడు, వేసవిలో ప్రయాణించేటప్పుడు నియమాలను పాటించ వీలుకాక పోయినా సుదూర ప్రయాణం చేసేటప్పుడు బాగా అలసిపోయినా, బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు లభించక పోయినా ప్రాణాలు నిలుపుకోవటానికి కొంచెం అపక్వాహారాన్ని శూద్రుని నుంచి అయినా తీసుకోవచ్చు. రోగి, దుఃఖితుడు, ఆర్తుడు ఆకలిగొన్న బ్రాహ్మణుడు విధానానికి భిన్నంగా భుజించినా ప్రాయశ్చిత్తం అక్కరలేదు. **జలం, మూలం, నేయి, పాలు, హవిస్సు బ్రాహ్మణ కాంక్ష నెరవేర్చటం, గురువు ఆజ్ఞను పాలించటం ఔషధం అనే ఎనిమిది ఆచరించటం వల్ల వ్రతభంగం కాదు.**** యధావిధిగా ప్రాయశ్చిత్తాలు చేసుకోవటానికి ఆశక్తుడయిన వాడు విద్వాంసుల మాటలవల్ల, దానం ద్వారా కూడా శుద్ధుడవుతాడు. పరదేశంలో ఉండే పురుషుడు కొద్ది కాలం ఇంటికి రావటం సంభవిస్తే

---

* గావో మే మాతరః సర్వాః పితరశ్చైవ గోవృషాః ।
గ్రాసముష్టిం మయా దత్తం ప్రతిగృహ్ణీత మాతరః ॥

**అష్టౌ తాన్యవ్రతఘ్నాని ఆపో మూలం ఘృతం పయః ।
హవిర్బ్రాహ్మణకామ్యా చ గురోర్వచనమౌషధమ్ ॥

ఋతుకాలంలో గాని, తదితర సమయంలోగాని పగలుగాని, రాత్రిగాని భార్యాసంగమం చేస్తే ప్రాయశ్చిత్తం అక్కరలేదు."

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! ఉత్తమ వ్రత సంపన్నా! ప్రశంసించదగిన విప్రులు, ప్రశంసార్హులు కానివారు ఎవరు? అష్టకాశ్రాద్ధ సమయం ఏది ? చెప్పవలసింది." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! ఉత్తమ వంశీయుడు, శాస్త్రోక్త కర్మానుష్ఠానపరుడు, విద్వాంసుడు దయాళువు, శ్రీమంతుడు, సరళుడు నిజం చెప్పేవాడు అందరూ ప్రశంసాపాత్రులే అవుతారు. వీరు ఆగ్రాసనాలమీద కూర్చుండి అందరికంటే ముందు భుజింపదగినవారు వారి పంక్తిలో కూర్చున్న వారందరిని వారు పవిత్రులను చేస్తారు. నాయందు మనస్సు పెట్టేవారు, నాశరణందినవారు, నాభక్తులు అయిన బ్రాహ్మణులను పంక్తిపావనులనుగాను, విశేషంగా పూజ్యులు గాను తెలుసుకో. రాజా! ఇప్పుడు నింద్యులయిన బ్రాహ్మణులను గూర్చి విను, లోకంలో కపటంగాప్రవర్తించే వారు వేద పారగులు అయిన విద్వాంసులయినా పావవర్తనులు గానే పరిగణింపబడతారు. అగ్నిని ఆరాధించనివాడు, దానాలు పట్టటంలోనే ఆసక్తిగలవాడు, ఎక్కడపడితే అక్కడ తినే బ్రాహ్మణుని బ్రాహ్మణ జాతికి కళంకంగా తెలుసుకోవాలి. రాజా! మరణాశౌచంలో చేసిన భోజనంతో బలసిన శరీరం గలవాడు, శూద్రాన్నం తినేవాడు, శూద్రాన్న రసంతో దృఢ శరీరంగలం బ్రాహ్మణుడు ప్రతిరోజు జపం చేస్తున్నా, హోమాదులు చేస్తున్నా అతనికి ఉత్తమ గతి కలుగదు. ఆహితాగ్ని అయిన విప్రుడు అయినా సరే శూద్రాన్నం తినటం మానకపోతే అతనికి ఆత్మ, వేదాధ్యయనం, మూడు అగ్నులు అనే అయిదు నశిస్తాయి. శూద్రసేవ చేసే బ్రాహ్మణునికి ప్రత్యేకించి నేలమీదనే అన్నం పెట్టాలి. అతడు కుక్క నక్కలతో సమానుడు. మరణించిన శూద్రుని శవాన్ని అనుసరించి వెళ్లే మూర్ఖ బ్రాహ్మణుడు మూడురాత్రులు మూడు రోజులు అపవిత్రు డవుతాడు. మూడు రాత్రులు గడచిన తరువాత సముద్రంలో కలిసే నదికి వెళ్లి నూరు ప్రాణాయామాలు చేసి నేతిని త్రాగి శుద్ధుడవుతాడు. దిక్కులేని బ్రాహ్మణుని శవాన్ని మోసే బ్రాహ్మణ శ్రేష్ఠులు ఆడుగడుగున అశ్వమేధయాగం చేసిన ఫలాన్ని పొందుతారు. సత్కార్యం చేసిన వారికి అశుభంగాని, పాపం గాని ఉండదు. నీటిలో స్నానంచేస్తే వారికి వెంటనే శౌచం కలుగుతుంది. నివృత్తి మార్గపరాయణుడయిన బ్రాహ్మణుడు శూద్రగృహంలో పాలుగాని, పెరుగుగాని తినరాదు. ఆవిగూడా శూద్రాన్నం అని తెలుసుకోవాలి.

బాగా ఆకలివేసి అన్నం తినాలనే కోరిక గల బ్రాహ్మణులకు భోజనంలో విఘ్నంచేసే మనుష్యుని మించిన పాపాత్ముడు వేరొకడు ఉండదు. రాజా! శీలం లేని బ్రాహ్మణునికి ఆరు అంగాలతో గూడిన వేదాలు, సాంఖ్యం, పురాణం, ఉత్తమ వంశ జన్మ అనేవి ఉత్తమ గతి కలగటానికి ఉపయోగపడవు. పాండు నందనా! గ్రహణకాలంలో విషువ యోగంలో అయనం చివరి శ్రాద్ధాదులలో, మఘా నక్షత్రంలో తనకు పుత్రుడు కలిగినప్పుడు, గయా శ్రాద్ధసమయంలో చేసే దానం సువర్ణ దాన సమానం అవుతుంది. వైశాఖ మాసంలో శుక్ల తృతీయ, కార్తీక శుక్ల పక్షంలో తృతీయ, భాద్రపదమాసంలో కృష్ణ పక్ష త్రయోదశి, మాఘమాసంలో అమావాస్య. సూర్య చంద్రగ్రహణాలు, ఉత్తరాయణ దక్షిణాయన పుణ్యకాలాలు శ్రాద్ధకాలాలు అవుతాయి. శ్రాద్ధయుక్తుడయిన మనుష్యుడు ఈ పుణ్య సమయాల్లో

తిలతర్పణం చేసినా అది వేయి సంవత్సరాల శ్రాద్ధం పెట్టినట్లే అవుతుంది. ఈ రహస్యాన్ని పితృదేవతలే చెప్పారు ఒకే పంక్తిలో కూర్చున్నవారికి భోజనం పెట్టేటప్పుడు ఎవడయినా స్నేహం వల్లగాని, భయంవల్లగాని, డబ్బుకోసం గాని, భేదం చూపించే వాడిని, క్రూరుడు దురాచారి, మనోజయం లేనివాడు, బ్రహ్మ హత్య చేసిన వాడు అని విద్వాంసులు చెపుతారు శత్రునాశకా! సమృద్ధిగా ధనం గలవారు. పరలోకాన్ని గురించి ఏమీ తెలియక ఆ ధనాదులతో సుఖపడే వారు కేవలం శారీరక సుఖలోలురే అవుతారు. వారికి కేవలం ఇహలోక సుఖమే ఉంటుంది. లౌకిక విషయాసక్తిలేని వారు, తపోనిష్ఠులు, వేదాధ్యయ నశీలులు, ఇంద్రియవిజేతలు, శరీరాన్ని దుర్బలం చేసిన వారు, సర్వ ప్రాణుల హితం కోరే మహాత్ములకు ఇహలోకపరలోక సుఖాలు రెండూ కలుగుతాయి. మూర్ఖులు, విద్యాగంధంలేని వారు, తపస్సు చేయనివారు, దానం చేయనివారు, శాస్త్రానుసారం సంతతి కనని వారు సుఖభోగాలు అనుభవించిన వారికి ఈలోకమూ లేదు. పరలోకమూ లేదు."

యుధిష్ఠిరుడు అడిగాడు / "దేవా / నీవు స్వాత్తుగా నారాయణుడివి. పురాణ పురుషుడివి. సర్వజగత్తుకు నివాసభూతుడివి సర్వధర్మాల సారాన్ని సంపూర్ణంగా నీ నుండి వినగోరుతున్నాను." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "మహా ప్రాజ్ఞా! పూర్వకాలంలో మనువు మొట్టమొదట ధర్మసారాన్ని చెప్పాడు. అది పురాణాలకు అనుకూలం, వేదాలు సమర్థించేది. దీన్ని నీకు చెపుతాను. అగ్ని హోత్రం చేసిన బ్రాహ్మణుడు, కపిలధేనువు, యజ్ఞంచేసిన బ్రాహ్మణుడు, రాజు, సంన్యాసి, సముద్రం అనేవి చూచినంతనే పవిత్రతను కలిగిస్తాయి. కాబట్టి వారిని ఎల్లపుడు దర్శించాలి. ఒక గోవునుగాని, ఒకే వస్త్రాన్ని గాని, ఒకే శయ్యనుగాని, ఒకే స్త్రీనిగాని అనేకులకు ఈయరాదు ఆ దాన ఫలం దాతకు లభించదు. బ్రాహ్మణులకుగాని, గోవులకుగాని ఆహారం పెట్టేటప్పుడు పెట్టవద్దు అని నివారించేవాడు వందలకొలది తిర్యక్కుల జన్మలు ఎత్తి చివరకు చండాలురలో జన్మిస్తాడు. రాజా! బ్రాహ్మణుని సొత్తును దైవద్రవ్యాన్ని, దరిద్రుని ధనాన్ని, గురుధనాన్ని హరించేవారు, స్వర్గవాసులయినా అధోగతిపాలు అవుతారు. **ధర్మం తెలుసుకోదలచుకున్న వారికి వేదం ప్రథమ ప్రమాణం. రెండవవి ధర్మశాస్త్రాలు. లోకాచారం మూడవ ప్రమాణం అవుతాయి.*** తూర్పు సముద్రం మొదలుకొని పశ్చిమ సముద్రందాకా హిమవంతం, వింధ్య పర్వతం, మధ్యలో ఉన్న భూమిని ఆర్యావర్తం అని చెపుతారు. సరస్వతి దృషద్వతి అనే దేవనదుల మధ్యలో ఉన్నది. దేవతలు నిర్మించిన దేశాన్ని బ్రహ్మావర్తం అనేపేరుతో చెపుతారు. ఏదేశంలో నయినా ఉండే వర్ణాలకు ఉపవర్ణాలకు పూర్వ పరంపర నుంచి క్రమంగా వచ్చే ఆచారాన్ని ఆయా వర్ణాలకు సదాచారం అని చెపుతారు కురుక్షేత్రం మత్స్యదేశం, పాంచాలదేశం, శూరసేన దేశం అనేవి బ్రహ్మర్షి దేశాలు, బ్రహ్మావర్తానికి సమీపంలో ఉంటాయి. ఈ దేశంలో

---

* ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం పరమం శ్రుతిః ।
ద్వితీయం ధర్మశాస్త్రాణి తృతీయం లోకసంగ్రహః ॥

జన్మించిన బ్రాహ్మణుల నుండి భూమండలంపైనగల సర్వమానవులు తమతమ ఆచారవ్యవహారాదులను నేర్చుకోవాలి.* హిమాలయ వింధ్య పర్వతాల మధ్యలో ఉన్నది. కురుక్షేత్రానికి తూర్పుగా ఉన్నది. ప్రయాగకు పశ్చిమంగా ఉన్న దేశాన్ని మధ్యదేశం అని చెప్పారు కృష్ణసారం అనే మృగం స్వభావ సిద్ధంగా సంచారంచేసే ప్రదేశమే యజ్ఞం చేయదగిన దేశం. అదిగాక ఇతరమయినది మ్లేచ్ఛ దేశం అవుతుంది. బ్రాహ్మణులు ఈ దేశాల వైశిష్ట్యాన్ని తెలుసుకొని ఇక్కడే నివసించాలి. కాని బ్రతుకు తెరువు కన్పించకపోతే ఏ దేశంలో నయినా నివసించవచ్చు **నదాచారం, అహింస, సత్యం యథాశక్తి గా దానం చేయటం. యమ నియమాలను యథాశక్తిగా పాటించడం - ఇవి ముఖ్య ధర్మాలు.**** బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు గర్భాధానం మొదలు అంత్యేష్టిదాకా పవిత్రమయిన వైదిక కర్మలతో శరీర సంస్కారం చేయాలి. అది బ్రతికి ఉన్నప్పుడు, మరణానంతరం పవిత్రతను కలిగిస్తుంది. గర్భాధాన సంస్కారంలో చేసే హోమంతో జాతకర్మతోను, నామకరణంతో చౌలంతో, ఉపయనయంతో, వేదాధ్యయనంతో, వేదోక్తవ్రతాలతో, స్నాతకవ్రతం వివాహం పంచమహాయజ్ఞాలు, యజ్ఞాలతో ఈ శరీరం పరబ్రహ్మ ప్రాప్తికి సాధనం అవుతుంది. ధర్మాన్నిగాని, ధనాన్నిగాని కలిగించ లేనివాడు శుశ్రూష చేయని శిష్యునికి విద్యాదానం చేయరాదు. అలా చేస్తే అది చవిటినేలలో వేసిన మంచి విత్తువలె వ్యర్థం అవుతుంది. లౌకికం, వైదికం, ఆధ్యాత్మికం అయిన జ్ఞానాన్ని తనకు ప్రాప్తింపజేసిన గురువుకు మొట్టమొదట నమస్కారం చేయాలి. గురువు కుడి కాలిని కుడిచేతితో, ఎడమకాలిని ఎడమచేతితో పట్టుకొని గురువందనం చేయాలి. ఒంటిచేతితో గురువుకు నమస్కారం చేయరాదు. గర్భాధానాదులయిన వైదిక సంస్కారాలను యధావిధిగా చేసేవాడు. వేదం అధ్యాపనం చేయించేవాడు అయిన బ్రాహ్మణుని గురువు అంటారు. ఉపనయనం చేయించి నిత్యమూ కల్పం, రహస్యాలతో గూడా వేదాన్ని చెప్పే వ్యక్తిని ఉపాధ్యాయుడు అని అంటారు. అంగాలతోగూడా వేదాలను అధ్యాపనం చేయించి వైదిక వ్రతాలను బోధించి మంత్రార్థాలను వివరించిన వానిని ఆచార్యుడు అంటారు. గౌరవం పొందటంలో ఉపాధ్యాయుని కన్నా పదిరెట్లు ఆచార్యుడు, ఆచార్యుని కన్నా వందరెట్లు తండ్రి, తండ్రి కన్నా తల్లి నూరు రెట్లు అధికురాలు అవుతుంది. జ్ఞానదాత అయిన గురువు వీరి అందరికంటే శ్రేష్ఠుడు. గురువును మించిన గొప్పవ్యక్తి ఎవ్వరూ లేరు. ఉండబోరు. కాబట్టి మనుష్యుడు పైన చెప్పిన గురువు వశంలో ఉండాలి. వారికి శుశ్రూష చేయుట ముఖ్యంగా భావించాలి. వారిని అవమానించటంచేత నరకం కలుగుతుంది. ఇందులో సంశయం లేదు. అంగం ఏదోఒకటి లోపించిన వారిని శరీరంలో ఏదో ఒక అవయవం పెద్దదిగా ఉన్నవారిని,

---

* ఏతద్దేశప్రసూతస్య సకాశాదగ్రజన్మనః ।
స్వం చరిత్రం చ గృహ్ణీయుః పృథివ్యాం సర్వమానవాః ॥

**ఆచారః ప్రథమో ధర్మో హ్యహింసా సత్యమేవ చ ।
దానం చైవ యథాశక్తి నియమాశ్చ యమైః సహ ॥

విద్యలేనివారిని, రూపం ,ధనంలేనివారిని హీనజాతి వారిని ఆక్షేపించరాదు. తిట్టేవాడు చేసిన పుణ్యం తిట్లు తినేవానికి పోతుంది. తిట్లుతినే వాని పాపం శపించేవానిని చేరుతుంది. నాస్తికత్వం, వేదాలను నిందించటం, దేవతలపైన దోషాలను ఆరోపించటం, ద్వేషం, డంబం, అభిమానం, కోపం కారిన్యం అనే వానిని వదలి వేయాలి."

అగ్నిహోత్రవిధి, దాని మాహాత్మ్యము

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! హోమం బ్రాహ్మణులు ఎలా చేయాలి ? క్షత్రియులు ఎలా చేయాలి? వైశ్యులు ఎలా చేయాలి ? హోమం ఎట్లా చేస్తే మేలు కలిగిస్తుంది ? ప్రభూ! అగ్నులెన్ని ? వాటి స్వరూపాలు ఏమిటి? వాటి స్థానం ఎక్కడ దేనికి ఉంటుంది? అగ్నిహోత్రి ఏ అగ్నిలో హోమం చేస్తే ఏ స్థానం పొందుతాడు? అనఘా! పూర్వకాలంలో అగ్ని హోత్రం ఏనిమిత్తం వల్ల ఉత్పన్నం అయింది? దేవతలకు ఏవిధానంతో హోమం చేస్తారు? దానితో దేవతలు ఎలా ప్రీతులు అవుతారు? శ్రీకృష్ణా! శాస్త్రవిధిననుసరించి మంత్రాలతో పూజితాలయిన మూడు అగ్నులు అగ్నిహోత్రం చేసిన వానికి ఎలాంటి ఉత్తమగతిని కల్పిస్తాయి మూడగ్నుల స్వరూపం తెలియక శాస్త్ర విరుద్ధంగా హోమం చేసినా, వాని ఉపాసనలో దోషం కలిగినా అహితాగ్నికి ఎలాంటి ఉత్తమగతిని కల్పిస్తాయి. ? దేవా! అగ్నిపూజ చేయనిపాపాత్ముడు ఎలాంటి జన్మ ఎత్తుతాడు ? సర్వజ్ఞా! సర్వాధికా! భక్తితో నిన్ను శరణందిన నాకు సంగ్రహంగా చెప్పవలసింది."

శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! మహాపుణ్యమూ, ప్రజకు ధర్మామృతము అయినదాన్ని విను ఇది ధర్మపరులు అగ్నిహోత్రులు అయిన బ్రాహ్మణులను తరింపజేస్తుంది. మహాతేజస్వీ! యుధిష్ఠిరా! నేను మొదట బ్రహ్మనయి లోకాలను సృజించాను. మొదట లోకాలకు హితం కోరి ముఖాన్నుంచి అగ్నిని సృష్టించాను. నేను సర్వ భూతాలకు ముందుగా నిర్మించటంవల్ల ఆయనను పురాణాలు తెలిసిన విద్వాంసులు అగ్ని అని చెప్పారు. సమస్త కార్యాల్లో ప్రజ్వలించే ఈయనకు మొట్ట మొదట ఆహుతిని ఇస్తారు. అందువల్ల అయనను అగ్ని అని చెపుతారు. రాజా! చక్కగా పూజితుడయి విప్రులను అగ్రగతికి (పరమపదానికి) చేరుస్తాడు. ఆవిధంగా అగ్రగతికి తీసుకు పోవటం వల్ల దేవతల్లో ఈయనను అగ్ని అని వ్యవహరిస్తారు. నరోత్తమా! విధిని అతిక్రమించి హోమంచేస్తే యజమానిని ఒక్కక్షణంలో భక్షిస్తాడు. కాబట్టి అగ్నిని క్రవ్యాదుడు అని చెపుతారు. రాజా! సర్వభూతాత్మకుడయిన ఈయన దేవతలకు ముఖమయినవాడు ఇంద్రియాలు మనస్సు, బుద్ధులను అదుపులో ఉంచుకున్న సిద్ధులు, సప్తర్షిసమూహం అగ్నిని అర్చించటంలో తత్పరులయి అమరుల సాయుజ్యాన్ని పొందారు. రాజా! ఇప్పుడు ఏకాగ్రచిత్తంతో అగ్నిహోత్ర ప్రకారాన్ని విను, మూడు అగ్నులకు గుణానుసారం కలిగిన నామాలను చెపుతాను. గృహాలకు పతికావటం గృహపత్యం అని చెపుతారు. గృహపత్యం కలగటం వల్ల అగ్నికి గార్హపత్యత సిద్ధిస్తుంది. అందువల్ల గార్హపత్యాగ్ని అంటారు. యజమానిని దక్షిణ మార్గంలో స్వర్గానికి తీసుకుపోతాడు కాబట్టి దక్షిణ దిక్కులో నివసించే

అగ్నిని ద్విజులు దక్షిణాగ్ని అన్నారు. ఆహుతి అనేశబ్దం సర్వ వాచకం హవ్యాన్ని వహనం అంటారు. సర్వవిధాల హవ్యాన్ని స్వీకరించే అగ్నిని ఆహవనీయాగ్ని అంటారు. గార్హపత్యాగ్ని బ్రహ్మస్వరూపం ఆయన బ్రహ్మనుంచే జనించాడు. క్రోధ రూపం ప్రచండం కావటం వల్ల దక్షిణాగ్ని రుద్రస్వరూపం. ఆరంభం నుంచి అంతందాకా ఆహుతులను వేయటం వల్ల ఆహవనీయాగ్నిని నేనే అవుతాను. ఆహవనీయాగ్నిలో హోమం చేసే భక్తిగలనరుడు ఋషి సమూహాలతో గూడా భూమిని, అంతరిక్షాన్ని, స్వర్గాన్ని జయిస్తాడు. యజ్ఞాల్లో అన్నివైపులనుంచి అగ్నిముఖంలో ఆహుతులు వేస్తారు. అందువల్ల కూడా మహాతేజస్వి అయిన అగ్ని ఆహవనీయ మనే పేరు పొందాడు. అగ్నిహోత్రంలోగాని, ఇతరమయిన యజ్ఞాల్లోగాని హోమారంభంలోనే అగ్నిలో సర్వవిధాలయిన ఆహుతులను వేస్తారు. ఇందువల్ల కూడా ఆయన్ను ఆహవనీయాగ్ని అంటారు.

నరనాథా ! ఆత్మవేత్తలు ఆధ్యాత్మికం, ఆదిదైవం, ఆధిభౌతికం అని మూడు రకాల దుఃఖాన్ని చెప్పారు. యధావిధిగా హోమం చేయటంవల్ల అగ్ని యజమానిని ఈ మూడు రకాల దుఃఖాలనుంచి రక్షిస్తాడు. అందువల్ల ఆ వనిని వేదంలో అగ్నిహోత్ర మనేపేరు పెట్టారు. లోకాలు సృష్టించిన బ్రహ్మదేవుడు ఆ అగ్నిహోత్రాన్ని సృష్టించాడు. వేదాలు, అగ్ని హోత్రం స్వయంగానే జనించాయి. వేదాధ్యయన ఫలం అగ్ని హోత్రాలు (అంటే వేదాధ్యయనం చేసి హోమం చేయని వాని అధ్యయనం నిష్ఫలం అని అర్థం) శాస్త్ర జ్ఞాన ఫలం శీలం, సదాచారం. స్త్రీ ఫలం రతి, పుత్రులు. ధనఫలం దానం చేయటం, అనుభవించటం. మూడువేదాల మంత్రాల సమన్వయంతో అగ్నిహోత్రం ప్రవర్తిస్తుంది. ఋగ్వేదం యజుర్వేదం, సామవేదాల పవిత్ర మంత్రాలతో మీమాంసా సూత్రాలతో అగ్ని హోత్రకర్మను ప్రతిపాదిస్తారు. నరపతీ! వసంత ఋతువును బ్రాహ్మణస్వరూపంగా తెలుసుకోవాలి. ఆయన వేదానికి జన్మస్థానం అని చెపుతారు. అందువల్ల బ్రాహ్మణుడు వసంత ఋతువులో అగ్ని స్థాపనచేయాలి. అనఘా! వసంత ఋతువులో అగ్న్యాధానంచేసే బ్రాహ్మణునికి సంపద వృద్ధి చెందుతుంది. వేద జ్ఞానం కూడా పెంపొందుతుంది. రాజా! క్షత్రియుడు గ్రీష్మఋతువులో అగ్న్యాధానం చేయాలి గ్రీష్మఋతువులో అగ్నిని స్థాపించే క్షత్రియునికి సంపద, సంతతి, పశువులు, ధనం, తేజస్సు, బలం, యశస్సు అభివృద్ధి చెందుతాయి. శరత్కాల రాత్రి స్వాత్తుగా వైశ్యస్వరూపం కాబట్టి శరదృతువులో వైశ్యుడు అగ్నిస్థాపన చేయాలి. ఆ సమయంలో స్థాపితమయిన అగ్నిని వైశ్యాగ్ని అంటారు పాండునందనా! శరదృతువులో అగ్న్యాధానం చేసే వైశ్యునికి సంపద, సంతతి ఆయువు, పశువులు, ధనం పెంపొందుతాయి.

నానావిధరసాలు, నేయి మొదలయిన జిడ్డు పదార్థాలు, గంధాలు , రత్నాలు, మణులు, బంగారం, లోహాలు అగ్ని హోత్రుని కోసమే వీర్పడ్డాయి. ఆయుర్వేదం, ధనుర్వేదం మీమాంస, విస్తారమయిన న్యాయశాస్త్రం, ధర్మశాస్త్రం అగ్నిహోత్రం కోసమే నిర్మితాలయ్యాయి. ఛందశ్శాస్త్రం, శిక్ష వ్యాకరణాలు, జ్యోతిశ్శాస్త్రం, నిరుక్తం అనే వాటిని అగ్నిహోత్రునికోసమే వీర్పరిచారు. ఇతిహాసాలు పురాణాలు, గాధలు, ఉపనిషత్తులు, అధర్వవేదకర్మలు అగ్నిహోత్రర్థమే కలిగాయి. పావకహితా! తిధులు, నక్షత్రాలు, యోగాలు, ముహూర్తం, కరణ స్వరూపాలయిన కాలాన్ని తెలుసుకోవటానికి

పూర్వకాలంలో జ్యోతిశ్శాస్త్రాన్ని వీర్పరిచారు. ఋగ్వేద యజుర్వేద సామవేద మంత్రాల ఛందస్సు తెలియటానికి సంశయ వికల్పాల నిరాకరణ పూర్వకంగా వాటి తత్వజ్ఞానంకోసం ఛందశ్శాస్త్రరచన జరిగింది. వర్ణాలు, అక్షరాలు, పదాలు అర్థాలు సంధులు, లింగాలు,నామవాచకాలు, ధాతువులు తెలుసుకోవటానికి పూర్వకాలంలో వ్యాకరణశాస్త్రం నిర్మితమయింది. యూపం, వేది, యజ్ఞ స్వరూపం తెలియటం కోసం ప్రోక్షణం, క్షరణం (చరువును వండటం) మొదలయిన కర్తవ్యకర్మలు తెలుసుకోవటానికి యజ్ఞానికి దేవతలకు గల సంబంధం తెలియటానికి శిక్ష అనే వేదాంగాన్ని రచించారు. యజ్ఞపాత్రలు శుద్ధిచేయటానికి, యజ్ఞానికి కావలసిన సామగ్రిని సంపాదించటానికి, సమస్తమయిన యజ్ఞాలలోని వికల్పవిధానాలను తెలుసుకోవటానికి పూర్వం కల్పాన్ని చెప్పారు. సమస్త వేదాలలో ప్రయోగించిన నామ ధాతు వికల్పాల తత్వార్థాన్ని నిశ్చయించటానికి ఋక్తి శాస్త్రాన్ని నిర్మించారు. బ్రహ్మదేవుడు, యజ్ఞవేదికోసం యజ్ఞ సంభారాలకోసం పృథివిని సృష్టించాడు. సమిధలు, యూపాలకోసం వృక్షాలను సృజించాడు. గోఘృతం గో దక్షిణ లేకుండా యజ్ఞం జరగదు. అందుకని ఆవులు ఉద్భవించాయి. యజ్ఞపాత్రలు, కడవలకోసం బంగారం వెండి వీర్పడ్డాయి.

హోమకుండానికి నాల్గువైపులా పరచటానికి, రాక్షసుల బారినుండి యజ్ఞాన్ని రక్షించటానికి దర్భల సృష్టి జరిగింది పూజకోసం బ్రాహ్మణులను, నక్షత్రాలను, స్వర్గంలో దేవతలను బ్రహ్మ సృష్టించాడు. సమస్త రక్షణ కోసం క్షత్రియుల సృష్టి జరిగింది. కృషి గోరక్షణ, వాణిజ్యాదులయిన జీవికా సాధన కోసం వైశ్యుల ఉత్పత్తి జరిగింది. వర్ణత్రయ సేవకోసం బ్రహ్మ శూద్రులను సృష్టించాడు. శాస్త్రానుసారం అగ్నిని పూజించే బ్రాహ్మణుల ద్వారా దానం, హోమం, యజ్ఞం, అధ్యయనం అనే సమస్త కర్మలు పరిపూర్ణం అవుతాయి. రాజా! ఈ రీతిగా బ్రాహ్మణులు చేసే యజ్ఞాల, ఉద్యానవన నిర్మాణం, బావులు త్రవ్వించటం అనే ఇష్టా పూర్తాల పుణ్యాన్ని నేను సూర్యమండలంలో స్థాపిస్తాను. నేను ఆదిత్యునిలో స్థాపించిన లోకుల పుణ్యాన్ని అగ్నిహోత్రుల సుకృతాన్ని సూర్యుడు వేలకిరణాలతో ధరిస్తాడు. కాబట్టి రాజా! పరదేశాల్లో నివసించని బ్రాహ్మణులు ఊర్ధ్వగతిని పొందగోరేవారు ప్రతినిత్యం శాస్త్రానుసారం అగ్నిలో హోమం చేయాలి యుధిష్ఠిరా! తననువలె అగ్ని హోత్రుని అవమానించరాదు. యుధిష్ఠిరా! ఈ అగ్నిహోత్రాన్ని ఒక్కక్షణంకూడా విడువరాదు. బాల్యం నుంచే అగ్నిని సేవించే వారు, శూద్రాన్నం తిననివారు కోపం, లోభం వదలిన వారు, ఉదయాన్నే స్నానంచేసేవారు, జితేంద్రియులయి శాస్త్రానుసారం అగ్నిహోత్రంలో హోమం చేసేవారు, ఎల్లప్పుడు అతిధి సేవా పరాయణులు, శాంత స్వభావులు, కాలాలు రెండింటిలోను ధ్యాన పరాయణులు అయిన పుణ్యాత్ములు మరణానంతరం ఆదిత్య మండలాన్ని ఛేదించుకొని జనన మరణ రూప సంసారంలోనికి రాకుండా నా పరమపదాన్ని పొందుతారు. వేదాలను నిందించే వారు, అజ్ఞానంతో శ్రుతిపై దోష దూషణ చేసే కొంతమందిమూర్ఖులు శ్రుతుల ప్రమాణం కాదంటారు. వాళ్లు ఈలోకంలో గూడా అధోగతి పాలవుతారు. వేదాలను ఇతిహాసాలను ప్రమాణాలుగా స్వీకరించే ద్విజులు నిత్యం ఆస్తిక్యబుద్ధి కలవారు కాబట్టి దైవ సాయుజ్యం పొందుతారు."

చాంద్రాయణవ్రతవిధి - ప్రాయశ్చిత్తరూపమయిన కర్మవిధానము - దాని మహిమ

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! గరుడధ్వజా! చక్రాయుధా! శ్రీకృష్ణా! భగవానుడా! పుణ్యమయిన చాంద్రాయణ వ్రత విధానం నాకు చెప్పవలసింది." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "పాండుసుతా! సర్వపాపాలను పోగొట్టే చాంద్రాయణవ్రతాన్ని గురించి యథార్థాన్ని విను, పాపాత్ములను గూడా పవిత్రం చేసే దానినివూర్తిగా చెవుతాను. ఉత్తమ నియమాలను పాటించే బ్రాహ్మణుడుగాని క్షత్రియుడుగాని, వైశ్యుడుగాని ఈ చాంద్రాయణ వ్రతాన్ని యథావిధిగా నిర్వర్తించదలచుకుంటే మొట్టమొదట చేయవలసిన పని నియమాన్ని అనుసరిస్తూ పంచగవ్యంతో శరీరాంతర్భాగాన్ని పవిత్రం చేసుకోవాలి. కృష్ణ పక్షం అయిన తరువాత తలను, గడ్డాన్ని క్షవరం చేయించుకోవాలి. తెల్లని వస్త్రాలు ధరించి శుచియై ముంజగడ్డితో మొలత్రాడు కట్టుకోవాలి. మోదుగు దండాన్ని చేత దాల్చి బ్రహ్మ చర్య వ్రతం పాటించాలి. బ్రాహ్మణుడు మొదటి రోజు ఉపవాసంఉండి శుక్ల పక్షంలో పాడ్యమినాడు నదీ సంగమంలోగాని, తీర్థాలలోగాని, పవిత్ర ప్రదేశాలలో, ఇంట్లోగాని ఈ వ్రతాన్ని ఆరంభించాలి. మొదటి రోజున నిత్యనియమాలను చేసి ఒక వేదిలో అగ్నిని స్థాపించాలి. దాంట్లో క్రమంగా అఘోరాలు, ఆజ్యభాగాలు, ప్రణవం, మహావ్యాహృతులు, పంచ వారుణ మంత్రాలతో హోమం చేసి సత్యం, విష్ణువు, బ్రహ్మర్షి సమూహం, బ్రహ్మ, విశ్వేదేవులు, ప్రజాపతి అనే ఆరుగురు దేవతలకయి హోమం చేయాలి. చివరకు ప్రాయశ్చిత్తహోమం చేయాలి. తరువాత శాంతిక పౌష్టిక కర్మలను చేసి హోమాదులను సమాప్తం చేయాలి. అగ్నికి సోమునికి నమస్కరించి యథావిధిగా భస్మధారణ చేసి నదికి వెళ్లి నిర్మలమయిన మనసుతో సోమునకు వరుణునికి, ఆదిత్యునికి నమస్కరించి ఏకాగ్రచిత్తంతో స్నానంచేయాలి. దీని తరువాత నీటినుంచి బయటకు వచ్చి తూర్పుముఖంగా కూర్చుని ప్రాణాయామం చేసి కుశ పవిత్రంతో తన శరీరాన్ని మార్జనం చేసుకోవాలి. తరువాత ఆచమనం చేసి రెండు చేతులు పైకెత్తి సూర్యదర్శనం చేయాలి. చేతులు బోడించి నిలిచి ప్రదక్షిణం చేయాలి. అంతట భోజనం చేయటానికి ముందే నారాయణ సూక్తంగాని రుద్రసూక్తంగాని, బ్రహ్మను గురించిన మంత్రాలనుగాని, వరుణ మంత్ర సూక్తంగాని జరిపించాలి. లేక వీరఘ్నం ఋష్యం అఘమర్షణ గాయత్రి లేక నాకు సంబధించిన వైష్ణవగాయత్రి వందగాని, ఎనిమిదివందలుగాని సహస్రంగాని, ఇంకా ఎక్కువగాని చెయ్యాలి.

అంతట పవిత్రుడు ఏకాగ్రచిత్తుడయి పాయసంగాని, గోధుమ పిండిగాని ప్రయత్న పూర్వకంగా వండించాలి. అలాకాక పోతే బంగారు, వెండి, రాగిలోహాల పాత్రను గాని, మట్టి పాత్రను గాని, మేడి కర్రపాత్రనుగాని, యజ్ఞానికి ఉపయోగపడే వృక్షపు శుభ్రమయిన ఆకులతో దొన్నెను చేసి దాన్ని చేతితో మూసిపట్టుకొని ఏకాగ్రచిత్తంతో భిక్షాటనం చేయాలి ఇంద్రియాలను నిశ్చలం చేసి మౌనంగా ఉండి బ్రాహ్మణుల ఇండ్లను వీడింటికి మాత్రం భిక్షకు వెళ్ళాలి. అక్కడ అవును పాలు పితికితే పట్టేటంతకాలమే గృహస్థగృహంముందు భిక్షకోసం నిలవాలి. భిక్షచేసే వ్యక్తి నవ్వరాదు. దిక్కులు చూడరాదు. స్త్రీలతో మాట్లాడరాదు మూత్రం, అమేధ్యం, చండాలుని, ముట్టయిన స్త్రీని

పతితుని, కుక్కను చూస్తే ఆ దోష పరిహారానికి సూర్యదర్శనం చేయాలి. తరువాత నివాసానికి వచ్చి భిక్షను నేలమీద ఉంచి, మోకాళ్ళ వద్దనుంచి క్రిందికి పాదాలను మోచేతులనుంచి క్రిందికి చేతులను కడుగుకొని, ఆ జలంతో ఆచమించి అగ్నిని, విప్రులను పూజించాలి. తెచ్చిన భిక్షను అయిదుగాని ఏడుగాని భాగాలుచేసి, వాటితో ముద్దలుచేసి ఒక ముద్దను సూర్యునికి నివేదించాలి. బ్రహ్మకు, అగ్నికి, సోమునికి, వరుణునికి విశ్వేదేవతలకు క్రమంగా ఒక్కొక్క ముద్దను నివేదించాలి. మిగిలిన భిక్షను నోటపట్టేంతదాన్ని చేయాలి. కుడిచేతి మునివ్రేళ్ళమీద ఉన్న ముద్దను గాయత్రీ మంత్రంతో అభిమంత్రించాలి. తూర్పుముఖంగా కూర్చుని పవిత్రుడయి మూడు వ్రేళ్ళతో ఆ ముద్దను భుజించాలి. చంద్రుడు కళలతో పెరిగే కొద్ది ముద్దలు రోజురోజుకు పెరుగుతాయి. అలాగే చంద్రుడు క్షీణించే రోజులో ముద్దల సంఖ్య తగ్గుతుంది. శుక్ల ప్రతిపత్తునాడు ఒకటి విదియనాడు రెండుగా పూర్ణిమకు ముద్దలు పెరగాలి. కృష్ణ ప్రతిపత్తునుంచి చతుర్దశి రోజుకు ఒక ముద్దకు తగ్గించాలి. అమావాస్యనాడు ఉపవాసం పెట్టాలి. ఈ రీతిగా ఒక మాసం చేయాలి. ఈ వ్రతానుష్ఠాత రోజు మూడు సార్లుగాని, రెండు సార్లుగాని స్నానం చేయాలని చెప్పారు. అతడు నిత్యం బ్రహ్మచారిగా ఉండాలి తర్పణానికి ముందు వస్త్రాన్ని పిండరాదు.

పగలు స్థిరంగా ఒకేచోట ఉండరాదు. రాత్రి వీరాసనంలో కూర్చోవాలి. లేకపోతే అరుగుమీద గాని చెట్టు క్రిందగాని పడుకోవాలి. పాండు నందనా ! ఆ వ్రతానుష్ఠాత నార బట్టనుగాని, నూలు బట్టనుగాని వస్త్రంగా ఉపయోగించుకోవాలి. అలాగే చాంద్రాయణవ్రతం ఒక మాసం పూర్తి అయిన తరువాత బ్రాహ్మణులకు భక్తితో భోజనం పెట్టి వారికి దక్షిణలు ఇవ్వాలి. చాంద్రాయణ వ్రతం చేయటంచేత వ్రతం ఆచరించినవాని పాపం అంతా అగ్నిలో కర్ర దగ్గం అయినట్లు భస్మం అవుతుంది. బ్రాహ్మణహత్య, గోహత్య, బంగారం దొంగిలించటం, భ్రూణహత్య, మద్యపానం, గురుభార్యాగమనం మొదలయిన మహాపాపాలు అన్నీ గూడా గాలికి భూరేణువులు ఎగిరిపోయినట్లు చాంద్రాయణ వ్రతాచరణం చేత నశిస్తాయి. దూడను ఈనిన తరువాత పదిరోజులుకాని ఆవుపాలను, ఒంటెపాలను, గొర్రెపాలను, సూతకాన్ని జాతాశౌచాన్ని త్రాగితే తింటే ఆ పాపం పోవటానికి చాంద్రాయణ వ్రతం చేయాలి. ఉపపాతకి పెట్టే అన్నాన్ని, పతితుని అన్నాన్ని, శూద్రుడు తినగా మిగిలిన అన్నాన్ని తింటే చాంద్రాయణ వ్రతం చేయాలి. ఆకాశంలో ఉన్నట్టు చెట్టుకు వ్రేలాడుతున్న ఫలాదులను, చేతిమీద ఉంచినదాన్ని ఇతరులచేతిలో ఉన్నదాన్ని క్రింద జారిపడిన దానిని తింటే చాంద్రాయణ వ్రతం చేయాలి. అక్కకు పెళ్ళికాక ముందే వివాహిత అయిన చెల్లెలు పెట్టే అన్నంగాని, మరణించిన అన్న భార్యను వివాహం చేసుకున్న వాని అన్నాన్ని, అన్నకు పెండ్లికాకముందే పెళ్లి చేసుకున్న తమ్ముని అన్నాన్ని, అవివాహితుడయిన అన్న పెట్టే అన్నాన్ని, కుండుని, గోళకుని అన్నాలను, పూజారి అన్నాన్ని పురోహితుని అన్నాన్ని తింటే చాంద్రాయణవ్రతం చేయాలి. మద్యాన్ని, ఆసవాన్ని, విషాన్ని, నేతిని, లక్కను, ఉప్పును, నూనెలను అమ్మే బ్రాహ్మణుడు చాంద్రాయణ వ్రతం చేయాలి. ఏకోద్దిష్ట శ్రాద్ధాన్నం తినేవాడు, పెద్ద గుంపుమధ్య భోజనం చేసేవాడు, పగిలిన పాత్రలలో భుజించే బ్రాహ్మణుడు చాంద్రాయణ

వ్రతం చేయాలి. ఉపనయనం కాని బాలకునితో భుజించేవాడు, స్త్రీతో కూడా భోజనం చేసేవాడు, పెళ్లికాని పిల్లతో కలిసి భోజనంచేసే బ్రాహ్మణుడు చాంద్రాయణ వ్రతం చేయాలి. అజ్ఞానం వల్ల తన ఎంగిలిని ఇంకొకరి భోజనంలో కలిపేవాడు, మోహంతో ఇతరులకు పెట్టే బ్రాహ్మణుడు చాంద్రాయణం చెయ్యాలి. సొరకాయను, కోశాతకాన్ని, నీరుల్లి, ఎట్టి ఉల్లిని, వెల్లుల్లిని, సర్పాక్షి/ పుట్టగొడుగుని లకునాన్ని, ఉల్లిని తిన్న బ్రాహ్మణుడు చాంద్రాయణ వ్రతం చెయ్యాలి. ముట్టయిన స్త్రీకుక్క, చండాలురు చూచిన అన్నాన్ని తిన్న ద్విజోత్తముడు చాంద్రాయణాన్ని ఆచరించాలి. పాండుపుత్రా! ఈ చాంద్రాయణ వ్రతాన్ని పూర్వం పవిత్రతకోసం మహర్షులు ఆచరించారు. సర్వప్రాణులను ఇది పవిత్రం చేస్తుంది అని చెప్పారు. పైన చెప్పిన రీతిగా దీనిని చేసిన బ్రాహ్మణుడు పవిత్ర చిత్తుడయి నిర్మలమయిన సూర్యతుల్యుడై స్వర్గానికి వెళతాడు."

సర్వహిత ధర్మము - ద్వాదశీవ్రతమాహాత్మ్యము - భగవత్ స్తవము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "సమస్త ప్రాణులకు ప్రభువయినవాడా! సర్వప్రాణులచే నమస్కృతుడా! సమస్తం తెలిసిన శ్రీకృష్ణా! సమస్త ప్రాణులకు మేలుచేసే ధర్మాన్ని మాకు చెప్పవలసింది." శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "యుధిష్ఠిరా! దరిద్రులయిన వారికి గూడా సుఖం కల్గించేది సర్వపాపాలను పోగొట్టేది, స్వర్గాన్ని ప్రసాదించేది చెపుతాను విను. రాజా! ఒక సంవత్సరం దాకా రోజూ ఒక పూట మాత్రమే భోజనం చేస్తూ బ్రహ్మచారిగా ఉంటూ ఇంద్రియాలను జయించి నేలమీదనే పడుకొంటూ కోపాన్ని జయించిన వాడు, పవిత్రుడు, నిత్యం స్నానం చేస్తూ ఆవేశరహితుడు, నిజంచెపుతూ, అసూయ లేకుండా ఉండేవాడు, నాయందే బుద్ధిని నిలిపి నిత్యమూ నన్నే పూజిస్తూ, నేను ప్రధానమయిన విష్ణుగాయత్రీ మంత్రం ఏకాగ్రచిత్తంతో జపిస్తూ ఉండేవాడు, **నమో బ్రహ్మణ్య దేవాయ** అనే మంత్రంతో పలుమారులు నాకు ప్రణమిల్లేవాడు, అగ్రాసనం మీద బ్రాహ్మణుని కూర్చుండబెట్టి, ఆయన భోజనం చేసిన తరువాత తాను మౌనంగా ఉండి, యవాన్నంగాని, భిక్షగాని, మౌనంగా భుజించేవాడు, **నమోఽస్తు వాసుదేవాయ** అనే మంత్రం చెప్పి బ్రాహ్మణపాదాలకు నమస్కరించే వాడు, ప్రతిమాసంలోను పవిత్రులయిన బ్రాహ్మణులకు భోజనం పెట్టి సంవత్సరం పూర్తి అయిన తరువాత ఈ వ్రతానికి దక్షిణగా నవనీతమయిన ధేనువునుగాని, తిలధేనువునుగాని ఇచ్చేవాడు బ్రాహ్మణునిచేతి నుంచి సువర్ణంతో గాని, జలం తీసుకొని తనమీద చల్లుకొనే మానవునికి కలిగే పుణ్యఫలం చెపుతాను విను. అలాంటి పుణ్యాత్ముడు కడచిన పది జన్మలలో తెలిసిగాని, తెలియకగాని చేసినపాపం అయినా నశిస్తుంది. సందేహంలేదు." యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! ఉపవాసాలు అన్నింటిలో గొప్పది మహాఫలం ఇచ్చేది లోకంలో గొప్పమేలు కలిగించేది చెప్పగోరుతాను."

శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! యుధిష్ఠిరా! పూర్వం నేను నాభక్తుడయిన నారదునికి చెప్పిన దానిని నాభక్తుడివయిన నీకు చెపుతాను విను. నరనాథా! స్నానాదులతో పవిత్రుడయి భక్తితో నా పంచమినాడు, మూడు పూటలా నన్ను అర్చిస్తూ ఉపవాసం చేసేవాడు సమస్త యజ్ఞాలు

చేసిన ఫలం పొంది నా లోకంలో ఉంటాడు. రాజా! అమావాస్య, పూర్ణిమ అనే రెండు పర్వాలు, శుక్ల కృష్ణ పక్షాలలోని ద్వాదశులు, శ్రవణా నక్షత్రం అనే అయిదురోజులు నా పంచములుగా ప్రసిద్ధాలు. విశేషించి ఇవి నాకు ఇష్టమయినవి. కాబట్టి నాయందు లగ్నం చేసిన బ్రాహ్మణశ్రేష్ఠులు ఈ రోజులలో నాకు ప్రియాన్ని కలిగించటానికి తప్పక ఉపవాసం చేయాలి. నరశ్రేష్ఠా! ఆశక్తుడయితే ద్వాదశి నాడయినా ఉపవాసం చేయాలి. దానిచేత నేను పరమ ప్రీతిని పొందుతాను. మార్గశిర మాసంలో ద్వాదశినాడు రేయింబవళ్ళు ఉపవాసం చేసి కేశవనామంతో నన్ను పూజించేవాడు అశ్వమేధ యాగ ఫలం పొందుతాడు. పుష్యమాసంలో ద్వాదశినాడు ఉపవాసం చేసి నారాయణ నామంతో నన్ను పూజించేవాడు అశ్వమేధ యజ్ఞఫలం పొందుతాడు. రాజా! ఫాల్గుణ మాసంలో ద్వాదశినాడు ఉపవాసం ఉండి గోవింద నామంతో నన్ను పూజించేవాడు అతిరాత్ర యాగఫలాన్ని పొందుతాడు. చైత్రమాసంలో ద్వాదశ తిథినాడు ఉపవాసం చేసి విష్ణు నామంతో నన్ను పూజించేవాడు, పౌండరీక యాగ ఫలాన్ని పొందుతాడు. పాండవా! వైశాఖ మాసంలో ద్వాదశినాడు ఉపవాసం చేసి నన్ను పూజించేవాడు అగ్నిష్టోమయాగ ఫలాన్ని పొందుతాడు. రాజా! జ్యేష్ఠమాసంలో ద్వాదశినాడు ఉపవాసం చేసి నన్ను త్రివిక్రమనామంతో అర్చించేవాడు గోమేధయాగఫలాన్ని పొందుతాడు. భరతవంశశ్రేష్ఠా ! ఆషాఢ మాసంలో ద్వాదశినాడు ఉపవాసం ఉండి నన్ను వామన నామంతో పూజించేవాడు నరమేధ యాగఫలాన్ని పొందుతాడు. రాజా! శ్రావణమాసంలో ద్వాదశినాడు ఉపవాసం చేసి శ్రీధరుడు అనే పేరుగల నన్ను పూజించేవాడు పంచయజ్ఞాల ఫలం పొందుతాడు.

ఆశ్వయుజమాసంలో ద్వాదశినాడు ఉపవాసం చేసి నన్ను పద్మనాభనామంతో పూజించేవానికి వేయి గోదానాల ఫలం కలుగుతుంది. కార్తికమాసంలో ద్వాదశి దినాన ఉపవాసం చేసి దామోదరుడనే పేరుగల నన్ను పూజించేవానికి సమస్త క్రతువులు చేసిన ఫలం లభిస్తుంది. పాండసుతా! ద్వాదశినాడు కేవలం ఉపవాసం చేయటం వల్ల పూర్వం చెప్పిన ఫలం సగం లభిస్తుంది. ఈ విధంగానే శ్రావణమాసంలోకూడా భక్తుడయిన నరుడు నన్ను అర్చించాలి. అతడు నా సాలోక్యముక్తిని పొందుతాడు. ఈ విషయంలో ఆలోచించవద్దు. ఎలాంటి పరాకు లేకుండా ప్రతిమాసంలో నన్ను అర్చించి ఒక సంవత్సరం అయిన తరువాత ఇంకో సంవత్సరం నన్ను పూజించాలి. ఈ రీతిగా నేనే శరణంగా గలిగి నాభక్తుడయి వన్నెండు సంవత్సరాలు నన్ను నిర్విఘ్నంగా పూజించేవాడు. నా సాయుజ్యాన్ని పొందుతాడు. రాజా! ద్వాదశినాడు వేద సంహితతో గూడా నను సంతోషంతో పూజించేవాడు వెనుక చెప్పిన ఫలం పొందుతాడు. సందేహం లేదు. ద్వాదశినాడు నాకు గంధం, పూలు, పండ్లు, జలం, పత్రాలు, దుంపలు ఇచ్చే వానితో సమానంగా నాకు ఇష్టుడయినవాడు ఇంకొకడు లేడు. నరోత్తమా! ఈ విధానంలో నాభక్తులయిన ఇంద్రాది దేవతలు నన్ను పూజించి స్వర్గసుఖాలను అనుభవిస్తున్నారు."

వైశంపాయనుడు చెప్పాడు "జనమేజయా! దేవదేవుడు కృష్ణుడు ఇలా చెప్పగా పాండు పుత్రుడు ధర్మదేవతాత్మజుడు అయిన యుధిష్ఠిరుడు నమస్కరిస్తూ ఇలా స్తోత్రం చేశాడు "హృషీకేశా ! నీవు సర్వలోకాలకు ప్రభువువు. దేవాధిపతివి సహస్రశిరస్సులు గలవాడవు. వేలకన్నులు గలవాడివి

అలాంటి నీకు నమస్కారం. మూడు వేదాలు నీ స్వరూపం. మూడు లోకాలకు నాధుడవు. మూడు వేదాలచేత స్తుతింపబడే నీకు అనేక నమస్కారాలు. యజ్ఞస్వరూపుడివి. యజ్ఞాధిపతివి అయిన నీకు నమస్కారాలు. నీవు నాలుగురూపాలు దాల్చేవాడివి. నాలుగు చేతులు గలవాడవు. చతుర్వ్యూహరూపుడివి. లోక స్వరూపుడవు. లోకాలు సృష్టించేవాడివి. లోకాలకు నివాసమయిన నీకు నమస్సులు. సృష్టి సంహారాలు చేసేవాడివి. నరశ్రేష్ఠుడివి. భక్త ప్రియుడివి. అయిన నీకు అనేక నమస్కారాలు. జనులకు ఇష్టుడవయిన నీకు నమస్కారం. భక్తులయందు వాత్సల్యంగల నీకు నమస్సు. బ్రహ్మదేవునికి నివాసం నీవే. బ్రహ్మకు ప్రభువువయిన నీకు అనేక నమస్కారాలు. రుద్రరూపా! నీకు నమస్కారం. రౌద్ర కర్మలయందు ఆసక్తి గల నీకు నమస్సు. వంచయజ్ఞ స్వరూపా ! నీకు నమస్సులు. సర్వయజ్ఞమయా! నీకు అనేక వందనాలు. ప్రియమయిన శ్రీకృష్ణా! నీకు నమస్సు. స్వామీ ! శ్రీకృష్ణా నీకు వలుమారులు నమస్సులు, యోగిప్రియా! నీకు నమస్కారం. యోగాధిపతీ ! నీకు నమస్సులు హయగ్రీవస్వామీ! నీకు నమస్కారం చక్రపాణీ! నీకు అనేక నమస్సులు. పంచభూత స్వరూపా ! నీకు నమస్సు. పంచాయుధధారీ! నీకు అనేక నమస్కారాలు."

వైశంపాయనుడు చెప్పాడు. "రాజా! భక్తితో కంఠంబొంగురు పోతూ యుధిష్ఠిరుడు ఈ రీతిగా స్తోత్రం చేస్తే సంప్రీత మనస్కుడయి శ్రీకృష్ణుడు ఆయనచేతులు పట్టుకొని అలా చేయవద్దని వారించాడు. భక్తితో వినమ్రుడయిన యుధిష్ఠిరుని అలా నివారించి ఇలా చెప్ప ప్రారంభించాడు. నరశ్రేష్ఠా, ధర్మపుత్రా! రాజా! యుధిష్ఠిరా! పరాయివానివలె నన్ను ఇలా స్తుతిస్తావేమిటి ? మామూలుగా ఉండి వెనకటి వలెనే ప్రశ్నలు అడుగు." యుధిష్ఠిరుడు అడిగాడు. "మానదా! ప్రతిమాసంలో కృష్ణ పక్షంలో నిన్ను ధర్మ సంపన్నంగా ఎలా పూజించాలో చెప్పవలసింది." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు "రాజా! వెనక చెప్పిన రీతిగానే కృష్ణ పక్షంలో ద్వాదశినాడు నన్ను అర్చిస్తే కలిగే మహాఫలం చెపుతాను, వినుము. ఏకాదశినాడు ఉపవాసముండి ద్వాదశినాడు నన్ను పూజించాలి. యధాశక్తిగా మానవుడు భక్తితో బ్రాహ్మణులను పూజించాలి. అతడు దక్షిణామూర్తి రూపుడయిన శివునిగాని, నన్నుగాని పొందుతాడు. లేక గ్రహ నక్షత్రాల పూజలందుకొంటూ చంద్రలోకానికి వెళ్తాడు ఇందులో సందేహంలేదు."

విషువ యోగములో గ్రహసమయములో దానమహిమ.
అశ్వత్థమాహాత్మ్యము తీర్థభూతగుణప్రశంస, ఉత్తమప్రాయశ్చిత్తము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవాధిపా! శ్రీకృష్ణ దేవా! విషువయోగంలోను, సూర్యచంద్రగ్రహణాల్లోను చేసిన దాన ఫలాన్ని చెప్పవలసింది. శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. రాజా! వినుము. విషువయోగంలో, చంద్రసూర్యగ్రహణాలలో వ్యతీపాత యోగంలో ఉత్తరాయణ దక్షిణాయన ఆరంభసమయాల్లో చేసిన దానం అక్షయ ఫలదాయకం అవుతుంది. రాజా! ఉత్తరాయణ దక్షిణాయనాలమధ్య రేయింబవళ్లు సమానం అయినప్పుడు ఆ సమయాన్ని విషువయోగం అని చెపుతారు. ఆ రోజు సంధ్యాసమయంలో బ్రహ్మ, నేను, శంకరుడు క్రియా, కరణం కార్యాల ఏకత్వ విషయంలో ఆలోచన

చేయటానికి ఒకసారి కలుస్తాము. రాజా! మేము కలిసే ముహూర్తం కళారహితమయిన పరమపదం అవుతుంది. విషువం అనే పేరుగల ఆ ముహూర్తం పరమ పుణ్యప్రదం అవుతుంది. ఆ సమయాన్ని అక్షరబ్రహ్మమని, పరబ్రహ్మ అని చెపుతారు. ఆ సమయంలో అందరూ పరమపదాన్ని గూర్చి ఆలోచిస్తారు. రాజేంద్రా! దేవతలు, వసువులు, రుద్రులు, పితరులు, అశ్వనీదేవతలు, సాధ్యులు, విశ్వేదేవతలు, గంధర్వులు, సిద్ధులు, బ్రహ్మర్షులు, చంద్రాదిగ్రహాలు, నదులు, సముద్రాలు, మరుత్తులు, అప్సరసలు, నాగులు, యక్షులు, రాక్షసులు, గుహ్యకులు ఇంకాఇతర దేవతలు ఇంద్రియ నిగ్రహంతో ధ్యానతత్పరులై ప్రయత్నపరులై ఉంటారు. యుధిష్ఠిరా! ఆ పుణ్యసమయంలో అన్నం, గోవులు, నువ్వులు, భూమి, కన్యాదానం, ఇల్లు విశ్రమ స్థానం, ధాన్యం, వాహనం, శయనం, ఇంకాదానం చేయదగిన వన్నీ నేను చెప్పిన వస్తువులన్నీ దానం చేయవలసింది. కుంతీనందనా! విషువ సమయాలలో విశేషించి శ్రోత్రియులయిన బ్రాహ్మణులకు ఇచ్చే దానానికి నాశనం ఉండదు. ఆ దానం ప్రతిదినమూ కోటి రెట్లు పెరుగుతుంది. ఆకాశంలో చంద్ర గ్రహణంగాని, సూర్యగ్రహణంగాని కలిగినసమయంలో విష్ణు గాయత్రినిగాని శివగాయత్రినిగాని జపించాలి. భక్తితో గూడి శంఖతూర్యధ్వనుల కంటె గంట ధ్వనులను చేయించే వానికి వచ్చే పుణ్యఫలం వినుము. నాయెదుట గానం చేయటం, హోమం, జపం చేయటం, ఉత్తమమయిన నా నామాలను సంకీర్తనం చేయటం చేత రాహువు బలహీనుడవుతాడు. చంద్రుడు బలవంతుడవుతాడు సూర్య చంద్ర గ్రహణ సమయాల్లో శ్రోత్రియద్విజులకు చేసే దానఫలం వేయి రెట్లయి దాతకు లభిస్తుంది. ఆ దానమహిమ వలన మహాపాతకం చేసినప్పటికి ఆ క్షణంలోనే అతడు పాపరహితుడు, నరశ్రేష్ఠుడు అవుతాడు. చంద్రసూర్యుల సమానకాంతితో విరాజిల్లే విమానంలో ఆ దాత అప్సరసల సమూహాలచేత సేవింపబడుతూ చంద్రపట్టణాన్ని చేరుతాడు. రాజేంద్రా! ఆకాశంలో చంద్రునితో గూడా నక్షత్రగణాలు ఉన్నంత కాలం అతడు చంద్రలోకంలో ఉంటాడు. యుధిష్ఠిరా! తరువాత కాలంలో అక్కడనుంచి ఇహలోకానికి వచ్చి వేదవేదాంగాలు తెలిసిన బ్రాహ్మణుడుగా జన్మించి కోటీశ్వరుడవుతాడు."

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! నీ గాయత్రీజపం ఎలా చెయ్యాలి ? భగవానుడా! దేవాధిపా! దాని ఫలం ఏమిటోనాకు చెప్పవలసింది." శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "రాజా! ద్వాదశినాడు విషువయోగంలో, చంద్రసూర్యగ్రహణకాలంలో, ఉత్తరాయణ దక్షిణాయనారంభాలలో, శ్రవణానక్షత్రంలో రావిచెట్టును దర్శించినపుడు నాదర్శనం చేసినపుడు నా గాయత్రిగాని, **ఓంనమోవాసుదేవాయ** అనే అష్టాక్షర మంత్రాన్ని గాని జపించాలి. అందువల్ల జపం చేసేవాడు ఆర్జించిన పాపం అంతా నశిస్తుందనటంలో సందేహం లేదు."

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా! రావిచెట్టును దర్శించటం నీ దర్శన సమం అవుతుందా ! ఇదినాకు కుతూహలం కల్గిస్తున్నది. కాబట్టి ఆ విషయం చెప్పవలసింది." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! నేను అశ్వత్థవృక్ష రూపంలో ముల్లోకాలను పాలిస్తున్నాను. అశ్వత్థ వృక్షం లేనిచోట నేను ప్రతిష్ఠితుడను కాను. రాజా! నేను ఉన్నచోట అశ్వత్థ వృక్షం ఉంటుంది ఈ అశ్వత్థాన్ని భక్తితో

పూజించేవాడు సాక్షాత్తుగా నన్నే అర్చించిన వాడవుతాడు. కోపంతో ఎవడయినా ఈ చెట్టును కొట్టి వేస్తే నన్నే కొట్టినవాడు అవుతాడు. కాబట్టి రావిచెట్టుకు ప్రదక్షిణం చేయాలి. కాని తెగగొట్టరాదు. వ్రతానికి చేసేపారణ సరళత్వం దేవతాసేవ, గురుశుశ్రూష అనేవి అన్నీ తీర్థాలు అంటారు. తల్లిదండ్రులనేవ, భార్యను సంతోషపెట్టటం గృహస్థ ధర్మం పాటించటం తీర్థం అంటారు. అతిథిపూజలో లగ్నం కావటం పరమతీర్థం అవుతుంది. వేదాధ్యయనం సనాతన తీర్థం. బ్రహ్మచర్యం పాటించటం పరమ తీర్థం అవుతుంది. ఆహవనీయాదులయిన త్రేతాగ్నులు తీర్థం అంటారు. కుంతీనందనా! వీటికి అన్నింటికి మూలం తీర్థం అని తెలుసుకొని మనస్సును అక్కడ నిలపాలి. తీర్థాలకు వెళ్ళు. ధర్మకార్యాలు చేస్తే ధర్మం వర్ధిల్లుతుంది. స్థావరాలు, జంగమాలు అని తీర్థాలు రెండు రకాలని చెప్పారు. జ్ఞాన ప్రాప్తి కలుగుతుంది కనుక స్థావర తీర్థానికంటె జంగమ తీర్థం గొప్పది. భరతవంశీయా! ఈలోకంలో పుణ్యకర్మానుష్ఠానం వలన పరిశుద్ధుడయిన పురుషుని హృదయంలో సర్వతీర్థాలు ఉంటాయి. అందువలన అతడు తీర్థీభూతుడు అని చెపుతారు. గురురూప తీర్థం వలన పరమాత్మ జ్ఞానం కలుగుతుంది. కాబట్టి ఆయనను మించిన తీర్థం ఇంకొకటి లేదు. జ్ఞాన తీర్థం సర్వశ్రేష్ఠ తీర్థం. బ్రహ్మతీర్థం సనాతనమయినది. పాండునందనా! సర్వతీర్థాలలో క్షమాగుణం గొప్పతీర్థం. క్షమగల వారికి ఈ లోకం వరలోకంగూడా సిద్ధిస్తాయి. **గౌరవించినా, అగౌరవించినా, పూజించినా, అవమానించినా, భయపెట్టినా, కోపించని ఓర్పుగలవాడు తీర్థం అని చెపుతారు.** క్షమాగుణమే యజ్ఞం, దానం, యజ్ఞం, దమం, అహింస, ధర్మం ఇంద్రియనిగ్రహం అవుతుంది. క్షమాగుణమే దయ యజ్ఞం అవుతాయి. క్షమచేతనే ఆ జగత్తు ధృతమయి ఉంది.క్షమగల బ్రాహ్మణుడే దేవుడు,క్షమగల బ్రాహ్మణుడే శ్రేష్ఠుడు. క్షమగలవాడు స్వర్గం చేరుతాడు. క్షమగలవారు కీర్తిని పొందుతారు. **క్షమావంతుడు మోక్షం పొందుతాడు.** కాబట్టి ఆయనను సాధువు అంటారు. రాజా! ఆత్మరూపమయిననది పరమ పావన తీర్థం. అది సర్వతీర్థాలలో ప్రధానమయినది. ఆత్మయే ఎల్లప్పుడు యజ్ఞం అని భావిస్తారు. స్వర్గం మోక్షం అనే సమస్తం ఆత్మాధీనాలే. సదాచారపాలనంతో మిక్కిలి నిర్మలమయినవాడు, నత్యం క్షమాగుణంతో సాటిలేని శీతలమయిన వాడు, జ్ఞానం అనే జలంతో నిత్య స్నానం చేసేవానికి జలతీర్థంతో స్నానావసరం ఏమింటుంది ?"

యుధిష్ఠిరుడు అడిగాడు. "భగవానుడా ! దేవశ్రేష్ఠా! నీభక్తుడయిన నాకు సర్వపాపాలు నాశనం చేసే సరళ మయిన ప్రాయశ్చిత్తం చెప్పవలసింది." శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "రాజా! ఇది చాలా రహస్యమయినది. పాపాత్ములకు పాప కార్యాలు చేసేవారికి వినిపింపదగనిది. అధర్మంచేసేవారికి వినిపింపదగనిది అయిన ప్రాయశ్చిత్తం నీకు వినిపిస్తాను. తటస్థవడిన ఎవరయిన బ్రాహ్మణుని చూస్తే వెంటనే నన్ను స్మరించి **నమో బ్రహ్మణ్యదేవాయ** అని వలికి అభివాదం చేయాలి. **'ఓం నమోనారాయణాయ'** అనే అష్టాక్షర మంత్రంతో ప్రదక్షిణం చేయగా సంతుష్టుడయిన ఆ విప్రుని ద్వారా అతని పాపాన్ని నేను పోగొడ్తాను. వరాహం త్రవ్వినచోటి మట్టిని శిరస్సుమీద దాల్చి నూరు ప్రాణాయామాలుచేసిన నరుడు పాప విముక్తుడవుతాడు. సూర్య గ్రహణ సమయంలో తూర్పుకు ప్రవహించే నదీ తీరానికి వెళ్ళినా, ఆలయ సమీపంలో దక్షిణా వర్త శంఖ జలంతో గాని, కపిలగోవు

కొమ్ములతో స్పర్శించిన జలంతోగాని ఒక్కసారి స్నానంచేస్తే అతడు కూడబెట్టుకొన్న పాపం వెంటనే నశిస్తుంది. పూర్ణిమనాడు ఉపవాసం ఉండి పంచగవ్యం త్రాగినవాడు పూర్వం సంచితమయిన పాపం నశిస్తుంది. ఈరీతిగానే ప్రతిమాసంలోను ప్రత్యేక మంత్రాలు పరించి సంగ్రహించిన బ్రహ్మకూర్చ జలాన్ని త్రాగిన వాని పాపం నశిస్తుంది. భరతనందనా! ఇప్పుడు నేను బ్రహ్మకూర్చాన్ని, దాని పాత్రను గూర్చి చెపుతాను విను.మోదుగ ఆకులో పద్మపత్రంలో గాని లేక రాగితోగాని, బంగారంతో చేసిన పాత్రలోగాని బ్రహ్మ కూర్చను ఉంచి త్రాగాలి. దానికి ఇవే తగిన పాత్రలని చెపుతారు. గాయత్రీమంత్రంతో గోవు పంచితాన్ని, **గంధద్వారాం** అనే మంత్రంతో ఆవుపేడను **'ఆప్యాయస్వ'** అనే మంత్రంతో పాలను **'దధిక్రావ్ణో'** అనే మంత్రంతో పెరుగును, **'తేజోఽసి'** అనే మంత్రంతో నేతిని, **'దేవస్యత్వా'** అనే మంత్రంతో కుశజలాన్ని, **'ఆపోహిష్ఠా'** అనే మంత్రంతో యవచూర్ణాన్ని యధావిధిగా తీసుకొని అన్నింటిని కలిపివేయాలి. ప్రజ్వలించే అగ్నిలో విధిపూర్వకంగా బ్రహ్మను ఉద్దేశించి హోమం చేయాలి. ప్రణవాన్ని ఉచ్చరిస్తూ పైన చెప్పిన వస్తువులను కలుపుతూ మధించాలి. ప్రణవం ఉచ్చరిస్తూనే దాన్ని పాత్రనించి తీసి ప్రణవోచ్చారణతోనే త్రాగాలి. అది త్రాగినందువల్ల ఆవ్యక్తి పాము కుబుసాన్ని విడిచినట్లు పాపవిముక్తుడవుతాడు. జలమధ్యంలో కూర్చునిగాని, సూర్యుని చూస్తూగాని, **భద్రంనో అపివాతయ** అనే ఋజ్మంత్రాన్ని పరించే వాని పాపం తొలగుతుంది. నిత్యము నాయందే లగ్నచిత్తుడయి నాసూక్తాన్ని (పురుష సూక్తాన్ని) పరించే వాడిని జలం తామరాకును స్పృశించనట్లు పాపం స్పృశించదు."

ఉత్తమాధమబ్రాహ్మణుల లక్షణము
భగవద్భక్తుల మాహాత్మ్యము. గోపిప్పల వృక్ష మాహాత్మ్యము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవదేవా ! అనఘా ! శుద్ధమయిన భావం గల బ్రాహ్మణులు ఎలా ఉంటారు? బ్రాహ్మణునికి స్వకర్మలో సాఫల్యం కలగకపోవటానికి కారణం ఏమిటి? ఈ విషయాలు నాకు చెప్పవలసింది " శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. "పాండుపుత్రా! బ్రాహ్మణులు చేసే కర్మలు ఎందుకు సఫలం అవుతాయో, ఎందుకు నిష్ఫలం అవుతాయో వాటిని క్రమంగా చెపుతాను విను మనోభావం నిర్మలంగా ఉండకపోతే త్రిదండధారణం, మౌనం, జడలు దాల్చడం, గుండుచేయించుకోవటం, నారబట్టలు, చర్మం ధరించటం, బ్రహ్మచర్యం, స్నానాలు చేయటం, హోమం చేయటం, గృహస్థ ధర్మపాలనం, వేదాధ్యయనం, భార్యను సత్కరించటం అనే ఇవి అన్నీ వ్యర్థం అవుతాయి. క్షమాశీలుడు, ఇంద్రియ విజేత, దాంతిగలవాడు, కోపం జయించిన బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు. మిగిలిన వారు శూద్రులు అని చెపుతారు. రాజా! అగ్నిహోత్రం, వ్రతాలు, వేదాధ్యయనంలో మగ్నులయినవారు, పవిత్రులు ఉపవాసపరులు ఇంద్రియ నిగ్రహం గల వ్యక్తులను దేవతలు బ్రాహ్మణులు అని భావిస్తారు. ఎవ్వడూ జాతితో మాత్రమే పూజితుడు కాడు. ఉత్తమ గుణాలే మేలు కలిగించేవి. భారతనందనా! మనశ్శుద్ధి,కర్మశుద్ధి కులశుద్ధి, శరీర శుద్ధి, వాక్‌శుద్ధి అని శుద్ధి అయిదువిధాలు అంటారు ఈ

అయిదు శుద్దులలో మనశ్శుద్ధి అన్నిటి కంటే గొప్పది. హృదయశుద్ధితో మానవులు స్వర్గానికి వెళ్తారు. అగ్నికార్యానికి దూరమయిన వాడు, అమ్మటం కొనటాలలో నిమగ్నుడు, వర్ణసంకరం చేసే బ్రాహ్మణుడు వృషలుడని నిర్ణయించారు. కుంతీనందనా! వైదిక శ్రుతులను మరచినవాడు, వ్యవసాయం చేసే బ్రాహ్మణుడు, తన వర్ణ ధర్మానికి విరుద్ధ మయిన పనిచేసే వానిని వృషలుడు అంటారు. వృషం అంటే ధర్మం అని తెలుసుకోవాలి. ఆ వృషాన్ని లయం చేసేవాడిని వృషలుడు అని దేవతలు భావిస్తారు. అతడు చండాలునికన్నా నీచుడు. బ్రహ్మగీతాదులతో నన్ను కాక శూద్రుని స్తుతించే పాపాత్ముడు చండాలునితో సమానం అవుతాడు. కుక్కచర్మంలో ఉంచిన పాలు, కుక్క త్రాగిన హవిస్సు ఆ శుద్ధం అయినట్లుగానే వృషలుని బుద్ధితో ఉన్న వేదం కూడా అపవిత్రం అవుతుంది. నాలుగువేదాలు, ఆరు అంగాలు, మీమాంస, న్యాయశాస్త్రం, ధర్మశాస్త్రం, పురాణం అనే విద్యలు మొత్తం పద్నాలుగు అవుతాయి.

భరతా! నేను చెప్పిన విద్యాస్థానాలు పదునాలుగు లోకక్షేమానికై ఉత్పన్నమయిన పవిత్ర విద్యలు. కాబట్టి యుధిష్ఠిరా! వాటిని శూద్రుడు స్పృశించరాదు. శూద్రుడు స్పృశించింది అంతా అపవిత్రమవుతుం దనటంలో సందేహం లేదు. భారతా! లోకంలో మూడు అపవిత్రమయినవి, అయిదు అశుద్ధమయినవి కుక్క, శూద్రుడు, కుక్కమాంసంతినే వాడు (చండాలు) అపవిత్రాలు. అశ్లీలగీతాలు పాడేవాడు, కోడి, జంతువులను చంపటానికి కట్టిన స్తంభం, ముట్టుత, వృషజాతి స్త్రీని వివాహమాడిన ద్విజుడు అనే అయిదూ అమేధ్యాలు, వీటిని ఎప్పుడూ ముట్టుకోరాదు. ఎనిమిదింటిని తగిలిన బ్రాహ్మణుడు కట్టుబట్టతోనే స్నానం చేయాలి. శూద్రజాతిలో జన్మించారనే కారణంతో నాభక్తులను అవమానించే మానవులు నరాధములయి, కోటి సంవత్సరాలు నరకాలలోనే ఉంటారు నాభక్తుడు చండాలుడయినా బుద్ధిమంతుడు అవమానించరాదు అవమానించిన మానవులు రౌరవం అనే నరకంలో తప్పక పడతారు నాభక్తుని భక్తులమీద గూడా నాకు ప్రేమ చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి నాభక్తుని భక్తులు గూడా విశేషంగా పూజించదగినవారే. నాయందు చిత్తం నిలిపితే కీటాలకు పక్షులకు, మృగాలకు కూడా ఉత్తమగతి కలుగుతుందని తెలుసుకో! అలాంటప్పుడు జ్ఞానులయిన మానవులను గూర్చి వేరే చెప్పాలా ? పత్రం గాని, పుష్పంగాని, ఫలం గాని నీరు గాని శూద్రుడు ఇచ్చిన దయినా తలదాల్చుతాను. సర్వప్రాణుల హృదయాలలో ఉండేనన్ను వేదోక్తమార్గంలో అర్చించే విప్రులు నాసాయుజ్యం పొందుతారు. యుధిష్ఠిరా! నాభక్తుల మేలు కోసమే నేను అవతరించాను. కాబట్టి నా అవతారమూర్తులలో దేనినయినా అర్చించవచ్చు. నా అవతార విగ్రహాలలోని ఒకదాన్ని అయినా నాయందలి భక్తితో అర్చిస్తే దానితోనే సంతుష్టుడను అవుతాను. సందేహం లేదు. మట్టితోగాని, మణులతోగాని, రత్నాలతోగాని రాగితోగాని, వెండితో, బంగారంతో గాని నా విగ్రహాన్ని చేయించి అర్చన చేయాలి. ఈ విగ్రహాల్లో వరుసగా ఒకదానికంటే ఇంకొకదాన్ని అర్చిస్తే పదేసిరెట్లు ఎక్కువ పుణ్యం కలుగుతుందని తెలుసుకోవాలి. బ్రాహ్మణుడు విద్యకోసం, రాజు జయం కోసం, వైశ్యుడు ధనంకోసం శూద్రుడు సుఖంకోసం స్త్రీలు సమస్త కాంక్షలు తీరటంకోసం నన్ను అర్చిస్తే వారి ఆయా కోరికలు తీరుతాయి "

ధర్మజుడడిగాడు. "దేవదేవా! ఎలాంటి శూద్రుల అర్చనను నీవు గ్రహించవు? నీకు

నచ్చనిది ఏకార్యం ? నాకు చెప్పవలసింది." శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "రాజేంద్రా! వ్రతానుష్ఠానం చేయనివాడు నాభక్తుడు కాని శూద్రుడు స్పృశించిన అర్చనను కుక్కమాంసం తినే చండాలుని అర్చనలాంటి వని తలచి వదలివేస్తాను. యుధిష్ఠిరా! గోవులు, విప్రులు రావిచెట్టు అనే మూడు దైవరూపాలు, వీటిని నారూపంగాను శంకరుని రూపంగాను భావించాలి. నాభక్తుడు ఈ మూడింటినిఎప్పుడూ అవమానించరాదు. పాండుసుతా ! రావిచెట్టు, బ్రాహ్మణులు, గోవులు నాస్వరూపాలు. తరింపజేస్తాయి. కాబట్టి ఈమూడింటిని ప్రయత్నపూర్వకంగా పూజించవలసింది."

భగవదుపదేశ సంహారము - ద్వారకాగమనము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "శ్రీకృష్ణా! విప్రుడు దేశాంతరానికి వెళ్లి అక్కడే మరణించగా అక్కడే ఆతని శరీరం నాశనం అయితే ఆతనికి అంత్యసంస్కారం ఎలా చేయాలి?" శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "యుధిష్ఠిరా ! ఆ స్థితిని పొందిన ఆహితాగ్ని అయిన బ్రాహ్మణుడు చేయవలసిన సంస్కారం చెపుతా విను. ప్రేతకల్పంలో చెప్పిన దానిననుసరించి అతనికి మోదుగు కర్రతో ప్రతిమను నిర్మించాలి. యుధిష్ఠిరా! మనుష్యుని శరీరంలో మూడు వందల అరువది ఎముకలు ఉంటాయని చెపుతారు. శాస్త్రానుసారం వాటినన్నిటిని కల్పించి ఆప్రతిమను దహనం చెయ్యాలి."

యుధిష్ఠిరుడు అడిగాడు. "దేవా ! తీర్థయాత్రచేయలేని భక్తులందరు తరించటానికి దయతో ధర్మానుసారం వీదయినా విశేష తీర్థాన్ని చెప్పవలసింది." శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. "యుధిష్ఠిరా! సామగానం చేసే విద్వాంసులు సత్యం సర్వతీర్థాలను పవిత్రం చేసేది అని చెపుతారు. సత్యం చెప్పటం, వీజీవిని హింసించకుండటం తీర్థం అని చెపుతారు. యుధిష్ఠిరా! తపస్సు, దయ,శీలం, అల్పసంతోషిత్వం, పతివ్రత అయిన స్త్రీ తీర్థస్థానాలు. నిత్యసంతోషి అయిన బ్రాహ్మణుడు, జ్ఞాన తీర్థం అంటారు. నాభక్తులు ఎల్లప్పుడు తీర్థరూపులు. శంకరుని భక్తులు విశిష్ట తీర్థరూపులు. సంన్యాసులు, విద్వాంసులు తీర్థం అని చెపుతారు. ఇతరులకు శరణు ఇచ్చేవాడు తీర్థరూపుడు. అభయం ఇవ్వటం గూడా తీర్థమే అని చెపుతారు. నేను ముల్లోకాల్లో ఉద్వేగం లేనివాడిని. పగలుగాని రాత్రిగాని నేను ఎవరికీ భయపడను. కాని శూద్రుడు మర్యాదను అతిక్రమించటం నాకు బాగుండదు. రాజా! దేవతలవల్లగాని దైత్యులవల్లగాని రాక్షసులవల్లగాని నాకు భయంలేదు. కాని శూద్రునినోటనుండి వేదమంత్రోచ్చారణ నాకు ఎల్లప్పుడు భయదాయకం. కాబట్టి శూద్రుడు నా నామాన్ని ఓంకారంతో కలిపి ఉచ్చరించరాదు. వేదవేత్తలయినవారు ప్రణవమే సర్వోత్కృష్టమయిన వేదం అని అంటారు. శూద్రుడు నాయందు భక్తిగలిగి బ్రహ్మణ క్షత్రియ వైశ్యులకు సేవచేయటమే పరమధర్మం. ద్విజులకు శుశ్రూషచేయటంవల్ల శూద్రుడు గొప్పమేలు పొందుతాడు. శూద్రునికి ద్విజశుశ్రూషను మించిన వేరొక ఉపాయంలేదు. పూర్వం బ్రహ్మదేవుడు శూద్రుని తామస గుణయుక్తునిగా సృష్టించి ద్విజశుశ్రూషను ధర్మంగా ఉపదేశించాడు. శూద్రునిలో ఉండే తామస భావాలు ద్విజభక్తిచేత నశిస్తాయి.

శూద్రుడు భక్తితో పత్రాన్నిగాని పుష్పాన్నిగాని, పండుగాని, నీటినిగాని ఇస్తే భక్తి పూర్వకంగా

ఇచ్చిన దాన్ని ఆదరంతో తలదాలుస్తాను. సర్వపాప పరిపూర్ణుడయిన బ్రాహ్మణుడు నన్ను నిరంతరం ధ్యానిస్తే సర్వపాపాలనుంచి విముక్తుడవుతాడు. విద్యావినయాలు గలవారు వేదాలను తుదముట్ట తెలిసిన బ్రాహ్మణులయినా నాయందు భక్తి లేకపోతే చాండాలురతో సమానులే అవుతారు. నాభక్తుడుకాని బ్రాహ్మణుడు చేసే దానం తపస్సు యజ్ఞం, హోమం అతిథ్యం ఇవి అన్నీ వ్యర్థాలే అవుతాయి. పాండుపుత్రా! స్థావరాలు, జంగమాలు అయిన సమస్త ప్రాణులయందు, మిత్రుల శత్రువులయందు సమభావంతో ఉండేవాడు నా అసలయిన భక్తుడవుతాడు. రాజా! క్రూరత్వంలేకపోవటం, అహింస, సత్యం, సరళత ప్రాణులకు ద్రోహం చేయకపోవటం అనేవి నాభక్తుల వ్రతాలు. రాజా! కుక్కమాంసం తినే వాడయినా సరే శ్రద్ధతో నాభక్తునికి నమస్కారం చేస్తే ఆతనికి అక్షయమయిన ఉత్తమలోకాలు కలుగుతాయి. స్వాత్తుగా నాభక్తులు నాయందే ప్రాణాలు పెట్టుకొన్నవారు. ఎల్లప్పుడు నన్ను గురించే చెప్పుకునే వాళ్లు. లక్ష్మీదేవితో గూడా నన్ను పూజించేవారిని గురించి వేరే చెప్పవలెనా? నాభక్తులు పొందే వరమపదాన్ని వేలకొలది సంవత్సరాలు తపస్సు చేసిన మానవుడు కూడా పొందలేడు. కాబట్టి రాజేంద్రా ! పరాకు లేకుండా నిత్యం నన్నే ధ్యానిస్తూ సిద్ధిని పొందగలవు. నీవు తప్పక వరమపదాన్ని పొందగలవు. హోతలయి ఋగ్వేదంతో, అధ్వర్యులయి యజుర్వేదంతో, ఉద్గాతలయి పవిత్రమయిన సామవేదంతో నన్ను స్తుతించేవారు. అధర్వవేదీయ బ్రాహ్మణులయి, అధర్వవేదంతో ఎల్లప్పుడు నన్ను స్తుతించేవారు అందరు భగవద్భక్తులు అంటారు. యజ్ఞాలు ఎల్లప్పుడు వేదాలకు అధీనమయి ఉంటాయి. దేవతలు యజ్ఞాలకు, బ్రాహ్మణులకు అధీనులు అయి ఉంటారు. కాబట్టి విప్రులు దేవతలు. ఎవరినీ ఆశ్రయించకుండా ఎవ్వరూ ఉన్నతిని పొందలేరు. కాబట్టి ఎవరయినా ఒక ముఖ్యుని ఆశ్రయించాలి. దేవతలు రుద్రుని ఆశ్రయించారు. రుద్రుడు బ్రహ్మను ఆశ్రయించారు. రాజా! బ్రహ్మ నన్ను ఆశ్రయించాడు. నేను ఎవ్వరినీ ఆశ్రయించలేదు. నాకు ఆశ్రయం ఎవ్వరూ లేరు కాని అందరికీ నేనే ఆశ్రయం. రాజా! నిత్యం ధర్మ ప్రియుడివయిననీకు ఈ ఉత్తమమయిన రహస్యాన్ని చెప్పాను. దీనిని ఈరీతిగా ఆచరించు. పాండునందనా ! ఇంతవరకు నేను చెప్పిన పవిత్రమయిన ఈ ఆఖ్యానం వేద సమానమయినది. ఈ వైష్ణవధర్మాన్ని ప్రతిదినం చదివే వానికి ధర్మం వృద్ధి చెందుతుంది. బుద్ధి ప్రసన్నం అవుతుంది. పాపం నశిస్తుంది. శుభం పెంపొందుతుంది. ఇది పవిత్రమైనది. పుణ్యదాయకం ఉత్తమమయిన పాపనాశకం. శ్రద్ధగావినాలి. శ్రోత్రియులు ముఖ్యంగా వినాలి. భక్తితో దీన్ని ప్రయత్నపూర్వకంగా వినిపించేవాడు వినేవాడు నా సాయుజ్యం పొందుతాడు. ఇందులో సందేహంలేదు నాభక్తుడు నేనే గమ్యంగా భావించేవాడు దీన్ని శ్రాద్ధకాలంలో వినిపిస్తే అతని పితృదేవతలు ఈ బ్రహ్మాండానికే ప్రళయం కలిగేటంత వరకు సంతృప్తి లవుతారు."

వైశంపాయనుడు చెప్పాడు. "జనమేజయా! స్వాత్తు విష్ణువు జగద్గురువు అయిన శ్రీకృష్ణుని నుండి ఈ భాగవతధర్మాలను విని ఈ అద్భుత ప్రసంగాన్ని గూర్చి ఆలోచిస్తూ ఋషులు, పాండవులు చాలా సంతోషించారు. ఆ జనార్దనునికి నమస్కరించారు. ధర్మపుత్రుడు శ్రీకృష్ణుని పలుమారులు పూజించాడు. దేవతలు, బ్రహ్మర్షులు సిద్ధులు, గంధర్వులు, అప్సరసలు, ఋషులు మహాత్ములయిన గుహ్యకులు, సర్పరాజులు మహాత్ములయిన వాలఖిల్యులు తత్వాన్ని దర్శించిన యోగులు భాగవతులు

పంచకాలాల్లో ఉపాసనచేసే భగవద్భక్తులయినవారు కుతుహలంతో ఉపదేశం వినటానికి వచ్చిన వారు పరమపుణ్యదాయకమయిన పవిత్ర వైష్ణవ ధర్మోపదేశాన్ని విని, వెంటనే వారందరు పాపవిముక్తులయి పరమపవిత్రులు అయినారు. తలలు వంచి, విష్ణురూపి శ్రీకృష్ణునికి నమస్కరించి ఆయన ఉపదేశాన్ని ప్రశంసించారు. 'రాజా! దేవా! మేము మళ్లీ జగద్గురు వయిన నిన్ను ద్వారకానగరంలో దర్శిస్తాం.' అని చెప్పి సంతుష్టమనస్కులయి ఋషి సమూహాలు దేవతల సమూహాలతో పాటు తమతమ నివాసాలకు వెళ్లారు రాజా! వారందరు వెళ్లిన తరువాత కేశి రాక్షస సంహారి అయిన శ్రీకృష్ణుడు సాత్యకితో గూడా సారధి దారుకుని స్మరించాడు సమీపంలోనే ఉన్న సారధి 'దేవా! రథం సిద్ధంగా ఉంది దయ చెయ్యండి.' అన్నాడు. అప్పుడు పాండవులు ముఖాల్లో విషాదం కలుగగా ఆర్తులయి కన్నీరు నిండిన కన్నులతో శిరస్సులపై అంజలులు ఘటించి పురుషోత్తముని శ్రీకృష్ణునిచూస్తూ ఏమీ మాటాడలేకపోయారు భగవంతుడు శ్రీకృష్ణదేవుడు ఆర్తునివలె మేనత్త కుంతీదేవికి ధృతరాష్ట్రునికి, గాంధారికి, విదురునికి, ద్రౌపదికి, శ్రీకృష్ణద్వైపాయన వ్యాసమహర్షికి, ఇతర ఋషులకు వెళ్లివస్తానని చెప్పాడు. సుభద్రను, కొడుకుతోగూడా ఉన్న ఉత్తరను చేతితో ఆప్యాయంగా స్పృశించాడు ఆ పాండవుల భవనం నుంచి బయటికివచ్చి రథం ఎక్కాడు

ఆ రథానికి శైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వలాహకం అనే నాలుగు గుర్రాలు కట్టారు. ధీమంతుడయిన గరుత్మంతుడు ధ్వజంపైన ఉన్నాడు అప్పుడు కురురాజు యుధిష్ఠిర మహారాజు సారధి అయిన దారుకుని తప్పుకోమని చెప్పి తాను ఆ రథం ఎక్కి స్వయంగా పగ్గాలు పట్టుకున్నాడు. అర్జునుడు రథం ఎక్కి స్వర్ణదండంగల పెద్ద వింజామరను చేతబట్టి శ్రీకృష్ణభగవానునికి దక్షిణం వైపునిల్చి వీచాడు. అలాగే పరాక్రమవంతుడు భీముడు గూడా రథం ఎక్కాడు. భగవంతుడికి గొడుగు పట్టి నిలిచాడు. ఆ గొడుగుకు నూరు ఊచలు ఉన్నాయి. అది దివ్యమయిన పూలమాలికలతో అలరారుతున్నది దాని దండాన్ని వైడూర్యమణులతో చేశారు. బంగారంతో అలంకరించారు అలాంటి ఛత్రాన్ని భీముడు కృష్ణునికి పట్టాడు. నకులసహదేవులు త్వరగా రథం ఎక్కి తెల్లటి వింజామరలను దాల్చి కృష్ణుని వీచసాగారు. భీమసేనుడు అర్జునుడు, శత్రునాశకులయిన నకుల సహదేవులు సంతోషంగా శ్రీకృష్ణుని అనుసరించారు వెళ్లవద్దు అని ఆయనతో అన్నారు. మూడు యోజనాల దూరం వెళ్లిన తరువాత శ్రీకృష్ణుడు తనకు నమస్కరించిన పాండవులను ఆలింగనం చేసుకొని వారిని వదలి ద్వారకానగరానికి వెళ్లాడు ఆ విధంగా పాండవులు శ్రీకృష్ణునికి నమస్కారాలు చేసి తమ నివాసాలకు తిరిగి వచ్చారు. ఆనాటినుంచి వారు ధర్మపరాయణులయి కపిల గోదానాది దానాలు చేశారు. పాండవులు మనస్సులోఉన్న శ్రీకృష్ణుని ఉపదేశ వాక్యాలను పలుమారులు గుర్తుచేసుకుంటూ మానసికంగా ఆయనను పూజించారు ధర్మాత్ముడయిన యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని హృదయంలో నిలుపు కొని ఆయన యందు మనస్సుఉంచి ఆయననే భజించసాగాడు యోగయుక్తుడయి భగవంతునే భజింపసాగాడు."

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No 96369
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ఇరవై ఆశ్వమేధిక పర్వం

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకి తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నప్పుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.